# రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)

## రాష్ట్ర మహాసభల సావనీర్ - 2010








పతాకావిష్కరణ : కా॥ ఎస్.ఝాన్సీ



స్థూపం వద్ద శ్రద్ధాంజలి : కా॥ ఎస్.డి.బోస్



శ్రీ సింగమనేని నారాయణ



డా॥ బి.డి.శర్మ



ప్రొ॥ కె.ఆర్.చౌదరి



శ్రీ కె.ఆర్.వేణుగోపాల్



కా॥ బి.సూర్యసాగర్



బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం

# రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)



## అంతం కాదిది ఆరంభం

భూమి కోసం భుక్తి కోసం
సాగేరైతుల పోరాటం
అనంత జీవిత సంగ్రామం

రాజులు మారి రోజులు మారి
పాలనచేసే పద్ధతి మారి
మారనిదొకటేరా-అది
దున్నే రైతుల బ్రతుకేరా......

సంపద పెంచే తీరులు మారి
పంపకాలలో రీతులు మారి
మారనిదొకటేరా-అద
పేదలి ఆకలి మంటేరా

తూరుపు దిక్కున వీచేగాలి
పడమట కడలిని పిలిచేగాలి
తూరుపు పడమర లేకంచేసే
తుపానులా చెలరేగే దాకా
భూమికోసం భుక్తికోసం
సాగే రైతుల పోరాటం
అంతం కాదిది ఆరంభం

శ్రీశ్రీ

## రాష్ట్రమహాసభల సావనీర్ 2010

# రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)
# రాష్ట్ర మహాసభల సావనీర్ - 2010

వెల: 30/-

ప్రతులకు:
మైత్రీ బుక్ హౌస్
జలీల్‌వీధి, కారల్ మార్క్స్ రోడ్
విజయవాడ-2

రైతుకూలీసంఘం ఆంధ్రప్రదేశ్
ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్, కృష్ణలంక
విజయవాడ-10



ప్రచురణ: కా॥ ఎస్.ఝాన్సి, కా॥ కె.కోటయ్య, అధ్యక్ష-కార్యదర్శులు, రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)
ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్, కృష్ణలంక, విజయవాడ-10

# విషయసూచిక


1. విజయవంతమైన రాష్ట్ర మహాసభల విశేషాలు
   ప్రారంభ సభ: 'భూపరాయీకరణకు వ్యతిరేకంగా, దున్నేవానికే భూమి హక్కు కోసం పోరాడుతాం' **7**
   ప్రదర్శన-బహిరంగ సభ: 'మరో పైరు పచ్చ విప్లవం మాటున రైతాంగంపై సాగనున్న మహాదాడిని ప్రతిఘటిద్దాం' **9**
   ప్రతినిధుల సభ: 'భూస్వామ్య సామ్రాజ్యవాద దోపిడీ పీడనలపై దండెత్తుదాం. **11**

**ప్రసంగ వ్యాసాలు**

2. 'రైతుకూలీలు సంఘటితంగా పోరాడి హక్కులు సాధించుకోవాలి' **- శ్రీ చెరుకూరి వెంకటేశ్వర్లు** **13**
3. 'భారత రైతాంగ వీరోచిత పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం' **- కా॥యస్.ఝాన్సి** **15**
4. 'మానవ వికాసానికి మూడు గొప్ప అవసరాలైన వ్యవసాయం -విద్య-వైద్యాలను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వాల విధానాలు' **- శ్రీ సింగమనేని నారాయణ** **18**
5. 'వ్యవసాయాన్ని అధమంగానూ, సేవలను ప్రధమంగానూ మార్చిన పాలకులు' **- డా॥బి.డి.శర్మ** **22**
6. 'వ్యవసాయాభివృద్ధికి, వ్యవసాయ విప్లవానికి భూమి కేంద్రంగా వుండాలి.' **- ప్రొ॥కె.ఆర్.చౌదరి** **25**
7. 'నిర్బంధం-సంస్కరణలు ఒకే నాణానికి రెండు పార్శ్వాల వంటివి' **- డా॥ పి.జస్వంతరావు** **30**
8. 'ప్రజల్ని విభజించే పాలకుల కుట్రలకు బలికాకుండా సమైక్య పోరాటం సాగిద్దాం' **- కా॥ కె.కోటయ్య** **32**
9. 'అటవీ భూమి, నీరు, వనరులపై హక్కు ఆదివాసులదే' **- కా॥ శ్రీకాంత్ మొహంతి** **33**
10. రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) కార్యకలాపాల (2005-10) సంక్షిప్త నివేదిక **- కా॥యస్.ఝాన్సి** **35**
11. 'ప్రజాపంపిణీ వ్యవస్థను నీరుగారుస్తున్న ప్రభుత్వాలు' **- శ్రీ కె.ఆర్.వేణుగోపాల్** **51**
12. 'విప్లవ విజయం తథ్యమన్న కా॥టి.ఎన్. మాట నిజమౌతుంది' **- డా॥బి.సూర్యసాగర్** **57**
13. సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు **62**
14. తీర్మానాలు **79**
15. అమరులకు జోహార్లు **82**
16. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కార్యక్రమాల ఫోటోలు **89**
17. రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ కరపత్రం **100**
18 ప్రత్యేక ఆర్థిక మండళ్ళు-రైతాంగ ఉసురు తీసే ఉరిత్రాళ్ళు **104**
19. పోలవరం(ఇందిరాసాగర్) ప్రాజెక్టు మునక ప్రాంత ప్రజల పునరావాస అధ్యయన బృంద నివేదిక **106**
20. తెలంగాణా రైతాంగ జీవనాధారాలు తోడివేస్తున్న పాలకులు **108**
21. బాక్సైట్ తవ్వకాలకు తరలింపుకు ఆరాటపడుతున్న పరాధీన పాలకులు **110**
22. బళ్ళారి విమానాశ్రయ భూసేకరణపై నిజనిర్ధారణ కమిటీ నివేదిక **112**
23. భైంసా, వటోలి ఘటనలు-మతతత్వ శక్తులు విసురుతున్న సవాలు **116**
24. 'పత్రికా స్వేచ్ఛ-సమాజం-రాజ్యం'పై గోష్టి-రైతుకూలీసంఘం పత్రం **119**
25. 'జూన్ 17-పనసభద్రపై దాడి' నిజనిర్ధారణ కమిటి నివేదిక **120**
26. వీరోచిత మునగాల రైతాంగ ప్రజా ఉద్యమం **- టి.వెంకట్రావు** **122**

# మా మాట

ఆర్భాటంగా ప్రస్తుతించబడిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను పాలకులు అమలు చేయటం ప్రారంభించి దాదాపు రెండు దశాబ్దాల కాలం గడిచింది.

ఈ విధానాలు దేశంలోని సమస్త ప్రజా, జీవన రంగాలన్నింటినీ మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తాయని, 'పెనం మీద నుండి పొయ్యిలో పడదోస్తాయ'ని జాతీయ, ప్రగతిశీలవాదులు, పీడిత వర్గ రాజకీయ వాదులు, మేధావులు చేసిన తీవ్ర హెచ్చరికలను పాలకులు పెడచెవిన పెట్టారు.

పైగా, ఈ విధానాల అమలు-దేశాన్ని అత్యున్నత పథంలోకి పయనింపజేస్తుందని; ఈ విధానాలను వ్యతిరేకించటమంటే దేశద్రోహానికి పాల్పడటమేనంటూ హూంకరించారు.

'నిజమే కాబోలు'నని నమ్మిన నిజాయితీపరుల కళ్ళు తెరిపిళ్ళు పడేందుకు ఆట్టే కాలం పట్టలేదు.

ప్రపంచంలోని అత్యధిక సంపన్నులుగల జాబితాలో మన దేశ బడాచోర్‌లు పైకెగబ్రాకుతూ వుండటం-మరోవైపున రోజుకి 20 రూపాయల ఆదాయం కూడా లేనివారి సంఖ్య నూటికి 70మందిని దాటిపోవడం;

సామ్రాజ్యవాద గుత్త సంస్థలు ఇబ్బడిముబ్బడిగా దేశ సంపదలను దోచుకొని తెగబలిసిపోవటం-మరోవైపున ఈ కాలంలో రెండు లక్షలమంది రైతులు ఆత్మహత్యల పాల్పడటం;

'సెజ్'ల పేరిట లక్షల ఎకరాల నుండి రైతులను గెంటివేసి బహుళజాతి, బడా కంపెనీలకు కట్టబెట్టటం -మరోవైపున హామీ ఇచ్చిన ఏ పరిశ్రమా స్థాపించక పోగా, పట్టుమని పదిమందికి కూడా ఉపాధి కల్పించకపోవటం వంటి ఎన్నో తార్కాణాలు పాలకుల వినాశకర 'అభివృద్ధి'ని విశదపరుస్తున్నాయి.

రెండు పంటలు పండే జీల భూములను బీడు భూములుగా మార్చవద్దన్నందుకు 'నందిగ్రాం-సింగూరు'లు మన రాష్ట్రంలోనూ సంభవించాయి.

శ్రీకాకుళంజిల్లా, సోంపేట ప్రజలపై పాలకులు సాయుధ పోలీసులను ప్రయోగించి ఇద్దరు సాధారణ రైతులను బలిగొన్నారు.

తీరప్రాంతమంతా విస్తరిస్తున్న సెజ్‌లకు, మెగాథర్మల్ విద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగానూ, నిర్వాసితుల సమస్యలపైనా నిరసన జోరందుకుంది.

సోంపేట స్ఫూర్తిగా కనపర్తి, కోటిపాం, సంతబొమ్మాళి థర్మల్ వ్యతిరేక ఉద్యమాలు సాగుతున్నాయి.

దేశ ప్రజల భద్రతకు, పర్యావరణానికీ తీవ్ర అనర్థదాయకమైన, ప్రమాద కరమైన పెక్కు అణువిద్యుత్ కర్మాగారాల స్థాపనకు రంగం సిద్ధమైంది.

అణు ప్రమాదాలు సంభవించినా సంబంధిత బహుళజాతి కార్పోరేట్ సంస్థలను దోషులుగా నిలపకుండా తప్పించే అణుప్రమాద బాధ్యతా చట్టాన్ని పాలకులు ఇటీవలే పార్లమెంట్‌లో ఆమోదించారు.

రణస్థలంలో అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా ప్రజలు కదుతున్నారు.

యావద్దేశానికి ఆహారధాన్యాలనందించే వ్యవసాయరంగాన్ని డొల్ల చేసిన పాలకులే, ఆహార సంక్షోభాన్ని తీవ్రం చేసిన పాలకులే-'ఆహార భద్రత' చట్టాన్ని గురించి మాట్లాడుతున్నారు.
ప్రజల ఆవాసాలన్నింటినీ ఒకవైపున తొలగించి వేస్తూనే-'రాజీవ్ గృహ కల్ప', 'ఇందిరమ్మ ఇళ్లని మభ్య పెడ్తున్నారు.

ప్రజలకున్న కొద్దిపాటి ఉపాధిని కూడా ఊడ్చేసి, వలసలను తీవ్రం చేసిన వారే-'గ్రామీణ ఉ పాధి హామీ పథకాల' పేరిట ఊరిస్తున్నారు.
సన్న, చిన్నకారు రైతుల భూములన్నింటినీ ఒక్కటొక్కటిగా గుంజివేసుకుంటున్న వారే-మరోవైపున ప్రతిఏటా అంబేద్కర్ వర్ధంతినాడు భూసమారాధన చేస్తున్నామంటున్నారు.

ఆదివాసులకు రక్షణ కల్పించే చట్టాలన్నింటినీ హరించివేసినవారే-'ఆదివాసీ హక్కుల చట్టం'తో ముందుకొచ్చారు.
అల్పాదాయ వర్గాలకు సంస్థాగత రుణాలను శూన్యం చేసిన వారే, మైక్రో సంస్థలను ప్రజలపై ఎగదోలిన వారే-'పావలా వడ్డీకే ప్రభుత్వ రుణాల'ని ప్రలోభపెడుతున్నారు.

అరాకొరా ప్రభుత్వ వైద్యసేవలను పడకన పడేసిన వారే-'రాజీవ్ ఆరోగ్య శ్రీ' పేరిట రక్షణలు కల్పిస్తున్నట్లుగా ఫోజు పెడ్తున్నారు.
ప్రభుత్వ విద్యకు చెల్లుచీటి ఇచ్చిన ఈ పాలకులే-'విద్యా హక్కు' చట్టంతో ఉద్ధరిస్తామంటున్నారు.
పాలకుల ఈ నయా వంచనాత్మక విధానాలకు వ్యతిరేకంగా, కళ్లెదుట తమ జీవన విధ్వంసానికి వ్యతిరేకంగా ప్రజల ఆందోళనలు ఎల్లెడలా తీవ్ర మౌతున్నాయి.
దేశంలోనూ, రాష్ట్రంలోనూ వివిధ స్థాయిలలో సాగుతున్న ఈ ఆందోళన, ఉద్యమాలన్నీ భూస్వామ్య, సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా నూతన ప్రజాతంత్ర విప్లవం దిశగా ఐక్యంగా ఎక్కుపెట్టవలసిన అవసరముంది.

ఈ నేపథ్యంలో 2010 ఏప్రిల్ 12,13,14 తేదీల్లో ఒంగోలులో రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభల స్ఫూర్తిదాయకంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి రైతు,కూలీలు; ఆదివాసులు ఈ సభలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చాషీమూలియా ఆదివాసీ సంఘ నాయకత్వాన ప్రభుత్వ నిర్బంధాలను, పెత్తందారుల దాడులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్న ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు కోరాపుట్ ప్రాంత ఆదివాసీ ప్రజానీకం నాలుగువందల మంది కామ్రేడ్స్ అర్జున్, పైడమ్మల నాయకత్వంలో ఈ సభలకు హాజరయ్యారు. 2010 ఆగస్టు 9న కామ్రేడ్ అర్జున్ మావోయిస్టుల చేతిలో హత్యకు గురయ్యాడు. ఈ హత్యను మేము తీవ్రంగా గర్హిస్తున్నాం.
ప్రధానంగా రాష్ట్ర మహాసభల విశేషాలతో ఈ 'రాష్ట్ర మహాసభల సావనీర్-2010' వెలువరిస్తున్నాం. గత వార్షిక సంచికలవలెనే ఈ సంచికనూ ఆదరిస్తారని ఆశిస్తూ, ఈ సంచిక రూపకల్పన, ముద్రణలో తోడ్పడిన సహచరులు, కార్మిక మిత్రులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. ఈ సంచికలోనూ-వివిధ కవితా సంకలనాల నుండి అనేకమంది కవుల 'కవితా ఖండిక'లను ప్రచురించాం. ఆ సాహితీ మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

విజయవాడ
**1.11.10**

**రాష్ట్ర కార్యవర్గం**
రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)

# దేశమును ప్రేమించుమన్నా

గురజాడ అప్పారావు

రచనా కాలం: 1910.



దేశమును ప్రేమించుమన్న
మంచి అన్నది పెంచుమన్నా;
వొట్టిమాటలు కట్టిపెట్టోయి
గట్టిమేల్ తలపెట్టవోయ్!

పాడిపంటలు పొంగిపొర్లే
దారిలో నువు పాటుపడవోయి;
తిండి కలిగితే కండ కలదోయి
కండకలవాడేను మనిషోయి!

ఈసురోమని మనుషులంటే
దేశమేగతి బాగుపడునోయి?
జల్దుకొని కళలెల్ల నేర్చుకు
దేశిసరుకులు నించవోయి!

అన్ని దేశాల్ క్రమ్మవలెనోయి
దేశిసరుకుల నమ్మవలెనోయి;
డబ్బు తేలేనట్టి నరులకు
కీర్తి సంపదలబ్బవోయి!

వెనుకజూసిన కార్యమేమోయి?
మంచిగతమున కొంచెమేనోయి
మందగించక ముందు అడుగేయి
వెనక పడితే వెనకెనోయి!

పూను స్పరథను విద్యలందే
వైరములు వాణిజ్యమందే;
వ్యర్థకలహం పెంచబోకోయి
కత్తివైరం కాల్చవోయి!

దేశాభిమానం నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పుకోకోయి;
పూని ఏదైనాను ఒక మేల్
కూర్చి జనులకు చూపవోయి!

ఓర్వలేని పిశాచిదేశం
మూలుగులు పిల్చేసెనోయి;
ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయి!

పరుల కలిమికి పొర్లియేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయి?
ఒకరిమేల్ తనమేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయి!

స్వంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడుపడవోయి
దేశమంటే మట్టి కాదోయి
దేశమంటే మనుషులోయి!

చెట్టాపట్టాల్ పట్టుకొని
దేశస్థులంతా నడువవలెనోయి;
అన్నదమ్ములవలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి!

మతం వేరైతేను ఏమోయి?
మనసులొకటై మనుషులుంటే
జాతమన్నది లేచి పెరిగి
లోకమున రాణించునోయి!

దేశమనియెడి దొడ్డ వృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయి
నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయి

ఆకులందున అణిగిమణిగి
కవిత కోయిల పలకవలెనోయి
పలుకులను విని దేశమందభి
మానములు మొలకెత్తవలెనోయి!

ప్రారంభ సభ

# 2010 ఏప్రిల్ 12,13,14 తేదీలలో-ఒంగోలులో విజయవంతమైన రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలు

**ప్రకాశంజిల్లాలో** ఏప్రిల్ 11 అర్ధరాత్రికే ప్రభాకరుడుదయించాడు. కారుచీకట్లను చీల్చుకుంటూ అరుణకాంతులతో ప్రకాశిస్తూ ఒంగోలు పట్టణం అమరుల త్యాగాల రక్తరాగ సంశోభిత మైంది. కొండలు కోనలు దాటి, రాష్ట్రాల సరిహద్దులు దాటి ఉత్తరాన పోరాట కోరాపుట్, పార్వతీపురాల నుండి, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి రైతు, కూలీ, ఆదివాసీ, నిరుపేద గ్రామీణ ప్రజానీకం తమకు ఎల్లవేళలా అండదండైన పోరుజెండాను చేతబట్టి మహాసభల ప్రాంగణమైన అమరుడు కామ్రేడ్ కానూసన్యాల్ నగర్‌కు అలలు అలలుగా తరలి వచ్చారు. మార్గదర్శకత్వంలో మండే ఎండలను లెక్కచేయక నెల రోజుల పాటు వలంటీర్స్ సాగించిన అవిశ్రాంత సన్నాహక కృషికి, రాష్ట్రవ్యాపిత రైతుకూలీసంఘ కార్యకర్తల పట్టుదలకి మూడు రోజుల మహాసభలు అద్దం పట్టాయి.

రాష్ట్ర మహాసభల ప్రారంభ దినాన, హాజరైన వేలాదిమంది ప్రజానీకపు సమక్షాన, మహాసభల ప్రాంగణంలో విశాలంగా నిర్మించిన వేదికపై తప్పెట గుళ్ళు, కిందిరి, ధింసా, డప్పుల నృత్యం, కోలాటం వంటి జానపద, ప్రజా కళారూపాలను ఉదయం 9 గంటలనుండే ఆయా కళాకారులు వరుసగా ప్రదర్శించారు.



ప్రారంభ సభలో లేచి నిలచి అమరులకు నివాళులర్పిస్తున్న ప్రజానీకంలోని ఒక భాగం

నక్సల్బరీ రైతాంగ ఉద్యమ నిర్మాత, అమరుడు కామ్రేడ్ కానూసన్యాల్ చిత్రపటాలతో ఏర్పాటు చేయబడిన ద్వారం గుండా మహాసభల ప్రాంగణంలోకి ప్రవేశించిన కామ్రేడ్స్‌కు–అప్పటికి మూడు వారాల క్రితం కనుమూసిన ఆ కామ్రేడే అక్కడ నిలబడి ఆహ్వానిస్తున్నట్లుగా భావించి హృదయాలు భారమయ్యాయి. నాయకత్వపు

పదీ ముప్పై నిముషాలకు రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షులు కా॥సింహాద్రి ఝాన్సి ప్రజానీకపు పోరాట నినాదాల నడుమ సంఘం పతాకను ఆవిష్కరించారు.

వేదిక ప్రక్కన నిర్మించిన అమరుల స్మారక చిహ్నంపై కామ్రేడ్ కానూసన్యాల్ సహచరుడు–ఏ.ఐ.కె.ఎమ్.కె.ఎస్. నాయకులు

**భూ పరాయీకరణకు వ్యతిరేకంగా, దున్నేవానికే భూమి హక్కు కోసం పోరాడుదాం**

కా॥ఎస్.డి.బోస్ (బీహార్) పుష్పగుచ్ఛాలనుంచి మృతవీరులకు జోహార్లర్పించారు. వివిధ రాష్ట్రాల నుండి మహాసభలకు హాజరైన ప్రతినిధి బృందాలు, సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, వరుసగా శ్రద్ధాంజలి ఘటించారు. మహాసభకు హాజరైన ప్రజలందరూ పతాకావిష్కరణ, అనంతరం అమరులకు శ్రద్ధాంజలి సాగుతున్నంత సేపూ ఎక్కడివారక్కడ లేచి నిలబడి ఉచ్చస్వరంతో నినాదాలు చేస్తూ ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

మార్చి 23న అమరులైన పీడిత ప్రజల ప్రియతమ నేత కా॥కానూసన్యాల్‌కు ఘన నివాళులర్పిస్తూ కా॥రఘూన్సి సంతాప తీర్మానంలో ప్రముఖంగా పేర్కొన్నారు. అదే రోజు మరణించిన కా॥పైలా వాసుదేవరావుతో పాటుగా గత 5 సం॥లుగా ఉద్యమంలో అశువుల బాసిన అమరులకు సంతాపం ప్రకటిస్తూ లేచి నిలచిన మహాసభ ప్రాంగణమంతా నిముష కాలం పాటు స్థంభించింది. వేలాది ప్రజానీకపు కలకలం సద్దుమణగటంతో గంభీరమైన ప్రశాంతత ఆ ప్రాంతమంతా పరచుకుంది. ఆపై నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఒక్కపెట్టున వెల్లువెత్తిన అమరుల జోహార్ల నినాదాల హోరుతో మహాసభల ప్రాంగణమంతా ఉద్విగ్నభరితమైంది. మృతవీరుల స్మరించే ప్రజాకళాకారుల విప్లవ గీతాలతో సభ ఉద్వేగ పూరితమైంది. మహాసభల ప్రారంభపు ఈ తొలిఘట్టాన్ని రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జె.కిషోర్‌బాబు నిర్వహించారు.

వేసవి ఎండలను, సుదూర ప్రయాణాల ప్రయాసలను అధి గమించి మహాసభలకు హాజరైన వారందరికీ ఉద్యమాభి వందనాలు తెలియజేస్తూ రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె.కోటయ్య వక్తలను, వివిధ రాష్ట్రాల నుండి, మన రాష్ట్రం నుండి హాజరైన సౌహార్ద్ర ప్రతినిధులను సాదరంగా ప్రజానీకపు నినాదాల, కరతాళధ్వనుల నడుమ వేదికపైకి ఆహ్వానించారు.

మహాసభలో మొదటి అంకమైన ప్రారంభ సభకు రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షులు కా॥రఘూన్సి అధ్యక్షత వహించారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, సీనియర్ అడ్వకేట్ శ్రీ చెరుకూరి వెంకటేశ్వర్లు తొలుత స్వాగతోపన్యాసం చేశారు. ప్రముఖ కథా రచయిత శ్రీ సింగమనేని నారాయణ ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం భారత జన ఆందోళన్ ఛైర్మన్ డా॥బి.డి.శర్మ ప్రసంగించారు, ప్రముఖ వ్యవసాయార్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి వ్యవసాయరంగ సమస్యలపై ప్రసంగించారు. (ఈ ప్రసంగాలన్నిటి పాఠాలను విడిగా అందిస్తున్నాం.)

## ఆకట్టుకున్న రైతు, కూలీ, ఆదివాసీల ఊరేగింపు

ప్రారంభ సభ ముగిసిన అనంతరం కామ్రేడ్ కానూసన్యాల్ నగర్ నుండి సాయంత్రం 4 గంటలకు ఆదివాసీ, రైతు,కూలీల ప్రదర్శన ప్రారంభమైంది. ప్రదర్శనకు ముందుభాగాన తప్పెటగుళ్ళు, కోలాటం, రేలనృత్యం, తదితర కళాకారుల బృందాలు తమ ప్రదర్శనలతో ముందుకు సాగాయి. ప్రదర్శన అగ్రభాగాన రైతుకూలీసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతోపాటు, ఇతర రాష్ట్రాల నుండి హాజరైన సౌహార్ద్ర ప్రతినిధులతో కలిసి రైతుకూలీ ఉద్యమ చిరకాల మిత్రులు డా॥బి.డి.శర్మ, ప్రొ॥కె.ఆర్.చౌదరి నడవగా ప్రదర్శన ఆసాంతం రెండు వరుసలుగా రెండు గంటలపాటు బారులు తీరి క్రమశిక్షణాయుతంగా కొనసాగింది. ఒంగోలు పట్టణ ప్రధాన వీధులుగుండా జనసమ్మర్దం నడుమ నుండీ సాగిన ఈ ప్రదర్శన, ముందుభాగాన కళాకారుల విన్యాసాలు, ఒంగోలు పట్టణ ప్రజలపై చెరగని ముద్రవేశాయి. సాయంసంధ్యతో కలగలసిన ఎర్రజెండాల, బ్యానర్ల మెరుపులతో ఒంగోలు పట్టణాన్ని ఎర్రకావురు కమ్మివేసింది. దున్నేవానికే భూమి దక్కాలని, వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలని, నక్సల్బరీ రైతాంగ ఉద్యమ నిర్మాత కా॥కానూసన్యాల్‌కు జోహార్లంటూ నినాదాలు చేస్తూ సాగిన ఈ ప్రదర్శనలో చంకలో బిడ్డలనెత్తుకొని మరోచేతిలో ఎర్రజెండాను పట్టుకొన్న వారితో సహా మహిళలు పెద్ద సంఖ్యలో, పట్టుదలతో పాల్గొన్నారు. దాదాపు కిలోమీటరు నిడివున్న ఈ ప్రదర్శనలో వేలాదిమంది రైతు, కూలీ, ఆదివాసులు రోజుల తరబడి ప్రయాణ బడలికను, వేసవి ఎండల తీవ్రతను అధిగమించి ఐదు కిలోమీటర్లు సాగిన ఈ ప్రదర్శనలో పాల్గొనటం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

**సామ్రాజ్యవాద దోపిడీ, జోక్యందారీ విధానాలనూ, భారత ప్రభుత్వ, పాలకవర్గాల సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే విధానాలనూ ఎండగట్టడం; పరిశ్రమలలో సామ్రాజ్యవాదుల మిలాఖత్తును, వారి పెట్టుబడులను వ్యతిరేకించటం; భారత ప్రభుత్వం సామ్రాజ్యవాదులతో చేసుకున్న అన్ని రకాల అసమాన ఒప్పందాలను ప్రతిఘటించడం; భారత గడ్డపై సామ్రాజ్యవాద దోపిడీని రూపుమాపడం రైతుకూలీసంఘం లక్ష్యం.**

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర) 'లక్ష్య ప్రకటన' నుండి**

# 'మరో పైరుపచ్చ విప్లవం మాటున రైతాంగంపై సాగనున్న మహాదాడిని ప్రతిఘటిద్దాం'

మహాసభల ప్రారంభ దినాన ప్రదర్శన అనంతరం పివిఆర్ హైస్కూల్ ఆవరణలో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన బహిరంగ సభకు రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఎస్. లలితకుమారి అధ్యక్షత వహించారు. ఫిబ్రవరి 23న ఒంగోలు పట్టణంలోని ప్రముఖులు, ప్రజాతంత్రవాదులు, ఉద్యమ మిత్రులు, సోదర ప్రజా సంఘాల ప్రతి నిధులతో దాదాపు 200మంది సభ్యులతో రాష్ట్ర మహాసభల ఆహ్వానసంఘం ఏర్పడి, సన్నాహక కృషి ప్రారంభించిందనీ, స్పష్టమైన లక్ష్యం, నిర్దిష్టమైన కృషీ సాగిస్తున్న సంఘం రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహించు కోవటం గర్వకారణంగా ఉందని పేర్కొ న్నారు.

జిల్లాలో రైతు, రైతుకూలీ సంఘాలు సమైక్యంగా పోరాడిన ఫలితమే టుబాకో బోర్డు ఏర్పాటనీ, కానీ ఈ బోర్డును ఎత్తివేసే కుట్రలను ప్రభుత్వం సాగిస్తున్నదని పేర్కొన్నారు. సుబాబుల్ రైతాంగం దళారుల బారిన పడకుండా మార్కెట్ యార్డుల ద్వారా కొనుగోలు చేసుకుంటుంటే ప్రభుత్వాలు దీనిని కూడా రద్దు చేస్తున్నాయని చెప్పారు. జిల్లాలో చేనేత కార్మికులు తీవ్ర సంక్షోభ పరిస్థితుల నడుమ ఆత్మహత్యలకు పాల్పడు తున్నారనీ రైతాంగపు, చేనేత కార్మికుల, రైతు కూలీల మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలు మినహా ఆత్మహత్యలు పరిష్కారం కావని ఆమె తన అధ్యక్షో పన్యాసంలో నొక్కి చెప్పారు.

**'బలమైన రైతు ఉద్యమాల ద్వారానే నేలతల్లిని విముక్తి చేయగలుగుతాం'**

భారత్ జన ఆందోళన్ ఛైర్మన్ డా॥బి.డి. శర్మ మాట్లాడుతూ సామ్రాజ్యవాదులు మన దేశ వ్యవసాయరంగాన్ని దెబ్బతీసే దురుద్దేశ్యంతోనే పైరుపచ్చ విప్లవాన్ని రైతాంగంపై రుద్దారన్నారు. విశాల భూములు, అశేష శ్రమశక్తి వున్న మన దేశంలో ఇది సర్వనాశనం సృష్టించిందన్నారు. రైతాంగం నుండి కొల్లగొట్టిన డబ్బునంతా నగరాలలో అభివృద్ధి పేరిట వినియోగించి గ్రామీణ ప్రజలను దుర్భర దారిద్ర్యంలోకి నెట్టివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి అమ్మకపు సరుకుగా మార్చిన పాలకుల విధానాలపై ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. బలమైన రైతు ఉద్యమాల ద్వారానే నేలతల్లిని విముక్తి చేయ గలుగుతామని, పాలకుల మెడలు వంచ గలుగుతామనే ప్రగాఢ విశ్వాసాన్ని డా॥బి.డి.శర్మ తన ఉపన్యాసంలో వ్యక్తం చేశారు.




బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కా॥కోటయ్య; వేదికపై ఎడమ నుండి పెద్దన్న, స్వామి, కె.ఆర్.చౌదరి, బి.డి.శర్మ, ఝాన్సి, లలిత

## 'సెజ్‌ల వ్యతిరేక పోరాటాలకు మహాసభలు స్ఫూర్తినిస్తాయి'

ప్రముఖ వ్యవసాయార్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి ప్రసంగిస్తూ ఆరు దశాబ్దాల పైగా మన పాలకుల పాలనలో భూమి ఇంకా కొంతమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందన్నారు. దేశవ్యాపితంగా సాగిన అనేక రైతాంగ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వాలు కొన్ని సంస్కరణలను చేపట్టినా, అవన్నీ ప్రజలను మభ్యపరిచేందుకు విని యోగించాయి తప్ప ఆచరణలో అమలు చేయ లేదన్నారు. తెలంగాణా, శ్రీకాకుళం, నక్సల్బరీ, గోదావరి లోయ పోరాటాలు, కొండమొదలు, మనుగోపాల, దుగ్గేరు, పార్వతీపురం, కోరాపుట్ ప్రాంతాలలోనూ భూమి కోసం పోరాటాలు సాగుతున్నాయన్నారు. పోర్టులు, పార్కులు, ప్రాజెక్టుల పేరిట రైతుల భూములను గుంజి వేసుకుంటున్న నేటి స్థితిలో వున్న భూములనైనా నిలుపుకునేందుకు పోరాటం చేయవలసి వుందనీ, సెజ్‌ల వ్యతిరేక పోరాటాలకు, భూపరాయీకరణ వ్యతిరేక పోరాటాలకు స్ఫూర్తిదాయకంగా సాగుతున్న ఈ మహాసభ, ప్రదర్శన, బహిరంగసభలు ఉత్తేజాన్నిస్తాయని ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## 'రైతాంగాన్ని దగా చేస్తున్న పాలక పార్టీలు'

సిపిఐ(ఎం.ఎల్) కేంద్ర కమిటీ నాయకులు కామ్రేడ్ పి.జస్వంతరావు మాట్లాడుతూ పాలక పార్టీలన్నీ ముఖ్యంగా ఎక్కువ కాలం పాలన సాగించిన కాంగ్రెస్ పార్టీ రైతాంగాన్ని దగా చేసిందనీ వలస వాదులకు ఇంకా సేవ చేస్తూనే వున్నారని అన్నారు. జాతీయోద్యమ కాలంలో ఇదే జిల్లాలో చీరాల పేరాల ఉద్యమం ఉధృతంగా సాగే సందర్భంలో ప్రభుత్వానికి లెవీ చెల్లించాలనే నీరు గార్చే వైఖరి తీసుకున్నారని, గ్రామ స్వరాజ్యమనే మాటలను వల్లెవేయటం మినహా దానిని నిర్వచించటం కానీ రైతాంగం ముందు ఒక కార్యక్రమాన్ని ఉంచటం కానీ చేయలేదని ఎత్తిచూపారు. ఈ నేపథ్యంలో రైతాంగం సంఘటితంగా పోరాటం ద్వారానే భవిష్యత్‌ను కాపాడుకోగలుగుతారని కా॥జస్వంత్ నొక్కి చెప్పారు.

## 'కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా పోరాటాలు సాగాలి'

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సి.పెద్దన్న మాట్లాడుతూ ఒంగోలును ఎరుపు మయం చేసిన రైతు, కూలీ ఆదివాసీ ప్రజానీ కానికి విప్లవాభినందనలు తెలియజేశారు. రైతు, కూలీల పరిస్థితి ఎంతటి దుర్భరంగా ఉందో, ఈ దేశంలో కార్మికవర్గం పరిస్థితి అందుకు ఏ మాత్రం మినహాయింపుగా లేదని పేర్కొన్నారు. శతాబ్దాల క్రితమే కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినం వంటి అనేక హక్కులన్నీ కాలరాయబడుతున్నా యని, కాంట్రాక్టు కార్మికులు, ఔట్‌సోర్సింగ్ తదితర పేర్లతో నిర్బంధ వెట్టిచాకిరీ కొనసాగు తున్నదని అవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా ఈ వ్యవస్థ మార్పుకోసం, నూతన ప్రజా స్వామిక విప్లవ దిశగా ఉద్యమాలు సాగాల్సిన అవసరాన్ని కామ్రేడ్ పెద్దన్న తన ఉప న్యాసంలో ప్రముఖంగా పేర్కొన్నారు.

## 'మరో పైరు పచ్చ విప్లవం-మరో పెను విపత్తు!'

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ ఇప్పటివరకూ రైతులకు ఏమి ఒరగబెట్టారో చెప్పకుండా ఎప్పటికప్పుడు కొత్తగా రైతాంగపు సమస్యల పరిష్కారానికి ఏదో చెయ్యబోతున్నామని ప్రకటించటంలోనే ప్రభుత్వాల కుట్ర దాగి వుందని అన్నారు. 'మరో పైరుపచ్చ విప్లవం' పేరిట కనీసపాటి విత్తన స్వతంత్రతను కూడా లేకుండా చేస్తూ, విత్తన రంగాన్ని యావత్తు సామ్రాజ్యవాద బహుళజాతి అగ్రిబిజినెస్ కంపెనీల పరం చేయబూనుకున్నారని కా॥ఝాన్సి వివ రించారు. జాతీయ భావాల గురించి, దేశభక్తి గురించి పదే పదే వల్లెవేసే ఈ పాలక రాజకీయ నాయకులంతా ఆచరణలో రాజకీయ దళారులుగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఆదివాసీ ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ తదితర అనేకానేక అనారోగ్యాల బారినపడి లెక్కకుమించి మరణిస్తూంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూడా సరిగా పనిచేయించని ప్రభుత్వం, పేదలకొచ్చే జబ్బులకు కార్పోరేట్ స్థాయి వైద్యాన్ని అందించే పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పెద్ద పెద్ద కార్పోరేట్ సంస్థలకు దోచిపెడ్తుందన్నారు. రైతాంగం, కూలీలు, ఆదివాసీలు, గ్రామీణ పేదలు, చేతివృత్తుల సమస్యల పరిష్కారానికి భూమి సమస్య పరిష్కారానికి సంఘటిత పోరాటాల నిర్మాణం అవసరమన్నారు. ఈ మహాసభల నిర్వహణకు సహకరించిన ప్రతిఒక్కరికీ బహిరంగ సభావేదిక నుండి రాష్ట్ర కార్యవర్గం తరపున కా॥ ఝాన్సి కృతజ్ఞతలు తెలియ జేశారు.

## 'ఏకీభావమున్న సమస్యలపై ఐక్యకార్యాచరణ అవసరం'

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య మాట్లాడుతూ ఆనాడు దేశంలో ఏర్పడిన సంక్షోభం ఫలితంగా పెల్లుబుకుతున్న ప్రజల పోరాటాలను అణచివేసేందుకే 1975లో ఇందిరాగాంధీ ప్రభుత్వం అత్యసవర పరిస్థితిని విధించి కనీసపాటి ప్రజాస్వామిక హక్కుల గొంతు కూడా నులిమివేసిందని గుర్తు చేశారు. ఏకీభావమున్న రైతాంగ సమస్యలపైన, రైతు, రైతుకూలీసంఘాలు ఐక్యకార్యాచరణ సాగించిన కాలంలో ప్రభుత్వాలపై వత్తిడి పెంచి, ఏదో మేరకు కొన్ని సమస్యల పరి ష్కారానికైనా దోహదపడేదని, దాన్ని కొన సాగించాల్సిన ఆవశ్యకతను కామ్రేడ్ కోటయ్య తన ఉపన్యాసంలో ప్రముఖంగా పేర్కొన్నారు.

## 'మహాసభలకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు'

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ డివిఎన్ స్వామి మాట్లాడుతూ రైతాంగ సంక్షోభం నేపథ్యంలో జిల్లాలో ఐక్య కార్యాచరణ సాగుతున్న వాతావరణంలో ఒంగోలులో ఈ రాష్ట్ర మహాసభలు నిర్వహించు కోవటం ఎంతో ఉపయోగకరంగా ఉంద న్నారు. ఈ మహాసభల నిర్వహణకు హార్దికంగా, ఆర్థికంగానూ, వస్తురూపంలోనూ తోడ్పడిన వారందరికీ, వలంటీర్స్‌కు, పట్టణ ప్రజలకు, మీడియాకు ఆహ్వాన సంఘం తరపున కృతజ్ఞతలు తెలియచేయటంతో బహిరంగసభ ముగిసింది.

ప్రతినిధుల సభ

# భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ-పీడనలపై దండెత్తుదాం!

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభల రెండవ రోజైన 13.4.10 ఉదయం 11 గంటలకు ప్రారంభమైన తొలి సెషన్‌కు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జె.కిశోర్‌బాబు అధ్యక్షతన వహించారు. ఈ సెషన్‌లో 'ప్రజాపంపిణీ వ్యవస్థ-పాలకుల విధానాలు' అంశంపై విశ్రాంత ఐఎఎస్ అధికారి శ్రీకె.ఆర్.వేణుగోపాల్ ప్రసంగించారు. అనంతరం, టి.ఎన్ మెమో రియల్ ట్రస్ట్ ఛైర్మన్ డా॥బి.సూర్యసాగర్ ఉపన్యసించారు. (ప్రసంగాల పూర్తి పాఠాలను విడిగా అందిస్తున్నాం.)

## ప్రతినిధుల సభ

రాష్ట్ర మహాసభల రెండవ రోజైన 13.4.10 సాయంత్రం సెషన్ నుండి 14.4.10 సాయంత్రం వరకు ప్రతినిధుల సభ జరిగింది. ఈ సభకు అధ్యక్షవర్గంగా రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్స్ వర్మ, సునీత నర్సయ్య..... వ్యవహరించారు. ప్రతినిధుల సభలో మొదటగా '2005-అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర మహాసభల నుండి 2010 మార్చి వరకు జరిగిన కార్యకలాపాల నివేదిక' ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ఝాన్సి ప్రవేశపెట్టగా వివిధ జిల్లాల నుండి 20మంది పైగా ప్రతినిధులు మౌలికంగా ఈ నివేదికను ఆమోదిస్తూనే నివేదిక మెరుగుదలకు సవరణలు, చేర్పులు సూచించారు. అనంతరం కార్యక్రమాల నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. (కార్యక్రమాల నివేదిక సంక్షిప్త పాఠాన్ని విడిగా అందిస్తున్నాం)



ప్రతినిధుల సభ

## నూతన కార్యవర్గ ఎన్నిక

రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కోటయ్య వివిధ జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే 23 మందితో నూతన కార్యవర్గాన్ని ప్రతిపాదించగా మహాసభ కరతాళ ధ్వనులతో ఆమోదం తెలిపింది. ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గం సమావేశమై సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా కా॥ఎస్.ఝాన్సి, ఉపాధ్యక్షులుగా కామ్రేడ్స్ మానం రామారావు, ముత్తిరెడ్డి శ్రీరాములు, రాష్ట్ర కార్యదర్శిగా కా॥కె.కోటయ్య, సహాయ కార్యదర్శులుగా కా॥ జె.కిషోర్‌బాబు, కా॥డి.వర్మ కోశాధికారిగా కా॥వై.సోనిలను ఎన్నుకొని ప్రకటించగా ప్రతినిధులు కరతాళ ధ్వనులతో స్వాగతించారు.

అనంతరం రాష్ట్రంలో రైతాంగం, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై, ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతినిధుల సభ తీర్మానాలను ఆమో దించింది. (తీర్మానాల పూర్తి పాఠాన్ని విడిగా అందిస్తున్నాం.)

## ఏ.ఐ.కె.ఎమ్.కె.ఎస్‌లో భాగస్వామిగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర)

అఖిలభారత స్థాయిలో రైతుకూలీ సంఘాల సమన్వయంతో ఏర్పడిన ఏ.ఐ.కె.ఎమ్.కె.ఎస్.లో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) భాగస్వామిగా వుందనీ, మన బాధ్యతలు మరింత పెరుగుతున్నాయని చెపుతూ, సంఘ సభ్యత్వాలను విస్తరించాలనీ, గ్రామ, జిల్లా

కమిటీల ఫంక్షనింగ్ మెరుగుపరుచుకోవాలనీ, ప్రచురిస్తున్న సాహిత్యాన్ని రైతాంగం, మేధావుల వద్దకు విస్తృతంగా తీసుకెళ్ళటంతో పాటు రైతుకూలీ సంఘ సభ్యులు, కార్యకర్తలు తమ అధ్యయనాన్ని మెరుగుపర్చుకుంటూ ఉద్యమ నిర్మాణానికి పూనిక వహించాలని కోరుతూ సంఘం అధ్యక్షులు కా॥ఝాన్సి చేసిన ముగింపు ఉపన్యాసం అనంతరం అంతర్జాతీయ శ్రామిక గీతంతో మూడు రోజుల మహాసభల కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.

## సన్నాహక కృషి

మహాసభల నిర్వహణ కోసం 2010 ఫిబ్రవరి 23న ఏర్పడిన ఆహ్వానసంఘం, సభలను విజయవంతం చేయటానికి పట్టుదలతో కృషి చేసింది. వివిధ జిల్లాల నుండి నెల రోజుల ముందుగానే ఒంగోలుకు చేరుకున్న వలంటీర్లు, స్థానిక వలంటీర్స్‌తో కలసి పట్టణంలోని ఇంటింటికీ మహాసభల సమాచారాన్ని చేరవేశారు. ప్రజల నుండి విరాళాలను సేకరించారు. ఒంగోలు పట్టణంలోనూ, జిల్లాలోనూ వివిధ మండలాలు, గ్రామాలలో గోడవ్రాతలు, కరపత్రాలు, పోస్టర్స్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. కళాకారుల బృందాలు పాటలతో, గ్రూపు సమావేశాలతో ప్రజల మధ్య రాజకీయ ప్రచార కృషిని సాగించాయి.

## సాంస్కృతిక, కళారూపాలు

ప్రపంచదేశాల్లోనూ, మనదేశంలోని వీరోచిత తెలంగాణా, నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల్లోనూ, కొండమొదలు, దుగ్గేరు, కోరాపుట్ ప్రాంతాలలో ఎర్రజెండా నీడన ప్రజలు సంఘటితమై సాగిస్తున్న పోరాటాలను, ఎర్రజెండా మహత్తర త్యాగాల పోరాట చరితను చాటిచెప్పే **'ఎర్రజెండా'** రూపకం; వివిధ పోరాటాలలో భూస్వాముల, పోలీసుల, రౌడీగూండాల దాడులలో అమరత్వం పొందిన వీరుల క్రొన్నెత్తుటి త్యాగాల గాథలను దృశ్యీకరించే **'నెత్తుటి దీపాలు'** నృత్య రూపకం; శ్రీకాకుళ గిరిజనోద్యమ నేపథ్యాన్నీ, కోరన్న, మంగన్నల అమరత్వాన్ని కళ్ళెదుట నిలిపే **'పోరుదారి'** రూపకం; ఒరిస్సా కోరాపుట్ ప్రాంత ఆదివాసులపై సాగుతున్న దోపిడీ పీడనలు, వాటిని ఎదుర్కొంటూ చాషీమూలియా ఆదివాసీ సంఘ **'పోరుదారి'** రూపకం; కిర్మపై పెత్తందార్ల దాడులను తిప్పికొడుతూ ప్రజలు సాగుతున్న తీరును వివరించే అనంతపురం జిల్లా యువ ప్రజా కళాకారుల **వీధి నాటిక;** శ్రీకాకుళం జిల్లా జానపద కళాకారుల **'తప్పెట గుళ్ళు';** గోదావరి జిల్లా ఆదివాసుల **రేల నృత్యాలు;** నెల్లూరుజిల్లా బాల కళాకారుల, పల్నాడు ప్రజా కళాకారుల **కోలాటం;** వివిధ జిల్లాల ప్రజాకళాకారుల **విప్లవగీతాలు, డప్పునృత్యాలు** రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహాసభలకు హాజరైన ప్రజానీకాన్ని-ముఖ్యంగా ఒంగోలు ప్రజానీకాన్ని ఆకట్టుకోవటంతో పాటుగా విప్లవోత్తేజాన్ని నింపటంలో విశేష పాత్ర నిర్వహించాయి.

**పైరుపంటల నీవు పండింపగానేమి**
**యా ధాన్యములు గడ్డి యప్పపాలు**
**పసికదుపుల నీవు పాలింపగా నేమి**
**నిస్సారమయ్యివి నేలపాలు**
**కాననంబుల నీవు కాపాడగా నేమి**
**భూపాలవర్గంపు బొయ్యి పాలు**
**కడగండ్లు వడి నీవు గుడిసె గప్పిన నేమి**
**యాలుపిల్లలు దిన మడవి పాలు**
**ఫలిత మేమేమి దీసిన పరుల పాలు**
**లేమిచే గ్రుంగు వానికి లేదు పాలు**
**కాన వేగమే లేలెమ్ము కనులు విప్ప**
**కర్షకా! నీకు నింకేమి గలదు వెరపు?**

గంగుల శాయిరెడ్డి 'కాపుబిడ్డ' నుండి
రచనా కాలం-**1937**

**మత్స్యకారులపై కారిడార్లా?**
**పోడుల్లో పేలుడులా?**
**కారిడార్లు వద్దంటే కాల్చి పారేస్తారా?**
**కొండలు పేల్చొద్దంటే-**
**గిరిజనులను చెర బడతరు!**
**నేలా గాలీ నీరులో-కాలుష్యం దింపుతారు!**
**'బహుళజాతి', 'దళారీల'**
**బానిసలోరి బుగతలార**
**సూర్యబింబదుందిభదిగో-తీరరేఖ మోగుతుంది**

ఛాయరాజ్
'సెజ్జంటే గిజ్జంటే' నుండి

స్వాగతోపన్యాసం

# రైతుకూలీలు సంఘటితంగా పోరాడి హక్కులు సాధించుకోవాలి’



“ఈ రైతుకూలీసంఘం కార్యకర్తలు, అభిమానులు, నాయకులు అంతా కలిసి ఇటువంటి ఉద్యమాలు వచ్చినప్పుడు ప్రభుత్వాన్ని ఎదిరించి జయం పొంద గలరని నేను ఆశిస్తున్నాను. దానివల్ల మనకేకాక రాబోవు తరాలవారికి మంచి జరుగుతుంది.’

**శ్రీ చెరుకూరి వెంకటేశ్వర్లు**
**రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షులు**

సభకు నమస్కారం. రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలకు విచ్చేసిన మేధావులకు, ప్రతినిధులకు అందరికీ స్వాగతం, సుస్వాగతం. ప్రకాశంజిల్లా–ఒంగోలులో ఈ మహాసభలు జరుపుకోవటం–చాలా సముచిత మైన విషయమని నేను భావిస్తున్నాను.

రైతుకూలీసంఘాలు రైతుతో నిమిత్తం లేని సంఘాలనే భావన ఇది వరకు వుండేది. రైతులు, ఆ రైతు మీద ఆధారపడి జీవనం గడుపుతున్న కూలీలు ఇద్దరికీ ఈ సంస్థల్తో ఎక్కువ అవినాభావ సంబంధం వుంది. గత కొద్ది సంవత్సరాలుగా రైతుకూలీల పరిస్థితి తారు మారైపోయింది. దానికి కారణం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు. చిన్న ఉదాహరణ మీకు చెప్తాను. ప్రభుత్వం బంజరు భూములు పంచే విధానంలో ఒక్క ఎకరం భూమి ఎసైన్ మెంట్ కింద పట్టా ఇచ్చినట్లయితే దానికి కూడా 10సం॥ల పాటు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతుంది. రెవెన్యూ కోర్టు, ఎమ్మార్వో–ఆర్‌డివో–జిల్లా కలెక్టరు–రాష్ట్ర రెవెన్యు బోర్డు అక్కడ కూడా సివిల్‌సూట్ అయితే మునిసిపల్ కోర్టు–జిల్లా కోర్టు–హైకోర్టు–సుప్రీంకోర్టు ఈ విధంగా ఈ అన్ని కోర్టుల్లో ఆక్రమణకు గురైన తన భూమి గురించి అనుకూల తీర్పులు తెచ్చుకోని భూమి పొందేసరికి అప్పీలు చేసిన వాడు అక్కడ మిగలడు. వారసులు మాత్రమే దక్కించుకోగలరు. ఈ విధంగా వేల ఎకరాల రైతుల భూముల్ని సెజ్‌లకు, కారిడార్లకు ఒక్క కలం పోటుతో ఒకే రోజు వ్యవధిలో వారికి స్వాధీనం చేస్తున్నారు. ఒక్క ఎకరం భూమి కోసం సామాన్యుడికి 10 ఏళ్ళు పడితే సెజ్‌ల యాజమాన్యానికి 1000 ఎకరాలు ఒక్కటే ఒక సంతకంతో ధారాదత్తం చేయబడుతున్నది. ఈ విధంగా సామాన్యుడు దోపిడీకి గురౌతున్నాడు. దాన్ని ఎదిరించాలంటే సంఘటిత శక్తి కావాలి.

బెంగాల్‌లో రైతుకూలీలు సంఘటితంగా నిలబడి టాటా కంపెనీ గుంజుకున్న భూముల్ని పోరాడి నిలబెట్టుకున్నారు. ఆ పోరాట శక్తి మనలోనూ వున్నది. ఈ మహాసభను చూస్తూంటే పురుషులకన్నా స్త్రీలే ఎక్కువగా కనిపిస్తున్నారు. చాలా సంతోష కరమైన విషయం. పురుషుల్ని పోలీసులు అరెస్టు చేసి హింసలకి గురి పెడతారు. స్త్రీలను కూడా హింసపెడతారు. కానీ కొంచెం వెనకడుగేస్తారు.

ఈ మహాసభకు ప్రత్యేకంగా ఆర్‌సిఎస్ అభిమానులు, ఇతర రాష్ట్రాల నుండి ప్రతినిధులు రావటం సంతోషదాయకం. వాళ్ళు–వాళ్ళ రాష్ట్రాల్లోని ప్రజా వ్యతిరేక విధానాలను ఏ విధంగా ఎదిరిస్తున్నారో మనం ఎలా ఎదుర్కోవాలో వాళ్ళ అనుభవాలు మనకు వివరిస్తారు. ఆ రాష్ట్ర సంస్థలకు, ప్రతినిధులుగా వచ్చిన వారందరికీ కూడా ఆహ్వానసంఘ అధ్యక్షునిగా నా ఆహ్వానం, మరియు అభినందనలు.

భారతదేశంలో వున్నటువంటి చట్టాలు సంఖ్యాపరంగా ప్రపంచంలో మరే దేశంలోనూ లేవు. కొన్ని చట్టాలలో పరిమితంగానైనా బడుగు జీవులకు సహాయపడాలన్న ఉద్దేశ్యం వున్నది. ఐతే ఆచరణలోకి వచ్చేటప్పటికి ఆ చట్టాలకి కొన్ని సవరణలు తెచ్చిపెడతారు. దానితో ఆ చట్టం నీరుగారిపోతోంది.

గత 100 సం॥ల నుండి దోపిడీకి గురై పొగాకు రైతులు ఎంత బాధపడిందీ మీకు తెలుసు. కొన్ని సంవత్సరాల పాటు ఆందోళన చేసి రైతులు, రైతుకూలీల క్షేమం కోసం టుబాకో బోర్డు తీసుకొస్తే, ఈ రోజు కూడా ఆందోళన జరపనిదే ఏ చిన్న సమస్యా సాధ్యం కావట్లేదు. ఇప్పుడు టుబాకో బోర్డు రైతుల సంక్షేమానికి తూట్లు పొడిచే విధంగా బెంగుళూరులో సమావేశమై 30% పొగాకును రైతులు ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముకోవచ్చు అని సవరణ తీసుకొచ్చింది. దాన్ని వ్యతిరేకిస్తూ రైతులు, రైతు సంఘాలు ఆందోళన చేస్తే ప్రస్తుతానికి ఆ సమస్య

ఆగింది. అలానే భూమిలేని పేదలకు భూమి ఇస్తున్నామంటూ 1977 సం॥లో చట్టం తీసు కొచ్చారు. ఎపి ఎసైన్డ్ ల్యాండ్ ప్రొహిబిషన్ ఆఫ్ ఎలియనేషన్

యాక్ట్. ఎసైన్ చేసినటు వంటి వ్యక్తికి ఇచ్చిన భూమిని అమ్మటానికి లేదు. మరొకడు కొంటానికి వీల్లేదు. ఒకవేళ కొన్నా కొన్నవాడికి హక్కు లేదు. ఎమ్మార్వో ఆ భూమి తిరిగి స్వంతదారునికే అంటే ఎవరికైతే మొదట పట్టా ఇచ్చారో అతనికే ఇచ్చివేసే అధికారం వుంది. బాగానే వుంది. కానీ ఈ చట్టానికి తూట్లు పొడిచే సవరణలు చేశారు ఇటీవల. ఈ చేతులు మారిన భూమిని ఎమ్మార్వో తీసు కొంటాడు. అయితే, ఇపుడు మొట్టమొదట భూమి పొందిన వానికే ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ అవసరాల మేరకు దాన్ని ప్రభుత్వం అట్టిపెట్టు కోవచ్చు అనేది ఆ సవరణ! వేలాది ఎకరాల భూమిని బడా కంపెనీలకు కట్టబెడుతూ పేదవానికిచ్చిన భూమిని ప్రభుత్వం స్వంతం చేసుకోవచ్చు నంటారు. ఈ విధంగా అన్ని రకాల చట్టాలు, ప్రజాప్రతినిధులకు చుట్టాలై పోయినాయి.

1970 సం॥లో 'ఆంధ్రప్రదేశ్ సీలింగ్ యాక్ట్' వచ్చింది. ఆ సీలింగ్ చట్టం కింద పరిమితులు నిర్ణయించారు. ఆ చట్టం కింద భూమి యొక్క స్వభావాన్ని బట్టి మాగాణి-మెట్ట ఇట్లా ఒక్కో రైతుకు ఇంతకుమించి భూమి వుండటానికి వీల్లేదు అన్నారు. భూమి స్వభావాన్ని బట్టి ఎ,బి,సి,డి అని వర్గీ కరించారు. సారవంతమైన భూమి, అతిసార వంతమైన భూమి, మాగాణి భూమి, అని ఇలా.. అది ఆచరణకొచ్చేటప్పటికి కుటుంబానికి పరిమితి 35 ఎకరాలు! మెట్ట భూమి ఐతే ఎక్కువలో ఎక్కువ 35 నుండి 40 వరకు వుండొచ్చన్నారు. మాగాణి భూమి ఐతే (రెండు పంటలు పండేది) 12 ఎకరాల కంటే మించకూడదన్నారు. ఒకే పంట పండే మాగాణి భూమైతే 15 ఎకరాల కంటే మించకూడదన్నారు. ఆ కారణం చొప్పున కుటుంబ సభ్యుల్లో ఎంతమంది మేజర్లుం టారో అందరినీ తలా ఒక స్టాండర్డ్ హోల్డింగ్ అన్నారు. ఒక కుటుంబంలో భార్య, భర్త పిల్లలు(ఇద్దరు మేజర్లు). వారికుండాల్సిన భూమి-ఎంతమంది మేజర్లుంటారో ఆ కుటుంబంలో అన్ని స్టాండర్డ్ హోల్డింగ్ లన్నారు. అంటే ఒక కుటుంబం 35 ఎకరాలు అట్టిపెట్టుకోవచ్చుననుకోండి ఈ ఇద్దరు పిల్లలు మేజర్లుండగా, వారితో కలిపి 105 ఎకరాలు అట్టిపెట్టుకోవచ్చన్నమాట. ఇలానే చట్టాలన్నీ మొదట్లో ఏ ఫలితాన్ని ఆశించి పెట్టారో ఈ సవరణల తర్వాత నిరుపయోగంగా మారి ఎవరి కోసం ఉద్దేశించ బడినవో వారికి ఉపయోగపడకుండా చట్ట సవరణలుంటూ వచ్చాయి.

మన దేశంలో అన్నింటికంటే ముఖ్య మైన విషయమేమిటంటే-ఒక ప్రధాన విషయం మీద అసెంబ్లీలో చర్చ జరగటం, దానికి గవర్నర్ ముద్ర వేయటం, అది అమల్లోకి రావటం జరగాలి. ఇవాళ మనం టీవీల్లో చూస్తూనే వున్నాం. అసెంబ్లీలో ఉదయం నుంచీ రాత్రి దాకా వాళ్ళని వీళ్ళు, వీళ్ళని వాళ్ళు దూషించుకోవటం, ఈ సీట్లో కూర్చొన్న వ్యక్తి రేపు ఎదురు సీట్లోకి రావటం, వాడు ఏదైతే విమర్శ చేశాడో ఆ చేసిన చట్టాలుగానీ, కార్యకలాపాలుగానీ, వీటినే తాను చెయ్యటం, అంతకుముందు కూర్చొన్న సీటుకు ఎదురుగా కూర్చొని వాటిని విమర్శించటం, ఇది రాత్రి 10-11 దాకా వాళ్ళు ఒకళ్ళనొకళ్ళు విమర్శించుకొని అన్నం తిని, పడుకోవాల్సిన టైమ్ అవుతుంది. ఆ రోజుకి పాస్ కావాల్సిన చట్టాలు వుంటాయి. వాటిని గెలిటిన్‌చేస్తారు. ఐతే ఇదిట్లానే కావాల్సిందేనా, ఏదైనా మార్పు రావాలా? ఇటువంటివన్నీ ఇవాళ కళ్ళకు కట్టినట్లుగా పత్రికలు-మీడియా విస్తృత ప్రచారం చేస్తు న్నారు. అవన్నీ మనకు కనపడుతున్నాయి. కావున వీటన్నిటి మార్పు కోసం మనం సంఘటి తమై పోరాడి సాధించుకోవాల్సిన అవసరముంది.

ఈ రైతుకూలీసంఘం కార్యకర్తలు, అభిమానులు, నాయకులు అంతా కలిసి ఇటువంటి ఉద్యమాలు వచ్చినప్పుడు ప్రభుత్వాన్ని ఎదిరించి జయం పొందగలరని నేను ఆశిస్తున్నాను. దానివల్ల మనకేకాక రాబోవు తరాలవారికి మంచి జరుగుతుంది. నన్ను ఆహ్వాన సంఘ అధ్యక్షునిగా ఎన్ను కున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపు కుంటున్నాను. ఈ మూడు రోజుల్లో జరిగే చర్చల్లో మీరంతా శ్రద్ధగా పాల్గంటారని ఆశిస్తూ, మీ కర్తవ్యాలను అమలు చేసేందుకు ముందుటారని ఆశిస్తూ మీ అందరికీ ధన్య వాదాలు తెలుపుకుంటూ సెలవు తీసు కుంటున్నాను.

**మీ అమ్మ మెడలోని తాళిబొట్టు పుసుపుకొమ్మయింది**
**నీ చెల్లెలి చెవుల్లోని కమ్మలు జన్న బెండులైనాయి**
**నీ తమ్ముడు బడిమాని బట్టీలో కాలే ఇటికైపాయే**
**నువ్వేమో హోటల్లో ఎంగిలి కంచమైపోతివి**
**దేశానికి పట్టెడన్నం పెట్టిన మీ తాత**
**తుంట బీడీలు అడుక్కొంటూ**
**బస్టాండులో బిచ్చగాడైపాయే**
**అన్నింటినీ ఒడ్డి**
**నేను జూదంలో ఓడిన ధర్మరాజునైపోతిని**

గోపినికరుణాకర్
'పొద్దున్నే వచ్చిన వాన' నుండి.

అధ్యక్షోపన్యాసం

# 'భారత రైతాంగ వీరోచిత పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం'



రైతు ఏ విధంగా తిరుగు బాటు చేసి తన జీవితాన్ని చక్కదిద్దు కుంటాడో, ఆ వీరోచిత పోరాట చరిత్ర భారత ప్రజల ముందుంది. అదే తెలంగాణా పోరాటం, నగ్జల్బరీ పోరాటం, శ్రీకాకుళ పోరాటం! ఆ పోరాటాలకు సంబంధించిన వారసత్వాలను తీసుకొని దున్నే వానికే భూమి నినాదంపై మనం రైతు కూలీసంఘంగా ఉద్యమిస్తూ గ్రామ గ్రామానా, కొండకోన ల్లోనూ ఎంతో నిబద్ధతతో, చైతన్యంతో, నిర్మాణ దృష్టితో పనిచేయవలసిన అవసరం వుంది. దాన్ని గుర్తింపజేసుకొని మరింత ముందుకు సాగటం కోసమే ఈ మహా సభలను మనం నిర్వహించుకుంటున్నాం.


కా॥యస్.ఝాన్సి

రైతుకూలీసంఘ:(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు


2005లో అనకాపల్లిలో జూన్ మండు టెండల్లోనే మనం గత రాష్ట్ర మహాసభలు జరుపుకున్నాం. ఇప్పుడు 2010లో తీవ్రమైన ఎండలలో మహాసభలు జరుపుకుంటున్నాం. ఇబ్బందులన్నింటినీ అధిగమించి ఈ మహా సభకు హాజరైన కూలీలు, రైతులు, ఆదివాసులు, వివిధ సెక్షన్ల ప్రజానీకాని కందరకూ విప్లవాభినందనలు. మన మహా సభలో ప్రసంగించేందుకు విచ్చేసిన ఉపన్యాస కులకు, సౌహార్ద్ర సందేశాలు ఇచ్చేందుకు విచ్చేసిన వివిధ సంఘాల ప్రతినిధులకు ముందుగా అభినందనలు తెలియజేస్తున్నాను.

గత చరిత్ర నొక్కసారి పరిశీలిస్తే భారత దేశాన్ని బ్రిటీష్ వాళ్ళు ఏలిన 200 సం॥ల కాలంలో మన దేశ సహజ సంపదలన్నింటినీ వారు పెద్ద ఎత్తున తరలించుకుని వెళ్ళారు. అంతకుముందు భారతదేశంలో ఏ విధమైన భూమి విధానం, భూమి పద్ధతీ వున్నదో దాన్ని పూర్తిగా మార్చివేసి భూమిని ఒక సరుకుగా, ఆస్తిగా మార్చి, రైతాంగాన్ని దోపిడీ చేసేందుకు వీలుగా జమీందారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుని, ఎవరైతే భూమిపైన శ్రమిస్తున్నారో వాళ్ళ శ్రమ సంపద ఫలితాన్నంతా తరలించుకు వెళ్ళటమనేదే ఆనాడు బ్రిటీషువాడు మన దేశానికి వచ్చిన దగ్గర నుండీ చేసినది!

వాళ్ళేం చేస్తున్నా భారత రైతాంగం చూస్తూ వూరుకోలేదు. ఎక్కడికక్కడ ప్రతి ఘటించారు. 1857 ప్రధమ భారత స్వాతంత్ర సంగ్రామానికంటే ముందే వివిధ ప్రాంతాల్లో ఉండే రైతులు-ఏజన్సీలో వుండే గిరిజనులు ఎంతోమంది 'మీరు మా మీద దోపిడీ చెయ్యటానికి వీల్లేదు, ఈ భూమి మాది, మేం పండించే పంటకు శిస్తును వసూలు చెయ్య టానికి వీల్లేదు' అని ప్రతిఘటించారు. భారత దేశ చరిత్ర చూస్తే రైతాంగ పోరాటాల చరిత్ర గానే మనకు కనిపిస్తుంది. పందొమ్మిదో శతాబ్దపు రెండో దశలోనే భారతదేశంలో అనేక రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి. మన ఆంధ్రదేశంలో 1803-04 ప్రాంతంలోనే అనేక రైతాంగ తిరుగుబాట్లు జరిగిన చరిత్ర వుంది. దేశ వ్యాపితంగా జరిగిన ఈ పోరాటాలను ఒక దగ్గర చేర్చే ప్రయత్నం కాకుండా జాతీయోద్యమానికి, తిరుగుబాట్లకు కాంగ్రెస్సే నాయకత్వం వహించిందనే పేరుతో గాంధీనే నాయకుడని, అహింసా యుత పద్ధతుల్లోనే ఈ స్వాతంత్ర్యం తెచ్చామని చెప్పుకుంటున్నారు. కానీ వాస్తవ చరిత్ర చూస్తే బ్రిటీష్ వలసవాద వ్యతిరేక రైతాంగ పోరాటాల్లో ఎన్నో వేలమంది, లక్షలమంది చంపివేయబడ్డారు, కాల్చివేయబడ్డారు.

మరి 'అధికార మార్పిడి' జరిగిన తర్వాత భారత రైతాంగానికి ఏం ఒరిగిం దండీ? రైతాంగానికి ఏమైనా భూమిని పంచారా? ఎక్కడా భూమిని పంచ లేదు. చట్టాలు చేశారు. ప్రతి చట్టం వెనుక కొన్ని భీకరమైనటువంటి పోరాటాలున్నాయి. భూసంస్కరణలు ఎప్పుడు చేశారండీ? ఆనాడు మహత్తర తెలంగాణా పోరాటం జరిగిన తర్వాత ఆ పోరాటాన్ని నిర్వీర్యం చెయ్యటానికి, ప్రజల్ని పక్కదారి పట్టించటానికి ఈ భూసంస్కరణల చట్టాన్ని చేశారు. ఎట్టకేలకు 1973లో ఆ చట్టాన్ని తెచ్చారు. కాంగ్రెస్ పాలకులకు వ్యతిరేకంగా గిరిజన ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాటాలు సాగించారు. మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం తదితర అనేక గిరిజన రైతాంగ తిరుగుబాట్ల ఫలితంగా పాలకులు 1/70 చట్టాన్ని చేశారు. ప్రతి ప్రజానుకూల చట్టం చేయటం వెనుక భీకరమైన రైతాంగ, గిరిజన, ప్రజా పోరాటాలుంటున్నాయనే విషయం స్పష్టమౌ తున్నది. ఈ పోరాటాలను నీరుగార్చటం కోసమే ఈ చట్టాలను ముందుకు తెస్తున్నారు తప్పితే, వాస్తవానికి వీటిని అమలు చేయ టానికి కాదు. చట్టాలలో వుండే అనేకానేక

లొసుగులను పాలకులు తమకనుకూలంగా ఉపయోగించుకుంటున్నారు. కానీ, ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏనాడూ అమలు చేయలేదు. భూసంస్కరణల చట్టం చేశారు. మిగులు భూములు లేవన్నారు, తగ్గిపోయా యన్నారు, పంచామన్నారు.

మరోవైపున రైతాంగ సమస్యల పరిష్కారం పేరిట ఈ ప్రభుత్వాలే అనేక కమీషన్లు వేశాయి-ప్రతీ కమీషన్ నివేదిక లోనూ, మిగులు భూములున్నాయని, వీటిని భూమిలేని నిరుపేద రైతాంగానికి పంచాలి అని చెప్తూ వస్తున్నారు. వై.యస్. ప్రభుత్వ హయాంలోనూ కోనేరు రంగారావు కమీషన్‌ను నియమించారు. భూసంస్కరణల చట్టం సరిగా అమలు కాలేదని ఈ నివేదిక పేర్కొంది. 1/70 చట్టం సక్రమంగా అమలు కాలేదని, 9/77 చట్ట సవరణ చేసిన తర్వాత అసైన్డ్ భూములు పేదల చేతుల్లో నుండి జారిపోతున్నాయని, కనుక ఈ చట్ట సవరణ రద్దు చేయాలనే దానితో పాటుగా 104 సిఫార్సులను ఈ కమీషన్ చేసింది. అందులో 16 అంశాలను మినహా మిగిలిన అంశాల న్నింటినీ అమలు చేస్తామని ఆనాటి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ 16 అంశాలు ఏమిటంటే, ఏజన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఇవ్వవలసిన కొన్ని రాయితీలు, మైదాన ప్రాంతాల్లో పేదవానికి ఇవ్వవలసిన బంజరు భూములకు సంబంధించినవి, ఎసైన్డ్ భూములను పేదలకు కేటాయించాలనే చట్టాలను అమలు చేయటం వంటివి-ఈ ప్రక్కన పెట్టిన సిఫార్సులలో వున్నాయి. మిగతా సిఫార్సులనైనా ఆమోదించారు తప్పితే అమలు చేయలేదు. అవీ పక్కకు పెట్టారు. ఈ కమీషన్‌కు నాయకత్వం వహించిన కోనేరు రంగారావు ఆనాటి ప్రభుత్వంలో ఒక మంత్రి. అయినప్పటికీ ఆయన నివేదికలో, అసైన్డ్ భూములన్నీ ప్రభుత్వం గుంజివేసు కొన్నదని చెప్పక తప్పలేదు. పేదల నుండి ఎసైన్డ్ భూమి ఎవరికి చేరిందో వారి నుండి రెట్టింపు విలువను వసూలు చేయవలసిందిగా సిఫార్సు చేసింది. కనుక కమీషన్ వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే. సంస్కరణలు చేయాలని చెప్పిందీ కాంగ్రెస్ మంత్రిగారే! కానీ, మరలా వాటన్నిటినీ పక్కకు పెట్టేదీ వాళ్ళే.

మరోవైపున మధ్యతరగతి, దిగువ తరగతి రైతులు గిట్టుబాటు ధర లేక ఆత్మ హత్యలు చేసుకుంటున్నారు. వెనుకబడిన ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వెళ్తున్న రైలు బండ్లన్నీ ఖాళీ లేకుండా వలస కూలీలతో నిండిపోతున్నాయి. రోజూ వంద లాదిమంది కూలీపనుల కోసం పొట్ట చేత పట్టుకొని మద్రాసో, కర్ణాటకో, హైదరాబాదో వెళ్ళి పోతున్నారు. గ్రామాల్లో కనీస సౌకర్యా లైన విద్యుత్ లేదు. తాగునీరు లేదు. విద్యా, వైద్య సౌకర్యాలు లేవు. భూమి లేదు, వ్యవసాయరంగం, ప్రజా జీవనం ఈ స్థితిలో ఉండటానికి కారకులు ఎవరు? కోట్లాది మంది ప్రజలు మన దేశంలో ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ రంగాన్నే అతలాకుతలం చేసి చిన్న, సన్న కారు రైతుల వద్దనున్న భూములను కూడా లాక్కొని నిరుపేదలుగా, కూలీలుగా మార్చివేసి -తాము పెట్టబోయే ప్రత్యేక ఆర్థికమండళ్ళలో, ప్రత్యేక వ్యవసాయ మండళ్ళలో కారుచౌక కూలీలుగా వుండమని భారతదేశంలోని పాలకులంతా నిర్దేశిస్తున్నారు.

2006లో కళింగనగర్‌లో ఏం జరిగింది? భారతదేశంలోనే బడా పెట్టుబడి దారుడైన 'టాటా'కు అక్కడి భూమిని అప్ప జెప్పేందుకు పాలకులు పూనుకున్నారు. అక్కడి గిరిజనులు నిరాయుధంగా, ప్రశాంతంగా తమకు నష్టపరిహారం ఇచ్చి భూములు తీసుకోవలసినదిగా మాత్రమే అన్నారు. అప్పుడు మాత్రమే తమ భూముల్లో టాటా కంపెనీని నిర్మాణ పనులు చేసుకోనిస్తా మన్నారు. దీనినే సహించలేక కాల్పులు జరిపి 12మంది గిరిజనులను ఊచకోత కోశారు. 2007లో సింగూరు, నందిగ్రామ్‌లలో ఏం జరిగింది? నందిగ్రాం, సింగూర్‌లలో వామ పక్ష పార్టీలనబడేవి అధికారంలో ఉన్నాయి. వాళ్ళేం చేశారు? వాళ్ళు ఇంకా తీవ్రంగా 'భూమిని మేం బడా కంపెనీలకివ్వాలను కుంటున్నాం. భూమిని వదల కుండా మీరు ఇంకా పోరాటం కూడా చేస్తారా అని అనేక మందిని చంపి, ప్రక్కనే వున్న నదిలో విసిరి పారేశారు. ఉత్తరప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్ లలో పరిస్థితి ఏమిటనేది చూస్తే రైతాంగానికి ఏ విధమైన చిన్న సహాయం కూడా ఈ పాలకులు-బి.జె.పి, కాంగ్రెస్, బి.జె.డి- ఎవరైనా కానీ రైతాంగానికి అనుకూలమైన విధానాలను అనుసరించటం లేదనేది స్పష్ట మైంది. 100 కోట్ల మందికి పైగా గల జనాభాకంతటికీ ఆహారాన్ని సమ కూర్చే రైతు రంగాన్ని అత్యంత ప్రాధాన్యత కల రంగంగా తీసుకొని అభివృద్ధి చెందే చర్యలు తీసుకో వలసిందిపోయి, ఈ రంగాన్ని కునారిల్ల చేస్తున్నారు. విత్తనం మన చేతుల్లో లేదు, ఎరువులు మన చేతుల్లో లేవు, పురుగు మందులు మన చేతుల్లో లేవు, మన దేశంలో ప్రవహించే నదులు మన చేతుల్లో లేవు, ఏం చేయాలి? ఇవన్నీ ఏదో తెలిసో, తెలీకో జరుగుతున్నవి కాదు. వ్యవసాయ రంగానికి సంబంధించి విధ్వంసం చేయడ మనే సామ్రాజ్యవాదుల కుట్రపూరిత వ్యూహం ఇందులో ఇమిడి వుంది. ఉపాధి హామీ పథకం అంటూ, భూములు పంపిణీ అంటూ, అనేక ప్రజాకర్షక పథకాలు చెప్పుకుంటూ- చేతలన్నీ బహుళజాతి కంపెనీల ప్రయోజనా లను నెరవేర్చటమే తప్ప మరొకటి కాదు. 62 సంవత్సరాల స్వతంత్ర మనబడేదాని తర్వాత కూడా ప్రపంచంలో తిండి తినలేని పేదవారిలో నాలుగో వంతు మన దేశంలోనే ఉన్నారంటే ప్రభుత్వానికి అది సిగ్గుచేటైన విషయం! తిండే కాదు-విద్య లేకుండా చేస్తున్నారు. మన దేశంలోని దోపిడీ వర్గాలు ఒక కుట్రపూరిత పథకం ప్రకారమే మన దేశంలోని సంపదనంతా సామ్రాజ్య వాదులకు ధారాదత్తం చేయటం కోసం పూనుకుంటు న్నారు. ఈ దేశంలోని పాలక పార్టీలన్నీ కూడా ఈ దోపిడీ విధానాలను పకడ్బందీగా అమలు చేస్తున్నాయి. పేదలు బ్రతికి వుండాల్సింది కూడా పెద్ద పెద్ద కంపెనీల్లో పనులు చేయటం కోసం, కారుచౌకగా శ్రమను అమ్ముకోవటం కోసమే తప్ప మరొకందుకు కాదని చెప్తున్నారు.

రైతాంగానికి సంబంధించి-మిగులు భూమి ఏమిటి, పేదవాళ్ళ భూమి ఏమిటి? దున్నేవానికే భూమి ఇస్తారా, లేదా? ఏజన్సీలో ఉండే గిరిజనుల భూముల పరిస్థితి ఏమిటి?

ఎసైన్డ్ భూములు ఏమిటి? దేవాలయ భూములు ఏమిటి? శోత్రియం భూములు ఏమిటి? ఈ భూములన్నీ మీరు పేదవాళ్ళకు పంచుతారా, లేదా అంటూ అనేక ఉద్యమాలు ఆంధ్రదేశంలో జరుగుతూనే ఉన్నాయి. కానీ, ఈ నడుస్తున్న ఉద్యమాలన్నింటినీ కూడా 'మసిబూసి మారేడు కాయ'జేసి పాలకులు నిస్సిగ్గుగా ఒక్కొక్క చట్టాన్ని ప్రక్కకుబెట్టి, వందల, వేల ఎకరాల భూములను 'సెజ్'ల పేరిట కట్టబెడ్తున్నారు. కనుక, ఈ దశలో – ఈ భూమి మొత్తం ఏమైపోయింది? ఈ భూములను బడా కంపెనీలకు కట్టబెట్టేందుకు ఒప్పుకోం అని నినదిస్తూ మన సంఘాల వంటివి గ్రామీణ ప్రాంతాల్లో, ఏజన్సీ ప్రాంతాల్లో మరెటూ బెసకకుండా మా భూమి మాకిస్తారా లేదా? మీ కోనేరు రంగారావు సిఫార్సులలో భాగంగా చెప్పిన విధంగా భూముల సాగుదార్లకు అవసరమైన నీరు, విద్యుత్, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు–అన్నీ సబ్సిడీగా అందించాలని డిమాండ్ చేయాలి. కనుక చట్టాలే కాదు, ఏ కమీషన్ సిఫార్సులను కూడా పోరాటాలు లేకుండా పాలకులు ఏనాడూ అమలు చేయరనేది స్పష్టమౌతున్నది. భూమి సమస్య, విత్తన సమస్య, ఎరువుల ధరలు, మద్దతు ధరల సమస్యల విషయంలో కానీ ఏ చట్టాలూ అమలు కావు–ఇవన్నీ పాలకులకు, ఉన్న వారికి చుట్టాలే.

ఆంధ్ర–ఒరిస్సా సరిహద్దు ఉద్యమ ప్రాంతం నుండి షుమారు 4–5 వందల మంది ఈ మహాసభకు హాజరయ్యారు. వాళ్ళేమి అడుగుతున్నారు? 2/56 చట్టం ప్రకారం ఆదివాసీ భూములు ఆదివాసులకు దక్కాలని డిమాండ్ చేస్తున్నారు. సారా వద్దన్నందుకు, అధిక వడ్డీ దోపిడీ సాగ దన్నందుకు, ఫారెస్ట్ అధికారుల ఆగడాలను అడ్డుకున్నందుకు వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. పెత్తందారులు, వారి రౌడీ మూకలు మన సంఘాల్లో తిరిగే ఒక మహిళా కామ్రేడ్‌పై అత్యాచారం చేశారు. ఈ ఘోరానికి పాల్పడిన దోషులను పట్టుకోవటానికి ప్రభుత్వానికి, పోలీసులకు తీరిక లేదు. చట్టాలు చాలటం లేదు! ఇదంతా ఏదో అనుకోకుండా జరిగిందని అనుకోవాలా?! కాదు, ఈ రోజు అనకాపల్లి ప్రాంతంలో గ్రామీణ మహిళలను చూస్తూంటే పని కల్పిస్తామని తీసుకువెళ్ళి వ్యభిచారంలోకి దించుతున్న పరిస్థితిని మేం పరిశీలించాం.

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వాళ్ళపై, ఏజన్సీ ప్రాంతంలో నివసించే ఆదివాసీలపై దోపిడీ అనేక రూపాల్లో సాగుతున్నది. ఎరువులు, పురుగుమందులు ఎవరైతే రైతులకు అమ్ముతున్నారో వారు కోటీశ్వరులు అవుతుండగా, వాటిని కొనుగోలు చేస్తున్న రైతు బికారిగా మారిపోతున్నాడు. ఆది వాసీలకు అటవీ ఉత్పత్తులకు సంబంధించి గత 30–40 సంవత్సరాలుగా వారి నుండి చౌకగా కొనుగోళ్ళు చేస్తూ, వారి శ్రమను దోచుకుంటున్నారు.

కామ్రేడ్స్, ఈ పరిస్థితినంతటినీ ప్రక్కన బెట్టి మనమంతా చాలా అభివృద్ధి దిశగా పయనిస్తున్నాం అని చెప్పటం బూటకం, ప్రజల్ని దగా చేయటమే! వాస్తవ మైన అర్థంలో అభివృద్ధి అంటే 'దున్నే వానికే భూమి' కల్పించటం! వాళ్ళకు కావలసిన సదు పాయాల్ని కల్పిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా మూడుపూటలా తినగలిగే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది మినహా, ఈ దేశంలో 'అభివృద్ధి' అనేదేదో జరిగిపోతుందని ఎవ్వరు చెప్పినా దానిని నమ్మవలసిన అవసరం లేదు, తిరస్కరించాలి.

అయితే, వీటన్నింటికీ పరిష్కారం ఏమిటి? ఆత్మహత్యలు చేసుకుంటామా లేక గ్రామాలు వదిలేసి పారిపోతామా? వెళ్ళము– మనం పుట్టిన గడ్డ మీదే మనం నిలబడి మన భూముల కోసం, మన భూములను దురా క్రమిస్తున్న దోపిడీ దొంగలకు వ్యతిరేకంగా పోరాటం సాగించుదాం. 'మా భూములకు కావలసిన సాగునీరు అందిస్తారా లేదా? గిట్టుబాటు ధర కల్పిస్తారా, లేదా? మీరు కల్పించకుంటే మేమే మా సంఘాల ద్వారా, సంఘటిత శక్తి ద్వారా, పోరాటాల ద్వారా మేమే సాధించుకుంటాం' అని ప్రకటిద్దాం. ప్రజలందరికీ పోరాటం తప్ప మరో మార్గం లేదు. ఈ పోరాటం నడిపేందుకు కూడా స్పష్టమైన అవగాహన కల్గిన రైతుకూలీ సంఘాలు వుండాలి. ఈ సంఘాల ఆధ్వర్యంలో దోపిడీ సాగిస్తున్న వారికి వ్యతిరేకంగా ఎవరెవరిని కలుపుకోవాలి? అనేది స్పష్టపరచుకోవాలి. దీని చుట్టూ అనేక మంది మేధావులను, ప్రజాతంత్ర వాదులను సమీకరించుకోవాలి. రైతు ఏ విధంగా తిరుగు బాటు చేసి తన జీవితాన్ని చక్కదిద్దు కుంటాడో, ఆ వీరోచిత పోరాట చరిత్ర భారత ప్రజల ముందుంది. అదే తెలంగాణా పోరాటం, నక్సల్బరీ పోరాటం, శ్రీకాకుళ పోరాటం! ఆ పోరాటాలకు సంబంధించిన వారసత్వాలను తీసుకొని దున్నే వానికే భూమి నినాదంపై మనం రైతు కూలీసంఘంగా ఉద్యమిస్తూ గ్రామ గ్రామానా, కొండకోన ల్లోనూ ఎంతో నిబద్ధతతో, చైతన్యంతో, నిర్మాణ దృష్టితో పనిచేయవలసిన అవసరం వుంది. దాన్ని గుర్తింపజేసుకొని మరింత ముందుకు సాగటం కోసమే ఈ మహా సభలను మనం నిర్వహించుకుంటున్నాం. హాజరైన ప్రతినిధులు, ఒక్కొక్కరూ ఒక్కో గ్రామంలో ప్రజలకు నాయకత్వం వహించి ఈ దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం సాగించేందుకు పూనుకోవాలి, కామ్రేడ్స్ అంతా ఈ ప్రారంభ సభ ద్వారా ఆ ఉత్తేజం, ఆ చైతన్యం నింపుకోవాలని ఆశిస్తున్నాను.

ఈ మహాసభల్లో మనం కొన్ని ముఖ్య మైన నిర్ణయాలు తీసుకొని ముందు కెళ్ళేందుకే మనం పోరాటాల గడ్డ అయిన ఈ ప్రకాశం జిల్లాలో మన రాష్ట్ర మహా సభలను జరుపుకుంటున్నాం. ఒకనాడు గుంటూరు జిల్లాలోని, నెల్లూరు జిల్లాలోని, కర్నూలు జిల్లాలోని భాగాలతో ఏర్పడిన ఈ జిల్లాలో–తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని అమరులైనటువంటి వాళ్ళున్నారు. ప్రధాన వాణిజ్య పంటలైన పొగాకుకు గిట్టుబాటు ధరల కోసం, పొగాకు బోర్డు ఏర్పాటు కోసం పోరాడి అమరులైన చరిత్ర ఈ ప్రాంతానికి వుంది. ఈ పోరాటాల పురిటి గడ్డపైన మహాసభలు జరుపుకుంటున్నా మంటే మనకు మరెంతో బాధ్యత వుంది. ఈ ఎండలు ఎంతో తీవ్రంగా వున్నా, ఈ ఎండల తీవ్రత కంటే రైతు, గిరిజనుడి ఆకలి మంట తీవ్రత మరింత ఎక్కువగా వుందనే విషయం గమనంలో వున్నపుడు మరింత శ్రద్ధగా, బాధ్యతతో ఈ మహాసభల్లో పాల్గొంటారని ఆశిస్తున్నాను.

ప్రారంభోపన్యాసం

# 'మానవ వికాసానికి మూడు గొప్ప అవసరాలైన వ్యవసాయం, విద్య, వైద్యాలను ధ్వంసం చేస్తున్న ప్రభుత్వాల విధానాలు'



సంఘటితమైన పోరాటశక్తిని నిరూపించుకోవడానికే మన మంతా ఇక్కడ సమావేశ మయ్యాం. సంఘటితంగా వాస్తవాలు గ్రహించుకొని, పోరాడితే కొన్ని లక్షల తుపాకీలు కూడా ప్రజలను శాసించలేవని చరిత్ర నేర్పింది. భవిష్యత్తులో విప్లవ నిర్మాతలు స్త్రీలే. మగవాళ్ళను తక్కువ చేయటం కాదు. వర్తమాన శతాబ్దం వనితలదే! వనితలు విప్లవ పథ మార్గదర్శకులుగా, నిర్దేశకులుగా ఉండ గలుగుతా రనే విశ్వాసం మాకు చాలా సందర్భాలలో కలిగింది.


**శ్రీ సింగమనేని నారాయణ,**
ప్రముఖ కథా రచయిత


మీ అందరికీ నా ఎర్రెర్రని నమస్కారాలు. ఈ కలయిక ఎంత శక్తి వంత మైనదో నిరూపించుకోవటానికి ఈ సభ. కూలీనాలీ జనం ఒక్కొక్కరూ ఒక్కో అగ్ని కణమని నిరూపించుకోవడానికి ఈ సభ. శ్రమైక జీవన సంఘటిత పోరాటం ముందు ఏ శక్తీ ఆగదని చెప్పుకోవడానికి ఈ సభ. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని చాటి చెప్పుకోవటానికి ఈ సభ. మహాకవి శ్రీశ్రీ– ఎండకాలం మండినప్పుడు, గబ్బిలం వలె కాగిపోయే వాళ్ళుగా, వానకాలం ముసిరి రాగా నిలువు నిలువునా నీరు కారే వాళ్ళుగా, శీతకాలం కోతబెట్టగా, కొరడుకట్టీ, ఆకలేసి కేకలేసే వాళ్ళుగా మీ పట్ల నిలబడి, మీ పట్ల తన గాఢతను ప్రకటిస్తూ మీరొక్కరూ నిల్చిపోతే–చంద్రగాడ్పులు, వానమబ్బులు, మంచుసోనలు భూమి మీదా భగ్నమౌతా యన్నాడు. నింగి నుండీ తొంగిచూసే రంగు రంగుల చుక్కలన్నీ రాలి నెత్తురు కక్కుకుంటూ పేలిపోతాయన్నాడు. పగళ్ళన్నీ పగిలిపోయీ, నిశీధాలూ విశీర్ణిల్లీ మహాప్రళయం జగం నిండా ప్రగల్భిస్తుంది అన్నాడు శ్రీశ్రీ మీ గురించి. ఏనాటికైనా ఈ రాజ్యం మీరేలండి– మీ రాజ్యం మీరేలుకోండని ఆహ్వానించాడు. మీకు నా ఆహ్వానమన్నాడు–మీకు నా రెడ్ శాల్యూట్స్ అన్నాడు. దానిని నిజమని నిరూపించుకునే దానికి, ఒక గొప్ప కలయికను చాటి చెప్పుకోవటానికి మనమంతా ఈ సమావేశంలో పాల్గొంటూ వున్నాం.

భారతదేశం మొత్తం మీద వ్యవసాయ రంగం ఎంత సంక్షోభంలో వున్నదో, సాంకేతికంగా చెప్పటానికి వ్యవసాయరంగ నిపుణులు ఇక్కడ వున్నారు. వ్యవసాయాన్ని ఒకప్పుడు ఎంతో ఇష్టంగా, గౌరవంగా, ప్రేమగా, ఆదర్శంగా, ప్రేమిస్తూ వచ్చిన వాళ్ళందరూ చాలా ఆశ్చర్యకంగా ఈ రోజు పారిపోతూ వున్నారు. నిన్న గాక మొన్న వెలువడిన ఒక నివేదికలో ఈ నాలుగైదు సంవత్సరాల కాలంలో గ్రామీణ జనాభా కంటే పట్టణ జనాభా పెరిగిపోయింది అని గణాంక వివరాలతో ప్రచురించారు. మొన్న మొన్నటి వరకు పట్టణ జనాభా కంటే గ్రామీణ జనాభానే 14–15 శాతం ఎక్కువగా వుండేది. పట్టణాల, నగరాల వేర్లన్నీ పల్లెల్లో వుండేవి. ఇప్పుడు పల్లెల నుండీ పట్టణాల్లోకీ, నగరాల్లోకీ పారిపోతున్న వాళ్ళెవరు? పల్లెల నుంచి – వ్యవసాయంలో అలసిపోయిన వాళ్ళు! వ్యవసాయం గిట్టుబాటు గాక, స్వచ్ఛందంగా వదులుకొంటున్న వాళ్ళు! ఇన్నాళ్ళుగా వ్యవసాయ రంగంలో వుండి, తమ సర్వశక్తులూ వొడ్డి, పంట పండించటంలో సహాయపడుతున్న అనేకమైన దళిత కుటుంబాల వాళ్ళు–ఈనాడు పట్టణాల వైపు పరుగెత్తుతూ వున్నారు. అంటే–పరిస్థితి ఎంత దాకా వచ్చిందీ అంటే, ఏ మెట్ట ప్రాంతం వాళ్ళ గురించి మాట్లాడినప్పటికీ, రైతుల చేతుల్లో ఇప్పుడు కేవలం ఉత్తి భూమి మాత్రమే వుంది. ఎరువులు వాళ్ళ చేతుల్లో లేవు, మందులు వాళ్ళ చేతుల్లో లేవు, విత్తనాలు వాళ్ళ చేతుల్లో లేవు. ఈ పదేళ్ళ కాలంలో ఎవరో వీటన్నింటినీ కొల్లగొట్టి, దొంగిలించుకొని వెళ్ళిపోయారు. తనతో నిమత్తం లేకుండా, తన ప్రమేయం లేకుండా రైతు తన సర్వస్వాన్ని ఈ కాలంలో కోల్పోయిన ఒక విషాదకర పరిస్థితిలో మనమంతావున్నాం.

'వాని రెక్కలు కష్టంబు లేనినాడు/ సస్యరమ పండి పులకింప సంశయించు' అని మహాకవి జాషువా అంటాడు. ఎవడు వాడు?

దళితుల రెక్కల కష్టము, ప్రతిఫలాన్ని పొంద లేక పల్లెల నుండి పట్టణాలకు విస్తారంగా వలసలు వెళ్ళిపోయిన కారణంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిన వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి. ఇప్పుడు పరిస్థితి ఎంత దాకా వచ్చిందీ అంటే, రైతులు–వ్యవసాయ కూలీలను చూసి అసూయ పడేదంకా రైతును –ప్రభుత్వాలు తెచ్చి పెట్టాయి. 'వాళ్ళకేమీ?, ప్రొద్దున్న 7 గంటల నుండి 11 గంటల వరకు–3,4 గంటలు పని చేస్తారు–నూరు, నూట ఇరవై సంపాదించుకొని వెళ్తారు. వాళ్ళ పనే హాయిగా వుంది. వాళ్ళకు అప్పులు సప్పులు లేవు', అని రైతుకూలీలను చూసి రైతులు అసూయపడే విధంగా రైతులకు–రైతు కూలీలకు మధ్య సయోధ్య చెడగొట్టిందెవరు? ప్రభుత్వ వ్యవసాయ ఆర్థిక విధానాలు! ఉపాధి హామీ పథకాన్ని ఒకదాన్ని ప్రవేశపెట్టి, దాన్ని ఆచరణలో సరిగ్గా అమలు చేయడంలో వచ్చిన దుష్పరిణామాల వల్ల, అది నిర్వీర్యమై పోవడం వల్ల, అవినీతిలో కూరుకుపోవటం వల్ల, దొరికిన వాళ్ళందరూ ఆ హామీ పథకపు ధనాన్ని తినివేయటం కారణంగా, రైతు, రైతుకూలీలను చూసి అసూయపడేట్టుగానూ, రైతుకూలీలు, రైతును చూసి జాలిపడే పరిస్థితికి నెట్టివేయబడిన వ్యవసాయ వర్తమాన సంక్షోభం! చాలా వరకు మెట్ట భూముల్లో వ్యవసాయాధారితంగా వున్న రాయలసీమ, తెలంగాణా వంటి అనేక ప్రాంతాల్లో, ఈ పది సం॥లలో ఎన్ని వేల ఆత్మహత్యలు జరిగినాయో ఆశ్చర్యమౌతుంది. 2000 సం॥ పూర్వం, అనంతపురం జిల్లాలో ఒక్క రైతుకూడా ఈ కారణంగా ఆత్మహత్య చేసుకోలేదు. ఈ 10సం॥ల కాలంలో 700 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవటం– స్వచ్ఛందంగా చేసుకున్నారా? రుణభారం పెరిగిపోవడం, అప్పులు తీర్చలేకపోవడం, వ్యవసాయానికి పెట్టుబడులు లేకపోవటం, పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపో వటం, సాగునీరు ఏ 10–15 శాతం కూడా పేదరైతాంగానికి లభింపకపోవటం దీనికి కారణం! ఒక్క అనంతపురంలోనే 26 లక్షల ఎకరాల వ్యవసాయ సాగుభూములు వుంటే అందులో లక్షా 20 వేలకు మాత్రమే సాగునీటి సౌకర్యం వుంది. అంటే 8 శాతం! 60 ఏళ్ళ స్వతంత్రంలో చాలా ప్రాంతాల్లో జలయజ్ఞం ద్వారా 20–60 శాతం దాకా మెట్ట ప్రాంతాల్లో సాగునీరు అందిస్తున్నామని చెపుతున్నది అనుమానాస్పదంగా వున్నది, ఈనాడు ప్రశ్నార్థకమైంది. నీళ్ళు అందుతున్నాయా? కాలువలు తవ్వుతున్న వాళ్ళకు నిధులు అందుతున్నాయా?

మెట్ట ప్రాంత వ్యవసాయం ఈ విధంగా వుంటే సాగునీరు పుష్కలంగా ఉన్న ప్రాంతాలలో రైతులు సుఖంగా జీవిస్తూ వున్నారా? ప్రభుత్వం ఇచ్చిన గణాంక వివరాలను బట్టే 80–85 శాతం సాగునీరు పుష్కలంగా లభించే ప్రాంతాలలో భూమి దున్నుతున్న వాళ్ళు భూయజమానులు కాదు. ఎవరు? కౌలు రైతులు. 10 ఎకరాల–మాగాణి భూమి వున్న ఏ భూయజమాని కూడా ఆ పది ఎకరాలను ఒకే ఒక్క కౌలు రైతుకివ్వటం లేదు. అర్ధ ఎకరా ఒకరికి, ఒకటిన్నర ఎకరా ఒకరికి...... ఇలా కౌలు రైతులకి కౌలుకిచ్చి, కౌలురైతులు బతకలేని పరిస్థితులేర్పడి, పంటలు నష్టపోతే వచ్చే పరిహారాలు కానీ, ఇన్‌పుట్ సబ్సిడీలు కానీ, ఇన్సూరెన్స్‌లుగానీ భూమిని దున్నని, భూ యజమానులకు చెందుతూ వుండగా ఇన్నేళ్ళుగా కౌలు రైతుల హక్కులను గురించి మాట్లాడే వాడు లేడు. కౌలు రైతులకు నికరమైన చట్టాలు ఈ 62 ఏళ్ళ కాలంలో ఒక్కటి కూడా ఏర్పడలేదు. సాగుభూమి పుష్కలంగా వుండే ప్రాంతాలలో రైతులందరూ చాలా సుఖంగా జీవిస్తున్నారు, గొప్ప పంటలు తీస్తున్నారు అని అనుకోవచ్చు. కానీ అది వాస్తవం కాదు. 80 శాతం రైతులందరూ కౌలు రైతులే.

విజయవాడ–విశాఖపట్నం మార్గంలో ప్రయాణిస్తే– ఒక్కసారి పల్లెల్లోకి వెళ్ళి చూస్తే, కౌలు రైతులందరూ పుట్టగోచీలతో వుంటారు. కావళ్ళు మోస్తూ కనిపిస్తారు. మన మెట్ట ప్రాంతపు వ్యవసాయ కూలి, భూమిని సాగు చేసే వాడు, పదేండ్లకైనా ఓ పదెకరాలు సంపాదించుకోగలడేమో కానీ, సాగునీరున్న ప్రాంతాలలో భూమిని దున్నే ఎవ్వడూ కూడా వంద ఏళ్ళు భూమి దున్ననీ ఒక్క సెంటు భూమి సంపాదించుకోలేడు. ఈ ఏభై ఏళ్ళ రికార్డులను పరిశీలిస్తే, ఏ భూయజమాని నుండీ, ఏ భూమిని సాగుచేసే కౌలు రైతైనా కానీ భూమిని కొనుక్కున్న దాఖలాలున్నాయా? అక్కడ కూడా విపరీతమైన వ్యవసాయ సంక్షోభం! అక్కడ కూడా భూమిని దున్నేవాడు అలసి పోతూ వున్నాడు. వాళ్ళకు ఇన్సూరెన్స్ కానీ, ఇన్–పుట్ సబ్సిడీలు కానీ, ఇతరత్రా రాయితీలుకానీ ఇచ్చేందుకు ఇంతవరకూ ఒక చట్టం రూపొందలేదు. మరి, మెట్ట ప్రాంతపు రైతులు ఆత్మహత్యల దాకా ఈ పది సంవత్సరాల కాలంలో పరిణామం చెందితే సాగునీరు పుష్కలంగా అందే ప్రాంతాల్లో 80 శాతం కౌలు రైతుల పరిస్థితీ ఇలాగే వుంటే ఎవడయ్యా బతుకుతున్నాడు? ఎవడయ్యా తింటున్నాడు? ఎవడు ఈ దేశ సంపదను అనుభవిస్తున్నాడు? చాలా ఆశ్చర్యంగా వుంది. ఒక ఊరు వాడు ఇంకో వూరి వాడిని గతంలో కలిసినప్పుడు 'ఏం పంటలు పెట్టారు? వానలే మైనా వచ్చినాయా? పంటకు రేటు ఎట్లుండాది?' ఈ విషయాలు మాట్లాడుకొనే వాళ్ళు. ఇప్పుడైతే ఏం మాట్లాడుకుంటు న్నారు? మీ వూర్లో భూములకు రేట్లు ఎట్లుండాయి అని మాట్లాడుకుంటున్నారు. ఎకరా భూమి 5 లక్షలా, పది లక్షలా, 20 లక్షలా అని మాట్లాడుతున్నారు. గద్ద లాగా భూమిని తన్నుకొని పోయేదానికి రాజకీయ మాఫియా ఒక ప్రత్యేక వర్గం ఈ 7–8 సంవత్సరాల్లో తయారైంది. పంట పండే భూములను, రకరకాల సాంకేతికమైన పేర్లు పెట్టి దోచుకోవటానికి రాజకీయాలు ఈ రోజున నడుస్తు న్నాయనే వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. భూమి చివరకి ఎవరికి పోతుందో, భూముల్లో నుండి ఎవరు వెళ్ళగొట్ట బడతారో, భూముల్లో పండే ఆహారధాన్యాల మాటేమిటి? న్యాయంగా మహిళలు, ఇల్లు పచ్చగా వుండాలని, ఊరు పచ్చగా వుండాలని, ఆహారధాన్యాలతో తమ ఇల్లు నిండాలనీ కోరుకుంటారు. నిజమైన ఆకాంక్ష వాళ్ళది! ప్రజా జీవితపు ఆకాంక్ష మహిళలలో వ్యక్త మైనట్లుగా మగవాళ్ళలో వ్యక్తం కావటం

లేదు–13 రూ॥ బియ్యాన్ని ఎందుకు 30రూ॥లకు అమ్ముతున్నారు? ఇబ్బడి ముబ్బడిగా వ్యాపార పంటలను బల వంతంగా రుద్ది, డ్రిప్ ఇరిగేషన్ల పేరుతో 75 శాతం రాయితీలను పళ్ళతోటలకు ప్రకటించి, వాళ్ళను ఆహార ధాన్యాలను పండించకుండా చేసి, పండించిన పండ్లకు గిట్టుబాటు ధర లేకుండా జేసి, అటు–ఆహార సేద్యపు రైతు గాకుండానూ, ఇటు పండ్ల తోటల రైతు గాకుండానూ పని గట్టుకొని పేద రైతుల్ని, మధ్యతరగతి రైతుల్ని, రైతుకూలీల్ని ప్రభుత్వం సర్వనాశనం చేస్తూ వుంది.

అందుకే ఈ రోజు పల్లెల నుండి పట్టణాలకు పరుగులు తీస్తూ వున్నారు. మొన్న మొన్నటి వరకూ రెండున్నర లక్షలు వున్న అనంతపురం పట్టణ జనాభా 4 లక్షలకు చేరుకొంది. ఏ కాలనీలకు వెళ్ళి చూసినా, 'ఎవరయ్యా ఎవరు మీరు?' అని అడిగితే 'మాది ఫలానా వూరు, ఫలానా పని కోసం వచ్చాం' అక్కడ పనుల్లేవు. భూముల్లో పంట పెట్టే దానికి లేదు. నీళ్ళు లేవు. వర్షాలు లేవు, మాట్లాడిచ్చే వాడు లేడు–ఉపాధి హామీ పథకం 365 రోజులూ వుండదు కదా! ప్రభుత్వ ఆర్థిక విధానాలకంటే రాజకీయ నాయకుల కుటిల స్వార్థ విధానాలు ప్రవేశించిన కారణంగా ఈ రోజు వ్యవసాయ ఆర్థిక విధానాలు మాఫియా రంగు పూసుకున్నాయి. ఒక యువనేత ఈ రోజు పోరాడుతూ వున్నాడు. తాను ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని! ఎందుకు? కొన్ని లక్షల కోట్ల వ్యవసాయ భూముల్ని హక్కు భుక్తం చేసుకోవటానికి, అనుభవించటానికి, తన అనుచరగణానికి పంచడానికి! పొలిటికల్ మాఫియాను తన చుట్టూ తిప్పుకోవడానికి, గ్రామాలను ధ్వంసం చేయడానికి, మైళ్ళకు మైళ్ళు భూములను స్వాధీనం చేసుకోవడానికి! ఇంత ఆరాటమా? ఇంత అప్పనంగా పదవులు వస్తాయా? ఇంత వేగంగా ఎందుకు కోరుకుంటున్నాడు. ఇంత వేగంగా దోచుకోవాలని రాజకీయ ఆర్థిక శక్తులు ఎందుకు తలపడుతూ వున్నాయి? వీటన్నిటికీ గ్రహపాటుగా జరుగుతున్నది అంతిమంగా రైతు–రైతుకూలీ యొక్క నాశనం!

మేము 3 సంవత్సరాల క్రితం 20 మందిమి రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులూ దర్శించటానికి వెళ్ళినాం. చివరకు పోలవరం వెళ్ళినాం. పోలవరం కొండ శిఖరాగ్రభాగాన మేము దృశ్యాలను తిలకించినాం. అక్కడ ఇంజినీర్లు చెప్పిన మాటలేమంటే 'ఇది 10 వేల కోట్ల అంచనా–కానీ 30వేల కోట్లకు తక్కువ కాదు' అని! ఇప్పటికే ఆ ప్రాంతాలలో 70–80 శాతం భూమి సాగుభూమే! పోలవరం ఆలస్య మౌతుందని, పోలవరానికి దిగువన 7,8 కిలోమీటర్లలో తాడిపూడి–పుష్కరమనే ప్రాంతాలలో రెండు లిఫ్ట్ ఇరిగేషన్లు పెట్టి, వాటి కోసం కాలువలు తవ్వి, నాలుగు లక్షల 20 వేల ఎకరాలకు సాగునీరు అందివ్వవచ్చు నంటున్నారు. మరి ఎందుకయ్యా అంత తొందర? అంటే పోలవరం ఆలస్యమౌ తుందని! కరువు ప్రాంతాలైన రాయలసీమ ప్రాంతాలలో ఒక చుక్కనీరు–వరదనీరు–మిగులు నీరు–ప్రతి సంవత్సరం కొన్ని వేల టి.యం.సిలు వృధాగా సముద్రంలో కలిసిపోయే నీరు– గాలేరు–నగరికో, హంద్రీ–నీవాకో, పోతిరెడ్డిపాడుకో ఈ జలాలను తరలిస్తే దానిమీద ఎందుకు రచ్చ?! 70–80 శాతం సాగునీరందే ప్రాంతాల్లో క్షణాల మీద లిఫ్ట్ ఇరిగేషన్లు పెట్టి, వ్యవసాయ భూములకు సాగునీరందించటంలో ఎంత శ్రద్ధ? ఇంతాజేస్తే ఏడు లక్షల ఎకరాలకు! అక్కడికి పోయినప్పుడు ఆదివాసీలను చూసి కుప్పకూలి పోయినాం మేము. ఆదివాసీలకు ఏ హక్కూ లేదక్కడ! వాళ్ళకు, వాళ్ళదైన భూమి లేదు, వాళ్ళవైన నికర నివాసాలు లేవు. మొట్టమొదట వెళ్ళగొట్టేది ఆదివాసులనే. భూములకు కొన్ని వేల కోట్ల రూపాయల ప్రతి ఫలం పొందేది–రాజాలు, జమీందారులు! ఎవరి ప్రయోజనాల కోసం పోలవరం?! 'పోలవరం పూర్తయితే శ్రీశైలంలో 70–80 టి.యం.సిల నీళ్ళు మిగులుతాయి, సీమవాసులంతా ఆ జలాలలో తనివితీరా స్నానాలు చేయవచ్చు' అని చెప్పేవాళ్ళు కూడా మాకున్నారు. ఇప్పుడే ప్రకటించమనండి–పోలవరం పూర్తయితే రాయలసీమ ప్రాంతాలకు శ్రీశైలం నుండి 100 టి.యం.సిల నికర జలాలు ఇస్తామని ఒక్కమాట అనమనండి–అప్పటికి కూడా మిగులు నీరే, వరద నీరే! ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనాలను రక్షించుకోవడానికి? ఎవర్ని కాపాడుకోవడానికి? ఇంత పెద్ద ఎత్తున వ్యూహాత్మకంగా తరలి వస్తూ వున్నదో, ఎవర్ని కబళించటానికి తరలివస్తున్నదో, జాగ్రత్తగా కాదు–అజాగ్రత్తగా చూసినా కూడా అర్థమౌతుంది. రెండేళ్ళ క్రిందట కాలినడకన కూడా తిరగలేని వాడు కార్ల మీద తిరుగుతూ, పెద్ద పెద్ద భవంతుల్లో నివశిస్తున్న వాళ్ళను మేం చూస్తూ వున్నాం. 10 రూపాయల కోసం పదిమంది చుట్టూ తిరిగిన వాళ్ళు, పెద్ద భవంతులు కట్టుకొని వందల కోట్లతో రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్న వాళ్ళని మేం చూస్తున్నాం. ఈ అరాచక వర్గగణం–అది ఏ రాజకీయ పార్టీ అయినా కావచ్చు–దీనిని పెంచి, పోషించడానికి అన్ని పాలక రాజకీయ పార్టీలూ, పార్టీల నాయకులూ, తమ శక్తి యుక్తులను, శ్రమను నిస్సిగ్గుగా ధారపోస్తూ వున్నాయి. అంతిమంగా నాశనం పేద రైతులు, రైతుకూలీలు!

ఒక వెనుకబడిన మెట్ట ప్రాంతాలకు వెళితే తెలుస్తుంది–మా అనంతపురం జిల్లాలో ఏ పల్లెకైనా వెళ్ళి చూడండి. మనుషులే కనబడరు–పశువులు ఎప్పుడో బోయినయి–ఏ రావి చెట్టు క్రిందో బిక్కచిక్కిన ప్రాణులు ఒకరో, ఇద్దరో కూర్చుని వుంటారు–పలకరించాలంటే భయం–ఊళ్ళోకి ఎవరైనా, బంధువులు వస్తారేమోనని తత్తరపాటు! భూమి వుండి, పుష్కలమైన భూమి వుండి–భూమి వున్న కారణంగా అప్పులైన వాళ్ళ జాబితాలో, నీకున్న అప్పునుబట్టి నీ భూమిని గురించి చెప్పవచ్చు. మెట్ట ప్రాంతాల్లో నీకు 10 ఎకరాల భూమి వుంటే 2 లక్షల అప్పు వుంటుంది. 50 ఎకరాల భూమి వుంటే 5–6 లక్షల అప్పు వుంటుంది. రైతులందరినీ రకరకాల పేర్లతో బ్యాంకుల చుట్టూ, ఎమ్మార్వోల చుట్టూ తిప్పడమే, తిప్పడమే పనిగా ఈనాడు ప్రణాళికలన్నీ రచించబడు తున్నాయి. ఒక ప్రొఫెసర్‌కు–ఒక కొడుకు–

ఒక బిడ్డ మాత్రమే వున్నారు-50 ఎకరాల భూమి వున్న ఆయన కొడుకు ఏమంటాడు? మా నాయన నాకు చానా ద్రోహం చేసినాడు సార్ (50 ఎకరాలు భూమి యిచ్చి) అంటున్నాడు. ఆ భూమి లేకుండా వుంటే నా జీతం డబ్బులు దానికి మినహాయించ కుండా వుంటే కనీసం 30, 40 లక్షలు మిగుల్చుకొని వుండేవాడిని కదా! అంటు న్నాడు. ఈ మాట వాస్తవమా కాదా? ఏ రైతునన్నా అడిగి చూడండి. గతంలో రైతు తనకో అప్పు ఉందని చెప్పుకోవటానికి సిగ్గుపడేవాడు. ఇప్పుడు నాకు అప్పు వుందని చెప్పుకోనవసరంలేదు. ఎందుకంటే రైతు లంతా అప్పుల్లోనే వున్నారు. అప్పు దాపరికం లేదిప్పుడు.

పరిస్థితి ఒక పార్శ్వంలో ఇట్లుంటే, మరో పార్శ్వంలో మధ్యతరగతి, పేద రైతులను, రైతుకూలీలను నాశనం చేయటానికి రెండు పెద్ద భూతాలు మన వెంటబడి తరుముతూ వున్నాయి. ఒకటి కార్పోరేట్ విద్య, రెండు కార్పోరేట్ వైద్యం. ఇంత పేదరికపు స్థితిలో వుండి కూడా తమ పిల్లల్ని ఇంగ్లీషు మీడియం స్కూళ్ళలో చదివిస్తున్నారన్నమాట వాస్తవామా కాదా? వేలకు వేలు ధారపోసి చదువే చెప్పని పాఠశాలల్లోకి చేర్పిస్తున్నది వాస్తవమా కదా! ఏ విధానాల వలన తమ రక్త మాంసాలను ధారపోస్తున్నారు? డబ్బున్నవాడు ఏ బడిపాట్లు పడినా చింత లేదు-కానీ అంతా పేదలే-5వ తరగతి పిల్లవాడి నుండి ఒక లక్ష రూపాయలు కట్టించుకొని పదవ తరగతి పూర్తయినాక ఆ లక్ష తిరిగి ఇచ్చేస్తామని కార్పోరేట్ స్కూల్స్ ప్రలోభపెడ్తున్నాయి. ప్రభుత్వపు దుర్మార్గ విధానాల వలన 50వేల కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన ప్రభుత్వ పాఠశాల తరగతి గదులను తనకు తానుగా తగులబెట్టి రెక్కాడితే గానీ డొక్కాడని పేదలందరినీ కూడా కార్పోరేట్ స్కూళ్ళకు పరుగులు తీసేలా చేసింది వాస్తవమా కాదా?! ఎవరికి జబ్బొచ్చినా జబ్బొచ్చినందుకు ఎవ్వరూ భయపడటం లేదు. ఏ డాక్టరు దగ్గరకు వెళ్ళాలో అనేది భయం! దగ్గు, తుమ్ము, పడిశానికి కూడా వెయ్యి రూపాయలు ఖర్చు అవుతాయి. రెండుబిళ్ళలు మింగితే తగ్గిపోయే రోగాలకు కూడా వేలకు వేలు ధారపోసే విధంగా కార్పోరేట్ వైద్యాన్ని ప్రభుత్వాలు పనిగట్టుకొని ప్రోత్సహిస్తున్నాయి. ఏ ప్రభుత్వ ఆసుపత్రికి ఎవడూ పోవటం లేదు. ఏ ప్రభుత్వ పాఠశాలకూ ఎవరు ఎవర్నీ పంపటం లేదు. ప్రభుత్వ పాఠశాలకు పంపితే చదువు రాదని, ప్రభుత్వ వైద్యానికి పోతే వాడు చచ్చిపోతాడని, ఒక తెల్లని భయాన్ని ఈ 10-15 సం॥ల కాలంలో మన పాలకులు పనిగట్టుకొని ప్రోత్సహించి, ఇంకొక పదేళ్ళ తర్వాత ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాలలు లేకుండానే చేతులెత్తేసి ప్రజల మీద పడిదోచుకోవటానికి అడ్డొచ్చిన వాడికి కూడా అధికారాలను, లైసెన్సులను ఇవ్వ దానికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనివల్ల అంతిమంగా బాధపడ్తున్నది ఎవరంటే గ్రామీణ ప్రాంతంలోని పేద రైతులు, రైతు కూలీలు, పట్టణ ప్రాంతాలకు వలస వచ్చిన అసంఖ్యాక కూలీలు అందరూ ప్రభుత్వ దుష్ట ఆర్థిక విధానాలకు బలై పోతున్నారు. ఇప్పుడున్న పరిస్థితి ఇలాగే కొనసాగితే పేదరికం కాదు గదా, పేదవాణ్ని లేకుండా నిర్మూలించే పరిస్థితి వస్తుంది. రైతులు చేసిన అప్పుల క్రింద మొన్నమొన్నటి వరకు వేలం వేసి, బిల్లులు కట్టలేదని చెప్పి సామాన్లను పట్టుకెళ్ళే పరిస్థితి కొనసాగింది. భయమనేది శరీరంలో ఇంకిపోయి, భయ మనేది జీవిత విధానంలో ఒక భాగమైపోయి, భయపడ కుండా బతకండి అని శాసించే స్థితికి వచ్చి చేరాం. దీనికంతా మూలం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేయటం! విద్యను, వైద్యాన్ని ధ్వంసం చేయటం, వ్యవసాయాన్ని ధ్వంసం చేయటం! మానవ వికాసానికి మూడు గొప్ప అవసరాలైన వ్యవసాయం, విద్య, వైద్యం అంతరించిపోయినాక మనుషులు ఏమౌతారు? సంఘటితమైన పోరాటశక్తిని నిరూపించుకోవడానికే మన మంతా ఇక్కడ సమావేశ మయ్యాం. సంఘటి తంగా వాస్తవాలు గ్రహించుకొని, పోరాడితే కొన్ని లక్షల తుపాకీలు కూడా ప్రజలను శాసించలేవని చరిత్ర నేర్పింది.

భవిష్యత్తులో విప్లవ నిర్మాతలు స్త్రీలే. మగవాళ్ళను తక్కువ చేయటం కాదు. వర్తమాన శతాబ్దం వనితలదే! వనితలు విప్లవ పథ మార్గదర్శకులుగా, నిర్దేశకులుగా ఉండ గలుగుతారనే విశ్వాసం మాకు చాలా సందర్భాలలో కలిగింది. రైతుకూలీ సంఘంలో కూడా మహిళల పాత్ర మరింత ఉన్నత పథములలోకి దూసుకొని పోతూ, మనకొస్తున్న సమస్యలను పరిష్కరించుకునే దిశగా, పోరాట రూపంలో పయనించడానికి, రైతుకూలీ సంఘాలు కృషి చేయాలని అందుకు బాసటగా విద్యావేత్తలు, మేధావులు, రచయితలు, కళాకారులు సహకరించాలని విన్నపం చేసుకుంటూ ఈ ప్రసంగాన్ని ముగిస్తూ, ప్రారంభ ఉపన్యాసం చేయడానికి అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను.

**కరువు అంటే నిత్యం కొద్ది కొద్దిగా రక్తం పీల్చే రక్తపింజరి**

**కరువు అంటే ఆత్మల్ని నడిరోడ్ల మీద వేలం పాటలో తెగనమ్ముకోవటం**

**కరువు అంటే నిత్యం ఆత్మ హననం కాదు**

**కరువులంటే అనునిత్యం ఆత్మహత్యించుకోవటం**

**ప్రకటించాల్సిందే/కరువు మీద యుద్ధం ప్రకటించాల్సిందే**

**కపట రాజకీయం మీద యుద్ధ ప్రకటించాల్సిందే**

జూపల్లి ప్రేమ్‌చంద్

'పదును' నుండి

ప్రసంగ వ్యాసం

# 'వ్యవసాయాన్ని అథమంగా-సేవలను ప్రథమంగా మార్చిన పాలకులు'



భారత ప్రభుత్వం అనుసరించిన పన్నుల విధానం, భూమిశిస్తు, నీటి తీరువా ఇలాంటి విధానాల తోటి రైతుని తప్పనిసరిగా తను ఉత్పత్తి చేసిన పంటలో నాలుగింట మూడు వంతులు అమ్మేసుకోవాల్సిన స్థితి కల్పించింది. ఆ పరిస్థితుల్లోకి నెట్టింది. ఆ విధంగా వ్యవసాయ పంటలకు అతి తక్కువ ధరలు చెల్లించి, ఆ సంపదనంతా కొల్లగొట్టి తీసుకెళ్ళి పట్టణాల్లో కేంద్రీకరింపజేయటం వల్ల రైతాంగం నానాటికీ నష్టపోయే స్థితికి తీసుకువచ్చింది.


**డా॥బి.డి.శర్మ**
భారత్ జన ఆందోళన్ చైర్మన్


నేను మొదటగా-ఇటీవల అమరులైన కానూసన్యాల్‌గారికి నా శ్రద్ధాంజలి తెలుపుతున్నాను. కొద్ది కాలం పాటు నేను ఆయనతో కలిసి వున్నాను. మంచి మిత్రులుగా ఉన్నాం. ఇవాళ ఆయనను కోల్పోవటం ఎంతో విచారించదగిన విషయం.

ఇవాళ గిరిజన ప్రాంతంలోనూ, ఇతర మైదాన వ్యవసాయ ప్రాంతాలలోనూ కీలకమైన 2,3 అంశాలను మీ ముందుంచుతాను. భారత ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి గురించి గావుకేకలు పెడ్తున్నది. ఆదివాసీ ప్రాంతాలను అభివృద్ధి చేస్తానంటున్నది. నేనడుగుతున్నాను, ఏ రకపు అభివృద్ధిని ఈ ప్రభుత్వం చేయబోతున్నదని? ఈ రోజున గిరిజన ప్రాంతాలు ఒక అశాంతికి లోనయ్యాయి అంటే రెండే సమస్యలు. 1. స్వయం పాలన కోసం, 2. అటవీ వనరులు ఆదివాసులకే చెందాలనే దాని కోసం.

బ్రిటీష్ వాళ్ళు ఈ దేశాన్ని జయించామని చెప్పుకుంటారు. కానీ మిగతా ప్రాంతమంతా వాళ్ళు ఒక సైన్యంతో పోరాడాల్సి వచ్చింది. ఆ సైన్యాల్లో గెలుపు ఓటముల మీద ఆధారపడి వాళ్ళు ఈ దేశం మీద ఆధిపత్యం పొందారు. కానీ, ఒకసారి గిరిజన ప్రాంతాల మీదకు రాగానే, వాళ్ళు సైన్యంతో కాదు-ప్రజలతో తలపడాల్సి వచ్చింది. అక్కడ చాలా అప్రతిష్టపాలైన ఓటమికి గురై వెనక్కు వెళ్ళారు. ఈ నిజాన్ని ఈ రోజుకీ విశ్వవిద్యాలయాల్లోగానీ, పాఠ్యగ్రంథాల్లో కానీ ఎవరూ బోధించటం లేదు.

బ్రిటీష్ ప్రభుత్వం గిరిజనుల వద్ద లెవీ వసూలు చేయటానికి, పీడించటానికి పూనుకుంది. అపుడు ఆదివాసులు ఒకటే అడిగారు. ఈ భూమి భగవంతుడి సృష్టి! మేము దేవుని బిడ్డలం. మధ్యలో ఈ ప్రభుత్వం ఎక్కడ నుండి వచ్చింది? అని! కనుక ఈ ప్రాంతాలను ఆక్రమించుకోవటానికి ప్రయత్నించిన బ్రిటీష్ వాళ్ళు అక్కడ ఓటమి పాలై వెనక్కు వెళ్ళారు. మరో రూపంలో ప్రయత్నించారు. కొన్ని చట్టాలు చేశారు. 'మేము మిమ్మల్ని వెనక్కు నెట్టేస్తే మీరెవరు? మమ్మల్ని శాసించే చట్టాలు చేయటానికి' అని ప్రశ్నించారు ఆదివాసులు!

ఆ తర్వాత స్వతంత్రం వచ్చింది. మనం ఒక రాజ్యాంగ చట్టాన్ని రచించుకున్నాం. ఆ రాజ్యాంగ చట్టంలో 5వ అధికరణం వుంది. అది ఆదివాసీ ప్రాంతాలకు వర్తించే అధికరణం. ఇది స్పష్టంగా చెప్తోంది-సుప్రీం కోర్టు కూడా ఆంధ్రప్రదేశ్‌లోని సమతా కేసు విషయంలో స్పష్టమైన తీర్పు ఇచ్చింది-గిరిజనుల భూములను అతిక్రమించే అధికారం ప్రభుత్వానికి గూడా లేదు. ప్రభుత్వం కూడా ఆదివాసుల భూములను స్వాధీనం చేసుకోవటానికి వీలు లేదు. ఇది ఆ మేరకు గిరిజనులకు రక్షణనిచ్చింది. దీనిని కొందరు రాజ్యాంగ చట్టం లోపల మరొక రాజ్యాంగ చట్టంగా కూడా పేర్కొంటూ వస్తున్నారు.

ఈ రాజ్యాంగ చట్టాన్ని అమలు జరపటంలో భారత పాలకులు విఫలమయ్యారు. వాగ్దానాల పరంపరను ఎప్పుడూ అమలు జరుపలేదు. అవి శుష్క వాగ్దానాలుగానే మిగిలిపోయాయి. ఈ ప్రాంతాలలో-తాను ఏ రాజ్యాంగ చట్టం మీదనైతే ప్రమాణం చేసి అధికారాన్ని చెలాయిస్తున్నామని అన్నారో ఆ రాజ్యాంగ చట్టాన్ని అమలు పరచకుండా పూర్తిగా ఈ పాలకులు నిర్లక్ష్యం వహించారు. అదే ప్రస్తుత ఆదివాసీ ప్రాంతాల్లోని సంక్షోభానికి కారణం.

ఈ రాజ్యాంగ చట్టాన్ని ఆమోదించినందువలన జరిగిన మొట్టమొదటి నష్టమేమిటంటే స్వపరిపాలన అనేదానిని ఈ రాజ్యాంగ చట్టం ఎక్కడా పేర్కొనలేదు. ఇప్పటివరకు గ్రామసభలు తమ గ్రామ వ్యవహారాలను తామే పాలించుకునే దాన్ని ఈ రాజ్యాంగ చట్టం గుర్తించక పోయినందువల్ల, అమలు జరపడంలో పూర్తిగా విఫలమైనందువల్ల

స్వపరిపాలన అనే దానిని ఆదివాసీ ప్రజలు కోల్పోయారు.

దేశంలోని అన్ని ప్రాంతాల నుండి ఈ ప్రాంతంలోకి వలసలు పెరుగుతూ వచ్చాయి. దీనితో తమ గ్రామాల్లోని వనరుల మీద, భూమి మీద, అడవి మీద, నీటి మీద ప్రజలకు ఉండాల్సిన అధికారం అనేది కోల్పోవటం జరిగింది. అది ఇతరుల చేతిలోకి వెళ్ళి పోయింది. భారతదేశంలోని అత్యున్నత న్యాయస్థానం కూడా 'వీటిని రక్షించాలి, ఆయా ప్రాంతాల్లో వనరులపై ఆదివాసులదే అధికారం' అని పేర్కొన్నప్పటికీ, ఈ రాజ్యాంగ చట్టం అలా రచించినప్పటికీ భారత పాలకులు ఏనాడూ వీటిని అమలు చేయని ఫలితంగా ఆదివాసీ ప్రాంతాల్లో ప్రజలు తమ వనరులపై ఆధిపత్యాన్ని కోల్పోయారు. తత్ఫలితంగా అక్కడ అశాంతి నెలకొని వుంది. గ్రామ పరిధిలోపల వున్న వనరులపై ఆ గ్రామసభకు ఆధిపత్యం లేకపోవడం అనేదే మూల కారణం. రాజ్యాంగ చట్టం ఇచ్చిన హక్కు ప్రకారమే ఈ గ్రామంలోని వనరులపైన ప్రజలు సామూహిక హక్కు కలిగి వుండాలి. ఇది ఇస్తారా లేదా? పొందుతామా లేదా? అనేదే మన ముందున్న కీలక సమస్య. ఈ భూమి ఈ గ్రామ ప్రజల సామూహిక హక్కు క్రింద వుండాలి. ఇది రాజ్యాంగ చట్టంలో ఆమోదించింది అయినప్పటికీ దీనిని అమలు చేయటానికి పాలకులు సిద్ధంగా లేరు. 'మేము బయట నుండి చట్టాలు చేస్తాం-ఈ ప్రాంతంలో భూమి, సంపద అంతా ప్రభుత్వానికి చెందు తుంది' అని వాళ్ళు చట్టాలు చేయటమనేది అన్యాయమైంది. వాళ్ళు ఆమోదించిన రాజ్యాంగ చట్టానికే భిన్నమైంది. కనుక ఆ రాజ్యాంగ చట్టాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం అమలుచేయటానికి పూనుకుంటాయా లేదా? మన స్వయం పాలన, మన వనరులపై మనం ఆధిపత్యం పొందుతామా లేదా? అనేదే కీలకమైన సమస్య.

ఇప్పుడు రైతు, రైతుకూలీలకు గ్రామీణ ప్రజలకు-భూమికి మధ్య సంబంధం దగ్గరకు

## డా॥బి.డి.శర్మ రచించిన 'రెండు దేశాల కథ' పుస్తక ఆవిష్కరణ-వ్యవసాయార్థిక శాస్త్రవేత్త ప్రొఫెసర్.కె.ఆర్.చౌదరి



'ఈ పుస్తక రచయిత అయిన డా॥బి.డి.శర్మగార్ని గురించి రెండు మాటలు చెప్పాలి. ఆయన ఒక ఐఏఎస్ ఆఫీసర్‌గా పనిచేశారు. అనేక ఉన్నతమైన పదవులను వారు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వంలో హోంశాఖ జాయింట్ కార్యదర్శిగానూ, ఎస్‌సి, ఎస్‌టి కమీషన్ కమీషనర్‌గానూ, వైస్ ఛాన్స్‌లర్‌గా కూడా పనిచేశారు. వారు బస్తర్‌జిల్లా కలెక్టరుగా ఉన్నపుడు ఆదివాసుల అభ్యున్నతి కోసం కృషి చేశారు. ఆనాటి నుండి డా॥శర్మ గారు ఆదివాసుల హక్కుల కొరకు పోరాడు తున్నారు. గ్రామీణ పేదల పట్ల కూడా అపార ఆసక్తి వుంది. గ్రామాలలో అధికార వికేంద్రీకరణ అవసరమంటారు ఆయన. మన పంచాయితీలకు ఏ విధమైన నిధులు లేవు. అధికారాలు లేవు, సరైన విధులు లేవు-అధికార వికేంద్రీకరణతో గ్రామీణ అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నారు. ఆదివాసులు, గ్రామీణులు, దళిత ప్రజల తరఫున పనిచేస్తున్న గొప్ప మేధావి-అనేకమైన రచనలు చేశారు. ఆ రచనలన్నీ చాలా విలువైనవి. అలాంటి రచనలలో 'ది టేల్ ఆఫ్ టు నేషన్స్' అనే ఈ చిన్ని పుస్తకం కూడా ఒకటి. భారత జన ఆందోళన్ అధ్యక్షులుగా దేశమంతా తిరుగుతూ ప్రజల హక్కుల కొరకు-ముఖ్యంగా రైతులు, కూలీలు, గ్రామీణ పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తి ఆయన. ఈ వయసులో-ఆయన ఆరోగ్యం అంతగా సహకరించకపోయినా కూడా ఢిల్లీ నుండి ఇక్కడికి వచ్చి ఈ రైతుకూలీసంఘం మహాసభల్లో పాల్గొంటున్నారంటే ఆయనకు ఈ ఉద్యమాల పట్ల ఆసక్తిని చెప్పకనే చెప్తున్నది. వారు రాసిన, రైతుకూలీసంఘం తెలుగులో ముద్రించిన 'రెండు దేశాల కథ' అనే ఈ అనువాద పుస్తకంలో రెండు దేశాలు-అంటే ఒకటి సంపన్న ఇండియా-రెండు పేదల భారత్! 1965 కాలంలో సస్య విప్లవం వచ్చిందని చెప్పుకొంటున్నాం. సస్య విప్లవానికి ముందు రైతులు తమ వ్యవసాయాన్ని తమ కొరకే చేసుకొనే వాళ్ళు. అప్పుడు సాపేక్షంగా సుఖంగా ఉండేవాళ్ళు. మొదట్లో ప్రభుత్వం కొంత సహాయం చేసినప్పటికీ ఆ పచ్చ విప్లవం తర్వాత అనేకమైనటువంటి ప్రమాదాలు వచ్చాయి. వాటి నుండి ఇప్పటికీ కూడా బయటపడలేకుండా ఉన్నారు. ఈ పుస్తకంలో భూమిని గురించి కూడా మాట్లాడారు. భూమిని ఒక వర్తకపు సరుకుగా మార్చి అమ్ముకుంటున్నారు. ఈ పారిశ్రామికవేత్తలు, మాఫియా భూమిని చెరబట్టారు అనే విషయాన్ని చక్కగా వివరించారు. అభివృద్ధి నమూనా అనేది ప్రజల కొరకా? లేక బహుళజాతి కంపెనీల కొరకా అని ప్రశ్నిస్తున్నారు? పెట్టుబడులంతా ఎక్కడి నుండి సమకూరుస్తున్నారంటే పల్లెల నుండి, వ్యవసాయరంగం నుండి వస్తుందని వారు చాలా చక్కగా వివరించారు. వ్యవసాయ రుణాల గురించి చాలా చాలా పుస్తకాలు రాశారు. చాలా లోతుగా వారు అధ్యయనం చేశారు. రుణభారం గురించి కూడా ఈ పుస్తకంలో వారు పేర్కొన్నారు. ఈ విధంగా అనేకమంచి విషయాలు ఈ చిన్న 50 పేజీల పుస్తకంలో పొందుపరిచారు. రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) ప్రచురిస్తున్న ఈ పుస్తక తెలుగు అనువాదాన్ని ఆవిష్కరిస్తున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను'.

వద్దాం. నేనింతకు ముందు ఒకటి, రెండు సందర్భాలలో మీ సభలు, సమావేశాల్లో ఈ అంశంపై మాట్లాడి వున్నాను. 'రెండు దేశాల కథ' కూడా ఈ సమస్యను వివరంగా పేర్కొంది. ఈ రోజున మౌలిక సమస్య ఏమిటంటే భూమి ఎవరికి చెందాలి అన్నదే మౌలిక సమస్య. భూమికి-భూమి మీద పంట పండిస్తున్న రైతుకు వున్న సంబంధం ఏమిటి? ఈ రోజు ఎలా వుంది? భవిష్యత్‌లో అది ఎలా మారబోతోంది? దాని ఫలితాలు ఎలా ఉండబోతున్నాయనేదే మౌలికమైన సమస్య.

2000సం॥లో భారత ప్రభుత్వం ఒక వ్యవసాయ విధానాన్ని ఆమోదించి పది సంవత్సరాలు గడిచిపోయాయి. ఈ వ్యవసాయ విధానం యొక్క మౌలికమైన అంశం ఏమిటంటే భూమి మీద పనిచేయాలి అంటే మరింత ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం కావాలి. మరింత ఉన్నత సాంకేతిక పరిజ్ఞానం కావాలీ అంటే ఇంకా ఎక్కువ డబ్బు పెట్టుబడి పెట్టాలి. ఆ డబ్బు పెట్టుబడి రైతు పెట్టలేడు. కావున ఆ పెట్టుబడి పెట్టగలిగిన ధనవంతుడెవరో వాడే వ్యవసాయం చేయాలి. ఇదీ ఆ వ్యవసాయ విధాన కీలకమైన అంశం! ఈ చట్టాన్ని చేసే సందర్భంలో ఏ రాజకీయ పార్టీ దీనిని ప్రశ్నించలేదు.

నా చిన్నతనంలో పెద్ద రైతుగానీ, చిన్న రైతుగానీ తన పిల్లాణ్ని పట్నానికి చదువుకోవటానికి పంపేవాళ్ళు కాదు. ఇవ్వాళ తన భూమి కూడా అమ్మేసి ఏ ప్యూన్ ఉద్యోగం కోసమైనా తన కొడుకును పంపటానికి సిద్ధపడని రైతును చూడగలమా? ఇదీ పరిస్థితిలో వచ్చిన పెద్ద మార్పు. ఇదే మన వ్యవసాయ రంగంలో వచ్చిన ఒక దిగజారిన స్థితిని మనకు తెలియజేస్తోంది.

స్వాతంత్ర్యం వచ్చి మన స్వతంత్ర ప్రణాళికలు రచించుకోవటం ప్రారంభమైన తర్వాత జాతీయ సంపదలో ప్రథమ స్థానం వ్యవసాయనికుండేది. సేవల స్థానం చిట్ట చివరిదిగా ఉండేది. 60 ఏళ్ల తర్వాత ఈ రోజున సేవల స్థానం మొదటి స్థానంలోకి రాగా, వ్యవసాయం 3వ స్థానంలోకి, అధమ స్థానంలోకి దిగజారింది. ఈ విధంగా పరిస్థితి తల్లక్రిందులైంది. ఈ సంక్షోభానికి కారణం ఏమిటి? వ్యవసాయం గిట్టుబాటు కాని వృత్తి అని అందరూ అంటున్నారు. కానీ అది నిజం కాదు. వ్యవసాయం గిట్టుబాటు కాకుండా చేసింది ప్రభుత్వం. ఎందుకంటే ఈ వ్యవసాయ భూమిని ప్రజల చేతుల్లోంచి ధనికుల చేతుల్లోకి మార్చటం కోసం వ్యవసాయం గిట్టుబాటు కాకుండా ఉండే విధానాలని ఈ ప్రభుత్వం అమలు జరిపింది. భారత ప్రభుత్వం అనుసరించిన పన్నుల విధానం, భూమిశిస్తు, నీటి తీరువా ఇలాంటి విధానాల తోటి రైతుని తప్పనిసరిగా తను ఉత్పత్తి చేసిన పంటలో నాలుగింట మూడు వంతులు అమ్మేసుకోవాల్సిన స్థితి కల్పించింది. ఆ పరిస్థితుల్లోకి నెట్టింది. ఆ విధంగా వ్యవసాయ పంటలకు అతితక్కువ ధరలు చెల్లించి, ఆ సంపదనంతా కొల్లగొట్టి తీసుకెళ్ళి పట్టణాల్లో కేంద్రీకరింపజేయటం వల్ల రైతాంగం నానాటికీ నష్టపోయే స్థితికి తీసుకువచ్చింది.

నేను ఈశాన్య ప్రాంత విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా ఉన్నప్పటి నుండి ఒక ప్రశ్న అడుగుతున్నాను. దానికి నాకు సమాధానం రావటం లేదు. ఆ ప్రశ్నకు సంబంధించి, ఒక మౌనాన్ని ఈ పాలకులందరూ పాటిస్తున్నారు. ఆ ప్రశ్న ఏమిటంటే-'ఔను-నగరాలు అభివృద్ధి చెందుతున్నాయి. పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. వీటన్నిటి అభివృద్ధికి పెట్టుబడి ఎక్కడి నుండి వస్తున్నది?' అనేదే నా ప్రశ్న! ఇదంతా గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థ నుండి నాలుగింట మూడు వంతులు-ఆ రైతులు, ఆ రైతుకూలీలకే తెలియకుండా నగరాలకు తరలించటం వలననే ఆ అభివృద్ధి సాధ్యమైంది. గ్రామాలు మట్టికొట్టుకుపోయాయి. ఇదెలా సాధ్యమైందంటే-వ్యవసాయ పంటలకు ధరలను అతితక్కువగా లెక్కగట్టి ఆ తక్కువ చెల్లించినందువలన, నాలుగింట మూడు వంతులు నగరానికి తరలించినందు వలన అభివృద్ధి అని ఏదైతే అంటున్నారో అదైనా సాధ్యమైంది.

మరోవైపున రైతాంగం, రైతుకూలీలు దుర్భర దారిద్ర్యంలో కూరుకుపోయారు. రైతాంగం, రైతుకూలీలు చేస్తున్న శ్రమను, నైపుణ్యం లేని శ్రమ కింద లెక్కగడ్తున్నారు. వారి శ్రమ విలువను తగ్గించి వేశారు. ఐక్యరాజ్యసమితి ప్రకటనలో కుటుంబానికి ఒక వ్యక్తి పనిచేయాలి. ఆ వ్యక్తికిచ్చే వేతనం ఆ కుటుంబ అవసరాలు తీర్చేదిగా ఉండాలని పేర్కొంది. కాగా, మన దేశంలో ఒక కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు పని చేస్తారు. కనుక ఒక వ్యక్తికిచ్చేది ఆ కుటుంబ అవసరాల్లో సగము ఇవ్వాలి అనే రూపంలో ఆ వేతనంలో కూడా తగ్గించి వేశారు-ఈ విధంగా చూసినపుడు భారతదేశంలోని ప్రతి గ్రామం నుండీ సంవత్సరానికి కోటి రూపాయల చొప్పున ఆ రైతాంగపు శ్రమను ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇంత పెద్ద ఎత్తున దోపిడీ జరిగిన తర్వాత ఆ రైతాంగం ఎలా బ్రతుకుతారు? వాళ్ళు దారిద్ర్యంలో కూరుకుపోకుండా ఎలా మిగిలి వుంటారు? అనేదే మనకెదురౌతున్న సమస్య.

భారతదేశం నిరుద్యోగ సమస్యతో అతలాకుతలమైపోతున్నది. ఈ సమస్యను పరిష్కరించటానికి మార్గాలు లేవని చెప్తున్నారు. కానీ వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలను దోపిడీ చేసుకోవటానికి ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను కృత్రిమంగా సృష్టించింది అంటాను. 24 కోట్ల కుటుంబాలు ఈ దేశంలో వున్నాయి. వాటిల్లో 18 కోట్ల కుటుంబాలు గ్రామీణ ప్రాంతాల్లో నివశిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ఈ 18 కోట్ల కుటుంబాల్లో కుటుంబానికి ఇద్దరు చొప్పున పనిచేస్తే తప్ప వాళ్ళ జీవనాధారం దక్కదు అని చెప్తోంది. ఐరాస పేర్కొన్న విధంగా ఒక వ్యక్తికి వేతనం చెల్లించాలి అనే విధానాన్ని అమలు జరిపితే, ఆయా రైతు కుటుంబాల్లో పసిపిల్లలు, వృద్ధులు, మహిళలు తప్పనిసరై ఆ రోజు తిండి కోసం బయట కొచ్చి మార్కెట్‌లో కూలి చేయాల్సిన స్థితి తప్పిపోతుంది. ఎప్పుడైతే కుటుంబ వేతనం అనే సూత్రాన్ని పాటించి, మన శ్రమకు వేతనం చెల్లించబడుతుందో ఇద్దరు రావాల్సిన చోట ఒక్కరే పనిలోకి వస్తారు-మార్కెట్లో ఒక్కసారిగా 18 కోట్లమంది నిరుద్యోగులు అదృశ్యమౌతారు! నిరుద్యోగ సమస్య పరిష్కారమౌతుంది. కానీ ఎందుకిలా జరుగుతోంది? అంటే గ్రామీణ భారత మూపుల మీద ఎక్కి కూర్చొన్న **(తరువాయి 29వ పేజీలో)**

ప్రసంగ వ్యాసం

# ‘వ్యవసాయాభివృద్ధికి, వ్యవసాయ విప్లవానికి భూమి కేంద్రంగా ఉండాలి’



రైతులకు-విదేశీ, స్వదేశీ దోపిడీ దారుల నుండి, బహుళజాతి కంపెనీల నుండి, విదేశీ శక్తుల నుండి రక్షణ కావాలి. కావున మనం బహుళజాతి కంపెనీలకు, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. ఈ విధంగా మన సంఘం బలంగా ఉన్నపుడే పోరాటాలు చేయగల్గుతాము- రైతు, రైతుకూలీ సంఘాలు అన్నీ కలిసి ఐక్య పోరాటాలు చేసినపుడే, ఐక్య పోరాటాలకు సిద్ధమైనపుడే కొన్ని కొన్ని డిమాండ్స్‌నైనా మనం సాధించు కోగలం. కానీ మన అంతిమ నిర్ణయం-వ్యవ సాయక విప్లవం సాధించుకోవటం!


**ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి**
వ్యవసాయార్థిక శాస్త్రవేత్త


వ్యవసాయ సంక్షోభం-దాని మూలాలు-కారణాల విశ్లేషణ-వీటికి ప్రత్యామ్నాయ విధానాలు ఏమిటి? అనే అంశాలు నేను ప్రస్తావిస్తాను.

పాలకవర్గాలు ఎక్కడా సంక్షోభం లేదని చెప్తున్నారు. ఒక పాలక పార్టీ అయిన బిజెపి చెప్తున్నదేమంటే భారతదేశం వెలిగిపోతుంది అని! మరి ఇప్పుడున్న యుపిఏ ప్రభుత్వం ఏమి చెప్తున్నదంటే ప్రపంచంలోనే మహా శక్తివంతమైన దేశము, భారతదేశమని చెప్తున్నారు. ఈ మాటలు గాలి మాటలు మాత్రమే. నిజానికి వీరు చెప్పే దాంట్లో వాస్తవం లేదు. వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయి వుంది. రైతులు సంకట స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గత 15-20 ఏళ్ళుగా వ్యవసాయం నానాటికీ క్షీణిస్తూ వున్నది. వ్యవసాయ అభివృద్ధి రేటు 1980 దశకంలో 3.5 శాతం వుంటే ఈనాడు ఒక శాతానికంటే తక్కువగా పడిపోయింది. మరి వ్యవసాయ అభివృద్ధి రేటే పడిపోతే అది సంక్షోభానికి సంకేతం కాదా? అని ప్రశ్నించాలి. ముఖ్యంగా ఈనాడు వ్యవసాయ రంగంలో వున్న సంక్షోభాన్ని రైతుల యొక్క అప్పే వెల్లడి చేస్తున్నది. సంక్షోభం అంటే రైతులు అప్పుల్లో మునిగిపోయారు అని అర్థం! ఇది మనం చెప్పే మాట కాదు. భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారము మన రాష్ట్రంలో 82 శాతం మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వ్యవసాయం సంక్షోభంలో లేకపోతే వీరు అప్పుల్లో ఎందుకు కూరుకు పోయారు? ఈనాడు వ్యవసాయం మరింతగా క్షీణిస్తుందని చెప్పటానికి గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా వ్యవసాయ రంగంలో వున్నవారి నిరుద్యోగం చాలా చాలా పెరిగిపోయింది. వ్యవసాయంలో ఎన్నో మార్పులు తీసుకు వస్తున్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం పెట్టారు. కావున నిరుద్యోగం తగ్గిందని ఒక వైపున చెప్తుంటే నిరుద్యోగం తగ్గలేదు అని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా వ్యవసాయ రంగంపైన ఆధారపడిన వారు ఇప్పటికీ దారిద్ర్యం, పేదరికంలో మగ్గిపోతున్నారు. దీనికి అనేక అంచనాలున్నాయి. ప్లానింగ్ కమీషన్ వాళ్ళు నూటికి నలభైమంది పేదరికంలో ఉన్నారని చెప్తూ వుంటే సురేష్ టెండూల్కర్ అనే ప్లానింగ్ కమీషన్ సభ్యుడు 40 శాతం కంటే ఎక్కువగా పేదరికం ఉంది అన్నారు. ఎన్‌సి సక్సేనా అనే మరో ఆయన 60 శాతం మన దేశంలో నిరుద్యోగం వుందని అన్నారు. అక్షయసేన్ గుప్తా అనే ఆయన అసంఘటిత కార్మికుల స్థితి గతులను అధ్యయనం చేస్తే 70 కోట్లమంది ప్రజలు-ముఖ్యంగా అసంఘటిత రంగంలో ఉన్న వారు, ఎక్కువగా వ్యవసాయ రంగంలోనున్న వారు రోజుకు 20 రూపాయల కంటే తక్కువ వేతనం పొందుతున్నారన్నాడు.

రైతులు సంక్షోభంలో కూరుకుపోతు న్నారు-ఆహార సమస్య నానాటికీ జటిల మౌతూ వున్నది. పెరుగుతున్న ధరలు వొక వైపు, ఉత్పత్తి కూడా మరోవైపు పెరగటం లేదు. గత 10-15 ఏళ్ళుగా చూస్తుంటే ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల లేదు. 23 కోట్ల టన్నుల నుండి ఈనాడు ఆహార ధాన్యాల ఉత్పత్తి 16 కోట్ల టన్నులకు పడిపోయింది. ఆహార ఉత్పత్తి పడిపోయినందు వల్ల, ధరల పెరుగుదల వల్ల కూడా ప్రజలు ఆహారధాన్యాల వాడకం, తినడం తగ్గి పోయింది. 1979లో ఒక వ్యవసాయ కుటుంబం, సంవత్సరానికి 475 కేజీల ఆహారాన్ని వినియోగిస్తుంటే, 2004-05 నాటికి 445 కేజీలకు తగ్గిపోయింది.

ఆకలి చావులు కూడా ఎక్కువగా-ముఖ్యంగా-ఒరిస్సాలో, జార్ఖండ్‌లో, ఛత్తీస్‌ఘడ్‌లో మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆకలి చావులు ఉన్నాయని అనేక రిపోర్టులు

తెలుపుతున్నాయి. పోషకాహారం లేనందువల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం, చిన్న పిల్లల్లో 74 శాతం మంది రక్తహీనతతో బాధపడ్తున్నారు. 45 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. పోషకాహారం లేనందువల్ల శిశు మరణాలు కూడా పెరిగిపోయాయి. అలాగే కాన్పులు అయిన తర్వాత చనిపోతున్న స్త్రీలు పెరిగిపోతున్నారు. ఆహార సమస్య ఎక్కువగా కృంగ దీసేది– మహిళలనే! ఇంట్లో ఆహారముంటే పురుషులు తిన్న తర్వాత పిల్లలకుపెడ్తారు. మిగిలినది ఏమైనా వుంటే వాళ్ళు తింటారు. ఈ విధంగా వ్యవసాయ రంగంలో వున్న మహిళలు– ఆహార సమస్యతో కూడా తీవ్రంగా బాదపడ్తున్నారని గమనించాలి.

ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఉన్నటువంటి వాళ్ళు, గ్రామీణ ప్రాంతాల్లో ఉండేటి వాళ్ళు వలసలు పోతున్నారు. వలసలను అరికట్టాలి అనే ఉద్దేశ్యముతో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇది ప్రవేశపెట్టినప్పటికీ కూడానూ, ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుండి తండోపతండాలుగా వలసపోతున్నారనేది వాస్తవం. వలస పోవటం ఏదో బాగా సంపాదించుకోవటానికి కాదు. కడుపు చేతబట్టుకు పోతున్నారు. అక్కడ అనేక ఇక్కట్లకు లోనవుతున్నారు. సరైన సౌకర్యాల కొరతతో వలస కూలీల పరిస్థితి దారుణంగా వుంది.

రైతు కుటుంబాల్లో–ముఖ్యంగా–గిరిజన రైతు కుటుంబాల్లో పరిస్థితి మరీ దారుణంగా వుంది. వరంగల్ జిల్లాలోనూ–నల్గొండజిల్లా దేవరకొండ ప్రాంతంలోనూ మేము అధ్యయనం చేస్తే కొన్ని తండాల్లో–లంబాడా రైతులు–వాళ్ళ ఆడపిల్లల్ని అమ్ముకుంటున్నారు. వారికి తిండి పెట్టలేక, వారికి సరైన పోషణ ఇవ్వలేక, వాళ్ళు బిడ్డల్ని అమ్ముకునే దుస్థితి దాపురించింది. ఇంకా విషాదకరమైన విషయమేమంటే గ్రామీణ ప్రాంతాల నుండి మహిళలు వేశ్యా మందిరాలకు తరలింపబడుతున్నారు అనేది! ఇక్కడ వాళ్ళకు సరైన కూడు, గుడ్డ లేకపోవటం వల్ల అనేక ప్రలోభాలకు లోనుచేసి వారిని తరలిస్తున్నారు. ఒక సర్వే ప్రకారం గోవాలో, ముంబాయిలో, ఢిల్లీలో వున్న వేశ్యల్లో 70 శాతం మంది వ్యవసాయ కుటుంబాల నుండి వచ్చిన వాళ్ళు! ఈ దేశంలో మహిళలకు ఎంతటి దురదృష్టకర పరిస్థితి వుందో ఈ సంఘటనలు తెల్పుతున్నాయి.

మేము–గుంటూరు జిల్లా రెంటచింతల గ్రామానికి పోతే, అక్కడ దాదాపు 40మంది రైతులు తమ కిడ్నీలను 40 వేలు–50 వేలకు అమ్ముకున్నారు. వాళ్ళు ఇప్పుడు ఏ మాత్రం కూడా పనిచేయలేకుండా వున్నారు.

ఇక, రైతుల ఆత్మహత్యలు! వ్యవసాయం గిట్టుబాటు కాక, వాళ్ళ శ్రమకు కూడా తగిన ప్రతిఫలం రాక, నష్టాలలో కూరుకొని పోయి, అప్పులు తీర్చలేక, బలవన్మరణాల పాలవుతున్నారు. దాదాపు ఒకటిన్నర లక్షల మంది పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని భారత పార్లమెంటులో మంత్రిగారే చెప్పారు– మన రాష్ట్రంలో కూడా దాదాపు 30 వేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రాజశేఖరరెడ్డిగారు మొదటిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు మరునాటి నుండి ఆత్మహత్యలు ఉండవన్నారు. కానీ ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే వుంది. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాల్లో పరిస్థితులు మరీ దరిద్రంగా వున్నాయి. అంటే ఎవరి వద్దనైతే అప్పు తీసుకొన్నారో, వాడు– ఆ రైతు కుటుంబంలో మిగిలిన వారిని పీడించి, పీడించి అప్పు వసూలు చేస్తున్నాడు– ప్రభుత్వమేదన్నా దయ తలచి కొంచెం ఆర్థిక సహాయం చేస్తే, దాన్ని కూడా గద్దల్లాగా తన్నుకొనిపోతున్నారు. రైతుల ఆత్మహత్యల అనంతరం ఆ కుటుంబాల్లోని మహిళల పరిస్థితి, పిల్లల పరిస్థితి మరీ దారుణంగా వుంది. వారు అనాథలైపోతున్నారు. ఇదంతా వ్యవసాయ సంక్షోభంలో భాగంగా జరుగుతున్నదే!

ఎవరూ కూడా వ్యవసాయం చేయడానికి ఇష్టపడటం లేదు. ముఖ్యంగా మన చదువుకున్న పిల్లల్లో ఆ ఊళ్ళల్లో వుండి వ్యవసాయం చేయడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. వ్యవసాయం చాలా నష్టాలతో కూడుకొని వుంది. గవర్నమెంట్ ఒక నేషనల్ శాంపుల్ సర్వే చేస్తే 40 శాతంమంది రైతులు ఇప్పుడే వాళ్ళు తమ వ్యవసాయ వృత్తిని వదులుకొని వెళ్ళిపోవడానికి తయారుగా వున్నారు. కానీ ఎక్కడికి పోవాలో తెలీక, గత్యంతరం లేక, నష్టాలైనా భరించుకుంటూ అదే వ్యవసాయంలో కొనసాగుతున్నారు.

సాగునీటి వసతిగల ప్రాంతాల్లో ఒక్క కౌలుదారుడు కూడా భూమిని కొనలేకపోవటమే కాదు, సన్నకారు, చిన్నకారు రైతులు తమకున్న భూముల్ని అమ్ముకుంటున్నారు. ఏ మధ్యతరగతి రైతో, ఏ పెద్దరైతో ఈ భూముల్ని సన్న, చిన్నకారు రైతుల నుండి కొనుక్కుంటున్నారు. భూములు, పశువులు కోల్పోతున్నారు. వారి ఇతర ఆస్తులనూ అమ్ముకుంటున్నారు. మన రాష్ట్రంలో ఒక కోటీ 20 లక్షల మంది వ్యవసాయ కూలీలు గతంలో ఉన్నారు– ఇది గత పదేళ్ళల్లో ఒక కోటీ 50 లక్షలమందికి పెరిగింది. వీరంతా ఎక్కడి నుండి వచ్చారంటే సన్నకారు, చిన్నకారు రైతుల నుండి వ్యవసాయ కూలీలుగా వీరు మారిపోయారు.

ఈ సంక్షోభానికి కారణాలు ఏమిటి? 1990ల తర్వాత కొనసాగుతున్న వ్యవసాయ

**ప్రపంచంలోని వివిధ దేశాలలోని దోపిడీ శక్తులను, సామ్రాజ్యవాద తొత్తులను, ప్రత్యక్షంగా వున్న సామ్రాజ్యవాద అగ్రరాజ్య ఆధిపత్య శక్తులను వ్యతిరేకిస్తున్న ప్రజలతోను, అక్కడి జాతీయ విముక్తి ఉద్యమాలతోను, ఇరుగుపొరుగు దేశాలతో నిజమైన మైత్రి కోసం సాగే ఉద్యమాలతోనూ రైతుకూలీసంఘం సంఘీభావ దృక్పథం కలిగి వుంటుంది. అగ్రరాజ్య యుద్ధ ప్రయత్నాలను, దురాక్రమణ, విస్తరణ చర్యలను వ్యతిరేకించే శక్తులతో గొంతు కలుపుతుంది.యుద్ధాన్ని వ్యతిరేకిస్తుంది. నిజమైన ప్రపంచశాంతిని కాంక్షిస్తున్నది.**

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర) 'లక్ష్య ప్రకటన' నుండి**

రంగ సంక్షోభం మరీ తీవ్రంగా వుంది. దీనికి కారణమేమంటే రైతాంగానికున్న కొద్దిపాటి రక్షణలు అన్నింటినీ తొలగించివేసి ఆనాటి ప్రధాని పివి నరసింహారావు, ఈనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ మరియు మాంటెంగ్‌సింగ్ అహ్లూ వాలియా..... వీరంతా కల్సి నూతన ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టారు. వ్యవసాయ రంగంపైన దాని ప్రభావం పడింది. ఆర్థిక విధానాలంటే అన్నింటినీ ప్రైవేటీకరించడము, సరళీకరించడము, ప్రపంచీకరణ చేయటము -ఇలాంటి విధానాలను అవలంబించటం వలన ఈ సంక్షోభం మరీ తీవ్రమైంది.

రైతులు అప్పుల ఊబిలో కూరుకొని పోయారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారము, ఒక రైతు కుటుంబం ఒక ఎకరాకి ఒక సంవత్సరానికి 12 వేల రూపాయలు ఖర్చు పెడుతుంటే, అన్ని వనరుల నుండి వాళ్ళకు వచ్చే ఆదాయం మాత్రం 9 వేల రూపాయలే! అంటే ఎకరాకి 3 వేల రూపాయలు నష్టంతో రైతు వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నాడు! మరోవైపున ఈనాడు కుటుంబ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఒక కుటుంబం సగటున 28,600 ఖర్చు పెడుతుండగా వాళ్ళకు వచ్చే ఆదాయం 19 వేల రూపాయలుగా వుంది. దాదాపు 9 వేల రూపాయల లోటు వుంది. ఆ లోటు పూడ్చు కోవాలంటే అప్పుల పాలు కావలసిందే.

ఈ అప్పులు ఏమైనా బ్యాంకులు ఇస్తున్నాయా? సహకార సంస్థలిస్తున్నాయా? గ్రామీణ బ్యాంకులిస్తున్నాయా? ఇవన్నీ చాలా చాలా తక్కువగానే ఇస్తున్నాయి. సంస్థాగత రుణాలు 20-25 శాతానికి మించటం లేదు. 70 శాతం రుణాలు ప్రైవేటు వనరుల నుండి వస్తున్నాయి. 53 శాతం రైతులకు కావలసిన రుణాలు వడ్డీ వ్యాపారస్తుల నుండి తీసుకుంటున్నారు. వడ్డీ రేటు 2 రూపాయల నుండి 10 రూపాయల వరకు వుంది. 6 నెలలు, సంవత్సరం తర్వాత చక్రవడ్డీ కూడా వేస్తున్నారు. ఎంత వడ్డీ కట్టినా అసలు కట్టకుండా పోయాడని రకరకాల హింసలకు గురిచేస్తున్నారు. కాగా, బ్యాంకులు 3 లక్షల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలిస్తున్నా యంటున్నారు. బ్యాంకులు మొత్తం ఇచ్చే అప్పుల్లో 18 శాతం వ్యవసాయరంగానికి ఇవ్వాలి. కానీ ఇది అమలు కావటం లేదు. 10 శాతానికి మించటం లేదు. వ్యవసాయ వ్యాపారానికి, వ్యవసాయ పరిశ్రమకి, హైటెక్ వ్యవసాయానికి, అటువంటి వాటికి ఇస్తున్నారు కానీ, సన్నకారు, చిన్నకారు రైతులకు, ఆహార ధాన్యాలు పండించే రైతులకు ఈ అప్పులు అందటం లేదు. రైతులకు రుణభారం అనేది చాలా తీవ్రంగా వుంది. ఇది కూడా ఈ సంక్షోభానికి ఒక కారణం.

గతంలో వ్యవసాయ ఖర్చులు ఎట్లుండేవి? ఉత్పత్తి ఖర్చులు, సేద్యపు ఖర్చులు. ఈనాడు ఆ ఖర్చులు ఏ విధంగా పెరిగిపోయాయి? హరిత విప్లవం కంటే ముందు పరిస్థితి చాలా భిన్నంగా ఉండేది. రైతుకు అనుకూలంగా ఉండేది. రైతు-తనకు కావలసిన విత్తనాలు తానే సమకూర్చుకునే వాడు. పశువుల పేడ, సేంద్రియ ఎరువులు వాడుకునే వాడు. తనకు కావలసిన పురుగు మందులు-టుబాకో డికాక్షన్-వేపనూనె తోనో-పంచామృతమనో-తానే తయారు చేసుకొనేవాడు. ఈనాడు ఆ పరిస్థితి కాదు-రైతుకు కావలసిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు. అన్నీ కూడా మార్కెట్ నుండి కొనుగోలు చేయాల్సిందే. మార్కెట్‌పై రైతు ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విత్తనాల విషయం తీసుకుంటే-1966లో ఒక విత్తన చట్టం చేశారు. రైతులకు కావలసినంత విత్తనం, ప్రభుత్వం సరఫరా చేయాలి. ఇందులో ప్రభుత్వ పాత్ర ఎక్కువగా వుండాలి. రైతుల ప్రమేయం కూడా ఎక్కువగా ఉండాలి. పరిశోధనలన్నీ వ్యవసాయ విశ్వ విద్యాలయాల్లో సాగాలి. దీని ఫలితంగా కొత్త విత్తనాలు రూపొందిస్తే అవి రైతులకు ఉప యోగపడతాయి. దీనిలో లాభాపేక్ష వుండదు-1966 విత్తన చట్టంలో ఈ అంశాలన్నీ ఉన్నాయి.

1966 విత్తన చట్టాన్ని అమలు చేయలేదు. కాగా, 2004లో మరో విత్తన చట్టం తీసుకువచ్చారు. ఈ విత్తన చట్టం-2004లో అనేక లోపాలున్నాయి. అది రైతాంగానికి వ్యతిరేకంగా వున్నది. ఈనాడు మొత్తం విత్తనమంతా ప్రైవేటు, కార్పోరేట్ కంపెనీల చేతుల్లో ఉంది కనుక వారి ఇష్టా రాజ్యంగా వుంది. వారి ఇష్టమొచ్చిన ధరకు వాళ్ళు అమ్ముకుంటారు. నాణ్యత ప్రమాణం గురించి వాళ్ళపైన ఏ మాత్రమూ నియంత్రణ లేదు.

అదే, రైతుల విషయానికొస్తే తమకు కావలసిన విత్తనాలు తాము తయారు చేసుకోగూడదు. ఎందుకంటే నాణ్యతా ప్రమాణాలు ఉండవు గనుక అని! ఆ నాణ్యతా ప్రమాణాలను ఎవరు పర్య వేక్షిస్తారు? అంటే వ్యవసాయధికారులు! తమ విత్తనాలు తామే తయారుచేసుకొని, పంట పండించుకొనే హక్కును రైతు కోల్పోయాడు. విత్తనాల రేట్లు ఈనాడు 800 శాతం పెరిగాయి. 300 శాతం ఎరువుల ధరలు పెరిగాయి. 500 శాతం పురుగుమందుల ధరలు పెరిగాయి. ఉత్పత్తి ఖర్చులు ఈ విధంగా పెరిగిపోతూ వుంటే, రైతుకు ఎక్కడ నుండి లాభం వస్తుంది? రైతులు పండించే పంటకు ఎక్కువ ధర రావటం లేదు. కానీ ఉత్పత్తి ఖర్చులు మాత్రం విపరీతంగా పెరిగి పోతున్నాయి. ఈ పెరిగిపోవటానికి మూల కారణం-ప్రభుత్వ విధానాలు! ప్రభుత్వం-రైతాంగానికి మద్దతునివ్వకుండా, ధనిక వ్యాపారులకు, కార్పోరేట్ సంస్థలకు మద్దతు నిస్తున్నది-రైతాంగాన్ని దోచుకునేందుకు చేస్తున్న కుట్ర ఫలితమే పంట ఉత్పత్తి ఖర్చులు పెరగటము అనేది అర్థం చేసుకోవాలి.

ప్రైవేట్ కంపెనీలు సరఫరా చేసే విత్తనాలు, నాసిరకం విత్తనాలు-కల్తీ విత్తనాలు! వీటిని విత్తి రైతులు ఎంతో నష్ట పోయారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతులు ఏ కారణంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నా రంటే 62 శాతం పురుగుమందులు పని చేయక నష్టపోయి, 30 శాతం విత్తనాలు కల్తీలు కావటం వలన నష్టపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

పంటను రైతు మార్కెట్‌లో అమ్ముకోగల్గు తున్నాడా? మార్కెట్ ఎవరి చేతుల్లో ఉంది? మార్కెట్ వ్యాపారస్తుల చేతుల్లో వుంది. మార్కెట్, మిల్లర్ల చేతుల్లో ఉంది. మార్కెట్,

కార్పోరేట్ కంపెనీల చేతుల్లో వుంది. వీళ్ళు తమ లాభాల కోసం రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నారు. మన వినియోగదారులు చెల్లించే ధరలో రైతుకు ఎంత గిడుతుంది? మార్కెట్‌లో 35రూపాయలు కేజీ బియ్యం ధర వుంటే, రైతుకు కిలో బియ్యానికి 10 రూపాయలు మించి రావటం లేదు. రైతు దగ్గర కొను గోలుకు, రిటైల్ మార్కెట్ ధరకు చాలా వ్యత్యాసం వుంది. ఈ వ్యత్యాసాన్ని ఎవరు దోచుకుంటున్నారు–అంటే మధ్య దళారులు, మిల్లర్లు, పెద్ద పెద్ద కంపెనీలు! ఈ దళారుల పైన, ఈ కంపెనీలపైన ఏ విధమైన నియంత్రణా ప్రభుత్వానికి లేకపోగా ప్రభుత్వ విధానాలు వారికి దోహదపడేవిగా వున్నాయి.

ఫ్యూచర్ ట్రేడింగ్ అనేది మరోటి! దీంట్లో అమ్మేవాడూ వుండడు. కొనేవాడు వుండడు. మొత్తం పేపర్ల మీదే వ్యాపారమంతా! బ్రోకర్ల కొరకు, బ్రోకర్ల చేత సాగించబడుతున్న వ్యాపారంగా వుంది. దాదాపు నెలకు 10 వేల కోట్ల రూపాయలు విలువ చేసే వ్యాపారం ఈ విధంగా జరుగుతున్నది. 60 శాతం వ్యాపారం–భవిష్య వాణిజ్యంలోకి పోయింది. ఇది రైతాంగాన్ని చాలా నష్టపరుస్తున్నది. ఇక, గిట్టుబాటు ధర రావటం లేదు. ప్రభుత్వం–కనీస మద్దతు ధర ఇస్తామంటున్నది. చాలా తక్కువగా నిర్ణయిస్తున్నది. అందువల్ల రైతులు చాలా నష్టాల పాలవుతున్నారు.

ప్రపంచీకరణ అనేది గత 20 సంవత్సరాలుగా వ్యవసాయ రంగంలో కూడా ప్రవేశించింది. సామ్రాజ్యవాద శక్తులు మన ప్రకృతి వనరులను దోచేస్తున్నాయి. అది–భూమి, నీరు, అడవులు, ఖనిజాలు! వీటన్నింటినీ సామ్రాజ్యవాద శక్తులు దోచు కుంటున్నాయి. మనకు కావలసిన విత్తనాలు 30 శాతం–బహుళజాతి కంపెనీల చేతుల్లో వున్నాయి. ఎరువులు 50 శాతం వారి చేతుల్లో వున్నాయి. పురుగుమందులు 90 శాతం వారి చేతుల్లో వున్నాయి. ఈ కంపెనీలపై ప్రభుత్వానికి ఏ విధమైన నియంత్రణా లేదు. కాకపోగా ప్రపంచీకరణ విధానంలో భాగంగా వీటిని ప్రభుత్వం ప్రోత్సహిస్తూ వస్తున్నది. ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థల సలహాలను–మన ప్రభుత్వం తీసుకొని అమలు చేస్తున్నది. మన రైతులకు, మన ప్రజానీకానికి అనుకూలంగా ఉండే విధానాలు ఇవి కావు. వ్యవసాయరంగంపైన పెట్టే ఖర్చులను తగ్గించమని ప్రపంచ బ్యాంక్ చెప్తున్నది. ద్రవ్యలోటును తగ్గించమనీ, వ్యవసాయరంగానికి బడ్జెట్‌లో తక్కువగా కేటాయించమని చెప్తున్నారు. వ్యవసాయ రంగానికిస్తున్నటువంటి రాయితీలు, సబ్సిడీలు తగ్గించమని చెప్తున్నారు. సామ్రాజ్యవాద దేశాలు 70–80 శాతం సబ్సిడీలు తమతమ దేశాల్లో ఇస్తుండగా ఈ దేశంలో వున్న 45 శాతం సబ్సిడీలు కూడా తొలగించమని ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశిస్తోంది. కానీ, రైతులు, కూలీలు ఏదైనా కొనాలనుకుంటే బియ్యం, కిరోసిన్, పంచదార, వీటి ధరలన్నీ పెంచుతూ వున్నారు. ప్రపంచబ్యాంక్ మార్కెట్ యార్డులను ప్రైవేటీ కరించమని చెప్తున్నది. ఇప్పుడు మనకు క్రమబద్ధీకరించిన మార్కెట్లు ఉన్నాయి. కొంచెమైనా అక్కడ న్యాయం జరగటానికి అవకాశముంది. అది కాదని ప్రైవేటు మార్కెట్లు వస్తే అది–రైతులను దోచుకోవటానికి పూర్తిగా ద్వారాలు తెర వటమే అవుతుంది. సాగునీటి ఛార్జీలు పెంచ టానికి కూడా ఒప్పుకుంటున్నారు. మీటర్లు కూడా పెడ్తున్నారు.

ప్రపంచ బ్యాంకు 'ఆహార ధాన్యాలు పండించకండి, వాణిజ్య పంటలు పండిం చండి' అంటున్నారు. ఆహార సమస్య–ఆహార అభద్రత వున్నది. 'ఆహార పంటలు పండించు కోకుండా వ్యాపార పంటలు పండించండి, మీరు మా దేశాలకు ఎగుమతి చేయండి. మేమిచ్చే డాలర్లతో మీరు ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోండి' అంటున్నారు. ఈ పద్ధతి ఆఫ్రికా దేశాల్లో పూర్తిగా విఫలమైంది. సన్నకారు, చిన్నకారు రైతుల సమస్యలు తీరాలంటే 'వ్యవసాయరంగాన్ని కార్పోరేటీ కరణ చేయాలి. సహకార వ్యవ సాయంలోకి తేవాలి–బహుళజాతి కంపెనీ లను, పెటు ్టబడులను విదేశాల నుండి ఆహ్వానించాలి' అని ప్రపంచ బ్యాంకు చెప్తూ వున్నది. ప్రపంచ వాణిజ్య సంస్థ 'మనం ఎగుమతి చేయాలంటే ఆ దేశాల్లో సుంకాలు భారీ ఎత్తున వుంటాయి. అంటే మనం ఎగుమతి చేయలేము. ఈ దేశంలో దిగుమతి సుంకాలు చాలా చాలా తక్కువగా వున్నాయి. కాబట్టి ప్రపంచంలో–ఎవరు ఏది పండించినా అవన్నీ దిగుమతి చేసుకోవాలి' అంటున్నది. బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, పాలు కూడా ఇప్పుడు దిగుమతి అవుతున్నాయి. ఈ విధంగా ఉత్పత్తులు మన దేశంలో వచ్చి పడుతూ వుంటే, మన దేశంలో రైతు పండించిన పంటలకు గిరాకీ లేకుండా పోతుంది. ధరలు కూడా చాలా పడిపోతాయని గుర్తించాలి.

ఈ అనేకానేక కారణాలు మన వ్యవసాయాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ప్రత్యామ్నాయం ఏమిటి? రైతుకూలీ సంఘాలుగా మనం ఏమి డిమాండ్ చేయాలి? దేని కోసం పోరాడాలి? మన ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానంలో ఆహార భద్రత అనేది ముఖ్యం–ప్రతి మనిషికీ తినగలిగినంతగా ఆహారాన్ని అందించాల్సిన అవరముంది–అలాగే వ్యవసాయ రంగంలో వున్న వారికి జీవనభద్రత కూడా కల్పించాలి. స్వావలంబన వుండాలి. మనం ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవటం కాదు. 110 కోట్ల

**సామ్రాజ్యవాదుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే వ్యవసాయ విధానాలనూ; ప్రాజెక్టుల నిర్మాణ, నిర్వహణల్లో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశాధికార, ఫ్యూడల్ అనుకూల విధానాలనూ వ్యతిరేకిస్తుంది. వీటిలో భాగంగానే ప్రభుత్వ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను, వారి అడుగులకు మడుగులొత్తే విధానాలను ప్రతిఘటించడానికి గ్రామీణ పేదలను రైతుకూలీసంఘం సంఘటితపరుస్తుంది.**

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర) 'లక్ష్య ప్రకటన' నుండి**

మందికి మనం కావలసినవి మనం పండించుకోవాలి. ఈ ఆశయాలను సాధించు కోవాలంటే వ్యవసాయ రంగంలో ప్రజా స్వామ్యం ఉండాలి. సమానత్వం ఉండాలి. సామాజిక న్యాయం వుండాలి. ఇవి పునాదిగా మన ప్రత్యామ్నాయ వ్యవసాయ విధానాన్ని రూపొందించుకోవలసిన అవసరముంది.

భూమి అనేది వ్యవసాయ అభివృద్ధికి, వ్యవసాయ విప్లవానికి పునాదిగా వుంటుంది. అది కేంద్రంగా ఉండాలి-కౌలు రైతులు భూమి లేకుండా అల్లాడిపోతున్నారు-భూ యజమానుల చేతుల్లో దోపిడీకి గురిచేయ బడుతున్నారు. కౌలు భద్రత లేదు. ప్రభుత్వ రాయితీలు ఏవీ వారికి చేరవు-అప్పులూ పుట్టటం లేదు. వారికి జీవనాధారమైన భూమి ఇచ్చినపుడే జీవనాధారం వుంటుంది. ప్రతి రైతు కూలీ కుటుంబానికి కనీసం 3 ఎకరాలు భూమి వుండేట్లుగా పంపిణీ చేయాలి.

రైతులను రుణవిముక్తుల్ని చేయాలి. ప్రభుత్వం దీనికి చర్యలు తీసుకోవాలి. రైతులకు రుణసదుపాయం కల్పించాలి. ప్రతి ఒక్క రైతుకు అవసరమైన మేరకు సంస్థాగత రుణాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వా నిది. పంటల బీమా గురించి చాలా మందికి తెలీదు-రైతులలో 10-15 శాతానికి కూడా ఈ బీమా వర్తించటం లేదు. పంట నష్టం జరుగుతూనే వుంది. రుణసదుపాయంతో పాటు బీమా కూడా ముఖ్యమైంది. రైతులు కూడా తమ ఉత్పత్తి ఖర్చులు తగ్గించు కోవటానికి ఏమి చేయాలో ఆలోచించాలి. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు కూడా పాటించాల్సిన అవసరం వుంది. ఈ సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పూనుకోవాల్సిన బాధ్యత వుంది.

రైతులకు గిట్టుబాటు ధరలు కావాలి. వ్యవసాయరంగాన్ని లాభపూరితం చేయాల్సిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వం డా॥ఎమ్.ఎస్ స్వామినాథన్ పేరుతో కమీషన్ వేసింది. ఆయన కొన్ని వేల పేజీల రిపోర్టు ఇచ్చాడు. అవన్నీ ప్రభుత్వం ఆమోదించామని చెప్తున్నది. కానీ, ఏవీ అమలు కావటం లేదు. ఒక్కటి మాత్రం ప్రభుత్వం ఆమోదించలేదు. అదేమిటంటే, కనీస మద్దతు ధర ఎలా చెల్లించాలనేది? ఎమ్.ఎస్.స్వామినాథన్ ఏమంటాడంటే ఉత్పత్తి ఖర్చులను శాస్త్రీయంగా లెక్క వేసి ఎంతైతో వస్తుందో దానికి అదనంగా 50 శాతం కలిపితే రైతుకు కొంత ఉపశమనం జరుగుతుంది, కొంత లాభదాయకంగా ఉంటుంది అని చెప్పాడు. అనేక కమీషన్లను ప్రభుత్వం వేసింది. ఆ కమీషన్ల రిపోర్టులను అమలు చేయాలని మనం డిమాండ్ చేయాల్సిన అవసరం వుంది. వ్యవసాయరంగానికి ప్రభుత్వం ప్రణాళికా కేటాయింపులు పెంచాలి. బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. అలాగ అనుబంధ రంగాలను కూడా పెంచాలి. వ్యవసాయేతర ఆర్థిక కార్యక్రమాలను ఎక్కువగా కల్పించాలి- రైతులకు, కూలీలకు ఇది ఎక్కువగా ఉప యోగపడ్తుంది.

రైతులకు-విదేశీ, స్వదేశీ దోపిడీదారుల నుండి, బహుళజాతి కంపెనీల నుండి, విదేశీ శక్తుల నుండి రక్షణ కావాలి. కావున మనం బహుళజాతి కంపెనీలకు, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడాలి. ఈ విధంగా మన సంఘం బలంగా ఉన్నపుడే పోరాటాలు చేయగల్గుతాము-రైతు, రైతుకూలీ సంఘాలు అన్నీ కలిసి ఐక్య పోరాటాలు చేసినపుడే, ఐక్య పోరాటాలకు సిద్ధమైనపుడే కొన్ని కొన్ని డిమాండ్స్‌నైనా మనం సాధించు కోగలం. కానీ మన అంతిమ నిర్ణయం-వ్యవ సాయక విప్లవం సాధించుకోవటం! సమ సమాజ స్థాపన కొరకు, అది దీర్ఘకాలిక పోరాటంగా మారాల్సిన అవసరం వుందని భావిస్తూ, రైతుసంఘాలు, రైతు, కూలీలు సంఘటితమై ఈ పోరాటాలు సాగిస్తారని ఆశిస్తూ ఈ అవకాశం నాకు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ముగిస్తున్నాను.

**(24వ పేజీ తరువాయి)**

సంపన్న ఇండియా, దోపిడీ చేసి తాను బలిసిపోవటానికి ఈ పద్ధతిని అను సరిస్తూ నిరుద్యోగ సమస్య అని చెపుతున్నారు. దాని ద్వారా రైతుకూలీలకు చెల్లించాల్సిన వేతనాన్ని తగ్గించివేస్తూ వస్తున్నారు. దాని ద్వారానే ఈ సంపదను గ్రామీణ ప్రాంతాల నుండి నగర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

200 సంవత్సరాల క్రితం రష్యన్ రచయిత టాల్‌స్టాయ్ చెప్పిన విషయాలను **'రెండు దేశాల కథ'** ముగింపులో పేర్కొన్నాను. ఈ దేశంలో మేధావులు, మహామహా నాయకులు అందరూ కూడా రైతాంగానికి సలహాలిస్తారు. కానీ రైతాంగపు మూపులపై నుండి మాత్రం క్రిందకు దిగరు. వారు రైతాంగం భుజాలపై నుండి క్రిందకు దిగితే రైతు తన స్వంత కాళ్ళపై నిటారుగా నిలబడి తన సమస్యలను పరిష్కరించుకోగలుగుతాడు. కానీ ఆ మూపుల మీద నుండి వాళ్ళు దిగరు- మనం వాళ్ళను పడతోయాలి. మనం సగర్వంగా తలెత్తుకొని, నడుమెత్తుకోని నిలవాలి అని చెప్తూ ముగిస్తున్నాను.

**వ్యవసాయం చెయ్యడానికిప్పుడు**
**స్విస్సు బ్యాంకుల్లో ఖాతాలుండాలి**
**నెత్తిన ఖద్దరు కిరీటాలుండాలి**
**బిర్లాలకో-టాటాలకో బామ్మర్దులై ఉండాలి**
**గంధపు చెట్లు, గంజాయి మొక్కలతో**
**పత్తి, పుగాకు పైర్లకి పంటమార్పిడి చేయాలి**
**టేకు, ప్లాంటేషన్లు, టీ ఎస్టేట్లకీ ఆదరువుగా**
**రొయ్యల చెరువుల, గొర్రెల ఫారాలు పెంచాలి.**
**అలా చేయలేని వాడు ఉన్నపళంగా**
**ఏ శూన్య లోయలోకో కందిరీకుడై తరలిపోవాలి.**

సుదేరా
'పొలికేక' నుండి

ప్రసంగ వ్యాసం

# 'నిర్బంధం-సంస్కరణలు ఒకే నాణానికి రెండు పార్శ్వాల వంటివి'



కోటీ 30 లక్షల ఎకరాలు గిరిజనులకు చెందాల్సిన భూమి వారికి చెందకుండా పోయింది. ఇప్పుడు జలయజ్ఞం పేరుతో, అభివృద్ధి పేరుతో బాక్సైట్ మైనింగ్ తోటి ఆ భూమి కూడా లేకుండా, వాళ్ళ గ్రామాలు కూడా అక్కడ లేకుండా తరిమి వేస్తున్నారు పాలకులు. పై పెచ్చు వారిపై అణచివేత మారణకాండ సాగిస్తూ, గిరిజనులను వారి నివాస స్థలాల నుండి గెంటి వేస్తుండగా, గిరిజనుల సాంప్రదాయక హక్కులు గుర్తిస్తున్నామంటూ ఒక కొత్త చట్టాన్ని చేశారు. భారత పాలకులు ప్రజలను వంచించే తమ నైపుణ్యాన్ని ఎంత కళాత్మకంగా అభివృద్ధి చేశారో అర్థమౌతుంది


కా॥ పి.జస్వంతరావు

ఎడిటర్ -'జనశక్తి'


గత ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులందరూ ప్రజల దగ్గరకొచ్చి వేల కోట్ల రూపాయలు మీకు ఇచ్చామని మాట్లాడుతూ వచ్చారు. వాళ్ళను అడగాల్సిన ప్రశ్న- 'ఈ డబ్బంతా ఎక్కడి నుండి వచ్చింది అని!' రైతులను, రైతుకూలీలను చేసిన దోపిడీ కారణంగా పోగుపడిందే ఆ డబ్బంతా!

కౌలు రైతులకు రక్షణ కల్పించటానికి మరో కొత్త బిల్లును ప్రభుత్వం ప్రవేశ పెట్టటానికి పూనుకుందని అంటున్నారు. ఈ రోజున వ్యవసాయంలో ప్రధాన ఉత్పత్తిదారు కౌలురైతుగా ఉన్నాడు. ఈ వాస్తవం ప్రభుత్వానికి తెలుసు. 1950లలోనే కౌలు రైతులకు రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టం చేసింది. ఆ చట్టం కౌలు రైతులకు కల్పిస్తున్న రక్షణ ఏమైంది? ఈ రోజు మరల కొత్తగా కౌలు రైతులకేదో రక్షణ కల్పించేందుకు ఒక చట్టాన్ని తేబోతున్నట్లు చెబుతోంది. ఇంతకు మించిన మోసం మరోటి లేదు. 50-60 సంవత్సరాల కాలంలో తను చేసిన చట్టం ఎందుకు అమలు కాలేదో, కౌలు రైతులకు న్యాయమైన కౌలు రేటు ఎంతో కూడా చెప్ప లేని స్థితి ఎందుకు నెలకొందో, పాలకులు నోరు మెదపటం లేదు-ఇది ఉద్దేశ్యపూరితంగా కౌలు రైతాంగాన్ని దోపిడీ చేసుకొనేందుకు ఉద్దేశించిన చర్యగా స్పష్ట మౌతుంది.

ప్రజల్లో పెరుగుతున్న అశాంతి నుంచి మరలా దారి మళ్ళించటానికే మరో కొత్త చట్టాన్ని చేస్తున్నారు. ఈ విధంగా రైతాంగాన్ని మోసం చేయటానికి మరోమారు ప్రభుత్వం సిద్ధమైంది. ఎప్పుడైతే తమ న్యాయమైన హక్కుల కోసం కార్మికులు, రైతాంగం, ఆదివాసీ ప్రజలు ముందుకొచ్చి సంఘటిత పడి పోరాటాలు సాగిస్తారో, అలాంటి ప్రతి సందర్భంలోనూ పాలకులు పాశవికంగా విరుచుకుపడతారు. మరోప్రక్క పోరాటాలు అవసరం లేదనీ, తామే తగిన చట్టాలు చేస్తామంటూ ముందుకొస్తారు. ప్రజల సంఘటిత స్థితి దెబ్బతిన్న తర్వాత ఆ చట్టాలన్నింటిని ప్రక్కన పెడ్తారు.

కాంగ్రెస్ పార్టీ తను జాతీయ పోరాటానికి నాయకత్వం వహించానని చెప్పుకుంటుంది కానీ, ఏ రోజునా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలకు కాంగ్రెస్ పార్టీ ఎలాంటి కార్యక్రమాన్నీ ఇవ్వలేదు.

నైజాం, తిరువాన్కూర్‌లాంటి సంస్థానాలలో రైతాంగం అత్యంత అణచి వేతకు, దోపిడీకి గురౌతున్న సందర్భంలోనూ, అలాంటి రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ ఎలాంటి కార్యక్రమాన్ని ఇవ్వలేదు. తన కార్యక్రమంలో గ్రామస్వరాజ్యమనే నినాదం ఇచ్చింది తప్ప ఎప్పుడూ దానికి నిర్దిష్టమైన రూపం లేదు.

అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ భూమిని గురించి కానీ, రైతాంగ సమస్యల గురించి కానీ పట్టించుకోలేదు. 'అధికార మార్పిడి' జరుగుతున్న సమయంలోనే కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాపితంగా రైతాంగం జరిపిన పోరాటాలు -తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటమే కాదు-పునప్రవాయిలార్ కానీ, త్రిపురలోకానీ, బెంగాల్ కౌలు రైతుల తెభాగా ఉద్యమం కానీ, ఈ ఉద్యమాలన్నింటి ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పనిసరిగా ముందుకొచ్చి జమిందారీ రద్దులాంటి చట్టాలను చేసింది. గరిష్ట భూపరిమితి చట్టాలు, భూపంపక చట్టాలను చేసింది. మరి, ఈ చట్టాలు అమలు జరిగాయా?

1950లో కేంద్రం చట్టం చేస్తే తిరిగి ఆ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో చేయటానికి మరో రెండు దశాబ్దాలు తీసుకున్నారు. మళ్ళీ ఇది ఎజెండా మీదకొచ్చింది ఎప్పుడు అంటే-శ్రీకాకుళం, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అనంతపురం, కర్నూలు జిల్లాల్లో రైతాంగం తమ హక్కుల కోసం పోరాటాలకు దిగినప్పుడు మాత్రమే ఆ

ఉద్యమాలను పాశవికంగా అణచివేస్తూనే అప్పటి వరకు భూపరిమితి చట్టాలంటూ వచ్చిన వాటికి భూసంస్కరణ చట్టాలని పేరుపెట్టి మన ముందుకు తీసుకొచ్చారనే విషయాన్ని గమనంలో వుంచుకోవాలి.

శ్రీకాకుళం లాంటి చోట్ల పోరాటాల్ని రక్తపుటేరుల్లో ముంచే నాటికి 'ఆదివాసీ ప్రాంతాల్లోకి మైదాన ప్రాంతం వాళ్ళెవ్వరూ రాకూడదు. ఆ భూములు కొనగూడదు' అనే చట్టం వున్నా ఆదివాసుల భూమి అన్యాక్రాంతమైంది. గిరిజనులు కొండల మీదకు వెళ్ళిపోయారు. సారవంత మైన భూములు వదులుకోవాల్సి వచ్చింది. ఆ చట్టాన్ని మరింత పటిష్టం చేస్తామంటూ శ్రీకాకుళ పోరాటం తర్వాత 1970లో మళ్ళీ చేసిన చట్టం 40 సంవత్సరాలు గడిచినా ఈ రోజుకీ అమలు జరపలేదు. కోటీ 30 లక్షల ఎకరాలు గిరిజనులకు చెందాల్సిన భూమి వారికి చెందకుండా పోయింది. ఇప్పుడు జలయజ్ఞం పేరుతో, అభివృద్ధి పేరుతో బాక్సైట్ మైనింగ్ తోటి ఆ భూమి కూడా లేకుండా, వాళ్ళ గ్రామాలు కూడా అక్కడ లేకుండా తరిమివేస్తున్నారు పాలకులు. పై పెచ్చు వారిపై అణచివేత మారణకాండ సాగిస్తూ, గిరిజనులను వారి నివాస స్థలాల నుండి గెంటివేస్తుండగా, గిరిజనుల సాంప్ర దాయక హక్కులు గుర్తిస్తున్నామంటూ ఒక కొత్త చట్టాన్ని చేశారు. భారత పాలకులు ప్రజలను వంచించే తమ నైపుణ్యాన్ని ఎంత కళాత్మకంగా అభివృద్ధి చేశారో అర్థమౌతుంది. బాక్సైట్ తదితర ఖనిజాల మైనింగ్ పేరిట, జలయజ్ఞం పేరిట ఈ రాష్ట్రంలోనే కనీసం 3 లక్షల ఎకరాల్లో భూమిని గిరిజనుల నుండి లాక్కొన్న ప్రభుత్వం గిరిజనుల సాంప్రదాయక హక్కులు కాపాడతానంటూ చట్టం చేసింది.

ఈ దేశంలో పేదలు సంఘటిత పడ్డప్పుడు, తమ హక్కుల కోసం పోరాడు తున్నప్పుడు ప్రభుత్వం ఎంత వంచనకు పూనుకుంటుందో ఆ ఉద్యమాలను ప్రక్కదారి పట్టించి ఏ విధంగా అణచివేస్తుందో అర్థమౌతుంది.

దీనికి వ్యతిరేకంగా మనం తీవ్రమైన పోరాటం చేయాల్సి వుంటుంది. సంఘటితం గానూ, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని జరపాల్సిన పోరాటాలివి. మనకు గతానికి సంబంధించి కూడా ప్రతిక్షణం, ప్రతి అడుగు భారత పాలకులు అనుసరిస్తున్న విధానాలు వాటిల్లో వెూసాలను మనం అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి.

పది రోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలోని బ్యాంకర్లందరితో సమావేశ మయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి నాబార్డు 60 వేల కోట్ల రూపాయల దాకా అప్పులివ్వవచ్చు. వాళ్ళకు ఆ సామర్థ్యం వుంది అన్నారు. సంస్థాగత రుణం ద్వారా రైతాంగ అవసరాలు తీరతాయా అని అడిగితే 20 శాతం మాత్రమే తీరతాయి. మిగతా 80 శాతం రుణాల కోసం రైతాంగం ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడాలి. అంటే ఏం జరుగుతోంది? 'నాబార్డు' అంచనా ప్రకారం కనీసం 3 లక్షల కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం రైతాంగానికి అవసరమైతే సంస్థాగత రుణ సౌకర్యం దాంట్లో పదో వంతు కూడా ఇవ్వటం లేదు.

పైగా, ఈ రైతాంగానికి 70 వేల కోట్ల రూపాయల అప్పు రద్దు చేశాం అంటూ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసు కుంటున్నది. న్యాయంగా అప్పు చెల్లించిన వారికి 5 వేల రూపాయలు 'ఇన్‌సెంటివ్' ఇస్తానని రాజశేఖరరెడ్డి అన్నారు. దీనితోనే ఈ ప్రభుత్వం ఎంతటి రైతాంగ ప్రయో జనాలను కాపాడుతున్నదోనని భ్రమ పడ నవసరం లేదు.

ఈ దేశంలో చిన్నరైతు, పేద రైతు వెన్నెముకలుగా వున్నారు, ఈ ఆర్థిక వ్యవస్థ వాళ్ళను బలపరచాలి. కాగా, ఈ ఆర్థిక వ్యవస్థ వాళ్ళను దివాళా తీయిస్తున్నది. వాళ్ళ ఖర్చులను విపరీతంగా పెంచివేయటమనే రెండు తిరగలి రాళ్ళ మధ్య వేసి నలిపి వేస్తున్నది. దాని ఫలితమే ప్రతి సంవత్సరం అప్పులు పెరిగిపోతూ, కొత్త విధానాలు ప్రవేశపెట్టిన గత 10 ఏళ్ళలో దాదాపు 2 లక్షలమంది రైతాంగం ఆత్మహత్యలు చేసు కున్నారు. ఇది ప్రభుత్వం అంగీకరించిన లెక్కలు.

ఈ అంశాలను దృష్టిలో పెట్టు కొన్నపుడు, ప్రభుత్వం ఉద్దేశ్యపూరితంగా రైతాంగాన్ని నాశనం చేయటానికి, రైతు కూలీలను నాశనం చేయటానికి వారి నుండి భూమిని గుంజి ధనిక వర్గాలకు కట్టబెట్టి, వాటిలో ఈ పేదలను కూలీలుగా దిగజార్చ టానికి పూనుకొన్న ఈ విధానాలకు వ్యతి రేకంగా సంఘటితంగా పోరాడితే తప్ప మన భవిష్యత్, మన పిల్లల భవిష్యత్తు బాగుపడదు.

**పాలకుండలనదొచ్చి పగులగొడ్తది**
**పాడి ఆవులెత్తికెళ్లి చంపి తింటది**
**స్వచ్ఛమైన గింజలంటే కచ్చగడ్తది**
**మైల కలిపినిత్తనాలు మంచివంటది**
**రెట్టతోనే పంటలాకు ప్రాణమంటది**
**అందుకని అన్ని నేను మింగుతంటది**

**అల్లుకున్న గూడులన్ని ఆగమయితవి**
**పర్చుకున్న నీడలన్ని పల్చగయితవి**
**వేపచెట్ల మీద హక్కు నాదేనంటది**
**వేరే పిట్టలొస్తే వెంబడిస్తనంటది**
**పండ్లతోటలుంటే పీకి పందిరేస్తది**
**ఆ పందిరిలో పందులను పెంచమంటది**

గోరేటి వెంకన్న
'గద్దొచ్చే గద్దొచ్చే గద్దొచ్చేరా' నుండి

# 'ప్రజల్ని విభజించి పాలించే పాలకుల కుట్రలకు బలికాకుండా సమైక్య పోరాటాలు సాగిద్దాం'



**ఏ పాలకులైతే ఇంతకాలం అధికారంలో వుండి దేశ, ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైన విధానాలను అమలు చేస్తూ వచ్చారో, వారే మరలా పెద్ద గొంతుతో ఈ ప్రాంతాలు అభివృద్ధి కాకపోవటానికి మరెవరో కారణమని ఆరోపణలు చేస్తూ తమ బాధ్యత నుండి తప్పించుకోవటంతో పాటుగా ప్రాంతాల ప్రజల మధ్య ఆరని విద్వేషాగ్నులు రగిలిస్తున్నారు.**

**కా॥కె.కోటయ్య**
**రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్)**
**రాష్ట్ర కార్యదర్శి**

దేశంలో, రాష్ట్రంలో రైతాంగం, కార్మికులు, అన్ని సెక్షన్ల ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సంఘటితంగానో, అసంఘటితంగానో తిరగబడతూనే వున్నారు. తిరగబడుతున్న ప్రజానీకాన్ని పాలకులు నిర్బంధ చట్టాలతో అణచివేయటమో, పోలీసుల దమనకాండతో రక్తపుటేరులు పారించటమో సాగిస్తూ వున్నారు. మరోవైపున పోరాటంలో వున్న ప్రజలమధ్య కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల సంఘటిత ఐక్య పోరాటాలు తమవైపు ఎక్కుబెట్టబడకుండా జాగ్రత్తపడుతూ వస్తున్నారు.

దేశంలో జలవనరులు విస్తారంగా వున్నప్పటికీ గత ఆరుదశాబ్దాలపైగా పాలన సాగిస్తున్న ప్రభుత్వాలేవీ ఈ జలవనరుల సక్రమ వినియోగానికి కావలసిన పథకాలను వేటినీ చేపట్టకుండా ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చాయి. సామ్రాజ్యవాద ప్రయోజనాలకనుగుణంగా పాలన సాగిస్తున్న ఈ దళారీ పాలకులు దేశాన్ని సమగ్రంగా అభివృద్ధి పరిచే ప్రణాళికలన్నింటినీ తుంగలో తొక్కివేశారు. ఫలితంగా ఈనాటికీ దేశంలో అత్యధిక భాగం భూములకు నీటిపారుదల సౌకర్యంలేక కరువు పీడిత ప్రాంతాలుగా మిగిలి వున్నాయి. అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తుతున్నాయి.

ఏ పాలకులైతే ఇంతకాలం అధికారంలో వుండి దేశ, ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైన విధానాలను అమలు చేస్తూ వచ్చారో, వారే మరలా పెద్ద గొంతుతో ఈ ప్రాంతాలు అభివృద్ధి కాకపోవటానికి మరెవరో కారణమని ఆరోపణలు చేస్తూ తమ బాధ్యత నుండి తప్పించుకోవటంతో పాటుగా ప్రాంతాల ప్రజల మధ్య ఆరని విద్వేషాగ్నులు రగిలిస్తున్నారు.

ఆరు దశాబ్దాల కాలం దాటినా ఈనాటికీ పాలకులు నాగార్జునసాగర్ రెండవ దశ పనులను పూర్తి చేయలేదు. ఒక్క ఎకరాకు కూడా కొత్తగా సాగునీరు అందించే ప్రణాళిక వీళ్ళ వద్ద లేదు. దేశంలో కొన్ని ప్రాంతాలను నిత్యకరువు పీడిత ప్రాంతాలుగా వుంచటం ద్వారా నగరాలలోని బడా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద పరిశ్రమలకు కారుచౌక కూలీలకు ఈ ప్రాంతాలను ప్రధానవనరుగా ఉపయోగిస్తున్నారు. దేశంలోని విస్తారమైన జలవనరులు, మానవ వనరులను భూమితో అనుసంధానం చేస్తే ప్రజల జీవితంలో మౌలిక మార్పు సాధ్యమౌతుంది. దీనికి భిన్నంగా తమ యొక్క ఏ మౌలిక సమస్యలపై ప్రజలు పోరాటాలు సాగించకుండా, అందుకు వారిని ముందుకు రాకుండా వుంచేందుకు ప్రత్యేక తెలంగాణా, విశాల రాయలసీమ, సమైక్యాంధ్ర అంటూ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ చాపక్రింద నీరులాగా ప్రజావ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలనన్నింటినీ అమలు చేసుకుంటూ వెళ్తున్నారు. రైతుకూలీలకు ఉపాధిలేమి, రైతుల గిట్టుబాటు ధరలు కల్పించకపోవటం, నిరుద్యోగ సమస్య, అధికధరలు, సెజ్‌ల ఏర్పాటు, దేశానికి అత్యంత ప్రమాదకరమైన అణు విద్యుత్ కర్మాగారాల స్థాపన, గ్యాస్, ఖనిజ సంపదనంతటిని విదేశీ కార్పోరేట్ సంస్థలకు ధారాదత్తం చేయటం వంటి వాటిని నల్లేరుపై నడకలాగా సాగించుకుంటూ పోవటం ఈ కారణాల వలననే సాధ్యమౌతున్నది. ప్రజల్ని విభజించే పాలకుల ఈ కుట్రలకు బలికాకుండా సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలి.

ప్రసంగ వ్యాసం

# 'అటవీ భూమి, నీరు, వనరులపై హక్కు ఆదివాసులదే'



**గత 18 సం॥ల నుండి కోరాపుట్ జిల్లాలో ఛాషీమూలియా ఆదివాసీ సంఘం అడవి, భూమి, నీటి మీద ఆదివాసులకే హక్కు కావాలని పోరాటం సాగిస్తూ వస్తున్నది. ఒరిస్సా ప్రభుత్వం, గిరిజనుల భూములు గిరిజనులకే దక్కాలనే 2/56 చట్టం చేసింది. ఈ చట్ట ప్రకారం మా భూమి మాకు కావాలని ఆదివాసులు ఆందోళన చేస్తున్నారు.**

**కా॥శ్రీకాంత్ మొహంతి**
**చాషీమూలియా ఆదివాసీ సంఘం ఒడిషా రాష్ట్ర కన్వీనర్**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) మహా సభలకు హాజరైన వారందరికీ విప్లవాభి నందనలు. ఆంధ్రదేశంలోనే కాదు–భారతదేశ వ్యాపితంగా రైతు, కూలీ లంతా చాలా తీవ్రమైన సంక్షోభంలో ఉన్న సమయంలో ఈ మహాసభ జరగటం ప్రత్యేకమైన విషయం. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2 లక్షలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పని దొరకక యువత పెద్ద ఎత్తున పట్టణాలకు తరలి వెళ్తున్నారు. వ్యవసాయానికి సాగునీరు, ఏ పరికరాలూ అందుబాటులో లేవు. పంటకు గిట్టుబాటు ధర లేదు. అనేక దుర్భర పరిస్థితుల్లో రైతు జీవిస్తున్నాడు. మా రాష్ట్రంలో కూడా రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటు న్నారు. ఎందుకు ఈ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు? పాలకుల విధానాలను కూడా చాలా లోతుగా పరిశీలించాల్సిన అవసరం వుంది. కౌలు వ్యవసాయం చేస్తున్న వాళ్ళు ప్రధానంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కౌలు రైతులకు, పేద రైతులకు బ్యాంకులు సరిగ్గా రుణాలు ఇవ్వటం లేదు. దాంతో ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద అప్పు చేస్తూ రుణభారం పెరిగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ఒరిస్సాలోని అనేక ప్రాంతాల్లో సాగు నీటిని ప్రభుత్వం అలక్ష్యం చేసింది. సహజ వనరులైన నీటిని, గనులను బహుళజాతి పరిశ్రమలకు ప్రభుత్వం ఇచ్చివేస్తున్నది. అప్పులు తీర్చలేక భూములను కుదువ బెడ్తున్నారు. పెద్ద కంపెనీలకు భూములను రైతులు అమ్మివేస్తున్నారు. కౌలు రైతులు చాలా తీవ్రమైన శ్రమచేసి పంట పండిస్తున్నారు. కానీ ఇంత కష్టపడుతున్నా పంటకు సరైన గిట్టుబాటు ధర లేదు. అప్పు తెచ్చి పెట్టిన పెట్టుబడి అంతా అలాగే వుండిపోవటం, వడ్డీలు పెరిగిపోవటంతో చాలా తీవ్రమైన నష్టానికి, తీవ్రమైన దోపిడీకి గురౌతున్నారు.

ఈ రోజు దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనేక రైతుకూలీ సంఘాలు పనిచేస్తున్నాయి. ఆ సంఘాలు డిమాండ్ చేస్తున్న విషయమే మంటే పండించిన పంటకు గిట్టుబాటు రేటు కావాలి. సదుపాయాలు కావాలి. సంస్థాగత రుణాలు ఇవ్వాలి. పంటకు కావలసిన సాగునీరును కూడా పాలకులు అందించాలి అని డిమాండ్ చేస్తున్నారు. వ్యవసాయానికి నీరు కావాలని మనం డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం–వ్యవసాయదారులకు కాకుండా పరిశ్రమలకు నీరు ఇస్తున్నది. అదే విధంగా గ్రామీణ ప్రాంతంలో భూమి మీద ఆధారపడి బతుకుతున్న వారికి భూమి కావాలని మనం డిమాండ్ చేస్తుంటే పెద్ద పెద్ద పరిశ్రమలకు వేలాది ఎకరాల భూములను ప్రభుత్వం కేటాయిస్తున్నది. గ్రామాల్లో వ్యవసాయం చేసు కుంటున్న వాళ్ళు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్ళి అప్పులు తీసుకుంటుండగా, పెద్ద పెద్ద కంపెనీలకు లక్షల కోట్ల అప్పులు బ్యాంకులు అందిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్దేశ్యం–పేద రైతులు అందరూ వ్యవసాయం చేయవలసిన అవసరం లేదని! పెద్ద పెద్ద కంపెనీలు వస్తాయిని, కార్పోరేటు వ్యవ సాయం చేసే కంపెనీలలో మీరు కూలీలుగా ఉండాల్సిందే తప్ప మీకు వ్యవసాయం చేయాల్సిన అవసరం లేదని పాలకులు తేల్చి చెప్తున్నారు.

ఒరిస్సా పాలకులు పెద్ద పెద్ద కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఒరిస్సా ఏజన్సీ ప్రాంతాల్లో ఎక్కడైతే కొండ కోనల్లో ఆదివాసీలు నివసిస్తూ వున్నారో ఆ ప్రాంతంలోనే ఖనిజాలు, నిక్షేపాలు వున్నాయి. ఆ ప్రాంతంలోని ఖనిజ వనరులను, సహజ సంపదలను కొల్లగొట్టేందుకు ఆదివాసీల నందరనూ వారి ప్రాంతాల నుండి, అడవుల నుండి వెళ్ళగొడ్తున్నారు. కళింగనగర్‌లో టాటా కంపెనీ తమ భూములను గుంజివేసు

కోవటాన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసులు పోరాటం చేస్తున్నారు–పోస్కో దురాక్రమణలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. పశ్చిమ ఒరిస్సాలో హీరాకుడ్ ప్రాజెక్టు వుంది. సాగుకోసం ఈ ప్రాజెక్టు నీటిని ఇవ్వకుండా అక్కడి పెద్ద కంపెనీలకు నీరు ఇచ్చేందుకు నిర్ణయించారు. దీనికి వ్యతిరేకంగా అక్కడి రైతులు తమకు సాగునీరు కావాలని ఆందోళన చేస్తున్నారు. ఈ అక్రమ ఒప్పందాలకు వ్యతిరేకంగా 'మా వనరులు మాకే కావాలి' అని ఆందోళనలు సాగుతూ వుంటే ఈ ఉద్యమాలను అణచివేయటానికి పాలకులు తీవ్రమైన నిర్బంధం ప్రయోగిస్తు న్నారు. 2006 జనవరి 2న కళింగనగర్‌లో పాలకులు, టాటా కలిసి 12మందిని చంపారు. పోస్కో వ్యతిరేక ఆందోళనలో ఇద్దర్ని చంపారు. కాశీపూర్‌లోనూ ఇదే విధంగా చంపారు. కంపెనీలకు వ్యతిరేక పోరాటాల పైన అణచివేత చేపట్టారు. ఈ పాలకులు సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతి రేకంగా ఒరిస్సాలో, ఆదివాసీ ఛాషీములియా సంఘం నాయకత్వంలో ఉద్యమిస్తున్నాం.

గత 18 సం॥ల నుండి కోరాపుట్ జిల్లాలో ఛాషీమూలియా ఆదివాసీ సంఘం అడవి, భూమి, నీటి మీద ఆదివాసులకే హక్కు కావాలని పోరాటం సాగిస్తూ వస్తున్నది. ఒరిస్సా ప్రభుత్వం, గిరిజనుల భూములు గిరిజనులకే దక్కాలనే 2/56 చట్టం చేసింది. ఈ చట్ట ప్రకారం మా భూమి మాకు కావాలని ఆదివాసులు ఆందోళన చేస్తున్నారు. ఎప్పుడైతే పాలకులు ఈ చట్టాన్ని అమలు చేయకుండా ప్రక్కకు పెట్టారో మేము ఛాషీమూలియా ఆదివాసీ సంఘం తరఫున కోరాపుట్‌లో ఎన్‌టిఎమ్ కంపెనీ ఆక్రమించుకున్న 240 ఎకరాల భూములను సంఘ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నాం. ఈ ఉద్యమాన్ని అణచివేయటం కోసం ప్రభుత్వమే ఒక శాంతి కమిటీని పెట్టింది. శాంతి కమిటీల్లో సభ్యులు ఎవరూ అంటే అక్కడ వుండే కాంట్రాక్టర్లు, దోపిడీదారులు, సారా వ్యాపారులు, షావుకార్లు, పెద్ద పెద్ద కంపెనీలకు సంబంధించిన వాళ్ళు. వీళ్ళంతా ఆ కమిటీలో వుండి, ఆ కమిటీకి అనేక విధాల ఆర్థిక సహాయాలు చేస్తూ, ఈ కమిటీ ద్వారా అక్కడి ఉద్యమాన్ని అణచివేయ చూస్తున్నారు. అక్కడి పాలకులు గిరిజనుల మీద, ఛాషీమూలియా ఆదివాసీ సంఘంపైన తప్పుడు కేసులు పెట్టి నిర్బంధిస్తున్నారు. ఈ వుద్యమాలు ఇంకా తీవ్రం చేయాలి. అక్కడ జరుగుతున్న ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్ళటం కోసం రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) పూర్తి సహాయ సహకారాలందిస్తుందని ఆశిస్తున్నాను.

## నలుగురు కలిసీ

శ్రీశ్రీ

నలుగురు కలిసీ పొరువ్వులు మరచీ
చెయ్యాలి ఉమ్మడి వ్యవసాయం–మన
కష్టం దక్కువ ఫలసాయం–ఇది
రైతులకెంతో సదుపాయం॥

ఒక సంసారం పందెకరాలను
పండించటమే అరుదుకదా–అది
భరించలేని బరువుకదా
పది కుటుంబములు వెయ్యెకరాలను
సాగుచెయ్యడం సులువు కదా॥

మహారాజులూ జమీందారులూ
మచ్చుకు దొరకని కాలంలో–ఈ
ప్రజలే ఏలే రాజ్యంలో
ఇతరుల కష్టం దోచుకు తినడం
ఇకపై సాగే పని కాదు!
ఇదియే సూత్రం ఒక్కడు మాత్రం
భూమిని గుత్తకు కొనరాదు–కడు
సోమరిపోతై మనరాదు
నేలా నీరూ గాలీ వెలుగూ
కొందరి సొత్తని అనరాదు–అవి
అందరి హక్కై అలరారు॥

ఒక్కొక్క వ్యక్తీ సమస్త శక్తి
ధారపోసి పనిచెయ్యాలి–ధన
ధాన్యరాశులే పెంచాలి
కూటికి గుడ్డకు లోటులేక తన
కవసరమైనది పొందాలి॥

# రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభ లు
# 2010 ఏప్రిల్ 12,13,14 తేదీలు

## కార్యకలాపాల సంక్షిప్త నివేదిక
**(2005 జులై నుండి 2010 మార్చి వరకు)**

కామ్రేడ్స్,

దోపిడీశక్తుల పట్టు వ్యవసాయ రంగంపై నానాటికీ తీవ్రమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'మౌలిక వసతుల అభివృద్ధి' కోసమంటూ రోడ్లు, విమానాశ్రయాలు, పోర్టుల ఆధునీకరణకు పెద్ద ఎత్తున నిధులు తరలిస్తూ వ్యవసాయ రంగానికి మాత్రం నామ మాత్రపు కేటాయింపులతో సరిపెడుతున్నారు. బహుళజాతి కంపెనీల, సామ్రాజ్యవాదుల రైతుకు వ్యవసాయంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఏ మాత్రం లభించటం లేదు. మన దేశ రైతాంగానికి తగిన ధర చెల్లించి గోధుమలు సేకరించేందుకు నిరాకరించిన ప్రభుత్వం అంతకన్నా ఎక్కువ మొత్తాలు చెల్లించి విదేశాల నుండి దిగుమతి చేసుకుంటోంది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాల్లో భాగంగా భారతదేశంలో దిగుమతి సుంకాలు తగ్గించిన దిగుమతి విధానాలను అనుసరిస్తున్న ఫలితమే ఇది. ఇక ఆహారధాన్యాల ధరలు, వ్యాపారం-రెండింటి మీద సామాజిక నియంత్రణ కోసమంటూ ఏర్పడిన అగ్రికల్చర్ కాస్ట్ అండ్ ప్రైసెస్ కమీషన్ -భూస్వాముల, మార్కెట్ శక్తుల లాభాలకు, ఒత్తిడులకు లోబడి మద్దతు ధర నిర్ణయిస్తోంది తప్ప పంట పండించే రైతాంగానికి ఉపయోగపడే విధంగా నిర్ణయించటం లేదు.



నివేదిక ప్రవేశపెడ్తున్న కా॥ఎస్.ఝాన్సి; వేదికపై ఎడమ నుండి నర్సయ్య, వర్మ, సునీత (అధ్యక్ష వర్గం); కోటయ్య,నాగరాజు, ఇతరులు

కనుసన్నల్లో, వారి ప్రయోజనాలకనుగుణంగా మన దేశ వ్యవసాయ విధానాల్ని రూపొందిస్తున్నారు. ప్రజలందరి కనీస అవసరాలను తీర్చగలిగిన, దేశాన్ని కనీసం ఆహారధాన్యాల రంగంలోనైనా స్వయం పోషకంగా ఉంచ గలిగిన విధానాలకు ఇందులో చోటులేదు.

ఎరువులు, పురుగుమందులు, విత్తనాల ధరలు విపరీతంగా పెరగడంతో సగటు తర్వాత మలేషియా, యూరోపియన్ దేశాల నుండి ప్రారంభంలో చౌకగా వంటనూనెలు దిగుమతి కాసాగాయి. మన దేశంలో నూనె గింజల సాగు మూలనబడిపోయింది. అంతిమంగా నూనెల విషయంలో దిగుమతులపైనే ఆధారపడే పరాధీనులుగా మార్చబడుతున్నారు. సామ్రాజ్యవాదులకు, మార్కెట్ దళారులకు అనుకూలమైన ఎగుమతి,

మౌలిక సదుపాయాలు-ప్రధానంగా నీటి పారుదల వసతులను కల్పించకపోవటం, భూసంస్కరణలను అమలు చేయకపోవటం. వాణిజ్య పంటలను ప్రోత్సహించే విధానాలు -మన వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు. ఈ విధానాలు దేశ ఆహార భద్రతను, స్వావలంబనను తీవ్రంగా దెబ్బ తీస్తాయన్నది మన దేశ అనుభవమే కాదు;

జింబాబ్వే, సోమాలియా, ఇథియోపియా, లాటిన్ అమెరికా దేశాల అనుభవాలు కూడా చెప్తున్నాయి.. నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, ఎరువులు, పురుగుమందులపై సబ్సిడీ, మార్కెట్ గ్యారంటీ, గోదాముల ఏర్పాటు తదితర మౌలిక సౌకర్యాల కల్పన నుండి ప్రభుత్వం వైదొలగింది. దీని వలన పేద, మధ్యతరగతి రైతాంగానికి వ్యసాయం భారంగా మారింది. భూముల కేంద్రీకరణ మూలంగా నిరంతరం కష్టం చేసే సామాన్య రైతు అదనంగా ఒక్క ఎకరం భూమి కూడా కొనుక్కోలేని స్థితిలో వుంటే, గ్రామాల్లో ఇప్పటికే పాతుకుపోయి వున్న భూస్వామ్య, పెత్తందారీ శక్తులు, నూతన ధనాఢ్య, వ్యాపార వర్గాలు వేల ఎకరాల భూముల్ని స్వంతం చేసుకొంటూ కొత్త ఎస్టేట్లని నిర్మిస్తున్నారు. భూముల నుండి రైతాంగం గెంటివేయబడుతోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతంలో భూస్వామ్య వర్గాల పెత్తనం, సామాన్య జనంపై అదుపు, అధికారం నానాటికీ స్థిరపడుతున్నాయి. దళితులపై, కష్టజీవి మహిళలపై పెత్తందార్ల దాడులు, దౌర్జన్యాలు అనేక రూపాల్లో పెచ్చరిల్లుతున్నాయి.

మారిన పంటల విధానం వల్ల వ్యవసాయ కూలీకి ఏడాదిలో వంద రోజులు పని దొరకడం కూడా మహాకష్టంగా మారింది. దాంతో లక్షల సంఖ్యలో స్త్రీ, పురుషులు ఉపాధిని వెతుక్కొంటూ ఇతర ప్రాంతాలకు, నగరాలకు వలసపోతున్నారు. ఊరుగాని ఊరులో వ్యవసాయ కూలీలుగానో, నగరాల్లో భవన నిర్మాణ కార్మికులుగానో, పరిశ్రమల్లో రోజువారీ కూలీలుగానో పనిచేస్తున్నారు. కనీస నివాస సౌకర్యాలు లేని, హీనమైన పని పరిస్థితుల మధ్య, ఉపాధి గ్యారంటీ లేని స్థితిలో శ్రమ చేస్తున్న ఈ వలస శ్రామికులపై పెత్తందారుల, దళారుల దోపిడీ, పీడన, అత్యాచారాలకు లెక్కలేదు. కనీస వేతన చట్టంగానీ, సమాన పనికి సమాన వేతన చట్టంగానీ అమలయ్యే ప్రశ్నే లేదు.

భూసంస్కరణల చట్టాన్ని నిలువులోతు గొయ్యిలో పాతిపెట్టిన పాలకులు ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతో విదేశీ, స్వదేశీ బడా కంపెనీలకు, ప్రైవేటు వ్యక్తులకు వేలాది ఎకరాల పంటభూముల్నికారుచౌకగా దోచి పెడుతున్నారు. ప్రభుత్వ భూములన్నీ వివిధ రూపాల్లో భూస్వాముల, స్థానిక పెత్తందార్ల, పాలకవర్గ పార్టీల రాజకీయ నాయకుల అనుభవంలో ఉన్నాయి. భూసంస్కరణల అమలు కోసం, ప్రభుత్వ బంజరు, పోరం బోకు, దేవాదాయ భూములను భూమిలేని పేదలకు పంచాలని ఉద్యమిస్తున్న ప్రజలపై పాలకవర్గాలు, ప్రభుత్వ యంత్రాంగం విరుచుకు పడుతున్నాయి. అనేక రూపాల్లో నిర్బంధం ప్రయోగిస్తున్నాయి.

మన రాష్ట్రంలో అధిక సంఖ్యలో వున్న కౌలు రైతులను ప్రభుత్వం అసలు సాగుదారులుగానే గుర్తించడం లేదు. కౌలు రైతులకు రుణసౌకర్యంగానీ, ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా నష్టపరిహారంగానీ, ఇతర రాయితీలు గానీ ఏవీ అందటం లేదు.

రాష్ట్రంలోని ఏజన్సీ ప్రాంతంలో పెద్ద ఎత్తున భూములు అన్యాక్రాంతమై వున్నాయి. మన రాష్ట్రంలో 1/70 చట్టం, మన పొరుగు రాష్ట్రమైన ఒరిస్సాలో 2/56 చట్టాలకు తూట్లు పొడిచి, ఏజన్సీలోని భూమిని, అటవీ సంపదను, సహజవనరుల్ని గిరిజనేతర భూస్వాములకు, కాంట్రాక్టర్లకు, స్మగ్లర్లకు, బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకుంటోంది. అటవీ ఉత్పత్తులకు న్యాయమైన ధరలేక, భూములు అన్యాక్రాంతమై, తాగునీరు, వైద్యం, విద్యా సౌకర్యాలు కనీస స్థాయిలో కూడా అందుబాటులో లేక ఆదివాసులు హింసతో కూడిన చాకిరీ చేస్తూ దుర్భరమైన జీవనం గడుపుతున్నారు. సామాన్యమైన రోగాలకు కూడా మందు దొరికే దారిలేక, పోషకాహారం లేక పిట్టల్లా రాలిపోతున్నారు. అటవీ ఉత్పత్తులకు జిసిసి చెల్లించే ధర గత పాతికేళ్ళ నుండి ఒక్క రూపాయి కూడా పెంచలేదు. భూముల నుండి, అడవి నుండి ఆదివాసీలను దూరం చేసే ప్రభుత్వ చర్యలు దొడ్డిదారిన అమల్లోకి వస్తున్నాయి.

బహుళజాతి కంపెనీల, బడా వ్యాపార సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ప్రజాధనంతో ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టి, లక్షలాది మంది ప్రజల్ని నిర్వాసితుల్ని చేస్తోంది. దోపిడీవర్గ ప్రయోజనాల్ని అత్యంత భక్తిశ్రద్ధలతో కాపాడుతున్న పాలకులు, అధికార యంత్రాంగం–ప్రజలకు న్యాయమైన నష్టపరిహారం, పునరావాసం కల్పించటంలో చాలా ఘోరంగా, క్రూరంగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ జీవనంతో పెనవేసుకొని వున్న, అధికశాతం ప్రజలకు ఉపాధిరంగంగా వున్న చేనేత తదితర చేతివృత్తుల్లో శ్రామికులు చాలా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు చేతివృత్తులకు మార్కెట్‌ను గ్యారంటీ చేయకుండా, ఆయా రంగాల వారికి ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించకుండా, వాటి భవిష్యత్తును బడా కంపెనీల దయాదాక్షిణ్యాలకు వదిలేశాయి. చేనేత కార్మికుల ఆకలిచావులు, ఆత్మహత్యలు దీని పర్యవసానమే.

అంతర్జాతీయ ద్రవ్య సంస్థ ఆదేశాలకు, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు అనుగుణంగా, భూస్వామ్య, పెత్తందారీ శక్తుల్ని స్థిరపరచే విధంగా భారత పాలకులు వ్యవసాయరంగాన్ని మలుస్తున్నారు. పేద, మధ్య తరగతి రైతాంగాన్ని,రైతుకూలీలను భూముల నుండి గెంటివేసి, కార్పొరేట్ వ్యవసాయం పేరుతో, సెజ్‌ల పేరుతో భూకేంద్రీకరణ సాగిస్తున్నారు. సొంతగడ్డ మీదే

**పాశవిక ప్రభుత్వ నిర్బంధ చట్టాలను, చర్యలను ప్రతిఘటించడం, ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాడటం రైతుకూలీసంఘం ఆశయం. నిర్బంధానికి, అణచివేతకు వ్యతిరేకంగా సాగుతున్న కార్మిక, ఉద్యోగ, విద్యార్థి, ఉపాధ్యాయ, పట్టణ పేదల ప్రజాతంత్ర హక్కుల ఉద్యమాలలో రైతుకూలీసంఘం భుజం భుజం కలిపి పోరాడుతుంది.**

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర) 'లక్ష్య ప్రకటన' నుండ**

ప్రజల్ని దిక్కులేనివారిగా, నిర్వాసితులుగా చేయపూనుకుంటున్నారు.

అనేక పార్శ్వాలతో, అనంఖ్యాక రూపాల్లో వెల్లడవుతున్న వ్యవసాయరంగ సంక్షోభానికి సమగ్రమైన, సమూలమైన పరిష్కారం కోసం పోరాడాలి. ఉద్యమాలు నిర్మించాలి. అటువంటి ఉద్యమ నిర్మాణ కృషిని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) తన శక్తి వంచన లేకుండా నిరంతరాయంగా సాగిస్తూ వస్తోంది. సోదర కార్మిక సంఘాలు, మహిళా సంఘాలు, యువజన, విద్యార్ధి సంఘాలు తీసుకుంటున్న అనేక ఆందోళనా కార్యక్రమాలతో రైతుకూలీసంఘం తన గొంతును కలుపుతున్నది. ప్రజల హక్కుల్ని, న్యాయమైన డిమాండ్లను సాధించుకోవటంలో, ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయడంలో, భూస్వామ్య పెత్తందారీ శక్తుల దోపిడీ దౌర్జన్యాలను ఎదిరించి ప్రజల్ని నడిపించడంలో, సామ్రాజ్యవాద దోపిడీ శక్తుల కుట్రల్ని బట్టబయలు చేయడంలో తాను కృషి సాగిస్తున్న ప్రాంతాలలో రైతుకూలీసంఘం ఒక గుర్తింపు గలిగిన నాయకునిగా నిలిచింది. రైతుకూలీ సంఘం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సాగించిన విస్తారమైన ఉద్యమ, పోరాట కార్యకలాపాలు దీన్నే తెలియజేస్తాయి.

(2007 వార్షిక సంచికలో రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో ఆనాటి వరకు చేసిన కృషి క్లుప్తంగా పేర్కొనబడింది.)

## జయతీఘోష్ కమీషన్ సిఫార్సుల అమలు కోసం

భూసంస్కరణలు అమలు జరిపి పేదలకు భూములు పంచాలని, రైతులందరికీ ప్రభుత్వమే పంట రుణాలు తక్కువ వడ్డీకి యివ్వాలని, అప్పులు రద్దు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు యిచ్చి మార్కెట్ సౌకర్యం కల్పించాలనీ, ఉపాధి అవకాశాలు కల్పించి వలసలు నివారించాలని మొదలైన సూచనలతో ప్రభుత్వానికి జయతీఘోష్ నివేదిక అందచేసింది. ప్రభుత్వం ఈ సిఫార్సులు వేటినీ ఇంతవరకు అమలు జరపటానికి చర్యలు తీసుకోలేదు. వ్యవసాయరంగ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో–గత రాష్ట్ర మహాసభల వెనువెంటనే జయతీఘోష్ కమీషన్ ముఖ్య సిఫార్సులు అమలు జరపమని డిమాండ్ చేస్తూ 2005 జులైలో రాష్ట్ర వ్యాపిత ఆందోళనకు రాష్ట్ర కార్యవర్గం పిలుపు యిచ్చింది. ఈ పిలుపునందుకొని రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సదస్సులు, ధర్నాలు, ఊరేగింపులు స్వతంత్రంగానూ, ఐక్యకార్యాచరణగానూ జరిగాయి. జయతీఘోష్ కమీషన్ సిఫార్సులను వివరిస్తూ ఒక బుక్‌లెట్‌ని ప్రచురించి, విస్తృత ప్రచారం, ఆందోళన చేపట్టడం ద్వారా–తావే నియమించిన కమీషన్ సూచనలను కూడా అమలు చేయని ప్రభుత్వ వంచనాత్మక విధానాలను వెల్లడి చేయగలిగాం.

## డబ్ల్యుటిఓ నుండి భారత్ బయటకు రావాలని డిమాండ్ చేస్తూ

భారత ప్రజానీకాన్ని, రైతాంగాన్ని, సామ్రాజ్యవాద రథచక్రాలకు మరింతగా బంధించనున్న పెను ప్రమాదాన్ని గుర్తెరిగి, హెచ్చరిస్తూ, రైతుకూలీసంఘం రాష్ట్ర వ్యాపిత కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిలో భాగంగా 2005 నవంబర్ 23న హైద్రాబాద్‌లో 'సామ్రాజ్యవాద ప్రపంచీకరణను, ప్రపంచ బ్యాంక్ పెత్తనాన్ని' వ్యతిరేకిస్తూ ఏపిఎఫ్‌టియుతో కలిసి రాష్ట్ర సదస్సు నిర్వహించి, రైతుకూలీసంఘ సభ్యులు, కార్యకర్తలకు ఒక స్పష్టమైన అవగాహనను అందించాం.

ఈ సదస్సులో ప్రముఖ పాత్రికేయులు శ్రీ.వి.హనుమంతరావు ప్రారంభోపన్యాసం చేశారు. 'వ్యవసాయరంగంపై డబ్ల్యుటిఓ దుష్ఫలితాలు' అంశంపై సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఎస్.ఝాన్సి; 'డబ్ల్యుటిఓ ఏర్పడిన తరువాత మూడవ ప్రపంచ దేశాల సంక్షోభం', అంశంపై ముంబాయి యూనివర్శిటీ ప్రొఫెసర్ అఫ్సర్ హెచ్.జాఫ్రీ; 'డబ్ల్యుటిఓ–వ్యవసాయరంగం' అనే అంశంపై డా॥కె.ఆర్.చౌదరి; 'ప్రాజెక్టులు–పునరావాసం' అంశంపై ఓపిడిఆర్ రాష్ట్ర కార్యదర్శి సి.భాస్కరరావు; 'పారిశ్రామిక రంగం–కార్మికులు' అంశంపై కా॥జి.విజయకుమార్; 'సామ్రాజ్యవాద ప్రపంచీకరణ–ఆర్థిక, రాజకీయ పర్యవసానాలపై కా॥పి.జస్వంతరావు, ఇంకా రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥కె.కోటయ్య–లు ఉపన్యసించారు.

అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి ఊరేగింపు జరిగింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నుండి భారత్ వైదొలగాలని, హాంకాంగ్ సదస్సుకి వ్యతిరేకంగా డిసెంబర్ 13 నుండి గ్రామీణ–పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచార క్యాంపెయిన్ జరపాలని సదస్సు పిలుపు యిచ్చింది. సదస్సు ప్రసంగాలతో వెనువెంటనే బుక్‌లెట్‌ను ప్రచురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాము.

డిసెంబర్ 13–18 తేదీలలో రైతుకూలీ సంఘం స్వతంత్రంగానూ, వివిధ సోదర ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో వివిధ రూపాలలో–ప్రదర్శన, దిష్టిబొమ్మ దగ్ధం, సదస్సు, సైకిల్ ర్యాలీ, రాస్తారోకో–తదితర నిరసన ఆందోళనా కార్యక్రమాలను చైతన్యయుతంగా నిర్వహించింది. సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యాన్ని పెంపొందించింది.

## సెజ్‌ల ఏర్పాటుకి వ్యతిరేకంగాను, 9/77 అసైన్డ్ చట్ట సవరణ రద్దు కోసం

సామ్రాజ్యవాదులకు ఊడిగం చేసే విధానాలకు పరాకాష్టగా దేశంలోని వనరులను, సహజసంపదలను, విదేశీ బహుళజాతి కంపెనీలకు, సామ్రాజ్యవాదులకు దోచిపెట్టేందుకు 'ప్రత్యేక ఆర్థిక మండళ్ళ' పేరిట 'ప్రైవేట్ రాజ్యాల'ను నెలకొల్పే విధంగా భారత ప్రభుత్వం సెజ్–2005 చట్టాన్ని చేసింది. ఆ చట్టం అమలులో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలలోను, ప్రత్యేకించి మన రాష్ట్రంలోను అనేక ఆర్థిక మండళ్ళకు ప్రభుత్వం అనుమతులనిచ్చింది. మరిన్ని ఆర్థిక మండళ్ళకు అనుమతినివ్వటానికి సిద్ధంగా ఉంది. సెజ్‌ల ఏర్పాటు కోసం వందల, వేల ఎకరాల భూములను రైతాంగం నుండి బలవంతంగా గుంజుకొని

బహుళజాతి పరిశ్రమలకు, బడా కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకొంది. సెజ్-2005 చట్టం ఫలితంగా వ్యవసాయ రంగంలో ఏర్పడనున్న విపత్తులను, అభివృద్ధి పేరుతో పాలకులు సాగిస్తున్న రైతాంగ వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను వివరిస్తూ రైతుకూలీసంఘం తరఫున 2006 అక్టోబరులో బుక్‌లెట్ తీసుకువచ్చి, రాష్ట్ర వ్యాపితంగా విస్తృత ప్రచారం చేపట్టాము.

అసైన్డ్ భూములు పేదల నుండి అన్యాక్రాంతం కాకూడదని చేసిన పోరాట ఫలితంగా రాష్ట్ర పాలకులు 9/77 అసైన్డ్ చట్టాన్ని చేశారు. ఈ చట్టం ద్వారా అసైన్డ్ భూముల అమ్మకం-కొనుగోళ్ళు నిషేధించ బడ్డాయి. ప్రజలకు భూములు యిచ్చిన ప్రభుత్వం, వాటిని సాగుచేయటానికి కావాల్సిన ఆర్థిక సహాయం, పరికరాలు అందచేయకపోవటం వలన బీళ్ళుగా ఉన్న ఆ భూములను వారు సాగుచేయలేని స్థితిలో భూస్వాములు, సంపన్నవర్గాలు, పెత్తం దారులు వాటిని స్వాహా చేశారు. 20 లక్షల ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమైనట్లు కోనేరు రంగారావు కమిటీ ప్రకటించింది. భూములు అన్యాక్రాంతం అవుతుండటం ప్రభుత్వానికి, రెవెన్యూ అధికారులకు తెలిసినా దాన్ని నివారిం చేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోలేదు.

అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతుంటే ఎటువంటి స్పందన చూపని పాలకులు, ఇప్పుడు భూములు అన్యాక్రాంత మైనాయని వాటిని స్వాధీనం చేసుకోవటానికి 9/77 చట్టానికి సవరణ చేస్తూ ఆర్డినెన్స్ తెచ్చి శాసనసభలో ఆమోదం పొందారు. ప్రభుత్వం చట్టాన్ని సవరించటానికి చెప్పిన కారణాలు వంచనతో కూడినవి తప్ప మరొకటి కాదు. అసైన్డ్ చట్టంలోనే ఉన్న ఆ అన్యాక్రాంత భూములు స్వాధీనం చేసుకొని లబ్ధిదారులకు గాని లేక మరో లబ్ధిదారునికిగాని ఇవ్వాలనే క్లాజును తొలగించారు. ప్రస్తుత సవరణ ప్రకారం స్వాధీనం చేసుకొన్న భూములను తన ఇష్టానుసారం వినియోగించుకునే హక్కును ప్రభుత్వం పొందింది. ఇది, భూములను-భూస్వాములకు, బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టడానికి చేయబడినదే. ఆ అధికారంతో భూస్వాముల ఆక్రమణలో వున్న భూములకు చట్టబద్ధతతోపాటు, స్వాధీనం చేసుకొన్న భూములను ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేర సామ్రాజ్యవాదులకు కట్ట బెట్టేందుకు ప్రభుత్వం పూనుకున్నది.

ఈ నేపథ్యంలో సెజ్ 2005 చట్టాన్ని రద్దు చేయాలని, 9/77 చట్ట సవరణ రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్స్‌తో 2006 నవంబర్ 6న రాష్ట్రవ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నా కార్యక్రమాలను నిర్వహించాలని ఇచ్చిన రాష్ట్ర కార్యవర్గం పిలుపు ననుసరించి సంఘ నిర్మాణం వున్న అన్ని జిల్లాల్లోనూ విస్తృత రాజకీయ ప్రచారం, జిల్లా కేంద్రాలలో సంఘం ఆధ్వర్యంలో ధర్నా, ప్రదర్శన, సదస్సుల రూపంలో చైతన్య యుతంగా కార్యక్రమాలు జరిగాయి. దీని కొనసాగింపుగా వివిధ జిల్లాల్లో ప్రత్యేక ఆర్థిక మండళ్ళ వ్యతిరేక ఆందోళనలు కొన సాగాయి.

మంగళగిరి ప్రాంతంలో పెదవడ్లపూడి హై లెవల్ ఛానల్ క్రింద 3 వేల ఎకరాల్లో మంచి పంటలు పండే ప్రాంతాన్ని నాలెడ్జ్ పార్కు పేరిట ప్రభుత్వం సేకరించి, రైతాంగాన్ని భూముల నుండి గెంటివేయ పూనుకుంది. సుక్షేత్రమైన భూములను కబళించటానికి వ్యతిరేకంగా పార్టీలకతీతంగా రైతాంగమంతా ఐక్యకార్యాచరణలోకి వచ్చారు. రైతుకూలీసంఘంగా నాలెడ్జ్ పార్కు పేరుతో వ్యవసాయాన్ని దెబ్బతీసే ప్రమాదాన్ని వివరిస్తూ కరపత్రం వేసి, పరిసర గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారంతోపాటు, ఐక్యకార్యా చరణలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. గ్రామ గ్రామాన ప్రచారం, సభలు నిర్వహించటం, మండల స్థాయిలో ధర్నాలు, నిరసనలు; మంత్రులకు, ముఖ్యమంత్రికి విజ్ఞప్తులు; జిల్లా స్థాయిలో ఆందోళనలే కాక విజయవాడ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యాలయానికి పెద్ద ఎత్తున రైతాంగం కదిలివచ్చి మిలిటెంట్‌గా నిరసన కార్యక్రమం నిర్వహించటం, సమస్యను వదలకుండా నిరంతర కార్యక్రమాలను చేపట్టిన ఫలితంగా ప్రభుత్వం ఒక అడుగు వెనక్కు వేయక తప్పలేదు. భూముల స్వాధీనానికి నోటీసులిచ్చినప్పటికీ బల వంతపు సేకరణకు పూనుకోకుండా తాత్కా లికంగా ఆగింది.

అదే విధంగా గుంటూరుజిల్లా, నిజాంపట్నం మండలం దిండి ప్రాంతంలో రసాయన కర్మాగారాల సముదాయం కోసమని, 12 గ్రామాలలోని వందలాది ఎకరాల తీర ప్రాంత భూములను సేకరించే ప్రభుత్వ ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ, తీరప్రాంత మత్స్యకారుల, ప్రజల జీవనానికి రానున్న ప్రమాదాన్ని వివరిస్తూ సంఘ నాయకత్వంలో విస్తృత ప్రచార క్యాంపెయిన్ చేశారు. దిండి గ్రామానికి ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం వచ్చిన అధికార యంత్రాంగానికి కూర్చొనే వసతి కూడా లేకుండా చేసిన ఆందోళనల్లో సీనియర్ నాయకులు కామ్రేడ్ ముత్తిరెడ్డి శ్రీరాములు కూడా పాల్గొని, రసాయన కర్మాగార నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజాగ్రహాన్ని చాటిచెప్పారు. ఈ ప్రతిపాదన తాత్కాలికంగా ఆగింది.

గుంటూరు, చిలకలూరిపేట మధ్యన టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం పేరిట మూడువేల ఎకరాల భూములను సేకరించేందుకుగాను ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని పార్టీలక తీతంగా స్థానిక రైతాంగం ఎదుర్కొని అడ్డు కున్నారు.

కృష్ణాజిల్లా కంచికచర్ల ప్రాంతంలో 1602 ఎకరాల భూములను అపెరల్ పార్కు పేరిట విదేశీ కంపెనీలకు కట్టబెట్టే చర్యలను నిరసిస్తూ రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో గ్రామాల స్థాయిలో విస్తృత ప్రచారం, నిరసన ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. భూముల స్వాధీనానికి సర్వే కోసం వచ్చిన కంచికచర్ల ఎమ్మార్వోను, సిబ్బందిని రెండు సార్లు ప్రజలు అడ్డుకొని తిప్పి పంపారు. ప్రభుత్వం తన ప్రయత్నాలను ఇంకా అమలు చేసే ప్రయత్నాన్ని నిరసిస్తూ విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద తీవ్ర నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు వ్యతిరేకంగా కృష్ణాజిల్లా

సదస్సు నందిగామలో జరిపారు. రాష్ట్ర నాయకత్వం పాల్గొన్న ఈ సదస్సు ద్వారా అనేకమంది మేధావుల, ప్రజాతంత్రవాదుల మద్దతును సమీకరించారు. కంచికచర్ల అపెరల్ పార్కుకు వ్యతిరేకంగా నిరంతరాయంగా, ముఖ్యంగా రైతుకూలీసంఘం ఆధ్వర్యాన సాగిన ప్రచార, ఆందోళనా కార్యక్రమాల ఫలితంగా భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వం తాత్కాలికంగా ఆపివేయక తప్పలేదు.

నెల్లూరుజిల్లా చింతవరంలో ప్రత్యేక ఆర్థికమండలి పేరున శ్రీలంక మాస్ హోల్డింగ్ కంపెనీకి వందల ఎకరాల భూములు ఇవ్వాలని ప్రభుత్వం పూనుకొని భూముల సర్వేకి వచ్చిన సందర్భంలో రైతులు ప్రభుత్వ యంత్రాంగాన్ని అడ్డుకున్నారు. రైతుల ఆగ్రహాన్ని చవిచూసిన అధికార యంత్రాంగం ఒక అడుగు వెనక్కు వేసి స్థానిక పెత్తందార్ల ద్వారా కుట్రలు సాగించారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని నేదురుమల్లి జనార్దనరెడ్డి పూనుకొని ముందుగా పెద్ద రైతులను కూడగట్టాడు. పట్టా పొలాలను ముందు స్వాధీనం చేసుకున్నారు. అసైన్‌మెంట్ పట్టాలున్న రైతులను విడగొట్టి బెదిరించారు. పట్టాలు లేకుండా బంజరు భూములను సాగు చేసుకొంటున్న రైతులు చివరకు మిగిలారు.

మొదటి నుండీ ఈ గ్రామంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు భూములు వదులుకోవడానికి వ్యతిరేకంగా వున్న రైతులను ఆశ చూపి, బెదిరించి, విడగొట్టి లోబరుచుకున్నారు. చివరకు పట్టాలులేని సాగుదార్లు రైతుకూలీసంఘం నాయకత్వంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు జరపడమేకాక పోలీసు హెచ్చరికలకు లొంగకుండా, భూములు వదలకుండా భూముల్లో పైర్లు వేసేందుకు పూనుకోవడంతో ప్రభుత్వ యంత్రాంగం దిగివచ్చి వారికి కూడా నష్ట పరిహారం ఇచ్చేందుకు అంగీకరించక తప్ప లేదు.

## ముదిగొండ కాల్పులను నిరసిస్తూ

వై.ఎస్.రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక తాను వాగ్దానం చేసిన పేద ప్రజలకు ఇళ్ళ స్థలాలు, భూమి సమస్యలు గాలికి వదిలేశాడు. చారెడు నేల కోసం, కుంట భూమి కోసం ప్రజలలో ఆందోళన తీవ్రమైంది. సామ్రాజ్యవాదులకు, బడా పెట్టుబడిదారులకు వేల ఎకరాల భూములను కారు చౌకగా కట్టబెడుతున్న ప్రభుత్వం-నిరు పేదలు తలదాచుకోను నీడ కోసం ఉద్య మిస్తే సహించలేకపోయింది. 2007 జులై 27న వివిధ జిల్లా కలెక్టరేట్ల వద్ద జరిగిన ధర్నా, పికెటింగ్ కార్యక్రమాలపై తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. లాఠీఛార్జి, వాటర్ కానన్‌లు, గుర్రాలను ప్రయోగించారు. ప్రభుత్వ ఈ దమనకాండను ఖండిస్తూ, ప్రజల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జులై 28న జరిగిన రాష్ట్ర బంద్ సందర్భంగా వివిధ మండలాలు, జిల్లా కేంద్రాల్లో రైతుకూలీ సంఘం, ఇతర సంఘాలు, పార్టీలతో కలిసి పాల్గొంది.

ఈ బంద్ సందర్భంగా ఖమ్మంజిల్లా ముదిగొండలో జులై 28న నిరాహారదీక్షా శిబిరంపై పోలీసు మూకలు సాగించిన పాశవిక హత్యాకాండలో మొత్తం 7గురు నిరుపేదలు ప్రాణాలు కోల్పోయారు. జులై 28 మారణకాండను ఖండిస్తూ మరునాడే జులై 29న రాష్ట్ర వ్యాపితంగా పెద్ద ఎత్తున ప్రభుత్వ వ్యతిరేక ప్రజా నిరసన వ్యక్తమైంది. ఇతర సంఘాలతో కలిసి రైతుకూలీసంఘం ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నది.

## పోలవరం ప్రాజెక్టు పునరావాసం కోసం-భూమికి భూమి, అడవికి అడవి కోసం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఏ వర్గానికి ఉపయోగమో అన్న విషయాన్ని ప్రక్కకు పెడితే శాస్త్రీయమైన పునరావాసం కల్పించకుండా భూములు, గ్రామాలు ఖాళీ చేయబోమని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గిరిజన-గిరిజనేతర ప్రజలు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర), ఏజన్సీ గిరిజన సంఘం నాయకత్వంలో పెద్ద ఎత్తున మిలిటెంట్ ఆందోళనలకు పూనుకున్నారు. 276 గ్రామాలు, ఒక లక్షా యిరవై వేలమంది పునరావాసం కోసం డిమాండ్ చేస్తున్నారు.

పోలవరం కాలువల భూమి పూజ కొరకు 2004 సెప్టెంబర్ 25న ముఖ్యమంత్రి పోలవరం మండలం కొవ్వాడకు వచ్చిన సందర్భంగా సమగ్ర పునరావాస విధానం గురించి రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఏజన్సీ గిరిజన సంఘాల నాయకత్వంలో గిరిజనులు మెమోరాండం యిచ్చారు. 2004 నవంబర్ 8న సమగ్ర పునరావాస సాధన కోసం కమిటీని ఏర్పాటు చేసుకొన్నారు. 2వేలమంది గిరిజన-గిరిజనేతర ప్రజలు ప్రదర్శనగా వెళ్లి ముఖ్యమంత్రికి మెమోరాండం యిచ్చారు. భూమికి భూమి, అడవికి అడవి, ముందు పునరావాసం తర్వాత పని అని నినదించారు. కలెక్టరు గ్రామాలకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని ముఖ్యమంత్రి హామీ యిచ్చారు. ఈ హామీని అమలు జరపకుండా అధికారులు పనులు ప్రారంభించడంతో వందలాది మంది గిరిజనులు 2005 ఏప్రిల్ 27న పోలవరం ఎంఆర్ఓ కార్యాలయాన్ని ముట్టడించి కలెక్టర్ రావాలని డిమాండ్ చేశారు సమగ్ర పునరావాసం అమలు జరగాలని 2005 మే 13న దేవీపట్నంలో సదస్సు జరిపారు. పునరావాస విధానాన్ని ప్రభుత్వం జి.వో.నెం.68/2005ను ఏప్రిల్ 8న ప్రకటించింది. పశ్చిమ గోదావరిలో గిరిజనులు ప్రాజెక్టు పనులను నిలిపివేయించి, ప్రొక్లెయిన్‌లు వెనక్కి పంపే కార్యక్రమం ఏప్రిల్ 26నుండి ప్రారంభించారు.

పోలవరం ప్రాజెక్టు పేరుతో గిరిజన రైతాంగ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ విధానాలకు నిరసనగా పోలవరంలో ప్రదర్శన -బహిరంగ సభకు 17.1.2006న గిరిజన సంఘం పిలుపు యిచ్చింది. ఈ సభలో భారత జన ఆందోళన్ నాయకులు డా॥బి.డి.శర్మ పాల్గోవలసి వుంది. ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ప్రాజెక్టు నిర్వాసిత ఆందోళన నాయకులను వేధిస్తూ, వెంటాడుతున్న పోలీసుల చర్యలను నిరసిస్తూ రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, హోంమంత్రి, మానవహక్కుల కమీషన్‌కు, కేంద్ర, రాష్ట్ర

ఎస్.సి., ఎస్.టి., కమీషనర్లకు, మంత్రులకు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి రైతుకూలీ సంఘం(ఆం.ప్ర), ఫ్యాక్స్ ద్వారా సమాచారాన్ని అందించి తగిన చర్యలు తీసుకోమని కోరింది.

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి సరైన పునరావాస చర్యలు చేపట్టాలంటూ, విద్య-వైద్యరంగాలలో ప్రభుత్వ నిర్లక్ష్యం, గిరిజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, జీవించే హక్కు కోసం, గిరిజన చట్టాల అమలు కోసం, గిరిజన-గిరిజనేతర పేదలు ఐక్యం కావాలని 21.6.2006న ఐ.టి.డి.ఏ ఆఫీసు వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం ఆందోళన చేసింది. ఈ సందర్భంగా 5వేల కరపత్రాలు ముద్రించి ప్రచారం చేశారు.

సుప్రీంకోర్టు నియమించిన సాధికారిక కమిటీ పోలవరం ప్రాజెక్టుని, త్రవ్వకాలను పరిశీలించేందుకు 29.7.06న పోలవరం వస్తున్న సందర్భంగా సాధికారికకమిటీకి ఈ ప్రాంతంలో భూములను, ఇళ్ళను కోల్పోతున్న గిరిజనుల గుండె చప్పుళ్ళు వినిపించాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) కరపత్రం వేసి విస్తృతంగా ప్రచారం చేసింది. ప్రజలు సాధికారిక కమిటీని కలిసే అవకాశం లేకుండా అధికారులు చేసిన ప్రయత్నాలను రైతుకూలీసంఘం నాయకత్వంలో అడ్డుకొని వందలాది గిరిజనులు ప్రదర్శన జరిపి సమగ్ర మైన వివరణలతో కమిటీకి మెమోరాండం ఇచ్చారు. ఈ ఆందోళన చేస్తున్న రైతుకూలీ సంఘ కామ్రేడ్స్‌పై అక్రమ కేసులు బనా యించి జైళ్ళ పాలు చేశారు. ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘం (ఆం.ప్ర) 4-8-06న పోలవరం ప్రాజెక్టు వద్ద రాస్తారోకో అనంతరం తాసీల్దారు ఆఫీసు వద్ద ధర్నా చేశారు.

పునరావాసం కోసం నిలదీస్తున్న పేద ప్రజలపై అధికార యంత్రాంగం కవ్వింపు చర్యలను విడనాడాలని డిమాండ్ చేస్తూ; గిరిజన, గిరిజనేతరుల మధ్య వైషమ్యాలు పెంచే అధికారుల చర్యలను ఖండిస్తూ, 23.9.2007న ఏజెన్సీ గిరిజన సంఘం కరపత్రాలు ముద్రించి విస్తృత ప్రచారం చేసింది.

ఏజెన్సీలోని భూవివాదాలు పరిష్కరించాలని, నకిలీ పట్టాలు, నకిలీ పాస్ పుస్తకాలు రద్దు చేయాలని, గిరిజనేతర భూస్వాముల చేతుల్లో ఉన్న గిరిజన భూములను గిరిజనులకు అప్పగించాలని, జస్టిస్ బి.ఎస్.ఐ స్వామి తీర్పుకు అనుగుణంగా అన్ని సెటిల్‌మెంట్ ఆర్డర్లు రద్దుచేసి గ్రామసభల సమక్షంలో భూవివాదాలు పరిష్కరించాలని, భూవివాదాలు పరిష్కరించకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టరాదని, రాజ్యాంగం లోని 5వ షెడ్యూలుకు భిన్నంగా అటవీ భూములు స్వాధీనం చేసుకోరాదని, గిరిజనులపై మోపుతున్న అక్రమ కేసులు రద్దు చేయాలని 19.11.2007న ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో ఉదయం 10గం. ప్రారంభమైన ధర్నా సాయంత్రం 4 గంటల వరకు సాగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజన, గిరిజనేతర రైతుకూలీలు 1500మంది ఈ ధర్నాలో మిలిటెంట్‌గా పాల్గొని ప్రభుత్వ, రెవిన్యూ అధికారుల విధానాలను నిరసించారు. భూస్వామి హోతా శ్రీరామచంద్రమూర్తి చేతుల్లో ఉన్న వేలాది ఎకరాల గిరిజన భూములను గిరిజనులకే అప్పగించాలనీ, 1/70 చట్టం అమలు పరచాలని రైతుకూలీ సంఘం నిరంతర ఆందోళన సాగిస్తూ ఉండగానే పోలవరం ప్రాజెక్టు మునక భూముల క్రింద హోతా శ్రీరామచంద్రమూర్తి ఆక్రమించుకొని వున్న గిరిజన భూములను ఇచ్చివేసి పెద్ద ఎత్తున ప్రభుత్వం నుండి పరిహారాన్ని పొందాడు. ఆ భూములు గిరిజనులకే దక్కాలని డిమాండ్ చేస్తూ భూస్వాములకు ఊడిగం చేసే ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ధర్నా జరిపారు.

గిరిజనుల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలకు సమగ్ర పునరావాసాన్ని అమలు చేయాలని, 1/70 చట్టం అమలు చేయాలని కోరుతూ కోటరామచంద్రాపురం ఐటిడిఏ ఆఫీసు వద్ద 25.8.2008న 1200మందితో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో భారత జనాందోళన్ ఛైర్మన్ డా॥బి.డి.శర్మ పాల్గొని ఉత్తేజపూరిత ఉపన్యాసం ఇచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కా॥ఝాన్సి, కా॥కోటయ్య, జనశక్తి పత్రికా సంపాదకులు డా॥జస్వంతరావు తదితరులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ధర్నా అనంతరం పి.ఓతో ప్రజల సమక్షంలోనే సమస్యలన్నింటి పైన చర్చలు జరిపారు. ఈ మొత్తం కార్యక్రమం ప్రజలలో మంచి ప్రభావం పడవేసింది.

ఈ ధర్నా జరిగిన తరువాత 13.8.2008న పోలవరం బస్టాండ్‌లో ఉన్న రైతుకూలీసంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥కుంజం రామారావును పోలీసులు మాట్లాడటం కోసమని పిలిచి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ అదే రోజున 200మందితో ధర్నా నిర్వహించి పోలవరంలో ప్రదర్శన నిర్వహించారు.

2004 నుండి 2008 వరకు నిరంతరాయంగా ఈ సమస్యలపై క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తూ వేలాది మంది ప్రజలను సంఘం వైఖరికి అనుగుణంగా ఉద్యమింపజేశాం. ఈ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన ఎంత ఆయకట్టు స్థిరీకరించబోతున్నారో చెప్పలేని స్థితిలో జిల్లా అధికారులున్నారు. ప్రజలకు సమగ్రమైన, శాస్త్రీయమైన పునరావాస ప్యాకేజీని ప్రకటించి చిత్తశుద్ధితో అమలు చేయాలని ఉద్యమించాం.

**గ్రామీణ అర్థభూస్వామ్య వ్యవస్థలోని దారుణ దోపిడీ పీడన, అణచివేతలను, అసమానతలను రూపుమాపటం, పీడిత ప్రజలందరికీ కనీసం తిండి, గుడ్డ, గూడు వసతిని కల్పించటం; భూస్వామ్య అధికారం స్థానంలో రైతుకూలీల గ్రామీణ పేదల అధికారాన్ని నెలకొల్పటం రైతుకూలీసంఘం ప్రప్రథమ ఆశయం.**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) 'లక్ష్య ప్రకటన' నుండి

నేటికీ దీనికి కొనసాగింపుగా కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి.

ఇదే సమయంలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు గాలిలో యుద్ధం చేసేవి గానూ, ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ప్రభుత్వ విధానాలను సమర్థించేవిగాను, ప్రజలను గందరగోళపరచేవిగాను ముందుకు వచ్చాయి. సంఘ చైతన్యంతో ప్రజలు వీరిని సులభంగానే గుర్తించి, ప్రక్కకునెట్టి సంఘ నాయకత్వాన ఉద్యమించారు.

## వాన్‌పిక్‌కు వ్యతిరేకంగా

రాష్ట్ర ప్రభుత్వం కోస్టల్ కారిడార్ జీ.వో.నెం. 34ను విడుదల చేసి శ్రీకాకుళం జిల్లా నుండి నెల్లూరు జిల్లా వరకు గల 9 కోస్తా జిల్లాల్లోని దాదాపు 1000 కి.మీ తీర ప్రాంతంలో కాలుష్య కారక రసాయన పరిశ్రమలను, ప్రత్యేక ఆర్థిక మండళ్ళను స్థాపించే పేరిట లక్షలాది ఎకరాల భూ సేకరణకు పూనుకున్నది. దీనిలో భాగంగానే గుంటూరుజిల్లా నిజాంపట్నం, ప్రకాశంజిల్లా వాడరేవుల మధ్య గల 26 కి.మీ సముద్ర తీరం వెంట రెండు ఓడరేవులు, ఒక విమానా శ్రయం నిర్మించి వీటి ద్వారా ఎగుమతి, దిగుమతులు చేసేందుకు మౌలిక వసతులు కల్పించి పరిశ్రమలు స్థాపించే ప్రాజెక్టు 'వాడరేవు–నిజాంపట్నం పోర్టు, ఇండస్ట్రియల్ కారిడార్' (వాన్‌పిక్) పేరిట ప్రజల నుండి వ్యవసాయం, రొయ్యలు, చేపల సాగుకు యోగ్యమైన 28వేల ఎకరాల భూమిని సేకరించేందుకు పూను కున్నది. 16,800 కోట్ల రూపాయలతో ప్రణాళికను సిద్ధం చేశానని ప్రభుత్వం ప్రకటించింది. రస్‌అల్ ఖైమా కంపెనీ, మాట్రిక్స్ కంపెనీలు చేపట్టిన ఈ వాన్‌పిక్ ప్రాజెక్టు వలన రెండు జిల్లాలోనూ 28 వేల ఎకరాల భూములను ప్రజలు కోల్పోతారు గుంటూరు జిల్లాలోని 6 మండలాలు, ప్రకాశంజిల్లాలోని 5 మండలా లలో, వేలాది కుటుంబాల జీవనోపాధి దెబ్బతిని వీధిన పడనున్నాయి.

దీని ద్వారా ప్రజలకు భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, భూములు కోల్పోయిన వారికి తగిన నష్ట పరిహారం, పునరావాసం కల్పిస్తామంటూ దళారులు, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలను మభ్యపెట్టి భూ సేకరణకు పూనుకున్నారు. అప్పటికీ వారి మాట వినని ప్రజలను భయపెట్టి భూమిని సేకరించే ప్రయత్నాలు చేశారు.

రైతుకూలీసంఘం, ఎ.ఎపి.ఎఫ్.టి.యుల భాగస్వామ్యంతో ఏర్పడ్డ కోస్టల్ కారిడార్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో 30–8–08న చీరాలలో సదస్సు జరిగింది. సదస్సుకు ముందు రెండు జిల్లాల్లోని భూములు కోల్పోయే గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. సదస్సులో కారిడార్ వ్యతిరేక కమిటీ నాయకులతోపాటు ఇతర ప్రజాతంత్ర వాదులు కూడా పాల్గొని, సెజ్‌లకు, కారిడార్ లకు వ్యతిరేకంగా పోరాడాలనీ–నిర్బంధ భూసేకరణను ప్రతిఘటించమనీ పిలుపు నిచ్చారు. సదస్సులో రెండు జిల్లాల తీరప్రాంత గ్రామాల నుండి వెయ్యిమంది రైతులు, మత్స్యకారులు, ప్రజానీకం పాల్గొన్నారు.

వాన్‌పిక్‌కు అవసరమైన భూములు ఇప్పించేందుకు దిండి, అడవులదీవి గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన ప్రత్యేక కలెక్టరును ప్రజలు ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా ఆందోళనాకారులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ రాస్తారోకో నిర్వ హించారు.

వాన్‌పిక్‌ను వ్యతిరేకిస్తూ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు నిర్వహించారు. శిబిరం వద్దకు కలెక్టరు వచ్చి ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'08 అక్టోబరు 15న చీరాలలో వాన్‌పిక్ కార్యాలయం ముట్టడి సందర్భంగా ప్రకాశం, గుంటూరు జిల్లాల రైతుకూలీసంఘం కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులపై పోలీసులు పాశవికంగా లాఠీఛార్జి జరిపి, అరెస్టులను సాగించారు. ప్రభుత్వ పాశవిక చర్యను ఖండిస్తూ జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

'08 నవంబరు 2న హైదరాబదు ప్రెస్‌క్లబ్‌లో వాన్‌పిక్ బాధితులతో "మా గోడు ఆలకించండి" అంటూ జరిగిన సభలో పాల్గొన్నారు.

2009 జనవరిలో ముఖ్యమంత్రి నిజాంపట్నం పర్యటన సందర్భంగా నిరసన తెలియజేసిన సంఘ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

కోస్టల్ కారిడార్‌కు వ్యతిరేకంగా, భూసేకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కొత్తపట్నం, ఒంగోలు, నాగులుప్పల పాడు మండలాల్లో విస్తృత ప్రచారం చేపట్టారు.

మ్యాట్రిక్స్ సంస్థ కుట్రపూరిత విధానాలతో ప్రజల భూములను కబళించ టానికి పూనుకున్నది. సంఘం ప్రజలకు అండగా నిలబడిన ఫలితంగా ప్రజలు వాన్‌పిక్ ప్రత్యేక కలెక్టరును నిలవేసి భూముల కొనుగోళ్ళను కొంతవరకు అడ్డుకోగలిగారు.

2009 నవంబర్ 22న వాస్తవ సేకరణ కమిటీగా ఏర్పడి ప్రకాశంజిల్లా దేవరంపాడు, పాతపాడు గ్రామాలలో పర్యటించి వాన్‌పిక్ పేరిట ప్రజల భూములను బలవంతంగా లాగి వేస్తున్న తీరును, ప్రజలను బెదిరిస్తున్న వైనాన్ని వెల్లడి చేశారు.

మొత్తం ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా, నిర్వాసిత గ్రామాలలోను, చుట్టుప్రక్కల ప్రాంతాలలోనూ రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశారు. దీనివలన మత్స్యకారులు, రైతుల జీవనోపాధి ఎలా దెబ్బతినబోతున్నదో, పర్యావరణ కాలుష్యం ప్రజల ఆరోగ్యాలను ఎలా దెబ్బతీయనున్నదో, సామ్రాజ్యవాదుల దోపిడీకి ఈ ప్రాజెక్టు ఎలా కేంద్ర బిందువు కానున్నదో వివరిస్తూ విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహించారు. దళ ప్రచారం, కరపత్రాలు, పోస్టర్లు ద్వారా ప్రచారం సాగించారు. రైతుకూలీసంఘం భాగస్వామిగా ఉన్న కోస్టల్ కారిడార్ వ్యతిరేక పోరాటకమిటీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు, బహిరంగసభలు, నిరసన ప్రదర్శనలు, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడులు, మంత్రుల, ఎమ్మెల్యేల, అధికారుల ఘెరావ్‌లు వంటి కార్యక్రమాలను చేపట్టారు. ఈ

సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అణచివేత చర్యలను ప్రతిఘటించి నిలబడ్డారు.

'ఇచ్ఛాపురం నుండి తడ వరకు కోస్టల్ కారిడార్ ఏర్పాటును వ్యతిరేకించండి' పేరున కోస్టల్ కారిడార్ వ్యతిరేక కమిటీ ఒక బుక్‌లెట్‌ను ప్రచురించి రానున్న ప్రమాదాల గురించి ప్రజలను హెచ్చరించటంతో పాటుగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను విస్తృతంగా వెల్లడి చేసింది.

నిరంతరాయంగా ఈ రెండు జిల్లాల్లో వాన్‌పిక్‌కు వ్యతిరేకంగా కోస్టల్ కారిడార్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో సాగిన కార్యక్రమాల్లో రైతుకూలీసంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలను నిలబెట్టడంలో చురుకైన పాత్ర పోషించారు. ఈ ఆందోళన రాష్ట్ర వ్యాపితంగా ప్రజలందరి దృష్టిలోకి వెళ్ళడంతో ప్రభుత్వం ముద్దాయిలా బోనులో నిలబడాల్సి వచ్చింది. దీంతో ప్రభుత్వం ప్రజల్ని మోసపుచ్చేందుకు కోస్టల్ కారిడార్ అధ్యయన జి.వో.నంబరు 34ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం తన దూకుడును తాత్కాలికంగా తగ్గించు కుంది. ప్రజలకు దీని ప్రమాదం మాత్రం తొలగిపోలేదు.

## మచిలీపట్నం పోర్టు పేరిట నిర్బంధ భూసేకరణకు వ్యతిరేకంగా

కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలో గిలకల దిండి చేపల రేవుకు 4 కి.మీ దూరంలో డీప్ వాటర్ పోర్టు నిర్మాణానికి పూనుకొన్నారు. వజ్రా సీ పోర్టు అనే ప్రైవేటు కంపెనీకి బి.ఓ.టి ప్రాతిపదికన ఈ రేవుని నిర్మించి, నిర్వహించుకునే అధికారాన్నిచ్చారు. కంపెనీ తన పర్యావరణ నివేదికలో 615 ఎకరాల భూమి అవసరం అని పేర్కొనగా కృష్ణాజిల్లా కలెక్టరు 6632 ఎకరాల భూమిని పోర్టుకు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు.

ఈ రేవుకు అవసరమైన పెట్టుబడి ఎలా? స్వదేశీ సంస్థలదా? విదేశీ సంస్థలదా? పర్యావరణ ప్రభావం వల్ల ఎన్ని గ్రామాలు దెబ్బతింటాయి. వేటను కోల్పోయే కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు ఏం చేస్తారంటూ రైతుకూలీసంఘం 'బహిరంగ విచారణ'సందర్భంగా ప్రశ్నిస్తూ కరపత్రం ప్రచురించి గ్రామాల్లో ప్రచారం చేసింది.

16-12-08న బందరు టౌనుహాలులో సెజ్‌లు, కారిడార్‌లకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించింది. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం, చేసింది. ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించింది.

## కనపర్తి థర్మల్ ప్లాంటు వ్యతిరేక ఆందోళనకు మద్దతుగా

జెన్‌కో ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా తీరప్రాంత గ్రామమైన కనుపర్తిలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం భూ సేకరణకు పూనుకోగా ఆ ప్రాంతంలోని రైతాంగమంతా 'థర్మల్ విద్యుత్ కేంద్ర వ్యతిరేక పోరాట సమితి'గా సమీకృతమై 2009 నవంబరు తమ ఆందోళనలను ప్రారంభించి నిరంతరాయంగా కొన సాగిస్తున్నారు. ఈ ఆందోళనల్లో రైతుకూలీ సంఘం భాగస్వామ్యమై మద్దతు నందిస్తోంది. పచ్చటి పంట పొలాలను వదులుకోమనీ-తమ ప్రాంతాన్ని కాలుష్య మయం చేయనివ్వబో మనీ నినదిస్తున్నారు. గుళ్ళకమ్మ, వెలుగొండ ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటిని కూడా రైతు ప్రయోజనాలను బలిపెట్టి ఈ థర్మల్ ప్రాజెక్టుకు ఇవ్వబోతున్నారన్న వాస్తవం కూడా రైతాంగాన్ని ఆగ్రహానికి గురిచేస్తోంది.

## సోంపేట, సంతబొమ్మాళిల్లోనూ; కోటిపాంలోనూ- ప్రైవేటు భారీ థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని నిలిపివేయాలని, కొవ్వాడ అణు విద్యుత్ కేంద్ర ప్రతిపాదనను విరమించాలని ఆందోళన-2009 డిసెంబరు

శ్రీకాకుళంజిల్లా సోంపేట, కవిటి మండలాల పరిధిలోని బీల ప్రాంతంలో ఎన్‌సిసి అనే ప్రైవేటు సంస్థ 12వేల కోట్ల రూపాయల పెట్టుబడితో 2468 మెగావాట్ల విద్యుదుత్పత్తి అంచనాతో థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి పూనుకుంది. నీటి కాలుష్యం, పర్యావరణ సమస్యలు ఏర్పడి మరొక కోనసీమగా పిలువబడే ఉద్దానం కనుమరుగయ్యే ప్రమాదం వుంది. ఇదే సామర్థ్యంతో సంతబొమ్మాళి మండలంలో నిర్మాణ పనులు ఈస్టుకోస్టు ఎనర్జీ కంపెనీ ప్రారంభించి ఆ ప్రాంత గెడ్డలను మూసివేస్తూ గోడ కట్టటంతో వేలాది ఎకరాలు ముంపుకు గురయ్యాయి. పంటలు తీవ్రంగా నష్టపోయాయి.

శ్రీకాకుళం రణస్థలం మండలం కొవ్వాడ మత్స్యలేశం వద్ద నిర్మించనున్న అత్యంత ప్రమాదకరమైన అణువిద్యుత్ కేంద్రానికి 23 గ్రామాలకు చెందిన షుమారు 20వేల ఎకరాల భూములను ప్రభుత్వం ప్రైవేటు కార్పోరేషన్‌కు కట్టబెట్టింది. తీరప్రాంతవాసులకు, రైతాంగానికి, మత్స్యకారులకు, యావత్ ప్రజానీకానికి తీవ్ర వినాశనం కలిగించే ఈ నిర్మాణాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో 2009 డిసెంబర్ నెలలో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు.

విజయనగరంజిల్లా కొమరాడ మండలం-కోటిపాం వద్ద, 'ఆల్ఫా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్'కు ప్రభుత్వం భారీ విద్యుత్ కేంద్ర నిర్మాణానికి అనుమతిచ్చింది. ఈ పేరిట వనకాబడిగెడ్డ ఆధారంగా పండుతున్న పచ్చటి పొలాలనన్నీ వ్యవసాయానికి పనికి రాని బంజరుగా చూపించి వందల ఎకరాల భూములను రైతులనుండి గుంజివేసు కునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజల జీవనానికి, పర్యావరణానికి అత్యంత హానికరమైన, సామ్రాజ్యవాద, బడా కంపెనీల ప్రయోజనాల కోసం నిర్మించ తలపెట్టిన ఈ థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణాన్ని నిరసిస్తూ కొమరాడ మండలంలోనూ, విజయనగరం జిల్లాలోని వివిధ ప్రాంతాలలోనూ రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు. 2009 డిసెంబర్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను వివిధ ప్రజాసంఘాలతో కలిసి అడ్డుకున్నారు.

## ఓబులాపురం నుండి ఇనుప ఖనిజం అక్రమ రవాణాకు వ్యతిరేకంగా

దేశంలోని ప్రజలందరికీ చెందవలసిన భూగర్భ వనరులు, ఖనిజాలు, సహజవనరు

లన్నింటినీ బహుళజాతి కంపెనీలకు, బడా పెట్టుబడిదారులకు పాలకులు ధారాదత్తం చేస్తూ వస్తున్నారు. 1980లలోనే ప్రభుత్వ రంగంలో విశాఖ ఉక్కు కర్మాగారం నిర్మిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దానికి స్వంత గనిని ఆనాటి నుండి ఈనాటి వరకు కల్పించలేదు. ముడి ఖనిజాన్ని ఆ కర్మాగారం కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. అదే సందర్భంలో పలు ప్రైవేటు స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారుల ఉక్కు కర్మాగారాలకు స్వంత గనులను ప్రభుత్వాలు కేటాయించాయి. అందులో భాగమే ఆంధ్రా- కర్ణాటక సరిహద్దులో వున్న అనంతపురం జిల్లాలోని ఓబులాపురం ఇనుప ఖనిజాన్ని గాలి జనార్దనరెడ్డికి చెందిన- ఓబులాపురం మైనింగ్ కార్పోరేషన్‌కు ప్రభుత్వం కారుచౌకగా లీజుకిచ్చింది. రాబోయే కాలంలో కట్టబోయే జగన్-బ్రాహ్మణి స్టీల్స్‌కు క్యాప్టివ్ మైన్స్‌గా పేర్కొంటూనే లక్షల టన్నుల ఇనుప ఖనిజాన్ని ఓ.ఎమ్.సి ఇప్పటి నుండే తవ్వితీసి, పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తూ కోట్ల రూపాయల లాభాన్ని పోగేసుకుంటున్నది.

అనంతపురం జిల్లా ఓబులాపురం నుండి నెల్లూరుజిల్లా కృష్ణపట్నం ఓడరేవుకు భారీ వాహనాలతో రోడ్డుమార్గం ద్వారా ఖనిజాన్ని రవాణా చేసే క్రమంలో నెల్లూరుజిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య తీవ్రమైంది. 2008 ఏప్రిల్ -జూన్ మూడు మాసాల వ్యవధిలో 60మందికిపైగా చనిపోయారు. 2010 నాటికి ఆ సంఖ్య 250కి చేరుకొంది. పశువులు, జీవాలు అనేకం ఈ ప్రమాదాల్లో మరణించాయి. రోడ్డు పొడవునా పరిసర గ్రామాల ప్రజలు తీవ్రమైన పర్యావరణ, కాలుష్య సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతు కూలీసంఘం స్పందించి ఇతర మేధావులను, ప్రజాతంత్రవాదులను, ప్రజాసంఘాలను కలుపుకొని 'ఇనుప ఖనిజ వ్యతిరేక పోరాట కమిటీ' నేర్పాటు చేయటంలో చొరవ చూపింది. ఇనుప ఖనిజ ఎగుమతుల వెనుకవున్న ఆర్థిక రాజకీయ కోణాలను విశ్లేషిస్తూ 'ఇనుప ఖనిజ ఎగుమతులెందుకు' అనే బుక్‌లెట్‌ను ప్రచురించింది. మన దేశ ప్రజలకు స్టీలును టన్ను 60 వేల రూపాయలకు అమ్ముతూ-గని యజమానుల నుండి టన్నుకు కేవలం 27 రూపాయలు సీనరేజి వసూలు చేస్తున్నారనీ, వారు విదేశాలకు టన్ను 5నుండి 7 వేల రూపాయల వరకు అమ్ముకుంటూ వేల కోట్ల రూపాయలు లాభాలార్జిస్తూ మరోవైపున ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న వైనాన్ని ప్రజల ముందు బహిర్గత పరచింది. దాదాపు 2 నెలల కాలం నిరంతరాయ ప్రజాకదలికల ద్వారా, ఇనుప ఖనిజ వ్యతిరేక ఆందోళనను సాగించటం ద్వారా ప్రమాదాలను నివారించుకోగలగటం, నష్టపరిహారాన్ని పెంచుకోగలగటం వంటి డిమాండ్స్‌ను సాధించుకోవటంతో పాటుగా ఖనిజ సంపదను దోచిపెడ్తున్న పాలకుల నైజాన్ని రాజకీయంగా విస్తృతంగా వెల్లడి చేయగలిగారు.

అనంతపురం జిల్లా రైతుకూలీ సంఘం, ఎపిఎఫ్‌టియు కమిటీల ఆధ్వర్యంలో-గనుల్లో భూములు కోల్పోయిన రైతులకు తగు నష్టపరిహారం ఇవ్వాలనీ, రాయదర్గం ఏరియాలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మించాలన్న డిమాండ్లతో కరపత్రం ముద్రించి విస్తృత ప్రచారం చేశారు.

## ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా

2006 జూన్-ఆగస్టు నెలల్లో వచ్చిన వాయుగుండం, రుతుపవనాలు కలిసి సృష్టించిన వరదల వలన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, ఉభయగోదావరి జిల్లాలతో పాటు, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలు; కృష్ణా-గుంటూరు జిల్లాల్లోని లంకగ్రామాలు అతలాకుతల మైనాయి. వాగులు, చెరువులు, కాల్వగట్లు తెగి 6 వేల గ్రామాలు జగదిగ్బంధంలో చిక్కుకొని, వేలాది ఇండ్లు కూలిపోయాయి. వందమందికిపైగా ప్రాణాలు కోల్పోగా, యాభైలక్షల మంది నిరాశ్రయులైనారు. 20 లక్షల ఎకరాల్లో పంట నష్టపోయి కోట్లాది రూపాయల నష్టం జరిగింది. ప్రాణాలు కాపాడుకోవటానికి తమంతట తామే ఇండ్లను వదిలి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోకపోతే ప్రాణనష్టం పెద్ద ఎత్తున జరిగేది. వరదల్లో చిక్కుకున్న ప్రజలు ఆహారం, నీరు లేక రోజుల తరబడి ఉన్నారు. విషసర్పాల మధ్య భయంకరమైన రాత్రులు గడిపారు. బాధితులను ఆదుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రభుత్వం హెలికాప్టర్ల నుండి జారవిడిచిన ఆహార పొట్లాలు కుళ్లి కంపు కొడుతున్నా వాటి కోసం ప్రజలు పరుగులు తీసారంటే సహాయం అందక ప్రజలు ఎంతటి దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారో అర్థమౌతుంది. సహాయక చర్యలు చేపట్టవలసిన బాధ్యత ఉన్న ప్రభుత్వం ప్రజలను బిక్షగాళ్ళుగా మార్చే విధానాలు అమలు జరుపుతున్నది. వరదల్లో చిక్కుకుపోయిన ప్రజలకు తోటి గ్రామస్తులు (మునగనివారు) అందించిన సహాయం గొప్పది.

సహాయం అందక అల్లాడుతున్న ప్రజలను ఆదుకోవాలనే సంకల్పంతో రాజమండ్రి కేంద్రంగా కా॥ఝాన్సి కన్వీనర్‌గా 15మంది సభ్యులతో వరద బాధిత సహాయక కమిటీని రైతుకూలీసంఘం (ఆం.ప్ర) ఏర్పాటు చేసింది. సర్వం కోల్పోయి సహాయం అందక బాధపడుతున్న ప్రజలను ఆదుకోవాల్సిందిగా అన్ని వర్గాల ప్రజలకు కమిటీ విజ్ఞప్తి చేసింది. కరపత్రం ద్వారా రాష్ట్రమంతటా విస్తృతంగా ప్రచారం చేసింది.

కమిటీ పిలుపు మేరకు అనంతపురం, కడప, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖజిల్లాల నుండి, హైదరాబాదు సిటీ నుండి బియ్యం, బట్టలు, ప్లేట్లు, గ్లాసులు, మందులు కమిటీకి అందాయి. ఈ వచ్చిన సహాయాన్ని కన్వీనర్ కా॥ఎస్.ఝాన్సి, సభ్యులు కామ్రేడ్స్ కె.కోటయ్య, జె.కిషోర్‌బాబు, సి.పెద్దన్న, యం.యస్.నాగరాజుల ఆధ్వర్యంలో తూర్పు -పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాల్లోని సహాయం ఏ మాత్రం అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న 45 లోతట్టు గ్రామాల ప్రజలకు క్రమశిక్షణాయుతంగా గ్రామసభల ఏర్పాటు ద్వారా పంపిణీ చేయటం జరిగింది.

వరద పీడిత ప్రాంతాల్లో ఒకవైపు కనీస సహాయం అందిస్తూనే మరోవైపు ప్రభుత్వం

నుండి హక్కుగా అందాల్సిన సహకారాన్ని రాబట్టేందుకు రైతుకూలీసంఘం వివిధ ప్రాంతాల్లో ఆందోళనా కార్యక్రమాలను చేపట్టింది. దేవీపట్నం మండలం కొండ మొదలులో నాలుగు రోజులుగా వరదల్లో చిక్కుకున్న బాధితుల వద్దకు తీరికగా వచ్చిన గిరిజనాభివృద్ధి సంస్థ అధికారిని గిరిజనులు కదలనీయకుండా నిలవేశారు. ఆ అధికారి క్షమాపణలు కోరుకొని తదనంతరం తక్షణ ప్రభుత్వ సహాయం అందచేశారు.

వరదల కారణంగా పశ్చిమగోదావరి జిల్లా మంటూరు ప్రాంతంలో మునిగిపోయిన గిరిజన గ్రామాలకు సహాయం అందని స్థితిలో గిరిజన సంఘ కార్యకర్తలు వరదనీళ్ళలో ఈదుకుంటూ వెళ్ళి మంటూరులో అధికారులను నిలదీసి తక్షణ సహాయం పొందారు.

తూర్పుగోదావరి జిల్లాలో వరదలు వచ్చిన 5 నెలల తరువాత కూడా పంట కోల్పోయిన రైతులకు కనీస నష్టపరిహారం అందించని కారణంగా; కరెంటు స్థంభాలు, కల్వర్టులు, చెక్‌డ్యాంలు పునరుద్ధరించని కారణంగా దేవీపట్నం ఎమ్మార్వో కార్యాలయం వద్ద గిరిజన సంఘ నాయకత్వాన స్పష్టమైన హామీలు పొందే వరకు మిలిటెంట్ ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు.

వంశధార వరదల మూలంగా సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాలనీ, వరదల నివారణకు కరకట్ట పనులు చేపట్టాలని శ్రీకాకుళం, నరసన్నపేటల్లో సంఘం ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు.

ఓగ్ని తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు, ప్రజానీకానికి ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని, కృష్ణాజిల్లా కంకిపాడు, మచిలీపట్నం, నందిగామల్లో; గుంటూరుజిల్లా రేపల్లె ప్రాంతంలో; ప్రకాశం జిల్లా కొత్తపట్నం; నెల్లూరుజిల్లా వెంకటగిరి ప్రాంతాలలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించి, తక్షణ సహాయాన్ని హక్కుగా పొందాలని, ప్రజలను బిక్షగాళ్ళుగా మార్చే ప్రభుత్వ విధానాలను నిరసించాలనే చైతన్యాన్ని అందించారు.

కొండమొదలు గ్రామంలో అగ్ని ప్రమాదం సందర్భంగాను, విజయగనరం జిల్లాలో అనావృష్టి, కరువు పరిస్థితుల్లోనూ ప్రజల తక్షణ డిమాండ్స్‌పై ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు.

## కృష్ణానది వరదల సందర్భంగా

2009 అక్టోబరులో గతంలో ఎన్నడూ లేని విధంగా కృష్ణానదికి వరద పరవళ్ళు త్రొక్కింది. కర్నూలు, మహబూబ్‌నగర్, గుంటూరు, కృష్ణా, నల్గొండ జిల్లాల్లోని వందలాది గ్రామాలను, పట్టణాలను తీవ్ర నష్టాలకు గురిచేసింది. ప్రజల,పశువుల ప్రాణాలను హరించటంతోపాటు, వేలాది ఇండ్లు నేలమట్టమయ్యాయి. వరి, చెరకు, పసుపు, అరటి, వేరుశెనగ తదితర పంటలు తీవ్రంగా నష్టపోయాయి. ముఖ్యంగా కౌలు రైతాంగానికి కోలుకోలేని దెబ్బతగిలింది. వ్యవసాయ కూలీలు, చేనేత కార్మికులు, చేతి వృత్తులవారు వరదల వలన ఉపాధి కరువై ఆకలితో అలమటించారు. కర్నూలు-మహబూబ్‌నగర్ జిల్లాల ప్రజలు వరద ముంపును ఊహించలేదు. అకస్మాత్తుగా వచ్చిన వరదతో భయాందోళనకు గురయ్యారు. ప్రభుత్వం, నీటి పారుదల అధికారుల నిర్లక్ష్యం వలన హంద్రీ నదికి గండిపడి కర్నూలు, మంత్రాలయం పట్టణాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. ఆకస్మాత్తుగా వచ్చిన వరదలతో ప్రజలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. అనేకమంది వరద ప్రవాహంలో కొట్టుకొనిపోయారు. వేలాది పశువులు చనిపోయాయి. మహబూబ్‌నగర్‌లో అనేక గ్రామాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో చిక్కుకున్న బాధిత ప్రజలను పరామర్శించేందుకు, ప్రభుత్వ సహాయాన్ని పరిశీలించేందుకు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర నాయకత్వం మూడు ప్రాంతాల్లో పర్యటించింది.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ఎస్.ఝాన్సి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.లలితకుమారి, సింహాద్రి లక్ష్మారెడ్డి, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, మందాజార్జి, కృష్ణాజిల్లా కార్యదర్శి ముప్పాళ్ళ భార్గవశ్రీ, గుంటూరుజిల్లా కార్యవర్గ సభ్యులు యం.శోభారాణి ఒక బృందంగా గుంటూరు -కృష్ణా జిల్లాల్లో పర్యటించారు. గుంటూరు జిల్లా కొల్లూరు మండలంలోని పోతార్లంక, తోకలవారిపాలెం, తిప్పలకట్ట, జువ్వలపాలెం, గుంటూరు గూడెం, పెసర్లంక, ఆవులవారి పాలెం, గాజుల్లంక తదితర గ్రామాలను; భట్టిప్రోలు మండలంలోని పెదలంక, కిష్కిందపాలెం, తడికలపూడి, చింతమోటు, ఓలేరు, పల్లెపాలెం, తూర్పుపాలెం; రేపల్లె, పేటేరు; అమరావతి మండలంలోని ధరణికోట, నరుకుల్లపాడు, అమరావతి, యండ్రాయి, మునుగోడు, జూపూడి; అచ్చంపేట మండలంలోని చింతపల్లి, పుట్లగూడెం, తాడ్వాయి, చల్లగరిక, మాదిపాడు; కృష్ణాజిల్లాలోని నందిగామ ప్రాంతాన్ని సందర్శించింది. బాధిత ప్రజలను పరామర్శించింది.

కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రాష్ట్ర కార్యదర్శి కా॥కె.కోటయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ జె.కిషోర్‌బాబు, ఎపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి.పెద్దన్న తదితరులు పర్యటించారు.

ఈ పర్యటనలలో-కృష్ణానది పరివాహక గ్రామాల్లో చెరకు,అరటి, పసుపు రైతాంగం తీవ్రంగా నష్టపోవటం, కౌలు రైతాంగం

**భూస్వాముల మిగులు భూములను, బంజరు ఫారెస్టు భూములను, దేవాలయాల భూములను, తోటలు ఫ్యాక్టరీల వంకతో అక్రమంగా దాయబడిన భూములను పేద ప్రజలు పంచుకోవడం, తద్వారా భూమి కేంద్రీకరణను బ్రద్దలు కొట్టడం రైతుకూలీసంఘం కర్తవ్యం.**

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర) 'లక్ష్య ప్రకటన' నుండి**

పూర్తిగా నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి స్పష్టమైంది. పేటేరులో నీరు ఇండ్లలోకి చేరటం వలన, చేనేత కార్మికులు మగ్గాలు నష్టపోవటం, ఉపాధి కరువుతో దుర్భర పరిస్థితులు ఎదుర్కొనటం, ఇతర చేతివృత్తులవారు వృత్తి పరికరాలను కోల్పోవటం, వ్యవసాయ కూలీలు పనులు లేక దుర్భర పరిస్థితుల్లో ఉండటం , కాల్వలకు, నది కరకట్టకు గండ్లుపడి గ్రామాలను, పైర్లను ముంచెత్తడాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.

కర్నూలు, మంత్రాలయ పట్టణాల్లో ముంపుకు గురైన పేదలు పడుతున్న బాధలు, మంచినీరు, ఆహారం అందక చేసే హాహా కారాలను, ధ్వంసం అయిన రోడ్లను పరి శీలించారు.

వరద ప్రాంతాల్లోని ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ప్రజలను ఆదు కోవటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పర్యటనలో మరింతగా స్పష్టమైంది. ప్రభుత్వం ప్రజలకు తక్షణ సహాయం అందించాలని పర్యటన బృందాలు డిమాండ్ చేశాయి. బాధితులను బిక్షగాళ్ళుగా మారుస్తున్న ప్రభుత్వ వైఖరులను నిరసించాయి. బాధితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ తక్షణ చర్యలను డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు.

కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని కొన్ని వరద బాధిత గ్రామాలకు పాదార్ధిక సహాయాన్ని సంఘం ఆధ్వర్యంలో అందజేశారు.

## బీహార్‌లో వరదల సందర్భంగా

2008 సెప్టెంబర్‌లో బీహార్ రాష్ట్రంలో కోసీనదికి సంభవించిన వరదల కారణంగా 30 లక్షల మందికిపైగా నిరాశ్రయులయ్యారు. బీహార్ వరద బాధితుల సహాయార్థం కా॥ఎస్.ఝాన్సి కన్వీనర్‌గా 'బీహార్ బాధితుల సహాయ కమిటీ' ఏపిఎఫ్‌టియు భాగస్వామ్యంతో ఏర్పడి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి బట్టలు, దుప్పట్లు, మందుల రూపంలోనూ, విరాళాల రూపంలోనూ సేకరించి బాధితులకు అందజేశారు

## కోరన్న-మంగన్నల వర్ధంతి సభలు

శ్రీకాకుళ గిరిజనోద్యమ తొలి అమరులు కామ్రేడ్స్ కోరన్న- మంగన్నలు అమరులై 40 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఆ అమరవీరుల ఆశయాలను స్మరించు కుంటూ గిరిజనోద్యమాన్ని ముందుకు తీసుకు పోతామని ప్రతినబూనుతూ సభలు జరపాలని రైతుకూలీసంఘం రాష్ట్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపు మేరకు పార్వతీపురం, మచిలీపట్నం, అనంతపురం ప్రాంతాల్లో వర్ధంతి సభలు జరిగాయి.

31-10-07న పార్వతీపురంలో నిర్వహించవలసిన బహిరంగ సభ, ఊరేగింపులకు చివరిరోజు వరకు పోలీసులు పర్మిషన్ యిస్తామని చెపుతూనే చివరలో పర్మిషన్ నిరాకరించారు. పార్వతీపురంలో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి సభకు వస్తున్న 5వేలమందికి పైగా గిరిజనులను కూనేరు రైల్వేస్టేషను వద్ద, ఆంధ్ర-ఒరిస్సా చెక్‌పోస్టు వద్ద, యం.ఆర్.నగర్ సెంటర్ మొదలైన చోట్ల అడ్డుకున్నారు. ఈ నిషేదాజ్ఞల మధ్యనే 1000మంది ప్రజలు కాలినడకన సభాస్థలికి చేరుకొన్నారు. తీవ్రమైన నిర్బంధం మధ్య వర్ధంతి సభను విజయవంతంగా జరుపుకొన్నారు. శ్రీకాకుళ గిరిజనోద్యమ పోరాటాల దృశ్యాలను వివరిస్తూ ప్రజా కళాకారులు భూపాల్ రాసిన "పోరుదారి" బ్యాలే ప్రదర్శించారు. సభలో బి.డి.శర్మగారు, కామ్రేడ్స్ పి.జస్వంతరావు, సి.భాస్కరరావు, గుర్రం విజయకుమార్, ఎస్.ఝాన్సి, కె.కోటయ్యలు ఉపన్యసించారు. సభ అనంతరం పార్వతీ పురం పట్టణంలో 1500 మందితో పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించారు.

శ్రీకాకుళ గిరిజనోద్యమ తొలి అమర వీరుల వర్ధంతి సభలు అక్టోబరు నాల్గవ తేదీ నుండి విజయనగరం జిల్లాలోని అనేక మండలాల్లో జరిగాయి. కొమరాడ మండలం పెదశాఖ పంచాయితీ "జల" గ్రామం, రాజ్యలక్ష్మిపురం; పార్వతీపురం మండలం కోరీ, కురుపాం మండలం కిచ్చాడ, మక్కువ మండలం దుగ్గేరు-గ్రామాల్లో బహిరంగ సభలు జరిగాయి. ఈ సభలలో వందల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అమరుల వర్ధంతి సభలు

మన్యం వీరుడు అల్లూరి వర్ధంతి సభలు; శ్రీకాకుళ అమరవీరులు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం సంస్మరణ సభలు; కొండ మొదలు పోరాట వీరులు కామ్రేడ్స్ కుంజెం రాజులు, మడెం లక్షుమయ్య; మనుగోపాల పోరాటంలో నేలకొరిగిన కా॥కారం పార్వతి; దుగ్గేరు పోరాటంలో అమరుడైన కా॥జెన్ని తిరుపతిల వర్ధంతి సభలను వివిధ జిల్లాల్లో జరుపుతూ వస్తున్నారు. అనంతపురం ఎం.ఎస్.నగర్‌లో అమరుడు కా॥మండ్ల సుబ్బారెడ్డి స్థూపాన్ని ఆవిష్కరించుకున్నారు.

## కళింగనగర్ ఆదివాసీ ప్రజలకు సంఘీభావంగా

2006 జనవరి 2న ఒరిస్సా రాష్ట్రంలోని కళింగనగర్‌లో జరిగిన మారణకాండ ప్రజలందరికీ తెలిసిందే. కళింగనగర్ ప్రాంతంలోని ఆదివాసీ భూములను టాటా స్టీలు కంపెనీకి ఒరిస్సా ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టింది. టాటా కంపెనీ ఆదివాసీ భూములను స్వాధీనం చేసుకొని చదును చేస్తున్న సందర్భంలో తమ భూములకు పరిహారం అడగటానికి భూముల దగ్గరకు వెళుతున్న ఆదివాసులపై టాటా కంపెనీకి అండగా నిలిచిన పోలీసు అధికారులు బాష్పవాయువు ప్రయోగించారు. విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 12మంది ప్రాణాలు కోల్పోయారు.

కళింగనగర్‌లో పోలీసు కాల్పులు జరిగిన వెంటనే రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కా॥ఎస్.ఝాన్సి, కా॥కె.కోటయ్య ఇతర ప్రజాసంఘాలను కలుపుకొని కళింగనగర్ ప్రాంతంలో పర్యటించి పోలీసు కాల్పులను ఖండించి ఆదివాసీ ప్రజలకు సంఘీభావం తెలిపారు.

అనంతరం భువనేశ్వర్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటుచేసి ఆదివాసుల కాళ్ళు నరికివేయడం, మర్మావయవాలు, మహిళల స్తనాలు కోసివేయటంలాంటి అనేక దుర్మార్గ సంఘటనలను, అప్పటివరకు వెలుగులోకి రాని అనేక విషయాలను ప్రజలకు బహిర్గత పరిచారు.

## సద్దాం హుస్సేన్‌ను ఉరితీయడాన్ని నిరసిస్తూ

అమెరికన్ అగ్రరాజ్య సామ్రాజ్యవాదం ఇరాక్‌లోని ఆయిల్ వనరులను కబళిం

చేందుకు ఇరాక్‌లో జీవరసాయన ఆయుధా లున్నాయనే సాకుతో ఏకపక్షంగా ఇరాక్‌పై యుద్ధానికి దిగింది. ప్రపంచ వ్యాపిత తీవ్ర నిరసనను ఖాతరు చేయకుండా ఇరాక్‌లో సర్వవిధ్వంసాన్ని సృష్టించింది. అంతిమంగా అమెరికన్ అగ్రరాజ్య అధికారానికి తలొగ్గని ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను పట్టి బంధించి నిర్బంధించింది. ఇరాక్‌లో తన కీలు బొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పరచింది. అమెరికా కనుసన్నలలో అమెరికన్ తొత్తులైన 'న్యాయాధిపతుల' ఎదుట సద్దాంపై బూటకపు విచారణ తంతును ముగించి సద్దాం హుస్సేన్‌కు మరణశిక్షను విధించింది.

అమెరిక్ అగ్రరాజ్య కండకావరాన్ని, సద్దాంకు ఉరిశిక్ష విధించడాన్ని నిరసిస్తూ –2006 డిసెంబరు 2వ వారంలో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలోను, ఇతర ప్రజా సంఘాలతో కలిసి నిరసనగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ దేశాల నిరసనను బేఖాతరు చేస్తూ 2006 డిసెంబరు 30న సద్దాంకు ఉరిశిక్ష అమలు చేసినదానికి నిరసనగా పెల్లు బుకిన ఆగ్రహావేశాల్లో, ఆందోళనా కార్య క్రమాల్లో రైతుకూలీసంఘం అన్ని జిల్లాల్లోనూ క్రియాశీలకంగా పాల్గొన్నది.

## సింగూర్, నందిగ్రామ్ ఘటనలను ఖండిస్తూ

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని సింగూరు, నందిగ్రామ్ ప్రాంతాల్లో ప్రత్యేక ఆర్థిక మండళ్ళ కోసం సారవంతమైన పంట భూములను స్వాధీనం చేసుకొనే ప్రభుత్వ ప్రయత్నాలను అక్కడి రైతులు అడ్డుకున్నారు. తమ భూముల కోసం పోరాడుతున్న సింగూర్, నందిగ్రామ్ రైతులపై లాఠీఛార్జి, అరెస్టులతో పాటు పోలీసులు కాల్పులు జరిపి రైతుల ప్రాణాలు బలిగొన్నారు. నందిగ్రామ్‌లో పదుల సంఖ్యలో పేద రైతు కూలీలు చనిపోయారు.

ఈ హత్యాకాండను ఖండిస్తూ నం గామ్ రైతులకు మద్దతు తెలపటానికి జాతీయ వాస్తవ సేకరణ బృందంలో రైతుకూలీ సంఘం తరఫున రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అక్కడ జరిగిన సంఘటనలను పుస్తక రూపంలో సోదర సంస్థ ప్రచు రించింది. విజయవాడలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) తరపున సభ నిర్వహించి నందిగ్రామ్, సింగూర్‌లలో జరిగిన వాస్తవాలను బయటి ప్రపంచానికి వెల్లడి చేశాము. నందిగ్రామ్ హత్యాకాండను ఖండిస్తూ వివిధ జిల్లాల్లో రై.కూ.సం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వ హించారు.

## బి.టి.వంగకు అనుమతినివ్వరాదని

బి.టి.విత్తన రంగంలో గుత్తాధిపత్యం వహిస్తున్న మోన్‌శాంటో, మహికో బహుళజాతి కంపెనీలు బి.టి.వంగను ప్రవేశపెట్టజూస్తు న్నాయి. ఇందులో భాగంగా బి.టి.వంగ అనుమతి కోసం కేంద్ర ప్రభుత్వం తరఫున మంత్రి జైరాం రమేష్ దేశంలోని కొన్ని ప్రధాన నగరాల్లో ప్రజాభిప్రాయ సేకరణ తంతు జరిపారు. ఈ బూటకపు బహిరంగ విచారణల్లో, కంపెనీలు తమ ఏజంట్లను రైతులుగా చూపెట్టి బి.టి.వంగ అనుకూల వాదనలు వినిపించిన అన్నిచోట్ల వివిధ ప్రజాసంఘాలు, రైతు ప్రతినిధులు, మేధావులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు.

2010 జనవరి 31న హైదరాబాదులో జరిగిన పబ్లిక్ హియరింగ్ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥కోటయ్య నాయకత్వంలో వరంగల్ నుండి వచ్చిన రైతులు, సంఘ కార్యకర్తలు, ఇతర సంస్థల ప్రతినిధులు–మంత్రి జైరాం రమేష్‌ని హాల్లోకి ప్రవేశించనీయకుండా అడ్డుకున్నారు. వారిని పోలీసులతో అరెస్టు చేయించినప్పటికీ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరిగారి సహాయం తీసుకుని పబ్లిక్ హియరింగ్‌లో మన వైఖరిని తెలియజేస్తూ మంత్రికి మెమోరాండం ఇచ్చాం. ఈ పబ్లిక్ హియరింగ్‌లో బిటి వంగ వ్యతిరేక వాదనలను బలంగా వినిపించటంలోను, బూటకపు రైతుల (కంపెనీ ఏజంట్లు) బండారాన్ని బట్టబయలు చేయడంలోనూ మనము ప్రధాన పాత్ర వహించాము.

## రైతులకు గిట్టుబాటు ధరలు, తదితర సమస్యలపై

పత్తి రైతుల సమస్యలు, సాధక బాధకాలపై పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకరరెడ్డి ఛైర్మన్‌గా ఉన్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వివిధ రైతు సంఘాలతో చర్చించటానికి 11.2.07న వచ్చిన సందర్భంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కా॥కోటయ్య పత్తిరైతుల సమస్యల పరిష్కారానికి వివిధ ప్రతిపాదనలు సూచిస్తూ మెమోరాండం యిచ్చి చర్చించారు.

2008 సెప్టెంబర్ 18న విత్తనాలు, ఎరువుల కొరత సమస్యపై రైతు, రైతుకూలీ సంఘాల ప్రతినిధులతో వ్యవసాయ శాఖా మంత్రి రఘువీరారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ఝాన్సి పాల్గొని మన వైఖరిని తెలియపరుస్తూ మంత్రికి మెమోరాండం యిచ్చారు.

2009 మే 7,8 తేదీలలో రై.కూ.సం, ఎ.పి.ఎఫ్.టి.యు, ఎన్.వై.ఎస్‌ల ప్రతినిధులు పరిశీలనా బృందంగా ఏర్పడి మెదక్, కరీం నగర్, నిజామాబాద్ జిల్లాలలో పర్యటించారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతాంగ కుటుంబా లను, పంటలు ఎండిపోయిన గ్రామాలను, పంటల కొనుగోళ్ళ కోసం ఆందోళన చేసిన గ్రామాలను, మార్కెట్ యార్డులను సందర్శిం చారు. పరిశీలనా నివేదికను తయారుచేసి అధికారులకు అందజేశారు.

చెరకు రైతులకు గిట్టు బాటు ధర కల్పించాలనే డిమాండ్‌పై సంఘం ఆధ్వర్యం లోనూ, ఐక్యకార్యాచరణ ద్వారానూ విస్తృతంగా కృష్ణాజిల్లా–ఉయ్యూరు ప్రాంతంలో ప్రచార ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు. రిలే నిరాహారదీక్షలు మొదలు కెసిపి షుగర్ ఫ్యాక్టరీని రైతులు చుట్టుముట్టడం వరకూ వివిధ కార్యక్రమాలను నిరంతరాయంగా చేపట్టి యాజమాన్య మొండి వైఖరిని వెల్లడి చేశారు. చెరకు రైతుల–ముఖ్యంగా కౌలు రైతుల సమస్యపై ప్రాధాన్యతనిచ్చి వారి సమస్యలను విస్తృతంగా వెలుగులోకి తెచ్చారు.

నిజామాబాద్ జిల్లాలో ఎర్రజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ప్రభుత్వం రైతులకు బకాయిబడ్డ 10 కోట్ల రూపాయ లను చెల్లించాలనే డిమాండ్‌పై సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం సాగించారు. పోలీసుల కాల్పుల వరకూ సాగిన విస్తృత ఐక్యకార్యాచరణ కార్యక్రమాల్లో సంఘ కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు.

కృష్ణాజిల్లా-గండేపల్లిలో పర్యావరణానికి తీవ్రంగా నష్టం చేస్తున్న కాలుష్యాన్ని వెలు వరిస్తున్న 'సెంటినీ బయో ప్రొడక్టు' పరిశ్రమ ఇథనాల్ ఉత్పత్తిని ఆపివేయాలని, ఆ విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రభుత్వంపై, యాజమాన్యంపై వత్తిడి చేస్తూ విస్తృత ప్రచారం, ఐక్య ఆందోళన చేపట్టారు. బాధిత గ్రామాల ప్రజలను భాగస్వాములను చేశారు. యాజమాన్యం సాగించే తప్పుడు ప్రచారాన్ని ఎదుర్కొన్నారు. ఆందోళన ఫలితంగా పరిశ్రమను 45 రోజులపాటు మూసివేసి తగిన నివారణ చర్యలు చేపట్టక యాజమాన్యా నికి తప్పలేదు.

## మండల/పంచాయితీ ఎన్నికల సందర్భంగా

2006 జూన్-జులైలో జరిగిన గ్రామ-మండల-పంచాయితీ ఎన్నికల్లో పాలకులు, తమ ప్రయోజనాలను కాపాడే అభ్యర్థులను గెలిపించుకోవటానికి, ముఠాల పేరుతో ప్రజలను చీల్చి, వారి మధ్య చిచ్చుపెట్టి, వారి ఐక్యతను దెబ్బతీయటానికి అన్ని రకాల కుట్రలు చేస్తారని, వీరి కుట్రలకు బలి కావద్దంటూ ముందుగానే ప్రజలకు రైతుకూలీ సంఘం పిలుపునిచ్చింది.

ప్రజలను మారణహోమానికి గురిచేసే భూస్వామ్య, పెత్తందారీ శక్తుల కుట్రలకు బలి కాకుండా కష్టజీవులు ఐక్యతను సాధించు కోవాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) పిలుపు యిచ్చింది. భూస్వాముల మిగులు భూములు, బంజరు- దేవాలయ-ఫారెస్టు భూములు పేదలకు పంచాలని, పంటలకు గిట్టుబాటు ధర యివ్వాలని, నాలుగు శాతం వడ్డీ మాత్రమే వసూలు చేసి రైతులందరికీ పంట రుణాలు యివ్వాలని, నీటి ప్రైవేటీకరణ నిలిపి వేయాలని, కార్పోరేట్ వ్యవసాయాన్ని రద్దు చేయాలనే డిమాండ్లపై రైతుకూలీలు ఉద్య మించాలని కరపత్రం ద్వారా ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. గ్రామీణ పేదలను ఐక్యపర్చే దిశగా ఉద్యమ నిర్మాణ ప్రయోజనాల కనుగుణంగా వ్యవహరించాలని పిలుపునివ్వటం జరిగింది. ఇదే సందర్భంగా కనీస వేతన చట్టం అమలు కోసం ప్రత్యేకంగా కరపత్రం ప్రచురించారు.

## వ్యవసాయ కూలీలకు కనీస వేతన చట్టం అమలుకై

నేటికీ వ్యవసాయ కూలీలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. భూస్వామ్య-పెత్తందారుల భూముల్లో రెక్కలు ముక్కలు చేసుకొన్నా వచ్చే కూలి డబ్బులు కుటుంబ అవసరాలకు ఏ మాత్రం చాలక, తినీ తినక, వచ్చే రోగాలకు వైద్య సహాయం అందక నికృష్టమైన జీవితాన్ని వెళ్ళబుచ్చుతున్నారు. వ్యవసాయకూలీలను శ్రమదోపిడీ నుండి కాపాడటమే ధ్యేయంగా తెచ్చిన కనీసవేతన చట్టం కూలీల ప్రయోజనాలను కాపాడలేక పోయింది. ఉన్న చట్టాన్ని కూడా పాలకులు సక్రమంగా అమలు జరపలేదు. పోరాటాల ద్వారానే వ్యవసాయ కూలీలు కొంతమేరకైనా హెచ్చు కూలీని సాధించుకొన్నారు. అనేక ప్రాంతాల్లో రోజువారి కూలి స్థానంలో వచ్చిన కాంట్రాక్టు కూలి విధానం భూస్వాములకు లాభకరంగా మారింది. వ్యవసాయ పనుల్లో ట్రాక్టర్ల వాడకంతో సంవత్సరంలో 100 రోజులకు మించి పనులు దొరకకపోవటంతో ఉపాధి కోసం వ్యవసాయ కూలీలు వలస బాటపడుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో కనీసవేతన చట్టాన్ని పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించి ప్రభుత్వం అమలు జరపాలని, కాంట్రాక్టు కూలివిధానం రద్దు చేయాలని, ఉపాధి పనులు కల్పించాలని, కూలీలకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కరపత్రాన్ని తెచ్చి ప్రచారం సాగించారు. కొన్ని ప్రాంతాలలో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టారు.

## భూముల సమస్యపై

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో బంజరు, ఫారెస్టు, దేవాలయ, శోత్రియం, ఈనాం తదితర భూములను-నివాస స్థలాల కోసం, సాగు కోసం పేదలు స్వాధీనం చేసు కొనేందుకు రైతుకూలీసంఘం నాయకత్వం వహించింది.

గుంటూరుజిల్లా పాలువాయి గ్రామంలో పూజారిమాన్యం భూములను సాగుచేసు కుంటున్న పేదలు, దళితులను తరిమివేసి గ్రామ పెత్తందార్లు ఆ భూములను తమ చేతుల్లోకి తెచ్చుకోవాలనుకున్నారు. గతం నుండీ సాగుచేసుకుంటున్న వారికే తిరిగి ఆ భూములు కౌలుకివ్వాలని డిమాండ్‌చేస్తూ సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు. పెత్తందార్ల కుట్రలను వెల్లడి చేశారు. వారి దుష్ప్రచారాల్ని తిప్పికొట్టారు. పెత్తందార్ల పక్షం వహించి పోలీసులు-భూముల్లోకి దిగి పనులు చేసుకుంటున్న సాగుదార్లను అడ్డుకున్నారు. కేసులు బనాయిస్తామని హెచ్చరించినా సాగు దార్లు జంకలేదు. పూజారి మాన్యం భూములకు వేలంపాటల పేరిట ప్రభుత్వ భూములను పెత్తందారులకు కట్టబెట్టేందుకు చేసిన ప్రయత్నాలను సాగుదార్లు నిలవ రించారు. పూజారి భూముల్లోకి వ్యవసాయ పనులు చేసుకొనేందుకు ప్రదర్శనగా వెళ్తున్న 300మంది మహిళలపై పెత్తం దారులు భౌతికదాడులకు పాల్పడ్డారు. సంఘం ఆధ్వర్యంలో ప్రజలు దీనిని తిప్పికొట్టి సంఘర్షణతోనే ఆ భూముల కౌలు తమకే దక్కించుకొని సాగుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకత్వం హాజరైన పల్నాడు కౌలు రైతుల సదస్సు రెంటచింతలలో జరిపి భవిష్యత్తు కర్తవ్యాలను ఎంచుకొన్నారు.

## సార్వత్రిక ఎన్నికల సందర్భంగా

2009వ సంవత్సరం ఏప్రిల్‌లో రాష్ట్ర శాసనసభకు, లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా నూతన ప్రజాస్వామిక వ్యవస్థ స్థాపనకు ప్రజావిప్లవ పోరాటాలను తీవ్రం చేయండంటూ, యు.పి.ఎ., ఎన్.డి.ఎ, మూడవ ఫ్రంటులను వారి ప్రాంతీయ మిత్రులను ఓడించండంటూ, ఏజన్సీ గిరిజన సంఘం రాష్ట్ర కన్వీనర్ కా॥ ఇల్లా రామిరెడ్డి అరకు పార్లమెంటు స్థానానికి; రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు, గిరిజన గిరిజనేతర పేదల సంఘం నాయకులు కా॥ఊయక ముత్యాలు, విజయనగరం జిల్లా సాలూరు అసెంబ్లీ స్థానానికి; సీనియర్ కామ్రేడ్ మరియు కార్మిక నాయకులు కా॥ గోగుల

మూడి నాగభూషణం పార్వతీపురం అసెంబ్లీ స్థానానికి, గిరిజన నాయకుడు కా॥ కద్రక వెంకటస్వామి కురుపాం అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రంప చోడవరం అసెంబ్లీ స్థానానికి సీనియర్ కామ్రేడ్, గిరిజనోద్యమ నాయకులు కా॥ కుండ్ల గంగ రాజు; వరంగల్ జిల్లా నర్సంపేట అసెంబ్లీ స్థానానికి కార్మిక నాయకులు కా॥మోడెం మల్లేష్‌లు పోటీ చేశారు.

సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక ప్రగతిశీల శక్తులను గెలిపించాలనే వైఖరితో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నది. గిరిజన సంఘం, రైతుకూలీ, కార్మిక నాయకులను బలపర్చింది.

రాష్ట్ర, జిల్లాల క్రియాశీల కార్యకర్తలు, సానుభూతిపరులు, సంఘ సభ్యులు వందలాదిమంది ఈ ఎన్నికలలో అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం సాగించారు. పాలకులు ప్రోత్సహిస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు, గిరిజన ప్రాంతాలలో 1/70 చట్టాన్ని తుంగలో త్రొక్కి వేలాది ఎకరాలను సామ్రాజ్యవాద, బహుళజాతి సంస్థలకు గనుల త్రవ్వకానికి కట్టబెట్టడానికి, భూ పరాయీకరణలకు వ్యతిరేకంగా, రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, భూసంస్కరణల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, దున్నేవానికే భూమి హక్కు కల్పించాలని, గిరిజనులకు అడవిపై హక్కు కల్పించాలని, తదితర డిమాండ్లతో ప్రచార దళాలు నెల రోజులకు పైగా వందలాది గ్రామాలలో పాటలు, నృత్యరూపకాలు, సభలు, సమావేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశాయి. రాష్ట్ర స్థాయి కరపత్రంతో పాటు, నియోజకవర్గాల వారీగా స్థానిక సమస్యలపై ప్రత్యేకంగా కరపత్రాలు రూపొందించి ప్రజలలో విస్తృతంగా పంపిణీ చేశారు. రాజకీయ దృష్టితో సాగించిన ఈ ప్రచారం అన్ని చోట్లా మంచి ప్రభావాన్ని పడవేసి సంఘానికి మంచి గుర్తింపునిచ్చింది.

సంఘ ఆశయాలను, పేదలకు సంఘం యొక్క అవసరాన్ని అనేక క్రొత్త ప్రాంతాల ప్రజలు అర్థం చేసుకొని సంఘానికి చేరువ య్యేందుకు ఈ ప్రచారం బాగా ఉపయోగ పడింది.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు వేయడంలో ప్రజలకు తగిన స్థాయిలో తర్ఫీదు లభించనందున ఉద్యమ ప్రాంతాల లోని ప్రజారాశులు తమ ఓటును మన అభ్యర్థులకు వేయాలనుకున్నా వేయలేక పోయారు.

ఈ సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్ర-ఒరిస్సా కోరాపుట్ జిల్లా లక్ష్మీ పూర్ అసెంబ్లీ స్థానానికి చాషీమూలియా ఆదివాసీ సంఘం అభ్యర్థిగా కా॥కేంద్రుక అర్జున్ పోటీ చేశాడు. 2009 మార్చి మొదటి వారంలో 50 గ్రామాలకు చెందిన చాషీమూలియా ఆదివాసీ సంఘం కార్యకర్తలతో సమావేశం జరిపి ఎన్నికల్లో మన వైఖరిని వివరించాం. 2008, నవంబర్17న బందుగాం అవుట్ పోస్టుపై ప్రజలు చూపిన ఆగ్రహాన్ని ఆసరా చేసుకొని పోలీసులు బనాయించిన తప్పుడు కేసులున్న ఈ నేపథ్యంలో ఉద్యమ ప్రయోజనాల రీత్యా 10 సంవత్సరాలుగా చాషీ మూలియా ఆదివాసీ సంఘం నాయకుడుగా ఉద్యమానికి బాధ్యత వహిస్తున్న అర్జున్‌ని అభ్యర్థిగా ఎంపిక చేశాం.మూడు వందల మంది ప్రజలతో కోరాపుట్ వెళ్ళి మండు టెండలో ప్రదర్శన జరిపి నామినేషన్ వేసి వచ్చాం. లక్ష్మీంపూర్ నియోజకర్గంలో బందుగాం, నారాయణపట్న ప్రాంతాలలో వందలాది మంది కార్యకర్తలు, ప్రజలు కాలినడకన తిరిగి ప్రచారం చేశారు. గిరిజనులే ఇంటికి 10 రూపాయల వంతున ఎన్నికల నిధిని ఇచ్చి తమ అభ్యర్థికి తోడ్పడ్డారు. ఎన్నికల్లో ఓట్లు కూడా చెప్పుకోదగ్గ విధంగా పొందగలిగారు. ఒకవైపు ప్రజలు ఉత్సాహంతో ఎన్నికల్లో సంఘం అభ్యర్థికి సహాయపడుతుండగా ఉద్యమ విచ్ఛిన్నానికి పూనుకున్న గణనాథ్‌పాత్రో మరియు మావోయిస్టులు పనిగట్టుకుని సంఘం అభ్యర్థికి ఓట్లేయవద్దంటూ 'ఓట్లు అడగటానికి వచ్చిన కార్యకర్తలపై పేడనీళ్ళు చల్లండి', 'ఓట్లు వేసిన వారి మణికట్టు వరకూ చేతులు నరుకుతాం' అంటూ ఆదివాసీలను బెదిరించారు.

వీటన్నింటి మధ్యలో ఉద్యమ ప్రాంతంలో సాగిన ప్రచారం మనం సంఘటి తపడడానికి, రాజకీయ చైతన్యం అందించు కోవడానికి బాగా ఉపయోగపడింది.

## కోరాపుట్ ఆదివాసీ ఉద్యమానికి సంఘీభావంగా

కోరాపుట్ ఆదివాసీ పోరాటానికి సంఘీభావంగా హైదరాబాద్‌లో 2010 మార్చి 14న సభ నిర్వహించాం. ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దున వున్న కోరాపుట్ జిల్లాలో గత 20 ఏళ్ళుగా మనం సాగించిన కృషి ఫలితంగా పెల్లుబికిన ఆదివాసీ ఉద్యమానికి మేధావులు, ప్రజాతంత్రవాదులు, ఇతర అన్ని సెక్షన్ల ప్రజానీకం మద్దతు తెలపాలని కోరాం. హక్కుల సాధన కోసం ఉద్యమిస్తున్న ప్రజలపై ప్రభుత్వం, పోలీసులు, అరాచక శక్తులు ముప్పేట దాడులు సాగించడం, అక్రమ కేసులు బనాయించడం, నాయకత్వంపై, గిరిజనులపై పెత్తందారీ వర్గాలు దాడులకు పూనుకోవడం వంటి అణచివేత చర్యల్ని ఖండించమని విజ్ఞప్తి చేశాం. ఈ స్థితిలో అన్నింటినీ ఎదుర్కొంటూ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్స్‌ని హతమారుస్తామంటూ మావో యిస్టులు ప్రకటించడాన్ని-గద్దర్, వరవరరావు వంటి మేధావులు, ప్రజాతంత్ర వాదులు ప్రశ్నించాలని బహిరంగంగా తెలియపరిచాం. ఈ సభలో స్థానిక ప్రజలతోపాటు కోరాపుట్ నుండి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు. రైతుకూలీసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కా॥ఝాన్సి, కా॥ కోటయ్య, ఒరిస్సా చాషీ మూలియా ఆదివాసీ సంఘం నాయకులు కా॥శ్రీకాంత్ మోహంతి, ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.భాస్కరరావు, రచయితలు, మేధావులు ఈ సభలో మాట్లాడారు. సభకు ముందుగా ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో నగరంలోని మేధావులు కోరాపుట్ ఉద్యమం పట్ల ఆసక్తి కనబరిచారు.

## విఫలమైన విచ్ఛిన్నకుల కుట్రలు

శ్రీకాకుళం, విజయనగరం జిల్లా సంఘ నిర్మాణంలోని కొందరు స్వార్థపరులు, సంఘం ఈ ప్రాంతాల్లో నిలదొక్కుకొని విస్తరించి, ప్రజానాయకుడుగా విస్తృత గుర్తింపు పొందుతున్న తరుణంలో సంఘాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నారు. సంఘ నాయకత్వంపై నిరాధార ఆరోపణలు, నీచమైన ప్రచారాలు సాగించారు. రైతుకూలీ సంఘంలో చీలిక వచ్చిందని పత్రికలకెక్కి దోపిడీ శక్తులకు సంతోషం కలిగించారు. వీరి చర్యల వెనుకనున్న దురుద్దేశాలను, స్వార్థ ప్రయోజనాలను సంఘ నాయకత్వంలో ప్రజలు వెల్లడి చేశారు, తిప్పికొట్టారు. వీరి దిగజారిన ఆచరణ ద్వారానే ప్రజలు వీరి నిజస్వరూపాన్ని మరింత స్పష్టంగా చూడ గలిగారు–సంఘం వెనుక ధృడంగా సంఘటిత మయ్యారు.

## జిల్లా మహాసభలు

2008 సెప్టెంబర్ 5,6 తేదీలలో జరిగిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సమావేశం–జిల్లా స్థాయిల్లో మహాసభలు నిర్వహించాలని, రైతు, కూలీల సభ్యత్వాన్ని పెంపొందించాలని చేసిన నిర్ణయం మేరకు రాష్ట్రవ్యాపితంగా సంఘ నిర్మాణమున్న అన్ని కేంద్రాలలోనూ సభ్యత్వ క్యాంపెయిన్ జరిగింది. 2008 అక్టోబర్‌తో ప్రారంభమై 2009 ఫిబ్రవరి వరకు కృష్ణా, నెల్లూరు, విజయనగరం, నిజామాబాద్, శ్రీకాకుళం, గుంటూరు జిల్లాల్లో జిల్లా స్థాయి మహాసభలు జరిగాయి.

## వ్యవసాయరంగ సమస్యలపై అవగాహన పెంపు కోసం

రాష్ట్ర వ్యాపితంగా సంఘ నిర్మాణమున్న అన్ని జిల్లాల్లోనూ సంఘ సభ్యుల, కార్యకర్తల రాజకీయ అవగాహన పెంపు కోసం విస్తృత సమావేశాలు, తరగతులు నిర్వహించారు. విస్తృత ప్రజానీకానికి అవగాహన కలిగించేందుకు సదస్సులను నిర్వహించారు.

వ్యవసాయ రంగ సంక్షోభం; భూ పరాయీకరణ–ఛిద్రమౌతున్న గ్రామీణ జీవనం; వలస పాలనకు వ్యతిరేకంగా కార్మిక రైతాంగ పోరాటాలు–నేటికీ ప్రాధాన్యత కోల్పోని భూమి సమస్య; వ్యవసాయరంగ సంక్షోభం–ప్రపంచ వాణిజ్య సంస్థ; సెజ్‌లు–కోస్టల్ కారిడార్–బందరు పోర్టు అభివృద్ధి; 'సాగునీరు–విత్తనాలు–ఎరువులు–ప్రైవేటీకరణ; గ్యాస్, సహజ వనరులు–సామ్రాజ్యవాద, బడా పరిశ్రమల దోపిడీ–పాలకుల విధానాలు; రైతాంగ సమస్యలు–కారణాలు–రైతాంగ కర్తవ్యాలు; సామ్రాజ్యవాద ప్రపంచీకరణ–వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సంక్షోభం –కర్తవ్యాలు; తీవ్రమౌతున్న కరువు–దుర్భర మౌతున్న రైతాంగ–కార్మిక జీవితాలు–తక్షణ, శాశ్వత పరిష్కారాలు; అనే వివిధ అంశాలపై జిల్లాలలో సదస్సుల నిర్వహణ ద్వారా సమస్యలపై ఎప్పటికప్పుడు సరైన అవగాహనను అందించి, కార్మిక, రైతాంగ ఐక్య పోరాటాల ఆవశ్యకతను నొక్కి చెపుతూ కర్తవ్యాలు రూపొందించుకుని విస్తృత ప్రచార ఆందోళనలను చేపట్టారు. అనేకమంది ప్రజాతంత్ర వాదులు, మేధావులు, ప్రజలు ఈ సదస్సుల్లో పాల్గొన్నారు.

## 2005–'10 మధ్యకాలంలో ప్రచురించిన సాహిత్యం

2008 అక్టోబర్ 20న రై.కూ.సం వార్షిక సంచిక ఆవిష్కరణ సభను హైదరాబాద్‌లో నిర్వహించాం. డా॥బి.డి. శర్మగారు ఈ సంచికను ఆవిష్కరించారు. ఇదే సభలో 'సామ్రాజ్యవాద చెరలో విత్తనాలు' అన్న రై.కూ.సం ప్రచురణను ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డా॥కె.ఆర్.చౌదరి ఆవిష్కరించి ప్రసంగించారు.

2005 అనకాపల్లి రాష్ట్ర మహాసభల సావనీర్; జలయజ్ఞంలో రైతాంగం–ప్రజలు సమిధలు కారాదు (2005 ఆగస్టు); ఆంధ్రప్రదేశ్‌లో నీటి పారుదల ప్రాజెక్టులు బుక్‌లెట్ (2005 నవంబర్); మన వ్యవసాయానికి ఉరితాడు–ప్రపంచ వాణిజ్య సంస్థ; సెజ్ చట్టం–2005; లోకుఖత్తాఇ –జనం పాటల పుస్తకాలు; 2007 రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) వార్షిక సంచిక; సామ్రాజ్య వాదుల చెరలో విత్తనాలు (2008); బి.డి.శర్మ రచించిన 'రెండు దేశాల కథ'కు తెలుగు అనువాదం (2010 మార్చి) లతో పాటుగా సమకాలీన సమస్యలపై నిరంత రాయంగా కరపత్రాలు ప్రచురిస్తూ విస్తృత ప్రజానీకం, శ్రేణుల మధ్య ప్రచార కృషి సాగిస్తూ వస్తున్నాం.

**కామ్రేడ్స్,**

గత 5 సంవత్సరాల కాలంగా రాష్ట్రంలో మన నిర్మాణం, సంబంధాలున్న ప్రాంతాలన్నింటిలో రైతు, కూలీ, గ్రామీణ పేదల మధ్యన సాగించిన కార్యక్రమాలను సంక్షిప్త రూపంలో ఈ నివేదికలో పొందు పరిచాము.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వేగవంతం చేస్తున్న పాలకులు– వ్యవసాయ రంగంలో ముందుకు తెచ్చిన, తెస్తున్న వ్యవసాయ వ్యతిరేక, రైతాంగ వ్యతిరేక విధానాలను ముందుగానే పసిగట్టి, హెచ్చరిస్తూ, వాటికి వ్యతిరేకంగా స్పష్టమైన, ఖచ్చితమైన వైఖరులతో రాష్ట్ర కేంద్రం నుండి, జిల్లా, గ్రామస్థాయి వరకు మన నిర్మాణమున్న అన్ని కేంద్రాలలోనూ రైతు, కూలీ, గ్రామీణపేదల మధ్య నిలిచి కార్యక్రమాలను సాగించి నాయకత్వం వహించాము.

నానాటికీ తీవ్రమౌతున్న వ్యవసాయ రంగ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు, భూపరాయీకరణకు, విత్తన స్వతంత్రతను సామ్రాజ్య వాదుల ధారాదత్తం చేసే బిటి విత్తనాల ప్రవేశానికి వ్యతిరేకంగానూ, సాగునీటికి మీటర్ల బిగింపుకు వ్యతిరేకంగానూ, నీటి ప్రైవేటీకరణను నిరసిస్తూనూ, కౌలు రైతాంగ సమస్యలపైనా, గిట్టుబాటు ధరల వంటి అనేకానేక సమస్యలపై రైతాంగాన్ని చైతన్య వంతం చేయటంతో పాటుగా నిలకడైన ఆందోళనల నిర్మాణ దిశగా నిరంతరాయ కృషి సాగిస్తున్నాం.

దేశవ్యాపితంగా ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, వ్యవసాయ మండళ్ళు పేరిట పార్కులు, పోర్టులు, ప్రాజెక్టుల పేరిట లక్షలాది ఎకరాల సాగు భూములను బలవంతంగా రైతులనుండి గుంజివేస్తూ, వాటినన్నీ పారిశ్రామిక అభివృద్ధి పేరిట బహుళజాతి పరిశ్రమల, బడా కంపెనీల పరం చేస్తుండ

టాన్ని నేడు మరింత స్పష్టంగా చూడ గల్గుతున్నాం.

సెజ్‌ల పేరుతో సాగుతున్న ఈ ప్రజాజీవన విధ్వంసం, భూపరాయీకరణ, లక్షలాదిమందిని అడవి నుండి, భూముల నుండి, గ్రామాల నుండి నిర్వాసితుల్ని చేస్తున్న నేటి స్థితిలో ఈ విధ్వంసక అభివృద్ధిని వ్యతిరేకిస్తూ 'వాన్‌పిక్' ప్రాంతంలోనూ, పోలవరం ప్రాజెక్టు తదితర అనేక ప్రాంతాల్లో నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడు తున్నాం.

మన పొరుగు రాష్ట్రమైన ఒరిస్సాలోని కళింగనగర్‌లోనూ, పోస్కో వ్యతిరేక ఆందోళన ల్లోనూ వున్న ప్రజానీకానికి, ఆదివాసులకు మద్దతుగా నిలిచాం. పశ్చిమబెంగాల్‌లోని సింగూరు, నందిగ్రామ్‌లలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా క్రియాశీలక మద్దతునందించాం. మన రాష్ట్రంలో ఇనుప ఖనిజ లూటీకి వ్యతిరేకంగా ఐక్య ఆందోళనను సాగించాం.

ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు ఆదివాసీ ప్రాంతాల్లో భూమిహక్కు కోసం పోరాడే క్రమంలో సారా వ్యాపారుల, పెత్తందారుల, రౌడీగుండాల భౌతిక దాడులను, హత్యలను, అత్యాచారాలను, అక్రమ కేసులను, రాజ్య నిర్బంధాలను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నాం. నిలకడగా సాగుతున్న మన రైతుకూలీ ఉద్యమానికి నిజాయితీపరుల, ప్రజాతంత్రవాదుల, మేధావుల, ఉద్యమ శ్రేయోభిలాషుల సంఘీభావాన్ని, ఉద్యమానికి ప్రత్యక్ష తోడ్పాటును పొందగలిగాం.

ఆదివాసుల హక్కులను ఒక వైపున కాలరాస్తున్న పాలకులే మరోవైపున అటవీ హక్కుల చట్టం పేరిట ఆదివాసుల్లో భ్రమలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ భ్రమలను తొలగించే కార్యాచరణను చేపట్టాం. దళితులపై గ్రామీణ అగ్రకుల పెత్తందార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిరంతరాయ కార్యక్రమాలను చేపట్టాం.

ప్రభుత్వ బంజరు, దేవాలయ, ఫారెస్టు బంజరు తదితర భూములపై పేదలకు హక్కు కల్పించవలసిందిపోయి, భూసంస్కరణ చట్టాలను ఏనాడో అటకెక్కించిన పాలకులే లక్షల ఎకరాలను పేదలకు విడతల వారీగా పంపిణీ చేయబోతున్నట్లు నాటకాలాడు తున్నారు. ఈ దుర్మార్గాలను మనం శక్తివంతంగా వెల్లడి చేశాం.

గ్రామీణ ప్రాంతాల్లో రైతాంగాన్ని దివాళా తీయించటం ద్వారా, భూమిపై ఆధారపడి జీవిస్తున్న రైతుకూలీల ఉపాధిని తీవ్రంగా దెబ్బతీసిన పాలకులే, ఉపాధి హామీ పథకం పేరిట వేల కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తూ దళారీ రాజకీయ నాయకులకు, అవినీతి అధికారులకు దోచిపెడ్తున్నారు. ఈ ఉపాధి హామీ పథకంలోని అవక తవకలు,అక్రమాలపై విస్తృత కార్యక్రమాలు చేపట్టాము. వలస కూలీల సమస్యల పరిష్కారానికి, ఉపాధి కల్పనకై ఆందోళనలు సాగించాము.

కరువు, వరదలు దోపిడీ పాలకులు సృష్టించినవేననే అవగాహన, చైతన్యాన్ని ప్రజలకందించటంతోపాటుగా, ఆయా వైపరీత్యాల సందర్భంగా ప్రజల్ని బిచ్చ గాళ్ళుగా దిగజారుస్తున్న పాలకుల నీచత్వంపై ధ్వజమెత్తాం-ఒక హక్కుగా ప్రజలకు తక్షణ, దీర్ఘకాల సహాయ, పురావాసాలనందించాలని ఎలుగెత్తాం. రైతులుగా కనీస గుర్తింపు లేని కౌలురైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టితో ఆందోళన సాగించాం.

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రైతుకూలీ ఉద్యమ చైతన్యాన్ని పెంపొందిం చేందుకు, దోపిడీ పాలకుల బండారాన్ని వెల్లడి చేసేందుకు విస్తృత ప్రచార కృషిని చేపట్టాం.

వ్యవసాయరంగ సంక్షోభ విభిన్న పార్శ్వాలను వివరించే విస్తృత పుస్తక, కరపత్ర సాహిత్యాలను అందిస్తూ వస్తున్నాము.

తెలంగాణా సాయుధ పోరాట, శ్రీకాకుళ గిరిజనోద్యమాలలోనూ, కొండమొదలు, దుగ్గేరు, మనుగోపాల, కోరాపుట్ తదితర ఉద్యమాల క్రమంలో అమరులైన వారి వర్ధంతి సభలను నిర్వహించటం ద్వారా విప్లవ వారసత్వాన్ని ముందుకు కొనిపోయే కృషి సాగిస్తున్నాం.

గత 5 సంవత్సరాల క్రమంలో వరంగల్, నల్గొండ, నిజామాబాద్ జిల్లాలో మన కృషిని విస్తృతపరచుకున్నాం. 2009లో వరంగల్ జిల్లాలో రైతుకూలీ రంగంలో పనిచేస్తున్న కామ్రేడ్స్, ఉద్యమమూ మన సంఘంతో విలీనమవటాన్ని మన మహాసభ స్వాగతిస్తున్నది. అలాగే ఈ కాలంలో-మన ఉద్యమం కొన్ని జిల్లాలో అరాచకుల, విచ్ఛిన్నాలకు గురైంది. ప్రజలను అంటి పెట్టుకొని ఉండటం ద్వారా వాటిని తిప్పికొట్ట గలిగాం. ప్రజలను ఐక్యంగా నిలబెట్టి ముందుకు సాగుతున్నాం.

అయినప్పటికీ, సాధించవలసింది ఇంకా ఎంతో వుంది. సంఘాన్ని గ్రామస్థాయి నుండి సభ్యత్వ ప్రాతిపదికన గ్రామ కమిటీల నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలి. జిల్లా, గ్రామ కమిటీల ఫంక్షనింగ్‌ను మెరుగు పర్చుకోవటంతో పాటుగా రైతు, కూలీ, గ్రామీణ పేదలను ముఖ్యంగా ఈ దోపిడీ వ్యవస్థ మార్పు కొరకు, దున్నేవానికే భూమి సాధ్యమయ్యే వ్యవసాయక విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవ సాధన కొరకు, కార్మిక-రైతాంగ ఐక్యతతో సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీ పీడనలను తుద ముట్టించేందుకు సమీకృతులను చేయాలి. సమరశీల పోరాటాల దిశగా రైతు, కూలీ గ్రామీణ పేదలందరినీ ఐక్యంగా నడిపేందుకు సంసిద్ధులమవుదాం.

*వ్యవసాయక విప్లవం వర్ధిల్లాలి!*
*నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!*
*అమరవీరులకు జోహార్లు!*

విప్లవాభినందనలతో,
**ఎస్.ఝాన్సీ**
అధ్యక్షులు
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర)**
రాష్ట్రకార్యవర్గం

**ఒంగోలు**
**కా॥కానూసన్యాల్‌నగర్**
**2010 ఏప్రిల్ 12, 13, 14 తేదీలు**

ప్రసంగ వ్యాసం

# 'ప్రజాపంపిణీ వ్యవస్థను నీరుగారుస్తున్న ప్రభుత్వాలు'



> **మన దేశంలో వ్యవసాయం గురించి ప్లాన్ అనేది చేయాలంటే, ఎవరైతే ఆహారభద్రత గురించి చట్టమే తీసుకొస్తున్నామని మాట్లాడుతున్నారో వీళ్ళు ఏం చేయాలంటే ఐదు నుండీ ఏడేళ్ళకు ప్లాన్ చేయాలి. ఐదేళ్ళు, ఏడేళ్ళ దాకా వ్యవసాయానికి మన మొక ప్లాన్ చేసి, ఆ ఏడేళ్ళలో ఎన్నిసార్లు మనకి వర్షాలు రావు, ఎన్నిసార్లు సక్రమంగా వుంటాయి. ఉత్పత్తి ఎలా వుటుంది, దాన్ని బట్టి స్టాక్స్ మనం ఎలాగ పెట్టాలి. ఇన్ని ఆలోచించాలి.**

**శ్రీ కె.ఆర్. వేణుగోపాల్**
**ఐ.ఎ.ఎస్ (రిటైర్డ్)**

మిత్రులారా! మహాసభలకు హాజరైన వారందరికీ మొదటగా అభినందనలు! ప్రజా పంపిణీ వ్యవస్థ గురించి నేను ప్రధానంగా ప్రస్తావిస్తాను.

ఇప్పుడు వున్న చట్టం ప్రకారం-మిల్లర్లు మర ఆడించిన బియ్యంలో 50 శాతం ప్రభుత్వానికి లెవీ కింద ఇవ్వాల్సిందే. దానికి ప్రొక్యూర్‌మెంట్ ప్రైస్ అని చెప్పి ఒక ధర నిర్ణయించబడుతుంది. మిగిలిన దాన్ని వారు ఎక్కడైనా అమ్ముకోవచ్చు. ఈ రకంగా చేసిన దాన్ని ప్రొక్యూర్‌మెంట్ అంటాము. దాన్ని తీసుకెళ్ళి ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ యిండియా వారు గోదాముల్లో పెట్టుకొంటారు. దాన్ని మనకి అందజేస్తారు. దాన్ని మన రాష్ట్రానికి, మనకి అందజేసేసరికి కేంద్ర ప్రభుత్వానికి కొంత ఖర్చు అవుతుంది. కొనుగోలు చేసే ధరే కాక, దానిమీద కొన్ని ఖర్చులుంటాయి. దాన్ని తరలించటం, దాన్లో అరుగు, తరుగు-ఖర్చులు ఇవన్నీ వుంటాయి. ఇవన్నీ లెక్కలోకి తీసుకొని కేంద్రం రాష్ట్రాలకి సబ్సిడీ ఇవ్వమని చెప్పి, కేంద్రం కూడా సబ్సిడీ భరించి బియ్యం ఇవ్వటం జరుగుతుంది.

ఉదాహరణకు చెప్పాలంటే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మన ఆంధ్ర రాష్ట్రానికి గానీ, ఇతర రాష్ట్రాలకుగానీ బియ్యం 5 రూపాయల 65 పైసలకు ఇస్తోంది. మన రాష్ట్రం 5 రూపాయల 65 పైసలకు కొని రెండు రూపాయలకు చౌక ధరల దుకాణాల్లో అందజేస్తుంది. అంటే ఆ మూడున్నర రూపాయల పైగా మన రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నమాట. ప్రతి గ్రామానికి చౌక ధరల దుకాణం డీలర్‌కు ఇవ్వాల్సిన కమీషన్ కూడా ప్రభుత్వమే ఇస్తూ ప్రజలకు బియ్యం అందించాలి. మన రాష్ట్రంలో ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం భరించే సబ్సిడీ 2,200 కోట్ల దాకా వుంటుంది. నెల ఒక్కింటికి దాదాపు మూడు లక్షల టన్నులు చొప్పున 36-37 లక్షల టన్నుల దాకా సరఫరా చేస్తారు. దాని మీద నేను ఇంతకుముందు చెప్పినట్లు రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ వుంటుంది. ఇది కాక కేంద్రం కూడా ఇచ్చే సబ్సిడీ అన్నీ కలిపి 30-40 వేల కోట్ల దాకా వుంటుంది. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, మనం యాక్టివిస్టులుగా ఏ ప్రజల హక్కుల గురించి పోరాడుతామో, మనకి ఈ విషయాలన్నీ తెలియకపోతే మనం చేయాల్సిన పోరాటానికి ఒక ఆధారం కూడా వుండదు. ఒక పునాది వుండదు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందంటే, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందంటే ఆ డబ్బు ఎవరిదండీ? అది మన్మోహన్ సింగ్‌గారిది కాదు. మనందరం పన్నులుగా చెల్లించిన మన డబ్బు అది. మనం సేల్స్‌టాక్స్ కడతాము. ఇన్‌కమ్‌టాక్స్ కడతాము. ఇవన్నీ ప్రజల డబ్బు. అందుచేత సబ్సిడీగా ఏదైతే వెనక్కి వస్తుందో, అదంతా ప్రజల డబ్బు. అంచేత ఈ సబ్సిడీ అనేది, ఈ పంపిణీ వ్యవస్థ అనేది సక్రమంగా పనిచేస్తుందా, లేదా, అవినీతి లేకుండా పనిచేస్తుందా, లేదా? సక్రమంగా మనకు దొరకాల్సినవి అన్నీ దొరుకు తున్నాయా లేదా అని చూడడం-మన మౌలిక మైన హక్కు. అది మన మౌలికమైన బాధ్యత కూడా. ఇందులో హక్కులూ వున్నాయి, బాధ్యతలూ వున్నాయి.

ఆంధ్రరాష్ట్రంలో ఇదంతా పెద్ద ఎత్తున చేసే దానికి మొదలుపెట్టిన తర్వాత కేంద్రానికి కూడా దేశం మొత్తం మీద ఇలాగ ఏమైనా చేస్తే మంచిదవుతుందేమో అని ఆలోచన చేస్తున్నారు. ఆనాడు నేను కమీషనర్‌గా మిల్లర్ల దగ్గర ఐదు లక్షల క్వింటాళ్ళు ప్రొక్యూర్‌మెంట్ చేశాను. ఐదు లక్షల్ని ఇరవై ఐదు లక్షలు చేశాను. మిల్లర్లను ఆ ప్రకారం కంట్రోల్‌లో పెట్టాము. విజయభాస్కరరెడ్డి గారికి నేను చెప్పాను, మిల్లర్లు మీకు ప్రొక్యూర్‌మెంట్ ఇస్తారు.

అయితే మీ పార్టీకి లంచాలు ఇవ్వలేరు, అధికారులకి లంచాలు ఇవ్వలేరు. అని! కాంగ్రెసువారు 1982లో ముందు నవ్వారు, ఇదంతా జరిగే పనా అని!

ఆ సంవత్సరం నలుగు ౖదుగురు చీఫ్‌మినిస్టర్లు మారారు. అంజయ్య గారు, వెంకట్రామిరెడ్డిగారు–అందరూ వచ్చి పోయారన్నమాట. విజయభాస్కరరెడ్డిగారు వచ్చినప్పుడు నన్ను అడిగారు. నేను అప్పుడు కమీషనర్‌ను కాదు. ఆయనకి నా మీద ఉన్న నమ్మకం ఏమిటంటే– ఆముదాలవలస షుగర్ ఫ్యాక్టరీని, చచ్చిపోయిన దాన్ని నేను వెళ్ళి బతికించానన్నమాట. 'సార్, ఆంధ్ర రాష్ట్రంలో బియ్యం పంపిణీ తప్పనిసరిగా చేయాల, చేయగలము' అని నేను చెప్పాను ఆయనకి. అప్పుడు గబగబా మొదలుపెట్టారు కాంగ్రెస్ పార్టీ వాళ్ళు. అయితే ఈలోపు ఇందిరాగాంధీగారు ఎలక్షన్ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోయింది. రామారావు వచ్చారు. ఇప్పుడు, ఇవాళ కూడా చెప్తున్నారు, రెండు రూపాయల పథకం మాదే అని!

రామారావుగారు రెండు రూపాయలకి బియ్యం ఇస్తానని చెప్పారుగానీ, ఆయనకి ఈ విషయంలో అవగాహన చాలా తక్కువ. ఆయన ఏమనుకొన్నాడంటే సబ్సిడీ లేకుండా ఇచ్చేయగలము అని. నేను 'సార్, సబ్సిడీ 33 కోట్లు కావాలి' అంటే, 'వేణుగోపాల్ గారు–మా పార్టీలో చాలా పెద్ద మనుషులు వున్నారు. అందరూ సబ్సిడీ అవసరం లేదని చెప్పారు, కాబట్టి మీరు వాళ్ళతో ఒకసారి మాట్లాడాలి' అని ఆయన నాకు ఆదేశం ఇచ్చారు. 'నేను ఎవరితోనూ మాట్లాడనండీ, అవసరముంటే వాళ్ళనే నాతో మాట్లాడ మనండి. ఇది సబ్సిడీ లేకుండా జరిగే పని కాదు. అసలు లెక్కలు ఇవీ' అంటే అప్పుడు ఆయనకి అర్థ మయిందన్నమాట! ఇన్ని కష్టసుఖాల్తో ఈ రెండు రూపాయల కిలో బియ్యం వచ్చిందన్న మాట.

రెండు రూపాయల కిలోబియ్యం ఈ రోజు దాకా నిలబడిందీ అంటే దానికి కారణం ఒకటే. ప్రజలకి తిండి గింజలు, న్యాయమైన ధరలకు కాదు, ఇంగ్లీషులో చెప్పాలంటే ఎఫర్డబుల్ ప్రైస్‌కు, ఏ ధర అయితే మనం ఇవ్వగలమో–నేను ఇంగ్లీషులో చెప్తాను. మీరు క్షమించాలి, చాలా వరకు పాలసీ చేసే వాళ్ళందరూ కూడా రీజనబుల్ ప్రైస్‌లో దొరకాల అంటారు. దటీజ్ నాన్సెన్స్. రీజనబుల్ ప్రైస్ అంటే ఎవరికి రీజనబుల్? వేణుగోపాల్‌గారికి ఈ రిస్ట్‌వాచ్ రీజనబుల్ అండి, రైతుకూలీకి తిండి రీజనబుల్ అండి. Reasonable is not the point in policy of food, affordability is the Key. నేను ఏ మేరకి ఎఫోర్డ్ చేయ గలను? రైతుకూలీకి రెండు రూపాయలకి ఇచ్చారండి ఆ రోజుల్లో. ఈ ప్రోగ్రాం అందుచేత నిలబడింది. పునాది చాలా గట్టిగా వేసిన దాని వల్ల నిలబడింది ఇది.

దీన్లో ఇప్పుడు మీకు చెప్పాల్సింది ఏమిటంటే–ఎప్పుడైతే కేంద్ర ప్రభుత్వం 1992లో నరసింహారావుగారి టైమ్‌లో కొన్ని మార్పులు తీసుకురావాలి ఈ పంపిణీ విధానంలో అని చెప్పినప్పుడు నేను ఆయన దగ్గర సెక్రటరీగా వున్నాను. ఆ రోజుల్లో నేను ఆయనకి చెప్పాను 'సార్, దీన్నొక టార్గెటెడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌గా చేయాలి, ఆంధ్ర రాష్ట్రంలో చేసినట్లు. మొత్తం దేశంలో చేయాలి. మనం రాష్ట్ర ప్రభుత్వాలకి ఆదేశాలు ఇవ్వాలి. అది లాలూప్రసాద్‌గారు కానీ, ఎవరు కానీ మనం ఆదేశం ఇవ్వాలి. ఎవరు దారిద్ర్య రేఖకు దిగువన వున్నారో, ఎవరు బీదలో, అంటే షెడ్యూల్డు కులాలకు చెందిన వారందరూ, షెడ్యూల్డు ట్రైబ్స్‌కు చెందిన వారందరూ, కాయకష్టం చేసే వారందరూ, లేబర్ మొత్తం ఇవన్నీ మనం ఐడెంటిఫై చేసి, లెక్కలు తీసి, వారికి గుర్తింపు కార్డు ఇచ్చి, ఆ కార్డులో 30 కేజీలదాకా ఇవ్వాల'ని ఆ రోజుల్లో సలహా ఇస్తే, ఆ రోజున మనకి విత్తమంత్రిగా వున్న మన్మోహన్‌సింగ్‌గారు దీన్ని వ్యతిరేకించారు. ఇప్పుడు చేస్తానంటు న్నాడాయన. పదిహేనేళ్ళ క్రితం చేయను అని చెప్పిన వ్యక్తి ఇపుడు ఎవరి కోసం చేస్తున్నా డండి? ఎవరి కోసం చేస్తున్నాడనేది నేను చెప్పదలచుకోలేదు. మీరందరూ గ్రహించాలని చెప్పి కోరుతున్నాను. అర్జన్సీ అనేది ఎక్కడి నుండి వచ్చింది? మీరందరూ ఆలోచించాలి. మీకు తెలుసు. రాజకీయంలో ఏబిసిడీలు తెలిసిన వాళ్ళకు కూడా తెలుసు–ఇంత తొందరగా ఎందుకోసం జరుగుతోందనేది.

అప్పుడు మన నరసింహారావుగారు అంత ధైర్యం చేసే మనిషి కాదు అని మీ అందరికీ తెలుసు. ఆ రోజుల్లో వరల్డ్‌బ్యాంక్ ఒకవైపు, మన్మోహన్‌సింగ్ ఇంకోవైపు. ఏదో ఫిస్కల్ డెఫిసిట్ అని అబద్ధాలు చెప్పారు. ఈ రోజు ఫిస్కల్ డెఫిసిట్ 11 శాతానికి వెళ్ళింది. దాని గురించి అడిగిన పాపాన ఎపుడూ పోలేదు. ఆ రోజుల్లో 5 శాతానికి పెద్ద గొడవ చేశారన్నమాట. అప్పుడు నరసింహారావుగారు ఏమి నిర్ణయం చేశారంటే, 'సరే వేణుగోపాల్, ఇది వద్దు. వెనకబడిన ఏరియాలను ఎన్ను కొందాం. అక్కడ 20 కేజీల బియ్యం, గోధుమ తక్కువధరలో ఇద్దాము' అన్నారాయన. అప్పుడు ఈ ఒక్క ప్రోగ్రామే దానికి Re wamped Public Distribution System అని పేరు పెట్టామండి. రాజస్థాన్‌లో మొదలు పెట్టామది. నరసింహారావుగారు '92లో ఇనాగరేట్ చేశారు. మన దేశంలో 6వేల బ్లాక్స్ ఉన్నాయండి, సమితులు, డెవలప్‌మెంట్ బ్లాక్స్. 1772 బ్లాక్స్‌లో 900 బ్లాక్స్ ట్రైబల్ ఏరియాస్, 700 బ్లాక్స్ డ్రాట్ ప్రోన్ బ్లాక్స్, అనంతపురం, కడప ఇటువంటి జిల్లాల్లో ఉన్న బ్లాక్స్ అన్నమాట. ట్రైబల్ బ్లాక్స్ అంటే మీకు తెలుసు కదా, ఐటిడిపి–ఈ సబ్ లైన్ ఏరియాలో వున్న బ్లాక్స్ దేశం మొత్తం మీద. మరి డిజర్ట్ డెవలప్‌మెంట్ బ్లాక్స్. రాజస్థాన్– అటువంటి ఏరియాలో డిజర్ట్ డెవలప్‌మెంట్ బ్లాక్స్. అవి 112 ఉండేవి ఆ రోజుల్లో. అన్నీ కలిపి 1772 బ్లాక్‌లు. వాటిలో 20 కిలో గ్రాములు హెవీగా సబ్సిడైజ్ చేసి ఇవ్వటం జరిగిందన్నమాట. అది అంత మంచి ఐడియా కాదు. అయినా నరసింహారావుగారు అలాగా–ఒక్కసారిగా దూకలేదు. అలా మెల్లిగా వెళ్ళేవాడాయన.

అప్పుడు ఇంకో పని చేశాం. Employ ment Assurance Scheme అని ఒకటి తీసుకొచ్చాం. ఈ వ్యవస్థలన్నీ పెరుగుతోంటే వాటితో పాటే నేనూ సర్వీస్‌లో పెరిగాను. కొన్ని అంతరంగికమైన విషయాలు చెప్పే వారెవ్వరూ వుండరు. ఈ అవకాశం తీసుకొని చెప్తున్నాను. ఎంప్లాయిమెంట్ ఎస్యూరెన్సు స్కీమ్‌ను ఈ 1772 బ్లాకుల్లో పెట్టామన్న

మాట. ఎందుకంటే ఆహారభద్రత ఉండాలంటే అది కేవలం రేషన్ షాపుల ద్వారా రాదు. ఎంప్లాయిమెంట్ వుండాలి. రైతు కూలీకి గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి. ఇవాళ మాట్లాడుతున్నారు. NREGA (ఎన్‌రిగా, ఎన్‌రిగా) అని. 1993లో నరసింహారావుగారి టైమ్‌లో ఈ ఉపాధి పథకం పెట్టటం జరిగింది. ఇదేమీ కొత్తగా వచ్చింది కాదు. మొత్తం 1772 బ్లాకుల్లో పెట్టించాం. ఇప్పుడు ఏదైతే పెట్టారో ఈ గ్యారంటీ అని మేము వాడలేదు. కానీ ఆ రోజు ప్రతీ కుటుంబంలో ఇద్దరికి ఉపాధి కల్పించాం. ఇవాళ ఈ గ్యారంటీ ప్రోగ్రామ్‌లో ఒక వ్యక్తికే వుందని బహుశా మీ అందరికీ తెలుసు. 1993లో ఆ రోజు ఇద్దరికి ఇచ్చినదాన్ని 2005లో ఇంకా ఎక్కువ చేయాలి కానీ, ఆమ్ ఆద్మీ అంటే ముందుకు తీసుకువెళ్ళాలిగానీ, సగం చేశారు. అయితే అందరం చూడాల్సింది ఏమిటంటే, ఒక పథకం వస్తే ఇంతవరకూ అది లేదని, ఇది గొప్ప పథకమని అనుకోవటం పొరపాటు. బీదప్రజలకు సంబంధించినంతవరకు వారి హక్కు గురించి మనం మాట్లాడుతున్నామని అంటే ఎప్పుడూ లేనిది ఇప్పుడు అడుగుతున్నాము అంటే – బిచ్చం కాదు ప్రజలకు కావాల్సింది. ప్రజలకు కావల్సింది వాళ్ళ హక్కు ఆ రోజు Employment Assurance Scheme ఆగస్టు 15, 1993, రెడ్‌ఫోర్ట్, ఇండిపెండెన్స్ డే స్పీచ్‌లో నరసింహారావుగారు అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. అనంతపురం జిల్లాకు అప్పటి వరకూ ఐదుకోట్లు వస్తోంటే, అది ఒక్కసారే 30 కోట్లు అయింది. It is a fact. ఇందులో కుటుంబంలో ఇద్దరికి వందరోజులు పని ఇవ్వటమే కాక, అందులో ఒక ఫుడ్ గ్రెయిన్ కాంపోనెంట్ వుండేది. కూలీ ఏదైతే వుందో, అందులో ప్రతి ఒక్కరోజుకి రెండున్నర కేజీల తిండిగింజలు కూడా వుండేవి. అది చాలా గొప్ప ఐడియా. ఎందుకంటే తిండిగింజలు సబ్సిడైజ్డ్ రేటులో మనం ఇస్తే వేజెస్ పెరిగినట్లు అన్నమాట. మీరు నాకు 80 రూపాయలు ఇస్తారు. నేను మార్కెట్లో 28 రూపాయలకు కొనటం–అన్నదాంతో పోలిస్తే నేను మీకు కుటుంబానికి రోజుకి సరిపోయే విధంగా కేజీ ఐదు రూపాయల చొప్పున రెండు కేజీలు ఇస్తాను అనంటే పది రూపాయలే కదండీ. అదీ కాక ఒక ఛాయిస్ కూడా ఇచ్చాం. ఆ పథకంలో రాశాం. ఎవరికైనా డబ్బు రూపంలో కావాలంటే ఆ రూపంలో తీసుకోవచ్చు. గింజలు కావలసిన వాళ్ళు గింజల రూపంలో తీసుకోవచ్చు. ఫలానాదే తీసుకోవాలని నిర్దిష్టంగా పెట్టలేదు. ఇవాళ National Rural Employment Gurantee Programme కింద there is no food component అన్న సంగతి మీ అందరికీ తెలుసు. So there is no real usage. And real wage is what. మన రాజ్యాంగంలో, అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో 43వ అధికరణంలో రియల్‌వేజ్ అనే అంశం వుంది. రియల్ వేజ్ ఎప్పుడొస్తుంది? ఏదైతే కొనుగోలు చేస్తానో, దానికి విలువ వుండాలి. అది రియల్ వేజ్ అవుతుంది. మినిమమ్ వేజ్ అనేది 1948 యాక్ట్. 1950లో రాజ్యాంగం వచ్చింది. Minimum wage is no more the ruling principle. The real wage is the ruling principle అని ఈ సభకి, ముఖ్యంగా యువకులకు చెప్తున్నాను. They should understand this point.

ఇవన్నీ మానేసి, మహారాష్ట్రలో పెట్టిన ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్‌ను కాపీకొట్టి, దాన్ని NREGA గా 2005లో పెట్టారు. ఇది అచ్చు మహారాష్ట్ర గ్యారంటీయాక్ట్ which is a very inadequate act, where as Employment Assurance Scheme was a superior scheme. అందుచేత ఈ NRGEA ఏదైతే వున్నదో, ఇది హక్కులేని హక్కు. హామీ లేని హామీ. ఇందులో మనం మోసపోకూడదు. ఏదో దొరికింది. ఇందులో అందరికీ ఎనభై రూపాయలు వచ్చాయి. అందులోనూ 30–35 రోజులు దాటి ఎవరికీ పని దొరకటం లేదు. అందుచేత మనం ఈ ఫైట్‌ను విరమించకూడదు. ఈ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్‌ను సవరించాలి. ఎలాగ సవరించాలి? కనీసం ఇద్దరికి పని ఇచ్చేది కావాలి. ఆలి–మగడు ఇద్దరూ వెళ్ళి పని చేస్తారు కదా పొలాల మీద, పిల్లల్ని కూడా తీసుకువెళ్తాం కదండీ. ఇంకా ఇది ఇద్దరు కాదండి ముగ్గురు వెళ్తారు. అటువంటి టైంలో నువ్వు ఒక వ్యక్తికి ఇస్తానని చెప్పి, పైగా అది గ్యారంటీ అని చెప్తే దానికేం అర్థం లేదు. ఎంప్లాయిమెంట్ ఎస్యూరెన్స్ స్కీమ్ తర్వాత ఇప్పుడు కొత్తగా, ఆహారభద్రత చట్టం ఒకటి మన దేశంలో తీసుకురాబోతున్నారు. దాని గురించి నేను మీతో మాట్లాడాలి. లేదంటే నేను మీటింగుకు రావడం అనవసరం. దాని గురించి మనం విశ్లేషించాలి. దాన్లో ఏమేమి కొరతలు, లోటుపాట్లు వస్తాయన్నది మనం గ్రహించి, దానితో ఇప్పటినుండే మనం పోరాటం మొదలు పెట్టాలి. దీన్లో అంశాలు ఏమిటంటే–మన రాష్ట్రంలో ఇచ్చేది 20 కేజీలే అని అందరికీ తెలుసు. అయితే కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఏమిటంటే ఈ పంపిణీ విధానం కింద 35 కేజీలు ఇవ్వాలనేది. మీకు అంత్యోదయ అన్న యోజన గురించి తెలుసు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో 17 లక్షలమందికి దానిని అందించాలి. మూడు రూపాయల చొప్పున 35 కేజీలు. మన రాష్ట్రం ఏం చేసిందంటే, ఏదైతే కేంద్రం నుండి దారిద్ర్యరేఖకు కిందనున్న వాళ్ళకు అని చెప్పి ఒక అలాట్ మెంట్ అంత్యోదయ యోజన అని ఒక అలాట్‌మెంట్ వస్తాయో ఇవన్నీ కలిపి మనం దుకాణంలో పెడుతున్నాము. ఇది చాలా ఇంపార్టెంట్ పాయింట్. వాళ్ళేమంటున్నారంటే 35 కేజీలను తగ్గించి 25 కేజీలు చేస్తామంటున్నారు. ఇది దేశవ్యాప్తమైన విషయం. ఆంధ్రా గురించి కాదు. అందుచేత రేపు వచ్చే ఆహారభద్రత చట్టం కింద, ఇప్పటిదాకా పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ కింద రేషన్ షాపుల్లో 35 కేజీలు ఇవ్వాలి అని వున్న కేంద్ర ప్రభుత్వ పాలసీ నీరు కారే అవకాశం వుంది. దీని మీద కాన్సెప్ట్ నోట్ అని తయారుచేసి దాన్ని అన్ని రాష్ట్రాలకు పంపించారు. ఆ కాన్సెప్ట్ నోట్‌ను నేను చూశాను. దాన్ని బట్టి ఈ ఇన్‌ఫర్మేషన్ మీ ఎదర పెడుతున్నాను. దీని ప్రభావం మన రాష్ట్రం మీద ఎలా వుంటుంది? మనము ఇప్పుడు 20 కేజీలే ఇస్తున్నాం. రామారావుగారి టైమ్‌లో 25 కేజీలు పెట్టాము. 25 కేజీలు పెట్టేసి అప్పుడు మేము అనుకున్నది ఏమిటంటే 25 కేజీలతో అయ్యే పనికాదు, మనం 35 కేజీల దాకా తీసుకు

వెళ్ళాలని చెప్పి ఆ రోజున నిర్ణయం. దాన్ని నాయుడుగారు-అందరూ కలిసి ఇరవై చేశారు ఆఖరికి. ఇప్పుడు ఈ 20 ఏమవుతుందంటే, కేంద్ర ప్రభుత్వం 25 అని చెప్తే, ఈ 20 వచ్చి 25 అవుతుంది. మంచిదే. అయినప్పుడు 2500 కోట్లు వున్న మన రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు 5 వేల కోట్లు అవుతుంది. ఇంచుమించుగా అంతదూరం వెళ్తుంది. ఇది ప్రభుత్వానికి చేతవుతుందా అన్నది కూడా ఆలోచించాల్సిన విషయం. ఈ విషయాలు ఇన్ని వున్నప్పుడు దీనికి పరిష్కారాలు ఏమైనా వున్నాయా? ఈ పరిస్థితుల్ని సరిచేసుకోవ డానికి మనం ఏం చేయాలన్న దానికి కొన్ని సూచనలను స్ట్రయిట్‌గా మీ ముందుపెట్టి, దాని కోసం మీరు పోరాటం జరుపుతారని భావిస్తూ ఈ విషయాలు మీకు చెప్తున్నాను.

ముఖ్యంగా అనంతపురం నుండి మన డాక్టరుగారు వచ్చారు, కేడర్స్ వచ్చారు. బ్రహ్మాండంగా పాడారు. వాళ్ళందర్నీ చూస్తే, మన ట్రైబల్ ఏరియాస్ నుండీ వచ్చినవాళ్ళని చూస్తే, నాకిప్పుడు 72 ఏళ్ళండీ, I am inspired.Iam inspired by what I saw today by them. ఎందుకంటే దశాబ్దాలుగా ఇలాంటి ప్రభుత్వాలతో సంబంధం పెట్టుకొని వుండి, అక్కడ నివసించిన వాళ్ళకి ఇన్స్పిరేషన్ రాదు. అయితే నాలాంటి వాడికే వచ్చిందంటే వాళ్ళు ఎంతో బ్రహ్మాండంగా, ఎంతో కమిట్‌మెంట్‌తో చేశారని నేను హృదయపూర్వకంగా చెప్తున్నాను. I want to take a photograph with them. I would like to take the photograph back home.

అనంతపురం జిల్లాల్లో పోయిన సంవత్సరం నేను ఒక సామాజిక తనిఖీ చేశాను, అంగన్‌వాడీ పథకం మీద. నా నేతృత్వంలో, కొన్ని గ్రామాలకు నేనే స్వయంగా వెళ్ళి చేశాను. ఈ అంగన్‌వాడీ ప్రోగ్రామ్‌ను నేను భారత ప్రభుత్వంలో జాయింట్ సెక్రటరీగా పనిచేసేటప్పుడు దేశం మొత్తం మీద అంగన్‌వాడీ ప్రోగ్రామ్‌ని నేను నడిపానండీ, మూడేళ్ళపాటు. ఎందుకివన్నీ చెప్తున్నానంటే ప్రజాపంపిణీగానీ, రెండు రూపాయలకు బియ్యం పథకంగానీ, అంగన్‌వాడీ కానీ నేను స్వయంగా చేసినవాణ్ని గనుగ, ఇవన్నీ మీ ఎదురుగా నిలబడి చెప్పేందుకు ధైర్యం చేస్తున్నాను. ఈ తనిఖీకి-ఛాయారతన్‌గారు, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉమన్ అండ్ ఛైల్డ్ డెవలప్‌మెంట్, 'మీరు వెళ్ళి, ఉన్నది వున్నట్లు రాస్తారు, రాయండి' అన్నారు. దాని మీద ఒక నివేదిక తెచ్చాను. రెండు మూడు నెలల్లో అది ఒక పుస్తక రూపంలో వస్తుంది. అది తెలుగు అనువాదం కూడా చేద్దామని అనుకొన్నాను. అది అందరికీ అందాలి.

ఇంతకుముందు చెప్పినట్లు ఇక మీదట ఆహారభద్రత లేదు. ఆహారభద్రత, పోషకాహార భద్రత-రెండూ కూడా మనం ఒకేసారి మాట్లాడాలి. ఎందుకంటే పోషకాహార భద్రత అనేది అమ్మాయిలకి, చిన్నపిల్లలకి, మహిళలకి, గర్భిణీస్త్రీలకు, బాలింతలికి-వీళ్ళందరికీ వర్తించే ప్రోగ్రామ్. అంగన్‌వాడీ ప్రోగ్రామ్‌లో గర్భిణీ స్త్రీకి రక్తహీనత అనేది వుండకూడదు. రక్తహీనత అనేది గర్భిణీ స్త్రీకి వుంటే పుట్టే పిల్ల చాలా డిఫెక్ట్స్‌తో పుదుతుంది. మెదడు దెబ్బతో పుట్టే అవకాశం చాలా వుంది. మెదడుగానీ ఒకసారి దెబ్బతింటే దాన్ని మళ్ళీ సరిచేయలేము. అందుచేత ఈ అంగన్‌వాడీ ప్రోగ్రామ్‌లో గర్భిణీ స్త్రీలను, బాలింతలను, పిల్లలు -ఆరేళ్ళ లోపు వయసున్న పిల్లలందరికీ కూడా ఆహారం, పోషకాహారం, టీకాలు, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, ఆహారభద్రత గురించి, ఆరోగ్య భద్రత గురించి అన్ని విషయాలూ చెప్పటం, గర్భిణీ స్త్రీలకి, బాలింతలకి, పిల్లలకి ఉన్న ఒక గొప్ప పథకమిది. అటువంటి పథకం అమలు కావటం లేదు. ఇక్కడే కాదు, భారతదేశం మొత్తంలో, అవన్నీ చూసేదానికి మన్మోహన్ సింగ్‌గారికి టైమ్ లేదు. ఆ ప్రోగ్రామ్ నాశనమై పోయిందని నేను నివేదిక రాశాను. మీటింగు పెట్టాను. మీటింగుకి రఘువీరారెడ్డిగారు వచ్చారు. కొండా సురేఖగారు వచ్చారు, అనంతపురంలో వేణుగోపాల్ ఒక్కడే ఇవన్నీ రాయగలడని అన్నారు. ఆవిడేమో రిజైన్ చేసి వెళ్ళిపోయింది. ఇప్పుడు ఆ ప్రోగ్రామ్ ఏం చేయాలి? ఈ సందర్భంలో ఆహార భద్రత, food, gurantee, food for all అనే చట్టం రేపొకటి వస్తుంది. ఇవాళ ప్రణబ్ ముఖర్జీగారు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో మీటింగు పెట్టు కొన్నారు. రేపువచ్చే చట్టంలో, ప్రజాపంపిణీ వ్యవస్థ మాత్రమే కాక, ఈ అంగన్‌వాడీ ప్రోగ్రామ్‌ను ఎలా మెరుగుపరచాలో, దానికి ఏమేమి గ్యారంటీలు వుండాలో కూడా ఇందులో భాగంగా వుండాలని మనమందరం డిమాండ్ చేయాలి. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా చట్టం కిందకి తీసుకు రావాలి. ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్ వుండాలి. ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్ ఎలా వుండాలంటే అందులో ఒక ఆహార కాంపోనెంట్ వుండాలి.

ఈ సందర్భంలో రైతు గురించి నేనొకటి చెప్పాలి. మన భారత దేశంలో 100 ఎకరాల భూమి వుంటే 35 లేక 36 ఎకరాల భూమికే నీటిపారుదల సౌకర్యం వున్నది. మన రాష్ట్రంలో అయితే 40 శాతం వుంటుంది. మిగిలిన 65-70 శాతం వివిధ రాష్ట్రాలను బట్టి మెట్ట ప్రాంతాలుగా వున్నాయి. మెట్ట ప్రాంతాల్లో వర్షం మీద ఆధారపడి వుంటాయి. We are a mansoon bound country. ఆ మెట్ట ప్రాంతాల్లో సక్రమంగా వర్షాలుపడి పంటలు పండినరోజు మన దేశం surplus country అన్న మాట. వర్షాలురాక, మాన్‌సూన్ ఎప్పుడైతే దెబ్బతింటుందో, అప్పుడు మన దేశంలో పంట పండక, కరువు, క్షామం అన్నీ వచ్చి ఉత్పత్తి పెద్ద ఎత్తున పడిపోతుంది. ఉదాహరణకు ఈ సంవత్సరం మన రాష్ట్రంలో 10 లక్షల టన్నుల బియ్యం దిగుబడి పడి పోయింది. రబీ లెక్కలు పూర్తిగా వచ్చాక, ఈ లెక్కని ఇంకా కరెక్టుగా చెప్పవచ్చు. నేను మీకు చెప్పగలను కనీసం మనకి లోటుపడేది పది లక్షల టన్నుల బియ్యమని. ఈ పది లక్షలు లేకుంటే, రేపు రేషన్ షాపుల్లో ఎక్కణ్ణుంచి తీసుకొచ్చి పెడతారు? ఎక్కణ్ణుంచి పెడతా రంటే పోయిన సంవత్సరంలో కొంత స్టాక్స్ మిగిలి వుంటాయి, అవి పెట్టారు. అయితే వచ్చే సంవత్సరం పంట లేదంటే మీకు భద్రత లేదు, ఆహారమూ లేదు, ఏదీ లేదు. అందుచేత

మన దేశంలో వ్యవసాయం గురించి ప్లాన్ అనేది చేయాలంటే, ఎవరైతే ఆహారభద్రత గురించి చట్టమే తీసుకొస్తున్నామని మాట్లాడు తున్నారో వీళ్ళు ఏం చేయాలంటే ఐదు నుండీ ఏడేళ్ళకు ప్లాన్ చేయాలి. ఐదేళ్ళు, ఏడేళ్ళ దాకా వ్యవసాయానికి మనమొక ప్లాన్ చేసి, ఆ ఏడేళ్ళలో ఎన్నిసార్లు మనకి వర్షాలు రావు, ఎన్నిసార్లు సక్రమంగా వుంటాయి. ఉత్పత్తి ఎలా వుటుంది, దాన్ని బట్టి స్టాక్స్ మనం ఎలాగ పెట్టాలి. ఇన్ని ఆలోచించాలి. మొత్తం భారతదేశం మీద చెప్పాలంటే బియ్యం – గోధుమల గురించి ఇప్పుడు నేను మాట్లాడ దలచుకోలేదు– 10 మిలియన్ టన్నుల లోటు వుండబోతోంది. This is hardly the year where you should be talking about the food security bill.



ఆదివాసీ ప్రజాకళాకారులతో శ్రీ కె.ఆర్. వేణుగోపాల్

Anyway, నా మనవి ఏమిటంటే employment becomes very important. ఎంప్లాయి మెంట్ గ్యారంటీ స్కీమ్ ఇటువంటి పరిస్థితిలో పెంచాలి. ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్‌లో 100 రోజులు పని కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే వాళ్ళు పని ఇవ్వకపోతే అందులో సగం కూలీ ఇస్తారట. హామీ ఇచ్చాక, హామీని కాపాడుకోకపోతే పది రూపాయలు అదనంగా ఇవ్వాలిగానీ, సగం ఇవ్వటం ఏమిటి? సగం ఇచ్చాక ఒక నెల రోజుల తర్వాత నాల్గవ వంతు ఇస్తారట. మీకు 100 రోజులకి– 80రూ॥లు, 100రూ॥లు చొప్పున ఉపాధి ఇవ్వకపోతే 80రూ॥లు నష్టపరిహారం ఇవ్వడానికి బదులు 40రూ॥లు ఇవ్వటం– ఇది ఎప్పుడూ–నెల రోజులు. ఆ తర్వాత 20రూ॥లు! ఇది హామీనా? దాని పేరు తెలుగులో హామీనా? లేక ఇంగ్లీషులో గ్యారంటీనా? ఇవన్నీ–వుంటే ఆహారభద్రత వుండదు.

ఇదీ తరుణం. మనం విశ్లేషించాల్సింది మొత్తం మన వ్యవసాయం, రైతు, కూలీ, వేతనాలు, ఈ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్‌లో హామీ అన్నమాట ఎక్కడైతే వచ్చిందో, ఏ హామీ ఎక్కడ వుందో చూడటం, మెట్ట వ్యవసాయం గురించి మనం ఆలోచించటం, దాన్ని చాలా పెద్ద ఎత్తున మనం మెరుగు చేయాలి. మెట్ట వ్యవసాయం మెరుగుపడక పోతే పావర్టీ అనేది పోదు. మన స్త్రీలు, మన పిల్లలు ఇలాగే వుంటారు. మనకి పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ఏదైతే వుందో– రెండు కోట్ల కార్డులంటే ఇంచుమించు 80% of the population poor. అందుచేత ఈ పంపిణీ విధానం మీద, ఎంప్లాయిమెంట్ గ్యారంటీ మీద, అంగన్‌వాడీ మీద, మధ్యాహ్న భోజన పథకం మీద, న్యూట్రిషన్ ఎడ్యుకేషన్ –ఈ మొత్తాన్ని కవర్ చేసేది మెట్ట వ్యవసాయం. ఈ చర్యలన్నీ మనం తీసు కొంటేనే మనకి దారిద్ర్యం అనేది తగ్గుతుంది. చదువుకీ, వేతనాలకీ, తిండికీ ఎంత సంబంధం వుందో నేను ప్రత్యేకించి చెప్పనవ సరం లేదు. పిల్లలు, గర్భిణీ స్త్రీలు–రక్తహీనత –మన ఆంధ్రాలోగానీ, భారతదేశంలోగానీ మామూలు మహిళలకి, గర్భిణీ స్త్రీలకు రక్తహీనతలో తేడా లేదు. అంటే 58% మామూలు మహిళలు, గర్భిణీలు కాని మహిళలు, 59% గర్భిణీ స్త్రీలు రక్తహీనతతో

వున్నారు. 60 శాతం మహిళలు రక్తహీనతతో గర్భం ధరిస్తే, పుట్టే పిల్ల తప్పనిసరిగా రక్తహీనతతోనే పుడుతుంది. డిఫెక్ట్స్‌తోనే పుడుతుంది. వీటన్నింటిలో మార్పులు తీసుకురావాలి.

లాస్ట్ పాయింట్ ఏమిటంటే ఆహార భద్రత చట్టం తీసుకొస్తున్నామని ప్రణబ్ ముఖర్జీగారి ఆధ్వర్యంలో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ మీటింగు నిన్న జరిగింది. చట్టం తీసుకొస్తారట. హక్కు అంటే ఏమిటి? హామీ ఇచ్చారు. ఆ హక్కు ఉల్లంఘించబడితే దానికి పరిహారం ఉండాలి కదా! అది ఎలా చేస్తారు? ఇప్పుడు మనకి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రామ్ మూడేళ్ళుగా అమలులో వుంది. ఒక్క రూపాయి నష్టపరిహారం ఎవరన్నా ఇచ్చారా? వందరోజులు పని ఇవ్వాల్సింది 30 రోజులు, 35 రోజులు ఇచ్చారన్నమాట. మిగిలిన 65 రోజులకి నష్టపరిహారం ఇచ్చారా? భారతదేశం మొత్తం మీద ఎక్కడా ఇవ్వలేదు. ఇదే పరిస్థితి రేపు, నీకు 25 కేజీల బియ్యం ఇస్తాను-అని చెప్పేసి నువ్వు ఇవ్వకపోతే మరల మా పరిస్థితి ఇదేనా అని మీరందరూ అడగాలి. నోరు మూసుకొని ఉండమాకండి. ఇవన్నీ యదార్థాలు. సి.ఎన్. అన్నాదురైగారికి ఎవరూ నోబెల్ ప్రైజ్ ఇవ్వలేదు. అమర్త్యసేన్‌గారికే ఇచ్చారు. ఆకలి గురించి ఎవరైనా రాస్తే వాళ్ళకి నోబెల్ ప్రైజ్ దొరుకుతుంది, నిజంగా బీదవాడికి కడుపుకి తిండిపెడితే వాళ్ళకి ఏ అవార్డులూ వుండవు. కోట్లాదిమంది ప్రజలు, అంతకుముందు తిండిలేని వాళ్ళు తిండి తిన్నారు. ఏ పార్టీకి చెందిన వాళ్ళన్నది మనకి అనవసరం. మనకి అవసరం పథకం. దాన్ని బట్టే మనలాంటి వాళ్ళం మాట్లాడాలి. అప్పుడే న్యాయం జరుగుతుంది బీదలకి.

ఈ మధ్యలో కొంతమంది కొన్ని లెఫ్టిస్టు వర్గాలు కూడా- ఈ ప్రజాపంపిణీ వ్యవస్థ కింద కార్డులు మొత్తం జనాభాకి ఇవ్వాలి, బీదలకే పరిమితమై ఉండకూడదు అని చెప్తున్నారు. దీనికంతా కారణం అభిజిత్‌సేన్ కమీషన్ రిపోర్టు. అభిజిత్‌సేన్ ప్లానింగ్ కమీషన్ మెంబరు, మంచి మనిషి. బియ్యానికి, గోధుమలకి తేడా తెలియని వాళ్ళు-వాళ్ళు ఏం చెప్తున్నారంటే, ఈ టార్గెటెడ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌లో ఈ టార్గెట్ అనేది మనము ఎప్పుడూ చేయలేము, చాలా కష్టం, బీదరికం అనేది మనం నిర్ణయించలేము, కనుక కె.ఆర్.వేణుగోపాల్‌కి కూడా ఒక కార్డు ఇవ్వాల, ఇంకా అంబానీ గారికి కూడా ఒక కార్డు ఇవ్వాల, అందరికీ ఇవ్వాలి అని-ఎవరు చెప్తున్నారండీ? కొందరు లెఫ్ట్‌వాళ్ళు. యూనివర్సల్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ అని అభిజిత్‌సేన్ కమీషన్ మొదలు పెట్టారు ఈ నాన్‌సెన్స్‌ని, వీళ్ళందరూ దాన్ని చిలకల్లాగా మరల మరల చెప్తున్నారు. నా మనవి ఏమిటంటే ఇది అన్యాయం. అర్హత లేని వాళ్ళని తీసుకొచ్చి ఒక ప్రోగ్రామ్‌లో పెడితే, అర్హతలేని వాళ్ళు అర్హత ఉన్న వాళ్ళని తోసేస్తారు, తోసేశారు అన్నది మనకందరికీ తెలుసు.

బలం ఉన్నవాళ్ళు, బలహీనులు-ఇద్దర్నీ తీసుకువెళ్ళి అదే చౌక దుకాణంలో పెడితే బలం వున్నవాడికే దొరుకుతుంది కానీ బలహీనులకి ఎలా దొరుకుతుంది? దీనికి చదువుకావాల్నా? ఇది ఏమన్నా కొత్త ఐడియానా? ఇది కూడా కొంతమందికి అర్థం కాదు. ఎందుకంటే ఇప్పుడు వాళ్ళకి మిడిల్ క్లాస్ ఓట్లు కావాలి. మిడిల్‌క్లాస్ ఓట్స్ కోసం కొందరు మాట్లాడటం వల్ల వచ్చిన ప్రాబ్లెమ్ అది. ఈ యూనివర్సల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ అనేది, ఐయామ్‌సారీ, అమర్త్యసేన్‌గారు కూడా సపోర్ట్ చేస్తున్నారంటే, ఆయన ఇటూగాక, అటూగాక మాట్లాడుతున్నాడు. It is not an idea to be dismised అన్నాడు. He used double negative to make it a positive. అమర్త్యసేన్ అయితే, ఎవరయితే మనకేమి? ప్లానింగ్ కమీషన్ వాళ్ళు బీదరికంలో వున్న ప్రజానీకం 32%, 28% అని అబద్ధాలు చెప్తున్నారు. ప్లానింగ్ కమీషన్ చెప్పే ఫిగర్స్ అబద్ధాలు. ఆ సబ్సిడీలు అన్నీ కూడా బీద ప్రజలకే దక్కాలి కనుక ఈ యూనివర్సల్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ అనేదాన్ని మనం ఎవరం కూడా ఒప్పుకోకూడదు అని చెప్తూ, ఈ విషయాలన్నీ మీరు ఆలోచించగలరని చెప్పి, నాకు ఇంత పెద్ద అవకాశం ఇచ్చినందుకు అందరికీ కృతజ్ఞతలు.

## ఎండా వానలలోను

చెరబండరాజు

ఎండావానలలోన
కొండా కోనలలోన
కూడూ గుడ్డా కొరకు
పదరానీపాట్లూ పడు
కూలీ బిడ్డల్లార
కూడీ వుండాలిరా
కోటా గోడలు అన్ని
కూలా దొయ్యాలిరా ॥కూలీ॥

పెకిలించక పెల్లేదీ
నీచేతికి అందదురా
విసరకుండ ఏ రాయీ
దూరాన పడదురా ॥కూలీ॥

నేలాతల్లిని దొరలు
చెరబట్టీ ఉన్నారు
పాడిపంటలు మెక్కి
కొవ్వెక్కీ ఉన్నారు
చేతనైన పోరాటం
చేస్తూ చావాలిగాని
అణగిమణగి వుండొద్దూ
ఆకలితో మాడొద్దూ ॥కూలీ॥

మన అమ్మల అమన అయ్యల
తోలుకొనే పోతాము
ఊరువాడ ఒకటిజేసి
ఏరోలే ఉరుకుదాము
ఎదురొచ్చిన దుష్టులపై
పదునుకత్తు లెత్తుదాము ॥కూలీ॥

ప్రసంగ వ్యాసం

# 'విప్లవ విజయం తథ్యమన్న కామ్రేడ్ టి.ఎన్. మాట నిజమౌతుంది'



పడీ పడని వర్షాలతో. అందీ అందని రుణాలతో, గిట్టీగిట్టని ధరలతో వాళ్ళు దేశం మొత్తాన్ని సబ్సిడైజ్ చేస్తున్నారు. ఇవాళ ప్రభుత్వాలు కాదు సబ్సిడైజ్ చేస్తున్నది, రైతాంగం, రైతుకూలీలు ఈ దేశానికి ఆహారాన్ని సబ్సిడైజ్ చేస్తున్నారు. వాళ్ళ చెమటను ధారపోసి, శ్రమను ధారపోసి, వాళ్ళ రక్తహీనతను ధారపోసి, వాళ్ళ భవిష్యత్తును ధారపోసి, వాళ్ళ వర్తమానాన్ని తాకట్టు పెట్టి రకరకాల పీడక శక్తులకి– దేశానికి వాళ్ళు ఆహార ధాన్యాలను అందిస్తున్నారు.

డా॥బి.సూర్యసాగర్
తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులు

మహాసభలకు హాజరైన అందరికీ వందనాలు. ఇటీవలే అమరుడైన ఒక మహా విప్లవ కారుని ప్రాంగణంలో ఈ సభలు జరుపు కొంటున్న మీకు మరో గొప్ప విప్లవకారుడి స్మారకంగా మేం ఏర్పరచిన ట్రస్ట్ తరపున అభినందనలు చెప్తున్నాను. ఈ ఇద్దరు మహానుభావులు కూడా భారతదేశ విప్లవం ప్రజాయుద్ధ పంథాలో సాగడానికి సైద్ధాంతి కంగా, ఆచరణరంగంలో పునాదులు వేసిన మహనీయులు. అందువల్ల భారతదేశంలో అన్ని పీడిత వర్గాల వారికీ వాళ్ళు ప్రేమ పాత్రులు. అందుకే ఈ రోజు కన్నీటితో వాళ్ళని తలచుకొంటున్నాం. మీరు కానూ సన్యాల్‌గారి ప్రాంగణంగా నామకరణం చేసి, మీ మహాసభలు జరుపుకొంటున్నందుకు అభినందనలు.

62 ఏళ్ళ స్వాతంత్ర్యం తర్వాత కూడా రైతుకూలీసంఘాలు ఏర్పరచుకొని, 'రైతులకు హక్కులు కావాలి, కూలీలకు హక్కులు కావాలి, ఈ దేశ ప్రజలకు ఆహార భద్రత కావాలి, ఈ దేశ ప్రజలకు కడుపు నిండా తిండి కావాలి, పోషకాహారం కావాలి, ఆరోగ్యం కావాలి' అని అడగాల్సిన దుస్థితి వుండటమే ఒక విషమ పరిస్థితిని తెలియ జేస్తోంది. ఇప్పటికి 40ఏళ్ళ క్రితమే తరిమెల నాగిరెడ్డిగారు 'తాకట్టులో భారతదేశం' అనే గ్రంథంలో ఈ పాలకవర్గాల మీద ఛార్జ్‌షీట్ పెడుతూ, 'ఈ సంక్షోభాలకి, ఈ పీడనలకి, ఈ దోపిడీకి మీరే కారణం. వీటిని తొలగించ డానికి మాత్రమే విప్లవకారులు పోరాడు తున్నారు. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నారు, ఇదుగో–ఇదీ మీరు తెచ్చినటు వంటి స్వాతంత్ర్యం, ఇదీ భారతదేశ పరిస్థితి, ఇదీ వ్యవసాయరంగ పరిస్థితి, ఇదీ పారి శ్రామికరంగ పరిస్థితి, ఇదీ గిరిజనుల పరిస్థితి, ఇదీ మహిళల పరిస్థితి, ఇదీ పాలన పరిస్థితి' అని–మొత్తం భారతదేశం యొక్క ముఖ చిత్రాన్నంతా ఆయన అందులో పొందుపరచి, న్యాయస్థానంలో చదివి నప్పుడు, దానికి పాలకవర్గాల వద్దగానీ, పాలకవర్గ న్యాయస్థానాల వద్ద గానీ సమాధానం లేకుండా పోయింది. నలభై ఏళ్ళ నాడే ఆయన భారతదేశంలోని సంక్షోభాన్ని అద్భుతంగా విశ్లేషించి, భూస్వామ్య, సామ్రాజ్య వాద ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థగా ఇది ఎలా మనుగడ సాగిస్తోందో, దీని ఫలితంగా, సకల శ్రేణుల ప్రజల జీవితాలు ఎలా అల్లకల్లోలమై పోతున్నాయో, వాళ్ళ జీవితాలకు ఎలా భద్రత లేకుండా పోయిందో, వాళ్ళకు విశ్రాంతి లేకుండా, విరామం లేకుండా, విజ్ఞానం లేకుండా, సంతోషం లేకుండా, భవిష్యత్తు మీద ఆశ లేకుండా చేయడానికి ఈ 60 సంవత్సరాలలో– అప్పటికి 30 సంవత్సరాల్లోనే–నాగిరెడ్డిగారు ఈ పాలకవర్గాలు చేసిన నిర్వాకం, ఈ పాలన నిర్వాకం వల్ల భారత సమాజంలో ఎటువంటి దుస్థితి ఏర్పడిందో, కష్టజీవులు అందరూ ఎటువంటి బాధలకు గురవుతున్నారో, దానికి కారణాలేమిటో స్పష్టంగా విశ్లేషించారు.

1970ల్లో ఆయన విశ్లేషించాడనుకొంటే నలభై ఏళ్ల తర్వాత మళ్ళీ మనం ఎక్కడు న్నాం? ఆయన విశ్లేషణ సరైనదా, కాదా? ఆయన గుర్తించిన సంక్షోభం ఏమైనా పరిష్కారం అయ్యిందా? సమస్య తీవ్రత తగ్గిందా? అని ప్రశ్న వేసుకోవాల్సిన అవసరం వుంది. ఏ సమాజమైనా కూడా ముందుకు రావాలంటే, అదొక నాగరిక సమాజంగా ఎదగాలీ అనంటే, అదొక ఆధునిక రాజ్యంగా రూపుదిద్దుకోవాలీ అనంటే, ఒక ప్రజాస్వామ్య హక్కుల వ్యవస్థగా రూపుదిద్దుకోవాలీ అనంటే వ్యవసాయ రంగమే పునాది. ఇది ఎవరూ పాఠాలు చెప్పనవసరం లేదు. ఈ సమాజంలో అనాది కాలం నుండీ, జీవులు పశుపోషణ వ్యవస్థ నుండీ బైటపడి, స్థిర నివాసాలు

ఏర్పరచుకొని, ఒక నాగరిక సమాజాన్ని, మానవార్హమైనటువంటి - మానవుడు జంతువుల మాదిరి బతకలేడు - మానవార్హమైన సమాజం, జీవితం అన్నప్పుడు దానికి కొంత స్థాయి, విలువలు వుంటాయి. ఒక డిగ్నిటీ కోసం, ఒక మర్యాద కోసం మానవాళి వేల సంవత్సరాలుగా కృషి చేసిన ఫలితంగానే ఈ రోజు మనం ఇక్కడ వున్నాం. దానికి పునాది వ్యవసాయం నుండీ ఏర్పడిందన్న విషయాన్ని మనం ఎప్పుడూ మర్చిపోకూడదు. ఈ రోజు పెద్ద పెద్ద పరిశ్రమలు పెట్టి వుండవచ్చు. చంద్రుని దగ్గరకి యానం చేసి వుండవచ్చు. అనేక వ్యాధుల్ని మనం జయించి వుండవచ్చు. పెద్ద పెద్ద డ్యాములు మనం కట్టి వుండవచ్చు. వ్యవధి లేకుండానే మనం ఎవరితోనైనా మాట్లాడే అవకాశాలు, టెక్నాలజీ, సైన్స్ అభివృద్ధి చెందివుండవచ్చు. దీని పునాది అంతా కూడాను వ్యవసాయంతోనే ఏర్పడింది. వ్యవసాయాన్ని కనుగొన్నవారు మహిళలు అన్న విషయాన్ని కూడా చరిత్ర మనకి చెప్తోంది. ఆ వ్యవసాయం చేయడం వల్లనే ఒక చోట స్థిరంగా నివాసం వుండి, ఒక నాగరిక జీవిగా, నాగరిక కుటుంబంగా, నాగరిక సమాజంగా మనిషి ఎదగగలిగినాడు.

భారతదేశంలో వేల సంవత్సరాల క్రితం వ్యవసాయం మొదలైనా నాగరిక నిర్మాతలైన రైతాంగం ఈ నాటికీ కూడాను ఏ పరిస్థితుల్లో వున్నారు? రైతాంగం బతకడానికి పెద్దగా ఏమీ అవసరం లేదు. వారికి భూమి కావాలి, నీళ్ళు కావాలి, విత్తనం కావాలి, మార్కెట్ కావాలి, కొంత మదుపు కావాలి. ఈ ఐదు అంశాలు సక్రమంగా ఒనగూడినప్పుడు వ్యవసాయం విజయవంతమవుతుంది. ఆ సమాజము, ఆ దేశము భద్రతతో బతుకు తుంది. ఏ సమాజానికైనా ఆహారభద్రత ముఖ్యమైనటువంటిది. ఆహారకొరత తీరిన తర్వాతనే, ఆకలి తీరిన తర్వాతనే ఏ కోరికలైనా మానవుని మీద ఆధిపత్యం చెలయించగలుగుతాయి. మరి అటువంటి కనీస అవసరమైన ఆహారభద్రత కూడా లేకుండా, 62 ఏళ్ల తర్వాత-ఎందుకు వ్యవసాయం సంక్షోభంలోకి నెట్టబడింది?

కర్ణుడి చావుకి వేయి కారణాలన్నట్టుగా ఇవాళ ఎన్నో కారణాలు-వ్యవసాయరంగ సంక్షోభానికి! రైతాంగ సంక్షోభానికి, కూలీల సంక్షోభానికి! ఈ కారణాలన్నింటికీ మౌలికంగా రెండు ఆధారాలు కలిగి వున్నాయి. ఇప్పటికీ తొలగిపోని భూస్వామ్య సామాజిక ఆర్థిక వ్యవస్థ, దాన్ని ఆధారంగా చేసుకొని మన సమాజం మీద పెత్తనం చెలాయించడానికి నానాటికీ దూకుడుగా వస్తున్న సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థ. ఈనాడు ఏ పౌరులైనా కూడా ఈ సమాజాన్ని ముందుకు తీసుకుపోవాలనుకొంటే, రచయితగాని, కళాకారుడుగానీ, మేధావిగానీ, రైతాంగం గానీ, కార్మికులు గానీ, విద్యార్థులు గానీ ఈ సమాజాన్ని ముందుకు తీసుకుపోవాలనుకొంటే, మన బతుకులు బాగుపడాలని కోరుకొంటే మౌలికంగా ఈ రెండు విషయాల్లో మార్పులు రావాలి. ఈ రెండు మౌలికమైన వాటిల్లో కూడా వ్యవసాయ రంగమే ముఖ్యమైనటువంటిది. ఒక వ్యవసాయక విప్లవం లేకుండా ఏ దేశమైనాగానీ, అమెరికాగానీ, జపాన్‌గానీ, మలేషియాగానీ, కొరియాగానీ, ఇంగ్లండ్ గానీ, ఫ్రాన్స్‌గానీ, జర్మనీగానీ, క్వీన్‌లాండ్‌గానీ -ఏది తీసుకున్నాగానీ-ఆ సమాజాలన్నీ- ఈనాడు మనం అలా వుండాలని కోరు కొంటున్నాంగదా, మన పిల్లలు అమెరికాకు పోతుంటే, పోయొచ్చి ఆ విషయాలన్నీ చెప్తోంటే అబ్బా, యిండియా కూడా అలా అమెరికా లాగా మారితే ఎంత బాగుంటుంది, మన రోడ్లు అట్లా మారితే ఎంత బాగుంటుంది, మన ప్రజారోగ్య వ్యవస్థ అట్లా వుంటే ఎంత బాగుంటుంది, మన పారిశ్రామిక వ్యవస్థ అలా వుంటే ఎంత బాగుంటుంది అని ఉవ్విళ్ళూరుతాయి మనకి కూడా. మరి అటువంటి ఒక ఆధునికమైన, ప్రజాస్వామిక మైన, చట్టబద్ధమైన ఒక పాలనను, వ్యవస్థను ఏర్పరచుకొన్న సమాజాలు-అక్కడా చాలా లోపాలున్నాయి. అక్కడా అసమానత లున్నాయి, దోపిడీ వుంది. అణచివేత వుంది. అవి పక్కన పెడితే-మన సమాజాలతో పోల్చి చూస్తే తప్పకుండా అవి అభివృద్ధి చెందిన దేశాలు. ఆ దశకు మనం తప్పనిసరిగా చేరుకోవాలి. అందులోని అవలక్షణాలను తొలగించి ఇంకా ముందుకెళ్ళాల్సిన ఆదర్శాన్ని భారత దేశ ప్రజలుగా మన ముందు పెట్టుకోవాల్సిన అవసరం వుంది.

ఇన్నేళ్ళ తర్వాత మీరు ఇక్కడ 'దున్నే వానికే భూమి కావాలి' అని రాసి వున్నారు. 'భూపరాయీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం' అని రాసి వున్నారు. 'భూమి నాదియన్న భూమి ఫక్కున నవ్వు' అని వేమన గారు ఆనాడే చెప్పారు. భూమి ఎవరిచ్చారు మీకు? మనకి భూమి ఎవరిచ్చారు? నీళ్ళు ఎవరిచ్చారు మనకి? ఈ చెట్లని ఎవరిచ్చారు? విత్తనమెవరిచ్చారు? ప్రకృతి ఇచ్చింది మనకు! మనం ప్రకృతిలో భాగం. ఈ సెంటు భూమి నాది, ఈ ఇల్లు నాది, ఈ గాలి నాది, ఈ నీళ్ళు నావి అన్న దగ్గర కూడా వ్యాపారం తయారైపోయింది. సామ్రాజ్యవాదులు, పెట్టుబడిదారులు, పెత్తందార్లు ప్రకృతి వనరులన్నింటి మీద వాళ్ళ భస్మాసుర హస్తాన్ని చాపి, ప్రజలకు బతుకు లేకుండా చేయడానికి కంకణబద్ధులై వున్నారు. వాళ్ళకి అండగా మన పాలకవర్గాలు నిలుస్తున్నాయి. ఈ అరవై ఏళ్ళ పాలకవర్గాల పాలన అంతా కూడా ప్రజావంచకమైన పాలన. మనల్ని దొంగలు పాలిస్తున్నారు. మనం దొంగలకి ఓట్లేస్తున్నాం. ఈ దేశాన్ని వారు బాహాటంగా కొల్లగొడు తున్నారు. ఇంత వంచనా పూరితమైన పరిస్థితుల్లో వాళ్ళని అడిగేవాళ్ళెవరు? ఇక్కడికి ఇంతమంది గిరిజనులు వచ్చారు. వీళ్ళ బతుకులు ఏంటి? ఒక సాఫ్ట్‌వేర్ రంగాన్నో, బిజినెస్ రంగాన్నో, మరో రంగాన్నో చూపి 10%-20% అభివృద్ధి వచ్చిందని అంటున్నారు. మరి అన్ని రంగాల్లో కూడా అభివృద్ధి జరగాలి కదా! వ్యవసాయరంగానికి ఇచ్చిన లెక్కలు చూసినట్లయితే ఇవాళ వ్యవసాయం నెగటివ్ గ్రోత్‌లో వుంది. అరవై రెండేళ్ళ తర్వాత అనేకానేక భూ సంస్కరణలు జరిపిన తర్వాత, ఆరు పంచవర్ష ప్రణాళికల తర్వాత ఈ రోజు ఎక్కడున్నాం మనం? మన దేశ ప్రజల యొక్క భవిష్యత్తుకు భద్రత ఎక్కడ ఏర్పడింది? ఈ రోజు భూమి కావాలని ఎందుకడుగుతున్నాం మనం? ఎకరా

రెండెకరాల్లో, అది ప్రకృతి ఇచ్చిన భూమి, ప్రకృతి ఇచ్చిన అడవి, అక్కడ వాళ్ళు-పాముల మధ్య, తేళ్ళ మధ్య, మలేరియా మధ్య, ఫైలేరియా మధ్య, అనేక జబ్బుల మధ్య పశుప్రాయమైన జీవితాన్ని బతుకుతూ వుంటే, ప్రభుత్వం యొక్క ఏ సహాయం లేకుండా బతుకు కూడా బతకనీయకుండా వాళ్ళ భూముల్ని కూడా కాజేయడానికి మల్టీనేషనల్ కంపెనీలకు, ఒరిస్సాలో-పోస్కో కానీ, బాల్కో గానీ, వేదాంత ఇండస్ట్రీగానీ, ఈ బహుళజాతి కంపెనీలన్నింటికీ అడవిలో-ఎవరినీ అర్థించ కుండా, ఏ ప్రభుత్వ సహాయం లేకుండా ప్రజలు బతుకుతూ వుంటే-కంపెనీలకు సహజవనరుల్ని కట్టబెట్టడానికి ప్రజల్ని అడవి నుండీ, వాళ్ళ సహజసిద్ధమైన స్థావరాల నుండీ వెళ్ళగొట్టడానికి ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో మన మీడియానే వెల్లడిస్తోంది. మీడియా చాలా వాటిని పట్టించుకోదు. కొన్నింటిని అప్పుడప్పుడు పట్టించుకొంటుంది. అలా బైటికి వస్తున్న వాస్తవాల గురించి భారత మేధావి వర్గం, చదువుకొన్న వాళ్ళం, కాస్త మెరుగైన స్థితిలో వున్నవాళ్ళు, ఎవరైతే బాధలు పడుతున్నారో వాళ్ళ వల్ల మనం మెరుగైన స్థితిలో వున్నాం, రైతాంగం, గిరిజనులు, కార్మికులు-వీళ్ళంతా బాధల పాలవుతుంటే, కష్టాల పాలవుతుంటే, వాళ్ళ శ్రమ కొల్లగొట్టబడుతుంటే,వాళ్ళు పీడనకు, దోపిడీకి, గురి అవుతుంటే మనం కాస్త మెరుగైన జీవితాల్లో వున్నామన్నది భారత మేధావి వర్గం గుర్తుపెట్టుకోవాలి. మీరు ఈ రోజు ప్రజల పక్షాన నిలవకపోతే రేపటి రోజున మీ పక్షాన నిలవడానికి ప్రజలుండరు. ఆ సమయం వస్తుందని ఖచ్చితంగా నేను భావిస్తున్నాను.

మరి ఎకరా, ఒకటిన్నర ఎకరాను సాగులోకి తెచ్చుకోవాలంటే ఎంత బాధ పడాలో చౌదరిగారు చెప్పారు. ఆ ఎకరా, రెండెకరాల్లో వాళ్ళు బతుకుతోంటే, వాళ్ళ భూముల్ని కంపెనీలకు కట్టబెట్టడానికి వాళ్ళపై హింస ప్రయోగించి, వాళ్ళకు సంబంధం లేని ప్రాంతాలకు తోలేసి, ప్రాజెక్టులు కట్టి, ఆ ప్రాజెక్టులతో బాగు పడుతున్న వాళ్ళెవరు? ఆ ఖనిజాన్ని బైటికి తీసినా ఆ ఖనిజ సంపద ఎవరికి దక్కుతుంది? దాని గురించి పెట్టే పరిశ్రమల్లో వాళ్ళకు ఉద్యోగాలేమైనా వస్తాయా? ఆ పరిశ్రమల ఆదాయాల్లో వాటా ఏమన్నా ఇస్తారా? మేం వాటా అడుగుతున్నాం ఈ రోజు. మీరు మా భూములు తీసుకొన్నట్లయితే, మా నీళ్ళను కొల్లగొట్టినట్లయితే, మా గాలిని కొల్లగొట్టినట్లయితే మేం వాటా అడుగుతాం.

ఇటువంటి ఉద్యమాలు ప్రపంచ వ్యాప్తంగా జరిగినాయి. నైజీరియాలో అక్కడ బర్మాషెల్ కంపెనీవాళ్ళు పెట్రోల్ అంతా తోడేస్తుంటే, ఆ పెట్రోల్ అంతా పంట పొలాల మీదికి వెళ్ళి, భూములన్నీ వ్యవసాయ యోగ్యం కాకుండా నాశనమయి, మేమెట్లా బతకాలని ఆ నైజీరియాకు చెందిన ఒగోని ప్రజలు ప్రశ్న వేశారు. కెన్‌సారో వివా అనే మహా వీరుడు, నాయకుడు దాని కోసం ఉద్యమిస్తే ఆయన్ని ఆ ప్రభుత్వం ఉరి తీసింది. ఇక్కడ ప్రభుత్వాలను నమ్ముకోవడానికి లేదు. సంఘాల్ని నమ్ముకోవాలి. ఉద్యమాన్ని నమ్ము కోవాలి. ఆ గిరిజనులు, వారికి చదువురాక పోయినా, అక్షరాస్యత లేకపోయినా ఆ రైతాంగం, గిరిజనులు, మేధావులు చెప్తున్న మాటల్ని, మా బ్రతుకు గురించి మాట్లాడు తున్నారు, ఇందులో ఏదో అంతరార్థము వుంది. ఇందులో ఏదో నిజముంది అనే విషయాన్ని వాళ్ళు గమనిస్తున్నారు. అది మన మేధావుల మీద ఎంత బాధ్యత వుందో గుర్తుజేస్తా వుంది.

ఈ దేశం అంటే ఒకరిది కాదు గదా. అంబానీలది, బజాజ్ వాళ్ళది, టాటాలది కాదుగదా. ఈ రోజు ప్రపంచంలోని అత్యంత సంపన్న వ్యక్తులలో 27మంది ఈ దేశంలో వున్నారు అని మీడియా ఊదరగొడుతోంది. అదేనా వార్త మనకు కావలసింది?! ఒక మనిషి ఆరోగ్యంగా బతకాలంటే రోజుకి 2400 కిలో కాలరీల ఎనర్జీ కావాలి. ఆ మేరకు ఆహారాన్ని తినాలి మనం రోజుకి. కానీ ప్రభుత్వం ఇచ్చిన గణాంకాల ప్రకారం 87% మంది కనీసంగా అవసరమైన కాలరీలు లేకుండా బతుకుతున్నారు. 62 ఏళ్ల పరిపాలన తర్వాత, ఎవర్ని దోషిగా నిలబెట్టాలి దీనికి? 60-70% మంది వ్యవసాయంమీద ఆధారపడి బతుకుతుండగా ఎందుకు ఆహారం లేకుండా పోతోంది? పోషకాహారం ఎందుకు లేకుండా పోతోంది? కేవలం 4% మంది వ్యవసాయం మీద ఆధారపడి వున్న అమెరికాలో, వాళ్ళు మనకు ఆహారధాన్యాల్ని ఎగుమతి చేయగలుగు తున్నారు. ఆధునిక విజ్ఞానం ద్వారా వాళ్ళు వాళ్ళ దేశం యొక్క ఆహార భద్రతను కాపాడుకోవడమే కాకుండా ఇతర దేశాలకు ఆహారభద్రతను కూడా శాసించే స్థితికి చేరారు. వాళ్ళు ఇష్టమైతే ఎగుమతి చేస్తారు, లేకుంటే లేదు. వాళ్ళు ఎగుమతి చేస్తే మనం బతుకుతాం, లేకుంటే లేదు. ఆ స్థాయికి మన దేశాలు వచ్చాయి. మరి నాలుగైదువేల సంవత్సరాల వ్యవసాయిక సంస్కృతీ నాగరికతా కలిగినటువంటి ఈ భారత దేశంలో వలసపాలనను కూడా కూలదోసి స్వతంత్రమైన అరవై ఏళ్ళ తర్వాత ఎందుకీ రోజు ఆహార భద్రత లేదు మనకి? పోషకాహారమెందుకు లేదు? ఏటా ఒక లక్ష మంది తల్లులు కేవలం ప్రసవ సమయంలో చనిపోతున్నారు. 80 శాతంమంది స్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. మరి ఎందుకు? మనది వ్యవసాయక దేశం.



> వ్యవసాయ రంగంలో సంక్షోభానికి కారణభూతమైన సామ్రాజ్యవాదుల, వారి దళారుల దారుణ దోపిడీ, హింసాకాండలనూ, భారత ప్రజల మూల్గులను పీల్చే వీరి విధానాలనూ రూపుమాపి, భారత ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను సాధించటం రైతుకూలీ సంఘం ఆశయం.
>
> రైతుకూలీసంఘం(ఆం.ప్ర) 'లక్ష్య ప్రకటన' నుండి

అయినా మనకి ఆహార భద్రత లేకుండా పోతోంది. ఎన్నో దేశాలకు ఎగుమతులు చేసి వున్నాం. ఎందుకు దిగుమతుల మీద ఆధారపడాల్సి వస్తోంది? పాలకవర్గాలు ఈ రోజు రేట్లు పెరిగినాయని ప్రజలు ఆందోళన చేస్తోంటే, విదేశాల నుండీ దిగుమతి చేసి అయినా ఇస్తామంటున్నారు. మనం 115 కోట్లమంది ప్రజలం వున్నాం. ఈ దేశంలో ఆ 15కోట్లమంది ధనికుల్ని తీసేస్తే నూరుకోట్లమందిమి వున్నాం. ఆ 15కోట్ల మంది కొనుక్కోగలరు, విదేశాలనుండి వచ్చే ధాన్యాన్ని, కేజీ బియ్యం నూరు రూపాయలైనా, 5 వందల రూపాయలైనా కొనుక్కొని బతకగలరు, ఆ 15 కోట్లమంది. మరి నూరు కోట్లమంది మాటేమిటి? విదేశాల మీద ఆధారపడినట్లయితే మన ఆహార భద్రత ఏమయిపోతుంది? మన ఆరోగ్యం ఏమయిపోతుంది? మన స్వతంత్రం ఏమయిపోతుంది? మన స్వావలంబన ఏమయిపోతుంది? మన భవిష్యత్తు ఏమయిపోతుంది? మన పిల్లల భవిష్యత్తు ఏమయిపోతుంది? ఇదీ అసలు ప్రశ్న. ఇప్పుడు అధిక ధరలంటున్నారు. ఇది ఏదో మధ్య తరగతికో, ఉద్యోగాలు చేసేవారికో, ధనిక రైతుకో, కార్మికులకో సంబంధించిన ప్రశ్న కాదు. మన రైతాంగంలో 70%మంది నికరంగా ఆహార ధాన్యాలు కొంటున్నారు. వ్యవసాయదారు డంటే వాళ్ళ ఆహారం వాళ్ళు పండించుకొంటున్నారన్న అపోహల్లో వున్నాం. ఇవాళ ఆహార ధరలవల్ల చితికి పోతున్న వారిలో రైతాంగమే అధికము. 70%మంది రైతాంగం కొనుక్కొని తినాల్సి వస్తోంది. వాళ్ళు పండించుకోలేరు, పండటం లేదు, గిట్టుబాటు కావడం లేదు. మరివాళ్ళెట్ల బతుకుతుండాలి? ఉద్యోగస్తులకి ధరలు పెరిగితే డిఏలు పెరుగుతాయి. ఆ రైతాంగం పరిస్థితి ఏమిటి? అసంఘటిత రంగంలో వుండే 90 శాతం మంది కార్మికుల మాటే మిటి? వాళ్ళకి ఎవరు డిఏలు పెంచుతారు? ఎవరు శాలరీలు పెంచుతారు? మరి ఎందుకు ఈ దీనావస్థ వ్యవసాయరంగంలో వచ్చింది? ఈ భూమి పంపకం చేయండి. ఇప్పుడు ఉత్పత్తి అవుతున్న ఆహారంలో అత్యధిక శాతం చిన్న కమతాల నుండి ఉత్పత్తి అవుతుందన్నది ఒక నిజం. పెద్ద కమతాల నుండి కాదు. భూస్వాములు కాదు పండిస్తుండేది ఆహార ధాన్యాల్ని, ఈ దేశాన్ని సాకుతుండేది, చిన్న రైతులు. పడీ పడని వర్షాలతో. అందీ అందని రుణాలతో, గిట్టీగిట్టని ధరలతో వాళ్ళు దేశం మొత్తాన్ని సబ్సిడైజ్ చేస్తున్నారు. ఇవాళ ప్రభుత్వాలు కాదు సబ్సిడైజ్ చేస్తున్నది, రైతాంగం, రైతుకూలీలు ఈ దేశానికి ఆహారాన్ని సబ్సిడైజ్ చేస్తున్నారు. వాళ్ళ చెమటను ధారపోసి, శ్రమను ధారపోసి, వాళ్ళ రక్తహీనతను ధారపోసి, వాళ్ళ భవిష్యత్తును ధారపోసి, వాళ్ళ వర్తమానాన్ని తాకట్టుపెట్టి రకరకాల పీడక శక్తులకి–దేశానికి వాళ్ళు ఆహార ధాన్యాలను అందిస్తున్నారు. మరి పండించిన పంటకు గిట్టుబాటు కాకుండా పడిపోవడమంటే ఆ సెక్షన్ ఎక్కువగా నష్టపోతారు. చిన్న కమతాలంటే అవి గిట్టుబాటు కమతాలు కావు. 70% కంటే ఎక్కువగా వర్షాధార కమతాలున్నాయి. కనీసం 30% సాగునీటి సౌకర్యం వున్నట్లయితే వ్యవసాయం స్థిరపడుతుందనేది శాస్త్రజ్ఞుల అభిప్రాయం. మరి ఈనాటికీ నదీ జీవజలాలు ప్రవ హిస్తుండగా, మనం వాటిని ఉపయోగించు కోలేక సముద్రం పాలవుతున్న పరిస్థితి వుంది. చంద్రమండలానికి పోవడానికి కోట్లాది రూపాయల బడ్జెట్‌ని ఈ ప్రభుత్వం అప్రూవ్ చేసింది. చంద్రమండలం పోయి ఏం చేస్తారక్కడ? భూగోళాన్ని సరిదిద్దుకోకముందే, ఇక్కడుండే ప్రజలకు కాస్తయినా సౌకర్యమివ్వ కుండా మానవార్హమైన జీవనాన్నివ్వకుండా, కనీసం కడుపు నిండా తిండి ఇవ్వకుండా, బట్ట ఇవ్వకుండా, ఆరోగ్యమివ్వకుండా, విద్య ఇవ్వకుండా, విరామివ్వ కుండా–చంద్రయా నానికి అమెరికా వాడు పోయాడు, రష్యా వాడు పోయాడు, చైనావాడు పోతుంటే మనం కూడా వానితో పోటీ పడు తున్నాం. ఆ చంద్రయానమంత నిరర్థకమైన ప్రాజెక్టు ప్రపంచంలో మరొకటి లేదు. అసలు దాని వల్లనే అమెరికా సగం దివాళా తీసిపోతోం దన్నది ఆర్థిక శాస్త్రవేత్తల అంచనా. అటువంటి దాన్లోకి మనం, ఇంత పేదరికాన్ని పెట్టుకొని, అభివృద్ధిలేని తనాన్ని పెట్టుకొని, ఆ చంద్రయానానికి ఎందుకంత అర్రులు చాస్తున్నారు? ఆ ఉన్న భూమిని పంచకుండా, ఇప్పటికీ కూడా 50% భూమి, 10%మంది చేతుల్లో బందీ అయి వుంది, వాస్తవం. అందుకే భూమి పంపిణీ కావాలి. నీటి సౌకర్యాలు ఏర్పడాలి. పండించిన పంటకు గిట్టుబాటు ధర కావాలి. న్యాయమైన మార్కెట్ వుండాలి. కావలసిన రుణాలు ఇవ్వాలి. ఆ రుణాలకు ఇటీవల ఆందోళన చేయగా చేయగా రుణాలో, మరొకటో, సబ్సిడీ పేరుతో ముందుకొస్తున్నారు. కానీ ఆ రుణాలు ఎవరికి అందుతున్నాయి? ఆ రుణాలు పంట పండించే రైతాంగానికి అందటం లేదు. ఆ రుణాలు శీతలగిడ్డంగులు నిర్మించుకోవడానికి, హార్వెస్టర్లు కొనుక్కోవడానికి వీటిని కూడా అగ్రికల్చర్ లోన్స్ కింద ఇస్తున్నారు. గుంటూరు నుండి ఒంగోలు వస్తోంటే అనేక శీతల గిడ్డంగులు కనిపించాయి. వాటన్నింటికీ రుణాలొస్తున్నాయి వాళ్ళకి. దాంతో కోట్ల రూపాయలతో దొరలై పోతున్నారు. రైతాంగానికి ఇచ్చే పేరుతో వారికి సబ్సిడీలు ఇస్తున్నారు. అదే కాస్త వడ్డీ తగ్గించమని, రుణాలు పెంచమని రైతాంగం అడిగితే వాళ్ళకి మనసు కరగదు. ఆ మధ్య 60 వేల కోట్ల రూపాయలు అప్పులు రద్దు చేశామన్నారు. బడా పారిశ్రామిక వేత్తలంతా కలిసి ప్రభుత్వానికి ఒక మహజరు సమర్పించారు, మీరు ఇంతిత రుణాలు రద్దు చేస్తే ప్రభుత్వ ఎకానమీ ఏమయిపోతుందీ అని. అసలు బ్యాంకుల్ని దివాళా తీయించేది ఈ మహానుభావులే. బ్యాంకుల్లో పేరుకు పోయిన రుణాలు వీరివే. ఐదేళ్ళ క్రితం లెక్కల ప్రకారమే ఒక లక్షా 65 వేల కోట్ల రూపాయల రుణాలు పేరుకుపోయాయి. అవి వసూలు కావని ప్రభుత్వం తేల్చేసింది. దానికి కమిటీ వేస్తే, ఆ కమిటీలో అంతా బజాజ్‌లు, అంబానీలను పెట్టారు. వాళ్ళు తమ రుణాలు రద్దు చేయమని రిపోర్టు ఇచ్చారు. అదే మామూలు రైతు అయితే వాని చెంబూ తపేలా కూడా బజార్లోకి విసిరేసి జప్తు చేసిన సందర్భాలు చూశాను నేను. ఒక ఐదువేల రూపాయల రుణం కోసం రైతు అనేక

లంచాలు ఇచ్చుకొంటూ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన స్థితి వస్తోంది. వాళ్ళు ఒక లక్షా అరవై ఐదు వేల కోట్లు అప్పనంగా తీసుకొని, చెల్లించలేని స్థితిలో వుంటారంట! కానీ రైతు మాత్రం ఎప్పుడూ చెల్లించే స్థితిలోనే వుంటాడు!

వర్షాలు వచ్చినా, రాకపోయినా, చీడలు పీడలు తగులుకున్నా, గిట్టుబాటు ధరలు రాకపోయినా రైతు మాత్రం చెల్లించే స్థితిలో వుండాలి. వీరు మాత్రం కోట్లాది రూపాయలు తీసుకొని, చివరికి చెల్లించలేని స్థితిలో వున్నాము అనంటే వాటిని రద్దు చేయాలి. ఇవి రద్దు చేయాలన్న నివేదిక వచ్చాక, బ్యాంకుల్ని ప్రైవేటుపరం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. బ్యాంకు ఉద్యోగులు తమ ఉద్యోగాలు పోతాయన్న దాంతో ఈ ప్రైవేటీ కరణను వ్యతిరేకించారు. ఆ సందర్భంగా బ్యాంకు ఉద్యోగులు ఈ లెక్కల్ని బైటికి తీశారు. బ్యాంకుల్ని ప్రైవేటీకరణ చేస్తామంటే మేం ఈ లొసుగులన్నీ బైటపెడతాం. ఎన్ని కోట్లు బకాయిలు ఉన్నాయో బైటపెడతా మంటే ప్రభుత్వం తేలుకుట్టిన దొంగలాగా నోరు మూసుకొంది. ఒక అంచనా ప్రకారం కార్పోరేట్ సెక్టార్‌కి ప్రభుత్వం ఏటా ఐదు లక్షల కోట్ల రూపాయలు అప్పనంగా ఇచ్చేస్తోంది. కానీ అదే రైతు ఏమైనా అడిగితే దిక్కులేని పరిస్థితి. భూమి ఇవ్వండి మేం బతుకుతాం అంటే ఆ భూమిని కూడా లాక్కొంటున్నారు. ఈ భూమి నాది, ఆ భూమి నాది అని ఇప్పటికే 60వేల ఎకరాల్ని నూరు సెజ్‌లకింద స్వాధీనం చేసుకొన్నారు. కనీసం 60 వేల మందికి కూడా ఉద్యోగాలు రాలేదని పేపర్లో వచ్చింది. ఈ ఒంగోలు వాన్‌పిక్ ప్రాంతంలో సారవంతమైన భూముల్ని, వాళ్ళ బతుకేదో వాళ్ళు బతుకుతున్న మత్స్యకారుల జీవితాల్ని ధ్వంసం చేస్తూ, అభివృద్ధి అంటే ధ్వంసం! ఈ దేశంలో Development is distruction. వాళ్ళేమీ అడగలేదు సముద్ర జలాల్లో చేపలు పట్టి బతుకుతారు. చీరాల ప్రాంతంలో రైతులు పండించుకొని బతుకుతా మంటే వల్లకాదన్నారు. వాన్‌పిక్ అనేది ఒక పనికిమాలిన ప్రాజెక్టు. మీరూ–నేనూ–ఒక పదిమందిమి కలిసి దొంగలుగా తయారుతే చాలు దానికి, డబ్బులు సంపాదించుకోవ డానికి. ఇంకేమీ అవసరం లేదు. ఈ ప్రభుత్వం దొంగలిది. ఆ మధ్య అంబానీ కుటుంబానికి ఐదు విమానాశ్రయాల్ని, ఒక్కోటి 150 ఎకరాలుండే ఐదు విమానా శ్రయాల్ని ఈ ప్రభుత్వం 63 కోట్లకి అమ్మింది. వాళ్ళ ధర సెంటుకి 4 వేలు మాత్రమే. అంత సులభంగా వాళ్ళు ఈ రాజకీయవేత్తలతో కుమ్మక్కయిపోయి ప్రజాధనాన్ని కొల్లగొడు తున్నారు. బళ్ళారిలో సారవంతమైన భూమి అది. నీళ్ళు ఉన్నాయి. వాళ్ళ బతుకు వాళ్ళు బతుకుతూ వుంటే అక్కడ ఎయిర్‌పోర్టు పెడతామని వచ్చారు. ఇప్పటికే ఒక ఎయిర్ పోర్టు వుంది, ఇంకోటి పెడతామని ప్రజల్ని భూముల నుండి వెళ్ళగొట్టడానికి సిద్ధ మయ్యారు. సింగూరులో అదే జరిగింది. నందిగ్రామ్‌లో అదే జరిగింది. వాన్‌పిక్‌లో అదే జరుగుతూవుంది. ఇదంతా ఎందుకు జరుగుతా వుంది? రైతుల పట్ల ఎవరికీ ఆపేక్ష లేదు. ఆహారధాన్యాలదేముంది, విదేశాల నుండి దిగుమతి చేసుకుందాం! పండించే, అమ్ముకునే రైతుసంగతి వేరే వదిలేయండి. కేవలం తిండి గడవడానికి మాత్రమే భూమి వుండే రైతులే ఎక్కువమంది. మరి వారి గతి ఏం కావాలి?

ఈ గిరిజనులందర్ని ఖనిజాల పేరుతోనో, మరో పేరుతోనో బైటికి తోసేస్తే వారంతా ఎక్కడ బతకాలి? అడవిలో తప్ప, భూమిలో తప్ప, మరో స్కిల్, నైపుణ్యం లేని వాళ్ళు, విద్యలేని వాళ్ళు వేరే చోటికిపోయి ఏమయిపోవాలి? మనం ట్రాన్స్‌ఫర్ అంటే భయపడిపోతున్నాం. ఉద్యోగం వున్నవాళ్ళు, శాలరీకి, ప్రమోషన్లకి, పెన్షన్లకి భద్రత ఉన్న వాళ్ళు బాధపడిపోతున్నాం. ఉన్న ఆ చిన్న హక్కుని, వనరుని కూడా వదలుకొని, సమాజానికి దూరమైపోయి, ఆ గిరిజనుల బతుకు ఏం కావాలి? ఇంత అన్యాయంగా ఈ ప్రభుత్వాలు రైతాంగం పట్ల కక్షగట్టి, కత్తిగట్టి వ్యవహరిస్తున్నాయి. ఈ సమయంలో మనం ఒక ఆధునిక సమాజంగా, ఆరోగ్య వంతమైన సమాజంగా, న్యాయమైన సమాజంగా, ప్రజాస్వామిక సమాజంగా ఎదగాలంటే ఇక్కడి భూమి సమస్య తీరాలి. అడవుల్లో భూమి గిరిజనులకే దక్కాలి. అడవుల్లో ఉపయోగపడేదేమైనా వుంటే అది సమాజానికే ఉపయోగపడాలి.

వనరులు కొద్దిమంది గుత్తసొత్తు కాదు. ఇది సారవంతమైన దేశం. మన దేశంలో విత్తనాలకు సంబంధించి–బి.టి వంగడం అన్నారు, 'ఫస్ట్ గ్రీన్ రివల్యూషన్' అన్నారు. ఇప్పుడు 'సెకండ్ గ్రీన్ రివల్యూషన్' అంటున్నారు. గ్రీన్ రివల్యూషన్ అంతా నాశనమైపోయింది. ఆ పంజాబ్ అంతా బీడుపడిపోతూ వుంది. ఆ ఫలాలంతా–ఆ ఎరువుల కంపెనీల వాళ్ళకి, విత్తనాల కంపెనీల వాళ్ళకి, ఆ కన్సల్‌టెంట్స్‌కి, రుణాలు ఇచ్చిన వాళ్ళకి! వాళ్ళు బాగుపడి నారు తప్పితే మరెవ్వరూ బాగుపడలేదు. మరి ఈ పరిస్థితుల్లో మన రైతాంగం భూమి కోసం, నీళ్ళకోసం, న్యాయమైన ధరల కోసం, హక్కుల కోసం పోరాడవలసిన అవసరం ఏనాటికన్నా కూడా ఈనాడు ఎక్కువగా వుంది. తరిమెల నాగిరెడ్డి తాకట్టులో భారతదేశం అన్న నాటి స్థితికన్నా కూడా ఇవాళ భారతదేశాన్ని అమ్మివేసే స్థితికి ఈ దొంగలైన పాలకవర్గాలు దిగజారారు. ఇవి చట్టబద్ధమైన ప్రభుత్వాలు కావు. ఓట్లు వేస్తుండొచ్చు. గెలుస్తుండొచ్చు. కానీ ఆ గెలిపిస్తున్న వారెవరు? ఈ రోజు అంబానీల మధ్య ఆస్తి తగాదాలు తీర్చడానికి ప్రైమ్ మినిస్టర్ కల్పించుకొంటున్నాడు. ఈ దేశం ఎంత దూరం పోయింది? వాళ్ళు పాపం చాలా బాధల్లో వుండి, కోట్ల రూపాయలు ఎట్లా పంచుకోవాలో తెలియక పోతోంటే, ప్రైమ్ మినిస్టర్‌గారు కల్పించు కొన్నారు. ముప్ఫై నలభై ఏళ్ళ క్రితం కనీస స్థాయిలో కూడా లేరు, ఈ అంబానీలు! ఈ రోజు కోట్ల రూపాయలకు ఎట్లా పడగ లెత్తారు? ఎవర్ని కొల్లగొట్టి, ఎవరి శ్రమని, ఎవరి చెమటని, ఎవరి వనరుల్ని? ఈ ప్రశ్నల్ని మనం మౌలికంగా తెలుసుకొని, ఆగ్రహాన్ని నింపుకొని రైతుకూలీలు, గిరిజనులు రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో పోరాటానికి దిగినట్లయితే తప్పకుండా సమాజం నుండి మద్దతు వస్తుంది, విజయం తప్పకుండా సిద్ధిస్తుంది. రివల్యూషన్ విల్ సక్సెస్ అన్న నాగిరెడ్డిగారి మాట సిద్ధిస్తుందని నేను నమ్ముతున్నాను.

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

### కా॥ రామకృష్ణ

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు**



మహాసభలకు హాజరైన వారందరికీ విప్లవాభినందనలు–మన రాష్ట్రంలోనూ, దేశం లోనూ రైతాంగం తీవ్రమైన ఇబ్బందులలో కూరుకుపోయిన నేపథ్యంలో, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడిన చేతివృత్తుల వారంతా కూడా అనేక సమస్యల నెదుర్కొంటున్న తరుణంలో రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలు ఒంగోలులో జరుగు తున్నాయి. ఈ మూడు రోజులపాటు ప్రజలెదు ర్కొంటున్న అన్ని రకాల సమస్యలను చర్చించు కొని, తీర్మానాలు చేసుకొని మరింత సమర్ధ వంతంగా పోరాటాలకు పూనుకుంటారని నేను ఆశిస్తున్నాను.

రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నప్పటికీ పేద ప్రజలు, గ్రామీణ పేదలు, రైతుకూలీల సమస్యలేమైనా పరిష్కరించారా? మన దేశంలో 12 కోట్ల 70 లక్షల మంది రైతులుంటే అందులో 49 శాతం మంది అప్పుల్లో ఉన్నారనీ అందరికంటే అధికంగా 82 శాతంమంది మన రాష్ట్ర రైతులు అప్పుల్లో ఉన్నారనీ, మన పొరుగునే వున్న తమిళనాడు రాష్ట్రంలో 74 శాతం మంది, కర్ణాటకలో 68 శాతం, పంజాబ్‌లో 64 శాతం మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయి, చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అధికారిక ఆర్థికవేత్తలు చెప్తున్నారు. 1991 నుండి 2000 సం॥ మధ్య కాలంలో భారతదేశంలో 1,99,600 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటే ఈ పాలకులు అందరూ సిగ్గుతో తల వంచుకోవాలి. ఏ మాత్రం సిగ్గులేని పరిపాలకులు–గతంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నా, ఆ తర్వాత మన్మోహన్ ప్రధానిగా వున్నా–ఈ పాలకు లంతా కోటీశ్వరుల కొమ్ముగాస్తూ వున్నారు. పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ వున్నారు. అన్నదాతను మర్చిపోతూ ఉన్నారు. రైతులు అప్పుల నుండి బయటపడలేదు. వ్యవసాయ సంక్షోభం పరిష్కారం కాలేదు. ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. రైతులకు గతంలో 1,13,000 కోట్ల రూపాయల సబ్సిడీ ఇస్తే, ఇవాళ దాన్ని 65,000 కోట్లకు కుదించారు. ప్రపంచంలో అనేక దేశాలు వ్యవసాయ సబ్సిడీలు పెంచుతూ పోతూ వుంటే మన దేశంలో సబ్సిడీలు కుదిస్తూ వున్నారు.

చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా వున్నా, రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నా, అందరూ అమెరికా గురించి చెప్తున్నారు. అమెరికాలో రైతాంగానికి ఎలా సబ్సిడీలు ఇస్తున్నారు? జపాన్, ఫ్రాన్స్‌ల్లో ఎలా ఇస్తున్నారు? ఆ దేశాల్లో ఇస్తున్న సబ్సిడీల గురించి ఈ పాలకులు ఎందుకు మాట్లాడటం లేదు?

వ్యవసాయ కూలీలకు ఐదో ధఫా భూపందేరంలో ఏప్రిల్ 14 అంబేద్కర్ వర్ధంతి నాడు లక్ష ఎకరాల భూమి పంపిణీ చేస్తామం టున్నారు. ఇంకో 50 సార్లు వీళ్ళు భూమి పంచినా భూపంపకం మాత్రం అయిపోదు. బంజరు భూములు, మిగులు భూములు, పడావు భూములు రాష్ట్రంలోని ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబానికి 2 ఎకరాలు ఇవ్వటానికి అవకాశం వుంది. ఎందుకు ఇవ్వటం లేదు? భూములు పంచరు, ఇళ్ళ స్థలాలు కావాలంటే లాఠీ దెబ్బలు తినాలి. జైలుకు పోవాలి. మూడేళ్ళలో అందరికీ ఇందిరమ్మ ఇళ్ళు, నిర్మిస్తాము అన్నారు. మూడేళ్ళు ఏనాడో గడిచిపోయింది. ఈ రోజుకీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికీ నివాసస్థలాల సమస్యపై వందల, వేల సంఖ్యలో ఏ కమ్యూనిస్టు పార్టీ పిలుపు ఇచ్చినా ప్రజలు తరలి వస్తున్నారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో ఒక్కొక్కరికి 11 ఇళ్ళు కేటాయించినారు. కొందరికి ఇళ్ళే కట్టకుండా కట్టామని లెక్కలు రాశారు. పందికొక్కుల మాదిరి డబ్బులు మేసేసినారు.

గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద 40 వేల కోట్ల రూపాయలను కూడా పేదలకు దక్కకుండా చేస్తున్నారు. గ్రామీణ పేదల ద్వారా కాకుండా యంత్రాల ద్వారా పనిచేయిస్తూ వున్నారు. మధ్యలో దళారులు భోంచేస్తున్నారు. యంత్రాలతో పని చేయించటాన్ని అంగీకరించకూడదని మేము డిమాండ్ చేస్తున్నాం.

ఎన్నో ఏళ్ళుగా మీరు పోరాటాలు చేస్తున్నారు. ఇంకా రైతు, రైతుకూలీసంఘాలు వున్నాయి. వ్యవసాయ కార్మిక సంఘాలు ఉన్నాయి. మనమంతా ఎవరికి వారం పోరాటాలు చేస్తా వున్నాం. ఎన్ని పోరాటాలు చేసినా పేదవాడు పేదవాడుగానే ఉంటు న్నాడు. ధనవంతులు వేల కోట్ల సంపాదనలు పోగేసుకుంటున్నారు.

మనమందరం నిస్వార్థంగా పేదవాళ్ళ కోసం పోరాడుతున్న వాళ్ళంగా సమైక్య ఉద్యమాలకు పూనుకోవాలి. ఎవరికి వాళ్ళం పోరాడుతున్నంత కాలం ఈ ప్రభుత్వం భయపడదు. ఈ దేశంలో శ్రమజీవులైన రైతులకు, వ్యవసాయ కూలీలకు, చేతివృత్తుల వారికి ఒక మార్గం చూపించవలసిన బాధ్యత మనందరిపై వుంది. ఆ విధమైన కర్తవ్యాలు చేపడ్తారని ఆశిస్తూ ఈ మహాసభలలో సందేశం ఇవ్వటానికి మమ్మల్ని ఆహ్వానించి నందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ– రాబోయే రోజులు మనవే–కష్టజీవి గెలుపు తధ్యం!

**రైతుకూలీసంఘం "దున్నే వానికే భూమి" అనే కేంద్ర నినాదం చుట్టూ గ్రామీణ ప్రాంతంలోని రైతుకూలీ పేదలను సమీకరించి, సంఘటితపరచి, దుష్ట భూస్వామ్య శక్తుల పెత్తనం, దౌర్జన్యం, దోపిడీ, హింసాకాండ, అణచివేతలను రూపుమాపే వ్యవసాయ విప్లవ కర్తవ్యాలను నిర్వరిస్తుంది.**

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర) 'లక్ష్య ప్రకటన' నుండి**

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

### కా॥ ఉప్పలయ్య
**ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు**



మహాసభలకు వివిధ ప్రాంతాల నుండి హాజరైన ప్రతినిధులకు 7 రాష్ట్రాలనుండి వచ్చిన మిత్రులకు విప్లవ జేజేలు. మిత్రులందరూ రైతాంగ సంక్షోభం మీద వివరించారు. పంచభూతాలలో–సూర్యరశ్మిని–అందరమూ వాడుకుంటున్నాం. అలాగే గాలి, ఆకాశం కూడా! మనం కొట్లాడుతున్నది భూమి కోసం–కష్టజీవి అయిన ప్రతి రైతుకు 2 ఎకరాలు భూమి కావాలి, ఇవ్వాలి. కానీ 2 కుంటలు లేదు. దీనికి పాలకులే కారణం. 1991లో డంకెల్ ప్రతిపాదనలపై సంతకం పెట్టడమే దీనికి ముఖ్య కారణం! రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈనాడు ప్రజలను ఏకం జేసి, వర్గ పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరముంది. ప్రజల సమస్యలను పరిష్కరించటంలో పాలకవర్గ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ప్రజా పోరాటాలు ఉధృతమయ్యే సందర్భంలో 'నక్జలైట్' అనే ముద్ర వేస్తున్న పరిస్థితి వుంది. కొన్ని వాళ్ళు రైతుకూలీల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న వాళ్ళు, వాళ్ళు నక్జలైట్లు కారు.

రైతాంగ సంక్షోభ రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర మహాసభలు ఈ నేపథ్యంలో జరపటం మంచి విషయం. ఆహ్వాన లేఖ అందటంతోనే మహాసభలకు వెళ్ళి సంపూర్ణ మద్దతు తెలపాలని భావించాం. రైతాంగ సమస్యలపైన కలిసి పనిచేయటంలో మేము కూడా భాగస్వాములౌతాం. పాలకవర్గ కుట్రలను ఓడించి రైతాంగ పోరాటాలను ముందుకు తీసుకుపోదాం.

### యస్. జీవన్ కుమార్
**మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు**



పౌరులుగా మనకు ఈ దేశంలో హక్కులున్నాయి. ఆ హక్కుల్ని కాపాడటం, ఆ హక్కుల్ని అనుభవించే పరిస్థితిని కల్పించటం ప్రభుత్వాల బాధ్యత. తిండిహక్కు కావచ్చు, జీవించే హక్కు కావచ్చు, గౌరవప్రదమైన జీవితం కావచ్చు లేదా వృత్తికి సంబంధించిన హక్కు కావచ్చు, ఇవన్నీ కూడా మనం కాపాడుకోవాలంటే ప్రభుత్వాలు సక్రమంగా నడుచుకోవాలి. కానీ దేశంలో వున్న పరిస్థితి ఏమిటి? వ్యవసాయ రంగంలో ఏమవుతోంది? పారిశ్రామిక రంగంలో ఏమవుతోంది? ప్రజలు ఏ విధంగా రోజురోజుకీ వాళ్ళ వనరుల నుండి దూరం చేయబడుతున్నారు? ఇంతకు ముందు పాటపాడిన ఆ గిరిజన అక్కలు, అమ్మలు ఈ భూమి మాది, ఈ చెట్లు మావి, ఈ గాలి మాది–కాబట్టి వీటి మీద హక్కులన్నీ మావే. కాబట్టి ఆ హక్కుల కోసం పోరాటం చేస్తామని చెప్తున్నారు. సరిగ్గా ఇదే మనకు కావలసింది. ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతో ఇప్పటికే 80వేల ఎకరాలు సేకరించినారు. వాటిల్లో 34వేల ఎకరాలు అసైన్‌మెంట్ భూమి వుంది. కోస్టల్ కారిడార్ పేరుతో మొత్తం గందరగోళం సృష్టిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఏడు పవర్‌ప్లాంట్స్ రాబోతున్నాయి. ఇదంతా ఎవరి కోసం? ప్రభుత్వం చెప్తోంది ఇదంతా అభివృద్ధి అని! ఇదంతా వినాశకర అభివృద్ధి! రైతుల పొట్టలు కొట్టి, రైతుల భూములు తీసుకొని, రైతుల జీవితాల మీద కవాతు చేస్తూ ప్రభుత్వాలు అభివృద్ధి అని చెప్తున్నాయి. చాలా విచారకరమైనదేమిటంటే ఆ అభివృద్ధి గురించి, పార్లమెంటులో, అసెంబ్లీల్లో కూర్చొనే వామపక్ష పార్టీలు సంతృప్తిగా వున్నాయి. ఎక్కడో ఒకసారి స్టేట్‌మెంట్లు ఇస్తున్నాయి తప్ప ఎక్కడా ఉద్యమాలు చేయడం లేదు. అది పోలవరం ప్రాజెక్టు కావచ్చు, కోస్టల్ కారిడార్ కావచ్చు, కాకినాడ సెజ్ కావచ్చు, విశాఖపట్నంలో ఫార్మా సెజ్ కావచ్చు–ఎక్కడా కూడా బాగా సాంప్రదాయికమైన వామపక్ష పార్టీలు ఏమీ మాట్లాడ్డం లేదు. అంటే ఈ అభివృద్ధికి వాళ్ళు లైసెన్స్ ఇచ్చేశారు. ఈ అభివృద్ధికి వాళ్ళు ఓటేసినారు. దీన్ని ప్రశ్నించాల్సిన అవసరం వుంది. దీన్ని ప్రశ్నించేవాళ్ళు రోజురోజుకీ తగ్గిపోతున్నారు. సరిగ్గా ఈ రైతుకూలీ సంఘం లాంటి సంఘాలు దీన్నే ప్రశ్నిస్తు న్నాయి. కొందరేమో మేము పూర్తిగా తుపాకీ దారినే ప్రశ్నిస్తామంటున్నారు. కొందరు సైలెంటయిపోయినారు. కొందరు మాత్రమే 'దీన్ని మనం ప్రజల్ని సమీకరించి ప్రశ్నించాలి. ఆ హక్కుల కోసం పోరాటం చేసినప్పుడు మాత్రమే ప్రభుత్వాలు దిగి వస్తాయి. అప్పుడు మాత్రమే మన వనరుల్ని కాపాడుకోగలుగుతామ'ని చెప్తున్నారు. దాంట్లో ఇప్పుడు మీరు నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘం సభ ఒకటిగా నేను భావిస్తున్నాను. గత సంవత్సరం నేనూ, బాలగోపాల్‌గారూ మానవ హక్కుల వేదిక తరఫున కరీంనగర్ ఏరియా తిరగాం. అప్పుడు పంట బాగా పండింది. మార్కెట్‌లోకి బాగా సరుకొచ్చింది. కానీ కొనే సౌకర్యం లేదు. కుప్పలు కుప్పలుగా ధాన్యాలు రాశిపడి వున్నాయి. మేం వెళ్ళి చూస్తే, ఆశ్చర్యకరంగా, నూతనంగా ఒక విషయం తెలిసింది. అక్కడ కొత్తగా వ్యవసాయంలో కొచ్చిన వాళ్ళంతా యంగ్ పీపుల్. టెన్త్ పాసయి, ఇంటర్మీడియట్ ఫెయిలయి, డిగ్రీ ఫెయిలయి, ఇక ఉపాధి దొరక్క మన గ్రామసీమలే చాలా ముఖ్యమని, తిరిగి వెళ్ళి గ్రామాల్ని నమ్ముకొని వ్యవసాయం చేస్తున్న వాళ్ళు. సిటీలో మేధావులు మాట్లాడుతున్నారు–వ్యవసాయ రంగం తగ్గిపోతోంది. వ్యవసాయరంగంలో నుండి మనుషుల్ని తీసేయాలి, ఇంకా 40 శాతానికి తీసుకురావాలని మన ఆర్థిక నిపుణులు,

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

ప్రణాళికా సంఘం వాళ్ళు మాట్లాడుతున్నారు. కానీ వ్యవసాయ రంగంలో ఇంకా ఎక్కువ మంది పార్టిసిపేట్ చేస్తున్నారు. కరీంనగర్‌లో మేం అదే చూశాం. మెదక్‌లో అదే చూశాం. వరంగల్‌లో అదే జరుగుతోంది. కాబట్టి ఈ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం, ఈ వ్యవసాయ రంగంలో వున్న చిన్న రైతును కాపాడుకోవడం మన బాధ్యత. ఆ దిశగా మనమంతా ప్రయత్నం చేద్దాం. ఈ రైతుకూలీ సంఘం లాంటి సంస్థలు ఆ దిశగా నిజాయితీగా ప్రయత్నిస్తే తప్ప ఈ ప్రభుత్వాల తల వొంగదు. కాబట్టి రైతుకూలీసంఘం చేసే ప్రతి పోరాటానికీ మా మానవహక్కుల వేదిక పూర్తి మద్దతు ఇస్తుంది. ప్రజల హక్కులు ఎక్కడ భంగమైనా మా మానవహక్కుల వేదిక అక్కడికి వచ్చి హక్కుల కోసం పోరాటం చేస్తుందని చెప్తూ, మీ రెండు రోజుల సభలు విజయవంతం కావాలని కోరుతూ, ఈ అవకాశం ఇచ్చినందుకు మానవ హక్కుల వేదిక రాష్ట్ర కమిటీ తరఫున మీకు అభినందనలు తెలుపుతున్నాను.

### కా॥ కొల్లిపర వెంకటేశ్వరరావు
### గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర నాయకులు



గ్రామీణ పేదల సంఘం తరఫున ప్రతినిధులందరకూ అభినందనలు తెలియ చేస్తున్నాను. మనం మొట్టమొదటగా ఈ గిరిజనులు, దళితుల గురించి కొంచెం మాట్లాడుకోవటం అవసరమను కొంటు న్నాను. గిరిజనుల్ని, దళితుల్ని మన సమాజంలో అంటరానివారుగా, చాలా హీనంగా చూడటం జరుగుతోంది. కానీ– ఒకనాడు మన దేశంలో వాళ్ళదే రాజ్యం. వాళ్ళే రారాజులూ కూడాను. ఈ దేశంలో మొట్టమొదట నివాసం వున్నవాళ్ళు వాళ్ళే. అంతా వాళ్ళతోనే ప్రారంభమైంది. వాళ్ళ వారసులం మనం. మన తల్లిదండ్రులలాంటి వాళ్ళని మన పాలకులు హీనంగా చూడటం చాలా అక్రమమైనదీ, అన్యాయమైంది కూడానూ. అంచేత మనం వాళ్ళను గౌరవించే పద్ధతిని నేర్పటం అనేది చాలా అవసరం అని నేనను కొంటున్నాను.

మనం చరిత్రను చూసినట్లయితే బ్రిటీషువాడు మన దేశాన్ని ఆక్రమించ డానికి పూర్వం చేతి వృత్తిదార్లు, వ్యవసాయదారులు కూడా సహోదరుల్లాగా, అన్నదమ్ములుగా వుండేవాళ్ళు. కలిసిమెలిసి వుండేవాళ్ళు. అన్నదమ్ములుగా, తాతా మావా అని బంధుత్వాలు కలుపుకొని పిలుచుకొనే వాళ్ళు. అట్లాంటిది బ్రిటీషువాడు వచ్చాక ఏమయిందంటే చేతివృత్తులు నాశనమవటం ప్రారంభమైంది. మనవాళ్ళంతా చెప్తున్నారు భూమి అంతా మనది అని. భూమి అంతా మనదే, కానీ బ్రిటీషువాడు భూమి నాది అన్నాడు. దురాక్రమణ చేసిన వాడే భూమి తనదని, తనకి అనుకూలంగా వున్నవారికి వందల ఎకరాలు పట్టాలు ఇచ్చి, భూమిని నువ్వు అమ్ముకో, అని చెప్పాడు. అంతకు ముందు భూమి గ్రామాల్లో అందరిదీ, అటువంటి అందరికీ చెందిన భూమి కొందరికి హస్తగతమైంది, ఈ భూస్వాములనే వాళ్ళు తర్వాత వచ్చారు. ముందు ఇక్కడ మనం గమనించాల్సిన అంశమేమంటే భూస్వాములకు, రైతులకు మధ్య తేడా చూడకుండా అందరూ రైతులే అంటున్నారు. భూముంటే రైతులే అంటున్నారు. భూమి వుంటే రైతు కాదు. భూమి మీద పనిచేసేవాడే రైతు. దుక్కి దున్నేవాడే రైతు. పంట పండించేవాడే రైతు. పంట పండించనివాడు రైతు కాదు అని మనం గట్టిగా చెప్పాల్సిన అవసరం వుంది. కమ్యూనిస్టు పార్టీ దున్నేవానిదే భూమి అని చెప్పింది. ఇవాళ దున్నేవానిదే భూమి కాదు. 80 శాతం భూమి, అధిక శాతం భూమి భూస్వాముల చేతుల్లో వుంది. చాలా తక్కువ శాతం భూమి, 20 శాతం భూమి మాత్రమే పేద, సన్నకారు, చిన్నకారు రైతాంగం చేతుల్లో వుంది. అంచేత భూమి అనేది చాలా ముఖ్యమైనది. ఈ భూస్వాముల చేతుల్లోని భూమిని తీసుకొని మనమందరం పేదలకు పంచినప్పుడే అది నిజమైన స్వాతంత్ర్యం అవుతుంది. మనకి ఈ స్వాతంత్ర్యం వచ్చిందని చెప్తున్న 62 ఏళ్ళ తర్వాత కూడా అటువంటి భూమి పంపకం జరగలేదు. ఎప్పుడో తెలంగాణా సాయుధ పోరాట కాలంలో మనం చెప్పాం. దున్నేవానికే భూమి కావాలని. ఈ పరిపాలన అంతా కూడా భూస్వాముల అధీనంలో జరుగుతోంది. ఈ బ్యాంకులు ఎవరికి అప్పులిస్తున్నాయంటే భూస్వాములకే అప్పులు ఇస్తున్నాయి తప్ప రైతులకు అప్పులు ఇవ్వటం లేదు. రైతుల పేరుతో భూస్వాములకు ప్రభుత్వం అప్పులిస్తోంది. భూస్వాములకి, రైతులకి మధ్య తేడా పెరిగిపోతోంది అనేది మనందరం గ్రహించాలి. అందుచేతనే భూస్వాములు చాలా పెరిగిపోయారు. అన్ని రంగాల్లో వాళ్ళదే పెత్తనం! పరిపాలనలో వాళ్ళదే పెత్తనం, న్యాయ వ్యవస్థలో వాళ్ళదే పెత్తనం, పోలీసు వ్యవస్థలో వాళ్ళదే పెత్తనం, సైన్యంలో వాళ్ళదే పెత్తనం. సాంస్కృతిక రంగంలో, సినిమాల్లో వాళ్ళదే పెత్తనంగా సాగుతోంది. ఇది భూస్వాముల రాజ్యము. ఈ భూస్వాముల రాజ్యాన్ని పడ దోయాలని రైతుకూలీసంఘం కోరుతోంది. అట్లాగే గ్రామీణ పేదల సంఘం కూడా, ఈ భూస్వాముల పెత్తనం పోవాలి అని కోరుతోంది. అయితే 1967లో కానూసన్యాల్ గారు, చారుమజుందార్‌గార్ల నాయకత్వాన పశ్చిమబెంగాల్‌లోని నక్సల్బరీ ప్రాంతంలో ఈ భూస్వాముల భూముల్ని ఆక్రమించుకోవటం ప్రారంభమైంది. నక్సల్బరీ ప్రాంతంలో ప్రారంభమైన వాళ్ళనే నక్సలైట్లు అంటున్నాం. కానూసన్యాల్‌గారి నగర్ ఇది. కానూసన్యాల్ గారు ఇచ్చిన పిలుపేమిటి? భారతదేశమంతటా నక్సల్బరీలు సృష్టించండి అని! వేలాది నక్సల్బరీలను సృష్టించడం మన కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని స్వీకరిస్తారని ఆశిస్తూ, ఆ కార్యక్రమంలో ఎల్లప్పుడూ మీ వెంట ఉంటా మని హామీ ఇస్తున్నాను.

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

## కె.రంగయ్య

**ఎ.ఐ.కె.ఎమ్.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



ఈ మహాసభ జరుగుతున్న సందర్భంగా మా అఖిల భారత రైతుకూలీ సంఘాన్ని కూడా ఆహ్వానించినందుకు అభినందనలు, సంతోషం. ఈ మహాసభ సంపూర్ణంగా విజయవంతం కావాలని కూడా నేను దృఢంగా ఆకాంక్షిస్తున్నాను.

ఈ మహాసభ జరుపుకొంటున్నటువంటి సమయం చాలా గడ్డు సమయం. పాలక వర్గాలు ప్రజా వ్యతిరేక విధానాలను చాలా నగ్నంగా, బాహాటంగా బరితెగించి అమలు చేస్తున్న సమయం. ఈ యొక్క తప్పుడు విధానాలు, పద్ధతులు ప్రజాజీవితం మీద, రైతుకూలీల జీవితం మీద చాలా నష్టకరమైన ప్రభావాన్ని పడవేసిన సందర్భంలో రైతు కూలీలు, ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి ముందుకొస్తున్న సమయం కూడా. ఈ సమయంలో ఈ మహాసభ జరుగుతున్నది. ఈ మహాసభ ఇట్లాంటి విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, కూలంకషంగా చర్చించి, సమీక్షించుకొని, తగిన విధానాలు రూపొందించుకొని మరింత ముందుకు పోవాలని కూడా ఈ సందర్భంగా నేను కోరు కుంటున్నాను.

సరళీకృత ఆర్థిక విధానాల పేరిట సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల్ని ఈ పాలకవర్గాలు అనుసరిస్తూ వుండటం వలన ఈ దేశానికి అన్నం పెడుతున్న, బట్ట లందిస్తున్న రైతు అనేక కష్టాలు ఎదుర్కొం టున్నాడు. వ్యవసాయ రంగమే దీనస్థితిలో వున్న పరిస్థితి ఇవాళ ఎదుర్కొంటూ వున్నాం. సాధ్యమైతే ఈ వ్యవసాయ రంగాన్ని వీడిపోవాలని కూడా చూస్తూ వున్నాం. ఈ విషయాలన్నీ కూడా, సమస్యలన్నీ కూడా పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాల యొక్క దుష్ఫలితాలే తప్ప మరొకటి కాదు అన్నది మనకందరికీ తెలుసు. ఇటువంటి పరిస్థితుల్లో ఈ దేశాన్ని, వ్యవసాయరంగాన్ని, రైతుకూలీల బతుకుల్ని కాపాడుకోవాల్సిన అవసర మున్నది. అందుకోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరమున్నది. ఈ పాలక వర్గాలు అనుసరిస్తున్న రైతుకూలీ వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలకు, అనేక పేర్లు వాళ్ళు పెట్టుకొన్నప్పటికీ, వీటి ఫలితం ప్రజా జీవితం మీద, అన్ని రంగాల మీద చెడుగా పడుతున్నది. వాళ్ళు ఎంత అభివృద్ధి అని చెప్తున్నా, ఆ అభివృద్ధి వినాశనానికి దారి తీస్తున్న పరిస్థితి వుంది.

విప్లవకారులు, రైతుకూలీసంఘాలు, రైతు సంఘాలకు సంబంధం లేకుండా కూడా కొన్ని సందర్భాల్లో రైతుకూలీ ఉద్యమాలు వస్తున్న పరిస్థితి వుంది. ఇలాంటి వాటిని ఒక రకంగా మనం సమీకృతం చేసి వీటన్నింటినీ ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత వుంది. ఆ విధంగా మేము కొన్ని పోరాటాలు చేస్తూ వున్నాం. అనేక సంఘాలు చేస్తూ వున్నాయి. మీరూ మీ వంతుగా చేస్తూ వున్నారు. ఇట్లా విడివిడిగా కాకుండా, ఇట్లాంటి సందర్భాల్లో, ప్రజా పోరాటాలు ముందుకొస్తున్న పరిస్థితుల్లో, ప్రజావ్యతిరేక విధానాలు బాహాటంగా ముందుకొస్తున్న పరిస్థితుల్లో, భూములు కోల్పోతున్న నేపథ్యంలో, ఈ విత్తన రంగంలో, వ్యవసాయరంగంలో సామ్రాజ్య వాదం మరీ బరితెగించి చొచ్చుకు వస్తున్న నేపథ్యంలో, మనం పెద్ద ఎత్తున సంయుక్తంగా కలిసి పని చేయాల్సిన అవసరం వున్నది. ఇలాంటి సందర్భంలో మహాసభలు జరుపుతూ తగిన నిర్ణయాలు తీసుకొని ముందుకొస్తారని, మీరు చేపట్టిన పోరాటాల్లో అవకాశం వున్న మేరకు మేం కూడా కలిసి పని చేస్తామని ఈ సందర్భంగా తెలియచేస్తూ, ఈ మహాసభలు విజయవంతం కావాలని మా అఖిల భారత రైతుకూలీసంఘం తరఫున కోరుకొంటూ సెలవు తీసుకొంటున్నాను. లాల్‌సలామ్.

## మల్లిఖార్జునరెడ్డి

**న్యాయవాది, భూరక్షణ కమిటీ నాయకులు, బళ్ళారి-కర్ణాటక**



వేదిక పైన ఉన్న పెద్దలకు, ఆంధ్ర రాష్ట్రం నుండే కాక దేశం నలుమూలల నుండి వచ్చిన నాతోటి ప్రతినిధులకు నమస్కారాలు. ఎక్కడ కర్ణాటక రాష్ట్రంలో బళ్ళారి జిల్లాలో వున్న చాగనూరు, సిలువార గ్రామాలు, ఎక్కడ ఈ ఒంగోలు?! ఈ రెంటినీ ఏకం చేసిన రైతుకూలీసంఘం- మా చాగనూరు, సిలువార పోరాట సమితికి అద్భుతమైన అవకాశాన్ని ఈ వేదిక ద్వారా కలుగచేసింది. మా కష్టాలేంటో, మా పోట్లాటేంటో తెలియజేయ డానికి మాకు ఈ వేదికను ప్రసాదించింది. వాళ్ళకు చెయ్యెత్తి జై కొట్టడం తప్ప వేరే విధంగా కృతజ్ఞత తెలియజేసుకోవడం వుండదని నా భావన.

మా పోరాటంలో పరోక్షంగా రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) వహించిన పాత్ర ఎనలేనిది. అక్కడ రైతులు ఎందుకు పోరాడు తున్నారు. అన్నది తెలుసుకునేందుకు ఒక నిజనిర్ధారణ కమిటీగా పంపిస్తాం. అందులో ముఖ్యులు కె.ఆర్.చౌదరిగారు, కోటయ్యగారు, పెద్దన్నగారు, తిమ్మారెడ్డిగారు. వాళ్ళ వయసులు వాళ్ళే యువకులుగా వచ్చి మా ప్రాంతాల్ని చూశారు. ఆ వయసులో కాలువలు, గట్లు దాటుతూ వుంటే నిజమైన పోరాట స్ఫూర్తి, ప్రజలకు నిజమైన సహాయసహకారాలు అందించగల వ్యక్తులు ఈ రోజు నాకు ఎదురు పడ్డారు అని సంతోషపడ్డాను.

మాది నీటిపారుదల ఉండే ప్రాంతం. తుంగభద్ర ప్రాజెక్టు కింద సాగుబడి అయ్యే

ప్రాంతం. వీళ్ళు భూములంతా పరీక్షించి ఒక నివేదికను తయారుచేసి మాకు ఇచ్చారు. ఆ నివేదికను కేసు విషయంలో మా సీనియర్స్‌కు ఇస్తే, 'మీ కేసు గురించి ఇతరత్రా ఏమీ చదవనక్కర్లేదు, ఒక్క ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ రిపోర్ట్ చదివితే చాలు, సమస్యంతా అర్థమై పోతుంది' అని నన్ను అప్రిషియేట్ చేశారు. అప్పుడు నాకు ఈ రైతుకూలీ సంఘమే కన్పించింది, ఎంతమంచి సహాయం చేశారు కదా వీళ్ళు అని'.

మా రైతు పోరాటాన్ని రైతుకూలీసంఘం వారు భుజం పైన వేసుకొని మేమున్నా మయ్యా అని ముందుకు ధార్వాడ్‌కు నడిపించారు. ఆ వెనుకటి రోజు థార్వాడ్‌లో భయంకరమైన పరిస్థితి. ఎక్కడో మంగు ళూరులో గొడవలు జరిగాయని చెప్పి అక్కడంతా 144 సెక్షన్ విధించారు. థార్వాడ్‌లో గుంపులు గుంపులుగా తిరిగే ప్రసక్తే లేదు. కానీ మేం వినిపించుకొనే పరిస్థితి లేదు. అందరూ సిద్ధంగా వున్నారు. రైతులకోసం ఆహారం కూడా సిద్ధం చేశాం. రైతుకూలీసంఘం (ఆంధ్రదేశ్) అనేకమంది మహిళల్ని వెంట తీసుకొచ్చారు. రైల్వేస్టేషన్‌లో దిగగానే పోలీసులు కాచుకొని వున్నారు, తీసుకు పోవడానికి. నేను చెప్పాను, 'అమ్మా మీరు దూరంగా వుండండి, మేం పోరాటంలో వున్నాము. అరెస్టు చేస్తే ఎన్ని రోజులు లోపల పెడతారో తెలీదు. మీరు పక్కకి వుండండి, రాకండి, మీరు వచ్చిపోయే వాళ్ళు', అని చెప్పాను. ఆ మహిళలు చిన్న పిల్లల్ని చంకలో వెంటేసుకొని వచ్చారు, పోరాటానికి? ఎంత అద్భుతమైన విషయం! నేను ఆ మహిళల్తో మాట్లాడితే-ఏం ఫర్వాలేదన్నారు. మాకు సిగ్గవుతుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో, పోరాట పరిస్థితుల్లో మేం అరెస్టవుతామా, దెబ్బలు తింటామా, జైల్లో వుంటామా అని ఏమీ ఆలోచించకుండా పోరాటంలో, మీ వెంట మేం వున్నామప్పా అని మా వీపు తడుతూ సంఘం మా వెంట నడుస్తోంటే ఎంత అద్భుతమైన పరిస్థితి అది?!

హంగ్రీనది, వేదావతి నదుల ఒడ్డున మా రెండు గ్రామాలు వున్నాయి. ఏడాదిలో పదకొండు నెలలు ఆ నదుల్లో నీళ్ళు పారుతూనే వుంటాయి. హంగ్రీనది తుంగభద్ర ఉపనది అవుతుంది. అంతే కాకుండా మాకు తుంగభద్ర ప్రాజెక్టు నుండి కాలువ సౌకర్యం వుంది. రెండు పంటలు మేం పండించు కొంటాం. మెట్ట భూమి. వర్షాధారిత భూమిని వదిలిపెట్టి, పుష్కలంగా రెండు నుండి మూడు పంటలు పండే భూమిలో ప్రభుత్వం వాళ్ళు ఎయిర్‌పోర్టు నిర్మిస్తామని బయల్దేరారు.

అదే సమయంలో మా కుటుంబ పరిస్థితుల కారణంగా అడ్వకేట్‌గా బెంగుళూరులో ప్రాక్టీసు చేస్తున్న నేను మా ఊరికి రావడం సంభవించింది. ఈ అడ్వకేట్ ప్రొఫెషన్ చాలు అని వచ్చినవాణ్ణి. పల్లె జీవితం ఎంత బ్రహ్మాండంగా వుంటుందో రుచిచూద్దాం అని వచ్చినవాణ్ణి. వచ్చిన ఆర్నెల్లకే ఈ ప్రాబ్లమ్ మొదలయ్యింది. రక్తం కుతకుత వుడుకుతూ వుంది. నేను దాదాపుగా చిన్నతనం నుండి బైటచదవడం వల్ల, వేరే దగ్గర పని చేయడం వలన మా ఊరికి కొత్త. ఒక్క రాఘవరెడ్డిగారి కొడుకుగా తెలుసునేగాని మల్లిఖార్జునరెడ్డిగా తెలీదు. అలాంటి సమయంలో ప్రభుత్వం వారు, ఈ గాలి సోదరులు, వాళ్ళ బ్రోకర్లు, కమీషన్ ఏజంట్లను పంపించి మాకు భూమి కావాలి, ఇవ్వండి, ఎయిర్‌పోర్టు వస్తుంది, మంచి రేటు వస్తుంది అని బేరం మొదలుపెట్టారు. ప్రభుత్వానికి భూమి అవసరమైతే నోటిఫికేషన్ ఇవ్వాలి. నోటిఫికేషన్ తర్వాత ప్రభుత్వ అధికారులు వస్తారు. వీళ్ళెవరు వచ్చేదానికి, అని మొదటి అనుమానం ఏర్పడింది. ఆ రోజుల్లో మా నాన్నగారితో చెప్పాను. ఈ పరిస్థితి రానివ్వకూడదు. మీరంతా పెద్ద లున్నారు. మీరు ఎట్లయినా చేసి దీన్ని రాకుండా చెయ్యాల అని చెప్పాను. మా నాన్నగారు మంచివారే. కానీ పోరాటపటిమ లేనివారు. ఒకసారి వాదించుకొన్నాం. ఇప్పటికీ మా నాన్నంటే భయం. ఎక్కువ మాట్లాడను. అప్పుడు భూ రక్షణ విషయంలో మా తండ్రిగారికి మించి విపరీతంగా వాదన చేశాను. ఆ రోజు మా తండ్రిగారి మీద తిరగ బడ్డాను. మా తండ్రిగారు ఒకటే చెప్పారు. 'రేయ్ పిచ్చాడా! నీ చేత ఏమవుతుందిరా? నువ్వు ఎదుర్కొంటున్నది గాలి జనార్దనరెడ్డి లాంటి మహామనిషిని. ఆయన్ని ఎదుర్కోవట మంటే కొండతో ఢీ కొన్నట్లవుతుంది' అన్నారు. వెంటనే నేను మాట్లాడలేక పోయాను. ఊరకనే కూర్చొన్నాను. మనసులో ఒకటే కదలిక ఏం చేయాలని. సొంత తండ్రికే కొడుకు మీద నమ్మకం లేకుండ పోయింది కదా! నీ చేత కాదు అన్నాడు కదా! సరే, ఏం చేద్దాం. ఎవరికీ చెప్పే అవసరం లేదు. నేను నడిచే బాట సరైన మార్గమయితే జనం నా వెంట వస్తారు, ఇందులో గాభరా పడాల్సింది ఏమీ లేదని, నేనేం చేస్తున్నానన్నది అనుకోని, నా భార్యకు తప్ప ఎవ్వరికీ చెప్పలేదు. ఎందుకంటే భార్యకు చెప్పకపోతే సహకారం దొరకదు భార్య నుంచి. ఆ రోజు భార్యకు చెప్పి ఊళ్ళోకి వెళ్ళాను. తప్పెట తీసుకొన్నాను. ప్రతి ఇంటికి వెళ్ళాను. పోరాటం, పోరాటం. భూమిని మిగులుద్దాం అని! పిచ్చోడన్నారు. వీడికి పనిలేదు, పాట లేదు. అడ్వకేటు వదిలొచ్చి ఊళ్ళో తిరుగుతున్నాడన్నారు. మా రాయలసీమ ప్రాంతంలో రెడ్లు తప్పెట తీసుకొనిపోతే సిగ్గుచేటు. అంటే ఏ దళితులో తప్పెట తీసుకొని పోయి రమ్మంటే రావాల. అంతే ఈ పిచ్చోడు రెడ్డి అయి వుండి తప్పెట తీసుకొని ఇంటింటికి పోతున్నాడ్రా, వీడికంటే పిచ్చోడు ఎవరూ లేరన్నారు. అన్నీ నిభాయించు కొన్నాను. ఆ రోజు ప్రారంభమైన పోరాటం ఈ రోజు అందరికీ తెలిసివచ్చి, మమ్మల్ని ఈ వేదిక పైకి ఆహ్వానించినారంటే, మాకు తెలుసు మేమెలా పోరాడుతున్నామో అది వేరే విషయం, కానీ ఈ రోజు పోరాటానికి గుర్తింపు వచ్చింది కదా. పోరాటం మీ అందరికీ కనబడుతోంది కదా అన్న సంతోషం కూడా కలుగుతోంది.

మిత్రులారా! అక్కడ ఎయిర్‌పోర్టుకు కావలసింది వెయ్యి ఎకరాలు. అందులో రెండు గ్రామాలకు సంబంధించిన భూమిని మధ్య ప్రాంతంలో తీసుకొంటున్నారు. పై నుండి కాలువలు కిందికి పారాలి. కిందివాళ్ళం పైకి పోవాలి. అంటే దార్లు బందవుతాయి. ఎట్లా ప్లాన్ చేశారంటే చూడ్డానికి వెయ్యి ఎకరాలు మాత్రమే తీసుకొంటున్నారు వీళ్ళు. కానీ దాని నుండీ నిజంగా నష్టపోయేది ఐదువేల ఎకరాలు.

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

వాళ్ళు ఎయిర్ పోర్టు ఆథారిటీ ప్రకారం ఆ ప్రాంతంలో నీలావరి కాలువ లేదు. ఆ ప్రాంతంలో వంకలు లేవు, వాగులు లేవు అని ఇచ్చారు. మరి అలాంటప్పుడు నోటిఫికేషన్ దానికి అనుగుణంగానే వుండాలిగానీ దానికి విరుద్ధంగా వుండకూడదు. నోటిఫికేషన్ చూస్తే వంకలు అక్వైర్ అవుతున్నాయి, కాలువలు అక్వైర్ అవుతున్నాయి. ఇదేమి విడ్డూరము? ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా వాళ్ళు స్పాట్‌ని ఐడెంటిఫై చేసి, ఏ స్థలం అనువుగా వుందో నిర్ధారణ చేసి, ఆ స్థలంలో కాలువలు, వంకలు లేవని చెప్పిన తర్వాత ఈ నోటిఫికేషన్‌లో కాలువలు, వంకలు పోతుండేసరికి మాకు చాలా ఆశ్చర్యం వేసింది. మేం ఒక చెక్‌డ్యామ్ ఏర్పరచుకొన్నాం. చాగలమ్మ వంక అని వుంది. ఆ చెక్‌డ్యామ్ వల్ల సుమారు 600 నుండి 1000 ఎకరాలు కేవలం వరినే పండిస్తాం. అటువంటి వాగు పైప్రాంతాన 10 ఎకరాలు ఎక్వైర్ అవుతోంది. అక్కడ పది ఎకరాలు ఎక్వైర్ అయితే ఇక్కడ వెయ్యి ఎకరాలు నష్టపోతాం. క్రిందకు పారే కాలువలు మధ్యలోనే ఆగిపోతాయి. వాటివల్ల సాగయ్యే 5 వేల ఎకరాల భూమి బంజరుగా మారి పోతుంది. మరి ఎవరికి అనిపించదండీ పోరాటం చేద్దామని ఆ పరిస్థితుల్లో?! ఆ పరిస్థితుల్లో ఉద్భవించిన పోరాటమే ఈ రోజు ఈ పోరాటంగా మారింది.

ఈ సందర్భంలో ఎన్నెన్ని కష్టాలెదుర్కొన్నామో, ఎన్నెన్ని నిష్ఠూరాలెదుర్కొన్నమో మాకు తెలుసు. ప్రథమంగా వంద గంటల సత్యాగ్రహమని నేను చేశాను. ఊరికే స్పీచెస్ ఇస్తే రైతులు ఎవరూ రారండి. నేను జనాల నాడి తెలుసుకొందామని 12 గంటల ఉపవాస సత్యాగ్రహమని ఊళ్ళో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మా వూరి దేవత దేవమ్మ గుడి ముందు కూర్చొన్నాను. సాయంత్రం ఆరు గంటల వరకు లెయ్యలేదు. అప్పుడు జనాల్లో కాస్త కదలిక మొదలయింది. స్లోగా ఒక్కరొక్కరు వెంటబడ్డారు. అదయ్యాక వంద గంటల కార్యక్రమం చేశాం. అదయ్యాక పక్కన శిరువార గ్రామం. మొదలే శిరువార గ్రామంలో పోరాటం ఉధృతంగా మొదలై ఆగిపోయింది. అటువంటి శిరువార గ్రామానికి వెళ్ళాను. అక్కడి నుండి రెండు కిలోమీటర్ల పొర్లు దండాలు చేద్దామని చెప్పాను. ఈ రెడ్డికి తల లేదా? పోరాటం చేస్తానని ఎవడైనా పొర్లుతాడా రోడ్డుపైన అన్నారు. ఆ రోజు మేం రెండు కిలోమీటర్లు పొర్లు దండాలు పెట్టాం. అలా మొదలైంది మా పోరాటం. ఆ పోరాట పటిమతోనే మేము 25 కి.మీ నుండి 30 కి.మీ వరకు పొర్లు దండాలు చేశాం. ఐదు రోజుల ప్రోగ్రామ్ ఫిక్స్ చేసుకొన్నామండి. రోజుకి ఐదు కిలోమీటర్ల చొప్పున ఐదు రోజులు 25 కిలోమీటర్లు పొర్లు దండాలు చేయాలని జెప్పేసి, ఎంత స్పందన అంటే రైతులనుండి– ఐదు రోజుల ప్రోగ్రామ్‌ని కేవలం రెండున్నర రోజుల్లోనే మేము ముగించేశాం. ఆ రోడ్లో మా రైతులు దొర్లుతా వుంటే–ఏమైనా మోటరుతో పనిచేస్తున్నారా అన్నంత వేగంగా చేశారు. మేము పొర్లు దండాలు చేసికొన్న రోజున బళ్ళారి చేరుకొన్నాం. విపరీతమైన వర్షం. ఎవరూ లేరు. ఐదుగురం మాత్రమే రైతులం వున్నాం. భయంవేసింది. నాలుగు రోజుల పోరాటం బ్రహ్మాండంగా కొనసాగించాం. చడీచప్పుడు లేకుండా ఒక మెమోరాండం తీసి, ఐదుగురం పోయి ఆఫీసులో ఇచ్చేద్దామనుకొన్నాం. ఎట్లా ప్రారంభమైందో ఏమో గానీ, 11 గంటలకు జనప్రవాహం వచ్చేసింది. అక్కడి నుండి రైతులు బురదలో, నీటిలో, మట్టిలో, గబ్బులో, గలీజులో దొర్లుకుంటూ మేం డి.సి ఆఫీసుకు పోయినాం. ఆ పోరాటాన్ని ఇప్పటికీ బళ్ళారి ప్రజలు మరువలేరు. కోరాపుట్ ఆదివాసీల నృత్యం చూస్తోంటే, మహిళలపై అత్యాచారం జరిగినా కూడా, పోరాటం సాగించి భూమిని నిలుపుకొన్నారంటే అది చాలా గొప్పది, స్ఫూర్తిదాయకం. మా పోరాట సమయంలో ఇది మాకు స్ఫూర్తిగా నిలుస్తుందని సభాముఖంగా తెలియజేసుకొంటున్నాను. ఈ వేదికని, సందేశం ఇవ్వడానికంటే, రైతుకూలీ సంఘం వారికి కృతజ్ఞతలు తెలియజేయడానికి మరియు మీ నుండి పూర్తి సహకారం కోరటానికి ఉపయోగించుకోవాలని మేము భావిస్తున్నాము.

ఇక్కడికి మా మహిళా రైతులు వచ్చినారు. రాజమ్మ, లక్ష్మమ్మ–చాలామంది ఉన్నారిక్కడ. మేం ఒక పోరాటం చేశాం. ఎడ్లబండిని మనుషులం లాగాం. బళ్ళారిలో ఐదు కిలోమీటర్ల పాటు ఎడ్లబండిని మనుషులమే లాగాం. మగవాళ్ళం ప్రతి బండిని ఇద్దరం లాగాం. కానీ లక్ష్మమ్మ అని, మహిళా కార్యకర్త ఇక్కడ వుంది, ఒకర్తే బండిని భుజాన వేసుకొని సుమారు అర్ధ కిలోమీటరు వరకు బండిని లాగింది. దీనికి ఏమి జెప్తాం! పోరాటం–స్ఫూర్తి!

వ్యాపారస్తుడికి లాభం పొందాలన్న ధోరణి వుందంటే అది సహజం. మరి ఈ ప్రభుత్వాలు ప్రజల్ని ఇబ్బంది పెట్టకుండా ప్రజల సంక్షేమానికి పాటుపడాలి గానీ మోసం చేయకూడదు. ఇక్కడ ప్రభుత్వాలే అడుగడుగునా తప్పులు చేయడం–మరి మేం పోరాటం చేస్తే పోలీసువాళ్ళని రప్పించడం, మా పైన నానా విధమైన కేసులు పెట్టడం. మేము ఒక రోజు రాస్తారోకో చేశాం. అప్పుడు నన్ను అరెస్టు చేస్తున్నారు అని మా రైతు సహోదరులు ఆందోళన చేశారు, జీపుకి అడ్డుపడ్డారు. దానికీ లాఠీఛార్జి చేశారు. టియర్‌గ్యాస్ ప్రయోగించారు. హత్యా ప్రయత్నం కేసు పెట్టారు. మా రైతు సోదరులతో కలిసి నేను ఒకసారి 12 రోజులు, ఒకసారి 8 రోజులు జైల్లో వున్నాను. నా పైన నాలుగైదు కేసులున్నాయి. 307, 365 సెక్షన్ల క్రింద కేసులు! పోలీసులపైన హత్యాప్రయత్నం చేశామని, కిడ్నాపింగ్ చేశామని, పోలీసులపై ఏ రైతైనా హత్యా ప్రయత్నం చేస్తాడా? పోలీసు యంత్రాంగం తాము ప్రజారక్షకులమన్న మాట మరచి ప్రభుత్వానికి కాపు కాస్తున్నది. ప్రభుత్వాన్ని రక్షించడమే వారి పని కనుక సామాన్య రైతుని హింసిస్తారు. ఇక్కడ ప్రతిచోటా మాకు అన్యాయమే, అన్యాయమే, అన్యాయమే!

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

ఈ పోరాటంలో ఇక్కడున్న వారు నాకు పక్కన వుంటే వెయ్యేనుగుల బలం. పోరాటం ప్రారంభమైన నాటి నుండీ ఈనాటి వరకు నా వెన్నంటే వున్నారు. ఈ వేదికపై రైతుకూలీసంఘం వారితో పాటు అనేకమంది పరిచమయ్యారు. మా సమస్య ఇదీ. మా పోరాటానికి సహకరించాలని, మీరూ మా పోరాటంలో భాగం కావాలని అర్థిస్తున్నాను.

**కా॥ ఎస్.రామారావు**

**ఆం.ప్ర. రైతుసంఘం ప్రధాన కార్యదర్శి**



మహాసభకు విచ్చేసిన ప్రతినిధులందరికీ ఆం.ప్ర.రైతుసంఘం తరపున హృదయ పూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను. మహాసభలు అత్యంత జయప్రదం కావాలని, రానున్న కాలంలో వ్యవసాయరంగ సంక్షోభానికి వ్యతిరేకంగా రైతుకూలీల ప్రయోజనాలు పరిరక్షించడానికి, మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహించడానికి అంచనాలు, ప్రణాళికలు, చిత్తశుద్ధితో కూడిన ఆలోచనలు చేయాలని నేను మనసారా విజ్ఞప్తి చేస్తున్నాను. ఉమ్మడిగా పోరాటాలు సమరశీలంగా నిర్వహించేందుకు మరింత పట్టుదలతోటి ముందుకెళ్ళడానికి మా వంతు సహకారమందిస్తామని తెలియజేస్తున్నాను.

ఆనాడు భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాగిన తెలంగాణా పోరులో, నాలుగు వేలమంది అమరవీరులు రక్తతర్పణ చేశారు. పది లక్షల ఎకరాల భూమిని పంచారు. అంతటి ఘన చరిత్ర కలిగి ఆనాడు చేసిన పోరాటాలు వారసత్వంగా పుణికి పుచ్చుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నఈ ప్రపంచీకరణ, ప్రభావం తోటి సరళీ కరణ విధానాలు మరింతగా రైతాంగాన్ని, కూలీల్ని, సమస్త ప్రజానీకాన్ని పీడనకు గురి చేసి, వాళ్ళ జీవనం మీద మరింత భారం మోపుతున్న ఈ కాలంలో చైతన్యయుతంగా, సమరశీలంగా మరిన్ని పోరాటాలను నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉన్నదని మనం గమనంలో ఉంచుకోవాలి. రైతుకూలీలకు మరింత భద్రత అవసరమైతే ఆ భద్రతను మరింత మృగ్యం చేసే పద్ధతుల్లో ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయి. ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతోటి ఉన్న కొద్దిపాటి భూమి నుండి కూడా వెళ్ళగొట్ట డానికి ఇవ్వాళ బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయడానికి అవసరమైన పద్ధతుల్లో విధానాలు చేస్తున్నారు. ఇప్పటికే భూములు వాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోయిన దాఖలాలు కనపడు తున్నాయి.

పేరుకి మాత్రం ప్రగతిశీలంగా వుంటూ, మాటల గారడీలతోటి రైతుకూలీలను వంచించే పద్ధతులు ప్రభుత్వ విధానాలుగా కొనసాగుతున్న పరిస్థితి వుంది. ఎంత కష్టం చేసినా ఫలితం రావటం లేదు, గనుక మీ భూముల్ని సహకార వ్యవసాయానికి ఇస్తే మీకు బొందితో కైలాసం చూపిస్తామని అంటున్నారు. అంటే భూమి నుండి వెళ్ళగొట్ట డానికి తీవ్రమైన చర్యలు ఒక వైపు, మన భూమి మనకు గాకుండా చేసే పద్ధతులు మరొక వైపు కొనసాగుతున్నాయి. మనం తాగే నీరుని కూడా మనకు కాకుండా చేయడానికి అవసరమైన పద్ధతుల్లో బహుళజాతి కంపెనీ లకు, ప్రత్యేకించి కోకోకోలా కంపెనీకి-ఇవాళ కిన్లే వాటర్ బాటిల్స్ రోజుకి వేయికోట్ల రూపాయల వ్యాపారం చేసుకొనే పద్ధతిలో అన్ని హక్కులూ కల్పించి-మన భూగర్భ జలాల్ని దోచుకోవడానికి వీలైన పద్ధతుల్ని, జలవిధానం పేరుతో 37 జీవోను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తీసుకొచ్చింది. ఈ పేరుతో నీటిని చుక్క చుక్క వెలకట్టి, కాలువలకు మీటర్లు పెట్టి, తాగే నీటికి మీటర్లు పెట్టి, నీటిని వ్యాపార సరుకుగా మార్చేసి, ప్రజల జీవనాడుల్ని పీల్చివేయడానికి అవసరమైన విధానాలు కొనసాగిస్తున్నారు. అంటే నీటిని నేడు మనకు దూరం చేసి, రేపు గాలిని కూడా దూరం చేస్తారు. ఇప్పుడు వైద్యశాలల్లో మాత్రమే ఆక్సిజన్ వాడు తున్నారు. ఈ వాతావరణం కలుషితమై, భూమి వేడెక్కి, చివరకి అస్తవ్యస్తమైన పరిస్థితికి తీసుకొచ్చి రేపు గాలిని కూడా అమ్మకానికి సిద్ధం చేస్తారు. అంటే ప్రకృతిలోని మన సంపదని, భూమిని, జలాన్ని, గాలిని మనకు దక్కకుండా చేసే పరిస్థితులున్నాయి. రేపు రానున్న కాలం మరింత కష్టకాలం. బ్రతకటమే మరింత భారంగా మారనున్న కాలం. గతంలో ఆకలి చావులకు చనిపోయారేగానీ ఏనాడూ కూడా ఆత్మహత్యలు చేసుకొన్న చరిత్ర మన దేశంలో లేదు. కానీ ఇటీవలి కాలంలో రెండు లక్షలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ప్రకటిస్తున్నాయి. ఇవాళ మనిషి జీవితంలోనే విరక్తి, ఏహ్యాభావం, మానసిక సంక్షుభితమైన ఆలోచనలు వస్తుండడానికి కారణం పెట్టుబడిదారీ విధానం! అటు చావలేక, ఇటు బతకలేక రెండింటి మధ్య నలిగి చనిపోయే పరిస్థితులు దాపురించాయి. దీనికి కారణమైన, దుర్మార్గమైన ఆర్థిక సరళీ కరణ విధానాలు మన దేశంలో మిన్నంటు తున్న స్థితిలో మరింత బాధ్యత తోటి మరింత కష్టతరమైన ఉద్యమాన్ని సరైన పద్ధతుల్లో గాడిలోకి తీసుకొని రావడానికి మనందరం ఇతోధికంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఎవరి పోరాటాలు వారు చేస్తారు. మంచిని స్వీకరించి, ఆచరణీయ మైన పద్ధతుల్లో మనం వెళ్ళటం అవసరం. ఉద్యమాలు నిర్వహిస్తుంటే సంతోషించాల్సిన అవసరం వుంది. ఉద్యమం తీవ్రతరమవు తుంటే దానికి జేజేలు పలకాల్సిన అవసరం వుంది. అందుకోసం ఎవరు ముందున్నారు, ఎవరు వెనుక వున్నారు అని చూడటం కాదు. వస్తున్న సమస్యల మీద సరైనటువంటి పరిజ్ఞానంతో, ఏ మాట వెనకాల ఏమున్నదో తెలుసుకోలేక ప్రజలు మోసపోయే దానికి చరమగీతం పాడేందుకు మనమంతా కంకణ ధారులవుదాం. మేం కూడా మీతోటి వీలైన

మేరకు ఎక్కడ అవకాశం వుంటే అక్కడ సహకరించి దానికనుగుణమైన పద్ధతుల్లో పోరుబాటలో ముందుకెళదామని చెబుతూ, ఈ మాటలు ఈ మహాసభలో చెప్పడానికి అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలియ జేస్తున్నాను.

## కా॥ ఎస్.డి.బోస్
**ఏఐకెఎమ్‌కెఎస్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, బీహార్**



రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధులకు అఖిలభారత ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యునిగా, బీహార్ రాష్ట్రానికి సంబంధించిన వానిగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

మిత్రులారా, ఈ రోజు మన దేశం చాలా తీవ్రమైన సంక్షోభంలో చిక్కుకొన్న ప్రత్యేక పరిస్థితిలో వున్నాం. మన దేశంలో రైతులు-సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా చాలా పెద్ద ఎత్తున పోరాటం చేశారు. మన దేశంలో ముఖ్యమైన రెండు మహత్తర రైతాంగ పోరాటాలు జరిగాయి. ఒకటి 40ల్లో తెలంగాణా రైతాంగ పోరాటం, 60ల్లో నక్సల్బరీ రైతాంగ పోరాటం. ఈ రెండింటి లక్ష్యం ఒక్కటే. అందుకనే మనం ఇస్తున్న నినాదం 'తెలంగాణా బాట, నక్సల్బరీ బాట ఒక్కటే. ఈ రెండూ మనకి దారి చూపుతున్నాయ'ని!' తెలంగాణా, నక్సల్బరీ లక్ష్యం-భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ శక్తుల్ని ఓడించి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం జేయటం. తెలంగాణాలో గానీ, నక్సల్బరీలో గానీ దున్నేవానికే భూమి అన్నదే ప్రధానమైన నినాదం. ఎప్పుడూ కూడా ఇక్కడ భూమి సమస్య చుట్టూ, 'దున్నేవానికే భూమి'ని సాధించటం చుట్టూనే ఈ పోరాటాలు జరిగాయి. ఐనా కేంద్రంలోగానీ, రాష్ట్రంలో గానీ, భూసంస్కరణ చట్టాలు ఎక్కడా అమలు జరగలేదు. తెలంగాణా పోరాటం సందర్భంగా వినోబాభావే జమీందార్ల చుట్టూ భూమి ఇవ్వమని తిరిగాడు. దాని పర్యవసానాలు మనకి తెలుసు. మహత్తర నక్సల్బరీ పోరాటం తర్వాత ఇందిరాగాంధీ భూ సంస్కరణల చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ రెండు పోరాటాల నుండి వాళ్ళు నేర్చుకొన్నదేమంటే ఇక్కడి రైతాంగం భూమి సమస్యపై పోరాడటానికి ముందుకు వస్తే, కేంద్రంలో గానీ, రాష్ట్రంలోగానీ తమ పునాదులు కదిలిపోతాయన్న గుణపాఠాన్ని పాలకులు తీసుకొన్నారు. కనుక ఈ భూమి కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి వుంటుంది తప్ప మరో మార్గం లేదు. నిన్నటి ప్రారంభసభలో డాక్టర్ బి.డి.శర్మ అభివృద్ధి గురించి, భూమి గురించి రెండు విలువైన విషయాలు చెప్పారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ నినాదాల్ని మన పాలకులు అమలు చేస్తున్న సందర్భంలో, మనకు పాలకుల విధానాలు మరింత స్పష్టంగా అర్ధమవుతున్నాయి. ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, బహుళజాతి కంపెనీలు ఎలా వచ్చి ఇక్కడ పాతుకుపోయి దోపిడీ చేస్తున్నాయో చూస్తున్నాం. ఈ రోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కూడా అభివృద్ధి పేరుతో ఏం చేస్తున్నాయో చూస్తున్నాం. గ్రామాల నుండీ కూలీల్ని దూరంగా గెంటివేస్తున్న పరిస్థితి వుంది. ఇటీవల బీహార్‌లో లెక్కల ప్రకారం భూమి వున్న వారిలో 96% ప్రజల దగ్గర 66% భూమి వుంది, 3% మంది దగ్గర 33% భూమి వుంది. భూమి ఎవరి చేతుల్లో పోగుబడి వుందో దీన్ని బట్టి అర్ధమవుతోంది. ఇప్పుడు పైకి కనిపించే జమీందార్లు లేరుగానీ, రాజకీయ దృష్టితో చూసినప్పుడు భూమిపై పట్టు కలిగిన నయా జమీందార్లు ఉన్నారు. గ్రామాల్లో వుండే ఫ్యూడల్ శక్తులు-స్థానిక అధికారులు, జిల్లా అధికారుల్తో సంబంధాలు పెట్టుకొని, అధికారం వాళ్ళ చేతుల్లోనే పెట్టుకొని పెత్తనం చేస్తున్నారు. కనుక రైతుకూలీసంఘం ఒక పక్కన సామ్రాజ్యవాదానికీ, సరళీకరణకీ, ప్రైవేటీకరణకీ, ప్రపంచీకరణకీ వ్యతిరేకంగా పోరాడుతూనే గ్రామాల్లో వుండే ఫ్యూడల్ శక్తులు, ఆధిపత్యశక్తులకి వ్యతిరేకంగా పోరాటం నిర్వహిస్తుందని ఆశిస్తూ ముగిస్తున్నాను.

## బాబూలాల్ కుంబర్‌గావ్
**మరట్వాడా కిసాన్ మజ్దూర్ సంఘ్, మహారాష్ట్ర**



వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతినిధులకు విప్లవాభినందనలు. మరాఠ్వాడా కిసాన్ మజ్దూర్ సంఘం తరఫున రైతుకూలీసంఘానికి విప్లవాభినందనలు. దేశవ్యాప్తంగా వివిధ రైతుసంఘాలకు ఒకే లక్ష్యం వుంది. దున్నడానికి భూమి, ఉండడానికి ఇల్లు, చేయడానికి పని సాధించాలి. అధికార బదిలీ జరిగి 63 సంవత్సరాలు అవుతున్నా- ఈ సమస్యలు పరిష్కారం కాలేదు. 1947లో జరిగింది ఏమిటంటే సామ్రాజ్య వాదులు దళారీలకు అధికారాన్ని బదిలీ చేశారు తప్ప నిజమైన స్వాతంత్ర్యం రాలేదు. 2020 నాటికి మన దేశం పెద్ద శక్తిగా అవుతామనుకొన్నాం. కానీ ఇవాళ జరిగిందేమిటి? రెండు లక్షల మంది రైతులు ఆత్మహత్యల పాలయ్యారు. మహారాష్ట్రలో కూడా ఈ పరిస్థితి దారుణంగా వుంది. చిన్న పిల్లల దగ్గర నుండి పెద్దవాళ్ళదాకా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. డిగ్రీలు చదువుకున్న లక్షలాదిమందికి ఉద్యోగాలు లేవు. అనేక ఉద్యోగాల్ని ప్రైవేటుపరం చేస్తున్నారు. విద్యను కూడా ప్రైవేటుపరం

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

చేయడం వల్ల సామాన్యులకు విద్య అందే పరిస్థితి లేదు. ప్రభుత్వరంగంలో వైద్య విధానం అత్యంత నిర్లక్ష్యం చేయబడుతోంది. ప్రైవేటురంగంలో వైద్యం ఖరీదైనదిగా మారి పోయింది. ప్రజలు వ్యాధులతో అల్లాడు తున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి మహారాష్ట్రవాడే. ధరలు విపరీతంగా పెరిగినాయి. పంచదార ధర పెరిగిందంటే పంచదార తినకపోతే చచ్చిపోతారా అంటు న్నాడు. ధరలు ఎప్పుడు తగ్గుతాయని ప్రశ్నిస్తే-అది చెప్పడానికి నేనేమైనా జ్యోతి ష్యుడినా అంటున్నాడు.

మా దగ్గర భూస్వాములు ఎట్లా ఉన్నా రంటే-ఒక భూస్వామి యొక్క పొలం-రైలు అరగంట పాటు నడిస్తేగాని దాటలేనంత విశాలంగా వున్నాయి. అడవి సంపద అంతా అప్పగించి, అక్కడి ఆదివాసుల్ని నిర్వాసితుల్ని చేసే చర్యలు సాగుతున్నాయి. 1965లో తెచ్చిన పైరుపచ్చ విప్లవానికి ముందు ప్రతి రైతు ఇంట్లో విత్తనాలు ఉండేవి. ఈ రోజు రైతు ఇంట్లో విత్తనాలు లేవు. మొత్తం బహుళ జాతి కంపెనీల చేతుల్లో విత్తనాలున్నాయి. ఇదీ పైరుపచ్చ విప్లవం ఫలితం! ఇవాళ విత్తనాలు ఎలా రూపొందిస్తున్నారంటే ఎరువులు లేకుండా, పురుగుమందులు లేకుండా పంట పండే స్థితి లేదు. అవి కూడా ఈ కంపెనీల వాళ్ళే ధరలు నిర్ణయించి ఆ రకంగా రైతుల్ని కొల్లగొడుతున్నారు. ఈ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వాడి పంట దిగుబడిని కొంత పెంచిన మాట వాస్తవమేగానీ, గిట్టు బాటుధర ఇవ్వకుండా, పెట్టుబడులు పెంచి రైతుల్ని దివాళా తీయించారు. విత్తనాల విషయంలో నూతనత్వం పేరుతో తీసుకొచ్చిన పద్ధతుల వల్ల రైతుల బతుకుల్ని బహుళజాతి కంపెనీలు బలి తీసుకుంటున్నాయి. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూమి నాశనం అవుతుందని ఈ రోజు చెప్తున్నారు. 1960కి ముందు ఏ మందులూ వాడే వాళ్ళం కాదు గదా! మరి ఎవరు పాడు చేస్తున్నారు భూమిని? రైతులా? పురుగుమందుల కంపెనీలా?

ఇవాళ మహారాష్ట్రలో తిండిగింజల్ని పండించే పరిస్థితి లేదు. పండిన వాటి నుండి కూడా ఇథనాల్ తయారుచేసే ఫ్యాక్టరీలు పెడుతున్నారు. ఈ పెడుతున్న వారంతా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన, మంత్రులకు సంబంధించిన పెద్దలే. ఒకవైపు వేలాదిమంది రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. కానీ భూముల ధరలు మాత్రం ఆకాశన్నంటు తున్నాయి. ఇది ఎందుకు జరుగుతోందంటే రైతుకి గిట్టుబాటు ధర ఇవ్వకుండా, రైతుని నష్టపెట్టి, అప్పుల పాల్జేసి, ఆ రైతు భూమిని అమ్ముకొనే దుస్థితికి తీసుకొచ్చారు. ఈ భూమిని కొంటున్నది నల్లధనం కలిగిన పెద్ద పెద్ద వాళ్ళే. రెండో వైపున ప్రభుత్వం రైతుల భూముల్ని కారుచౌకగా గుంజుకొని, పారి శ్రామికవేత్తలకు కట్టబెడుతోంది. ఇక కొన్ని వామపక్ష పార్టీలు, లేదా సోషలిస్టుల పరిస్థితి ఏమయిందంటే వాస్తవ పరిస్థితులపై ఆధార పడి ప్రజా ఉద్యమాన్ని నిర్మించే బదులు కాంగ్రెసు వ్యతిరేకత పేరుతో ఎమర్జెన్సీ తర్వాత బిజెపిని అధికారంలోకి తేవడానికి తోడ్పడ్డారు, సెక్యులర్ పార్టీ పేరుతో నేడు కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నారు. ఈ రకంగా వీళ్ళు ప్రజల్ని దగా చేస్తున్నారు. ఇటువంటి విధానాల్ని మనం వ్యతిరేకించాలి.

ఇవాళ కఠినమైన దరిద్రానికి వ్యతిరేకంగా పేదవాళ్ళందర్నీ ఐక్యం చేసి ఉద్యమాలు నడిపే బదులు మహారాష్ట్రతత్వం పేరుతో, మహారాష్ట్ర నగరాల్లో కొచ్చి బతుకు తున్న ఇతర ప్రాంతాల వాళ్ళని బెదిరి స్తున్నారు. కానీ ఈ మహారాష్ట్ర నుండే బతక లేక ఇతర ప్రాంతాలకు వెళ్తున్న ప్రజల గురించి ఈ తత్త్వవాదులకు పట్టలేదు. సానియా మీర్జా పెళ్ళి ఆమె వ్యక్తిగతమైనది, అయినా దాని మీద రాజ్‌థాక్రే తదితరులు గొడవ చేస్తూ, ప్రజల్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఆ రకంగా అసలు సమస్యల నుండి పక్కదారి పట్టించే కుట్రల నుండీ మనం మెలకువగా వుండాలి. తెలంగాణా రైతాంగ పోరాట అను భవాల నుండీ, నక్సల్బరీ పోరాట అనుభవాల నుండీ రైతుకూలీసంఘం (ఆం.ప్ర) వివిధ ప్రాంతాల్లో ఉద్యమాలు నిర్మిస్తున్న ప్రభావం మా మీద కూడా వుంది. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని మా ప్రాంతంలో కూడా ఉద్యమాలు నిర్మిస్తున్నాం. మహాసభకు హాజరైన వారందరికీ విప్లవాభి నందనలు తెలియజేస్తూ ముగిస్తున్నాను. ఇంక్విలాబ్ జిందాబాద్!

### బాబూలాల్ యాదవ్

**ఎఐకెఎమ్‌కెఎస్ నాయకులు, మధ్యప్రదేశ్**



ఆంధ్రరాష్ట్రంలోని గ్రామ గ్రామంనుండీ వచ్చిన ప్రతినిధులకు, వివిధ రాష్ట్రాల నుండీ వచ్చిన ప్రతినిధులకు ఏఐకెఎమ్‌కెఎస్, మధ్యప్రదేశ్ తరఫున అభినందనలు తెలియ జేస్తున్నాను. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లో మూలమూల ప్రాంతాల్లో రైతుకూలీ ఉ ద్యమాన్ని నిర్మిస్తున్న మీ అందరికీ ప్రత్యేక అభినందనలు తెలియచేస్తున్నాను. విశేషమేం టంటే, ఇక్కడ ఇంత పెద్ద మహాసభ నిర్వ హిస్తున్న కార్యకర్తలు భుజం భుజం కలిపి దీన్ని నిర్వహించటం చూస్తోంటే, ఎన్నో సంవత్సరాల అనుభవంతో ఈ సంస్థ ఇంత శక్తివంతంగా వుంది అని అర్థమవుతోంది. ఇక్కడి రైతుకూలీ ఉద్యమం యొక్క అనుభవాలు, నిర్మాణపద్ధతి-ఇదంతా కూడా దేశవ్యాప్తంగా ఒక బలమైన సందేశాన్ని అందిస్తుంది అని నేను భావిస్తున్నాను. ఈ రెండు రోజుల్లో ఆదివాసీ ప్రాంతాల్లో పని చేస్తున్న కార్యకర్తల్ని చూస్తోంటే, ఆ ఉద్యమం ఎంతగా వేళ్ళూనుకొని ఉందో అర్థమవు తోంది. సాంస్కృతిక కళారూపాల్ని ప్రదర్శించిన కార్యకర్తలకు అభినందనల్ని తెలియ జేస్తున్నాను. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతినిధులు ఈ కార్యక్రమాల్ని ఆస్వాదిస్తూనే, సందేశాన్ని అర్థం చేసుకోవ డానికి దోహద పడ్డాయి.

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

నేను మధ్యప్రదేశ్ నుండీ వచ్చాను. ఘనీభవించిన భూస్వాముల, సామంతుల రాజ్యం నుండీ వచ్చాను. భూస్వాముల పార్టీలు ఏవంటే ఒకటి కాంగ్రెసు, రెండోది బిజెపి. ఎక్కడైతే సింధియా రాజులు రాజ్యమేలుతున్నారో, అక్కడినుండీ వచ్చాను. అర్జున్ సింగ్ ఏలిన ప్రాంతం నుండి వచ్చాను. దిగ్విజయ్‌సింగ్ జిల్లానే నేను వచ్చిన జిల్లా. సింధియా రాజుల విద్రోహ చరిత్ర ఎటువంటిదంటే బ్రిటీషు వానికి కొమ్ముగాసి ఝాన్సీ రాణిని హతమార్చడానికి పూనుకొన్న విద్రోహుల కుటుంబం ఇది. నానా సాహెబ్, తాంతియాతోపేలను కూడా చంపడానికి బ్రిటీషువాళ్ళతో చేతులు కలిపిన ద్రోహులు వీళ్ళు. 1947 అధికార బదిలీ తర్వాత ఈ రాజులందరూ కాంగ్రెస్ తీర్థం తీసుకొన్నారు. నైజాం ప్రభువుకు ఏ రకంగా అయితే 'రాజ ప్రముఖ్' అని పదవి ఇచ్చారో, ఆ రకంగా ఈ సింధియా రాజులకు కూడా భారత ప్రభుత్వం రాజ ప్రముఖ్ అని గౌరవించి భరణమిచ్చింది. బిజెపీవాళ్ళు, కాంగ్రెసువాళ్ళు ఈ రాజుల వైభవం కాపాడడంలో ఇద్దరూ భాగస్వాములే. కాంగ్రెస్ సింహద్వారం నుండి ఈ రాజులకి చట్టసభల టిక్కెట్లు దొరుకుతాయి. వీళ్ళ రాణులు దొడ్డిగుమ్మం నుండి బిజెపి టిక్కెట్లు తెచ్చుకొంటుంటారు. బ్రిటీషు కాలం కంటే, ఈనాడు ఈ రెండు రాజ వంశాల పాలనలో రైతులు, కూలీలు దెబ్బ తిన్నారు, కునారిల్లుతున్నారు. 20%గా వుండే ఈ రాజులు, వీళ్ళ బంధువులు, భూస్వాముల చేతుల్లోనే నేటికీ 80%భూమి వుంది. 80%గా వున్న రైతుల చేతిలో వున్న భూమి 20% మాత్రమే. 63 సంవత్సరాల్లో భూమి లేనివాళ్ళు ఈనాటికీ 55% వున్నారంటే మధ్యప్రదేశ్‌లో పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చు. మధ్యప్రదేశ్‌లో సాగుకు సదుపాయం వున్న భూమి 3% మాత్రమే. 95% భూమి వర్షాధారితం మాత్రమే. నీటి పారుదల సౌకర్యాలు వాటికి ఏ మాత్రమూ లేవు. అర ఎకరం పొలంలో మెట్ట ప్రాంతంలో రెండు సంచుల ధాన్యం పండుతుంది. 8 ఎకరాలు, 9 ఎకరాలు ఉన్న రైతు కూడా సరైన తిండి లేక అలమటిస్తున్న స్థితి వుంది. 1960లోనే భూ నియంత్రణ చట్టం మధ్యప్రదేశ్‌లో వచ్చింది. అయితే వ్యవసాయరంగంలో మెకనైజేషన్ పేరు మీద చాలా భూమి వాళ్ళకే వదిలి పెట్టటం జరిగింది. 1970 లోపల ఇంకొక భూసంస్కరణల చట్టం వచ్చింది. 3 కోట్లు ఖర్చు పెట్టిన తర్వాత 50 లక్షల ఎకరాలు పంచగలిగారు. ఈ 50 లక్షల ఎకరాలు మాత్రమే బైటపడిన దాని గురించి కమ్యూనిస్టు పార్టీలు కొండను తవ్వి ఎలుకను పట్టినట్టని చెప్పారు. ఈ 50 లక్షల ఎకరాల గురించి కూడా భూస్వాములు కోర్టుకి వెళ్ళారు. ఇప్పటిదాకా ఒక్క ఎకరం కూడా ప్రభుత్వానికి వచ్చింది లేదు, ప్రజలకి దక్కింది లేదు. కాంగ్రెసు ప్రభుత్వం ఉండే కాలంలో భార్యభర్తలు ఇద్దరికీ కలిపి అర ఎకరమో, ఎకరమో పట్టా కాగితాలిచ్చారు గానీ భూమి మాత్రం చూపలేదు. ఆరేడు సంవత్సరాలుగా కాంగ్రెసు ప్రభుత్వం అధికారానికి దూరంగా వుంది. ఆరేళ్ళ నుండి బిజెపి అధికారంలో వున్నా అరెకరం భూమి కూడా పంచిన పాపాన పోలేదు. 2003లో మధ్యప్రదేశ్ నుండి ఛత్తీస్‌ఘడ్‌ను విడదీశారు. దీంతో కొన్ని పరిశ్రమలు, ఖనిజసంపద వెళ్ళిపోయాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి 25వేల బీగాల భూమిని విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేశాడు. ఇందులో ఐదువేల హెక్టార్ల భూమిని ఇప్పటికే వాళ్ళకి స్వాధీనం కూడా చేశాడు. కానీ భూమి లేనివారికి సెంటు భూమిని కూడా ఇచ్చింది లేదు. జనాభాలో 45% ప్రజలకు సెంటు భూమి కూడా లేదు. ఇదీ మధ్యప్రదేశ్ పరిస్థితి.

ఈ రెండురోజుల సదస్సు చూశాక–అన్నింటికంటే మధ్యప్రదేశ్‌లోని దీన, హీనస్థితుల మధ్య చురుగ్గా పనిచేసి బలమైన ఉద్యమాన్ని నిర్మించవచ్చు అన్న నిర్ణయానికి నేను వచ్చాను. మధ్యప్రదేశ్‌లో 13% గిరిజనులు వున్నారు. వాళ్ళు వ్యవసాయం చేయరు. ఒక ఎకరం, సెంటుభూమి వున్నా ఎవరికో ఒకరికి ఇచ్చేస్తారు. ఇవాళ ఇక్కడి అనుభవాల్ని ఉపయోగించి వీళ్ళ చేత వ్యవసాయం చేయించగలిగితే గొప్ప శక్తిగా తయారవుతారు. నేను ఈ సభ నుండి శపథం తీసుకొని వెళ్తున్నాను–భూమి లేనివాళ్ళకు భూమి సాధించుకొని, భూమిని నిలబెట్టుకొనే పద్ధతుల్లో ఉద్యమం నిర్మించి ముందుకు పోవటానికి శపథం తీసుకొన్నాను. నేను చిన్న రైతుని. రెండు హెక్టర్ల భూమి మాత్రమే వున్నా రైతు మనస్తత్వం నాకు వుంది. భారత రైతు ఇవాళ అప్పుల్లోనే పుట్టి అప్పుల్లోనే చస్తున్నాడు. రైతు తన భూమిలోనే తాను ఆత్మ హత్య చేసుకొంటున్నందుకు ప్రధానమంత్రి తదితరులు ఏ మాత్రం సిగ్గుపడటం లేదు. భూమిలేని వాళ్ళు, కొద్దిపాటి భూమి ఉన్న వాళ్ళు ఉద్యమించి, భూమిని తమ చేతిలోకి తీసుకొన్ననాడే పరిస్థితి బాగుపడుతుంది. ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఇంక్విలాబ్ జిందాబాద్.



### కా॥అరయాక్కండి రోబి, కేరళ



నేను మొదటిగా అమరులందరికీ విప్లవాంజలి ఘటిస్తున్నాను. మొదటి నుండీ మన నాయకులు ఒక నినాదాన్ని ఇస్తూ వచ్చారు. అది 'దున్నే వానికే భూమి' అన్నది. మహత్తర తెలంగాణా పోరాటాన్ని నాయకత్వం మోసానికి గురిచేసింది. ఆ తర్వాత నక్సల్బరీ పోరాటాన్ని సిపిఎం భాగస్వామిగా వున్న యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అణచివేసింది. ఈ రోజుకీ కూడా 'దున్నే వానికే భూమి'

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

అన్న నినాదాన్ని మనం నిజం చేసుకోలేక పోయాం. అయితే ఇది నిజమై తీరుతుంది. దీనికి మరికొంత సమయం పడుతుంది. మరికొంత కష్టతరమైన పనులు చేయాల్సి వుంటుంది. మనం మరింత అంకితమై ఈ నినాదాన్ని నిజం చేయడానికి పూనుకోవలసి వుంటుంది. ఈనాడు రైతుకూలీసంఘం 'దున్నే వానికే భూమి' అన్న నినాదాన్ని కేంద్రంగా తీసుకొని పనిచేస్తోంది. ఈ పనిని దేశ వ్యాపితంగా కొనసాగిస్తే మనం అచిర కాలం లోనే ఈ నినాదాన్ని ఆచరణ సాధ్యం చేయ గలుగుతాం. ఈ సందర్భంగా ఇక్కడ ప్రదర్శన లిచ్చిన ఆంధ్ర, ఒరిస్సా, సాంస్కృతిక దళాలను నేను అభినందిస్తున్నాను. 'స్వాతంత్ర్యానికి ' ముందు అన్ని విప్లవ ఉద్యమాలూ, తమ సందేశాల్ని ప్రజల్లో వ్యాప్తి చేయడానికి ఈ ప్రజాకళల్ని ఉపయోగించు కొన్నాయని మనకు తెలుసు. ఆ రకంగానే ఈ సాంస్కృతిక దళాల యొక్క పాటలూ, ప్రదర్శనలూ మెరుపుల్లా, ఉరుముల్లా ప్రజల్ని మేల్కొల్పు తాయని, తోడ్పడుతాయని నేను భావి స్తున్నాను. కనుక మన కేంద్ర నినాదమైన 'దున్నేవానికే భూమి' నినాదంతో పాటు తగిన నినాదాలను కూడా రూపొందించుకొని మన పోరాటాలను కొనసాగించాలని చెప్తూ మీ అందరికీ ధన్యవాదాలు చెప్తున్నాను.

### బసవేశ్వరరాం
**ఎడిటర్, వీక్లీ చర్చా-పంజాబ్**



నేను మొదట ఆంధ్రయోధులకు, కానూసన్యాల్‌కు, తెలంగాణా, శ్రీకాకుళం పోరాటంలో అమరులైన విప్లవవీరులకి విప్లవాంజలి ఘటిస్తున్నాను. నేను పంజాబ్‌లో నెలకొని వున్న రాజకీయ ఆర్థిక పరిస్థితుల్ని మీకు వివరిస్తాను.

పంజాబ్‌లో మేం ఐక్య కార్యాచరణ సాగిస్తున్నాము. భారతీయ కిసాన్ యూనియన్ పేరు మీద రైతాంగ సమస్యల మీద ఐక్యకార్యా చరణ సాగిస్తున్నాము. పంజాబ్ పరిస్థితి మీకు అర్థం కావాలంటే పంజాబ్‌లో జరిగిన జాతీయోద్యమం గురించి, రైతాంగ ఉద్యమం గురించి స్థూలంగా చెప్పాల్సి వుంటుంది. పంజాబ్‌లో రైతాంగ ఉద్యమానికి అక్కడ వున్న కమ్యూనిస్టు ఉద్యమంతో, జాతీయోద్యమంతో సన్నిహిత సంబంధాలుండేవి. పంజబ్‌లో రైతాంగ ఉద్యమాలు, జాతీయోద్యమాలు ఎంతో మిలిటెంట్‌గానూ, వీరోచితంగానూ సాగిన చరిత్ర వుంది. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత గదర్ ఉద్యమం తర్వాత భగత్‌సింగ్ ఇచ్చిన పిలుపు ప్రకారం 'మన తలాపాగా కాపాడుకొందాం' పేరుతో మిలిటెంట్ రైతాంగ ఉద్యమం సాగింది. రష్యాకి వెళ్ళిన గుర్జిత్‌సింగ్ తదితర కామ్రేడ్స్ విప్లవాల చరిత్రని అధ్యయనం చేశారు. తర్వాత వాళ్ళు రైతాంగ ఉద్యమాల నిర్మాణంతోపాటు మిలటరీ తర్ఫీదు కూడా పొందాలని గురీందర్ సింగ్ నాయకత్వంలో నిర్ణయానికొచ్చారు. ఆయన టర్కీకి వెళ్ళి సైనిక శిక్షణ, ప్రత్యేకించి గెరిల్లా శిక్షణ పొందారు. ఆ రకంగా ఆయన లెఫ్టినెంట్ కల్నల్ స్థాయి పొందారు. స్టాలిన్ నాయకత్వంలో గెరిల్లా శిక్షణ పొందిన బాబాలు తిరిగి భారతదేశం వచ్చారు. ఆ రకంగా కిసాన్ యూనియన్‌ని ప్రారం భించారు. వీరి ఆధ్వర్యంలో రైతాంగ ఉద్యమం మిలిటెంట్‌గా సాగింది. వీరి ఆధ్వర్యంలో 1800 గ్రామాల్లో కిసాన్ యూనియన్ వేళ్ళూనుకొన్నది. అప్పుడు కిసాన్ యూనియన్ సభ్యత్వం 18 లక్షలు. ఈ సంఘం ఏదో పేరుకి మాత్రమే సంఘం కాదు. ఇవాళ రివిజనిస్టుల ఆధ్వర్యంలో ఉన్న సంఘాలు కాదు. స్వచ్ఛందంగా రైతాంగం సభ్యత్వం తీసుకొని మిలిటెంట్‌గా పోరాటంలో పాల్గొన్న సంఘాలు ఇవి. క్లుప్తంగా చెప్పాలంటే ఈ రైతాంగం ఫ్యూడల్ భూస్వాములకి, పెట్టుబడిదారీ భూస్వాములకీ, బ్రిటీషు పెత్తందార్లకి వ్యతిరేకంగా, దోపిడీకి, అణచివేతకీ వ్యతిరేకంగానూ పోరాడారు. 1940లో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఇచ్చిన సూచన ప్రకారం వర్కర్స్ పార్టీని రద్దు చేసుకొని సిపిఐలో చేరారు. ఆ కమ్యూనిస్టు పార్టీకి అప్పుడు నాయకులుగా సోహన్‌సింగ్ జోష్, హరికిషన్‌సింగ్ సూర్జిత్ వుండేవాళ్ళు. అయితే రైతాంగం మీద పట్టు అంతా ఈ బాబాలకే వుండేది. నాయకుల పాత్ర నామ మాత్రంగానే వుండేది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఇచ్చిన డైరెక్షన్స్ ప్రకారం బాబాలు తాము చేయని తప్పులకి కూడా ఆత్మవిమర్శలు చేసుకొన్నారు. అప్పుడున్న కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం తమ తప్పుల్ని గుర్తించకపోగా, వీరి పనికి ఆటంకాలు కలుగజేసింది. వర్కర్స్ పార్టీగా వున్న నాయకులంతా కష్టపడే కార్యకర్తలు. వాళ్ళు క్షేత్రస్థాయిలో పనిచేసి, రైతాంగ ఉద్యమం నిర్మిస్తూ వచ్చారు. తదనంతరకాలం వీరు రెడ్ కమ్యూనిస్టు పార్టీని పెట్టుకొని అశేషమైన కృషి చేసి మాల్వా ప్రాంతంలో 740 గ్రామాల్లో 8 లక్షల ఎకరాల భూమి పంపకం చేశారు. తెలంగాణా సాయుధ పోరాటంలాగే వాళ్ళు కూడా రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్మించారు. ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించి, రక్తపుటేరుల్ని పారించి ఉద్యమాన్ని అణచడానికి తీవ్ర ప్రయత్నం చేసింది. ఈ రైతాంగ పోరాటానికి కిషన్‌గఢ్ కేంద్రంగా వుండేది. కిషన్‌గఢ్ గ్రామం అప్పుడు భటిండా జిల్లాలో వుండేది. ఇప్పుడు మాన్సా జిల్లాలో వుంది. ఈ ఉద్యమం మరింత తీవ్ర మవడంతో ప్రభుత్వం మీద ఒత్తిడి పెరిగింది. రైతాంగం యొక్క న్యాయమైన డిమాండ్ల పట్ల మీ వైఖరి ఏమిటని ప్రభుత్వం మీద ప్రజల ఒత్తిడి పెరిగింది. అంతిమంగా ప్రభుత్వం రాజీనామా చేయాల్సి వచ్చింది. అప్పుడు పంజాబ్ రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా వున్న ధ్యాన్‌సింగ్ ప్రభుత్వం రాజీనామా చేసి వైదొలగాల్సి వచ్చింది. ఈ ఉద్యమ ఫలితంగా నామ మాత్రపు రుసుముతో కౌలుదార్లకు భూమిపై హక్కు కల్పించే చట్టం వచ్చింది.

ఆ తర్వాత అనేక పరిణామాలు వచ్చాయి. ప్రధాన పరిణామం పైరుపచ్చ విప్లవం. దీని ఫలితంగా మేం గోధుమ, వరి పండిస్తున్నాం. అయితే గోధుమ, వరి దిగుబడులు పెరిగిన కొద్దీ రైతాంగం యొక్క రుణభారం కూడా పెరుగుతోంది. కనుక ఈ రోజు పంజాబ్‌లో భూమికోసం పోరాటం మరో రూపంలో సాగుతోంది. ఈ రోజు తమకున్న కొద్దిపాటి భూమి మీద తమ హక్కును నిలబెట్టుకొనేందుకు రైతాంగం పోరాటం సాగిస్తున్నారు. అప్పుల పాలయి పోయి, తమ భూమిని వడ్డీ వ్యాపారులకి ధారాదత్తం చేయాల్సిన పరిస్థితులు వస్తోంటే, తమ భూమి తమకే చెందాలని పోరాటం చేయాల్సి వస్తోంది. పోరాటాల నుండి నేను గమనించింది ఏమంటే శ్రీకాకుళంలోనూ, కోరాపుట్‌లోనూ ఆదివాసీ భూములను ఏ విధంగా వడ్డీ వ్యాపారులు, సారా వ్యాపారులు కబ్జా చేసుకుపోతున్నారో పంజాబ్‌లో కూడా ఇలాగే వుంది. పంజాబ్‌లో రైతు భూమిని-అప్పు ఇచ్చిన వడ్డీ వ్యాపారులు, బ్యాంకులు, లాండ్ మాఫియాలు కబ్జా చేసుకుపోతున్నారు.

ఇటీవల కాలంలో ఛండీగఢ్, ఆ చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో ఒక పోరాటం జరిగింది. ఛండీగఢ్ నగరానికి కేంద్రమైన రోజ్‌గార్డెన్‌లో లక్షలాది రైతాంగం ప్రదర్శనలు చేశారు. రోజ్‌గార్డెన్ అనేది భారతదేశంలోకల్లా అందమైన నగరంలో వున్న అందమైన ఉద్యానవనం. వేలాది మంది రైతాంగం అక్కడ సమీకృతులై వారం రోజులపాటు ధర్నా నిర్వహించారు. వాళ్ళను అక్కడ నుండీ తరిమి వేయడానికి, వాళ్ళ ప్రదర్శనని అడ్డుకోవ డానికి ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. అయితే రైతాంగం వీటిని ఎదుర్కొని నిబ్బరంగా నిలిచారు. 'అప్పుల వసూలు కోసం రైతాంగాన్ని అరెస్టు చేయము' అని ప్రభుత్వం హామీ ఇచ్చే వరకూ రైతాంగం ధర్నా కొనసాగించారు. అందమైన రోజ్‌గార్డెన్‌లోనే రైతాంగం తమ కాలకృత్యాలు తీర్చుకొన్నారు. నగరంలోని మధ్యతరగతి జనం అందమైన తోట పాడైపోతోందని గగ్గోలు పెట్టారు. ఈ ఉద్యమం ఒత్తిడిని తట్టుకోలేక ప్రభుత్వం చివరికి 'అప్పుల వసూలు కోసం రైతాంగాన్ని ఎవర్నీ అరెస్టు చేయబోమని' ప్రకటించింది. ఈ హామీని పొందిన తర్వాతే రైతాంగం తమ ఊళ్ళకి తిరిగివెళ్ళారు. కనుక ఈ పోరాటం కొనసాగుతూనే వుంది. అప్పుల బారి నుండి రక్షించుకోవడానికి రైతాంగం సంఘటితంగా పోరాడుతూనే వున్నారు.

అయితే బ్యాంకులు, షావుకార్లు కొత్తరకం ఎత్తుగడల్తో రైతుల నుండి భూమిని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ షావు కార్లు రైతాంగానికి తెల్లకాగితం మీద సంతకం పెట్టించుకొని అప్పులు ఇస్తారు. తర్వాత తమకు నచ్చిన షరతులు రాసుకొంటారు. మరోదారి లేక తప్పనిసరిగా వీటి మీద అప్పులు తీసుకొనే స్థితిలో వున్నారు. రైతాంగం నిస్సహాయతని ఆసరాగా చేసుకొని అన్యాయమైన షరతులతో హోధియార్లు అప్పులిస్తున్నారు. తమ ఇష్టం వచ్చినట్లుగా రాసుకొన్న ప్రోనోట్లతో కోర్టుల నుండి ఆర్డర్లు తెచ్చుకొని రైతుల భూములు గుంజుకొంటు న్నప్పుడు రైతాంగం ప్రతి ఘటించక తప్పటం లేదు. ఆ రకంగా రైతాంగ పోరాటం ఇవాళ పంజాబ్‌లో సాగుతోంది. కనుక గ్రామాల్లో ఈ రోజు భూస్వామి లేక పోవచ్చు. కానీ ఒక వర్గ పోరాటం సాగుతోంది. ప్రభుత్వ యంత్రాంగానికి, తహసీల్దార్లకి, పోలీసులకి, కోర్టులకి, హోధియార్లకి వ్యతిరేకంగా పంజాబ్ రైతాంగం వర్గపోరు సాగిస్తోంది. ఈ పోరాటంలో భాగంగానే భటిండా, మాన్సా, జలంధర్, ఇలాంటి జిల్లాలన్నింటా అనేక గ్రామాలు నిరంతరం ఈ వర్గపోరులో మునిగి వున్నాయి. ఈ పోరాటాల క్రమంలోనే అరెస్టులు, లాఠీ ఛార్జీలు, పోలీసు కాల్పులు జరుగుతున్నాయి. రైతాంగం రక్తం చిందించాల్సి వస్తోంది. ప్రభుత్వం, దాని యంత్రాంగం, కోర్టులు కలిసి రైతాంగాన్ని భూమి నుండి గెంటేయడానికి ప్రయత్నిస్తోంటే, మరొకపక్క భూమిపై తమ యాజమాన్య హక్కును నిలబెట్టుకోవడానికి రైతాంగం పోరాటం చేయాల్సి వస్తోంది.

ఇప్పుడు పరిస్థితి యొక్క రెండవ పార్శ్వాన్ని కూడా తడుముతాను. పంజాబ్‌లో వందలాది, వేలాది ఎకరాలున్నాయి. అక్కడి దేవాలయ భూములుగా సిక్కు గురుద్వారాల కింద వేలాది ఎకరాలున్నాయి. ఈ దేవాలయ భూముల మీద రైతాంగం కౌలు రైతులుగా పనిచేస్తున్నారు. కౌలు గురించి ఇతర సమస్యల గురించి ప్రభుత్వాలకి, గురుద్వారాల అధిపతులకి-కౌలు రైతులకి మధ్య అనేక పోరాటాలు సాగుతున్నాయ. ఇటీవలి కాలంలో దొరికిన భూమినల్లా ఆక్రమించే రౌడీ గుంపులు తయారైంది. పంజాబ్‌లో కాంగ్రెస్ ఛీఫ్ మినిస్టర్ ప్రకాశ్‌సింగ్ బాదల్‌ల దన్నుతో ఈ లాండ్ మాఫియా రోజురోజుకీ బలపడు తోంది. రైతాంగ పోరాటాల వల్ల భూమిపై కొంతమంది రైతులకు హక్కులు ఏర్పడి నప్పటికీ, కొంతమంది రైతులు పట్టాలు పొందగలిగినప్పటికీ ఈ రోజుకీ రైతాంగం అంతా అలాంటి పట్టాలు పొందలేకపోయారు. రైతే భూమిని సాగుచేస్తునప్పటికీ పట్టాల మీద భూస్వాముల పేర్లే ఉన్న సమస్య నేటికీ వుంది. కనుక ఈ ల్యాండ్ మాఫియా ముఖ్యమంత్రి అండదండలతో, అప్పులపాలైన రైతాంగం భూమిని, భూమిని సాగుచేస్తున్న రైతాంగపు పేరున పట్టాలేని భూమిని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొంటు న్నారు. లక్షలాది ఎకరాలు ఈ రకంగా లాండ్ మాఫియా చేతుల్లోకి వెళ్ళిపోయాయి.

2010లో మరో రకం పోరాటం ముందుకొచ్చింది. దేవాలయ భూముల్ని సాగు చేస్తున్న కౌలురైతుల నుండి భూమిని లాగేసు కోవడానికి గురుద్వారాల అధిపతిగా వుండే సంస్థ ప్రయత్నించింది. దీనిని రైతులు ప్రతి ఘటించారు. పోలీసులు కాల్పులు జరపడంతో ఐదుగురు రైతులు మరణించారు. గురుదాస్ పూర్ జిల్లాలో రైతాంగం-ప్రభుత్వ భూమిని దున్నుకొనే హక్కు రైతాంగానికే ఉండాలని పోరాడుతున్నారు. కానీ లాండ్ మాఫియా ఆ భూమిని కబ్జాచేసి అమ్ము కోవడానికి చూస్తున్నారు. ఈ రకపు పోరాటం ఇప్పుడు ముందుకు వస్తోంది. అమృత్‌సర్ జిల్లాలో ల్యాండ్ మాఫియా కామ్రేడ్ సాధుసింగ్

తత్పురాను '10 ఫిబ్రవరిలో హత్య చేశారు. ఈ నిర్బంధంతో రైతాంగం బెదిరిపోలేదు. రైతాంగం ఆ కామ్రేడ్ సంస్మరణ సభని జరుపుకొన్నారు. మార్చి 15న జాగరణ దివస్‌ను జరుపుకొన్నారు. సమస్య పరిష్కార మయ్యే వరకూ పోరాటం ఆగేదిలేదని ప్రకటించుకొన్నారు. పంజాబ్‌లో వున్న 22 రైతు, రైతుకూలీసంఘాలు ఐక్యకార్యాచరణ కమిటీగా ఏర్పడి ఈ పోరాటాలకు నాయకత్వం వహించడానికి శపథం తీసు కొన్నాయి. పంజాబ్ రైతుల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహానికి ఇది నిదర్శనంగా వుంటుంది.

నేను ఈ వేదిక మీద నుండి నిశ్చయంగా చెబుతున్నాను. పంజాబ్ రైతాంగం నిద్రపోదు, తమ అంతిమ విజయాన్ని సాధించే వరకు పోరాడుతారు, పోరాడుతారు, పోరాడుతారు. పాలకవర్గాల అత్యంత వంచనాత్మక ప్రతినిధి అయిన ప్రకాశ్‌సింగ్ బాదల్-రైతాంగాన్ని భూమి నుండి గెంటివేయడానికి సకల ప్రయత్నాలు చేస్తున్నాడు. పంజాబ్ ఎలక్ట్రిసిటీ బోర్డును ప్రైవేటీకరించడానికి ప్రపంచబ్యాంకు ఏప్రిల్ 15ను డెడ్‌లైన్‌గా పెట్టింది. ఇది రైతాంగానికి నష్టకరమన్న దాంతో 22 సంఘాలు దీన్ని ప్రతిఘటిస్తున్నాయి. పంజాబ్ రైతుల ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి కేంద్రం నుండి ప్రత్యేక సైనిక దళాలు కావాలని, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కావాలని కోరి వున్నాడు. ప్రకాశ్‌సింగ్ బాదల్ మాటల్లో చెప్పాలంటే పంజాబ్ రేపు మండిపోబో తుంది. మనం చూడాలంటే పంజాబ్ మరో చారిత్రక పోరాటానికి వేదిక కానున్నది. పంజాబ్ రైతాంగం, పంజాబ్ రైతుకూలీలు ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించరు. ఎలక్ట్రిసిటీ బోర్డును ప్రైవేటీకరించడానికి, అప్పుల పేరుతో భూముల నుండి రైతాంగాన్ని గెంటివేయ డానికి పంజాబ్ ప్రభుత్వం చేస్తున్న ప్రతి చర్యనీ వారు వ్యతిరేకిస్తారు. తమ హక్కుల్ని సాధించుకోవడానికి వారు పోరాటం సాగిస్తారు. రాబోయే రోజుల్లో తీవ్రమైన పోరాటాలకు మనం సంసిద్ధులం కావాలి. ఏ మాత్రం వెనకడుగు వేయకుండా ప్రజల పక్షాన, రైతాంగం పక్షాన నిలబడాలి. మీ అనుభవాలనుండి మేం ఎంతో నేర్చుకొన్నాం. మీ సందేశాన్ని నేను నా శక్తి మేరకు పంజాబ్ అంతా తీసుకుని వెళ్తాను.

## ప్రొ॥ జ్యోతిరాణి,

### కాకతీయ యూనివర్శిటీ, అర్థశాస్త్ర విభాగం; డైరెక్టర్ ఉమెన్స్ స్టడీస్ సెంటర్; 'స్త్రీ సంఘటన' ఎడిటర్

రైతుకూలీలు, చిన్న, సన్నకారు రైతుల హక్కుల కోసం, వాళ్ళ జీవితాల్లో గుణాత్మక మైన మార్పు రావడానికి, వాళ్ళు ఆత్మ గౌరవంతో బతకడానికి రైతుకూలీసంఘం (ఆం.ప్ర)గా మీరు నిజాయితీతో, చిత్తశుద్ధితో, అంకితభావంతో చేస్తున్న కృషి అభినంద నీయం.

నిజానికి మన రాజ్యాంగంలో, ఆదేశిక సూత్రాలలో, ప్రణాళికలలో అన్ని రకాల అసమానతలను తొలగించాలన్నదే ప్రధాన లక్ష్యంగా వుంది. కానీ ఆ లక్ష్యసాధన కొరకు ఏర్పడ్డ యంత్రాంగం అందుకు పూర్తి విరుద్ధంగా పని చేస్తున్నది. పీడిత వర్గాల జీవన సమస్యలు రోజురోజుకూ తీవ్రతరమవు తున్నాయి. అసమానతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కనీస జీవన ప్రమాణాలతో బ్రతకడమే కష్టమవుతోంది. ఇటువంటి పరిస్థితిలో అట్టడుగు వర్గాల సమస్యల పరిష్కారానికి సంఘటితపోరాటమే సరైన మార్గం. అయితే నిరక్షరాస్యత, సమస్యలపట్ల స్పష్టమైన అవగాహన లేకపోవటం, సమస్యలు ఎట్లా పరిష్కరించుకోవాలో తెలియక పోవడం వల్ల సమస్యలతోనే జీవిస్తున్న ప్రజలు వాళ్ళకు వాళ్ళే సమీకృతం కావడం సాధ్యం కాదు. అందువల్ల ఈ విజ్ఞానం తెలిసిన వాళ్ళు ప్రజలను సమీ కరించాల్సిన బాధ్యత తీసుకోవలసి వుంటుంది. ఆ బాధ్యత తీసుకోవడంలో, దాని కొరకు అంకితభావంతో పనిచేయడంలో గత నాలుగు దశాబ్దాలుగా మీరు చేస్తున్న కృషి హర్షించదగ్గది. రైతు, కూలీ, ఆదివాసీ పీడిత ప్రజల ఉద్యమాలను నిర్మించడంలో రైతు కూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) సరైన, సమగ్ర మైన దృక్పథంతో, సంతులితమైన వైఖరితో నిర్దిష్టంగా, నిర్మాణాత్మకంగా సాగిస్తున్న కృషి ఎన్నదగ్గది. ఉద్యమ నిర్మాణ క్రమంలో ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ, ప్రజల్ని అన్ని జీవిత పార్శ్వాల్లో చైతన్య వంతుల్ని చేస్తున్న మీ కార్యాచరణ ఆదర్శ ప్రాయమైనది, అవసర మైనది. ఇది విజయ వంతం అవుతుందని చరిత్ర కూడా రుజువు చేసింది. ఇటువంటి ఆచరణ సుదీర్ఘకాలం మనగలుగుతుంది.

లక్ష్యసాధనలో మీరు మరింత ముందుకు వెళ్ళాలని ఆశిస్తున్నాను. ఎటువంటి అసమానతలు లేకుండా ప్రజలందరు ఆత్మగౌరవంతో జీవించే పరిస్థితులు సాధించే దిశగా చేసే ప్రయత్నంలో మీరు సఫలం కావాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.

(రాతపూర్వకంగా పంపిన సందేశం)

## కా॥ టి.ఎల్.నారాయణ

### ఓపిడిఆర్ గౌరవాధ్యక్షులు



ఇతర రాష్ట్రాల నుండీ వచ్చిన సౌహార్ద్ర ప్రతినిధులకు, ఈ మహాసభకు వచ్చిన రైతుకూలీసంఘం కార్యకర్తలకు, మేధావుల కందరికీ వందనాలు. ఓపిడిఆర్ రాష్ట్ర కార్యవర్గం తరపున మీ రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని కోరు కొంటున్నాను. ప్రభుత్వం వైపు నుండి ప్రజా ఉద్యమాలు నిర్బంధాన్ని ఎదుర్కొంటూ వున్నాయి. ఎక్కడ అణచివేత వుంటుందో, అక్కడ తిరుగుబాటు వుంటుంది. తిరుగుబాట్లు ఎక్కువైన కొద్దీ వాళ్ళ అస్తిత్వాన్ని కాపాడు కోవడం కోసం పాలకవర్గాలు నిర్బంధాన్ని ఎక్కువ చేస్తారు. దీనికి పరిష్కారం ఒకటే. రైతుకూలీ సంఘం కార్యకర్తలు, అనేక

రంగాల ప్రజలందరూ ఈ పాలకవర్గాల పథకాల వల్ల అనేక రకాల ఇబ్బందులకి లోనవుతున్న వాళ్ళందర్నీ సమాయత్తపరచి, సంఘటితపరచి, యువతని, మహిళల్ని, కార్మికుల్ని సంఘటితపరచి పాలకవర్గాల్ని కూలదోసి రాజ్యాధికారం వచ్చేంత వరకూ పోరాటాలు చేయవలసిందే. మనకు హక్కులున్నాయని నిన్నటి నుండీ అనేకమంది మాట్లాడారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల కింద మనకి కొన్ని హక్కులున్నాయి. ఆదేశిక సూత్రాల పేరిట మరికొన్ని హక్కులను పొందుపరిచారు. వాళ్ళు పొందుపరచటం ఎలా జరిగిందంటే, గత వేల సంవత్సరాల నుండీ పీడితులూ, తాడితులూ, ఎవరైతే పాలకవర్గాల దోపిడీ కింద నలిగిపోతున్నారో– వాళ్ళంతా అనేక పోరాటాలు చేయడం ద్వారా, ఆ పోరాటాలకు భయపడి, గుర్తించి, వాటిని హక్కులుగా పొందుపరిచారు. సాధించుకొన్న హక్కుల్ని నిరాకరించడానికి పాలకులు రకరకాల చట్టాల రూపంలో ప్రయత్నిస్తున్నారు. ప్రజల్ని మతం పేరుతో, కులం పేరుతో, ప్రాంతం పేరుతో, రకరకాల కారణాలు చూపించి, బలహీనతల్ని వాడు కొని ప్రజల్ని విభజించటం చేస్తున్నారు. చట్టాల ద్వారా ప్రజలపైన అనేక రూపాల్లో నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. ఈ చట్టాల వెనుక అమెరికా వుందన్నది మనం మర్చిపోరాదు. అమెరికా ప్రభుత్వం కొన్ని షరతులు పెట్టింది, పెడుతోంది. ఇక ముందు పెడుతుంది కూడా. కనుక వెనుక అమెరికా ప్రభుత్వం వుండి మన ప్రభుత్వాలను నడిపిస్తోంది అని గుర్తించకపోతే కేవలం మన కేంద్ర ప్రభుత్వంలో వున్న కొద్దిమంది స్వార్థం వల్లనే ఇదంతా జరుగుతోంది అనుకొంటే పొరపాటు. అప్పుడు మన ఉద్యమాలు విజయవంతం కావు. అమెరికన్ ప్రభుత్వం ఈ రోజున అనేక షరతులు పెడుతోంది. దీనికి కారణం 1991లో మన కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన సంక్షోభంలో మునిగి పోయి, ప్రపంచబ్యాంకు దగ్గరకు వెళ్ళి మా ఓడ మునిగిపోతోంది, రక్షించాలని, దాసోహ మన్నారు. 'మేం అప్పులిస్తాం. కానీ మా షరతులు అమలు చేయాల'ని ప్రపంచబ్యాంకు అన్నది. ఆ షరతులను యథాతథంగా మనవాళ్ళు అమలు పరుస్తున్నారు అనే వాస్తవాన్ని మనం గుర్తించాలి. అమెరికన్ సామ్రాజ్యవాదుల యొక్క ప్రవేశాన్ని, మన ప్రభుత్వం మీద వారి యొక్క నియంత్రణను గుర్తించి, దానికి వ్యతిరేకంగా, పీడిత ప్రజలందర్నీ సంఘటితపరిచే బాధ్యత కూడా రైతుకూలీసంఘంపైన వుంది. ప్రజలు అనేక ఉద్యమాలు చేస్తున్నారు, చేస్తారు కూడా. ఉద్యమాలు చేస్తే ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తుంది. రాజ్యాంగంలో ఇన్ని హక్కులు ఇచ్చారు. ఆ హక్కులు ఎందుకు నిరా కరిస్తున్నారు అని నిలదీయడానికి ఒక వాయిస్ కావాలి. దానికోసం మేధావుల్ని, ప్రజాతంత్రవాదులను కూడగట్టడానికి ఓపిడిఆర్ అనే సంస్థ ఏర్పడింది. కనుక ప్రజలకి వాళ్ళ హక్కుల్ని కాపాడుకొనే హక్కు వుంది. వాళ్ళకు బతకడానికి హక్కు వుంది. ఎన్నో రకాల హక్కులు వుంటేగానీ ప్రజలు సజావుగా బతకలేరు, అర్థవంతంగా బ్రతక లేరు. రాజ్యాంగంలో వున్నా లేకపోయినా, కొన్ని సహజమైన హక్కులు వుంటాయి. ప్రజలకు అవసరమైన హక్కుల్ని ఏనాడూ తీసివేయలేరు. ప్రజల తరపున, ప్రజల్ని సంఘటితపరచి వాళ్ళ హక్కులు రక్షించు కోవటం కోసం మేధావులు అవసరం. ఈ ఓపిడిఆర్ ఆలాంటి మద్దతును మీకు ఎప్పుడూ అందిస్తుంది. నిర్బంధానికి వ్యతిరేకంగా మీ తరఫున నిలబడి, మీ హక్కుల్ని కాపాడే దానికి ఖచ్చితంగా మీతోపాటు ఉంటాము. అది మీ అవసరం కాదు. మా అవసరం కూడా, మనందరి అవసరం అది. భారతదేశంలోని ప్రతివాని అవసరం అది. అందరం కలిసి సజావుగా నడిచే పాలన, అర్థవంతమైన పాలన వచ్చేంత వరకూ పోరాడాలని, దానికి మా మద్దతు వుంటుందని చెప్తూ ముగిస్తున్నాను.

## దివికుమార్

**ప్రధాన కార్యదర్శి, జనసాహితి**



రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) మహా సభలకి రాష్ట్రంలోని వివిధ జిల్లాలనుండీ, వందలాది గ్రామల నుండీ ప్రతినిధులుగా విచ్చేసినటువంటి రైతుకూలీసంఘం కార్యకర్తలకు, ప్రతినిధులు అందరికీ విప్లవాభినందనలు. అలాగే వివిధ రాష్ట్రాల నుండీ ప్రతినిధులుగా వచ్చినవారికి నా లాల్ సలామ్. 'చెలరేగిన జనసమ్మర్దం/వికసించిన విద్యుత్తేజం/ కావాలోయ్ నవకవనానికి'– అన్నాడు శ్రీశ్రీ. అట్లాంటి చెలరేగిన జన సమ్మర్దాన్ని చూస్తే కవులకు, రచయితలకు హృదయం ఉప్పొంగుతుంది. కలాలూ, గళాలూ పరిగెత్తుతాయ్. తెలుగు నేల మీద, సాహిత్యంలో, కవిత్వంలో మొదటిసారిగా ఎర్రజెండాను ఎగరేసినటువంటి మహాకవి శ్రీశ్రీ, ప్రజాకవి శ్రీశ్రీ, కవిత్వాన్ని విప్లవీ కరించిన శ్రీశ్రీ యొక్క శతజయంతి జరుగు తున్న ఈ రోజుల్లో రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభ జరుగుతోంది. ఈ సందర్భంగా ఎర్రజెండాని మాత్రమే కాదు, పొలాలనన్నీ, హలాలదున్నీ, ఇలాతలంలో హేమం పిండగా, జగానికంతా సౌఖ్యంనిండగ, విరామమెరుగక పరిశ్రమించే, బలం ధరిత్రికి బలికావించే కర్షకవీరుల ఘర్మజలానికి అంటే ఈ చెమటకి ఖరీదు లేదోయ్ అని మొదటిసారిగా తెలుగు సాహిత్యంలో చెప్పినవాడు శ్రీశ్రీ. కవులకి, రచయితలకి, కష్టజీవి పక్షాన నిలబడమని నిర్దేశించి కష్టజీవి పక్షాన నిలబడేటటువంటి సాహిత్యాన్ని, కవిత్వాన్ని; కదిలేదీ, కదిలించేదీ, మారేదీ మార్పించేదీ, పెను

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

నిద్దుర వదిలించేదీ, మునుముందుకు సాగించేదీ, పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ కావాలోయ్ నవకవనానికి, అని నిర్దేశించిన వాడు శ్రీశ్రీ. ఈ సందేశాన్ని సాహిత్యకారులుగా, రచయితలుగా, ఆనాడు తెలంగాణా పోరాటానికి ఒక ఉత్తేజాన్ని కల్పించిన సాహిత్యాన్ని సృష్టించిన కవులూ, రచయితలూ; ఆ పోరాటం సాగుతుండగా ఉత్తేజాన్ని కల్పించిన కవులూ, రచయితలూ; అలాగే శ్రీకాకుళ పోరాటంలో స్వయంగా పాల్గొని అమరులైన సుబ్బారావు పాణిగ్రాహి లాంటి కళాకారులూ, రచయితలూ, ఆ స్ఫూర్తిని కలిగివున్న కవులూ, రచయితలూ; ప్రజల పక్షాన నిలిచి కష్టజీవిలో మొదటి అక్షరం 'క', చివరిది 'వి' అంటే కష్టజీవికి కుడి ఎడమల నిలబడిన వాడే కవి అని సాహిత్యకారులకి మహాకవి శ్రీశ్రీ చేసిన నిర్దేశాన్ని పాటిస్తూ జనసాహితి సంస్థగా గతకాలపు విప్లవాత్మక కృషినంతా ఒక వారసత్వంగా స్వీకరిస్తూ, రైతాంగ ఉద్యమాలకు, పోరాటాలకు బాసటగా నిలబడుతున్నాం. ప్రజాసాహితి–రాయలసీమ కరువు మీద ఒక ప్రత్యేక సంచిక తీసుకొచ్చాం. గ్రామీణ జీవన సంక్షోభం–రైతాంగ ఉద్యమం మీద ఒక ప్రత్యేక సంచిక తీసుకొచ్చాం. 1981లోనే తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట విశేషాలతో సాహిత్య ప్రత్యేక సంచిక తెచ్చాం. మళ్ళీ దాన్ని పునర్ముద్రణ చేశాం. ఆ రకంగా రైతుకూలీల, కష్టజీవుల, శ్రమజీవుల, కార్మికుల యొక్క పోరాటాలకు బాసటగా నిలబడుతూ వున్న మాకు ఒక సాహిత్య సంస్థగా మా కవిత్వాలకి, మా సాహిత్యాలకి, మా రచనలకీ మీరు సాగించే పోరాటాలు గొప్ప ప్రేరణనిస్తాయి. ఆ రకంగా ప్రజల జీవితం నుండీ, అనుభవాల నుండీ నేర్చుకొంటూ ఈ పరిజ్ఞానాన్ని తిరిగి ప్రజలకు అందించేటటువంటి ఒక స్ఫూర్తిని పొందుతున్నాం. మీ ఉద్యమాలూ, పోరాటాలూ విజయవంతమై తీరుతాయని, భవిష్యత్తు మీద పరిపూర్ణమైన విశ్వాసంతో, మీ పోరాటాలలో అండదండగా మేం నిలబడతామని మరోమారు ఈ మహాసభల సందర్భంగా ప్రకటిస్తూ సందేశాన్నిస్తూ సెలవు తీసుకొంటున్నాను–లాల్‌సలామ్.

**కా॥ సి. విజయ,**
**స్త్రీ విముక్తి సంఘటన (ఆం.ప్ర) అధ్యక్షులు**



వివిధ రాష్ట్రాల నుండీ వచ్చిన సౌహార్ద్ర ప్రతినిధులకు, రాష్ట్రంలోని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులకు, ఈ సదస్సుకు హాజరైనటువంటి రైతుకూలీసంఘం ప్రతినిధులందరికీ స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గం తరఫున విప్లవాభినందనలు తెలియజేస్తున్నాను. ఈ రోజు స్త్రీ విముక్తి సంఘటనగా మహిళల సమస్యల పట్ల ఒక స్పష్టమైన అవగాహనతో మేం పని చేస్తూ వున్నాం. ఈ సమాజంలో ఉన్న సమస్తమైనటువంటి అపసవ్యతలను, వాటి తాలూకు దుష్ప్రభావాలన్నింటినీ ముందు గానూ, ఎక్కువ గానూ అనుభవించేవారుగా ఈ రోజు స్త్రీలే వున్నారు. ఈ మహాసభకి ముఖ్య అతిథిగా వచ్చిన బి.డి.శర్మగారు బహిరంగ సభలో మాట్లాడుతూ రైతాంగం ఏ రకంగా అప్పుల పాలై పోయిందో, దాని పర్యవసానంగా ఆ రైతుల కుటుంబాలని, ఆ కుటుంబాలలో ఆడవాళ్ళు ఏ రకంగా పోషిస్తున్నారో మనకి చెప్పారు. మన రాష్ట్రంలో ఈ రోజు వ్యవసాయరంగ సంక్షోభం ఫలితంగా వచ్చినటువంటి దుష్ప్రభావాల వల్ల కరువు పీడిత ప్రాంతాల నుండి వ్యభిచార గృహాలకు తరలుతున్నటువంటి ఆడపిల్లల్ని గణనీయంగా చూస్తూ వున్నాం. వేణుగోపాల్ గారు కూడా స్త్రీల యొక్క సమస్యలను గురించి, వాళ్ళకు సంబంధించినటువంటి పౌష్టికాహార లోపం, రక్తహీనతల గురించి చాలాసేపు ఆవేదన చెందారు. ఎందుకంటే ఈ రోజు ధరల పెరుగుదల ప్రభావం వల్లనైతేనేమి, మరి ఇతర కారణాల వల్లనైతేనేమి, అనేకమంది స్త్రీలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. కాబట్టి ఇవాళ సమాజంలో ఉన్న పేదరికం యొక్క ఫలితాన్ని ముందుగా అనుభవిస్తున్న వాళ్ళుగా స్త్రీలున్నారు. ఈ స్త్రీలకు, ఈ సమస్యలన్నింటి పరిష్కారం కోసం ఏం చేయాలి అన్నది చూసుకున్నప్పుడు ఈ సమాజాన్ని ముందుగా మార్చాల్సిన అవసరం నిర్వివాదాంశం.

ఈ స్థితిలో వేము స్త్రీ విముక్తి సంఘటనగా స్త్రీలను పీల్చి పిప్పి చేస్తున్న పేదరికం, వివిధ అణచివేతలు, భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతులు, అవి స్త్రీల మీద చేస్తున్నటువంటి దాడులకు వ్యతిరేకంగా స్త్రీలను సంఘటిత పరిచే కార్యక్రమాన్ని చేపట్టాం. అదే విధంగా రైతుకూలీసంఘం దశాబ్దాల తరబడి ఒక నిర్దిష్టమైనటువంటి కార్యాచరణతో, ఒక నిబద్ధతతో, దీర్ఘకాలికమైన దృష్టితో, కార్యకలాపాల్ని విస్తారంగా సాగిస్తున్నది. దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా, భూస్వామ్య పెత్తనానికి వ్యతిరేకంగా నిరంతరాయంగా ప్రజల్ని అంటిపెట్టుకొని ఉండటం, ప్రజల్ని సంఘటితపరచి, ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించటం ద్వారా రైతుకూలీ సంఘం ఇవాళ మొత్తం పోరాటాలకి, ఉద్యమాలకి ఒక ఛాంపియన్‌గా రాష్ట్రంలో నిలిచిందనేది ఒక తిరుగులేని సత్యంగా రుజువయింది.

రైతుకూలీ సంఘానికి, స్త్రీ విముక్తి సంఘటనకి ఒక సన్నిహితమైన సంబంధం వుంది. అనేక ఆచరణాత్మక కార్యక్రమాలు, దృక్పథానికి సంబంధించిన విషయాల్లో ఈ రెండు సంఘాలూ ఏకీభావాన్ని కలిగి వున్నాయి. నిన్న, ఈ రోజు అనేకమైన ప్రదర్శనలు ఇచ్చి, ఎంతో ఉత్తేజితుల్ని చేసిన కళాకారు లందరూ కూడా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారే. ఆదివాసీ ప్రాంతాల నుండి వచ్చినప్పటికీ, రైతు కూలీసంఘం

యొక్క ఆచరణాత్మక కృషి వాళ్ళల్లో ప్రతిఫలించింది. ఈ రోజు మరో కళాకారిణి కిర్మ మన ముందు అత్యద్భుతంగా పాటపాడి వినిపించింది. మరి ఆమె మీద జరిగిన దాడి మనందరికీ కూడా తెలిసినటువంటిదే. కానీ ఆ దాడిని తట్టుకొని, వీటన్నింటికీ మనం లొంగకూడదు, ప్రజా ఉద్యమాల్లో ముందుకు కొనసాగటమే ఇటువంటి అరాచక శక్తులన్నింటికీ జవాబు అనే విధంగా ఈ రోజు ఇక్కడ, మహాసభలో పాల్గొనటం, పాటలు పాడటం అంటే దాని వెనక రైతుకూలీసంఘం యొక్క నిర్మాణాత్మక మైన కృషి వున్నది అనేది మనకు చాలా స్పష్టంగా అర్థమవుతోంది. ఈ మహాసభలు విజయవంతం కావాలని, మరింత పట్టు దలతో, కార్యదీక్షతో, కర్తవ్యాలను నిర్దేశించుకొనే వైపుగా, రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) వుంటుందని ఆశిస్తూ, మరొక్క సారి స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గం తరపున విప్లవాభినందనలు తెలియజేస్తున్నాను.

**కా॥గణేష్ పండా**

**ఏపిఎఫ్టియు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి**



రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) మహాసభకి, ఆంధ్రరాష్ట్రంలోని ప్రతి జిల్లా నుండీ వచ్చిన కార్యకర్తలందరికీ, రైతు కూలీసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ, అలాగే సౌహార్ద్ర ప్రతినిధులందరికీ ఏపిఎఫ్టియు రాష్ట్ర కమిటీ తరఫున విప్లవాభినందనలు తెలియజేస్తున్నాను. ఈ రోజు ప్రధానంగా వ్యవసాయరంగ సంక్షోభం వుంది. దాని భారం కార్మికుల మీదా పడు తున్నది. నిన్నా, మొన్నా రైతులుగా వున్న వాళ్ళు ఈ రోజు కార్మికులుగా వున్నారు. అసంఘటిత కార్మికులకు, కార్మికులుగా ఏ హక్కులూ వుండవు. దానికి కారణం ఎవరు? మనకి ఈ 63 సంవత్సరాల స్వతంత్రం తర్వాత చాలా హక్కులు వచ్చాయని అన్నారు. కానీ ఈ హక్కులన్నీ పేపర్పై వుంటాయి తప్ప అవి ఎవరికీ పనికిరావు. అందుచేత రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులన్నీ అమలు కోసం పోరాటం చేయాలి. ఈ విషయం ఇక్కడున్న రైతుకూలీసంఘానికి స్పష్టంగా తెలుసు. ఈ హక్కులన్నీ దేశాన్ని పరిపాలిస్తున్న భూస్వామ్య వర్గానికీ, దోపిడీ వర్గానికీ తప్ప పేదలకీ, దోపిడీకి గురయ్యే వర్గం కోసం లేవన్న స్పష్టమైన అవగాహనతో పనిచేస్తోంది. ఏపిఎఫ్టియు కూడా భారత దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతంతోనే మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయి తప్ప కొంతమంది హక్కుల కోసమో, బియ్యం కోసమో, కార్డుల కోసమో, ఇందిరమ్మ ఇళ్ళ కోసమో మాత్రమే మనం పోరాటం చేస్తే, భారతదేశంలో కార్మికవర్గం, రైతాంగం యొక్క సమస్య పరిష్కారం కాదు అనే అవగాహనతో రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్), ఎపిఎఫ్ టియులు పనిచేస్తున్నాయి. ఈ మహాసభల్లో ఈ దిశగా మరిన్ని కర్తవ్యాలు తీసుకొంటారని మీ పోరాటాలకు ఏపిఎఫ్టియు సహాయ సహకారాలందిస్తుందని చెప్తూ ముగిస్తున్నాను.

**ఇండ్ల విజయసారధి**

**ఏపిటిఎఫ్ నాయకులు, ప్రకాశం జిల్లా**



రైతుకూలీసంఘం సభలకు హాజరైన ప్రతినిధులకు, సౌహార్ద్ర ప్రతినిధులు, గౌరవనీయులైన అతిధులందరికీ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అభినందనలు తెలియ చేస్తోంది. ఈ రాష్ట్ర మహాసభలు రైతుకూలీసంఘం తయారుచేసుకొన్న విధాన ప్రకటనకు అనుగుణమైన పరిస్థితుల్లో నేడు జరుగుతున్న ఉద్యమాల్ని ఇంకా ముందుకు తీసుకెళ్ళడానికి చర్చలు జరిగి ఫలప్రదం కావాలని, ఉద్యమ పోరాట బాటలో అగ్రభాగాన నిలబడాలని ఏపిటిఎఫ్ కోరు కుంటున్నది. పరాయీకరణ ఫలితంగా రైతు రోజురోజుకీ దిగజారిపోతున్న పరిస్థితి వుంది. మధ్యతరగతి కూడా ప్రతిరోజూ అనేక సమస్యలతో సతమతమవుతోంది. రేపటి పరిస్థితి గురించి ప్రతి ఒక్క వర్గమూ కూడా ఆందోళన చెందుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల్ని అందరూ గమనిస్తున్నారు. దానికి అను గుణంగా ఉద్యమ రూపాన్ని తీసుకొన్నప్పుడు మాత్రమే రైతుకూలీ సంఘం కోరుకున్నటు వంటి ఒక ప్రజాతంత్ర వ్యవస్థని సాధించ గలుగుతాం. అలా సాధించే క్రమంలో ఏపిటిఎఫ్ తన సంఘీభావాన్ని తెలియ జేస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఇవాళ పేద పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న పరిస్థితి వుంది. అలాంటి ప్రభుత్వ పాఠశాలల్ని పరిరక్షించుకోవాలంటే ఏపిటిఎఫ్ గ్రామీణ ప్రాంతాల్లో వుండే రైతు కూలీ సంఘం అందరం కూడా ఆ పాఠశాలలు సక్రమంగా జరగడానికి మన వంతు పాత్రను మనం నిర్వహించాలి. ఏపిటిఎఫ్ మాతృభాషలో విద్యాబోధనను కోరుకొంటోంది. రైతు కూలీసంఘం కూడా మాతృభాషలో విద్యా బోధన ఉండాలన్నటువంటి అవగాహనతోనే వుంది. అటువంటి ఉద్యమాన్ని మనం ముందుకు తీసుకువెళ్ళాలంటే సంఘీభావంతో మనం కలిసి పనిచేయాలంటే ఖచ్చితంగా, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్ని పరిరక్షించుకోవడానికి కృషి చేయవలసిన అవసరం వుంది. రోజురోజుకీ పేదల బడుల్ని మూసివేస్తూ, ఉన్నవాళ్ళ బడుల్ని ప్రోత్స హిస్తూ, ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తూ, విద్యాహక్కుల చట్టం లాంటి బిల్లులు తెస్తున్న పరిస్థితుల్లో వున్నాం. ఉపాధ్యాయులంటే

## సౌహార్ద్ర ప్రతినిధుల సందేశాలు

సహజంగా వారి ఆర్థిక డిమాండ్ల కోసం, జీత భత్యాల కోసం పోరాడతారు అని కాకుండా ఏపిటిఎఫ్‌కి ఒక స్పష్టమైన లక్ష్యం వుంది. ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో అందరికీ విద్య అందించాలంటే కామన్ స్కూల్ సిస్టమ్‌లోనే అది సాధ్యమవుతుంది. దాన్ని ప్రజాతంత్ర వ్యవస్థలో మాత్రమే మనం సాధించకోగలం. ఆ ప్రజాతంత్ర వ్యవస్థ కోసం కూడా ఏపిటిఎఫ్ పోరాటం చేస్తూ వుంది. రైతుకూలీసంఘం చేసే అనేక ఉద్యమాలకు కూడా ఏపిటిఎఫ్ సంఘీభావం తెలియ జేస్తుంది. ఈ మహాసభలు విజయవంతం కావాలని ఆశిస్తూ, నేటి పరిస్థితులకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకొని ఉద్యమాలు నిర్మించవలసిందిగా కోరు కుంటూ మరోసారి ఏపిటిఎఫ్ తరఫున అభినందనలు తెలియచేస్తూ ముగిస్తున్నాను.

**యస్.కె. బాషా**

**నవయువ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



మహాసభలకు హాజరైన కర్షక వర్గానికి అందరికీ నవయువ సమాఖ్య తరఫున విప్లవాభివందనాలు తెలియజేస్తున్నాను. ఈ మహాసభలు సంపూర్ణంగా విజయవంతం కావాలని మా నవయువ సమాఖ్య ఆకాంక్షిస్తున్నది. కామ్రేడ్స్! 'బ్రిటీషు వాడు భారతదేశం నుండి వెళ్ళిపోయాడు, మన దేశాన్ని మనమే పరిపాలించు కొంటున్నాం. మన దేశం అభివృద్ధి చెందుతోంది. భవిష్యత్తులో మనం ప్రపంచంలో మొదటి స్థానాన్ని చేరుకోబోతున్నాం' అని ఈ రోజు పాలక వర్గాలు, మీడియా నమ్మబలుకు తున్నాయి. కానీ వాస్తవ పరిస్థితి ఏమిటో నిన్నటి నుండీ మన మహాసభల్లో భారత దేశంలో వున్న సమస్యల లోతుపాతుల్ని వివరిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా ఈ రోజు గ్రామీణ ప్రాంతాల్లో ఏ రకమైన సంక్షోభం వుందీ అన్న విషయాన్ని కూడా మనం విన్నాం. ప్రధానంగా ఈ రోజు గ్రామాల్లో పని దొరక్క, సుదూర ప్రాంతాలకు వలస వెళ్ళి దుర్భరమైన జీవితాల్ని గడుపుతున్నారు. అందులో భాగంగా ఈ రోజు యువత, గ్రామాల్లో ఉన్న యువత ఎన్ని రకాలుగా కష్టాల పాలవుతున్నారో మనం చూస్తున్నాం. ప్రతి ఒక్కరం, ప్రతి తల్లి దండ్రీ తమ కంటే తమ బిడ్డలు ఉన్నతంగా బతకాలని కోరుకొంటారు. మరి, ఉన్నతంగా బతకడానికి కావలసిన వాతావరణం, పరిస్థితి ఇక్కడ వుండాలి, ఆ పరిస్థితి ఈ రోజు లేదు. అందువల్లనే ఈ రోజు పనులు వెతుక్కొంటూ సుదూర ప్రాంతాలకు వలసలు పోతూ, ఉన్న రోజు పనిచేస్తూ, లేనిరోజు సంపా యించిన దాంతో ఒకరోజు తినీ, ఒకరోజు తినకా, పస్తులుంటూ, అనేక రకాల జబ్బుల తోటి మరల వెనక్కి వచ్చి అవస్థలు పడుతున్న పరిస్థితి ఇవాళ గ్రామీణ ప్రాంతాల్లో వుంది. మేం కూడా చూస్తున్నాం. యువతరం అంతా ఇవాళ గ్రామాల్లో లేదు. యువత పట్టణాల్లో ఏదో ఒక పనికోసం వెళ్తోంది. అందుకని యువతని సమీకరించడం అన్నది ఒక పెద్ద సవాల్‌గానే మనకి వుంది. దానికి ఏం చేయాలో ఒక స్పష్టమైన అవగాహనతో మనం పని చేయాల్సిన అవసరం వుంది. అటువంటి అవగాహన మన సంఘా లన్నింటికీ వుంది. ఈ రోజు యువతరం అనేక రకాల ప్రభావాలకి లోనవుతూ పక్కదారి పడుతున్న పరిస్థితి కూడా వుంది. వాళ్ళకై వాళ్ళు పక్కదారి పట్టడం లేదు. ఈ రోజు దోపిడీ పాలకవర్గాలు యువతరాన్ని పక్కదారి పట్టించాలన్న లక్ష్యంతో అనేక రకాలుగా దాడి చేస్తున్నారు. అది సినిమాలు కావచ్చు, సాహిత్యం కావచ్చు, ఇంకే రూపమైనా కావొచ్చు. మనకి దేశంతో సంబంధం లేదు. పక్కవారితో సంబంధం లేదు. నేనుగా బతకాలి. నాకు నేనుగా సంపాదించాలి. ఉన్నతంగా బతకాలి అనే స్వార్థపూరితమైన సంస్కృతిని ఇవాళ యువతరం మెదళ్ళలో చొప్పిస్తున్నారు. అనేక రకాల మత్తు పదార్థాలు, మద్యంతో యువతను ముంచెత్తడానికి పాలకవర్గాలు సాధ్యమైనంత వరకూ ప్రయత్నం చేస్తూనే వున్నాయి. ఈ పరిస్థితుల్లో, రైతుకూలీ సంఘంగా నూతన ప్రజాస్వామిక వ్యవస్థ లక్ష్యాన్ని నెరవేర్చు కోవాలంటే అందులో యువతరాన్ని కూడా కలుపుకు వెళ్ళాల్సిన అవసరం వుంది. మేం నవయువ సమాఖ్యగా యువతరం యొక్క దృష్టిని సరైన దిశగా మళ్ళిస్తూ, గ్రామీణ రైతుకూలీల ఉద్యమంతో భుజం భుజం కలిపేందుకు యువతని సమీకరిస్తూ వారిని ఉద్యమ బాటలోకి నడిపిస్తున్నాం. రైతుకూలీ సంఘం నిర్వ హిస్తున్న పోరాటాలన్నింటిలో నవయువ సమాఖ్య కలిసి ఆ విధంగా పోరాడు తుందని తెలియచేస్తూ, ఈ అవకాశం ఇచ్చి నందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ముగిస్తున్నాను.

---

**పుట్టుకలనుబట్టి కుల నిర్ణయం జేసి**
**కర్మ కతల రాసి దైవ సాక్ష్యము కూసి**
**ఉచ్చనీచాలతో పుచ్చెనీ సంఘము**
**సత్యమెరిగి మెలుగు శ్రమజీవులారా!**

**సంపదలు గుత్తగా సంగ్రహింబవుదాక**
**కులపు నిచ్చెనమెట్లు పచ్చగా నిలుచును**
**చదువు కావింపకా సమత సౌఖ్యము లేదు**
**సత్యమెరిగి మెలుగు శ్రమజీవులారా!**

**దివికుమార్**

**నీవు**
**దారిద్ర్యరేఖకు ఆకుపచ్చరంగు పులిమి**
**హరిత విప్లవం అని అరుస్తున్నపుడు**
**ఎండుటాకులు ఏమని వ్యాఖ్యానించాయో**
**నీకు తెలుసా?**
**దురదృష్టవశాత్తూ**
**రైతుకు ఎండుటాకుల భాష తెలుసు!**

అమ్మంగి వేణుగోపాల్
'ఎండుటాకు' నుండి.

# రాష్ట్ర మహాసభ తీర్మానాలు

## 1. రైతుకూలీలకు భూపంపకం చేయాలని

సాగుకుయోగ్యమైన భూముల కోసం, భుక్తి కోసం వ్యవసాయ కూలీలు నిరంతరం ఆందోళనలు, పోరాటాలు చేస్తున్నారు. ప్రజల ఆకాంక్షల కనుగుణంగా, పోరాటాల ఫలితంగా ఎన్నో సంస్కరణలు, చట్టాలు చేస్తున్నా నేటికీ ప్రజల వద్దకు చారెడు నేల చేరటం లేదు.

నేటి ప్రభుత్వం ప్రజల పోరాటాల ఫలితంగా చేసిన సంస్కరణల, చట్టాల అమలు తీరు-చేపట్టాల్సిన చర్యల గురించి వేసిన కోనేరు రంగారావు కమిటీ ప్రతిపాదనలు సైతం నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే భూమిలేని పేదలందరికి ప్రభుత్వ, బంజరు, పోరంబోకు, దేవాదాయ, ధర్మాదాయ, మిగులు భూములన్నింటిని పంపకం చేయాలనీ, కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలని మహాసభ డిమాండ్ చేస్తోంది.

## 2. గిరిజన సమస్యల పరిష్కారం కోసం

ఎ) ఏజన్సీ ప్రాంతాల గిరిజనులు-పోడు కొట్టి, మోడు తీసి, సాగుచేసి, సారవంతం చేసిన భూములను మైదాన ప్రాంతాల గిరిజనేతర భూస్వామ్య, పెత్తందారీ శక్తులు మోసాలు, దౌర్జన్యాలతో దురాక్రమణ చేశారు. భూమిపై, అడవిపై, నీటిపై హక్కు కోసం ఎన్నో పోరాటాల ఫలితంగా 1/70 లాంటి చట్టాలు వచ్చినా అవి ఆచరణకు నోచుకోక పోగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగా వారి భూములు మరింత పరాయీకరణకు గురౌతున్నాయి. గిరిజన ప్రాంతాల భూమి సమస్య పరిష్కారం కోసం 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. విజయనగరం జిల్లాను ఆనుకొని ఉన్న ఒరిస్సా ఏజన్సీ ప్రాంతంలో 2/56 చట్టాన్ని అమలు చేయాలి.

బి) ఏజన్సీ ప్రాంతాల్లో గిరిజనులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులైన చింతపండు, కొండచీపుర్లు, వన మూలికలు తదితర ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు చెల్లించాలి.

సి) ఏజన్సీ ప్రాంతమంతటా మలేరియా, విషజ్వరాలు, డయేరియా, పోషకాహార లోపాల ఫలితంగా ఏటా వేలాది మరణాలు సంభవిస్తున్నాయి. వాటి నివారణకై ఏజన్సీ అంతటా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శాశ్వత ప్రాతిపదికన డాక్టర్లను, వైద్య సిబ్బందిని నియమించాలి. తగిన మందులు వైద్య సౌకర్యాలను యుద్ధ ప్రాతిపదికన కల్పించాలి.

డి) ఏజన్సీలోని సహజ సంపదలైన ఖనిజాలను, వనమూలికలను కారుచౌకగా బహుళజాతి సంస్థలకు, దోపిడీదారులకు దళారీ పాలకులు దోచిపెడుతూ అనుసరిస్తున్న విధానాల ఫలితంగా గిరిజనులు అడవి నుండి గెంటివేయబడుతున్నారు. విశాఖ, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల్లోని బాక్సైట్ గనులను జిందాల్, అన్‌రాక్ కంపెనీలకు కట్టపెట్టడం ఒక పెద్ద ఉదాహరణ. అలాగే పోలవరం, తోటపల్లి లాంటి ప్రాజెక్టుల పేరుతో గిరిజనులను నిర్వాసితులను చేస్తున్నారు.

నిర్వాసితులౌతున్న గిరిజనులకు సమగ్ర, శాస్త్రీయ పునరావాసాలు ఏర్పరచకుండా ఎలాంటి ప్రాజెక్టులు నిర్మించరాదు. నిర్వాసితులౌతున్న గిరిజనులను మొట్టమొదటి లబ్ధిదారులుగా నిర్వాసిత విధానాలు అమలు చేయాలి.

## 3. పంటలకు గిట్టుబాటు ధరలకై

రైతులు పండిస్తున్న వరి, చెరకు, పప్పుధాన్యాలు, పొగాకు, కూరగాయలు, పచ్చజొన్న, మిరప, సుబాబుల్ తదితర పంటల సాగుకు నానాటికి ఖర్చులు పెరుగుతున్నాయి. అదే సమయంలో ప్రభుత్వం -రైతులను మార్కెట్ దోపిడీ శక్తులకు వదిలివేస్తోంది. ఫలితంగా రైతాంగం నానాటికీ దివాళా తీస్తున్నది. రైతులు పండించే పంటలన్నింటికి ప్రభుత్వమే గిట్టుబాటు ధరల నందించి కొనుగోలు చేయాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది.

## 4. కౌలు రైతుల హక్కుల గుర్తింపుకై

రాష్ట్రంలో గణనీయమైన వ్యవసాయం కౌలు రైతులే చేస్తున్నారు. బ్యాంకులు రుణాలిచ్చే విషయంలోను, పంట నష్టం విషయంలోను, కరువులు వరదల సమయంలో జరుగుతున్న నష్టాలకు ప్రభుత్వం కల్పిస్తున్న కనీసపాటి సౌకర్యాలు, నష్టపరిహారం కౌలు రైతులకు చేరటం లేదు. ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పడిన కౌలు రైతుల రుణ చట్టం అమలు కావడం లేదు.

కౌలు రైతుల సాగును నమోదు చేసి, హక్కులను గుర్తించి, రక్షణ కల్పించాలని మహాసభ డిమాండ్ చేస్తోంది.

## 5. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై

రాష్ట్రంలో సం॥ల తరబడి కరువు విలయతాండవం చేస్తున్నది. మరోపక్క తరచుగా వరదలు రాష్ట్రాన్ని ఏదో ఒక ప్రక్క ముంచెత్తుతున్నాయి.

రాష్ట్రంలో మెట్ట ప్రాంతాలకు ప్రత్యేకించి రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణా జిల్లాల్లో వెనుకబడ్డ ప్రాంతాలకు ప్రాధాన్యతనిచ్చి, నీటిపారుదల సౌకర్యాలు ఏర్పరచాలి. తాగునీటి సౌకర్యాలు కల్పించాలి.

నదుల కరకట్టలను పటిష్టపరచి, కాల్వకట్టలను తగినంత సౌకర్యవంతం చేసి పంటలకు నీరందించాలి.

అదే సందర్భంలో వేలాది గిరిజన, గిరిజనేతర పేదలను నిర్వాసితులను చేస్తూ సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టును ఆపివేయాలి.

జలయజ్ఞం పేరిట చేపట్టిన ప్రాజెక్టులను కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చే ప్రాతిపదికన కాకుండా-రైతాంగానికి సాగునీరు అందించే

నిర్దిష్ట ప్రాతిపదికపై సత్వరమే పూర్తిచేయాలని మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

**6. అణు విద్యుత్ ప్రాజెక్టును ఆపివేయాలని**

ప్రపంచ ప్రజలకు ప్రమాద భరితంగా మారిన అణువ్యర్థాలపై వ్యతిరేకత పెరుగు తూనే వున్నది. కానీ దళారీ కాంగ్రెస్ ప్రభుత్వం అమెరికన్ సామ్రాజ్యవాదుల అవసరాలకనుగుణంగా శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ వద్ద అణువిద్యుత్ ప్రాజెక్టును నిర్మిస్తున్నది. ప్రజలంతా వ్యతిరేకిస్తున్నా ప్రమాద భరితమైన అణువిద్యుత్ ప్రాజెక్టు నిర్మించే ప్రతిపాదనను రద్దు చేయాలని మహాసభ డిమాండ్ చేస్తోంది.

**7. వ్యవసాయ భూముల సేకరణ ఆపివేయాలని**

రాష్ట్రంలో ఇప్పటికే 100 సెజ్‌లకు లక్షలాది ఎకరాల భూములు పాలకులు సేకరించారు. కోస్టల్ కారిడార్, పోర్టుల పేరుతో 50 వేల ఎకరాలు గుంజారు. సారవంతమైన వేలాది ఎకరాల భూములను సామ్రాజ్యవాద కంపెనీలకు, దళారీలకు కట్టబెడుతున్నారు. వ్యవసాయ భూముల్ని బీడుపెడుతున్నారు.

సాగుకు యోగ్యమైన భూముల నుండి పరాయీకరణ చేస్తున్న ఫలితంగా రైతాంగం దిక్కుతోచని స్థితిలో, చెయ్యడానికి పనిలేక అవస్థలు పడుతున్నారు. ప్రజల్నించి బల వంతంగా భూములు సేకరించడాన్ని నిలిపి వేయాలని, ఇప్పటికే సేకరించిన భూముల్ని రైతులకు ఇచ్చివేయాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది.

**8. నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయాలని**

ఇటీవలి కాలంలో బియ్యం, పప్పులు, చెక్కరలాంటి ఆహారపదార్థాల ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి మూలం ప్రభుత్వ విధానాలే! బడా వ్యాపారులకు గోడౌన్‌లో అపరిమిత సరుకులు నిల్వ చేసుకొనే అవకాశాన్నివ్వరాదనీ, ఆహార పదార్థాల రంగంలో భవిష్య వాణిజ్యాన్ని నిరోధించి, గోడౌన్ నిల్వలపై పరిమితులు విధించి అదుపులోకి తీసుకోవాలనీ, ఆహార పంటలను ఇథనాల్ తయారీకి వినియోగించ రాదనీ, నల్లబజారులని నిల్వలన్నింటినీ వెలికి తీయాలనీ, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలనీ,ఆయా పంటలకు రైతులకు చెల్లిస్తున్న ధరలకనుగుణంగా నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని మహాసభ డిమాండ్ చేస్తోంది.

**9. దళితులపై అణచివేతలకు వ్యతిరేకంగా**

భూస్వామ్య, పెత్తందారీ వర్గాలు దళితులపై నిత్యం దాడులు, వివక్షతలను కొనసాగిస్తున్నారు. అన్నిచోట్ల కులవివక్ష, అసమానతలు కొనసాగుతున్నాయి. అణచి వేతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రభుత్వం, పోలీసులు కొనసాగిస్తున్నారు. దళితులపై సాగిస్తున్న దౌర్జన్యాలను, దాడులను, వివక్షతలను మహాసభ తీవ్రంగా ఖండిస్తున్నది.

**10. మహిళలపై అత్యాచారాలను ఖండిస్తూ**

కష్టజీవి, శ్రామిక మహిళలపై శ్రమ దోపిడీతోపాటు లైంగిక దోపిడీ కొనసాగు తోంది. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య దోపిడీకి, పెత్తందార్ల లైంగిక దోపిడీ దౌర్జన్యాలకు మహిళలు గురవుతున్నారు.

గిరిజన మహిళలు మరింత వంచనకు గురి కాబడుతూ నిత్యం తీవ్రమైన వేధింపులకు గురవుతున్నారు.

పట్టణ పేద, మధ్యతరగతి మహిళలు అనేక వంచనలకు గురవుతూ పని ప్రదేశాలలో వివక్ష, అణచివేతలకు గురవు తున్నారు.

మహిళలపై అత్యాచారాలని, దోపిడీని, వివక్షను మహాసభ తీవ్రంగా ఖండిస్తున్నది.

**11. అక్రమ కేసులను రద్దు చేయాలని**

గిరిజన, రైతుకూలీ ప్రజల సహజ హక్కుల కోసం–ఆత్మగౌరవం కోసం, ప్రజల్ని సంఘటిత పరుస్తూ, పరాయీకరణకు గురైన తమ భూముల్ని పునరాక్రమించుకొని సాగుచేసుకొంటున్న దశలో, సాగు నిలబెట్టు కొనే క్రమంలో పోలీసుల దాడులకు భూస్వాముల దౌర్జన్యాలకు వివిధ ప్రాంతాల రైతుకూలీలు, సంఘం కార్యకర్తలు, నాయకులు గురవుతున్నారు.

2009 జూన్ 30న పనసభద్రపై మావోయిస్టులు చేసిన కరువుదాడితో రైతుకూలీ సంఘానికి సంబంధం లేదు. అయినా విజయనగరం పోలీసులు కామ్రేడ్ వర్మ తదితరులపై కేసులు బనాయించారు.

కోరాపుట్ ఆదివాసులు సంఘటిత మవటాన్ని సహించలేని పాలకవర్గ పార్టీలు, భూస్వాములు, సారా వ్యాపారులైన సొండీలు కుమ్మక్కై ఆదివాసులపై కేసులు పెట్టి నెలల తరబడి నిర్బంధిస్తున్నారు. చాషీమూలియా ఆదివాసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఇంటిపై పోలీసులు దాడిచేశారు.

కామ్రేడ్ కిర్మపై లైంగిక దాడికి పాల్పడిన వారిని పోలీసులకు పట్టిఇచ్చిన మన కార్యకర్తలు కామ్రేడ్ శ్రీనునాయుడు తదితరులపై హత్యాయత్నం కేసులు పెట్టారు.

పోలవరం ప్రాంతంలో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా, నిర్వాసిత సమస్యలపై పోరాడు తున్న కామ్రేడ్ సున్నం రాజు, కుంజం రామారావు తదితరులపై రాజద్రోహం లాంటి కేసులు బనాయించారు. రైతుకూలీసంఘం కార్యకర్తలపై, రైతాంగంపై పెట్టిన కేసులన్నింటిని రద్దు చేయాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.

**12. అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని**

పట్టణాలలో చిన్న తరహా పరిశ్రమలన్నీ మూతబడి కార్మికులు రోడ్లపైకి నెట్టబడు తున్నారు. ఎలాంటి హక్కులు, చట్టాలు లేక దినసరి, నెలసరి గంటల కూలీలుగా అరకొర జీతాలతో కాలం గడుపుతున్నారు.

వ్యవసాయ సంక్షోభం ఫలితంగా రైతుల భూమి నుంచి గెంటివేయబడిన గ్రామీణ వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలసవెళ్ళి రిక్షాలు తొక్కేవారిగా, హోటల్ కార్మికులుగా ఇటుక బట్టీ కార్మికులుగా, భవన నిర్మాణ కార్మికులుగా, మహిళలు, పిల్లలు ధనికుల ఇళ్ళలో చాకిరీచేసే పనివారిగా ఉంటున్నారు. అసంఘటితరంగ కార్మికులకు ఎలాంటి గుర్తింపు, రక్షణ లేక, కనీస వేతనాలు లేక, పని గ్యారంటీ లేక, ఉండటానికి నివాసం లేక రోడ్లపైనే జీవితాలను వెళ్ళబుచ్చుతున్నారు. ఇలాంటి

కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఉపాధి హామీకై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని మహాసభ డిమాండ్ చేస్తున్నది. ఈ డిమాండ్లపై కార్మికులు సాగించే పోరాటాలకు మహాసభ సంఘీభావం తెలుపుతున్నది.

### 13. తీరప్రాంతంలో మత్స్యకారుల వేటపై ఆంక్షలను ఖండిస్తూ

తీర ప్రాంతాలలో మత్స్యకారులు చేపల వేట చేయడంపై కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించింది. వారి వృత్తి కొన సాగించుకుంటే, వేల, లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వాలకు చెల్లించు కోవాలనే ఆంక్షలు విధించారు. తీరప్రాంత మత్స్యకారుల జీవనాన్ని కల్లోలభరితం చేసే చర్యల్ని ఖండిస్తూ–ఇలాంటి ఆంక్షల్ని ఎత్తి వేయాలని మహాసభ తీర్మానం చేస్తున్నది.

### 14. మినీ సిగరెట్లకు అనుమతి నిరాకరించాలని

బహుళజాతి సంస్థలకు లాభాలు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం మినీ సిగరెట్లకు అనుమతినిస్తున్నది. ఈ విధంగా లక్షలాది బీడీ కార్మికుల జీవితాలను ఛిద్రం చేయబూనుకుంది.

తక్షణమే మినీ సిగరెట్లపై నిషేధం విధించాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.

### 15. గ్రీన్‌హంట్ పేరుతో చేస్తున్న దాడులను ఆపివేయాలని

ఒరిస్సా ఖనిజ సంపదను సామ్రాజ్య వాదులకు, విదేశీ కంపెనీలకు దోచిపెట్ట డానికి సంపద పరాయీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న గిరిజనులను అణచివేయ టానికి ఇప్పటికే పాలకులు అనేక మందిని కాల్చి చంపారు. చిత్రహింసలకు గురిచేశారు.

ప్రస్తుతం గ్రీన్‌హంట్ పేరుతో గిరిజనులను అడవి నుండి తరిమివేస్తున్నారు. కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపుల్లో గిరిజనులను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. గ్రీన్‌హంట్ పేరుతో ఒరిస్సాలోనూ, ఒరిస్సాకు ఆనుకొన్న ఆంధ్ర ఏజన్సీలో కేంద్ర ప్రభుత్వం గిరిజనులను వేటాడటాన్ని నిలిపివేయాలని ఈ మహాసభ డిమాండ్ చేస్తున్నది.

### 16. 'భారత బయోటెక్నాలజీ అథారిటీ బిల్లు–2009'ని బేషరతుగా ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ

1960లలో 'హైరు పచ్చ విప్లవం' పేరిట వ్యవసాయ రంగంలో సామ్రాజ్యవాదుల–సంకరజాతి విత్తనాలు, రసాయన ఎరువులు, వ్యవసాయ యంత్రాల వినియోగాన్ని భారత పాలకులు అనుమతించారు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వేగ వంతం చేస్తున్న ప్రస్తుత యుపిఏ పాలకులు 'మరో హైరు పచ్చ విప్లవం' పేరిట బీటీ విత్తనాల ప్రవేశానికి అనుమతి నిచ్చారు.

వివిధ సామ్రాజ్యవాద దేశాలలోనూ, అభివృద్ధి చెందిన దేశాలలోనూ నిషేధించిన ఈ విషపూరిత బీటీ విత్తనాలను మన దేశంలో విస్తారంగా పత్తి పంటలో ప్రవేశ పెట్టటం ద్వారా బహుళజాతి గుత్తసంస్థలు తమ విత్తన వ్యాపారాన్ని పెద్ద ఎత్తున సాగించాయి, సాగిస్తున్నాయి.

బీటీ పత్తి విత్తనాల వాడకం ఫలితంగా పాలకులు, విత్తన గుత్త సంస్థలు ప్రచారం సాగిస్తున్నట్లుగా ఇబ్బడిముబ్బడిగా దిగు బడులు పెరగకపోయినా మునుపెన్నటికంటే వ్యవసాయ పెట్టుబడుల ఖర్చు విపరీతంగా పెరిగిపోయి రైతు రుణ భారపు ఊబిలో మరింతగా కూరుకుపోతున్నాడు. బీటీ మొక్కలలో ఉత్పత్తి అయ్యే జీవ విషపదార్థ కారణంగా పర్యావరణ, జల కాలుష్యంతో పాటుగా, బీటీ మొక్కలను తిన్న పశువులు మరణిస్తున్న ఉదాహరణలు మన కళ్ళెదుట ఉన్నాయి.

ఈ దుష్పరిణమాలను ఏ మాత్రం లక్ష్య పెట్టని పాలకులు ఆహారభద్రతను దెబ్బతీసే దానిలో భాగంగా ఆహార పంటలలో సైతం బీటీ విత్తనాల ప్రవేశానికి ఆమోదముద్ర వేశారు. దీనికి ముందస్తుగా బూటకపు అభిప్రాయ సేకరణ తంతును దేశంలో వివిధ రాష్ట్రాలలోనూ, అందులో భాగంగా మన రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనూ కేంద్ర అటవీ పర్యావరణ శాఖా మంత్రి జైరామ్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆహార పంటలలో బీటీ విత్తనాల ప్రవేశంతో విత్తన స్వతంత్రను తుడిచిపెట్టాలనే సామ్రాజ్యవాదుల–ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాద కుట్రలను వెల్లడి చేస్తూ, బీటీ విత్తన దుష్ఫలితాలను ఎలుగెత్తి చాటుతూ వివిధ ప్రజాసంఘాలతో ప్రజాతంత్రవాదులు, మేధావులతో కలసి మన రైతుకూలీసంఘం పాలకుల ఈ ప్రజావ్యతిరేక చర్యలను తీవ్రంగా నిరసించింది.

దేశంలోని వివిధ ప్రాంతాలలో ఎక్కడికక్కడ వ్యక్తమైన ఈ తీవ్ర నిరసనతో కేంద్ర ప్రభుత్వం బీటీ వంగ విత్తనాల ప్రవేశానికి ఆమోదం తెల్పకుండా వెనకడుగు వేస్తున్నట్లుగా ప్రకటించింది. కానీ అనతి కాలంలోనే తన సామ్రాజ్యవాద లొంగుబాటు, విధానాలతో ముందుకొచ్చింది. దీని ఫలితమే 'భారత బయోటెక్నాలజీ అథారిటీ బిల్లు 2009' పేరిట రూపొందించి రాబోయే పార్లమెంట్ సమావేశాలలో ఆమోదం పొందడానికి ఉద్దేశించబడిన ఈ దుర్మార్గమైన ముసాయిదా.

ఈ ప్రమాదకర బిల్లు చట్టరూపం ధరిస్తే ఈనాడు వ్యక్తం చేస్తున్న విధంగా మేధావులు కానీ, ప్రజాసంఘాలు కానీ బీటీ విత్తనాలకు వ్యతిరేకంగా కనీసం గొంతెత్తేందుకు అవకాశం నిరాకరించబడుతుంది. మాట్లాడిన దానికి ఆధారాలుచూపాలనే పేరిట బీటీకి వ్యతిరేకంగా మాట్లాడినందునే జైలు శిక్షలు, పెద్ద ఎత్తున జరిమానాలు విధించేందుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తున్నది. బీటీ విత్తనాల ఫలితంగా పొందే నష్టాలకు పరిహారాలను కోరేందుకు కోర్టులను ఆశ్రయించే కనీసపాటి అవకాశాన్ని కూడా రైతులు కోల్పోతారు.

సామ్రాజ్యవాద బహుళజాతి పరిశ్రమ లైన మోన్‌శాంటో వంటి గుత్త వ్యాపార సంస్థల విత్తన వ్యాపారానికి వరదగేట్లు తెరుస్తూ భారత ప్రజల ఆరోగ్యానికి, పర్యా వరణానికి, ఆహారభద్రతకు తీవ్ర ప్రమాద కరమైన, కనీస ప్రజాస్వామిక గొంతును కూడా నులిమివేసే ఈ 'భారత బయో టెక్నాలజీ అథారిటీ బిల్లు–2009' ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని మహాసభ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

అదే విధంగా ఈ బిల్లును వ్యతిరేకించేందుకు ప్రజాస్వామిక వాదుల, మేధావుల అండదండలను అందించ వలసిందిగా ఈ మహాసభ కోరుతున్నది.

# నక్సల్‌బరీ ఉద్యమ నిర్మాత. విప్లవ ప్రజాపంథా పోరాటయోధుడు కామ్రేడ్ కానూసన్యాల్‌కు విప్లవ జోహార్లు!

2010 మార్చి 23న పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ కానూనన్యాల్ మనల్ని విడిచి శాశ్వతంగా దూరమైనారు. ఆయన 81 సంవత్సరాల జీవిత పుస్తకంలోని ప్రతి పేజీ పీడిత ప్రజల విముక్తి కోసం సాగిన కృషితో లిఖించబడిందే. నగ్జల్‌బరీ పోరాట నిర్మాతగానేగాక పోరాటం వెనుకపట్టు పట్టిన తర్వాత కూడా అదే పీడిత ప్రజలను అంటిపెట్టుకొని చివరవరకూ చైతన్యపు ఊపిరులూదిన మహానాయకుడు ఆయన. నిర్బంధాలను తట్టుకుని, ప్రలోభాలను తిప్పికొట్టి, పీడిత ప్రజల పోరాట పంథా యొక్క ఆచరణాత్మక కృషి తప్ప మరేదీ తనకి ప్రాధాన్యత కలది కాదని చాటి చెప్పారు. లక్షలాదిమంది జనసందోహానికి ఆయన నాయకత్వం వహించారు. నక్సల్‌బరి నుండి నేటి వరకు ప్రతి ప్రజా ఆందోళనపై ఆయన ముద్ర వుంది. దేశంలో సాగుతున్న ప్రజాఉద్యమాలకు, భూమికోసం సాగుతున్న పోరాటాలకు, పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా పెల్లుబుకిన కళింగనగర్, సింగూరు, నందిగ్రామ్ మొదలగు పోరాటాలన్నింటికీ కామ్రేడ్ కానూసన్యాల్ సంఘీభావంగా నిలిచారు. పాత శ్రీకాకుళం జిల్లాలోని పార్వతీపురం ప్రాంతంలో నిర్మించబడిన ఆదివాసీ రైతాంగ ఉద్యమానికి సంఘీభావంగా నిలిచారు-సన్నిహితంగా పరిశీలించారు. ఒరిస్సా-బందుగాం, నారాయణపట్న ప్రాంతంలో సాగుతున్న కార్యకలాపాలను, ఆదివాసీ ప్రజాఉద్యమాన్ని పరిశీలించుతూ, సూచనలిస్తూ వచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)కి ఆయనిచ్చిన అండదండలు, పోరాట స్ఫూర్తి మరువలేనివి. గుంటూరులో జరిగిన రైతుకూలీసంఘం రాష్ట్ర మహాసభలలో ఆయన పాల్గొన్న జ్ఞాపకాలు చెరిగిపోయేవి కాదు. ప్రజాపోరాటాలు విజయవంతం కావాలంటే పీడిత రైతాంగ, కార్మిక ఉద్యమ నాయకత్వంలో పెడధోరణులుండరాదని; మితవాద, అతివాద, అవకాశవాదాలు ప్రజా వుద్యమ నిర్మాణాలకు శత్రువులని స్పష్టంగా ప్రకటించాడు. అల్పమైన ప్రాచుర్యాలు, ప్రచార పటాటోపాలను తిరస్కరిస్తూ నిశ్చయాత్మకంగా చివరి వరకూ పనిచేసిన నిగర్వి, నిండుకుండ కామ్రేడ్ కానూసన్యాల్. అనారోగ్యాలను, పాలకవర్గాలు పెట్టిన అవరోధాలను-వేటినీ అడ్డురానీయకుండా కా॥కానూసన్యాల్ తన బాధ్యతలను నిర్వర్తించుతూ వచ్చారు. ఆయన నిజమైన అర్థంలో కార్మిక, కర్షక పక్షపు మనిషి. అణగారిన బడుగుజీవుల మనిషి. ఆదివాసీల, రైతుకూలీల మనిషి. ఆ మహోన్నత ప్రజా నాయకునికి ఈ మహాసభ ఘనమైన నివాళులర్పిస్తూంది. అరుణారుణ విప్లవాంజలి ఘటిస్తున్నది.

## లాల్‌సలాం

దేవా

తరతరాల పీడనకు చరమగీతి పాడగా
నవవసంత మేఘమై గర్జించిన వీరుడా
సాయుధ విప్లవస్ఫూర్తి నగ్జల్బరి నీవయా
అమరుడ కానూసన్యాల్ అందుకో మా లాల్‌సలాం ॥త॥

రివిజనిస్టు చీడనుండి విప్లవాన్ని కాపాడి
తొలి విప్లవ పతాకాన్ని ఎగరేసిన వాడివి
అతివాదపు ప్రమాదాన్ని ఆచరణలో పసిగట్టి
వ్యక్తిగత హింసెపుడు విప్లవం కాదంటివి ॥త॥

సిక్కోలు యుద్ధానికి చోదకుడవు నీవేలే
ప్రజాయుద్ధ పంథాకు నాయకుడవు నీవేలే
నీమేధ నీబోధ మాకు మార్గదర్శకమెలె
నీ ఆచరణే మాకు సదాశిరోధార్యములే! ॥త॥

విలువలకు నిలువెత్తు నిదర్శనము నీవు
ధృఢ చిత్తానికి నిజమగు చిరునామా నీవు
విప్లవకారుని మరణం వృధాకాదు ఏనాడు
నీ ఆశయ సిద్ధికొరకు ఉదయింతురు వేలకొలది ॥త॥

ముళ్ళదారి ప్రయాణంలో మెలకువలెన్నో తెలిపి
విప్లవ విజయానికి వ్యూహాన్నందించినావు
నువ్వులేని లోటు మాకు పూడ్చలేనిదే కామ్రేడ్
నీ స్ఫూర్తి మాకు బలం నీ లక్ష్యం సాధిస్తాం
అమరుడ కానూసన్యాల్ అందుకొ మా లాల్‌సలాం!




లాల్‌సలామ్

# కోరాపుట్‌జిల్లా చాషీమూలియా ఆదివాసీ సంఘ నాయకుడు

# కామ్రేడ్ కేంద్రుక అర్జున్‌కు జోహార్లు



ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు కోరాపుట్-బందుగాం ప్రాంత ఆదివాసీ ప్రజా ఉద్యమ నాయకుడు, చాషీమూలియా ఆదివాసీ సంఘం కోరాపుట్ జిల్లా కార్యదర్శి, మావోయిస్టుల కాల్పులలో మృతిచెందిన-కామ్రేడ్ కేంద్రుక అర్జున్‌కు రైతుకూలీసంఘం(ఆం.ప్ర) విప్లవ జోహార్లర్పిస్తున్నది.

9-8-2010 మధ్యాహ్నం కామ్రేడ్ అర్జున్ తన భార్యతో కలిసి వైద్యం చేయించుకొనేందుకు కేశుభద్ర నుండి సైకిల్‌పై కత్తులపేట వెళ్తుండగా మార్గమధ్యంలో మావోయిస్టులు వారిని అటకాయించి మాట్లాడాలి ప్రక్కకు రమ్మని అర్జున్‌పై దౌర్జన్యం చేశారు. మావోయిస్టులుగా వారిని గుర్తించిన కామ్రేడ్ అర్జున్ తాను అక్కడ వారితో మాట్లాడేది ఏమి లేదని, ఏ విషయాలున్నా ప్రజల సమక్షంలో మాట్లాడుకుందామని నిర్భయంగా తేల్చి చెప్పాడు. దాంతో మావోయిస్టులు కామ్రేడ్ అర్జున్ కాళ్ళపై కొట్టగా ముందుకు పడి పోయాడు. అనారోగ్యంతో ఉన్న కామ్రేడ్ అర్జున్ భార్య మావోయిస్టులను ప్రాధేయపడినా ఆమెను నెట్టివేసి పడిపోయి వున్న కామ్రేడ్ అర్జున్‌ను మావోయిస్టులు తమ వద్దనున్న తుపాకులతో ఘోరంగా కాల్చి చంపారు. 'కుయి' భాష మాట్లాడే నిరుపేద జాతాపు గిరిజన తెగకు చెందిన కామ్రేడ్ అర్జున్, సరైన ఆహారాన్ని, చికిత్సను అందించలేక ఒక కొడుకును కోల్పోయాడు. భార్య కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. వీటి నడుమ నుండే అర్జున్ పూర్తి కాలపు కార్యకర్తగా పనిచేస్తూ వస్తున్నాడు. నిరుపేద, ఆదివాసీ నేపథ్యం నుండి పైకెదిగిన ఒక ప్రజాఉద్యమ నాయకుడ్ని నిలువునా కాల్చి చంపే ఘాతూకానికి మావోయిస్టులు ఒడిగట్టారు. చాషీ మూలియా ఆదివాసీ సంఘం నాయకత్వాన నిలకడగా నిర్మాణ యుతంగా సాగుతున్న ప్రజాఉద్యమం-తమ టెర్రరిస్టు చర్యల దివాళా కోరుతనాన్ని వెల్లడి చేస్తుందనే కారణంగానే వారు ఈ పిరికి చర్యలకు పాల్పడ్డారని రుజువౌతున్నది.

కామ్రేడ్ అర్జున్ ఆదివాసీ ప్రజలతో గత పదిహేను సంవత్సరాలుగా మమేకమై చాషీమూలియా ఆదివాసీ సంఘ నాయకత్వాన ఉద్యమంలో పనిచేశాడు. కోరాపుట్ జిల్లా బందుగాం ప్రాంతంలో ఆదివాసీలను, ఆదివాసీయేతర పేదలను సంఘటితపరచి సారా వ్యాపారులకు, ఫారెస్టు అధికారుల దౌర్జన్యాలకు, పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా కూడగట్టటంలో ముందు నిలిచాడు.

బంకిని-నీలావడి మొదలైన గ్రామాలతో పాటుగా కోరాపుట్ ప్రాంతంలో సారాబట్టీల యజమానులైన సొండీలకు, షావుకార్లకు వ్యతిరేకంగా సాగిన ప్రజా ఉద్యమంలో కామ్రేడ్ అర్జున్ మిలిటెంట్ పాత్ర నిర్వహించాడు.

2006 నాటికి చాషీమూలియా ఆదివాసీ సంఘాన్ని, ఆదివాసీ ప్రజా ఉద్యమాన్ని కోరాపుట్ ప్రాంతం నుండి నారాయణపట్నకు విస్తరింపజేయటంలో ముఖ్య పాత్ర వహించాడు. 2006 జూన్‌లో నారాయణపట్న- పొడపొదర్ ప్రాంతంలో చాషీమూలియా ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో సాగుతున్న భూముల ఆక్రమణను అడ్డుకునేందుకు అక్కడి నాయకత్వాన్ని పోలీసులు అరెస్ట్ చేసి, 144వ సెక్షన్ విధించిన నిర్బంధ వాతావరణంలోనే సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ ప్రజానీకం తాము పండించిన పంటను స్వాధీనం చేసుకొనేందుకు కా॥అర్జున్ నాయకత్వం వహించాడు.

2008 నవంబర్ 17న సోరుపల్లి సంతలో ఆదివాసులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ, పోలీసుల చెర నుండీ తమతోటి ఆదివాసీలను విడిపించుకొనేందుకు బందుగాం పోలీస్ అవుట్‌పోస్టును 400మంది ఆదివాసులు తమ సాంప్రదాయక ఆయుధాలతో కామ్రేడ్ అర్జున్ నాయకత్వంలో చుట్టుముట్టి పదే పదే పోలీసులు సాగిస్తున్న వేధింపులు, దౌర్జన్యాలపట్ల తమ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అవుట్ పోస్టుపై దాడి నెపంతో పోలీసులు బనాయించినప్పటికీ వెరవక, ఉద్యమ అవసరాల రీత్యా 5 నెలల కాలం ప్రజల మధ్య వుంటూనే కా॥అర్జున్ సంఘ కార్యకలాపాలు నిర్వహించాడు.

2009 జులై నుండి ప్రారంభించి ఎస్.టి.ఎమ్ కంపెనీ ఆక్రమించుకున్న ఆదివాసీల భూములను పునఃస్వాధీనం చేసుకొనే ఉద్యమంలోనూ, ఆదివాసీయేతర పెత్తందార్ల ఆక్రమణలోని భూముల స్వాధీన పోరాటంలోనూ చాషీమూలియా సంఘ నాయకుడిగా కామ్రేడ్ అర్జున్ చురుకైన పాత్ర నిర్వహించాడు.

పెత్తందార్ల, రౌడీగూండాల దాడులను, పోలీసుల అక్రమ అరెస్టులు నిర్బంధాన్ని ఎదుర్కొనే ఈ మొత్తం క్రమంలో కామ్రేడ్ అర్జున పీడిత ఆదివాసీ ప్రజాపునాది నుండి నాయకుడిగా ఎదిగాడు–చాషీమూలియా ఆదివాసీ సంఘం కోరాపుట్ జిల్లా కార్యదర్శిగానూ, సంఘ రాష్ట్ర కమిటీ సభ్యునిగానూ బాధ్యతలు నిర్వహిస్తూ వున్నాడు.

2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లక్ష్మీపూర్ నియోజకవర్గం నుండి పీడిత ప్రజల ఆదివాసీ అభ్యర్థిగా పోటీచేసి, కోరాపుట్, నారాయణపట్న ప్రాంతంలో ప్రజా ఉద్యమ రాజకీయాలను విస్తృతంగా ప్రచారం చేశాడు.

చాషీమూలియా ఆదివాసీ సంఘం నేతృత్వంలో ఆదివాసీ, ప్రజా ఉద్యమం వేళ్ళూనుకొని, విస్తరించటాన్ని సహించలేని భూస్వామ్య, పెత్తందార్లు, సొండీలు, షావుకార్లు, ఆదివాసుల భూములను అప్పనంగా అనుభవిస్తున్న వివిధ కంపెనీల యజమానులు–సంఘంపై కత్తిగట్టి వివిధ రూపాల్లో దాడులు, దౌర్జన్యాలు సాగిస్తూ వచ్చారు. మరోవైపున రాజ్యం, పోలీసు యంత్రాంగం వివిధ రూపాల్లో కేసులు, అరెస్టులు, వేధింపులు సాగిస్తూ వచ్చింది.

చాషీమూలియా ఆదివాసీ సంఘ నాయకత్వంలో కోరాపుట్ ప్రాంతంలో నిర్దిష్టంగా, నిలకడైన ప్రజా ఉద్యమ కృషి సాగుతూండటాన్ని మరోవైపున మావోయిస్టులూ సహించలేకపోయారు. ప్రజా ఉద్యమ రాజకీయాలు విడనాడకుంటే సంఘ నాయకత్వాన్ని, సంఘ కార్యకర్తలను చంపుతామని మావోయిస్టులు వివిధ సందర్భాలలో పోస్టర్లు, ప్రకటనల రూపంలో బెదిరింపు చర్యలకు పాల్పడ్డారు.

మావోయిస్టుల ఈ విధమైన అప్రజాస్వామిక, దౌర్జన్య చర్యలను ఖండిస్తూ, చర్యలను ఎప్పటికప్పుడు ఆంధ్ర మరియు ఒరిస్సా రాష్ట్రాలలోని మేధావులు ప్రజాతంత్రవాదుల దృష్టికి తీసుకెళ్ళి, ప్రజా ఉద్యమాలపై, నాయకులపై భౌతిక దాడులు సాగించే అప్రజాస్వామిక అవాంఛనీయ చర్యలను నివారించవలసినదిగా సంఘ నాయకత్వం విజ్ఞప్తి చేస్తూ వచ్చింది. ఏమైనా ఈ విజ్ఞప్తులను బేఖాతరు చేస్తూ, భూస్వామ్య, పెత్తందార్లను సంతోషపరిచే చర్యకు మావోయిస్టులు పూనుకున్నారు.

మావోయిస్టుల ఈ ఘాతుకాన్ని యావన్మంది ప్రజలు, ప్రజాతంత్రవాదులు, మేధావులు గర్హించాలని, ప్రజాఉద్యమ కార్యకర్తలను, నాయకులను ఏకపక్షంగా ముద్రలు వేసి హత్యలు చేసే మావోయిస్టుల రాజకీయ విధానాలను తీవ్రంగా ఎండగట్టాలని రైతుకూలీసంఘం విజ్ఞప్తి చేస్తున్నది.

## అర్జున్‌కు లాల్‌సలాం

దేవా

కేశుభద్ర కిషోరమా–ఒరిస్సా వీరుడా
చాషీమూలియా ఆదివాసి పోరాటయోధుడా
అమరుడా అర్జునా అందుకొనుము లాల్‌సలామ్–
అందుకొనుము లాల్‌సలామ్ ॥కేశుభద్ర॥

తెల్లవాళ్ల నెదిరించి ఉరికంబం నెక్కినట్టి
లక్ష్మణ్ నాయక్ నీకు స్ఫూర్తి దాతకాదా
నల్లవాళ్ల నెదిరించి–పాలి బాబు ప్రేరణతో
ఆదివాసీ పోరుజెండా–ఎగరేసిన వాడా ॥కేశుభద్ర॥

సారా వ్యాపారుల తెరను ఛేదించగా
ఫారెస్టు అధికారుల పీడన నెదిరించగా
పెత్తందార్ల దోపిడిని సాగనివ్వబోమంటూ
పేదసాదలందరనూ నడిపించిన నాయకుడా ॥కేశుభద్ర॥

చట్టంలో లొసుగులతో భూములు కాజేసినా
సావుకార్ల, సొండీల మెడలు వంచి భూమి గుంజి
ఎస్టీఎం కంపెనీ కబంధ హస్తాలలోని
ఆదివాసి భూములను పేదల స్వాధీన పర్చె ॥కేశుభద్ర॥

ఉద్యమాన నాయకుడా–జీవితాన కూలివాడా
సాయుధపోరులో–అల్లూరి వారసుడా
కానూసన్యాల్ ప్రియమైన కామ్రేడా
పోలీసు ఠాణాపై–నీ మెరుపుదాడి మరువలేము ॥కేశుభద్ర॥

అందరం అన్నలమనే ఏమరపాటో
ఆదరించానని ఆదమరచుటో
ఒక పీడిత జన నాయకుడు అంతంకాగా
బందుగాం కొండలన్ని బావురమన్నాయి ॥కేశుభద్ర॥

మావోయిస్టుల పేరిట–జరిగే నీ హత్యను
ముక్తకంఠంతో నేడు మన్య సీమ నిరసించెను
భూమి భుక్తి విముక్తికై సాగుతున్న పోరులో
ఉద్యమవీరుల వధలను ఎదురించి తీరుతాం ॥కేశుభద్ర॥

# అమరులకు జోహార్లు

నల్గొండ జిల్లా-సూర్యాపేట తాలూకా కర్విరాల కొత్తగూడెంలో జన్మించిన కా॥బి.ఎన్. 85 ఏళ్ళ వయసులో 2008 మే 9న తుదిశ్వాసను విడిచారు. నైజాం క్రూర పాలనకు, రజాకార్ల దుర్మార్గాలకు వ్యతిరేకంగా సాగించిన వీరోచిత తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా భాగస్వామి అయినవాడు కా॥బి.ఎన్. చాకలి ఐలమ్మ భూ పోరాంటంలోనూ, మొండ్రాయి లంబాడీల భూమిని బేదఖల్ చేయటానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో కామ్రేడ్ బి.ఎన్.అగ్రభాగాన నిలిచారు. పీడిత ప్రజా ఉద్యమాలలో కడవరకూ కృషిచేసిన **కామ్రేడ్ భీమిరెడ్డి నర్సింహారెడ్డికి** రైతుకూలీసంఘం(ఆం.ప్ర) విప్లవ జోహార్లు అర్పిస్తున్నది.

మహత్తర తెలంగాణా రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 81 సం॥ల వయసులో 2008 అక్టోబరులో మరణించారు. పిన్న వయసులోనే నిజాం వ్యతిరేక, జాగీర్దారీ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. ఆదివాసీ ప్రజల సమస్యలు, హక్కుల కోసం వివిధ ప్రజాతంత్ర శక్తులతో కూడిన ఆదివాసీ హక్కుల వేదికకు కన్వీనర్‌గా స్పష్టమైన దృక్పథంతో కృషి చేశారు. పీడిత జన పక్షపాతిగా కడవరకూ నిలిచారు. **కా॥ ఓంకార్‌కు** రైతుకూలీసంఘం (ఆం.ప్ర) విప్లవ జోహార్లు అర్పిస్తున్నది.

కామ్రేడ్ పైలా వాసుదేవరావు 1960 ప్రాంతంలో శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో ప్రజా ఉద్యమ నిర్మాణంలోనూ, ఉపాధ్యాయునిగా పనిచేస్తూ శ్రీకాకుళ జిల్లా ఉద్యమ నిర్మాణ కృషిలోనూ భాగంగా యువజన, కళారంగాలలో చురుకైన పాత్ర నిర్వహించారు. శ్రీకాకుళ ఉద్యమం ఒడిదుడుకులకు గురైన కాలంలోనూ నిబ్బరంగా నాయకత్వ పాత్ర చేపట్టి నిర్వహించారు. కడదాకా విప్లవోద్యమంలో కృషి సాగించి 2010 ఏప్రిల్ 11న అమరులైన **కామ్రేడ్ పైలా వాసుదేవరావుకు** రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జోహార్లర్పిస్తున్నది.

1938 ఏప్రిల్ 12వ తేదీన హైదరాబాద్‌లో జన్మించాచిన జ్వాలాముఖి తన 71వ ఏట 2008 డిసెంబర్ 14న తుది శ్వాస విడిచారు. సాహితీవేత్తగా, కవిగానేకాక తన అద్భుత ఉపన్యాసాలతో ప్రజలకు పోరాట చైతన్యం కల్గించినవాడు **జ్వాలాముఖికి** రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జోహార్లర్పిస్తున్నది.

2008 మార్చి 27న గుంటూరులో మరణించిన రాజారామ్మోహనరావు చిన్ననాట నుండే జాతీయ భావాలతో ప్రేరేపితులై మానవతావాదిగా, ప్రజాతంత్రవాదిగా నిరంతర కార్యశీలిగా కడవరకూ కొనసాగారు. 2001లో గుంటూరులో జరిగిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షునిగా వుండి రైతాంగ సమస్యలపై ఆవేదనతో ఉద్వేగపూరితమైన ప్రసంగం చేశారు. మహాసభలు విజయవంతం కావటానికి తోడ్పడ్డారు. పీడిత ప్రజా ఉద్యమాల ఐక్యతను ఆకాంక్షించారు. కడవరకూ ఉన్నత విలువలతో జీవించారు. **డా॥రాజారామ్మోహనరావుకు** రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జోహార్లర్పిస్తున్నది.

ప్రకాశంజిల్లా సంతనూతలపాడు మండలం చంద్రపాలెం గ్రామంలో 1920లో జన్మించిన సుబ్బయ్య మాస్టారు పేర్నమిట్టలో 2009 జులైలో 90వ ఏట తన ప్రాణసమానమైన 'సుబ్బయ్య స్కూల్'లోనే తుదిశ్వాస విడిచారు- ప్రజాతంత్రవాది, రైతాంగ, ప్రజా ఉద్యమాలకు స్నేహితునిగా, సోషలిస్టు చైతన్యంతో సుబ్బయ్య మాస్టారు కడవరకు కొనసాగారు. ప్రజా సంఘాలకు, ప్రజాఉద్యమాలకు ప్రత్యక్ష, పరోక్ష సహకారాలందించారు. **సుబ్బయ్య మాస్టారుకి** రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) జోహార్లర్పిస్తున్నది.

మానవ హక్కుల వేదిక నాయకుడు బాలగోపాల్ హక్కల రంగాన్ని కార్యసాధన రంగంగా ఎంచుకొని పనిచేశాడు. ప్రధానంగా బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలకు రాజ్యహింసకు వ్యతిరేకంగా కృషి చేశారు. 2009 అక్టోబరులో హఠాన్మరణం చెందారు. **కామ్రేడ్ బాలగోపాల్‌కు** రైతుకూలీసంఘం జోహార్లర్పిస్తున్నది.

పేద దళిత కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ రామారావు (ఎర్రయ్య) విద్యార్ధి దశ నుండీ పీడిత వర్గ రాజకీయాల పట్ల ఆకర్షితులై శ్రీకాకుళ గిరిజనోద్యమంలో పాల్గొన్నారు. ప్రసిద్ధికెక్కిన పార్వతీపురం కుట్రకేసులో ముద్దాయిగా వుండి రెండు సం॥ల కాలం జైలు జీవితం గడిపారు. 2009 అక్టోబరు 31న అనారోగ్యంతో మరణించిన **కా॥ఎర్రయ్యకు** రైతుకూలీసంఘం శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

ప్రముఖ న్యాయవాది, పీడిత ప్రజల పక్షపాతి కా॥మల్లె వెంకటసుబ్బయ్య 2008 ఫిబ్రవరి 28న అనారోగ్యంతో ఒంగోలులో మరణించారు-విద్యార్థి దశలోనే ఆయన విప్లవ భావాలకు ఆకర్షితుడై విద్యార్థి ఫెడరేషన్‌లో చేరి పనిచేశారు. 1970 నుండీ ఒంగోలులో న్యాయవాదిగా వుంటూ పార్వతీపురం కుట్రకేసు డిఫెన్స్ నిధికి కా॥తరిమెల నాగిరెడ్డిగారితో కలిసి పనిచేశారు. ఎమర్జెన్సీలో డిటెన్యూగా 18నెలలు జైలు జీవితం గడిపారు. పీడిత ప్రజా ఉద్యమాలకు కడవరకూ అండదండలందించారు. **కామ్రేడ్ మల్లె వెంకటసుబ్బయ్యకు** రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జోహార్లర్పిస్తున్నది.

కామ్రేడ్ పిన్నింటి సురేష్ నిరుపేదరెల్లి కులంలో జన్మించి తన రెక్కల కష్టంపై ఆధారపడి జీవించేవాడు. ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు ప్రాంత చాషీమూలియా ఆదివాసీ సంఘం నాయకత్వంలో గిరిజన, గిరిజనేతర పేదల ఐక్యతతో సాగుతున్న ఉద్యమాల పట్ల కామ్రేడ్ సురేష్ ఆకర్షితుడయ్యాడు. నాచికలింగ నాయకత్వంలో గిరిజనేతర పేదలపై, దళితులపై సాగుతున్న విచక్షణారహిత దాడులను చూసి సహించలేక ఆ దాడులను తిప్పికొట్టేందుకు పేద ప్రజలందరితో సంఘటితపడ్డాడు. ఈ క్రమంలో నాచికలింగ ముఠా సాగించిన దాడులకు 6.9.2009న బలయ్యాడు. **కామ్రేడ్ పిన్నింటి సురేష్‌కు** రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నివాళులర్పిస్తున్నది.

కా॥వెంకటరత్నం గుంటూరుజిల్లా రేపల్లె ఏరియా లంకగ్రామమైన కిష్కింధకాండలో 1925 సం॥లో జన్మించారు. చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా లంక గ్రామాల్లో జరిగిన భూ పోరాటానికి ఆకర్షితులై ఉద్యమంలో కృషి చేశారు. కూలీ రేట్ల పెంపుదలకు జరిగిన పోరాటంలోనూ మోళ్ళ గుంట ఏరియా బంజరు భూముల పోరాటంలోనూ చురుకైన పాత్ర నిర్వహించారు ఈయన సెప్టెంబర్ 6వ తేదీన అమరులైనారు. **కామ్రేడ్ వెంకటరత్నంకు** రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జోహార్లర్పిస్తున్నది.

కృష్ణాజిల్లా నందిగామ ఏరియా కమ్మవారిపాలెంలో 1946లో జన్మించిన కామ్రేడ్ చంద్ర శివయ్య కడవరకూ పీడిత జన పక్షపాతిగా నిలిచారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షునిగా వుంటూ సంఘ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. రెండు సం॥ల కాలం క్యాన్సర్ వ్యాధితో పోరాడి 2008 మే 12న అమరులైనారు. **కామ్రేడ్ చంద్ర శివయ్యకు** రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జోహార్లర్పిస్తున్నది.

కామ్రేడ్ వేమన ఆదినారాయణ 68 సం॥ల వయసులో 2008జూన్ 17న బందరులో మరణించారు. శ్రామిక కుటుంబంలో పుట్టిన ఆదినారాయణ రైతుబజార్‌లో కూరగాయలు అమ్ముకుంటూ పీడిత వర్గ రాజకీయాలవైపు ఆకర్షితులయ్యారు. రైతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షునిగా, రైతుకూలీసంఘం(ఆం.ప్ర), కృష్ణాజిల్లా కార్యవర్గ సభ్యునిగా, కార్మికవర్గ నాయకునిగా బందరు ప్రాంతంలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు. **కామ్రేడ్ వేమన ఆదినారాయణకు** రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జోహార్లర్పిస్తున్నది.

2009 ఆగస్టు 25న గుంటూరుజిల్లా నిజాంపట్నంలో అనారోగ్యంతో మరణించిన కా॥ పీతావెంకటేశ్వర్లు నిరుపేద మత్స్యకారుల కుటుంబంలో జన్మించారు. విద్యార్థి దశలోనే పీడిత వర్గ రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. రేపల్లె ఏరియా గ్రామీణ పేదల సంఘంలోనూ, బోటు కళాసీల యూనియన్ అధ్యక్షునిగానూ పనిచేశారు. మరణించే నాటికి రైతుకూలీసంఘం(ఆం.ప్ర) గుంటూరుజిల్లా కార్యవర్గంలోవున్నారు. పేదల నాయకుడిగా ఆ ప్రాంతంలో గుర్తింపు పొందారు. **కా॥ పీతా వెంకటేశ్వర్లుకు** రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జోహార్లర్పిస్తున్నది.

కామ్రేడ్ నరసింహారెడ్డి వృద్ధాప్యం, అనారోగ్యంతో 2009జనవరి 13న తుదిశ్వాస విడిచారు. తెలంగాణా పోరాట కాలంలో ఆంధ్ర మహాసభలో శిక్షణ పొందిన వలంటీర్‌గా వుండిన కమాండర్ స్థాయికి ఎదిగారు. వెట్టిగొట్టాల రద్దుకు ఇచ్చిన పిలుపును కూరెళ్ళ ప్రాంతంలో అమలు జరిపేందుకు కృషి చేశారు. భువనగిరి డివిజన్‌లో నిజాం ప్రభుత్వం విధించిన పన్నుల నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో పోలీసు నిర్బంధాలకు గురయ్యారు. పీడిత వర్గ రాజకీయ పార్టీలన్నీ ఐక్యం కావాలని ఆకాంక్షించేవారు. **కామ్రేడ్ కొప్పల నర్సింహారెడ్డికి** రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జోహార్లర్పిస్తున్నది.

ప్రజాతంత్రవాది, ఏపిటిఎఫ్ నాయకులు కామ్రేడ్ ఎం.రామయ్య 2009 మార్చి 22న ప్రకాశంజిల్లా ఆలకూరపాడులో మరణించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనా ప్రవృత్తి రీత్యా కా॥రామయ్య మంచి గాయకుడు, నటుడు, 'మా భూమి' 'ముందడుగు' నాటకాలలో పాత్రధారిగా నటించాడు, కష్టజీవి బుర్రకథను చెప్పవారు. సామాజిక వ్యవస్థలో మౌలిక మార్పు కోసం తన జీవిత కాలంలో కృషిచేసిన, ప్రజా ఉద్యమాలకు అండదండగా నిలిచిన **కా॥రామయ్యకు** రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నివాళులర్పిస్తున్నది.

2008 మార్చి 13న మరణించిన ప్రజాకవి,కళాకారులు **తిరునగరి రామాంజనేయులు**, ప్రజా కళాకారులకు ఆదర్శంగా నిలిచిన **తాపీ రాజమ్మలకు** రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నివాళులర్పిస్తున్నది.

## వ్యవసాయ కార్మికా!

– తిరునగరి రామాంజనేయులు

వ్యవసాయ కార్మికా లేరా
నీవెంత
వెతలొందుచున్నావా కనరా॥
స్వాతంత్ర్య మొచ్చింది
చాల ఏళ్ళయ్యింది
పాతికేళ్లా కొడుకు
భూసామి నట్టింట
బందియై నీ గతిని
పట్టించుకోలేదు
నీ బతుకులో ఆశ
నీడలే నేడాదవె

కోడికూతతో లేచి
గొడ్ల కొష్టము నూడ్చి
జోడేసి నీళ్లన్ని
తోడి గాబులు నింపి
కోటేరు ఏసుకొని
గొడ్లలో గొడ్డువై
తెల్లవారక ముందె
వెళ్లుతావే పొలము
దుక్కులొత్తొ మొదలెట్టి

విత్తనాల లెదబెట్టి
పిట్టనూ చొరనీక
పొట్ట నాయగట్టి
కంటిరెప్పగ పంట

కాపాడి భూసామి
ఇంట జేర్చేదాక
కంటికును కెరుగవే

ఎండనక వాననక
బండచాకిరీ యనక
పామనక తేలనక
పగలు రేయని లేక
రెక్కల్ని ముక్కలుగ
రక్తాన్ని చెమటగా
ఆర్పించి నీ బతుకు
నార్పుకొంటున్నావు

తినబోతె నీయింట
తిండి బుక్కెడు లేదు
పొయిలొ పండిన పిల్లి
పోనె పో నంటుంది
ఆకలీ డొక్కల్తొ
అల్లాడు పిల్లోళ్ళు
తల్లినే చుట్టుకొని
తల్లడిల జేస్తుండె

పీలికల చీరతో
ఆలి సిగ్గడుతుంది
గుడిసెలో పొడ ఎండ

కాపురం బెడుతుంది
కర్మగాచారాలు
బ్రహ్మరాతా లన్ని
నీ తలకె చుట్టుకొని
నీరు గార్చేశాయి

భూమి దున్నే నీకు
భూమి రావాలిరా
కూలి బత్తెము పెరిగి
కడుపు నిండాలిరా
అంటరాదను కతలు
మంట గలవాలిరా
ఘోరాలు మారాలి

చుక్కలంటే ధరలు
చోద్యమౌ కల్తీలు
మిక్కుటపు వడ్డీలు
మిట్టిపడు కష్టాలు
ఎన్నాళ్లు యీ నరక
మనుభవిస్తావురా
ఎర్రజండా బట్టి
వేగ లే లెమ్మురా....

---

## జయగీతి

సుంకర సత్యనారాయణ
రచనాకాలం: 1946

పట్టరా వడిశాల-కొట్టరా దెబ్బ
పరిగపిట్టలమంద-పారిపోవాలి ॥పట్ట॥

పంట ధ్వంసముజేయు-పందులవిగోర
బాకునా, బల్లాన-పగల జీరుమురా ॥పట్ట॥

ముందుకురికీ తగిలి-పందులన్నిటిని
మందేసి కొట్టురా-కందికాయల్లె ॥పట్ట॥

కూలీలు రైతులూ-కూడి కేకేస్తె
క్రూరమృగముల గుండె-జారిపోవాలి ॥పట్ట॥

రామబాణముర నీ-రాయి దెబ్బలంటె
రమ్మురా వైరులను-దుమ్ముజేయాలి ॥పట్ట॥

శ్రామికా నీలోన-శక్తి మిగిలుంటె
సమరాన నీ కత్తి-ఝుళిపించుమోయి ॥పట్ట॥

పట పటా యీ దాస్య-బంధాల తెంచి
స్వాతంత్ర్యమును పొంది-జయగీతి పాడు ॥పట్ట॥

# జిల్లాల మహాసభలు




12.2.09న రాయదుర్గంలో అనంతపురం జిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న కా॥ఝాన్సి: వేదికపై ఎడమ నుండి కా॥లక్ష్మీరెడ్డి, సూర్యసాగర్, సింగమనేని, తిమ్మారెడ్డి




అనంతపురం జిల్లా మహాసభల సందర్భంగా రాయదుర్గంలో ప్రదర్శన




29.12.08న నిజామాబాద్‌లో జిల్లా మహాసభలు-వేదికపై కామ్రేడ్స్ ఝాన్సి; వేదికపై కామ్రేడ్స్ గుంగుల నరసయ్య, ఎమ్.అప్పిరెడ్డి, కె.కోటయ్య, ఇతరులు



సదస్సుకు హాజరైన ప్రతినిధులు




13.2.09న గుంటూరుజిల్లా మహాసభ-మాచర్లలో ప్రసంగిస్తున్న కా॥ఝాన్సి; వేదికపై ఎడమ నుండి కా॥కోటేశ్వరరావు, లలిత, నాగేశ్వరరావు, కోటయ్య, శ్రీరాములు



జిల్లా మహాసభల సందర్భంగా ప్రదర్శన

# జిల్లాల మహాసభలు




9.2.09 శ్రీకాకుళంలో జిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న కా॥ఝాన్సి;
వేదికపై ఎడమ నుండి కా॥కోటయ్య, బి.శంకరరావు, అచ్చియ్య, వర్మ, అరుణ, అప్పయ్య, ఛాయరాజ్




జిల్లా మహాసభల సందర్భంగా శ్రీకాకుళంలో ప్రదర్శన



విజయనగరం జిల్లా మహాసభల సందర్భంగా బహిరంగసభకు హాజరైన ప్రజానీకం




2.12.08న పార్వతీపురంలో జిల్లా మహాసభ సందర్భంగా బహిరంగ సభలో ప్రసంగిస్తున్న డా॥బి.డి.శర్మ, అనువదిస్తున్న కా॥విజయకుమార్, వేదికపై ఎడమ నుండి కా॥వర్మ, కోటయ్య ఝాన్సి, పండి, ఇతరులు




31.1.08న కంకిపాడులో కృష్ణాజిల్లా మహాసభలో ప్రసంగిస్తున్న కా॥భార్గవశ్రీ;
వేదికపై ఎడమ నుండి కా॥ఝాన్సి, జార్జి, సాంబశివారెడ్డి, కోటయ్య, అంజమ్మ



మహాసభ సందర్భంగా కంకిపాడులో ప్రదర్శన

# జిల్లాల మహాసభలు



నెల్లూరు జిల్లా మహాసభల సందర్భంగా పతాకావిష్కరణ



26.10.08న జిల్లా మహాసభల సందర్భంగా రాపూరులో ప్రదర్శన
ముందుభాగాన కామ్రేడ్స్ కిశోర్, ఝాన్సి, సునీత

# నిర్బంధాన్ని నిరసిస్తూ



విజయనగరం జిల్లా రైతుకూలీసంఘం: నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ
26.6.09న బందరులో ప్రదర్శన; నాయకత్వం వహించిన భార్గవశ్రీ




విజయనగరంలో నిర్బంధాన్ని నిరసిస్తూ 1.7.09న అనంతపురంలో ఎపిఎఫ్‌టియుతో
కలిసి రైతుకూలీసంఘం ధర్నా; ప్రసంగిస్తున్న కా॥పెద్దన్న



విజయనగరంలో నిర్బంధాన్ని నిరసిస్తూ 30.6.09 శ్రీకాకుళం కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా
నాయకత్వం వహించిన కా॥అరుణ



విజయనగరంలో నాయకుల అరెస్టులను ఖండిస్తూ 6.7.09న పోలవరంలో  ఏజన్సీ గిరిజన సంఘం
ఆధ్వర్యంలో ప్రదర్శన, నాయకత్వం వహించిన కుంజం రామారావు

# కోస్టల్ కారిడార్‌కు వ్యతిరేకంగా




30.8.08న చీరాలలో కోస్టల్ కారిడార్ వ్యతిరేక సదస్సుల్లో ప్రసంగిస్తున్న కా॥ఝాన్సి,
వేదికపై ఎడమ నుండి బొజ్జా తారకం, విజయకుమార్, కిషోర్, శ్రీరాములు,
పింజెల సుబ్బారావు, లలిత, శోభ, స్వామి, ఇతరులు.



సదస్సుకు హాజరైన ప్రతినిధులు

## 15.10.08న చీరాలలో వాన్‌పిక్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం, అరెస్టులు









చీరాలలో పోలీసు నిర్బంధం, కామ్రేడ్స్ అరెస్టులను ఖండిస్తూ బందర్‌లో ప్రదర్శన




16.12. 08న బందరులో కారిడార్ వ్యతిరేక సదస్సు ప్రసంగిస్తున్న కా॥ విజయకుమార్
వేదికపై ఎడమ నుండి జగన్, వడ్డీ శోభానాద్రీశ్వరరావు, సి.భాస్కరరావు, భార్గశ్రీ, సోని

# రైతాంగ సమస్యలపై



వరంగల్ జిల్లా సదస్సుకి హాజరైన ప్రతినిధులు



30.8.09 వరంగల్‌జిల్లా సదస్సులో అమరులకు జోహార్లు చెప్తున్న నాయకులు
వేదికపై కా॥ కోటయ్య, ఝాన్సి, మోడెం మల్లేష్, పైడి, యాకూబ్ తదితరులు




26.7.09న రెంటచింతలలో కౌలు రైతుల సదస్సు, ప్రసంగిస్తున్న కా॥కోటయ్య
వేదికపై ఎడమ నుండి కా॥పద్మ, నాగేశ్వరరావు, రాంబాబు, ముసలయ్య, లక్ష్మారెడ్డి , లలిత



సదస్సుకు హాజరైన ప్రజానీకం



గల్ఫ్ బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి డిమాండ్ చేస్తూ
నిజామాబాద్ కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నాలో కా॥కోటయ్య, నర్సయ్య




2009 అక్టోబరులో కృష్ణానది వరద బాధితులను పరామర్శిస్తున్న రాష్ట్ర బృందం
ఫోటోలో కా॥ఝాన్సి, జార్జి, ఇతరులు

# ఆదివాసీ, రైతాంగ సమస్యలపై




సోంపేట థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాన్ని నిరసిస్తూ
16.11.09న శ్రీకాకుళంలో కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా



26.6.09న రైతాంగ సమస్యలపై మక్కువ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా




25.7.08న కోటరామచంద్రాపురంలో ధర్నా, ప్రసంగిస్తున్న డా॥బి.డి.శర్మ, అనువదిస్తున్న కా॥జస్వంతరావు
వేదికపై కా॥కోటయ్య, ఝాన్సి, నాగరాజు, వెంకటరత్నం



ధర్నాలో పాల్గొన్న ఆదివాసీ ప్రజానీకం



22.10.08న ఏజన్సీలో వైద్యసేవల మెరుగకై ఏజన్సీ గిరిజన సంఘం,
నవయువ సమాఖ్య పోలవరం ఆసుపత్రి వద్ద ధర్నా



11.2.08న అభయారణ్య ప్రతిపాదనను ఖండిస్తూ
పార్వతీపురంలో జరిగిన ధర్నా, ప్రసంగిస్తున్న కా॥కోటయ్య

# అమరులకు నివాళులు




2008 జులైలో శ్రీకాకుళ అమరుల స్థూపం వద్ద సభ, ప్రసంగిస్తున్న కా॥ఝాన్సి
వేదికపై ఎడమ నుండా రమణ, ఛాయరాజ్, పండా, అప్పయ్య, అరుణ, వర్మ



21.3.09 కా॥సోమయ్య వర్ధంతి సభలో కా॥ఇల్లా రామిరెడ్డి,
వేదికపై కా॥నాగరాజు, పెద్దన్న, ఝాన్సి, రామారావె, ఇతరులు



24.4.09న అనంతపురంలో కా॥మండ్ల సుబ్బారెడ్డి స్థూపావిష్కరణ సభకు హాజరైన ప్రజానీకం



వేమన ఆదినారాయణ స్థూపావిష్కరణ
కా॥ఎస్.ఝాన్సి, ఫోటోలో కా॥కోటయ్య తదితరులు

# ఎన్నికల ప్రచారంలో



24.3.09న పార్వతీపురంలో ఎన్నికల ప్రచారంలో
కా॥నాగభూషణం, ముత్యాలు, వెంకటస్వామి



25.3.09న ఎన్నికల ప్రచారంలో భాగంగా సాలూరులో బహిరంగ సభకు హాజరైన ప్రజానీకం

# పోరాట పథంలో కోరాపుట్ ఆదివాసులు



బహిరంగ సభను శ్రద్ధగా ఆలకిస్తున్న ఆదివాసులు



20.6.09న బందుగాంలో చాషీమూలియా ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో బహిరంగ సభ వేదికపై ఎడమ నుండి కా॥ భాస్కరరావు, ఝూన్సి, వర్మ, విజయకుమార్, కేంద్రుక అర్జున్ పండా, ఇతరులు



బహిరంగ సభకు ప్రదర్శనగా తరలివస్తున్న ఆదివాసులు



తమ సాంప్రదాయక ఆయుధాలతో కోరాపుట్ ఆదివాసులు




27.3.09న ఎన్నికల ప్రచారంలో
చాషీమూలియా ఆదివాసీ సంఘం నాయకులు కా॥అర్జున్



ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు గ్రామాలలో 2009 జులై 4,5 తేదీలలో భూ ఆక్రమణలు, నిర్బంధంపై నిజనిర్ధారణ బృందం పరిశీలన, ఫోటోలో కె.ఆర్.చౌదరి, సత్యనారాయణరెడ్డి, సి.భాస్కరరావు, జయవింధ్యాల తదితరులు

with best compliments from:

SAROVAR

COFFEE SHOPPE

5-9-22, Sarovar complex
Secretariat Road,
Hyderabad-500 063
Ph: 23237299

with best compliments from:

ANIL PRABHAS
PRIVATE LIMITED

Hotel Sarovar
5-9-22, Secretariat Road
Hyderabad-500 063
Ph:23237638

# నెల్లూరు నగరపాలక సంస్థ

## అభివృద్ధి కార్యక్రమాలు

**సాధారణ విధులు:**

- రూ. 150.07 లక్షలతో రహదారులు
- రూ.60.59 లక్షలతో డ్రైన్‌లు
- రూ. 46.70 లక్షలతో నీటి సరఫరా పనులు

**APUSP (DFID)**

- B- MAPP - రూ. 440 లక్షలతో 19 పనులు పూర్తి
- C- MAPP - రూ.550 లక్షలతో 15 పనులు పూర్తి
- C-MAPP-Cylce- రూ.1068.00 లక్షలతో 30 పనులు నిర్మాణము

**12వ ఆర్థిక సంఘం విధులు**

- 92.00 లక్షలతో 7 పనులు పూర్తి (మొదటి విడత)
- రూ. 184.69 లక్షలతో 7 పనులు నిర్మాణము
- రూ.104.74 లక్షలతో ఆక్షన్ ప్లాను తయారు

**APURMSP(CIIP) WORLD BANK**

రూ.826.95 లక్షలతో 16 పనులు నిర్మాణము

**MP LADS:**

- రూ.31.86 లక్షలతో 7 పనులు పూర్తి
- రూ.19.22 లక్షలతో 7 పనులు నిర్మాణము

**ACDP**

రూ.149.22 లక్షలతో 66 పనులు నిర్మాణము
రూ.36.03 లక్షలతో 9 పనులు నిర్మాణము

**పింఛన్లు:**

- 6632 మందికి వృద్ధాప్య పింఛన్లు
- 2672 మందికి వితంతు పింఛన్లు
- 947 మందికి వికలాంగుల పింఛన్లు

**IHSDP**

- టౌన్‌షిప్ నందు 8047 ఇండ్ల నిర్మాణము



**సకాలంలో పన్నులు చెల్లించండి!!**
**నగరాభివృద్ధికి తోడ్పడండి**






# అభ్యుదయ ప్రగతిశీల ______ ______ విప్లవ సాహిత్య కేంద్రము

## మైత్రీ బుక్ హౌస్

జలీల్ వీధి, అరండల్‌పేట
కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ-520 002

**ఆహ్వాన సంఘ కరపత్రం**

# ఏప్రిల్ 12, 13, 14 తేదీలలో-ఒంగోలులో జరిగే రైతుకూలీసంఘం (ఆంప్ర) రాష్ట్ర మహాసభలకు ఆహ్వానం పలుకుదాం!

## సమాజంలో ప్రజాస్వామికాన్ని నెలకొల్పేటువంటి, బహుళజాతి సంస్థల పీడనల ప్రపంచంలో దేశ స్వాతంత్ర్య వ్యవస్థా నిర్మాణ పతాకను ఉన్నతంగా ప్రతిష్టించేటువంటి; రైతుల, వ్యవసాయదారుల, గ్రామీణ పేదల ఉద్యమ నిర్మాణానికి దోహదపడదాం!

మిత్రులారా!

ఏప్రిల్ 12, 13, 14 తేదీలలో రైతు కూలీసంఘం (ఆం.ప్ర) మహాసభలు ఒంగోలులో జరగనున్నాయి.

ఈ మహాసభలకు ఆహ్వానం పలికి ఏర్పాట్లు చేయటానికి ప్రకాశంజిల్లాలోని ఆలోచనాపరులు, వివిధ వర్గాల, సంఘాల ప్రతినిధులతో ఆహ్వాన సంఘం రూపొందింది.

ఏలినవారే అంగీకరించి పదే పదే చెప్తున్నట్లు ప్రపంచమంతా నేడు మహా సంక్షోభంలో కూరుకొని వుంటే, అందులో భాగంగా భారతదేశపు ఉత్పత్తి రంగాలు అన్నీ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వ్యవసాయదారుల వ్యధలు ఎన్ని చెప్పుకున్నా తరిగిపోకుండా వున్నాయి.

వ్యవసాయాన్ని మార్కెట్‌కు బంధించిన పాలకుల విధానాలు, చర్యల కారణంగా స్వయం పోషక, సమాజ పోషక రైతు వ్యవసాయం ధ్వంసం అయిపోయింది, పోతున్నది. గత దశాబ్ద కాలంలో వ్యవసాయం సాగిస్తూ, పంటలు పండించుతూ పెట్టుబడి విషవలయంలో చిక్కుకున్న రైతులు, వ్యవసాయదారులైన రెండున్నర లక్షలమంది ఋణబంధ విముక్తికి ఆత్మహత్యలే మార్గంగా మారాయంటే ఎంతటి విషాదం మన సమాజాన్ని చుట్టుముట్టిందో మన రైతుకు, మన వ్యవసాయదారునకు, కౌలు రైతునకు ఎంతటి దైన్యపు స్థితి దాపురించిందో అర్ధ మౌతుంది.

తన ఉత్పత్తిలో, తను సాగుచేసి పండించిన ఆహార పంటలతో సమాజం యొక్క పొట్ట నింపుతున్న రైతే సమాజంలో ఇంతటి ఒంటరితనాన్ని, అమానవీయ ఘోరమైన పరిస్థితిని అనుభవించవలసి వస్తున్నదంటే-మన రైతుల, గ్రామీణ పేదల, కౌలుదారుల, వ్యవసాయదారుల సమస్యలు ఎన్నో! వారిపై సవారి చేస్తున్న పీడనలు ఎన్నెన్నో!!

వీటన్నింటినీ సాకల్యంగా పరిశీలించు కోవటానికి, చుట్టుముట్టిన సమస్యలకు మూలమైన కారణాలను వెల్లడి చేయటానికి, ఆ సమస్యల కారణంగా నిర్మించుకున్న ఉద్యమాల, సాగించిన ఆందోళనల అను భవాలను కలబోసుకోవటానికి, ఆ అను భవాల వెలుగులో వ్యవసాయరంగం పైనున్న (భూస్వామ్య, సామ్రాజ్యవాదుల) పీడనలను, భల్లూకపు పట్టులను ఎదుర్కొనే కార్యాచరణ సంబంధిత నిర్ణయాలు చేసుకోవటానికి ఈ మహాసభలు జరుగనున్నాయి.

జాతీయోద్యమ కాలంలో జరిగిన ఆందోళనల్లో, పోరాటాలల్లో మన జిల్లా తగు ఘనమైన పాత్రనే నిర్వహించింది. చీరాల, పేరాల పోరాటం మనం ఎరిగినదే. జాతీయో ద్యమంలో జైలుకు వెళ్ళిన తొలి మహిళ రవూరు అలివేలమ్మ మన జిల్లా వారే. స్వాతంత్ర్యం కోసం తిరుగుబాటు నడప టానికి తల ఎత్తిన గదర్ ఉద్యమంలో పాల్గొన్న దరిశి చెంచయ్య మన జిల్లావారే. వలస పాలకుల కరకు, కఠిన లాఠీలను తట్టుకొని ఉప్పు సత్యాగ్రహం సాగించిన దేవరంపాడు మన జిల్లాలోనిదే. నిషేధాలకు గురై, వలస పాలకుల లాఠీలను, బూట్ల తొక్కుడును భరించి; ప్రగతిశీల భావాల, ఆలోచనల దీపాన్ని వెలిగించి ఆంధ్రలో సాగిన మహోద్యమాలకు నాయకులను సృష్టించిన రాజకీయ పాఠశాలల్లో తొలి పాఠశాల జరిగినది మన జిల్లాలోని కొత్తపట్నంలోనే. బ్రిటీష్‌వాళ్ళు సాగించిన రెండవ ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం లోను, క్విట్ ఇండియా ఉద్యమంలోను మన జిల్లా చురుకైన పాత్ర నిర్వహించింది. నైజాంకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా ప్రజా పోరాటంలోనూ 1950 సం॥ నుండి సాగిన అన్ని ప్రజా ఉ ద్యమాలలోను మన జిల్లా మంచి పాత్రను నిర్వహిస్తూ వచ్చింది.

మన సమాజంలో ఉన్న కులపీడన, వివక్షతలకు వ్యతిరేకంగానూ; సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగాను అనేక తీవ్రమైన పోరాటాలు, సంఘర్షణలు జరిగాయి. మానవ సమాజంలో కరుడుగట్టి పోయి ఉన్న కుల అసమానతలకు వ్యతిరేకంగా ఆలోచనాపరులను, మొత్తం సమాజాన్ని కదిలించిన సంఘర్షణలు జరిగిన ప్రాంతం మనది.

భౌగోళిక వనరుల రీత్యాను, సాంఘిక సంబంధాల రీత్యాను మన ప్రకాశం జిల్లాలో భిన్నభిన్న లక్షణాలు కలిగిన ప్రాంతాలు ఉన్నాయి. అయినా జిల్లాలో మొత్తంగా భూసంబంధాలు ప్రజాస్వామీకీకరణ చెందని ప్రాంతంగానే ఉన్నది. ఈ లక్షణానికి అను గుణంగా సాంఘిక సంబంధాలలో కూడా పెత్తందారీతనం, పెత్తందారీ వ్యవస్థ అంత రించిపోని ప్రాంతంగానే ఉన్నది. పొట్టనింపే ధాన్యపు పంటలనే పండించుకొనే జానెడునేల కోసం గ్రామీణ పేదలు, రైతులు అవురావురు

మంటుండగా బహుళజాతి కంపెనీల కోసం సారవంతమైన నేలలు ప్లాంటేషన్స్‌గా మార్చ బడుతున్నాయి. పశువులకు, మానవ ప్రాణులకు పనికిరాని నేలలుగా మార్చ బడ్డాయి. దశాబ్దాల క్రితం నుండీ జిల్లాలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు, త్రాగునీరు కోసం ప్రజా ఆందోళన సాగుతున్నప్పటికీ, ఫ్లోరైడ్ ప్రాంతాలు కూడా యధావిధిగానే దర్శనమిస్తున్నాయి. పాలకులు ప్రారంభించిన నీటి ప్రాజెక్టులు, తమ నిర్మాణపు వేగంలో నత్తలనే ముందుండ మంటున్నాయి. వరిగలు, సజ్జలు, జొన్నలు లాంటి ముతక ధాన్యాలు పండించుకొని భద్రంగా జీవనం కావించు కొన్న గ్రామీణులు-పొగాకు, పత్తి, మిర్చి, ఫలతోటలు లాంటి వాటివైపు ఈడ్చబడి మార్కెట్ ఎగుడు దిగుళ్ళకు, కొనుగోళ్ళ మాయాజాలాలకు, పెట్టుబడి ద్రవ్య కొరతలకు బలైపోతున్నారు.

గ్రామీణ పేదలు, గతంలో వృత్తులపై ఆధారపడి జీవనం సాగించిన వృత్తి పని వాళ్ళు, ఏ కాలంలోనైనా వలసల్లోనే జీవనాలు సాగిస్తున్నారు. జిల్లాలో రైతులు, కూలీలు, గ్రామీణ పేదలు నీటి ప్రాజెక్టుల కోసం సాగించిన ఆందోళనల్లోను, పంటల కొనుగోళ్ళ కోసం గిట్టుబాటు ధర కోసం సాగించిన ఆందోళనల్లోను, రసాయనిక ఎరువులను అవసరమైనంత అందించాలని సాగిన ఆందోళనల్లోను, రుణాలు మాఫీ చేయాలని, రీ షెడ్యూల్ చేయాలనీ సాగిన ఆందోళనల్లోను ఇతర ప్రజా సంఘాలతో పాటు ఈ మహాసభలు జరుపుకొంటున్న రైతుకూలీసంఘం నిరంతర కార్యక్రమాలు చేపడుతూ, కార్యకలాపాలు సాగిస్తూ వస్తున్నది. కావున ఒంగోలులో జరుగు ఈ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసు కునేందుకు అన్ని విధాలా సహకరించ వలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

## ఆహ్వానసంఘం

**అధ్యక్షులు: చెరుకూరి వెంకటేశ్వర్లు,** ప్రముఖ న్యాయవాది

**ఉపాధ్యక్షులు:**

చుంచు శేషయ్య, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య మాజీ అధ్యక్షులు
అన్నెం కొండలరాయుడు, ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు
మానం రామారావు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర ఉపాధ్యక్షులు
ముత్తిరెడ్డి శ్రీరాములు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర ఉపాధ్యక్షులు
డి.వి.ఎన్.స్వామి, ఎపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు
పింజల వెంకట సుబ్బారావు, వేటపాలెం చేనేత సొసైటి అధ్యక్షులు
చుండూరి రంగారావు, పొగాకు బోర్డు మాజీ సభ్యులు
అడపా హరనాథబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్, ఒంగోలు
తాటిపర్తి సుబ్బారెడ్డి, అఖిలపక్ష రైతు నాయకులు
షేక్ అబ్దుల్ బషీర్, ఎపిఎన్‌జిఓ జిల్లా సంఘ అధ్యక్షులు
ఇండ్ల విజయసారధి, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు
తన్నీరు ధర్మరాజు, రాష్ట్ర అధ్యక్షులు, వడ్డెర సంఘం
పల్నాటి శ్రీరాములు, బహుజన కెరటాలు
పంగులూరి గోవిందయ్య, అడ్వకేట్, జనసాహితి
సి.హెచ్.సుధాకరరావు, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు
కత్తి పేరయ్య, ఏపిఎస్ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ కమిటీ
మల్లె రాఘవరాణి, అడ్వకేట్, ఆదర్శ మహిళా మండలి
వేజండ్ల రామారావు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా అధ్యక్షులు
ఆలపాటి వివేక, అడ్వకేట్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు
పమ్మి బద్రిరెడ్డి, పొగాకు బోర్డు సభ్యులు
బి.హనుమారెడ్డి, అధ్యక్షులు, ప్రకాశంజిల్లా రచయితల సంఘం, అడ్వకేట్
యం.యస్.సాయి, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు
చల్లా శ్రీనివాసరావు, ఒంగోలు డెయిరీ ఛైర్మన్

**కార్యదర్శి: యస్. లలితకుమారి,** రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి

**కోశాధికారి:** పరిటాల కోటేశ్వరరావు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షులు

**గౌరవ సభ్యులు:**

మారెళ్ళ బంగారుబాబు, పొగాకు బోర్డు మాజీ సభ్యులు
యన్. బాబురావు, దళిత మహాసభ
నాగినేని అవనీంద్రప్రసాద్, ఏఎల్‌డిఎ ఛైర్మన్
కాకుమాను శ్రీరామమూర్తి, పాలకవర్గ సభ్యులు, ఒంగోలు డెయిరీ
బాచిన నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు, ఒంగోలు డెయిరీ
వడ్డెళ్ళ ప్రసాదు, పొగాకు బోర్డు ఫ్లోర్ నాయకులు
దేవత ముసలారావు (పాప), ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు
కట్టా శివయ్య, పొగాకు ఉత్పత్తిదారుల రాష్ట్ర అధ్యక్షులు
పంద్రాజు సుబ్బరావమ్మ, మోటుపల్లి పోర్ట్ & కారిడార్ వ్యతిరేక కమిటీ నాయకులు
పంద్రాజు శంకర్, మోటుపల్లి పోర్ట్ & కారిడార్ వ్యతిరేక కమిటీ నాయకులు
గాలి పోలిరెడ్డి, మోటుపల్లి పోర్ట్ & కారిడార్ వ్యతిరేక కమిటీ నాయకులు
సూరం గురవారెడ్డి, పొగాకుబోర్డు ఫ్లోర్ నాయకులు
వల్లంరెడ్డి రమణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, ఒంగోలు
ఇనగంటి పిచ్చిరెడ్డి, కోల్ సొసైటీ అధ్యక్షులు
మాలె వెంకటరామిరెడ్డి, కోల్ సొసైటీ మాజీ డైరెక్టర్
పమిడి వీరరాఘవయ్య, రైతు నాయకులు
మండవ వెంకటాద్రి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు-మద్దిపాడు
దేవరపల్లి నారపరెడ్డి, రైతు నాయకులు
మండవ రంగారావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్, మద్దిపాడు
కోయ కోటేశ్వరరావు, ఆం.ప్ర నాల్గవ తరగతి ఉద్యోగుల ప్రధాన కార్యదర్శి
యస్.యం.డి.ఖాశిం, ఆం.ప్ర సెరీకల్చర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
శెట్టి గోపి, ఎ.పి. డ్రైవర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి
బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏ.పి.ఆర్.యస్.ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా కార్యదర్శి
ఆవుల నరసింహారావు, వార్డెన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు
ఆత్మకూరి చెన్నయ్య, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు
యన్.యం.కె.ధర్మా, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు
బి.పూర్ణచంద్రరావు, అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు
యస్.కోటేశ్వరరావు, ఏ.పి.యస్.ఆర్.టి.సి, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

బి.గోపాలరావు, రజక జన సేవా సంఘం జిల్లా కన్వీనర్
గాదె శివయ్యనాయుడు, కాపు సంఘం నాయకులు
జడా కోటేశ్వరరావు, మునిసిపల్ కౌన్సిలర్
పి.కె.రాజేశ్వరరావు, ఎ.ఐ.బి.ఇ.ఎ నాయకులు
బి.రాంగోపాలరెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి
కర్రి సుబ్బారావు, జడ్‌పిటిసి, పంగులూరు
బండి శ్రీనివాసరావు, ఏ.పి.ఎన్.జి.ఓ జిల్లా కార్యదర్శి
పి.రాజ్యలక్ష్మి, ఏ.పి.ఎన్.జి.ఓ జిల్లా కోశాధికారి
జడా విజయకుమార్, ఎన్‌యు బిఎస్ఎన్‌యల్ డబ్ల్యు (ఎఫ్ఎన్‌టిఓ)జిల్లా కార్యదర్శి
ఎస్.గురునాథశర్మ, ఏ.పి.టి.ఎఫ్ జిల్లా కార్యదర్శి
కె.వెంకటేశ్వరరెడ్డి, ఎన్‌టియు జిల్లా కార్యదర్శి
చుంచు రామాంజనేయులు, యుటిఎఫ్
శిఖా చంద్రశేఖరబాబు, బిటిఎ జిల్లా గౌరవాధ్యక్షులు
దాసరి శివాజి, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు
ఎం.సర్వేశ్వరరావు, యుటిఎఫ్
గుంటూరు సుందరరావు, నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు
ఇ.ఆర్.గౌడ్, ఏపిఎస్ఆర్‌టిసి, ఎన్ఎంయు జిల్లా నాయకులు
పి.సుధాకరరావు, జిజెఎల్ఎ జిల్లా కార్యదర్శి
ఎ.సైమన్ విక్టర్, జిజెఎల్ఎ జిల్లా అధ్యక్షులు
ఎస్.ధర్మారావు, జిజెఎల్ఎ స్టేట్ ఫైనాన్స్ సెక్రటరి
గనిపినేని అంజయ్య, వివియం అండ్ డిగ్రీ కాలేజి రిటైర్డు ప్రిన్సిపాల్
అంజిరెడ్డి, వివియం అండ్ డిగ్రీ కాలేజి రిటైర్డు ప్రిన్సిపాల్
బొలిశెట్టి గౌరీశంకర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ టౌన్ సెక్రటరి
దేసు వెంకటేశ్వర్లు, శ్రీ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ అసోసియేషన్ అధ్యక్షులు
ఎస్. సుబ్బారావు, పోస్టల్ టెలికం హౌసింగ్ బోర్డు అధ్యక్షులు
ఎన్. కుటుంబరావు, ఏపిఎస్ఆర్‌టిసి, ఎన్ఎంయు-చీరాల నాయకులు
పి.ముసలయ్య, దళిత బహుజన శ్రామిక యూనియన్ అధ్యక్షులు
మందా చెంచయ్య, క్రిస్టియన్ మైనార్టీ ఆస్తుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు
బీరం సుందరరావు, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి, ఇంకొల్లు
కోడూరి శ్రీను, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు
కె. కుటుంబరావు, రైల్వే క్యాటరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు
షేక్ అయూబ్, ముస్లిం హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు
షేక్ బుజ్జి, (మహమ్మద్) ముస్లిం డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు
షేక్ మహబూబ్ జాని, ముస్లిం రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు
శ్రీనివాసరావు, వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్
రమణయ్య, మైక్ అండ్ లైటింగ్ అసోసియేషన్
తన్నీరు ఆంజనేయులు, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు
వల్లెపు రాములు, వడ్డెర సంఘం నాయకులు
కె.వి.శేషయ్య, ఏపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ జిల్లా అధ్యక్షులు
కోడె వెంకటావ్రు, ఏపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ యూనియన్ జిల్లా కార్యదర్శి
వి.రమణయ్య, టుబాకో బోర్డు హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు
చిట్యాల శేషిరెడ్డి, టుబాకో బోర్డు హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి
వెల్లంపల్లి గోపి, ఆర్య వైశ్య సంఘం యూత్ అధ్యక్షులు
గూడూరు వెంకట్రావు, మార్బుల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు
ఇల్లేంద్ర వీరబాబు, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు
మద్దులూరి హరిప్రేమనాథ్, బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శి
యర్రంనేని కోటేశ్వరరావు, గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు
తుమ్మల కోటేశ్వరరావు, ఏపియస్ఆర్‌టిసి సిసియస్ డెలిగేట్
పసుపులేటి పిచ్చయ్య, ఏపిఎన్‌జిఒ సంఘం జిల్లా మాజీ కార్యదర్శి
చింతా శేషుబాబు, ఏపిపిహెచ్ అండ్ ఎం ఇ.యు.జిల్లా అధ్యక్షులు
పెరుగు శ్రీధర్, ఏపిపిహెచ్ అండ్ ఎం ఇ.యు జిల్లా కార్యదర్శి
డా॥ నూకతోటి రవికుమార్, రచయిత-'ఆంధ్రజ్యోతి'
మంచికంటి వెంకటేశ్వరరెడ్డి, రచయిత
తలారి నాగేశ్వరరావు, ఆర్కెస్ట్ర కళాకారుడు
పి.వి. శేషయ్య, ఎఫ్ఎన్‌టిఒ బిఎస్ఎన్ఎల్ వర్కర్స్ యూనియన్ నాయకులు
పావులూరి రామ్మూర్తి, టిఎన్‌టియుసి నాయకులు
కె.ఆల్‌ఫ్రెడ్, ప్రకాశంజిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు
కె.వెంకటేశ్వర్లు, అఖిల భారత తపాలా యూనియన్ జిల్లా అధ్యక్షులు
పి.వి.క్రిష్ణ, చదరంగం సమాఖ్య జిల్లా అధ్యక్షులు
భూపతి రాజారావు, అంబేద్కర్ లైబ్రేరియన్, ఒంగోలు
డా॥ పోలవరపు ఫణిధర్, ఐఎంఏ-జిల్లా కార్యదర్శి
డా॥ కె.సీతారామయ్య, ఐఎంఏ-రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
డా॥ కొల్లా నాగేశ్వరరావు, ఇఎన్‌టి స్పెషలిస్ట్
డా॥మురళీధరరెడ్డి, చందమామ పిల్లల హాస్పటల్
డా॥ మండవ నరసింహారావు, కమలా నర్సింగ్ హోమ్
డా॥ కె.సుబ్బానాయుడు, రవితేజ హాస్పటల్
డా॥ కె.వి.రమణ, శాంతి మానసిక వైద్యశాల
డా॥ డి.చెంచురామిరెడ్డి, ఎం.డి
డా॥ గుమ్మడి రామమోహనరావు, ఛాతీ వైద్య నిపుణులు
డా॥ సిహెచ్.శాంతికుమార్, అరుణ హోమియో వైద్యశాల
డా॥ జాకీర్ హుస్సేన్, అమ్మ వైద్యశాల
పిట్టల లక్ష్మయ్య, అడ్వకేట్
బొడ్డు భాస్కర్, అడ్వకేట్
ఎం.ఏ.శేషాచారి, అడ్వకేట్
ఎన్.వి.సుబ్బయ్య చౌదరి, అడ్వకేట్
జెట్టి ప్రభాకరరెడ్డి, అడ్వకేట్
పోలూరి శ్రీను, అడ్వకేట్
బి.ఎల్.నారాయణ, అడ్వకేట్
వెల్లటూరి రామక్రిష్ణారెడ్డి, ఎస్ఎస్ఎన్ విద్యా సంస్థలు
మల్లేశ్వరరావు, ఉమామహేశ్వర విద్యాసంస్థలు
నల్లూరి వెంకటేశ్వర్లు, శ్రీ ప్రతిభ, గురుదత్తా విద్యాసంస్థలు
ప్రకాష్, మాంటిస్సోరి విద్యాసంస్థలు, ఏపిటిసిఏ అధ్యక్షులు
నార్నె వెంకటసుబ్బయ్య, హేతువాద సంఘం
బి.వి.సుబ్బారెడ్డి, యర్రగొండపాలెం
ఐ.రమణారెడ్డి, మాజీ సర్పంచ్-తాళ్ళూరు
మోంద్రు ఆదెమ్మ, సర్పంచ్-పొందూరు
సిద్దారపు బాలమ్మ, ఎంపిటిసి-పొందూరు
చిట్నీడి రంగారావు, ఉపసర్పంచ్-పొందూరు
మోంద్రు హనుమంతరావు, ఛైర్మన్-పొందూరు గ్రామ అభివృద్ధి కమిటి
దాసరి వెంకటరావు, పాలకేంద్రం అధ్యక్షులు-చినరావిపాడు
పాపినేని వెంకటేశ్వర్లు, పొందూరు ఎత్తిపోతల సంఘ ఛైర్మన్
కోడూరి ఆంజనేయులు, సాల్ట్ సొసైటీ అధ్యక్షులు
కారాణి బ్రహ్మారెడ్డి, సర్పంచ్-మోటుమాల
అప్పాటి శ్రీను, సర్పంచ్-గుండమాల
షేక్ వలి, సర్పంచ్-రంగాయపాలెం

వాటంబేటి రాఘవరెడ్డి, ఉపసర్పంచ్-రంగాయపాలెం
చిరుపల్లి వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్-గుండ్ల సముద్రం
మోటుమర్రి ప్రసన్న, తూర్పుగంగవరం
చుంచు లక్ష్మీనారాయణ, ఆక్వా రైతు
బొల్లినేని సీతారామయ్య, గ్రానైట్ పాలిషింగ్ యూనిట్
జాగర్లమూడి పూర్ణచంద్రరావు, పాలకేంద్రం మాజీ అధ్యక్షులు, పోతవరం
అన్నాబత్తిన చెంచురామయ్య, పాలకేంద్రం అధ్యక్షులు, జమ్ములపాలెం
కట్టా శింగయ్య, మాజీ సర్పంచ్-త్రోవగుంట
బొల్లినేని క్రిష్ణయ్య, మాజీ సర్పంచ్-చిలకపాడు
ఎం.వి.కృష్ణయ్య, ఏపిటిఎఫ్ నాయకులు
దేవతోటి నాగయ్య, గ్రామీణ పేదల సంఘం
గాండ్ల వెంకట్రావు, ఏపిసిఎల్‌సి జిల్లా అధ్యక్షులు
డా॥ జి.వి.కృష్ణయ్య, జనసాహితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
పోకూరి శాంతకుమారి, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
ఎస్. కొండలరావు, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు
మద్దినేని నారాయణ, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు
వడ్డెబోయిన సుబ్బారెడ్డి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు
వాటంబేటి శ్రీరాములు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు
బెంగులూరి జయబాబు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు
తుల్లిబిల్లి లక్ష్మమ్మ, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు
బీరంగుంట శ్రీను, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు
ఆలూరు శామ్యూల్, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు
కోడూరి కోటేశ్వరరావు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు
టి.ఉమామహేశ్వరరావు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా కార్యవర్గసభ్యులు
బెజవాడ శివరామకృష్ణయ్య, రైతుకూలీసంఘం(ఆం.ప్ర)
కాళహస్తి వెంకటేశ్వర్లు, కొత్తపట్నం
యారాసు భాస్కర్, ప్రజాతంత్ర చేనేత కార్మిక సమాఖ్య
కోడె వెంకటావు, ఏపిఎఫ్‌టియు
టి.రేణుక, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా అధ్యక్షులు
భీమవరపు సుబ్బారావు, ఎన్.వై.ఎస్ జిల్లా అధ్యక్షులు
గుళ్ళపల్లి వెంకటరావు, ఎన్.వై.ఎస్.జిల్లా కార్యదర్శి
ఎన్.లక్ష్మన్నాయుడు, ఎన్.వై.ఎస్
షేక్ నజీర్ భాషా, ఎన్.వై.ఎస్
కుంచాల వెంకటేశ్వర్లు, ఎల్.ఐ.సి
జె.కిషోర్‌బాబు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయ కార్యదర్శి
వై.సోని, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
సి.పెద్దన్న, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు
డా॥సి.విజయ, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు
ఇల్లా రామిరెడ్డి, గిరిజన, గిరిజనేతర పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షులు
డా॥వై.సుధీర్, టి.ఎన్.మెమోరియల్ ట్రస్టు
సింహాద్రి లక్ష్మారెడ్డి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
డి.వర్మ, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఉత్తరాంధ్ర నాయకులు
ఎలకా పత్రాపరెడ్డి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నల్గొండ జిల్లా
బి.తిమ్మారెడ్డి, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనంతపురం
మోడెం మల్లేష్, ఏపిఎఫ్‌టియు నాయకులు, వరంగల్
గంగుల నర్సయ్య, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నాయకులు, నిజామాబాద్
జి.సునీత, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
ఎం.శోభారాణి, స్త్రీ విముక్తి సంఘటన
కె.అజిత, పిడిఎస్‌ఓ

ఒంగోలు. 1.03.2010



**"పురుగును చంపలేని మందులు**
**రైతు ప్రాణం తీయగలిగినప్పుడు**
**మందుల్లో కల్తీ లేదని రాబందులు ప్రకటిస్తాయి**
**పండించే నేల ఆకాశమై తిరగబడి**
**తన నెత్తినే కూలిన వేళ**
**నేరం ప్రకృతిదని సింహాసనం తేల్చేస్తుంది"**

పాపినేని
'నాగలి విరిగినప్పుడు' నుండి.

కందెన లేక రోదిస్తున్న
నాటుబండి ఇరుసులాగ ఉంది పల్లె
కాలిపోయిన గుడిసెకు కట్టిన
ఖాళీ ఉట్టిలాగ
బీడుదేరిపోయిన వొళ్ళులాగా
చావు ముఖం దేరిన మనిషిలాగ
ఉంది పల్లె
బతుకు చిరునామా కోల్పోయిన
క్షతగాత్రుల ముఖచిత్రంలా
ఉంది పల్లె

అల
'మట్టిచెట్టూ పిట్ట బజినిక'

భారత పాలకుల సామ్రాజ్యవాద, బడా బూర్జువా అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పీడిత ప్రజలందరితోను, జాతీయ శక్తులన్నింటితోను రైతుకూలీసంఘం సఖ్యత నెరుపుతుంది. పాలకవర్గాల అభివృద్ధి నిరోధకత్వాన్ని పట్టణ కార్మిక వర్గంతో చేయి, చేయి కలిపి ప్రతిఘటిస్తుంది.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) 'లక్ష్య ప్రకటన' నుండి

నివేదిక

# 'ప్రత్యేక ఆర్థిక మండళ్ళు-రైతాంగ ఉసురుతీసే ఉరితాళ్ళు'

*కోస్తా కారిడార్ వ్యతిరేక కమిటీ కన్వీనర్ గుర్రం విజయకుమార్ సారధ్యంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥జె.కిశోర్‌బాబు, న్యాయవాది డాక్టర్ లెనిన్, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నెల్లూరు జిల్లా కార్యదర్శి కా॥జి.సునీత సహా ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం 2008 డిసెంబరు 29,30 తేదీల్లో నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని ప్రత్యేక ఆర్థికమండళ్ళను, ఆ పేరిట సేకరించిన భూములను పరిశీలన జరిపింది.*

*డిసెంబరు 29వ తేదీన తడవద్ద వున్న, శ్రీ సిటీ సెజ్ కోసం భూములు సేకరించిన సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లోని గ్రామాలను సందర్శించి, ప్రజలనడిగి వివరాలను సేకరించింది. అలాగే మేనకూరు గ్రామంలోని సెజ్ పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రజాభిప్రాయం సేకరించింది. రైతు సెజ్ పేరిట కావలి డివిజన్‌లో ప్రభుత్వం సేకరిస్తున్న 2,100 ఎకరాల భూములున్న గ్రామాలను 30వ తేదీన బృందం పరిశీలించి బాధిత రైతులతో చర్చించి తమ పరిశీలనాంశాలతో నివేదిక వెల్లడించింది.*

- సెజ్ భూముల మధ్య వుంటున్న గ్రామాలన్నీ స్వచ్ఛంధ నిర్బంధ, క్యాంపులుగా మారిపోవటాన్ని అధ్యయన బృందం గమనించింది.
- సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లో ప్రభుత్వం శ్రీ సిటీ ప్రత్యేక ఆర్థికమండలి(సెజ్)కి కేటాయించిన 6,500 ఎకరాలు పూర్తిగా వ్యవసాయ భూములేకావడం బృందం పరిశీలనలో వెల్లడైంది.
- పంటలు పండే భూమి శ్రీ సిటీ సెజ్‌కు కేటాయించినందువల్ల పై ప్రాంతాలలో(12 రెవెన్యూ గ్రామాల్లో) సన్న, చిన్నకారు నిర్వాసిత రైతులు జీవనోపాధిని కోల్పోయారు.
- రైతాంగాన్ని, వ్యవసాయాన్ని ఆశ్రయించుకొని బతుకుతున్న వందలాది మంది వ్యవసాయ కూలీలు కూడా ఉపాధి కోల్పోయారు.
- ముఖ్యంగా శ్రీ సిటీ సెజ్ యాజమాన్యం తమ భూముల చుట్టూ ఇనుపకంచె పాతేయడంతో, మధ్యలో మిగిలిన గ్రామాలలో పశువుల మేతకు భూమి లేకపోవడంతో గ్రామాల ప్రజలు పశువుల్ని సైతం తెగనమ్ముకొంటున్నారు.
- గ్రామాల్లో ఇళ్ళచుట్టూ శ్రీ సిటీ యాజమాన్యం కంచెనాటడంతో గ్రామస్తులు, మహిళలు, పిల్లలు బహిర్‌భూమి లేక కాలకృత్యాలు సైతం తీర్చుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- సత్యవేడు మండలంలోని శ్రీ సిటీ సెజ్ మూలంగా మల్లావారిపాలెం, చెరివి, ఇరుగళం గ్రామాలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- పై ప్రాంతాలలో సన్న, చిన్నకారు రైతుల పరిస్థితి దారుణంగా వుంది. ప్రభుత్వ పరిహారం ఖర్చయిపోతుంది. తిరిగి ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. సన్న, చిన్నకారురైతుల కుటుంబాల్లో ప్రభుత్వ పరిహారం కలతలు రేపింది.
- వచ్చిన డబ్బులు ఖర్చయిపోయి, చేసుకోవడానికి పొలంలేక, వైద్యం చేయించుకోలేక, బిడ్డల్ని చదివించుకోలేక కళ్ళనీళ్ళతో చేతులు కడుగుకుంటున్నామని రైతులు అధ్యయన బృందం ఎదుట వాపోయారు.
- నిర్వాసితుల పునరావాసం కోసం శ్రీ సిటీ యాజమాన్యం నిర్మిస్తున్న గృహాలన్నీ నాసిరకంగా వుండడంతో ప్రజలు ఆ గృహాలలో నివసించేందుకు నిరాకరిస్తున్నారు.
- రెండో దశ భూసేకరణలో సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లోని ఇరుగళం, మాదరపాలెం గ్రామ ప్రజలు భూసేకరణను ప్రతిఘటిస్తున్నారు.
- శ్రీ సిటీ సెజ్‌కు ప్రభుత్వం భూమి సేకరిస్తున్న కాలంలో రెవెన్యూ అధికారులు అనేక రకాలుగా రైతులను బెదిరించి లొంగదీసుకొన్నారని నిర్వాసితులు తెలిపారు.
- పరిహారం రూపంలో నిర్వాసితులకు ప్రభుత్వం ఎకరాకు రెండున్నర నుంచి మూడు లక్షలు మాత్రమే చెల్లించి భూమి స్వాధీనం చేసుకొంటే నేడు శ్రీ సిటీ యాజమాన్యం అదే భూమిని 30 లక్షలనుంచి 70 లక్షల వరకూ అమ్మి సొమ్ము చేసుకొంటున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
- చట్టప్రకారం ప్రభుత్వ పరిరక్షణలో వుండాల్సిన చెరువులు, వాగులు గుంటలు శ్రీ సిటీ సెజ్ పరిధిలోకి వెళ్ళిపోయాయి. ఫలితంగా వీటిని ప్రజలు తమ అవసరాలకు వాడుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు.
- శ్రీ సిటీకి కేటాయించిన 6,500 ఎకరాల్లో ఇప్పటివరకూ కేవలం మూడు పరిశ్రమలే నిర్మాణ దశలో వున్నాయి.
- నిర్వాసిత కుటుంబాలకు పరిశ్రమల్లో ఉపాధి కల్పిస్తామని హామీలు గుప్పించిన ప్రభుత్వం ఆచరణలో అమలు చేయలేదు.
- మేనకూరులో కపారోకు మంజూరు చేసిన 5,600 ఎకరాల్లో కూడా ఇంత వరకూ ఎటువంటి పరిశ్రమలూ రాలేదు. పైగా ఇక్కడ కూడా భూములు కోల్పోయిన సన్న, చిన్నకారు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.
- ఇటీవల మేనకూరు సెజ్‌లో భూముల్ని దున్నేందుకు ప్రయత్నిం

చారని నిరుపేద రైతులపై కేసులు పెట్టారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

- ఇఫ్‌కో కిసాన్ సెజ్ పక్కనే గ్రీన్‌బెల్ట్ పేరుతో దగదర్తి మండలంలోని పూచ గుంటపాళెం, చవట, పుత్తేడు, తడక లూరు గ్రామాల్లోను; కొవలూరు మండలంలోని సంజీవనగర్, చంద్ర శేఖరపురం, పెయ్యలపాలెం, కమ్మ పాలెం, తలమంచి గ్రామాల్లో కొత్తగా సెజ్ కోసం ప్రభుత్వం సేకరించ బోతున్న 3వేల ఎకరాలు కూడా రెండు కార్ల పంట పండే భూములే.
- ఈ భూసేకరణను కూడా రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు, ప్రభుత్వం కూడా దొంగచాటుగా ఈ ప్రాంతాన్ని సర్వే చేసేందుకు ప్రయత్నిస్తుందని రైతులు తెలిపారు.
- పై గ్రామాలలో ప్రభుత్వం భూ అమ్మకపు రిజిస్ట్రేషన్లు రద్దుచేయడం శోచనీయమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
- రెవెన్యూ అధికారులు సైతం భూముల్ని ప్రభుత్వానికి అప్పగిం చాలని తమని బెదిరింపులకు గురి చేస్తున్నట్టు పలువురు రైతులు తెలిపారు.

రైతుకూలీ సంఘాలు, ఇతర ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నట్లుగా సెజ్‌లన్నీ రైతాంగ జీవితాలను ఛిద్రం చేసేవేననీ, వ్యవ సాయోత్పత్తులను దెబ్బతీసి-బడా పెట్టుబడి దారులకు, విదేశీ గుత్త కంపెనీలకు సేవ చేసేందుకు వుద్దేశించినవేననే విషయం ఈ బృందం పరిశీలనలో అడుగడుగునా ఋజు వయ్యింది. పచ్చటి పంట పొలాలను ప్రభుత్వం దుర్మార్గంగా రైతాంగాన్నుంచి బల వంతంగా, అప్రజాస్వామికంగా గుంజు కొంటున్న తీరు స్పష్టంగా వెల్లడయ్యింది. తన ఉపాధిని రక్షించుకోవటం కోసం రైతాంగం పడుతున్న తపన అడుగడుగునా వెల్ల డయ్యింది. రైతుపక్షపాతి అని చెప్పుకొంటున్న వై.ఎస్.ప్రభుత్వం ఆచరణలో రైతాంగపు జీవితాల్లో ఎంతటి చిచ్చుపెట్టిందో సెజ్‌లే ప్రత్యక్షసాక్ష్యం. కోస్తా కారిడార్ పేరుతో, సెజ్ చట్టాలపేరుతోనూ జరుగుతున్న భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని, సెజ్-2005 చట్టాన్ని రద్దు చేయాలని సెజ్ ప్రాంతాల అధ్యయన బృందం డిమాండ్ చేసింది.

---

**నేనిప్పుడు నెపం నేల మీదో గాలి మీదో తోసేస్తే**
**కుదరదు**
**నేల మోసం చెయ్యదు**
**నేరం తప్పకుండా మనిషిదే**
**నే నిప్పుడు**
**వాడి చేతిలో పంట నొల్లుకుని**
**కంట్లో కారం జల్లిన వాళ్లనేప్రశ్నిస్తాను**
**ఖండాంతర లావాదేవీల్లో**
**జాతి వెన్నెముకని తాకట్టుపెట్టిన వాళ్లనే ప్రశ్నిస్తాను**
**శవాల ఉసురు పోసుకునే చీకటి డబ్బునీ**
**దాని కావలికుక్కల్నీ ప్రశ్నిస్తాను**
**మట్టిని నమ్ముకున్న బతుకు మట్టిలోనే పాలి**
**అయినప్పుడు**
**అది ఖచ్చితంగా హత్యే-**
**చేసిం దెవరనే నేను ప్రశ్నిస్తాను.**

పాపినేని శివశంకర్
'నాగలి విరిగినప్పుడు' నుండి

---

**ప్రజలు నౌకలు**
**పొడినేల అర్థం కాదు**
**ఇప్పుడులో జీవిస్తూ మనం**
**ఈ నౌకను పట్టిన తుప్పుడు దులిపించి**
**పడవ చెక్కలకి అంటుకున్న**
**సున్నపు గుల్లలు దుల్లించి**
**తుప్పు దులిపించి**
**తుఫానులను జయించి**
**సూర్యకాంతికి సరుపంగా**
**దించి లంగరు,**
**నౌకాయాన ప్రయాణం**
**పెరిగిన గడ్డాల నాచు**
**సముద్రపు చెత్త**
**పరిహరించి పరిశుభ్రంగా స్నానం చేద్దాం**

మయకోవ్‌స్కీ
'వ్లదీమీర్ ఇల్యీచ్ లెనిన్' నుండి

# పోలవరం (ఇందిరాసాగర్) ప్రాజెక్ట్ మునక ప్రాంత ప్రజల పునరావాస అధ్యయన బృంద నివేదిక

*ఖమ్మం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇందిరాసాగర్ (పోలవరం ప్రాజెక్టు) ముంపు గ్రామాల నిర్వాసితుల స్థితిగతులను అధ్యయనం చేయటానికి ఆచార్య కె.ఆర్.చౌదరి (అగ్రికల్చర్ యూనివర్శిటీ, హైదరాబాద్), అమిత్ ఉపాధ్యాయ (రిసెర్చ్ స్కాలర్, సెంట్రల్ యూనివర్శిటీ, హైదరాబాద్), వి.నారాయణరెడ్డి (ఓపిడిఆర్, అడ్వకేట్, హైదరాబాద్), సి.భాస్కరరావు (ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)ల ఆధ్వర్యంలో వాస్తవ సేకరణ కమిటీ 2008 డిసెంబర్ 12-14 తేదీల్లో కొన్ని ముంపు గ్రామాలలో పర్యటించింది. కోయిద పంచాయితీలో 7 గ్రామాల, తుమ్మిలేరు పంచాయితీలో 5 గ్రామాల, బొజ్జరాయగూడెం పంచాయితీ రాజుపేట గ్రామాల ప్రజలనుకలిసి వాస్తవ సేకరణ బృందం వివరాలు సేకరించింది.*

*సి.భాస్కరరావు, వి.నారాయణరెడ్డి, జాన్‌బర్న్ బాస్‌చిమ్మి, జి.నరసింహారావులతో కూడిన ఓ.పి.డి.ఆర్ రాష్ట్ర కమిటీ నిజనిర్ధారణ బృందం 2009 జనవరి నెల 9,10,11 తేదీలలో పశ్చిమ గోదావరిజిల్లా పోలవరం మండలంలోని ఏజన్సీ గ్రామాలను తూర్పు గోదావరిజిల్లా దేవీపట్నం మండలంలోని ఏజన్సీ గ్రామాలను సందర్శించింది.*

కమిటీ జంగారెడ్డిగూడెం ఆర్.డి.ఓ.నూ, రంపచోడవరం సబ్ కలెక్టర్‌నూ, రాజమండ్రి లోని భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌నూ కలిసి సమాచారం తెలుసుకున్నది.

పోలవరం మండలంలో 26 గ్రామాలూ, దేవీపట్నం మండలంలో 37 గ్రామాలూ, ఇందిరాసాగర్ రిజర్వాయర్‌లో పూర్తిగా మునిగిపోతాయి. పోలవరం మండలంలోని 25 గ్రామాలకు నష్టపరిహారాన్ని చెల్లించినట్లుగా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఓ తెలియజేశారు. కొన్ని గిరిజన గ్రామాలలో మాత్రమే భూమికి-భూమి యిచ్చినట్లు చెప్పారు. దేవీపట్నం మండలానికి బాధ్యుడైన రంపచోడవరం సబ్‌కలెక్టర్ మాణిక్యరాజ్‌ను కలువగా, పునరావాసం గురించి తనకేమీ తెలియదనీ, ఐ.టి.డి.ఎ ప్రాజెక్ట్ ఆఫీసర్‌దే బాధ్యత అనీ తెలియజేశారు. భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కూడ అదేమాట చెప్పారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ సెలవుపై వెళ్లారు. అయితే ఐ.టి.డి.ఎ.పీ.ఓ ఒక్కసారి కూడా తమ గ్రామాలను సందర్శించి పునరావాస ప్యాకేజీ గురించి తమకేమీ తెలియజేయలేదనీ కొండమొదలు, మంటూరు పంచాయితీకి చెందిన 18 గ్రామాల ప్రజలు కమిటీకి ఆవేదనతో చెప్పారు.

వాస్తవ సేకరణ బృందంతో ఆయా గ్రామాల నిర్వాసితులు మాట్లాడుతూ డ్యామ్ కట్టడం తమకు సమ్మతం కాదనీ, తప్పని పరిస్థితుల్లోనే నష్టపరిహారాన్ని అంగీకరిస్తున్నామనీ, భూమికి భూమే కావాలనీ, నీటి పారుదల సౌకర్యంతో సాగులో వున్న భూమినే ఇవ్వాలనీ; 6.25 ఎకరాలకు మించివున్న భూమికి నష్టపరిహారం ఎకరాకు 3 లక్షలు ఇవ్వాలనీ; భూమిలేని వారికి కూడా కుటుంబానికి 2 ఎకరాల చొప్పున పునరావాసం క్రింద మాగాణి భూమి ఇవ్వాలని, ఒకే ఊరిలో వారందరికీ ఒకే చోట పునరావాసం కల్పించాలనీ; ఇళ్లస్థలాలు, వ్యవసాయ భూములు ఒకేచోట ఇవ్వాలనీ పశువుల పాకకోసం 5 సెంట్ల భూమి విడిగా కేటాయించాలనీ; పశువుల మేతకోసం ఊరుమ్మడి భూమి కేటాయించాలనీ; కొత్త ప్రాంతాలలో అన్ని సౌకర్యాలను సమకూర్చిన తర్వాతనే తమను గ్రామాల నుండి తరలించాలనీ; ఇప్పటికే భూమికి నష్టపరిహారం చెల్లించబడిన గిరిజనులను, ఐదు ఎకరాలలో వున్న గిరిజనేతరులను డ్యామ్ నీటివల్ల భూములు ముంపుకు లోనయ్యే వరకు ఆ భూములనుండి తొలగించకూడదనీ, గిరిజనేతరులవద్ద 5 ఎకరాలకు మించిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అదే గ్రామంలోని భూమిలేని గిరిజనుల సమష్టి అనుభవానికి దఖలు పర్చాలనీ-నిర్వాసితులు తమ సమస్యలను, నిర్దిష్ట ప్రతిపాదనలను, అభిప్రాయాలను వాస్తవసేకరణ బృందానికి వివరించారు.

అదే విధంగా ఈ కమిటీ పోలవరం మండలంలో తోటగొంది, మామిడిగొంది, దేవరగొంది, రామయ్యపేట, పైడిపాక గ్రామాలను సందర్శించింది. ఈ గ్రామస్థుల పునరావాసం కోసం కట్టుబడిలో ఉన్న కాలనీలను కూడా పరిశీలించింది.

దేవీపట్నం మండలంలో కొండమొదలు పంచాయితీలోని సోమాలపాడు, కత్తెనపల్లి, కొత్తగూడెం, కొక్కెరగూడెం, పెద్దగూడెం, మెట్టగూడెం, తాడివాడ, నడిపూరు, తెలివేరు, కొండమొదలు గ్రామాలనూ; మంటూరు పంచాయితీలోని మంటూరు, మడిపల్లి, పెనికెలపాడు, మూలపాడు గ్రామాలనూ, దేవీపట్నం, దండంగి, జి.రావిలంక, బోడిగూడెం గ్రామాలనూ సందర్శించి పునరావాసం అమలవుతున్న తీరు గురించి తెలుసుకున్నది. పెనికెలపాడు గ్రామస్తులకు భూమికి భూమి ఇస్తామని చూపించిన కన్నారం భూములను సందర్శించింది. అన్ని విషయాలనూ లోతుగా పరిశీలించిన పిమ్మట, ఆర్.అండ్.ఆర్.జి.ఓ. 68 అధ్యయనం చేసిన పిమ్మట కమిటీ క్రింద నిర్ధారణలకు వచ్చి, కొన్ని డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం ముందు పెట్టింది.

## నిర్ధారణలు

1. ఆర్.అండ్.ఆర్.జి.ఓ 68లోని ప్రవేశికలోని అంశాలకు అనుగుణంగా కార్యాచరణ జీ.ఓ.73 లేదు. ఉదాహరణకు, భూమిలేని వారికి కొత్తచోట ఏ మాత్రమూ భూమిగానీ, అడవిగానీ కేటాయించడం లేదు. ఇందువలన కొత్తచోట వారికి ఎలాంటి ఖచ్చితమైన జీవనాధారం లభించే అవకాశం లేదు. గిరిజన వ్యవసాయ కూలీలకు, ఒక్కో కుటుంబానికి కొత్త గృహ నిర్మాణంతో సహా మొత్తం మీద రూ. 1,70,200/- మాత్రమే చెల్లిస్తారు. కానీ ఒక్క ఇంటి నిర్మాణానికే ఒక్కో కుటుంబానికి రూ.2,50,000/- దాకా ఖర్చవుతున్నది. 5 సెంట్లు భూమి ఉన్న గిరిజన రైతుకు కొత్త చోట 5 సెంట్లు వ్యవసాయ భూమితో పాటు రూ. 1,20,000/- మాత్రమే చెల్లిస్తారు. దీనివలన ఇలాంటి కుటుంబం రూ.50,000/- నష్టపోతున్నది. ఈ ప్యాకేజీ గిరిజనులనూ అప్పుల్లో ముంచివేస్తున్నది.
2. గిరిజనులకు భూమికి భూమి ఇవ్వాలి, ఆ ఇచ్చే భూమి నీటి సౌకర్యం కలిగివుండి, వ్యవసాయ యోగ్యమైనదిగా ఉండాలి. కానీ వారికి కేటాయిస్తున్న భూమి రాళ్ళు రప్పలతో, చెట్ల పొదలతో నిండి ఉండటం, అనేకచోట్ల ఈ కమిటీ గమనించింది. ఈ వ్యవహారం జి.ఓ. 68, జి.ఓ.73లను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుంది. అంతేకాక డి-ఫారం పట్టా పొలాలకు కొత్త చోట పొలం యివ్వడం లేదు, నష్ట పరిహారంగా డబ్బు కూడా చెల్లించడం లేదు. ఇది పూర్తిగా అన్యాయమైన పద్ధతి.
3. వ్యవసాయానికి యోగ్యంకాని భూములు యివ్వడం వలన గిరిజనులు ఆ భూములను తిరస్కరించి, తమ పాత గ్రామాల్లోనే నివాసం ఉంటూ, తమ పాత భూములనే సాగు చేసుకొంటూ ఉన్నారు. కానీ దేవరగొంది, రామయ్యపేట గ్రామాలకు చెందిన భూముల్లో మట్టి దిబ్బలు పోసి, గుంటలు త్రవ్వి, సాగుకు వీలుకాకుండా చేశారు. ఇది అత్యంత అమానుషమైన చర్య. 2009 సీజన్ నుండి గ్రామాలను పోలీసుల సహాయంతో ఖాళీ చేయిస్తామని అధికారులు గ్రామస్తులను బెదిరిస్తున్నట్లుగా ప్రజలు ఈ కమిటీకి తెలియజేశారు. అయితే తాము ప్రాణాలనైనా యివ్వడానికి సిద్ధంగా ఉన్నాం కానీ; ఊరికి ఊరు, భూమికి భూమి, అడవికి అడవి, చెట్టుకు చెట్టు చూపించినప్పుడు మాత్రమే గ్రామాలను ఖాళీ చేస్తామని, ప్రజలు ఈ కమిటీ ముందు ప్రకటించారు.
4. గిరిజనేతర రైతులకు భూమికి భూమి కాకుండా, ఎకరా ఒకటికి రూ. 44,000/- నుంచీ, రూ. 1,50,000/- మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ డబ్బుతో బయట ప్రాంతంలో వారికి 50 సెంట్ల భూమి కూడా కొనగలిగే పరిస్థితి లేదు. ఇది పూర్తిగా అన్యాయమైన ప్యాకేజి.
5. పునరావాస ప్యాకేజీ ప్రకారం ఇంటి స్థలం క్రింద 5 సెంట్లు కేటాయించాలి. కానీ 4 సెంట్లకు మించి ఎక్కడా కేటాయించలేదు.
6. దేవీపట్నం మండలంలోని డి. రావిలంక గ్రామంలోని కుంజం సూరన్నదొర, కుంజం పోతన్నదొర, కుంజం వీరమ్మ, కుంజం లక్ష్మి, తుర్రం రామన్నదొర, మడి అప్పన్న దొర మొదలగు 11 కుటుంబాలకు తగాదాల్లో వున్న భూమి కేటాయించారు. ఇది ఐ.టి.డి.ఎ.పి.ఓ, ప్రజావ్యతిరేక వైఖరికి ఒక నిదర్శనం.
7. కన్నారం దగ్గర 70 ఎకరాల పనికి రాని భూమి అడ్డతీగల మండలంలోని వేటమామిడి, గంగవరం మండలంలోని 'వేమలోవ' గ్రామాల వద్ద గల మరో 70 ఎకరాల భూమిలోని పొదలను కొట్టివేసి, చదును చేసినందుకు రూ. 1,40,00,000/- (కోటి నలభై లక్షలు) ప్రభుత్వ ధనాన్ని వెచ్చించినట్లు ప్రజలు తెలియజేశారు. ఇది అధికార యంత్రాంగపు సొమ్ము స్వాహా చర్యలకు తిరుగులేని నిదర్శనం.

## డిమాండ్స్

1. రాళ్ళు-రప్పలు, పొదలతో కూడిన భూమిని కాకుండా పూర్తిగా నీటి పారుదలతో కూడిన వ్యవసాయ యోగ్యమైన భూమిని గిరిజనులందరికీ-గిరిజన రైతులకూ, గిరిజన రైతు కూలీలకూ ఒక్కొక్క కుటుంబానికి రెండున్నర ఎకరాలకు తగ్గకుండా, వారికి ప్రస్తుతం ఎంత భూమి ఉందో అంత భూమి కేటాయించాలి. కొత్త ప్రాంతంలో వారు వ్యవసాయంలో నిలదొక్కుకోవడానికి సంవత్సరానికి రూ.1,00,000/- చొప్పున, 5 సంవత్సరాలపాటు ప్రతి కుటుంబానికీ చెల్లించాలి.
2. గిరిజనేతర రైతుల నీటి సౌకర్యంగల భూమికి ఎకరా ఒకటికి రూ.4,00,000/- తగ్గకుండా నష్ట పరిహారం చెల్లించాలి. వ్యవసాయ కూలీలకు మైదాన ప్రాంతంలో ఒక ఎకరా మాగాణి భూమి కేటాయించాలి.
3. గిరిజన, గిరిజనేతర ప్రజానీకం అందరికీ ఇంటి స్థలం కోసం ఒక్కో కుటుంబానికి 5 సెంట్లు చొప్పున, పశువుల చావిడికి 3 సెంట్లు చొప్పున భూమి కేటాయించాలి. ఇంటి నిర్మాణానికి రూ.3,00,000/- చొప్పున, పశువుల పాక నిర్మాణానికి రూ.50,000/- చొప్పున ప్రతి కుటుంబానికీ చెల్లించాలి.
4. ఆర్.అండ్.ఆర్ జి.ఓలకు విరుద్ధంగా రాళ్ళు, రప్పలతో కూడిన భూమి కేటాయించిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.
5. రూ. కోటి 40 లక్షల కుంభకోణానికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

నివేదిక

# 'తెలంగాణా రైతాంగ జీవనాధారాలు తోడివేస్తున్న పాలకులు'

*(రైతుకూలీసంఘం(ఆం.ప్ర), ఏపిఎఫ్‌టియు, నవయువ సమాఖ్యల రాష్ట్ర ప్రతినిధి బృందం 2009 మే నెల 7,8,9 తేదీలలో మెదక్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలు పర్యటించి, ఆత్మహత్యల పాలిటబడిన రైతుకుటుంబాలను, పంటలు ఎండిపోయిన గ్రామాలను, పంటల కొనుగోళ్ళ కొరకు ఆందోళన చేసిన గ్రామాల రైతుకుటుంబాలను, పెద్దలను కలిసారు. మార్కెట్ యార్డులను సందర్శించారు. వారి పరిశీలనా నివేదిక ఇది.)*

వేసవి వేడితో, రాష్ట్రం అల్లాడిపోతూ వేడి పెరిగిపోయిన వాతావరణంలో, ఉపరితలంలో వచ్చిన మార్పుల కారణంగా, పిడుగులతో కూడిన వర్షాలు, పెనుగాలులతో కలసి వచ్చిన వర్షాలు, వడగళ్ళ వానలు ప్రజలను అతలా కుతలం చేశాయి. పండిన పంటలను, కళ్ళాల్లోని ధాన్యపు రాశులను, అమ్మకానికి వచ్చిన మార్కెట్‌లలోని ధాన్యం కుప్పలను తడిపి రైతులను, వ్యవసాయదారులను కకా వికలు చేసాయి.

**1**

మెదక్‌జిల్లా పశ్చిమభాగం నీటి కొరతతో అల్లాడిపోతున్నది. తూర్పు భాగంలో విద్యుత్ తగినంతగా అందకపోవటంతో రైతాంగం, బావులలోని నీటిని తోడిపోసుకోలేకపోయారు. విద్యుత్ సరఫరాలో ఎగుడు దిగుడుల కారణంగా వేల రూపాయలను ఖర్చుపెట్టి ఏర్పరచుకొన్న మోటార్‌లు తగలబడిపోయి నష్టపోయారు. నెలకు పైగా నీటిని అందించినా తడిని యివ్వనందువలన పొలంలోని పంట ఎండిపోవడంతో, అప్పులు పేరుకుపోయి, శ్రమను కోల్పోయి తీవ్రమైన వ్యధకు లోనవుతున్నారు. ఆత్మహత్యల పాలవుతున్నారు.

(1) చినశంకరపేట మండలం బాగర్దిపల్లి గ్రామవాసి, పేదరైతు, కష్టజీవి యాదగిరి ఏడాది పొడుగునా, రోజంతా పొలాన్ని అంటిపెట్టుకొని శ్రమచేస్తూ, రెండు ఎకరాల వ్యవసాయం సాగించుకుంటున్నాడు. గత కొలది సంవత్సరాలుగా పొద్దుతిరుగుడు పువ్వు, చెరకు సాగుచేస్తున్నాడు. ఈ పంటల వ్యవసాయానికి 3 రూపాయల వడ్డీతో లక్షాఎనభై వేల రూపాయలపైగా ప్రైవేట్ అప్పు చేశాడు. బ్యాంక్‌లో అరువది వేల రూపాయలు అప్పుజేశాడు. అప్పుల బాధను తట్టుకోలేని యాదగిరి పురుగుమందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు.

సరిగ్గా ఏడాదిక్రితం ఇవే సమస్య లతో తండ్రి బలవన్మరణానికి ప్రయత్నిం చగా, గమనించిన తోటి రైతులు వైద్యశాలకు తీసుకొని వెళ్ళి ఆ తండ్రి ప్రాణాలు కాపాడారు. కానీ కొడుకును కాపాడే అవకాశమే లేకపోయింది.

పంటను పండించి మార్కెట్ చేసి, ఋణ బాధను తప్పించే బాధ్యతను తండ్రి నుండి తీసుకొన్న కుమారుడు యాదగిరి ప్రాణాన్ని ఋణబంధాలు యమపాశాలై తీసుకొని పోయాయి. మే 6న యాదగిరి ప్రాణం అనంతవాయువులలో కలిసిపోయింది. భూమికి నీటిని అందించలేకపోవటం, తడులు లేనందువలన పంటలు దిగుబడులు లేకపోవటం, మార్కెట్ లేకపోవటం, పెట్టుబడులకు, శ్రమకు తగిన ఆదాయాలు లేకపోవటం, అప్పులు తీరకపోవటమూ ఈ విషాదానికి కారణాలుగా వున్నాయి.

(2) దౌలతాబాద్ మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన కొల్లూరి నర్సింహారెడ్డి మూడు లక్షల రూపాయల ప్రైవేట్ అప్పులు, పదిహేను వేల రూపాయల బ్యాంక్ అప్పులతో వ్యవసాయం సాగించుతున్నాడు. ఈ ఏడాది రెండున్నర ఎకరాలలో వరి పంట వేశాడు. విద్యుత్ సరఫరా సరిగ్గా లేనందువలన తడికి నీరు అందించలేక పెరుగుతున్న వరి పంటను వదులుకోవాల్సి వచ్చింది. వరి ఎండిపోయింది. గత కొన్ని సంవత్సరాలుగా బంధువులు ఇచ్చిన సహాయంతో కుటుంబాన్ని అస్తుబిస్తుగా పోషించుకుంటున్న ఈ రైతు నర్సింహారెడ్డి ఇక అప్పుల బాధ పడలేక ఏప్రిల్ 27న తన ప్రాణాలను బలిపెట్టాడు.

(3) మెదక్ మండలం ఔరంగాబాద్ గ్రామం పొలాలలోని రైతులందరి వరి పంట ఎండిపోయింది. అక్కడి రైతులు, వ్యవసాయదారులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు అందరూ వ్యవసాయశాఖాధికారులతో, విద్యుత్ అధికారులతో, రెవిన్యూ అధికారులతో తమ మొరను ఆలకించమని వేడుకున్నారు.

అయినా రోజుల తరబడి నీటి తడి అందనందువలన పంట ఎండిపోయింది. అప్పులు తెచ్చి, పెట్టిన పెట్టుబడులు పోయి, చేసిన శ్రమ వృధా అయిపోయి, తిండికి కూడా ధాన్యం ఇంటికి చేరని పరిస్థితులలో రైతులు తీవ్రమైన మనోవ్యధకు లోనయ్యారు. పంచాయితీ సభ్యుడు, రైతు నాగరాజు తీవ్రమైన ఆవేదనతో తన పంటను తానే అంటపెట్టుకున్నాడు. ఈ రైతు నాగరాజు ఈ ఏడాది 6 ఎకరాలలో లక్ష రూపాయలపైగా (శ్రమ కాకుండా) పెట్టిన ద్రవ్య పెట్టుబడిని కోల్పోయాడు. ఊరు ఊరంతా పంటలను కోల్పోయి పెట్టుబడులను నష్టపోయారు.

**చేసిన శ్రమకు ఫలితం లేదు. సేద్యపు ఖర్చులు తిరిగి రావు. ఏటేటా చేసిన అప్పులు పెరిగి బలిపాశాలై మెడకు బిగిసుకుంటున్నాయి. అయినప్పటికీ అధికార యంత్రాంగం, ఏలినవారిలో కదలిక లేదు. అధికారులలో స్పందన లేదు.**

రాజకీయ నాయకులుగా చెలామణి అవుతూ పెద్దలు, పెత్తందారులు బ్యాంకుల నుండి తాము తీసుకున్న ఋణాలను

తీర్చకుండా ఏళ్ళ తరబడి వాయిదాలు పడుతున్నా ఏమీ చేయని అధికార యంత్రాంగం సాధారణ రైతుల నుండి, వ్యవసాయదారుల నుండి ఋణాల వసూలుకు అధికార యంత్రాంగాన్ని వినియోగించి, చావో బ్రతుకో అన్న స్థితిలోకి నెట్టడం ఘోరమైన పక్షపాతం, అన్యాయం. ఈ పరిస్థితి నుండి రైతాంగం విముక్తి కావడానికి ఈ చర్యలు తీసుకోవాలి.

1. మెదక్ జిల్లాలోని బావుల క్రింద వ్యవసాయం చేస్తున్న పేదరైతుల, సాధారణ వ్యవసాయదారుల బ్యాంక్ బాకీలు, ప్రైవేట్ అప్పులు అన్నింటినీ రద్దు చేయాలి.

2. వ్యవసాయం కనెక్షన్లన్నింటికి ఈ ఏడాదికి విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలి.

3. వ్యవసాయం కొరకు రైతులు కోరుతున్న విద్యుత్ కనెక్షన్లన్నింటిని వెంటనే ఇచ్చి తగినట్లుగా ఫీడర్లను, ట్రాన్స్‌మిషన్ సెంటర్లను, గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్లను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి.

## 2

తాను నడుస్తున్న భూమిపైనున్న ఎత్తు పల్లాలను, సాగుతున్న బాటలో వున్న ముళ్ళ పొదలను సరి చేసుకుంటూ విషపురుగులను తట్టుకుంటూ నెత్తిపైనున్న ఆకాశం నుండి వచ్చే వేడి దహించి వేస్తోందో, పిడుగులు పడి ప్రాణాలను హరించి వేస్తాయో గణించ కుండానే ఆరుగాలం భూమిని అంటి పెట్టు కొని వ్యవసాయం చేస్తున్న రైతుల, వ్యవసాయ దారుల పరిస్థితి మెదక్‌జిల్లాలో పై విధంగా ఉంటే కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్లగొండజిల్లాల్లో పంటలు పండించిన రైతాంగం తమ పంటలను మార్కెట్ యార్డులకు తెచ్చి మరో రకపు అవస్థలను అనుభవించుతున్నారు.

**మాడ్చివేస్తున్న ఎండలు, అకస్మాత్తుగా పిడుగులు, పెనుగాలులతో మీద పడుతున్న వర్షాలకు అల్లాడుతున్న రైతులు, వ్యవసాయదారులు తమ పంటను వెంటనే కొనుగోలు చేయమని ప్రభుత్వాన్ని కోరుతూ ఆందోళన చేస్తున్నారు.**

హైద్రాబాద్-కరీంనగర్ జాతీయ రహదారిపై వున్న రేణిగుంట గ్రామవాసులు, మహిళలు ఆందోళనకు దిగితే ప్రభుత్వ అధికార వర్గం- మానవత్వం, బాధ్యతలను వదిలివేసి ప్రజలపై లాఠీలను ప్రయోగించి వీపులను వాయగొట్టారు. కాళ్ళు చేతులను విరగగొట్టారు. అయినా రైతులు, వ్యవసాయ దారులు ఆందోళనను వీడడం లేదు. జిల్లా కేంద్రమైన కరీంనగర్‌లోని మార్కెట్ యార్డు దగ్గర బైఠాయింపు జరిపి ఆందోళన సాగించు తున్నారు..

కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పెద్ద మార్కెట్‌యార్డు అయిన జమ్మికుంటలో రైతులు తమ ఇంటిని, భూమిని, కుటుంబాన్ని వదిలి తెచ్చిన పంటను ఆరుబయట పోసి ముడ్డి, ముఖం కడుక్కోకుండా 15 రోజుల నుండి 20 రోజుల వరకు (తమ సరుకును అమ్ముకొనటానికి) పడిగాపులు కాయాల్సి వస్తున్నది. సరుకు అమ్ముడు పోవటం లేదు. గిట్టుబాటు రేటుగాని, మద్దతు ధరగాని రావటం లేదు. కాని, మద్దతు ధర కంటే తక్కువగా క్వింటాలు 830 రూపాయలకే రైతుల నుండి ధాన్యాన్ని కొంటున్నారు. క్వింటాలుకు 60 కిలోలకు పైగా బియ్యం వస్తాయి. మార్కెట్‌లో బియ్యం ధర కిలోకు 32 రూపాయలు కంటే ఎక్కువగానే వున్నది. కానీ మరి రైతు పంటకు ధర లేదు.

అమ్మకం జరగటం ఒక వంతయితే తూకాలు జరిగి, రసీదులు పొందటం రైతుకు మరింత కష్టంగా మారింది. సమాజానికి తిండి గింజలను అందిస్తున్న రైతుకు- మార్కెట్ యార్డుకు తెచ్చిగాని, మరో రకంగా గాని ధాన్యాన్ని, పంటని అమ్ముకొనటం బహుదుఃఖంగా మారింది.

**ఈ నాలుగు జిల్లాల్లో తక్షణం తీసుకోవలసిన చర్యలు:**

1. కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, నల్గొండ జిల్లాలలో రైతాంగం పండించిన పంటలన్నింటినీ యార్డుకు తెచ్చిన మూడు రోజుల లోపల కొనుగోళ్ళనంతటిని పూర్తి చేసి, తూకాలు జరిపి, చెల్లింపులు చేయాలి.

2. మే 31 లోపల తెలంగాణ జిల్లాల్లోని పంటలన్నింటి మార్కెటింగ్‌ను అధికార యంత్రాంగం పూర్తి చేయాలి.

3. యార్డులన్నింటి వద్ద రైతులకు, వాళ్ళ ఎడ్ల బండ్లు నిలుపుకోవటానికి తగు వసతి, సదుపాయాలు కల్పించాలి.

పాలకవర్గాలు, పాలకులు మరియు పాలనా యంత్రాంగం-వ్యవసాయాన్ని, రైతు సాంప్రదాయక పద్ధతుల నుండి దూరంచేసి ద్రవ్య పెట్టుబడికి, రసాయనిక ఎరువుల, పురుగుమందుల వాడకానికి, స్వేచ్ఛా మార్కెట్టుకూ ముడిపెట్టారు.

దీని ఫలితంగా......

తన భూమిలో వ్యవసాయం చేయటానికి రైతుకు బ్యాంకులు అప్పులు ఇవ్వవు, ప్రైవేట్ అప్పులు చేసుకోవాల్సిందే. మంచి విత్తనాలు దొరుకుతాయన్న గ్యారంటీ లేని మార్కెట్‌లో కల్తీ విత్తనాలు తెచ్చుకోవాల్సిందే. గ్యారంటీ యివ్వని మార్కెట్ నుండి తెచ్చిన కల్తీ ఎరువు లను, పురుగుమందులను వాడి వాటి పంటను, సాగు ఖర్చును నష్టపోవాల్సిందే రైతు కుటుంబం యొక్క శ్రమను గణించకుండా, భూమి విలువలను గణించకుండా వ్యవ సాయానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం తక్కువగా లెక్క వేస్తున్నపుడు వచ్చే లోటును, నష్టాలను రైతాంగం భరించాల్సిందే. పాలన సాగించు తున్న మంత్రులు, యార్డులను నిర్వహించు తున్న వారి సహచర రాజకీయ నాయకులు, నిరంకుశాధికారులు, బడా వ్యాపారస్తులతో కూటమి కట్టి కనీస మద్ధతు ధర పంటకు సమకూరకుండా మార్కెటింగ్ విషవలయాన్ని సృష్టించితే అందులో పడి రైతాంగం తమ పంటలను అయినకాడికి అమ్ముకోవల్సిందే. వచ్చిన కాడికి డబ్బు తీసుకొని వెళ్ళి తమ శ్రమ తమకు కాకుండా పోయిందని, ఖర్చులు కూడా తిరిగి రాలేదని ఇంటివద్ద కుటుంబమంతా కలిసి దుఃఖిం చాల్సిందే; ఏటేటా నష్టాలు పొందుతూ, అప్పులు పెరుగుతూ ముందు నగలు, నత్రా ఆపై ఎడ్లూ, ఆపై పరికరాలు, ఆపై ఇండ్లు, ఆపై వ్యవసాయ **(తరువాయి 110వ పేజీలో)**

**నివేదిక**

# బాక్సైట్ తవ్వకాలకు, తరలింపుకు ఆరాటపడుతున్న పరాధీన పాలకులు

*ఆర్.పి.ఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మరియు హైకోర్టు సీనియర్ న్యాయవాది బొజ్జా తారకం, సిపిఐ(ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ గుర్రం విజయకుమార్, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥కోటయ్య, ఏపిఎఫ్టియు విజయనగరం జిల్లా నాయకులు కా॥ శంకరరావు, ఆర్.పి.ఐ నాయకుడు సూర్యనారాయణ, ఏపిఎఫ్టియు రాష్ట్ర నాయకులు కా॥ఆదారి అప్పారావు, వాన్పిక్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కా॥శంకర్‌లతో కూడిన కమిటీ అనంతగిరి మండలంలో 18.6.09న పర్యటించింది. స్థానిక గిరిజనులతో మాట్లాడి ఆ వివరాలు వెల్లడి చేసింది.*

విశాఖ ఏజెన్సీలో సుమారు ఏడువేల ఐదు వందల మిలియన్ టన్నుల బాక్సైట్ ఖనిజ నిల్వలున్నాయి. వీటిపై కన్నేసిన సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు వీటిని త్రవ్వి తీయడానికి గత ప్రభుత్వం ద్వారా రెండేళ్ళుగా ప్రయత్నం చేశాయి. ప్రజల ప్రతిఘటనతో తాత్కాలికంగా త్రవ్వకాలను నిలిపివేసినా; తిరిగి రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ పాలనాధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా తిరిగి బాక్సైట్ త్రవ్వకాలకు అనుమతి మంజూరు చేసింది.

రెండు బహుళజాతి కంపెనీలైన జిందాల్, దుబాయ్‌కి చెందిన రస్ ఆల్ ఖైమాలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు పై కంపెనీలకు బాక్సైట్ నిక్షేపాలు తవ్వడానికి, ఇందుకు సంబంధించిన పరిశ్రమల స్థాపనకు గత ప్రభుత్వ హయాంలోనే పనులు ప్రారంభమయ్యాయి. బాక్సైట్ నిల్వలను తవ్వితీసి, బయటకు రవాణా చేసే పనిని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. ఇందులో భాగంగా విశాఖజిల్లా మాకవరపాలెంలో రస్ ఆల్ ఖైమాకు బాక్సైట్ శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకోసం ఈ ప్రాంతంలో 2,351 ఎకరాలను ప్రభుత్వం సేకరించి కంపెనీకి అప్పగించింది. ప్రస్తుతం ఈ కంపెనీ పనులు చకచకా సాగుతున్నాయి.

సార్వత్రిక ఎన్నికలు రావడంతో బాక్సైట్ నిక్షేపాల తవ్వకాలను కేంద్రప్రభుత్వం వాయిదా వేసింది. అప్పటికే అటవీశాఖ తప్ప మిగిలిన అన్నిశాఖల అనుమతులూ రస్ ఆల్ ఖైమా సంస్థకు వచ్చేసాయి. అటవీశాఖ అనుమతి వచ్చిన వెంటనే బాక్సైట్ త్రవ్వకాలకు ఆ సంస్థ సిద్ధంగా వుంది. ఎన్నికల్లో తిరిగి అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం నిక్షేపాల తవ్వకాలకు త్వరితంగా చర్యలు చేపట్టినట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో మన్యంలోని పరిస్థితులను, అక్కడి ప్రజల మనోభావాలను తెలుసుకోవడానికి నిజనిర్ధారణ కమిటీ 18.6.2009న అనంతగిరి మండలం బీస్‌పురం తదితర గ్రామాలను సందర్శించింది.

అనంతగిరి మండలంలో బీస్పుర గ్రామానికి ఆనుకొని వున్న రక్తకొండ, గాలికొండలలో బాక్సైట్ నిక్షేపాలున్నట్లు కనుగొన్నారని; ఇంకా గుండా జర్రెల, సప్పర్ల, గూడెం, చిట్టెలగొంది కొండలను పూర్తిగా తొలగిస్తామంటున్నారని, అలా చేస్తే పరిసర ప్రాంతాలలోని వందలాది గ్రామాలు నివాస యోగ్యం కాకుండా పోతాయని అక్కడి ప్రజలు వివరించారు.

త్రవ్విన ఖనిజాన్ని నేరుగా రిఫైనరీ నిర్మించే బొడ్డవర, కిత్తంపాలెం ఏరియాకు చేరడానికి కన్వేయర్ బెల్టు వేస్తామంటున్నారని, దానివల్లే ఈ ప్రాంతం మొత్తం ధూళి, దుమ్ముతో నిండిపోతుందని చెప్పారు. బొడ్డవర ప్రాంతంలో రిఫైనరీ నిర్మాణం కోసం రైతుల నుండి బలవంతంగా భూములు సేకరించే పని పూర్తి చేసారని చెప్పారు. ఈ తవ్వకాల వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు భూగర్భ జలాలు ఎండిపోతాయని, విజయనగరం జిల్లాకు సాగునీరు అందించే గోస్తనీ ఎండిపోతుందని, తాటిపూడి రిజర్వాయరు నీరు విశాఖకు త్రాగునీటిని అందిస్తున్నదని, అది కూడా కలుషితమవుతుందని, అయినా పట్టించుకోని పాలకులు మెరుగైన నష్టపరిహారం చెల్లిస్తామని, ఉద్యోగాలిస్తామని ఆశపెడుతూ కొంతమందిని లోబరుచుకుంటున్నారని ప్రజలు వాపోయారు. న్యాయమైన పునరావాసం, నష్టపరిహారం కోసం మీకు అండగా మేముంటామని కొన్ని పార్టీల వాళ్ళు వచ్చారని, త్రవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడతామని, తమది విప్లవ పార్టీ అని మరి కొందరు వచ్చారని, మీటింగు పెట్టి పాటలు పాడి వెళ్ళారని, మరలా కనిపించలేదని, ఎవరిని నమ్మాలో తెలియడంలేదని నిర్వేదంగా అన్నారు. బాక్సైట్ త్రవ్వకాలకు వ్యతిరేకంగా మీరంతా ఐక్యంగా నిలబడతారా–లేక మీకు ఇళ్ళు కట్టిస్తాము, నష్టపరిహారం ఇస్తామంటే తీసుకుంటారా అని కమిటీ సభ్యులు ప్రశ్నించినపుడు, ఇప్పటికంటే మెరుగైన జీవన పరిస్థితి కల్పిస్తామంటే ఒప్పుకుంటామన్నారు. ఐతే ముందు ఒప్పించి తర్వాత మాట నిలుపుకుంటారన్న నమ్మకం లేదని కూడా అన్నారు.

పాలకులు సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం దేశ ప్రజల జీవితాలను బలి చేయడానికి పూనుకుంటున్నారని, బాక్సైట్ తవ్వకాల వల్ల గిరిజనుల జీవితాలే కాకుండా పర్యావరణం విధ్వంసం కూడా జరుగుతుందని, నదులు ఎండిపోతాయని, దీనివల్ల ఒక్క తవ్వకాలు జరిగే ప్రాంత ప్రజానీకానికే కాకుండా విశాఖ, విజయనగరం పట్టణవాసులకు త్రాగడానికి మంచి

నీళ్ళు కూడా దొరకని దుర్భరమైన పరిస్థితి ఏర్పడుతుందని, అందువల్ల పట్టణ ప్రజానీకం కూడా తవ్వకాలకు వ్యతిరేకంగా గిరిజనులు చేపట్టే పోరాటాలలో పాలు పంచుకోవాలని, ఐక్య ఉద్యమ నిర్మాణం ద్వారా పాలకుల విధానాలపై పోరాటం సాగించాలని, తమ పార్టీ అయిన ఆర్.పి.ఐ ఈ పోరాటంలో భాగస్వామిగా వుండి పోరాటంలో పాలు పంచుకుంటుందని బొజ్జా తారకం తెలియ జేశారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ త్రవ్వకాల వల్ల 3 మండలాల్లో 247 గ్రామాలు, 9,312 ఆవాసాలకు ముప్పు ఏర్పడనుందని, సుమారు 50వేలమంది నిర్వాసితులౌతారని, పాలకుల విధానాల వలన ఈ ఒక్క ప్రాంతానికి మాత్రమే జరుగుతున్న ముప్పు కాదని; విజయనగరం, విశాఖపట్నంలకు సాగునీరు, తాగునీరు అందించే గోస్తనీ, తాటిపూడి, శారద తదితర నదులు ఎండిపోతాయని; అందువల్ల బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలతోపాటు, పట్టణాల, మైదాన ప్రాంతాల ప్రజలందరు సమష్టిగా ఈ తవ్వకాలను అడ్డుకోవడానికి నడుం బిగించాలని విజయకుమార్ విజ్ఞప్తి చేశారు.

పునరావాసం పేరుతో మెరుగైన నష్టపరిహారం అందజేస్తామని మభ్యపెట్టి ప్రజలను వంచించే కళలో పాలకులు ఆరితేరారని, వారి బూటకపు వాగ్ధానాలను నమ్మవద్దనీ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలోనూ ప్రభుత్వం ప్రజలను వంచనకు గురి చేస్తున్నదని, నిజానికి పోలవరం ప్రాజెక్టు వల్ల రైతాంగానికి సాగునీరు లభ్యం కాదని; పోలవరం ప్రాజెక్టు ప్రధానంగా జలరవాణా కోసం, కారుచౌకగా ఖనిజసంపదను తరలించుకుపోవడానికి ఉద్దేశించి కాలవల నిర్మాణం, ప్రాజెక్టు రూపకల్పన చేసారని; బాధిత ప్రజలంతా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఈ పోరాటాలకు అండగా వుంటుందని కా॥ కోటయ్య తెలియ జేశారు.

బాక్సైట్ నిక్షేపాలు సువిశాలమైన విశాఖజిల్లా అటవీ ప్రాంతమంతా విస్తరించి వున్నాయి. అరకు, అనంతగిరి, పాడేరు, చింతపల్లి, జి.కె.వీధి ప్రాంతం, రక్తకొండ, గాలికొండ, చిట్టింగొంది, కాటంరాజు, సప్పర్ల, జెర్రిలకొండ, గురుకురాయికొండల్లో నిక్షిప్తమై వున్నాయి. దేశప్రజల జీవిత భద్రతను, పర్యావరణాన్ని ధ్వంసం చేసే పాలకుల విధానాలపై ప్రజలంతా ప్రతిఘటించి పోరాడినప్పుడే మన ఖనిజ సంపద, మన అడవులను కాపాడుకోగలుగుతారని నివేదిక వివరించింది.

**(108వ పేజీ తరువాయి)**

భూములు కోల్పోయి వీధిన పడాల్సిందే. విదేశీ సామ్రాజ్యవాద, బహుళజాతి దోపిడీ దారులు, దేశంలోని దళారీ బూర్జువాలు, భూస్వామ్య పెత్తందారీ వర్గాలు కలిసి చేస్తున్న ఈ దోపిడీ నుంచి భారత ప్రజలు విముక్తులు కావలసి ఉంది. అందుకు

దున్నేవానికే భూమి-సాగుచేస్తున్న రైతులందరి భూమికి (పరాయికరణ నుండి) భద్రత కల్పించాలి.

- వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, గిట్టుబాటు రేట్లు, మార్కెటింగ్ గ్యారంటీలు ప్రభుత్వం కల్పించాలి.
- బావులు, ఎత్తిపోతల నుండి నీరు తోడటం కొరకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చి విద్యుత్‌ను సరఫరా చేయాలి.
- మెదక్‌జిల్లా వ్యవసాయదారులు కోల్పోయిన పంటలకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలి.
- తెలంగాణాలోని అన్ని జిల్లాలలో మార్కెట్‌కు వస్తున్న పంటలన్నింటిని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయించాలి.

# జెండా

డా॥బి.సూర్యసాగర్

**అందులో గొప్పేమీ లేదు**
**గాల్లో**
**ఏ జెండా అయినా ఎగురుతుంది**
**త్రివర్ణమైనా కాషాయమైనా**
**మరేదైనా కాని**
**జెండా గుండెల్లో మండాలి**
**బతుకు సమస్యల**
**ఎజెండాతో ఎగరాలి**
**చెట్టులా మట్టి నుంచి ఎదగాలి**
**కుల మతాల**
**శవసంస్కృతిపై**
**సమాధిలా లేవాలి**
**పీడకులను ధ్వంసించే**
**ధ్యేయంగా సాగాలి**
**ఒక త్యాగాన్ని భరించాలి**
**ఒక యుగాన్ని జయించాలి**
**ఉద్యమానికి వందనం జెండా**
**సదాశయాల ఆవేశం**
**అవ్యవస్థకు చికిత్సా లేజర్**
**అవకాశవాదానికి నీడనివ్వని**
**మధ్యాహ్నపుటెండ**
**వర్గ దృష్టిని సానబెట్టే ఆకురాయి**
**అణచివేత బండరాళ్ళ కింద**
**నలిగి నిలిచిన**
**పోరాటం ఊపిరి**
**అశాంతికీ ప్రశాంతికీ మధ్య**
**పరచుకున్న**
**అలజడి డప్పుల చప్పుడు**
**జెండా నెగురవేసేవాడు**
**జెండా లాగే నిలవగలగాలి**

నివేదిక

# బళ్ళారి విమానాశ్రయ భూసేకరణపై నిజనిర్ధారణ కమిటీ నివేదిక

*కర్ణాటక-బళ్ళారి దగ్గర తలపెట్టిన విమానా(శయం ఏర్పాటు భూసేకరణ బాధిత ప్రజల సమస్యలు, ప్రజా ఉద్యమాలు తదితర అంశాలపై రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రజాసంఘాల ప్రతినిధులు, సవివరమైన, నిష్పాక్షిక అధ్యయనం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానికనుగుణంగా ఈ క్రింద తెలిపిన సభ్యులతో నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశారు.*

*1. ప్రొ॥కె.ఆర్.చౌదరి, ప్రఖ్యాత వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త 2. కె.కోటయ్య, ఎఐకెమ్కెఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు; 3. సి. పెద్దన్న, ఏపిఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు 4. రాజు, ఏపిఎఫ్టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు 5. తిమ్మారెడ్డి, రైతుకూలీసంఘం అనంతపురం జిల్లా కమిటీ అధ్యక్షులు*

*2010 ఫిబ్రవరి 9న, బళ్ళారి తాలూకా చాగనూర్, సిరివార్ గ్రామ భూ పరిసరాలను సందర్శించి బాధిత గ్రామ ప్రజలను కమిటీ కలిసింది. ఈ కమిటీకి*

*1. హరిశ్చంద్రారెడ్డి, మాజీ వ్యవసాయ ఉపసంచాలకులు, (కర్ణాటక) 2. పన్నారాజ్, సిఐ 3. డా॥అరవింద్ పాటిల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎమ్ఎ) అధ్యక్షులు 4. ఎ.తిమ్మన, రజాక్సాబ్ మరికొందరు సమాజ సేవకులు సహాయపడ్డారు.*

ప్రతిపాదిత విమానా(శయం వలన ఏర్పడబోవు సమస్యల గురించి, చిక్కుముళ్ళ గురించి చాలామంది రైతులు, వ్యవసాయ కూలీలు, బాధిత గ్రామ ప్రజలతో వివరణాత్మ కంగా చర్చించడం జరిగింది. ప్రతిపాదిత విమానా(శయానికి వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంలో నిస్వార్ధంగా పనిచేస్తూ పోరాడు తున్న మల్లిఖార్జునరెడ్డి(అడ్వకేట్)తో కూడా చర్చించటం జరిగింది. ప్రతిపాదిత ప్రాంతంలో భూసేకరణకు సంబంధించిన అధికారక మరియు ఇతర పత్రాలను పరిశీలించడం జరిగింది. వివిధ మార్గాల ద్వారా అందరి భాగస్వామ్యంతో ఈ నివేదిక తయారుచేయడం జరిగింది. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కలవడానికి చేసిన ప్రయత్నం వృధా ప్రయాసే అయ్యింది. ప్రధాన మైన అంశాలను ఈ క్రింద పొందుపరచడ మైనది.

### బళ్ళారికి సమీపంలో 3వ విమానా(శయం అవసరం లేదు

ఇదివరకే 2 విమానా(శయాలు-ఒకటి తోరంగళ్, రెండవది బళ్ళారిలలో ఉన్నాయి. జిల్లాలో ప్రయాణీకుల రాకపోకలు చాలా తక్కువగా ఉన్నాయి. 40 సీట్ల సామర్థ్యంతో ఉన్న విమానాలు తోరంగళ్ విమానా(శయం నుండి నడుపబడుతున్నాయి. ప్రయాణీకుల భర్తీ 30 కంటే ఎక్కువగా ఎప్పుడూ లేదు. ఈ కారణం చేతే ఇక్కడ నుంచి విమానాలు నడుపుట లేదు. బళ్ళారి-బెంగుళూరు, హైదరాబాద్కు సమాన దూరంలో వుండటం వలన ఇంకొక విమానా(శయం అవసరం లేదు. ఈ విమానా(శయం ఏర్పాటు వలన రైతులు, కూలీలు మొదలగు వారి జీవితాల పైన తీవ్రమైన ప్రభావం పడుతుంది. బాధిత గ్రామాలైన చాగనూరు, సిరివార్ ప్రజల పైనే కాకుండా వాటికి దిగువ భాగాన వున్న భూములపై కూడా ప్రభావం వుంటుంది. అసలే అంతంత మాత్రమే వున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుంది. అందు వలన 3వ విమానా(శయం అవసరం లేదన్న ప్రజల అభిప్రాయంతో ఈ కమిటీ ఏకీభవి స్తున్నది.

### బాధిత గ్రామాల భూములు-వ్యవసాయం

విమానా(శయం ఏర్పాటు చేసే చాగనూర్, సిరివార్ గ్రామ భూములను కమిటీ పరిశీలించడం జరిగింది. అధిక పోషకాలతో ఉన్న సారవంతమైన నల్లరేగడి భూములను చూసి కమిటీ సభ్యులు ఆశ్చర్యపోయారు. ఈ భూములు ఎటువంటి వ్యవసాయ పంటలను పండించడానికైనా అనుకూలంగా ఉంటాయి. ఈ భూములు తుంగభద్ర ఆనకట్ట నుండి కాలువల ద్వారా నీటివసతి కూడా కలిగి వున్నవి. వేదావతి నది నుండి ఎత్తిపోతల పథకం ద్వారా, పైపు లైన్ల ద్వారా కూడా నీటి వసతి కల్పించ బడుతున్నది. అన్నిరకాల ఆహార పంటలు, కూరగాయలు, వ్యాపార పంటలైన పత్తి, మిరప, నూనెనిచ్చే అన్ని రకాల పంటలు మరియు పప్పు ధాన్యాలను కూడా పండిస్తున్నారు. ఇక్కడ సంవత్సరానికి రెండు పంటలు పండిస్తారు. ఈ భూములు వివిధ జీవరాసులకు కావలసిన పచ్చని మరియు ఎండు గడ్డి (ఆహారంను) కూడా అంద చేస్తున్నాయి. చాలా పెద్ద మొత్తంలో పశువుల, గొర్రెల మందలు మేత మేస్తూ కనిపించాయి. రైతులకు ఆదాయం సమకూర్చడమే కాకుండా దేశ ఆహార ఉత్పత్తికి తోడ్పడుతున్నాయి. గొర్రెలు, మేకలపై వచ్చే ఆదాయం కూడా ఈ రెండు గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా వుంటున్నది. అన్ని రకాల పంటలను పండిస్తూ ఇంతటి పోషక పదార్థాలు అందించే శక్తి కలిగివున్న భూములు, ఈ రెండు గ్రామాల వ్యవసాయ అభివృద్ధికి ఎంత గానో తోడ్పడుతాయి అని వివరించి చెప్ప వలసిన అవసరం లేదు.

### బాధిత ప్రజలు

ఈ విమానా(శయం ఏర్పాటు వలన సుమారుగా ఈ రెండు గ్రామాలలోని 25000 మంది ప్రజలు బాధితులవుతారు. వీరిలో చిన్న మరియు మధ్యతరగతి రైతులు ఎక్కువమంది వున్నారు. వెనుకబడిన తరగతి ప్రజలు, యస్.సి., యస్.టి మరియు ఇతర కులాల ప్రజలు కూడా నివసిస్తున్నారు.

ఈ రెండు గ్రామాలలోని వారే కాకుండా దిగువ భాగానవున్న గ్రామ ప్రజలు కూడా బాధితులవుతారు. ఈ విమానాశ్రయ ఏర్పాటు వలన ప్రకృతి వనరులే కాకుండా వ్యవసాయ కాలువలన్నీ నాశనమవుతాయి. ఈ కాలువలు చెడిపోతే క్రింది గ్రామానికి నీటి పారుదల తగ్గిపోతుంది. వ్యవసాయ భూములన్నీ మెట్ట భూములుగా మారుతాయి. మెట్ట భూములలో వ్యవసాయం చేయడం అంటే గాలిలో దీపం పెట్టి ఎదురు చూడటమే.

### భూసేకరణ

భూసేకరణలో పారదర్శకత పూర్తిగా లోపించింది. విమానాశ్రయానికి ఎంత భూమి అవసరమో ఇంతవరకు బహిర్గతం చేయలేదు. ఇప్పుడు 1000 ఎకరాలు కావాలని పుకార్లు వినిపిస్తున్నాయి. బాధిత రైతుల తీవ్ర వ్యతిరేకత మధ్యలో కూడా భూ సేకరణకు నోటీసులు ఇవ్వబడ్డాయి.

### ఉపేక్షించరాని తప్పు మరియు ఉద్దేశ్య పూర్వకమైన కుట్ర

రెవిన్యూ అధికారులు జారీ చేసిన ప్రకటనలో ఈ భూములన్నీ మెట్ట భూములుగా తెలిపారు. ఇది పూర్తిగా నిరాధారం. రెవిన్యూ రికార్డుల ప్రకారం ఇవన్నీ వ్యవసాయ అనుకూల భూములే. రికార్డులను తారుమారు చేయడానికి ప్రయత్నం చేసి క్షమించరాని మోసానికి పాల్పడ్డారు. అప్పటి బళ్ళారి జిల్లా సహాయ కమీషనరు అయిన హర్ష గుప్తా, ఇవి మెట్ట భూములు కాదని D.O.No.Rev LAQ 94-08-09 ఆర్డరు కూడా ఇచ్చారు.

### AAI అధికారుల సాధ్యాసాధ్యాల నివేదిక

ఏ ప్రాథమిక నివేదికనుబట్టి విమానాశ్రయ ఏర్పాటు ప్రతిపాదించారో, అది పూర్తిగా అశాస్త్రీయంగా తప్పుల తడకగా, ప్రజల మనోభావాలను పెడచెవిన పెట్టి తయారు చేసింది. ఇద్దరు క్రిందస్థాయి అధికారులు మరియు AAI సలహాదారుడు వివరణాత్మక మైన నివేదిక ఇవ్వలేదు. ఈ అనుకూలించబడిన నివేదికను చూస్తే వారి నీతి, నిజాయితీ, అర్హతలు ఏంటో తేటతెల్లమవుతాయి.

ఈ నివేదికలో సాధారణ అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు అని తెలియజేశారు. నిజానికి అవి అప్రధానమైనవి కాదు, ప్రధానమైనవి. భూసేకరణ ఏమన్నా అప్రధానమా? చిన్న చిన్న భూ సముదాయాలను అప్రధానమైనవిగా తెలిపారు. చిన్న చిన్న కుంటలు విమానాశ్రయానికి సరిపోతాయా? మ్యాపులు, ఛార్టుల ప్రకారం సహజ నీటి వనరులు,పంట భూములు పెద్ద ఆటంకాలు కాదు అని అధికారులంటున్నారు. (వీరికి ఈ ఛార్టులు ఎవరిచ్చారు?) అక్కడ అంతా పంటకాలువలు, జలధారలు, ఉపరితల జల వనరులు ఉన్నాయి. AAI అధికారులు భూ సేకరణ కోసం అవాస్తవాలు, భయంకరమైన అబద్ధాలు రిపోర్ట్ చేస్తున్నారు. విమానాశ్రయం ఏర్పాటు చేయటానికి చాలా ఇతర ప్రదేశాలు వున్నవి కాని వాటిని చూడలేదు. ప్రత్యామ్నాయం కోసం చూపిన మూడు ప్రదేశాలు అసాధ్యమని నిరూపించడానికే చూశారు. సంగక్కళ్-మోకారోడ్డులో బళ్ళారికి 10కి.మీ. దూరంలో విమానాశ్రయ ప్రతిపాదన ప్రాంతం వున్నది. ఉన్న పాత రోడ్డును 4 లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నారు.

AAI అధికారులు ఈ భూమి వ్యవసాయ అనుకూలమా, కాదా అని చెప్పకుండా మౌనంగా వున్నారు. అయితే ఇతర మూడు ప్రదేశాలు మాత్రం నల్లరేగడి వ్యవసాయ భూములని చెబుతున్నారు. నిజానికి చాగనూర్, సిరివార్ భూపరివాహక ప్రాంతం అంతా వ్యవసాయ అనుకూల నల్లరేగడి భూములే. ఈ విమానాశ్రయ స్థలానికి ప్రక్కనే స్టీలు ఫ్యాక్టరీ ప్రతిపాదన వున్నది. నిజనిర్ధారణ కమిటీ ఇది వ్యవసాయంగా అభివృద్ధి చెందిన భూమి అని గట్టిగా నమ్ముతున్నది. రాష్ట్ర భూ సేకరణ కోణంలో గానీ, ఆహారభద్రత కోణంలోగాని చూసినా దీనిని వ్యవసాయ భూముల నుండి మార్చరాదు.

### ప్రజల ఆర్థిక వనరుల వినాశనం

సంవత్సరానికి రెండు పంటలు పండే వ్యవసాయ భూమిని సేకరిస్తే, ప్రజల భూమే కాదు, ఆ ప్రాంత ప్రజలందరికీ ఉన్న ఒకే ఒక్క ఆదాయ వనరును కూడా లేకుండా చేసినట్లు అవుతుంది. వారి జీవనోపాధికి గండి కొట్టినట్లు అవుతుంది. భూములపై హక్కును పూర్తిగా కోల్పోతారు. వారికి ఇచ్చే నష్టపరిహారంతో కొన్ని సంవత్సరాలు బ్రతకవచ్చు. మరి వారి వారసత్వసంతతి అభివృద్ధి మాటేమిటి? భూమి-వారు బ్రతికి ఉన్నంతవరకే కాకుండా రాబోయే తరాలకు కూడా భద్రతనిస్తుంది.

### అతలాకుతలం కానున్న సామాజిక జీవనం

ఉమ్మడి కుటుంబాలలో భూమి కలిగి ఉండటం అనే భావన ఒక అంతర్గత అనుబంధ శక్తిగా ఈ గ్రామాలలో బలంగా నాటుకొని ఉంది. భూమి ఉమ్మడి కుటుంబంలోని సభ్యులందరికి ఒక భద్రతను కల్పిస్తుంది. ప్రభుత్వాలు చేసే ఈ భూసేకరణ మూలంగా వారి సామాజిక జీవనానికి భంగం వాటిల్లుతున్నది.

### బళ్ళారి దుష్టత్రయ మంత్రుల కుట్ర మరియు దోపిడీ

గాలి జనార్ధనరెడ్డి, గాలి కరుణాకర్‌రెడ్డి, బి.శ్రీరాములు కర్నాటక ప్రభుత్వంలో బళ్ళారి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులు ఆంధ్రప్రదేశ్, కర్నాటకల్లోని ఇనుప ఖనిజాన్ని దోచుకొని తక్కువ వ్యవధి లోనే అమితంగా సంపాదించారు. అనధికార త్రవ్వకాలు జరుపుకుంటున్న ఈ దుష్టత్రయం మిగతా కంపెనీల నుండి కూడా 30% లాభాన్ని పొందుతున్నారు. ఇనుప ఖనిజ వ్యాపారంలో వున్న ఇతర వ్యాపారస్తులను భయపెట్టడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. వారి స్వార్థం కోసం ముఖ్యంగా పోలీసు, రెవిన్యూ, కస్టమ్స్, సేల్స్‌టాక్స్ అధికారులను ఉపయోగించుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆస్తులను సైతం దోచుకుంటున్నారు. దోచుకున్న డబ్బు, రాజకీయ అధికారంతో బళ్ళారిలో సొంత రాజ్యాన్ని సృష్టించుకున్నారు. అక్కడ రాక్షస పాలన, ఆటవిక న్యాయం నడుస్తున్నది. ఎటువంటి వ్యతిరేకతను వారు సహించరు. వారికి వ్యతిరేకంగా మాట్లాడడానికి ఎవరూ సాహసించరు.

ఇటువంటి చరిత్రవున్న వీరి కళ్ళు చాగనూర్, సిరివార్ పరిసర ప్రాంత పచ్చని వ్యవసాయ భూములపై పడింది. మనసులో దురుద్దేశం పెట్టుకొని విమానాశ్రయం పేరుతో వేల ఎకరాలను దోచుకోవడానికి ప్రయత్ని స్తున్నారు. రియల్ ఎస్టేట్ పరిశ్రమల స్థాపనే వీరి అసలు ఉద్దేశ్యం. ఈ మంత్రులు ప్రజలను ఒకవైపు బుజ్జగిస్తూ, మరొకవైపు భయభ్రాంతు లకు గురిచేస్తున్నారు. దీనిలో భాగంగానే ఆరోగ్య శాఖామంత్రి బి.శ్రీరాములు అతని మనుషులు కొందరు రైతుల వద్ద నుండి విమానాశ్రయానికి అనుకూలంగా భూములను ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ దుష్టత్రయం రైతులలో వున్న ఐక్యతను చెడగొట్టడానికి వివిధ మార్గాల ద్వారా ప్రయత్నిస్తున్నారు. ఎవరో కొద్దిమంది తప్ప ఎక్కువమంది రైతులు తమ భూములను ఇవ్వడానికి సిద్ధంగా లేరు.

**బాధిత ప్రజల వైఖరి మరియు అభిప్రాయాలు**

1. జీవనోపాధిని కోల్పోయి బ్రతుకు తెరువు కోసం రోడ్డున పడవలసి వస్తుందని బాధపడు తున్నారు. 2. ఎంతటి నష్టపరిహారమైనా భూముల్ని వదులుకోవడం వలన వచ్చే నష్టాన్ని పూడ్చలేదు. 3. భూ సేకరణ పట్ల రైతులు పూర్తి వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారు.

**భూసేకరణ మరియు విమానాశ్రయ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజల ఆందోళన**

ఈ పోరాటం క్రింది స్థాయి నుండే మొదలైంది. విమానాశ్రయానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితపరచడంలో రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల పాత్రగానీ లేదు. వివిధ పద్ధతుల ద్వారా పోరాటాలను ప్రజలే ఎంచుకున్నారు. ఈ పోరాటం సంవత్సరం క్రితమే మొదలై రోజురోజుకు పెరుగుతూనే వున్నది. వారు దేనినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా వున్నారు. పోరాటంలో భాగంగా భూసేకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వ అధికారులకు, మానవ హక్కుల కమీషనుకు, కర్ణాటక గవర్నర్‌కు కూడా మెమోరాండం సమర్పించారు. విమానాశ్రయ ఏర్పాటుపై తమ వ్యతిరేకతను ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహారదీక్షలు రూపంలో ఎన్నోసార్లు తెలియ జేశారు. బెంగుళూరు వరకు పాదయాత్రను కూడా చేపట్టారు. ప్రభుత్వం సారవంతమైన భూములను సేకరించవద్దని వివిధ నిరసనల బోర్డులను 100 ఎద్దుల బండ్లపై తగిలించు కొని ఊరేగింపుగా తమ నిరసనను తెలియ జేశారు. రైతుల, రైతుకూలీల జీవనోపాధిని కొల్లగొట్టకండంటూ చెల్లగిరిగి నుండి బళ్ళారి వరకు 25 కి.మీ ఊర్లు సేవ (రోడ్డుపై దొర్లు కుంటూ పోవడం) చేశారు. ఈ ఆందోళన లను ఆపడానికి పోలీసులు లాఠీఛార్జీలు, కాల్పులు మొ॥ క్రూరమైన పద్ధతులను కూడా ప్రయోగించారు. చాలామంది రైతులను, స్త్రీలను హింసించి జైల్లో పెట్టారు. రైతుల ప్రతిఘటనను అణచివేయడానికి ప్రభుత్వము పోలీసు బలగాలతో చేసిన ప్రయత్నం విఫల మైందనే చెప్పాలి. తమ పచ్చని పొలాలలో నిర్మించ తలపెట్టిన ప్రతిపాదిత విమానా శ్రయాన్ని తుదికంటా తరిమేందుకు రైతులు, కూలీలు పట్టుదలతో వున్నారు. చాగనూర్, సిరివార్, నీరావరి భూరక్షణ సమితి ఈ పోరాటాన్ని ముందుండి నడిపిస్తున్నది.

**ముగింపు:**

నిజనిర్ధారణ కమిటి తమ అభి ప్రాయాలను ఈ క్రింది విధంగా తెలియ జేయడం జరిగింది.

1. ప్రతిపాదిత విమానాశ్రయం కోసం చాగనూర్, సిరివార్ గ్రామ పరిసరాలలోని రెండు పంటలు పండిస్తున్న సారవంతమైన పచ్చని పొలాలను సేకరించాలనుకోవడం ప్రభుత్వ మూర్ఖత్వపు ఆలోచన. ఈ ప్రాంతం వివిధ రకాల పంటలను పండిస్తూ వ్యవసాయకంగా అభివృద్ధి చెందింది. ఈ ప్రాంతరైతులు తమ దైన పద్ధతిలో దేశ ఆహార ఉత్పత్తికి తోడ్పాటు అందిస్తున్నారు. ఆహార ఉత్పత్తి కొరతగా వున్న మన దేశంలో ఇటువంటి భూములను తీసుకోకూడదు.
2. ఈ రైతులకు ఇంకొక వృత్తి తెలియదు. పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడ్డవారు. రైతుల భూములను సేకరిస్తే వారి జీవ నోపాధికి భంగం వాటిల్లుతుంది.
3. భూసేకరణ ప్రత్యక్షంగా చాగనూర్, సిరివార్ గ్రామాలలోని వెయ్యి ఎకరాల రైతులపైననూ, వ్యవసాయం పై ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆధారపడిన సుమారు 25000 మందిని తీవ్రంగా దెబ్బతీస్తుంది. విమానాశ్రయ ఏర్పాటు వలన వ్యవసాయ కాలువలు, ప్రకృతి వనరులు నాశనమవడమే కాకుండా దిగువనున్న 6000 ఎకరాలు మెట్ట భూములుగా మారిపోతాయి.
4. ముగ్గురు బళ్ళారి మంత్రులు విమానా శ్రయ ఏర్పాటు ముసుగులో వారి స్వంత లాభం కోసం అధికారుల సహాయంతో, రైతుల భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారు. రైతులను భయభ్రాంతులను చేస్తూ భూములను స్వాధీనం చేసుకుంటు న్నారు.
5. ఈ మంత్రుల త్రయం రాజకీయ అధికారం, డబ్బు, మందబలంతో ప్రజలను అణగద్రొక్కుతూ తమ ఆస్తులను దొడ్డిదారిన పెంచుకుంటు న్నారు. అధికార పార్టీకి వీరిపై ఎటువంటి నియంత్రణా లేదు. బహుశా ఆ పార్టీకి నీతి నిజాయితీ నియమాల విలువలు లేనట్లుంది. మహాభారతంలోని ధృతరాష్ట్రుని వలె కర్ణాటక ముఖ్యమంత్రి నిస్స హాయుడు. ఇదంతా కూడా కర్ణాటక ప్రజలను ముఖ్యంగా ప్రస్తుత సందర్భంలో చాగనూర్, సిరివార్ గ్రామ ప్రజలను బాధించడమే కాకుండా బీదరికంలోనికి నెట్టి వేస్తున్నది.
6. ఈ మంత్రుల త్రయం తమ దుర్మార్గపు వక్రబుద్ధులతో బాధిత ప్రజల మధ్య

ఐక్యతను విడదీయడానికి ప్రయత్ని స్తున్నప్పటికీ పోరాటాలు రోజు రోజుకు బలపడుతూ కొనసాగు తున్నాయి,

7. బళ్ళారి జిల్లాలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలోని రైతులు, కూలీలు, మేధావి వర్గం, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలసహాయ సహకారాలు కూడా వీరికి అవసరం. ఈ ప్రాంతపు ఉద్యమాన్ని కమిటీ అభినందించింది.
8. విమానాశ్రయ ఏర్పాటును విరమించు కోవాలని డిమాండ్ చేస్తున్న రైతుల, కూలీల విజ్ఞప్తి న్యాయసమ్మతమైనది. విమానాశ్రయ ప్రతిపాదనను విరమించుకొని సంబంధిత జీవోలను వెంటనే రద్దు చేయాలి.
9. విమానయాన మంత్రిత్వశాఖ మరియు AAI అధికారులు ఈ ప్రాజెక్టుకు అనుమతి మంజూరు చేయరాదు.
10. కర్ణాటక ప్రభుత్వం-ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అను గుణంగా బాధ్యత వహించాలేగాని దోపిడీ మంత్రుల దాహానికి, అధికారానికి కాదు.
11. వ్యవసాయ భూములను మరే ఇతర అవసరాలకుసేకరించరాదని భారత ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. చట్టప్రకారం నిరుపయోగ భూములనే సేకరించాలి. విమానాశ్రయ ప్రతి పాదనను విరమించుకోకపోతే వేరే ప్రదేశాలను పరిశీలించవచ్చు.
12. ప్రజలను తమ వ్యవసాయ భూముల నుండి వేరుచేయలేదని ప్రభుత్వం గ్రహించి తమ విజ్ఞతను ప్రదర్శించాలి. ఒకవేళ బలవంతంగా భూసేకరణ చేపట్టాలని ప్రయత్నిస్తే రైతులు తీవ్రంగా ప్రతిఘటిస్తారని మా కమిటీ భావిస్తోంది.

# తెలంగాణా

సుంకర సత్యనారాయణ
రచనాకాలం: 1946

**కార్మికులారా!**
**కర్షకులారా!**
**యువకులారా!వి**
**ధ్యార్థుల్లారా!**
**విన్నారా అదె విన్నారా!**
**విప్లవ శంఖం విన్నారా!**
**తరతరాల తన**
**అరదండాలను**
**తెగ తెంచాలని**
**పగతుర డీకొని**
**తెలంగాణ గర్జించింది**
**తెనుగు బిడ్డలను పిలిచింది**
**పేదల రక్తం**
**పిండుకుతాగే**
**నాజీ నైజాం**
**నరహంతకుడుపై**
**కత్తిదూసి లంఘించింది**
**గదిమి గదిమి మరితంతోంది**
**అడలి ప్రభుత్వం**
**గడగడలాడుతు**
**దించి సైనికుల**
**తెలుగు గడ్డపై**
**నానా హింసలు పెడుతోంది**
**నాజీలను మరిపిస్తోంది**
**బ్రహ్మాండంబగు**
**ప్రజావాహిని**
**కట్టలు తెంచుక**
**కదిలి ముందునకు**
**గుండె గుండునకిస్తోంది**
**దుండగులను అరికడుతోంది**

**సంస్థానంలో**
**సాగే యుద్ధం**
**ఒలికే రక్తం**
**ఒరిగే ప్రాణం**
**నీదేనని గుర్తించాలోయ్**
**నిలచినడుము బిగియించాలోయ్**
**ఉడుకు రక్తమే**
**యుంటే నీలో**
**తెనుగు బిడ్డనను**
**ధీమా ఉంటే**
**పోరాటంలో దూకాలోయ్**
**హోరాహోరిగ పోరాలోయ్**
**ఉన్నతాసనా**
**లున్నవిమాకని**
**ఉట్టిగట్టుకొని**
**యూగిసలాడే**
**నాయకులను కదిలించాలోయ్**
**సాయపడండని తెలపాలోయ్**
**ఘాతకులగు, ఆ**
**స్వేత ముఖులు, ఈ**
**నిజాములో కాల్**
**నిలవతొక్కితే**
**నీ తలబద్దలు కొడతారోయ్**
**నిజము తెలిసికొని మేల్కోవోయ్**
**లేరా, ముందుకు**
**రారా, ఆంధ్రుడ**
**వీరత్వాన్నీ**
**పేరు ప్రతిష్టల**
**కలసి నేడు నిలబెట్టాలోయ్**
**కష్టజీవులిదె లేవాలోయ్**

నివేదిక

# భైంసా, వటోలి ఘటనలు–మతతత్వశక్తులు విసురుతున్న సవాలు

*ఆదిలాబాద్‌జిల్లా భైంసా, వటోలి తదితర గ్రామాలలో 10.10.2008 నుండి జరిగిన మతఘర్షణలు, పోలీస్ కాల్పులు, సజీవ దహనాలు, సమాధుల కూల్చివేతలు, అనంతరం పరిస్థితులను రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యదర్శి కా॥కోటయ్య నాయకత్వాన ఒక పరిశీలనా బృందం 16.10.2008న వెళ్ళి పరిశీలించింది. కర్ఫ్యూ నీడలోనే వివిధ రకాల ప్రజలను కలిసింది. భైంసాకి దగ్గరలోని వాలేగాం అనే గ్రామంలో కూల్చివేయబడిన మసీదును పరిశీలించింది. వటోలి అనే గ్రామంలో అమానుషంగా హత్య చేయబడి సజీవ దహనం చేయబడిన మహబూబ్‌ఖాన్ ఇంటిని పరిశీలించి గ్రామ పెద్దలతో చర్చించింది. ఈ విధంగా 10.10.2008 నుండి జరిగిన సంఘటనల క్రమాన్ని పరిశీలించిన బృందం తన ప్రాథమిక పరిశీలనాంశాలను, డిమాండ్‌లను, ప్రజల విజ్ఞప్తులను జోడించి ఒక నివేదిక విడుదల చేసింది.*

భైంసా ప్రాంతం 1992–96 మత ఘర్షణల రీత్యా సున్నితమైన ప్రాంతం. 10.10.2008 ఆ తర్వాత జరిగిన ఘటనల క్రమం ఇలా ఉంది. ఆ రోజు మధ్యాహ్నం 2.45 ని॥కు భైంసా పట్టణంలోని పంజేషహ జమా మసీదు ముందు నుండి వెళ్ళే రోడ్డు గుండా దుర్గామాత విగ్రహ నిమజ్జన ఊరేగింపు సాగుతున్నది. వాస్తవానికి మన దక్షిణ భారత ప్రజలకు వినాయక నిమజ్జన సాంప్రదాయం ఉంది కానీ దుర్గామాత నిమజ్జనం ఇటీవల కాలంలో దిగుమతి చేయ బడింది. ఊరేగింపు ముందుభాగంలో 30–40మంది 20–25 సం॥ల యువకులు మసీదు ప్రాంతం వచ్చేసరికి డప్పులు, బ్యాండు వాయించడమేగాక మసీదుపై పసుపు (బండారు అంటారు) చల్లారని దీనితో ఉద్రిక్తత ఏర్పడిందని తెలుస్తున్నది. ఈ కవ్వింపు చర్యలతో మసీదులో అప్పటికే ప్రార్థన ముగించుకొని ఉన్న ముస్లిం యువకులు స్పందించడం, మసీదుపై రాళ్ళుపడటం, మసీదు నుండి కూడా రాళ్ళు విసరడం జరిగింది. తెలంగాణాలోనూ అంతటా చాలా కాలంగా ఉన్న సాంప్రదాయం ఏమంటే ముస్లింల పెళ్ళి ఊరేగింపులు అయినా హిందువుల ఊరేగింపులు అయినా మసీదు ముందు వచ్చేసరికి బ్యాండు వాయిద్యాలను ఆపి మసీదు దాటాక మరల ఊరేగింపులను యథావిధిగా సాగిస్తారు. కానీ వీటికి భిన్నంగా దుర్గామాత ఊరేగింపు బ్యాండు మేళాలతోనే సాగింది. ఈ మొత్తం ఊరేగింపులో కేవలం నలుగురు పోలీసులు–అదీ ఊరేగింపు వెనుక నడుస్తూ వచ్చారు. 10వ తేదీ 2.45 ని॥ల నుండి 4.30–5 గంటల వరకూ వేగంగా జరిగిన పరిణామాలలో గృహదహనాలు, కత్తిపోట్లు, పోలీసు కాల్పులు జరిగాయి. మసీదు నుండి బస్టాండ్ వైపు సుమారు 127 దుకాణాలు, ముఖ్యంగా ముస్లిం వ్యాపారుల దుకాణాలు తగలబడ్డాయి. అయితే మంటలకి మతం లేదు కనుక ఆ దుకాణాలతో పాటుగా ఉన్న హిందూ చిన్న వ్యాపారుల దుకాణాలు కూడా తగలబడ్డాయి. మసీదు వెనక భాగంలోని ముస్లింల ఇళ్ళకి నిప్పు అంటించ బడటంతో తగలబడుతున్న ఒక ఇంటిలోని ముస్లిం కుటుంబం-ఇంటి వెనుక మట్టి గోడను పగులకొట్టుకొని బయటకు రావ డానికి తోడ్పడిందీ బయటకు వచ్చిన వార్ని కాపాడిందీ హిందూ కుటుంబాలే! సాధారణ ప్రజలు ఇంత ఉద్రిక్తతలోనూ మతతత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించారనడానికి ఇది ఒక ఉదాహరణ.

ముస్లిం పెద్దలు చెపుతున్నదాని ప్రకారం ఇళ్ళు, దుకాణాలు తగలబెడుతున్న గుంపు వైపుగాక దీనికి వ్యతిరేకంగా సమీకృతమౌతున్న ముస్లింల వైపు పోలీసులు తుపాకులు కాల్చారని చెపుతున్నారు. ఈ కాల్పులలో మొదటి గుండుకి అబ్దుల్ ఖయ్యాం అనే 19-20 సంవత్సరాల యువకుడు చనిపోయాడు. మరో గుండుకి అబ్దుల్ సమీ అనే మరో యువకుడు మరణించాడు. (చనిపోయిన ఈ సమీ బావ కూడా 1996లో బాబ్రీ మసీదు కూల్చివేత నిరసనల సందర్భంగా చనిపోయిన 16మందిలో ఒకడు. (ఈ విధంగా ఒకే కుటుంబంలో అప్పుడూ, ఇప్పుడూ కూడ మరణం సంభవించింది) జరిగిన ఘర్షణలో భైంసాలోని రాజీవ్‌నగర్‌కి చెందిన ఎన్నార్ ఘూటాన్ అలియాస్ బూటాసింగ్ అనే అతను కత్తిపోట్లకు గురై మరణిస్తే, అతని సోదరుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ బూటాసింగ్ ఉత్తరప్రదేశ్‌లోని ఘోరక్‌పూర్ నుంచి వచ్చి ఇళ్ళకు రంగులు వేసే నిపుణుడు. ఇతనికి పుట్టిన ముగ్గురు ఆడపిల్లల్లో ముందు పుట్టిన ఇద్దరిలో ఒకరు అంధత్వంతోనూ, మరొకరు పాక్షిక అంధత్వంతోనూ పుట్టారు. ఇటీవల పుట్టిన పాపకి అలాంటి సమస్యలు లేవని తెలిసి ఈ దుర్గామాత విగ్రహాన్ని పెట్టటంలో ముఖ్యపాత్ర వహించాడు. 10వ తేదీ ఘర్షణల్లో మరణించాడు. ఈ విధంగా ఆ రోజు జరిగిన ఘర్షణలో మరో 25మంది వరకూ తీవ్రంగా గాయపడ్డారు.

భైంసా ఘటనలు జరిగాక భైంసా మండలంలో వటోలి అనే గ్రామంలో 11వ తేదీ రాత్రి ఆ గ్రామంలో ఉన్న ఒకే ఒక్క ముస్లిం కుటుంబం మహబూబ్‌ఖాన్ ఇంటికి నిప్పు అంటుకొంది. మంటలు మండే సమయానికి ఇంటి వెనుక ఉన్న అమ్మవారి గుడి వద్ద భజనలు జరుగుతున్నాయి. మంటలు కనపడగానే ఫైర్ సర్వీసుకి ఫోను చేసామని, వాళ్ళు వచ్చాక మంటలు ఆర్పారని కరెంటు, గ్యాసుస్టౌవు ఉంది కనుక ఎవరినీ మంటలు ఆర్పడానికి వెళ్ళవద్దని చెప్పామని, తెల్లవారి మహబూబ్‌ఖాన్ బంధువులు వచ్చి చూస్తే ఇంటిలో మహబూబ్ ఖాన్, ఆయన

భార్య, కూతురు రిజ్వానా, మరో ముగ్గురు చిన్నారులు మంటలలో కాలి పోయారని గ్రామ ఉపసర్పంచ్ జాదవ్ జగత్‌రావు చెప్పాడు. వాస్తవానికి మహబూబ్ ఖాన్ కాలును కుక్కలు గ్రామం పక్కన పొలాల్లోకి లాక్కొని వెళ్ళినట్లుగా అక్కడ పడి ఉందని ఆ ఇంటి వద్దనున్న పోలీసులు చెప్పారు.

ఎత్తు తక్కువతో కేవలం 3 గదులు, ముందుగది ఒక దుకాణంలాగా ఉండే చిన్న ఇల్లు మహబూబ్‌ఖాన్‌ది. మంచి దర్జీ అవటం వలన గ్రామస్తులు పూర్వం ఆయన్ని ఆ గ్రామంలోకి పిలిపించుకొని తమతో నివసించ మని కోరారుట. మహారాష్ట్రకి చెందిన సైలేన్ బాబాకు మహబూబ్‌ఖాన్ భక్తుడు. గ్రామంలో ఎవరికి దదుపు జ్వరం వచ్చినా అతని వద్ద తాయత్తులు తీసుకొంటారు. అతని పెద్ద కొడుకు మిలటరీలో ఉండి; చిన్న కొడుకు, ఇంకో కూతురు చదువుల నిమిత్తం దూరంగా ఉండటం వలన ఆ కుటుంబం నుంచి ముగ్గురు మాత్రమే మిగిలారు. దేశభక్తి గురించి గొప్పగా చెప్పుకునే వారు, వారి అర్థంలో దేశరక్షణ బాధ్యతల్లో ఉండి మిలటరీలో వున్న ఒక మైనార్టీ మతానికి చెందిన కుటుంబం పట్ల ప్రదర్శించిన 'ఔదార్యం' ఇది. ఇపుడు మీడియాలో 1996 నాటి ఘర్షణల్లో మహ బూబ్‌ఖాన్ నిందితుడు అని ప్రచారం జరుగు తోంది. నిజంగానే మహబూబ్‌ఖాన్ నిందితుడు అయితే అప్పటికి పుట్టని ఆ చిన్నారులు, మహిళలు ఏ నేరం చేశారు? మహబూబ్‌ఖాన్ ఇంటికి ముందు-వెనుక ఇళ్ళు ఉన్నాయి. ఎవరికీ పిల్లల అరుపులు సైతం వినపడలేదు అంటున్నారు.

16.10.2008న ఈ గ్రామానికి పరిశీలనా బృందం వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి అయింది. అప్పుడే మహబూబ్‌ఖాన్ ఇంటి ఇవతలగల ఒక కరెంట్ తీగ షార్ట్ సర్క్యూట్ అయి తెగిపడింది. వెంటనే చుట్టు పక్కల జనం బ్యాటరీ లైట్లతో వచ్చి ఆ దారిన ఎవరన్నా వచ్చి వైర్లు తొక్కుతారేమోనని ఒకరి కొకరు జాగ్రత్తలు చెప్పుకుంటున్నారు. ఇంత చిన్న సంఘటనకే జాగ్రత్తలు తీసుకొన్నవారు, మహబూబ్‌ఖాన్ ఇల్లు తగలబడుతుంటే స్పందించకపోవడం గమనించాల్సిన విషయం. వెళ్ళిన పరిశీలనా బృందం గ్రామ పెద్దలతో వటోలి గ్రామంలో జరిగిన ఘాతుకం యొక్క తీవ్రతను వివరించి ఎవరి పాత్ర దీనిలో ఉందో గ్రామం అంతా కళ్ళు తెరిస్తే అర్థం అవుతుందని, ఇప్పటికైనా జరిగిన విషయాలను పరిశీలించి వ్యవ హరించమని విజ్ఞప్తి చేసింది.

అదే విధంగా భైంసా నుండి బాసర వెళ్ళే దారిలోని దేగాం గ్రామం ప్రక్కనేగల వాలేగాం గ్రామం, కేవలం 5-6 ముస్లిం పేద కుటుంబాలు నివశిస్తున్న గ్రామం. (మొత్తం 200 కుటుంబాలపైనే ఉండే గ్రామం) భైంసా ఘటనల అనంతరం ఆ గ్రామంలోని మసీదు ఒక అర్ధరాత్రి దాడికి గురైంది. మసీదు ప్రహరీగోడ, పై భాగం గోడలు పొడిచి కూల్చి వేయబడ్డాయి. తలుపులు తగులపెట్టారు. ఈ ఘటనతో ఆ గ్రామంలోని 6 ముస్లిం కుటుంబాలు భయంతో గ్రామం విడిచి పారి పోయారు. అలాగే తానూరు మండలంలోని ఎవ్వి అనే గ్రామంలో ఇదే విధంగా మసీదు కూల్చివేయబడింది. ఈ విధంగా మహారాష్ట్ర లోని నాందేడ్‌జిల్లాలో, ఆదిలాబాద్ జిల్లాలో వివిధ ప్రాంతాలలో ఉద్రిక్తలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరిగాయి. ధర్మాబాద్ పట్టణంలో ఎన్నడూ లేని విధంగా దుర్గామాత విగ్రహ ప్రదర్శనను మసీదు ముందు నుండి తీసుకొని వెళ్ళేలా ప్రదర్శన దారిని మళ్ళించాలని ప్రయత్నించినపుడు హిందు, ముస్లిం పెద్దలు సమిష్టిగా వ్యవహరించి నిరోధించారు.

**అయితే 10వ తేదీ నుంచి జరుగుతున్న సంఘటనలు కాకతాళీయమైనవి కాదు. దీని వెనుక లోతైన వేళ్ళను తన్నుకొనజూస్తున్న ఒక విష వృక్షం ఉంది.** ఈ ఘర్షణల, దాడుల వెనక తక్షణ రాజకీయ స్వప్రయోజనాలు, స్థానిక ప్రయోజనాల నుండి దేశస్థాయిలో ప్రయోజనాలు ఉన్నాయి. 1990ల మత ఘర్షణల నుంచి హిందూ, ముస్లిం మత నిర్మాణాలు సంఘటితం అయ్యాయి. హిందూ మతతత్వ శక్తులు రాజ్యాంగ యంత్రంలోని వివిధ శక్తుల అండతో దూకుడుగా ఉన్నాయి. మైనార్టీ శక్తులు మతతత్వ భావాలతోనే తమలో తాము ముడుచుకొని పోతున్నాయి. భైంసా నగర పాలకసంస్థ యం.ఐ.యం చేతుల్లో ఉంది. 10వ తేదీ ఉద్రిక్తతలు ఏర్పడుతున్న వెంటనే ప్రస్తుత టి.ఆర్.యస్ యం.యల్.ఎ నారాయణరావు పటేల్‌కి చెందిన ఫ్యాక్టరీ నుంచి హిందూవాహినికి చెందిన 200మంది కర్రలు, కత్తులతో మసీదు వైపు దూసుకొచ్చారని ముస్లిం పెద్దలు చెపుతున్నారు. రాబోయే ఎన్నికలు, స్థానిక ఆధిపత్య ఆకాంక్షలు, వైరుధ్యాలు దీనికి తగ్గట్టు ఇరువైపులా నిర్మాణయుత మతతత్వ శక్తుల కార్యకలాపాలు తక్షణ అంశం. మరోవైపు ఇదే సమయంలో ఆ రాష్ట్రంలో మతకల్లోలాలు మరియు నాందేడు నుంచి భైంసా వరకూ జరిగిన మసీదుల పైకి దాడి ప్రయత్నాలు చూస్తే ఒక దేశవ్యాపిత రాజకీయ ఎజెండా వీటి వెనుక ఉందని స్పష్టపడుతుంది.

భైంసా కన్నా మతతత్వ వికృతరూపం, సమస్య అసలు తీవ్రత గ్రామాలలో ఉంది. వాలేగాంలో కేవలం 6గురు ముస్లిం కుటుంబాల (మొత్తం 2000 ఇళ్ళలో) నివశించే చోట మసీదు కూల్చివేత; గ్రామం లోని ఒకే ఒక ముస్లిం (మహబూబ్‌ఖాన్) కుటుంబంలోని ముక్కుపచ్చలారని చిన్నారులను సైతం అమానుషంగా చంపి, ఇంటిలోనే కాల్చివేయటం ఇవి చాలా తీవ్రమైన విషయాలు. మతం ప్రాతిపదికన గ్రామాలను పునర్వ్యవస్థీకరించదలచుకొని, దానికి భయోత్పాతాన్ని ఆయుధంగా వాడు కోవడం దీనిలో అంశం. వీటితో మైనార్టీ మతస్తులు, గ్రామాలలో మైనార్టీగా ఉండే వారంతా భయంతో వాలేగాంలో జరిగినట్లు గ్రామాలను వదిలి వెళ్ళేలా వాతావరణం సృష్టించబడింది. ముస్లింలేకాక క్రైస్తవులు కూడా 'హిందువాహిని' శక్తుల దాడులకు గురయ్యారు-మే 23న బ్రదరన్ చర్చికి చెందిన 30మంది ప్రచారకులపై 'హిందూ వాహిని' కార్యకర్తలు దాడి చేశారు.

ఈ మసీదుల కూల్చివేతలు, కుటుంబ సజీవ దహనాలు ఆదిలాబాద్, నిజామాబాద్,

నాందేడ్, ఔరంగాబాద్ ఘటనలు, వాలేగాం తరహా పేలుళ్ళు హిందూ టెర్రరిస్టు శక్తుల విధ్వంసక కార్యకలాపాలు అన్నీ యాదృచ్ఛిక సంఘటనలు కావు. మైనార్టీ శక్తుల టెర్రరిస్టు చర్యలకి వచ్చిన ప్రతిస్పందనలు కావు. వీటి వెనక దశాబ్దాల పాటు జరిగిన ఒక ప్రజా వ్యతిరేక తాత్విక, రాజకీయ కృషి ఉంది. స్వాధ్యాయి పరివార్ అనే సంస్థకి గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రలోని నిజామాబాద్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలన్నింటిలోనూ, విదేశాలలో విస్తారమైన పలుకుబడి కలిగి వేలాది మంది విశ్వాసులను కలిగి ఉంది. పాండురంగశాస్త్రీ అథవాలే (జననం 1920–మరణం 2003) అనే అతను హిందూ మతతత్వవేత్తగా, టెంపుల్‌టన్ అవార్డు, పద్మ విభూషణ్ అవార్డుల గ్రహీతగా, స్వాధ్యాయి పరివార్ వ్యవస్థాపకుడుగా చిరపరిచితుడు. ఆయన తత్వశాస్త్రం గురించి ఇలా చెప్పాడు: “కేవలం సైద్ధాంతికం, ఊహాజనితమైన ఆలోచనలను, వాదాలను చర్చించే తత్త్వశాస్త్రం మనకి అవసరం లేదు. కేవలం పారలౌకిక అంశాలను చర్చించే తత్వశాస్త్రము మనకి అవసరం లేదు. వాస్తవికమైన సాధారణ జీవితాలకి కావాల్సిన తత్వశాస్త్రం కావాలి. ఒక్కమాటలో చెప్పాలంటే సజీవంగా ఉండే తత్త్వశాస్త్రం కావాలి.”

["We donot want philosophy which is purely theoritical and which merely discuss utopian ideas and theories. We donot want a philosophy which is merely other wordly. Instead we want philisophy which is practical, one that can be useful in our daily lives we want a philosophy that can be lived"] స్వాధ్యాయి పరివార్ మౌలిక లక్ష్యం వారి మాటల్లోనే చెప్పాలంటే–“భక్తి అన్నది ఖచ్చితమైన ఆత్మానుగతమైన చర్చగా ఉండరాదు. అది ఒక సాంఘికశక్తిగా ఉండాలి.” ["Bhakthi is not strictly an intraverted activity rather it is to be a social force"]

ఈ విధంగా దేవాలయానికి వెళ్ళడం, మత కర్మకాండలో పాల్గొనడమే సరిపోదని భక్తి అన్నదాన్ని ఒక సాంఘిక శక్తిగా మార్చేందుకు కృషి చేయాలని స్వాధ్యాయి పరివార్ వివరిస్తుంది. అలాంటి అసాంఘిక శక్తి సృష్టించాలంటే ఏ హిందూ మతం అయితే శ్రమజీవులను నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ కింద విభజించిందో ఏ హిందూ మతం అయితే దళిత, ఆదివాసీ ప్రజలను ఆహార, విహారం పేరుతో సాంఘిక బహిష్కరణకి తరతరాలుగా గురిచేసిందో వారినే పావులుగా, పనిముట్లుగా మార్చి ఒక సాంఘికశక్తిగా రూపొందించేందుకు మతతత్వ శక్తులు చేసిన అనేక ప్రయోగాల ఫలితమే గుజరాత్ మారణకాండ–మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ తదితర ప్రాంతాల మతతత్వ రాజకీయాలు, విధ్వంసం! కనుక ప్రవీణ్ తొగాడియా, నరేంద్రమోడీలు తెరముందు కనపడేవాళ్ళే. దీని వెనుక వారి లక్ష్యం కోసం కృషి చేసే శక్తులు వేరే ఉన్నాయి. కనుక ఉత్పత్తిలోనూ, శ్రమలోనూ, ప్రకృతితోనూ సంబంధమూ, సంఘర్షణ కలిగి ఉండటం చేత సహజంగా సమరశీలురైన ఆదివాసులు, దళితులు, వెనుకబడిన కులాల ప్రజలనే మతతత్వ రాజకీయం తన చేతుల్లో శక్తివంతమైన పనిముట్లుగా మార్చగలిగే రాజకీయ, సిద్ధాంత భూమికలను ఈ స్వాధ్యాయి పరివార్ వంటివి సృష్టిస్తే; భజరంగదళ్, హిందూ వాహిని వంటివి, బి.జె.పి వంటివి వాటి యొక్క వివిధ స్థాయిల్లోని వివిధ అవసరాలను నెరవేరు స్తాయి.

కనుక భైంసా, వటోలి ఘటనల వంటివి, చెట్టు శిఖరాగ్రాన ఊగుతున్న కొమ్మల వంటివి. వాటి వెనుక బలమైన కాండము, లోతైన వేళ్ళు తన్నుకొన్న మతతత్వ విషవృక్షం ఉంది. ఆదిలాబాద్, నాందేడ్, నిజామాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రజలలో స్వాధ్యాయి పరివార్ ప్రచారం చేసే సచ్ఛీలత, స్వయం వికాశం వంటివి ప్రభావం కలిగి ఉన్నాయి. పెద్ద భూస్వాములు, బీడీ సేట్‌లు, పత్తి వ్యాపారులు, కాంట్రాక్టర్లు దీనికి పట్టుగొమ్మలు తమ రోజువారి జీవితంలో కార్మికులను, రైతుకూలీలను, శ్రమజీవులను అణచి, దోపిడీ చేసే శక్తులకు ఈ వాదాలు అవసరం. వీరు రోజువారీ జీవితంలో ఫాసిజం అమలు జరగాలని కోరుకొంటారు, అమలు చేస్తారు. కనుక వీరికి మతతత్వం అవసరం. ఇతర మతాలను చూపుతూ తమ మతంలోని కష్టజీవులను అణచి, దోపిడీ సాగించేందుకు ఇది అవసరం. కనుకనే మతతత్వం నేటి వర్గ దోపిడీ పీడక శక్తుల చేతులలో ఒక పనిముట్టు. సామ్రాజ్యవాదుల దోపిడీ ప్రయోజనాలను నిరాఘాటంగా అమలు చేసేందుకు ఉపయోగపడే క్రూర సాధనం.

భైంసా ఘటనలు శ్రామిక, విప్లవ ప్రజాతంత్ర శక్తులముందు విసురుతున్న సవాలు ఇది. ఊడలు దిగుతున్న ఈ విష వృక్షాన్ని ఎదుర్కొనటానికి పైపై విమర్శలు, సాధారణ పరామర్శలు, ఉదారవాద ప్రకటనలు, ఖండనలు ఏ మాత్రం చాలవు. చాప క్రింద నీరులా ప్రజలలోకి చొచ్చుకొని వస్తున్న ఫాసిస్టు శక్తుల తాత్విక, రాజకీయ సిద్ధాంత విషధోరణులకు వ్యతిరేకంగా అంతకన్నా తీవ్రంగా ప్రజలనుసమీకరించి విజ్ఞానవంతం చేసే తాత్విక, భౌతిక, రాజకీయ, సాంస్కృతిక, మానసిక రంగాలలో సంకుల సమరానికి సిద్ధపడకుండా మతతత్వ శక్తుల సవాలును త్రిప్పికొట్టలేము. మహత్తర తెలంగాణా ప్రజా సాయుధ పోరాటానికి ముందు, ఆ తరువాత వెల్లివిరిసిన ప్రజాతంత్ర చైతన్యపు పునాదులను దెబ్బతీసేందుకు, తుడిచి పెట్టేందుకు తెలంగాణా విమోచనా దినోత్సవంతో మొదలుపెట్టి మత ఘర్షణల వరకూ అన్ని అంశాలనూ ఉపయోగించుకొనేందుకు సాగుతున్న ఈ కుట్రలను త్రిప్పికొట్టాలి.

భైంసా, వటోలి ఘటనలు అందిస్తున్న హెచ్చరిక ఇది. విప్లవ, ప్రజాతంత్ర, లౌకిక ఉద్యమ శక్తులు ఐక్యం కావాల్సిన సమయమూ ఇదే.

# 'పత్రికా స్వేచ్ఛ-సమాజం'-రాజ్యంపై గోష్ఠి- రైతుకూలీసంఘం పత్రం

*(2008 మే 26న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'బాడుగ నేతలు' శీర్షికన కథనం వచ్చింది. దీనికి ప్రతిగా 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక సంపాదకుడు, జర్నలిస్టులపై యస్.సి., యస్.టి., అత్యాచార (నిరోధక) చట్టం క్రింద కేసులు నమోదు చేయటం కృష్ణమాదిగ నేతృత్వంలో ఆంధ్రజ్యోతిపై దాడి నేపథ్యంలో 2. 7. 08న విజయవాడలో 'పత్రికా స్వేఛ్ఛా -సమాజం-రాజ్యం' పై గోష్ఠి కార్యక్రమంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ఝాన్సి సమర్పించిన పత్రం.)*

'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'బాడుగ నేతలు' అనే కథనం వ్రాయటం సరైందా? కాదా? మందకృష్ణ అనుచరులు 'ఆంధ్ర జ్యోతి' కార్యాలయంపై దాడి చేయటాన్ని సమర్ధిస్తారా? వ్యతిరేకిస్తారా? 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్‌పై ఎస్.సి., ఎస్.టి., అత్యాచార నిరోధక చట్టం క్రింద కేసు బనాయించటం సరైనదా? కాదా? 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్‌ను, మరికొందరు సిబ్బందిని పోలీసులు అర్ధరాత్రి అరెస్టులు చేయటం న్యాయసమ్మతం అవునా? కాదా? అనే విధంగా ఒక్కో అంశాన్ని విడదీసి, ముక్కకు ముక్కగా, సమర్ధనో, ఖండనో సాగిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో కొనసాగుతున్నది. ప్రజలకోణంలో, ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోణంలో సమగ్రమైన, ఉద్వేగపూరితమైన ఆలోచన, విశ్లేషణ కొరవగా వుండి, ఎటో ఒకవైపు తేల్చి చెప్పమనే తీరు, ఆందోళన కలిగించేదిగా వుందని అభిప్రాయపడుతున్నాం.

సమాజంలో అణగారిన సమూహాలుగా వున్న దళితుల హక్కుల కోసం పోరాడే సంఘాలు ఒక వైపున ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల్ని ప్రతిబింబించాల్సిన పత్రికలు మరోవైపున-మోహరించి పరస్పర దూషణలు, కేసులు, దాడులు సాగించడం వలన నష్టపోతున్నదెవరు?, తగాయిదా వలన లబ్ధి పొందుతున్నదెవరనే విషయం సమాజ హితం కోరుకునేవారికి తేలిగ్గానే అర్ధమౌ తుంది. ప్రస్తుత సందర్భంలో-ప్రజాస్వామిక ప్రవాహాలుగా సాగాల్సినవి రెండూ, శత్రుపూరితంగా సంఘర్షణ పడటమనేది దోపిడీ రాజ్యాంగ యంత్రానికి, ప్రభుత్వాల ప్రయోజనాలకీ తోడ్పడుతుందనే ప్రధానమైన అంశాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ప్రజా ఉద్యమ నాయకులు, పత్రికా సిబ్బంది, సంపాదకులు-పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో మే 26న 'బాడుత నేతలు' పేరిట అన్యాపదేశంగా రాసిన కథనం పత్రికా విలువలను కాపాడేదిగా లేదనీ, దీనికి ప్రతిగా-'ఆంధ్ర జ్యోతి' తన కథనాన్ని వెనక్కు తీసుకొనే వైపుగా, ప్రజాస్వామిక, దళిత, హక్కుల సంఘాలను, కూడగట్టుకొని చేయవలసిన కార్యక్రమాల స్థానంలో-'ఆంధ్ర జ్యోతి' కార్యాలయంపై మందకృష్ణ వర్గీయులు దాడి చేయటం విజ్ఞత కలిగిన చర్య కాదు.

పత్రికలకు పెట్టుబడిపెట్టే యాజమాన్యాన్ని, పత్రికా సిబ్బందిని మేము వేరుచేసి చూడాలని భావిస్తున్నాం. పత్రికల యాజమాన్యాలు పత్రిక స్వేచ్ఛ గురించి మాట్లాడుతూనే, తమ పత్రికా సిబ్బందికి కనీస పాటి స్వేచ్ఛ లేకుండా, సంఘటితపడనీయకుండా చేయటం, హక్కుల గురించి ప్రశ్నించిన వారిని అణచివేయటం వాస్తవం కాదా? దేశంలో, రాష్ట్రంలో ప్రజల ప్రజాస్వామిక హక్కులు కాలరాయబడుతుంటే, నల్లచట్టాలు రాజ్యమేలుతుంటే పత్రికల గొంతెందుకు పెగలటం లేదు? ప్రజల ప్రజాస్వామిక, సామూహిక ఉద్యమాలకంటే సంచలనాత్మక, వ్యాపారాత్మక అంశాలకే పత్రికా యాజమాన్యాలు ప్రాధాన్యతనిస్తున్నారనే విషయం, ప్రజల ప్రయోజనాన్ని పత్రికా యాజమాన్యాలు ఉద్దేశపూర్వకంగా గాలి కొదిలివేస్తున్నాయనే విషయం వాస్తవం కాదా? గత ఆరు దశాబ్దాల 'స్వతంత్ర' పాలనలో అధికారంలోకి వచ్చిన పాలకులెవరైనా సరే, దేశాన్ని క్రమంగా తాకట్టు పెట్టడమే కాదు, సకల సంపదలను దోచుకుపోవటానికి ఆమోదిస్తూ, సామ్రాజ్యవాదులకు అమ్మివేస్తున్నారనే కఠోర వాస్తవం-పత్రికాధిపతులుందరికీ తెలిసినా-ఈ నిజాన్ని తమ పత్రికల్లో వెలుగుజూడ నియ్యకపోవటం, దీనిని పాలకుల అవినీతికి సంబంధించిన పైపై విషయంగా పరిమితం చేసి, 'మసిబూసి మారేడు కాయ'చేయటం – ఏ విధంగా ప్రజా పక్షం వహించటమౌతుంది.

ఆయా పత్రికాఫీసులపై దాడులు జరిగిన సందర్భంలోనో, పోలీసులు పత్రికా సిబ్బందిని అరెస్టులు సాగించిన సందర్భంలోనో-ఆయా పత్రికా యాజమాన్యాల ఆసక్తుల మేరకు సిబ్బంది యావత్తు ఈ చర్యలను ఎలుగెత్తి ముక్తకంఠంతో ఖండించినప్పటికీ, ఇంతకు మరెన్నో రెట్లు దారుణాలు, నిర్బంధాలూ సాగుతున్నా ఈ విధమైన స్పందన కొరవడటానికి కారణాలేమిటో పత్రికా సిబ్బంది పరిశీలించుకోవాలి. తమ పత్రికా ప్రపంచంలో హక్కుల సాధనకోసం, బయట ప్రపంచంలో ప్రజాస్వామికహక్కుల సాధన కోసం విలేకరులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులందరూ సంఘటితపడాలని ఆకాంక్షిస్తున్నాం.

సమాజంలో పీడిత కులాల హక్కుల సాధన కోసం కృషిచేసే సంఘాలు, ఉద్యమాలు ఏవైనా-పీడితుల్ని, విభజించి పాలించే **(తరువాయి 120వ పేజీలో)**

నివేదిక

# 'జూన్ 17 పనసభద్రపై దాడి'-నిజ నిర్ధారణ కమిటీ నివేదిక

*2009 జూన్ 17న విజయనగరం జిల్లా మక్కువ మండలం పనసభద్ర గ్రామంలో నాలుగు గిరిజనేతర కుటుంబాలపై జరిగిన 'దాడి'ని కరువుదాడిగా పేర్కొంటూ, దానికి రైతుకూలీసంఘాన్ని, ఆ సంఘ జిల్లా నాయకత్వాన్ని, కార్యకర్తలను బాధ్యులను చేస్తూ జిల్లా పోలీసు యంత్రాంగం అక్రమంగా కేసులు బనాయించి అరెస్టులు సాగిస్తున్న నేపథ్యంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ఈ ఆరోపణలను ఖండించింది. వాస్తవాలను పరిశీలించమని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర నాయకత్వం పౌర, ప్రజాస్వామికహక్కుల సంఘాలకు, ప్రజాతంత్రవాదులకు విజ్ఞప్తి చేసింది.*

*ఈ విజ్ఞప్తి మేరకు డి.సత్యనారాయణరెడ్డి (రిటైర్డ్ సెషన్స్ జడ్జి) అధ్యక్షులుగా డాక్టర్ కె.ఆర్.చౌదరి (రిటైర్డ్ ప్రొఫెసర్) ఉపాధ్యక్షులుగా సి.భాస్కరరావు (ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) కార్యదర్శిగా నిజనిర్ధారణ కమిటీ ఏర్పడి విజయనగరం జిల్లాలోను, పొరుగునే వున్న ఒరిస్సా రాష్ట్ర సరిహద్దు గ్రామాలలోనూ 2009 జులై 4,5 తేదీల్లో పర్యటించింది. ఈ నిజనిర్ధారణ కమిటీలో వి.నారాయణరెడ్డి (న్యాయవాది, హైదరాబాద్), జయవింధ్యాల(న్యాయవాది, పియుసిఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), టి.శ్రీరామమూర్తి (ఏపిసిఎల్‌సి విశాఖజిల్లా ఉపాధ్యక్షులు), సిహెచ్.జగదీశ్వరి (న్యాయవాది, విశాఖపట్నం), ఆర్. వాసుదేవరావు (ఉపాధ్యాయ పత్రిక సంపాదకవర్గ సభ్యులు), డి.ప్రకాష్ (పియుసిఎల్ కన్వీనర్, విశాఖపట్నం) సభ్యులుగా వున్నారు.*

**కమిటీ నిర్ధారణలు**

1. జూన్ 17 రాత్రి విజయనగరం జిల్లా పనసభద్ర గ్రామంలో నాలుగు ఇళ్ళలో దోపిడీ జరిగింది. ఆ దోపిడీలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర)కు గానీ, ఆ సంఘ జిల్లా నాయకులగు 1.దంతలూరి వర్మ, 2.మోనంగి భాస్కరరావు, 3. మండంగి ప్రసాదు, 4. ఊయక ముత్యాలు, 5. శ్రీనునాయుడు-లకుగానీ ఆ సంఘ ప్రజలకుగానీ ఎలాంటి సంబంధం లేదు.

2. మావోయిస్టులకు సీదరపు రాజప్ప, నన్యాని, తిరుపతి, వనతి భోజనం కల్పించినట్లు తమ విచారణలో తేలిందని ఓఎస్‌డి రవీంద్రనాథ్‌జూన్ 28న ప్రకటన చేశారు. వీరిది అనసభద్ర గ్రామం. ఆ గ్రామంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) లేదు. ఈ గ్రామం పనసభద్రకు కొంత దిగువున, కోరాపుట్‌జిల్లాకు అందుబాటులో వుంటుంది.

3. పనసభద్ర దాడిలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) పాత్ర వున్నట్లు ఆ గ్రామ ఇన్‌ఛార్జి రెవిన్యూ అధికారి పూర్ణచంద్ర ఫిర్యాదులో లేదన్నది గమనార్హం. ఈ దాడిలో ఆదివాసీ విప్లవ రైతుకూలీసంఘాలు, మావోయిస్టులు పాల్గొన్నట్లు అతను చెప్పాడని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

4. అన్ని విషయాలను పరిశీలించిన పిమ్మట విజయనగరం జిల్లా పార్వతీపురాన్ని ఆనుకొని వున్న కోరాపుట్‌జిల్లా, బందుగాం బ్లాక్‌లో ప్రజాసమస్యలపై బహిరంగంగా కార్యక్రమాలు సాగిస్తూ గిరిజన, పేద గిరిజనేతర ప్రజలను ఐక్యం చేస్తూ వేగంగా వ్యాప్తి చెందుతున్న రైతుకూలీసంఘం (ఆం.ప్ర)ను, చాషీమూలియా ఆదివాసీ సంఘాన్ని లేకుండా చేయాలన్న కొత్త పెత్తం దారీ వర్గాల డిమాండ్ మేరకు విజయనగరం జిల్లా పోలీసు యంత్రాంగం ఆ సంఘ జిల్లా నాయకులపై పనసభద్ర దాడి కేసు అక్రమంగా బనాయించి, అరెస్టులు సాగిస్తున్నారు. పోలీసువారి ఈ చర్య ప్రజల చట్టబద్ధ రాజ్యాంగ హక్కులపైన దాడి అవుతుంది. దీనివల్ల కొన్ని విపత్కర పరిణామాలు సంభవించే అవకాశముంది. దానికి జిల్లా పాలనా యంత్రాంగందే పూర్తి బాధ్యత అవుతుంది.

పై పరిశీలనల ఆధారంగా ఈ క్రింద పేర్కొన్న విధంగా సమస్యలను వెంటనే పరిష్కరించాలని నిజనిర్ధారణ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

1. జూన్ 17రాత్రి పనసభద్రలో నాలుగు గిరిజనేతర కుటుంబాలపై జరిగిన దాడిలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర)ను, ఆ సంఘానికి చెందిన జిల్లా నాయకులగు ఐదుగురిపై, పేరు పేర్కొనని మరికొందరిపైనా కేసు పెట్టటం (సి.ఆర్.నె. 30/90, మక్కువ పోలీస్ స్టేషన్) పూర్తిగా అక్రమ చర్య కనుక ఆ కేసు వెంటనే రద్దు చేయాలి.

2. ఈ కేసు క్రింద ఎ2గా చూపి జూన్ 27 రాత్రి అరెస్టు చేసిన మోనంగి భాస్కరరావును వెంటనే బేషరతుగా విడుదల చేయాలి.

3. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సంఘం పెట్టుకోవటం, ఆ సంఘాలకు నాయకత్వం వహించటం ఆందోళన చేయటం పూర్తిగా ప్రజాస్వామిక మని, రాజ్యాంగబద్ధమని పోలీస్ యంత్రాంగం గమనించాలి. అలాంటి సంఘ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించటం మానవ హక్కుల ఉల్లంఘన క్రిందకు వస్తుందని పోలీస్ అధికారులు గమనించాలి.

4. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) పనసభద్ర దాడి చేసిందని జిల్లా ఎస్.పి. గంగాధర్ జులై 4న కూడా ప్రకటించటం దురుద్దేశపూరితం. ఆయన నిష్పక్షపాతంగా నిజానిజాల ఆధారంగా వ్యవహరించాలి. రైతుకూలీసంఘాన్ని అణచివేసే దృష్టితో వ్యవహరించరాదు.

5. 1/70 (ఆంధ్రప్రదేశ్) చట్టాన్ని, 2/60 (ఒరిస్సా) చట్టాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరిపి, గిరిజన భూములన్నింటినీ గిరిజనులకే అప్పగించాలి.

6. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీ హక్కుల చట్టం-2006, రూల్స్-2008 ప్రకారం జిల్లా కలెక్టరు కమిటీలను ఏర్పాటుచేసి భూములపై గిరిజనుల హక్కులను నిర్ధారించాలి.

7. గిరిజనులు నివసించే ప్రాంతాలను ఏజెన్సీ ప్రాంతంగా ప్రకటించాలి.

(118వ పేజీ నుండి)

దోపిడీవర్గాల పట్ల స్పష్టమైన అంచనా కలిగి వుండాలి. మొత్తంగా, అగ్రకుల భూస్వామ్య, దోపిడీవర్గ వ్యతిరేక ప్రవాహాల్లో భాగంగా ఈ ఉద్యమాలు సాగాలి. దోపిడీవర్గ వ్యతిరేక పోరాట సంఘాలతో, పార్టీలతో, సంస్థలతో సన్నిహిత సంబంధాలను కలిగి వుండాలి. ఈ విధమైన స్పష్టతతో ఒక వైఖరిని కలిగి వుండకపోతే, నిజాయితీగా ఉద్యమాలు నిర్మించినా, సమస్యలు పరిష్కరించబడక పోగా, పాలకులు తమ చేతిలో మనల్నే ఒక ఆయుధంగా మార్చి, 'మన కంటిని మన వేలితోనే పొడుస్తా'రనే విషయాన్ని కూడా స్పష్టంగా గుర్తించాలి.

నేటి సమాజంలో 'ప్రజాస్వామ్యం'– 'నేతిబీరలో నేయి' చందమేనని మా నిశ్చితాభిప్రాయం. మన అనుభవాలూ, దానినే రుజువు చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామిక హక్కుల కోసం నిలిచే సమూహాలు శత్రుపూరితంగా కలహించుకోవటం–ప్రభుత్వాల దోపిడీవర్గ ప్రయోజనాలకే తోడ్పడుతుందని గమనించుకొని, 'ఆంధ్రజ్యోతి' సంపాదకులు, పత్రికా సిబ్బంది కృష్ణమాదిగ, దళిత సంఘాల ప్రతినిధులు–సిబిసిఐడి దర్యాప్తులు, పోలీసు దర్యాప్తుల ద్వారానోకాక పౌర, ప్రజాస్వామిక హక్కుల సంఘాల ప్రతినిధుల, ప్రజాస్వామికవాదుల సమక్షంలో, సంయమనంతో ప్రతిష్టకు పోకుండా చర్చించుకోవటం ద్వారా ఈ సమస్య మరింత ముందుకు సాగకుండా పరిష్కరించుకోగలుగుతారని, ఒక మంచి సాంప్రదాయాన్ని నెలకొల్పిన వారౌతారని భావిస్తున్నాం. దళితుల హక్కులను, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న పీడిత ప్రజా సమూహాలను విభజించి, పాలిస్తున్న నిరంకుశ దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

---

**అరువు లిచ్చి కరువు తెచ్చి**
**ఋణం పెట్టి రణం తెచ్చి**
**జనం ధనం ఇంధనమై**
**చరణ కరాబంధనమై**
**జనన జరా మరణ దురా**
**క్రమణల సంగ్రంథనమై**
**ఒకనా డోహొ అని పిం**
**చుక తిరిగిన ధనిక వాద**
**మికపై వెగటై జిగటై**
**మరణంలో మశౌతుంది**

శ్రీ శ్రీ
'మున్నుడి' నుండి

విశ్వాంతరాళంలో
విధ్వంస క్రీడకు పూనుకున్నవాడికి
ఆకుమడి మీద అత్యాచారం ఒక్క లెక్కా
తార్వాదుతనంలో తారపథానికి
చేరుకొన్న వాడికి
విషపు గోళ్ళతో
మట్టి కడుపును మెలేసి పిండుకోవడం
పెద్ద విద్యా!

యార్లగడ్డ రాఘవేంద్రరావు
'ముంతపొగ' నుండి

---

మట్టి మడతల్లోని వితంతు విత్తనం గుండె మౌనంగా బద్దలయ్యింది
రైతుముఖ చిత్రంలో తుపాను పుట్టింది
.... .... .... ....
చర్మం కింద నెత్తురు కదిలింది.
.... .... .... ....
బంగారు పొద్దులో నడచి నడచి
బువ్వను పండించడానికి బ్రహ్మాండంలోని పోతున్నావు
దున్నినంత దున్ను ఈ భూమి మండలం నీది
గంగలు నీవి గోదావరలు నీవి
ఏరువాకలు నీవి విత్తనాలు నీవి ఎరువులు నీవి
పురుళ్ళు నీవి పున్నాలు నీవి
పండుగలు నీవి పబ్బాలు నీవి
కర్రు నీది కలం నీది
సిరా నీది చినుకు నీది
ఓహ్! ఎంత సుందరం ఈ కల!

ఛాయరాజ్
'తొలకరి' నుండి

---

**మోటుబావి నుండి పాటల్ని చేది, పొలాల్ని పారించే జీతగాడు**
**బాల్యాన్ని పశువులకు మేతమేసి, ఈలవేస్తూ తిరిగే పసివాడు**
**నామీద ముద్రపడే అక్షరాలు నన్ను కవిత్వం చేసే సముద్రాలు**
**గడ్డికోయడానికో కట్టెలు మోయడానికో, శరీరాల్ని అంకితం చేసినవాళ్ళు**
**నాగలి వెంటో, కాల్వల వెంటో, బతుకంతా నడిచేవాళ్ళు**
**నన్ను మట్టినిచేసి, విత్తనం చేసి, విశ్వమంతా పరిమళాల్ని నింపుతారు**

అశారాజు
'జనమే నేనై' నుండి

# వీరోచిత మునగాల రైతాంగ ప్రజా ఉద్యమం

**టి. వెంకట్రావు**

మునగాల పరగణా ప్రజల పోరాటం -మన తెలుగు గడ్డ మీద జరిగిన అనేక జమీందారీ వ్యతిరేక పోరాటాలలో విశిష్ట మైనది. తమ ప్రాంతంలోని బ్రిటీష్ పాలన, జమీందారీ విధానాలను వ్యతిరేకించడమే కాక, పరగణా చుట్టూ ఆవరించిన నిజాం సంస్థానంలోని ఫ్యూడల్ వ్యతిరేక పోరాటాలకు అన్ని రకాల అండదండలు ఇచ్చిన పోరాటం ఇది. ఎన్నో త్యాగాలు చేసి సాగించిన ప్రజల వీరోచిత పోరాటం ఇది. ఎన్నో అనుకూల, ప్రతికూల అనుభవాల రాశి, మునగాల ప్రజాపోరాటం.

బ్రిటీష్ సామ్రాజ్యవాదులు భారత దేశంలో ప్రవేశించడానికి చాలా కాలం ముందే వారు తమ దేశంలోని రాజరికంపై తిరుగుబాటు చేసారు. ఇంగ్లాండ్ చక్రవర్తి తలనరికి ఒక వ్యవస్థగా ఉన్న ఫ్యూడలిజాన్ని దెబ్బతీసి ప్రజాతంత్ర విప్లవాన్ని తీసుకొని వచ్చారు. అదే బ్రిటీష్ పాలకులు వారి వ్యాపార పెట్టుబడులకు విపరీత లాభాల కోసం, ముడిసరుకుల కోసం, ప్రపంచ వ్యాపితంగా వలస పాలన రుద్దారు. మన దేశంలో బ్రిటీష్ ఈస్టు ఇండియా కంపెనీ రాజ్యపాలన ప్రారంభమైన కొన్ని సంవత్సరా లకే అమెరికాలో ప్రజలు బ్రిటన్ వలస పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి వలస పాలనను 1773లో నిర్మూలించు కొన్నారు. ప్రపంచంపై తమ ఆధిపత్యం నిలవాలంటే భారతదేశం మాత్రమే కీలక మైనదిగా గుర్తించిన వలసపాలకులు, తమ దోపిడీ పీడనలను స్థిరపరచుకొనేందుకు, భారత ప్రజలు తిరుగుబాట్లు చేయకుండా నివారించేందుకు ఒక తొత్తు వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దీనిలో భాగంగానే 'శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి' పేర జమీందారీ విధానాన్ని బ్రిటీష్ పాలకులు రుద్దారు.

ఈ జమీందారీ విధానం తమ దేశంలో తాము నిర్మూలించిన ఫ్యూడల్ ఎస్టేట్ విధానపు డొంకతిరుగుడు రూపమే. 1802 నాటికి ఆంధ్రదేశంలో ఇలాంటి ఎస్టేట్లు 563 ఉన్నాయి. బ్రిటీషు పాలకులు కంపెనీ పాలన కింద సృష్టించిన జమీందారీ వ్యవస్థ భారతదేశంలో అప్పటివరకు ఒక మార్కెట్ సరుకుగా లేని భూమిని ఒక సరుకుగా మార్చింది. అప్పటివరకు ఎవరు పాలించినా అవిచ్ఛిన్నంగా సాగిన రైతాంగపు సాంప్ర దాయక హక్కులను కాలరాచి భూములను అమ్ముకొని అన్యాక్రాంతం చేసుకొనే హక్కును మాత్రం జమీందారులకి దఖలు పరిచింది. బ్రిటీష్ పాలకుల తొత్తులుగా ఈ జమీందార్లు విర్రవీగి 1802 శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి ప్రకారం ఎంతైతే 'పేష్కస్'ను చెల్లించాలో అంతకు ఎన్నో రెట్లు ఎక్కువగా ప్రజల నుంచి వసూలు చేసి ప్రజలను-రైతులను చెప్పనలవి కాని బాధలకు గురిచేశారు. ఫలితంగా పైన జమీందారీ విధానం, క్రింద బానిసత్వం అమలు జరిగింది. ఎక్కడో పట్టణాలలో ఉండే జమీందారుకి అసలు భూమిని దున్ని పండించే రైతుకు మధ్య ఎందరో దళారీలు, వడ్డీ వ్యాపారులు- జమీందారులతో పాటు రైతుల భుజాల మీదకెక్కి వారి యాజమాన్య హక్కులను కాలరాయడం ద్వారాను, వారిని నిలువు దోపిడీ చేయడం ద్వారానూ, రైతు జీవితాన్ని సర్వనాశనం చేసారు. రైతాంగానికి పోరాటం తప్ప మరోమార్గం లేకుండా చేసారు. ఈ నేపథ్యంలో మునగాల పరగణా రైతాంగ పోరాట చరిత్రను చూడాలి.

## మునగాల పరగణా చరిత్ర

మునగాల సంస్థానం పురాతనమైనది. కాకతీయుల కాలం నుండీ ఉనికిలో ఉండి ఆ తర్వాత నిజాం రాజ్యంలో భాగంగా ఉండేది. నిజాం ప్రభువు, బ్రిటీష్ వారి కూటమికి-టిప్పు సుల్తాన్, ఫ్రెంచి కూటమికి మధ్య జరిగిన (1743-1760ల మధ్య) కర్ణాటక యుద్ధాలలో మునగాల సంస్థానాధీశు లు నైజాం నవాబు తరపున నిలిచారు. నేటి కృష్ణాజిల్లాలోని ముక్త్యాల జమీందార్లు ఫ్రెంచి వారి తరపున నిలబడ్డారు. ఈ పోరాటంలో నిజాం, బ్రిటీష్ కూటమి విజయం సాధిం చింది. ఈ యుద్ధాలలో జాతీయ ప్రజాతంత్ర వాది అయిన టిప్పు సుల్తాన్‌ను హత మార్చడంలో బ్రిటీషు వారు సహకరించి నందుకు ప్రతిఫలంగా 12-11-1766న నిజాం నవాబుకు బ్రిటీషు వారికి జరిగిన సహకార ఒడంబడికతో ఐదు సర్కార్ జిల్లాలు బ్రిటీషువారికి అప్పగించాడు. అయితే వజ్రాలు దొరికే పరిటాల ప్రాంతాన్ని నైజాం నవాబు ఉంచుకొని, లింగగిరి, మునగాల పరగణాలను బ్రిటీషువారికి అప్పగించారు. దానితో చుట్టూ నైజాం సంస్థానం ఉంటే మధ్యలో ద్వీపంలాగా కృష్ణాజిల్లాలో భాగంగా మునగాల పరగణా, లింగగిరి ఉండేవి.

బ్రిటీష్ సామ్రాజ్యవాదులకి మునగాల జమీందారుల విశ్వాసపాత్రత రీత్యా 1802లో మద్రాసు ప్రెసిడెన్సీలో ప్రవేశపెట్టిన శాశ్వత ఫైసల పద్ధతి ప్రకారం మునగాల జమీందార్లు సంవత్సరానికి 4008 రూపాయలు పేష్కస్ అనబడే కప్పం చెల్లించాలి. అదే ఫ్రెంచి వారికి సహకరించిన ముక్త్యాల జమీందారు చెల్లించవలసిన పేష్కస్ 17,511 రూపాయ లుగా నిర్ణయించబడింది.

ఈ క్రమంలో 1900 సం॥లో మునగాల జమీందారుగా రాజా నాయని వెంకట రంగారావు, మైనార్టీ తీరిన అనంతరం జమీందారు అయ్యారు. ఆయనకి దివానుగా

కొమర్రాజు లక్ష్మణరావుగారు వ్యవహరించారు.

### మునగాల జమీందారు వెలుగునీడలు

వెంకటరంగారావు, కొమర్రాజు లక్ష్మణ రావులు హైదరాబాద్‌లో రావిచెట్టు రంగారావుతో కలిసి 1901 కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయాన్ని, 1902లో హనుమకొండలో రాజరాజనరేంద్ర భాషా నిలయాన్ని స్థాపించారు. ఆనాటి తెలుగు భాషా సేవలో ప్రముఖ పాత్ర వహించారు. విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలిని స్థాపించారు. అనేక పుస్తకాలను ప్రచురించారు. ఆంధ్ర విజ్ఞాన సారస్వతం కొన్ని సంపుటాలు తెచ్చారు. అనేకమంది కవుల పుస్తక ప్రచురణలకి సహకరించారు. జాతీయ జెండాను రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య నడిగూడెం దివాణంలో ఉండగానే దానికి రూపకల్పన చేశారు. జాతీయ కాంగ్రెసు మహాసభలకి విరాళాలు ఇవ్వడం, జాతీయ నాయకులతో సంబంధాలు ఏర్పరచుకోవడం సాగించారు.

మరోపక్క వెంకటరంగారావు మునగాల ఎస్టేటు జమీందారుగా దత్తత వచ్చాడు. కనుక అతని దత్తత చెల్లదని దాయాదులు తెచ్చిన వాజ్యాలను పరిష్కరించుకొనేందుకు లండన్ ప్రీవికౌన్సిల్ వరకూ కేసులలో తిరిగేందుకు, ఆయన ప్రజలపై అంతకంతకూ భారాలు పెంచుకుంటూపోయాడు. కొమర్రాజు లక్ష్మణరావు మరణం తర్వాత అతనిలో ఫ్యూడల్ వర్గ దురఃహంకారం మరింత బలపడింది. బయట దయాళువు, వితరణశీలి గానూ, సంస్థానం లోపల పరమ కర్కోటకం గానూ వ్యవహరించసాగాడు.

### జమీందారు దురాగతాలు

శిస్తులు పెంచడం, జరిమానాలు విధించడానికి సివిల్, క్రిమినల్ అధికారాలను ఉపయోగించడం, వెట్టిచాకిరీ, అనేక దౌర్జన్యాల ద్వారా భూముల ఆక్రమణ సాగించాడు.

జమీందారు దౌర్జన్యాలకు నిరసనగా 1930లో ప్రథమ మునగాల జమీన్ రైతు మహాసభ జరిగింది. దీనికి అప్పటి శాసనసభ్యులు బి.విశ్వనాథదాస్, టంగుటూరు ప్రకాశం పంతులు హాజరై, జమీందారుకి వ్యతిరేకంగా రైతు సంఘాన్ని బలపర్చారు. జమీందారు ఈ రైతుసంఘాన్ని విచ్ఛిన్నం చేసేందుకు క్రూర నిర్బంధాన్ని అమలు చేసాడు. రైతు సంఘం ప్రారంభంలో ఉన్న నాయకత్వం గ్రామ కరణాలు, ఇతర పెద్దలతో నిండి ఉండటంతో పరగణాలోని 19మంది కరణాలలో 11 మందిని సస్పెండ్ చేశాడు. జమీను రైతు సంఘ నాయకుల భూమిని బలవంతంగా స్వాధీనపరచుకొన్నాడు.

ఇలాంటి స్థితిలో మునగాల పరగణాలో జరుగుతున్న పరిస్థితులను గమనించేందుకు నాటి జమీన్ రైతు సంఘం నాయకులు నెల్లూరు వెంకట్రామా నాయుడు మునగాల వెళ్ళారు. ఆయన వెళ్ళేసరికి రైతు సంఘ నాయకులు ఎంత భయభ్రాంతులై ఉన్నారంటే సంఘం అధ్యక్షులు వెంకట్రామనాయుడుతో మాట్లాడేందుకు, చివరికి ఆయన తమ వాకిట్లో అరుగు మీద పడుకొనేందుకు కూడా అంగీకరించలేదు. వెంకట్రామ నాయుడిని సంఘ కార్యదర్శి ఒక రహస్య స్థలంలో జరిగిన సమావేశానికి తీసుకెళ్ళారు. అక్కడ హాజరైన వారు "జమీందారు చేసిన దురాగతాలను చెపుతుంటే నాయుడుగారి కళ్ళ వెంట నీరు వస్తున్నది. కడుపు తరుక్కు పోతున్నది. శిస్తు వసూళ్ళలో నిర్బంధం అమానుషంగా వున్నది. ఇచ్చట బ్రిటీష్ ప్రభుత్వం చెలామణీ కావడం లేదనిపించింది. అంతా జమీందారీ జులుమే. శిస్తు ఇవ్వకపోతే వాకిట్లో, దొడ్లో రేగు కంప కొడతారు. లోపల మనిషి బయటకు, బయట మనిషి ఇంట్లోకి పోవటానికే వీలులేదు. రైతు మెడకు పలుపు వేసి కపిలదూలానికి (వోట దూలానికి) కట్టివేస్తారు. ఇదొక క్రూరమైన మరో పద్ధతి. శిస్తు ఇచ్చేదాక రైతును, ఎట్టటి ఎండలో వంగపెట్టి బండలెత్తేవారు." ఈ విధంగా ప్రజల కష్టాలను వింటున్న సమయంలో జమీందారీ నౌకర్లు వస్తున్నారని తెలిసి సమావేశం ముగించి నాయుడిగార్ని రహస్యంగా అడవి దారుల వెంట కోదాడ చేరిస్తే అక్కడి నుండి ఆయన విజయవాడ చేరారు. వెంకట్రామానాయుడుగారు ఇచ్చిన సమాచారాన్ని రాష్ట్ర జమీన్ రైతు సంఘ ఆర్థిక విచారణ సంఘం నివేదికలో మునగాలకు సంబంధించిన భాగాల్ని 25-1-1935న జమీన్ రైతు పత్రికలో ప్రచురించారు.

నడిగూడెం గ్రామంలోని రాజుగారి గుర్రములకు కావాల్సిన పచ్చిగడ్డిని గ్రామంలోని హరిజనులే సరఫరా చేయాలి. దివాణంలో అవసరమైన అనేక పనులకి

### మునగాల పరగణా మృత వీరులకు లాల్‌సలాం!

మృతవీరులారా, లాల్‌సలాం-
ఇదే మా లాల్ సలాం
దరిలేని బానిస చాకిరి
దొరతనం దోపిడీ పద్ధతి
ఇక వద్దని ఇది రద్దని
పోరాడి నేలకు ఒరిగిన
రణధీరులారా, లాల్ సలాం. ॥మృత॥

మత మూఢ విశ్వాసాలకు
కుల జాతి విద్వేషాలకు
నిరసించుతూ ఎదిరించుతూ
పోరాడి నేలకు ఒరిగిన
యువశూరులారా, లాల్‌సలాం. ॥మృత॥

శ్రమశక్తి దోపిడిదారుని
అధికారగుత్త కుబేరుని
అన్యాయాల అరికట్టుతూ
పోరాడి నేలకు ఒరిగిన
శ్రమజీవులారా, లాల్‌సలాం ॥మృత॥

చిరశాంతి భువి నిండాలని
నరజాతి కల పండాలని
యుగప్రష్టలై కమ్యూనిస్టులై
పోరాడి నేలకు ఒరిగిన
ధృవతారలారా, లాల్‌సలాం

మునగాల పరగణా
మృతవీరులారా, లాల్‌సలాం.

వివిధ గ్రామాలనుండి ఒక్కొక్క హరిజన కుటుంబం నుంచి ఒక్కొక్కరు 5 రోజులు తగ్గకుండా నామమాత్రపు కూలీకి వెట్టిచాకిరీ చేయాలి. చివరకు బ్రాహ్మణులు, పూజారులు దివాణంలో భోజనాలకి కావాల్సినన్ని విస్తళ్ళు కుట్టిపెట్టాలి. చాకలి, మంగలి, ఇతర సేవావృత్తులు, కులాలన్నీ ఉచితంగా సేవలు చేయాలి. 1908 తర్వాత జమీందారు–రైతులకు జిరాయితీ కల్పించేందుకని చెప్పి భూములపై శిస్తులను విపరీతంగా పెంచాడు. ఫలితంగా ఎస్టేటు ఆదాయం పరగణాలోని మొత్తం 24 గ్రామాల నుండి 46 వేల రూపాయల నుండి లక్షా 30 వేలకి పెరిగింది. కానీ బ్రిటీష్ వారికి చెల్లించే పేష్కస్ మాత్రం 4008 రూపాయలు మాత్రమే సాలీనా చెల్లించేవారు. ఈ విధంగా బ్రిటీష్ వారికి ఒక రూపాయి పన్ను వసూలు చేసి పెట్టినందుకు జమీందారు 25 రూపాయలు కమీషన్ తీసుకున్నట్లైంది. చివరగా ఆ నివేదిక ఇలా చెపుతూ ముగించింది.'' విద్యాధికుడనియు, పండిత పోషకుడనియు, వుదారాయములు కలవాడనియు పేరు పడిన యీ జమీందారుగారి సమర్ధ పాలన యొక్క ఫలితములు త్రివిధములై ఉన్నవి. 1. రైతుల యొక్క దుర్భర దారిద్ర్యము, 2. మనోక్లేశము, 3. నిస్సహాయకములై వున్నవి."

## రైతాంగ ప్రతిఘటన 1937-47 వరకూ

జమీన్ రైతు సంఘంగా 1930లలో చేసిన ప్రయత్నం జమీందారు క్రూర నిర్బంధం వల్ల చెల్లాచెదురు అయిపోయింది. 1937 సంవత్సరంలో మద్రాసు శాసనసభకి ఎన్నికలు వచ్చాయి. మునగాల పరగణాలో కాంగ్రెసు కార్యకర్తలు ఎవరూ ప్రచారం చేయకుండానూ పరగణాలో ఓట్లను కాంగ్రెసుకు వేయించేటట్లు జమీందారుకి కాంగ్రెసు అగ్రనాయకత్వానికి మధ్య ఒప్పందం కుదిరింది. తమ సంస్థానంలోకి జాతీయోద్యమ రాజకీయ చైతన్యం రానీయ కుండానూ, రాష్ట్రంలో కాంగ్రెసు గాలి వీస్తున్నది కనుక కాంగ్రెసు గెలిస్తే తనకు వుపయోగపడేలాగా రాజకీయ వ్యూహంతో జమీందారు వ్యవహరించాడు. అయితే ఎన్నికల అనంతరం కాంగ్రెసు సోషలిస్టు తరపున కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు, వెల్లంకి విశ్వేశ్వరరావులు మునగాలలోని అనేక గ్రామాలలో పర్యటించారు. బహిరంగ సభలు నిర్వహించారు. ప్రజలు భయంతో దూరంగా, చాటున ఉంటూ విన్నారు. చంద్ర రాజేశ్వరరావుగారి సూచనతో జగ్గయ్యపేట శాసనసభ్యులు కాట్రగడ్డ వెంకటనారాయణ రావుగారు ఎస్టేటు గ్రామాలలో మరల పర్యటించి గమనించిన విషయాలను పశ్చిమ కృష్ణా కాంగ్రెసు కమిటీకి నివేదించి కాంగ్రెసు కమిటీచే ఒక విచారణ సంఘాన్ని నియమింప చేసారు. 1938 జూలైలో ఆ కమిటీ పర్యటించి మునగాల రైతాంగంపై జరుగు తున్న అమానుష పీడనను గ్రామ కరణాలు–రైతాంగాన్ని పీడించుతున్న తీరును, వారు భూములని లాగుకొంటున్న తీరును వివరించింది. "ప్రతిఫల శూన్యమగు ప్రామ్సరీ నోట్లను'' (ఏమీ ఇవ్వకుండానే డబ్బులు ఇచ్చినట్లు బలవంతాన) రాయించుకోవడం, కోర్టులకి తిప్పటం, భూములుకాజేయడం, తనను వ్యతిరేకించిన వార్ని కొట్టించడం, వారి ఆస్తులను ధ్వంసం చేయించడం సివిల్, క్రిమినల్ చర్యల పేర అమానుష హింసలు ఆ నివేదిక ద్వారా వెలుగు చూసాయి. మునగాల జమీందారు 1925 నుండి 37 వరకూ చాకిరీ ఈనాములు, ఇతర ఈనాములు, శిస్తుల బకాయిల క్రింద కట్టుకొన్న భూములు, హక్కుదారులకు తెలియకుండా దావాలు వేసి ఎక్స్‌పార్టీ డిక్రీలు పొంది వేలం వంటి కర్మకాండను సైతం ఎవరికీ తెలియకుండా జరిపి స్వాధీనం చేసుకొన్న భూములు, రైతు సంఘంలో చేరారని కొందరి నుండి, తమ మధ్య వచ్చిన భూ తగాదాలను మధ్యవర్తిగా తీర్చమని కోరి వచ్చిన వారివి నాగులు, వడ్డీ, బాకీల క్రింద, సాముదాయక భూములను ఆక్రమణ కింద స్వాధీనం చేసుకొన్నవి–ఈ విధంగా వివిధ రకాల అక్రమ పద్ధతులలో స్వాధీనం చేసుకొన్నవి వున్నాయి. ఆ విధంగా ఆక్రమించుకొన్న మొత్తం మెరక భూమి 3,293.37 ఎకరాలుగాను, మాగాణి 336.59 ఎకరాలుగాను మొత్తం 3,629.96 ఎకరాలు అన్యాక్రాంతం చేశాడని ఆ నివేదిక బట్టబయలు చేసింది. 40 పేజీల ఆ నివేదికను అచ్చువేసి విస్తృతంగా పంపకం చేశారు.

తిరిగి పరగణాలో రైతు సంఘం కార్యకలాపాలు వూపందుకున్నాయి. కామ్రేడ్స్ నండూరి ప్రసాదరావు, మోటూరి పరం ధామయ్య తదితరుల నేతృత్వంలో తిరిగి 1935లో జమీన్ రైతు సంఘం సాధారణ సభ జరిగింది. రైతు సంఘ సభ్యత్వం చేర్పించటం, సమావేశాలు జరపటం సాగాయి. రైతులు, కూలీలు పాటలు నేర్చు కొని వీధులలో తిరుగుతూ శత్రువులను గమనిస్తూ ప్రచారం చేయసాగారు. అన్ని కులాల వృత్తులవారు జమీన్ రైతు సంఘంలో చేరారు. వెట్టిచాకిరీ మానుకొన్నారు. జరిమానాలు చెల్లించం అని చెప్పారు. యమ కింకరుల్లాంటి జమీందారు నౌకర్లను చూసి భయపడటం మానివేశారు. "మాకొద్దు జమీందార్ల పొందు'' అనే నినాదం మార్మోగింది.

ఇదే సమయంలో రేపాల అనే గ్రామంలో దీపావళి ఉత్సవాల సందర్భంగా ఆచారం ప్రకారం "మంగలివారు దేవా లయంలో కాగాడాలు వేయాలి". వాళ్ళు వెళ్ళేసరికి జమీందారీ వుద్యోగులు "మీరు సంఘంలో చేరారు కనుక కాగడాలు వేయడానికి వీలులేదని చెప్పారు". తమ సోదరులచే కాగడాలు వేయకుండా నిరోధించి నందుకు "చాకలి వారందరూ దేవుని వాహనం మోయటానికి నిరాకరించారు." దీనితో శివకేశవుల వూరేగింపు ఆగిపోయింది. జమీందార్ల ముఖ్య దైవం లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవం కూడా ఆగి పోయింది. అయితే ప్రజలు ఆ ఉత్సవాన్ని మరో విధంగా జరుప తలపెట్టారు. కా॥ నండూరి ప్రసాదు రావుని రేపాల తీసుకొని వెళ్ళి జాతీయ నాయకుల చిత్రాలను అలంకరించిన బళ్ళ మీద వూరేగించి వేలమంది ప్రజలు సభ జరుపుకున్నారు. ఈ సంఘటన తర్వాత జమీందారి నౌకర్లకి, ప్రజలకి మధ్య ఘర్షణ మరింత తీవ్ర రూపం దాల్చింది.

## కలకోవ సత్యాగ్రహం

కలకోవ గ్రామంలో దళితుల చేత జమీందారు 22 ఎకరాల మాగాణిని మెట్టగా సేద్యం చేయించుకొన్నాడు. ఎకరానికి 40

మానికల చొప్పున 72 మంది హరిజన (దళిత) కూలీల చేత 14 రోజులు పని చేయించుకొని తీరా గింజల కోసం వెళితే ముక్కిపోయిన ధాన్యం 30 మానికలే ఇస్తానని పేచీ పెట్టించాడు. కూలీలు దాన్ని తీసుకో నిరాకరించి 'మాకు సంఘమే కూలి ఇప్పిస్తుందని చెప్పి" తిరిగి వచ్చారు. రైతు సంఘ నాయకులు దివాణానికి వెళ్ళి జమీందారు దర్శనాన్ని కోరితే పోస్టు ద్వారా దరఖాస్తు పెట్టుకొంటే అప్పుడు దర్శనమిప్పి స్తామని జమీందారు కబురు పంపాడు. దానితో కలకోవ సత్యాగ్రహం మొదటి రోజు 500 మందితో ప్రారంభమై 3వ రోజు 33 వేలమందితో జరిగింది. జమీందారుని, ప్రభుత్వాధికారులను ప్రజలు సాంఘిక బహిష్కరణ చేశారు. దానితో కృష్ణాజిల్లా కలెక్టరు ఆ గ్రామం వెళ్ళేసరికి మాసిన గడ్డాలతో, నలిగిన బట్టలతో పోలీసులు కన్పించారు. వెంటనే కలెక్టరు దళితులకి 40 బస్తాల ధాన్యం వారు కోసిన చేల్లోంచి ఇప్పించి వెళ్ళాడు.

## బ్రహ్మయ్య అవార్డు

దీనితో ప్రజల చైతన్యం ఏ స్థాయిలోకి వెళుతుందో 1937న మద్రాసు శాసనసభకి జరిగిన ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు ప్రభుత్వానికి అర్థం అయింది. దాన్ని మరింత పెంచకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అప్పటి ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘ కార్యదర్శి గొట్టిపాటి బ్రహ్మయ్య మధ్యవర్తిగా ఒక కమీషన్‌ను నియమించింది. జమీందారు, రైతు సంఘ నాయకులు ఒక ఒడంబడిక మీద సంతకం చేశారు. అన్యాక్రాంతం చేసిన భూములను జమీందారు తిరిగి ఇచ్చివేయడం గురించి, ప్రతిఫలరహిత ప్రాంసరినోట్లు రద్దు చేయడం; జమీందారు ఆక్రమణలోని పట్టా భూములను తిరిగి ఇచ్చి వేయడం తదితర అంశాలతో బ్రహ్మయ్య తన తీర్పును వెల్లడించారు. బ్రహ్మయ్య అవార్డు అని పేరు పొందిన దాన్ని అమలు పరుస్తానని మొదట సంతకం చేసినవాడు ఈ తీర్పు వచ్చేసరికి ఇపుడు అమలు చేయనని జమీందారు ఎదురు తిరిగాడు. అప్పటికి రెవెన్యూ మంత్రి ప్రకాశం అధ్యక్షతన 'ఎస్టేటు లాంటి అక్టో విచారణా కమిటీ' ఏర్పడింది. రాష్ట్రం అంతా తిరిగి 18 భాగాల నివేదికను ఇచ్చింది. జమీందారులు అనబడే వారు శిస్తు వసూళ్ళ ఏజెంట్లు తప్ప ఏమీ కాదని 1802 నాటి శిస్తు రేట్లనే వసూలు చేయాలని చెప్పింది. అంతేతప్ప అసలు జమీందారీ విధానమే రద్దు చేసి దున్నుకొనే రైతులకే భూమి హక్కుని ఖచ్చితంగా చెప్పలేదు. కాంగ్రెసు అధికారంలో ఉంది. రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి బ్రహ్మయ్య అవార్డు ఇచ్చారు. దాన్ని అమలు చేసే పనిని మాత్రం ప్రభుత్వం చేపట్టలేదు.

దానితో బ్రహ్మయ్య అవార్డు అమలు చేయాలని రైతాంగం, రైతు సంఘం సత్యాగ్రహంకి పిలుపు ఇచ్చింది. 1930లలో జమీందారు ఆక్రమించిన ఇమ్మడి పాపయ్య గారి భూమిలోకి అరకలు గట్టి ప్రవేశం చేందుకు, 1939 జూన్ రెండున ప్రారంభ మైన ఈ భూస్వాధీన సత్యాగ్రహంలో వందలాది మంది కదిలారు. నాయకులను అరెస్టు చేసి తీసుకొని వెళుతున్న పోలీసులను 300మంది మహిళలు అడ్డగించారు. 4-6-'39 నుండి ప్రభుత్వం క్రూరంగా విరుచుకు పడింది. సత్యాగ్రహుల రక్తం భూమి మీద ప్రవహించింది. కొట్టించింది బ్రిటీషువారు కారు. బ్రిటీషు పాలనలో మద్రాసు శాసన సభను పాలిస్తున్న కాంగ్రెసు ప్రభుత్వమే ఈ దురాగతం చేసింది. చివరకు అరకలకు కట్టిన పశువులను సైతం అరెస్టు చేసి తిండి, నీరు ఇవ్వకుండా మాడ్చిన ఘనత కాంగ్రెస్ నాయకత్వానిదే. 17 రోజుల పాటు జరిగిన ఈ సత్యాగ్రహంలో 350మందిని అరెస్టు చేశారు. 11-6-1939న మునగాల దినోత్సవంగా జరపమని ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పిలుపు ఇచ్చాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుండి 'మునగాల రైతాంగ సమస్యలు పరిష్కరించాలి, బ్రహ్మయ్య అవార్డును ప్రభుత్వం అమలు చేయించాలని' విజ్ఞప్తులు వెళ్ళాయి. దానితో 18-6-39న రెవెన్యూ మంత్రి ప్రకాశం పంతులు బ్రహ్మయ్య అవార్డును అమలు జరిపిస్తామని, సత్యాగ్రహాను విరమించమని విజ్ఞప్తి చేయడంతో సత్యాగ్రహం విరమించబడింది. సత్యాగ్రహంలో పాల్గొన్న రైతాంగాన్ని విడిచిపెట్టి నాయకులను మాత్రం సంవత్సరం జైలు శిక్ష తరువాతే విడుదల చేసారు. ఈ విధంగా భూములలో ప్రవేశించి స్వాధీనపర్చుకోవడం కోసం సాగిన సత్యాగ్రహం రైతుల, కూలీల సమరశీలతను చాటి చెప్పింది. అపుడే ఏర్పడి ఇంకా బాల్యావస్థలో ఉన్న కమ్యూనిస్టు పార్టీకి ఎన్నో విలువైన అనుభవాలను అందించింది. కాంగ్రెసు పార్టీ నాయకత్వపు స్వభావం భూస్వాముల, జమీందారులకి అనుకూలంగా మారుతున్న విషయాన్ని పొడగట్టింది.

## 1941-48 వరకూ

1939 తర్వాత పరిణామాలు మరింత వేగవంతం అయ్యాయి. మద్రాసు శాసన సభలో కాంగ్రెసు ప్రభుత్వం దిగిపోయింది. తెలంగాణా ప్రాంతంలో ఆంధ్ర మహాసభ ఏర్పడి తెలంగాణా ప్రజానీకాన్ని జాగృతం చేస్తున్నది. మునగాల జమీందారుకి నైజాంలోని బేతవోలు జమీందారుకి మధ్య వైరుధ్యాల రీత్యా తన జమీలో రైతాంగాన్ని క్రూరంగా అణుస్తున్న మునగాల జమీందారు బేతవోలు జమీందారుకి వ్యతిరేకంగా రైతు నాయకులకి మాత్రం సహకరించేవాడు. ఈ వైరుధ్యాల నడుమ 1941లో హుజూర్‌నగర్ తాలూకాలోని బేతవోలు పక్కన గల చిలుకూరులో ఆంధ్రమహాసభ జరిగింది. మునగాల పట్టణం నుండి పెద్ద ఎత్తున రైతాంగం దానికి హాజరైనారు. ఆనాటి నుండి మునగాల, నైజాం సంస్థాన రైతాంగ ఉద్యమాలు భుజం భుజం కలిపి నడవడం ప్రారంభమైంది. మునగాల పరగణాలో జమీందారు యొక్క రాజకీయ ఆధిపత్యాన్ని దెబ్బతీసేందుకు అన్ని స్థానిక ఎన్నికలలో అంటే కృష్ణాజిల్లా బోర్డు ఎన్నికలలోనూ, పంచాయితీ బోర్డు ఎన్నికలలో రైతు సంఘం అభ్యర్థులే విజయం సాధించారు. గ్రామ గ్రామాన సహకార సంఘస్థాపన, వైజ్ఞానిక దళాల నిర్మాణం, గ్రంథాలయాల నిర్మాణం ప్రజలని రాజకీయంగా, నిర్మాణయుతంగా, సంఘటితపరచేందుకు కృషి సాగింది. జమీందారు పెట్టే అక్రమ కేసులను ఎదుర్కో వడం, జైళ్ళకి వెళ్ళిరావడం మామూలు అయిపోయింది. ఈ క్రమంలో 1946లో మరల మద్రాసు శాసనసభకి ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు పార్టీ జమీందారీ

వ్యవస్థను రద్దు చేస్తామని ఎన్నికల ప్రణాళికలో ప్రకటించి అధికారంలోకి వచ్చింది. కానీ మునగాల పరగణాలో బ్రహ్మయ్య అవార్డును అమలు చేసేందుకు పూనుకోలేదు. 1939 సత్యాగ్రహాన్ని విరమించమని, సమస్యలు పరిష్కరిస్తానని అప్పటి రెవెన్యూ మంత్రిగా హామీ ఇచ్చిన ప్రకాశం పంతులు 1946 నాటికి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చాడు. కానీ అప్పటికే కాంగ్రెసు నాయకత్వం రెండవ ప్రపంచ యుద్ధానంతర ప్రజాపోరాటాల నుంచి సంస్థానాధీశుల్ని, భూస్వాములను కాపాడుకొనేందుకు జాతీయోద్యమంలో తాము నాయకత్వం వహించిన ప్రజలకే ద్రోహం చేసేందుకు సన్నద్ధమవుతోంది.

## భూముల ఆక్రమణ-నిర్బంధం

**ఈ** పరిస్థితిని ఉపయోగించుకొని మునగాల జమీందారు తన ఆక్రమణలోని భూములను అమ్మకం పెట్టేందుకు పూనుకొన్నాడు. ఇలాంటి స్థితిలో కౌలు భూముల రక్షణకి, జమీందారు ఆక్రమణల నుంచి పేదలని దక్కించుకొనేందుకు 1947 మే 9నుండి భూస్వాధీన ఉద్యమం, నడిగూడెం జమీందారు కోట మీద ఎర్రజెండా ఎగుర వేయడంతో ప్రారంభమైంది. పరగణాలోని భూములన్నీ ఎర్రజెండాల మయం అయ్యాయి. జమీందారు ఇటు నిజాం పోలీసులతోనూ, తర్వాత మద్రాసు పోలీసుల తోనూ ప్రజలపై దాడులు చేయించాడు. తన పశువుల కొట్టాలను తన మనుషుల చేతే తగలపెట్టించి ప్రజలు తగులపెట్టినట్టు కేసులు పెట్టి, రిజర్వు పోలీసులను దించి గ్రామ గ్రామాన దాడులు చేయించాడు. జమీందారీ నౌకర్లు, పోలీసులు భూములను స్వాధీన పర్చుకొన్న ప్రజలపై విచ్చలవిడిగా దాడులు చేశారు. కరివిరాల గ్రామంపై దాడిచేసి కనిపించినవారినల్లా కొట్టారు. కలకోవ గ్రామంలో అప్పటికి 3-4 సార్లు దాడులు జరిపి ప్రజలందర్నీ చావగొట్టినా భయపడక 600మంది పైగా ప్రజలు నడిగూడెం వెళ్ళి నిరసన ప్రదర్శనలు జరుపుతుంటే చూసి చివరకు జులై 17న కలకోవ గ్రామంపై దాడిచేసారు. అపుడే భూములలో విత్తనాలు చల్లి వచ్చిన దళిత రైతాంగంపై కాల్పులు జరిపి మునగాల పోరాట తొలి అమరుడు సీమ గురవయ్యను కాల్చి చంపారు. శిరిపురం, కలకోవ, రామపురం, చాకెరాల, నారాయణ గూడెం, నరసింహగూడెం తదితర గ్రామాలపై దాడులు చేసి గ్రామ నాయకులను అరెస్టు చేసి సబ్‌జైళ్ళు, సెంట్రల్ జైళ్ళకి పంపారు.

కలకోవ కాల్పులతో రాష్ట్రం యావత్తు మునగాల పరగణాపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించింది. ఆ తీవ్ర నిర్బంధ పరిస్థితులలో లీలా సుందరయ్య, డా॥ అచ్చమాంబ, తాపీ రాజమ్మ మునగాల ప్రాంతంలో పర్యటించి నిర్బంధాన్ని ఎలుగెత్తి ఖండించారు. నిర్బంధానికి గురైన బాధితులను పరామర్శించారు. కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఒక సందేశంలో మునగాల, చల్లపల్లి ఎస్టేట్ రైతాంగ పోరాటాలు కృష్ణాజిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి రెండు భుజాలవంటివని, ఉద్యమం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో వీరోచితంగా పోరాడుతున్న మునగాల ప్రజలకు, కార్య కర్తలకు, నాయకత్వానికి అభినందనలు తెలుపుతూ రాష్ట్ర నాయకత్వ తోడ్పాటు ఎపుడూ ఉంటుందని తెలియజేశారు.

సీమగురవయ్య అమరత్వం, పోలీసుల అమానుష హింసాకాండపై వచ్చిన వ్యతిరేకత లను గమనించిన ప్రకాశం ప్రభుత్వం రెవెన్యూ మంత్రి కళా వెంకట్రావును, గొట్టిపాటి బ్రహ్మయ్యను మునగాల పరగణాకి పంపింది. మరల బ్రహ్మయ్య అధ్యక్షతన ఒక విచారణ కమిటీని 1947 అక్టోబరు 21న నియమించింది. కమ్యూనిస్టు పార్టీ తరపున వై.వి.కృష్ణారావు సభ్యులుగా ఉన్న ఐదుగురి కమిటీ 1939 బ్రహ్మయ్య అవార్డు అమలు కాలేదని తెలియచేస్తూ, అవార్డు ప్రకారం రావాల్సిన భూములను రైతులకి ఇవ్వాలని, అవార్డు ప్రకటించిన కాలం నుండి ఇప్పటి వరకూ (1939 నుండి 1948 వరకూ) రైతులకి జరిగిన నష్టానికి పరిహారం ఇవ్వాలని, జమీందారు సాగించిన ఉత్పత్తిలో కలిగిన లాభం రైతులకి చెందాలని, ఈ చర్యలు తీసుకోవటానికి ఒక స్పెషల్ ఆఫీసరును నియమించాలని ఈ విచారణ కమిటీ 10-6-1948న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అయితే కాంగ్రెసు ప్రభుత్వం రైతాంగ ఉద్యమాలను క్రూరంగా అణచి వేయాలనే నిర్ణయంతో కమిటీ నివేదికను సైతం బుట్టదాఖలు చేసింది. అయినప్పటికీ ఈ కాలం అంతా రైతాంగం -కమ్యూనిస్టు పార్టీ, రైతు సంఘ నాయ కత్వాన కౌలు భూములను నిలుపుకొన్నారు. అన్యాక్రాంత మైన 155 ఎకరాల దళితుల భూములను తిరిగి స్వాధీన పర్చుకొన్నారు.

## వీరోచిత తెలంగాణా పోరాటంలో మునగాల ప్రజలు నిర్వహించిన పాత్ర

1946 జులై 4న దొడ్డి కొమరయ్య అమరత్వంతో తెలంగాణా అంతటా రైతాంగ పోరాటం ముందుకు వచ్చింది. 1947లో బాలేముల పోరాటంలో అమరుడైన మట్టారెడ్డి భార్య మునగాల పరగణా బృందావనపురం ఆడపడుచు. ఆకునూరు, మాచిరెడ్డి పల్లెలో నైజాం పోలీసులు సాగించిన హత్యాకాండ యావత్ దేశంతో పాటు, మునగాల పరగణాపై తీవ్ర ప్రభావం పడవేసింది. బేతవోలులో నిజాం మిలటరీ బలగాల కాల్పులలో చనిపోయిన ముగ్గురు అమర వీరుల భౌతికకాయాలను మునగాల పరగణా తెచ్చి వేలాదిమంది హాజరై అంత్యక్రియలు నిర్వహించారు. 1947లో శిరిపురంలో జరిగిన మునగాల పరగణా జమీన్ రైతు సంఘం మహాసభకి రావి నారాయణరెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ విధంగా నైజాంలో నిరంతర పోరాటం నడుపుతున్న క్రమంలో పార్టీ కార్యాలయాన్నీ మునగాలకి తరలించారు. దాడులను ఎదుర్కొనే క్రమంలో నల్గొండ ప్రజలకి మునగాల పరగణా పెద్ద ఆశ్రయంగా ఉండింది. "తల్లి ఒడిలోకి పరుగెత్తే పిల్లల్లాగా పరగణాలోకి నల్గొండ ప్రజలు వచ్చేవారు". నిజాంలో అంతకంతకు నిర్బంధం తీవ్రతరమవుతున్న కొలది వలస వచ్చిన ప్రజలకు మునగాల ప్రజలు తమ ఇళ్ళు, గదులు ఖాళీ చేసి ఇచ్చారు. దొడ్లు ఖాళీ చేసి పాకలు వేసి ఇచ్చారు. మునగాల రహస్య బంగళా ఆసుపత్రిగా మార్చబడి, యుద్ధంలో గాయపడిన వీరయోధులకు వైద్య సహాయం అందించింది.

దీనినంతటినీ గమనించిన నెహ్రూ కేంద్ర ప్రభుత్వం మునగాలను 'కమ్యూనిస్టు గూడు'గా అభివర్ణించింది. రెండు వైపులా దాడులు చేయకపోతే నైజాం వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటాన్ని దెబ్బతీయలేమని గుర్తించింది. ప్రకాశం ఆర్డినెన్సు పేర పెద్ద ఎత్తున మునగాల పరగణా ప్రజలపై నిర్బంధం ప్రయోగించింది. అప్పటి ఆర్గనైజరు తద నంతర కాలంలో మునగాల పరగణా పోరాట చరిత్రను, అమరవీరుల చరిత్రను అద్భుతంగా అక్షరబద్ధం చేసిన కామ్రేడ్ తటవర్తి వెంకటేశ్వరరావు, ప్రజానాయకుడు వుప్పల రామయ్య తదితర అనేకమంది కార్య కర్తలను డిటెయిన్ చేసి జైళ్ళకు తరలించింది. పోలీసు క్యాంపులను దించింది.

## తెలంగాణా గడ్డ మీద పరగణా వీరుల అమరత్వం

ఈ విధంగా 1948-51 మధ్య కాలంలో మొత్తం 33మంది రైతాంగ ఉద్యమ కార్యకర్తలు నిజాం, కాంగ్రెసు ప్రభుత్వ సాయుధ మూకల చేతులలో అమరులైనారు. తెలంగాణా గడ్డ మీదే వారితో 12మంది అమరత్వం పొందారు. వీరిలో జగన్నాధపురం ముద్దుబిడ్డ, విద్యావంతుడు కేశబోయిన ముత్తయ్య ఒకడు. తన గ్రామంలో అభ్యుదయ పాఠశాలను పెట్టి అనేకమందికి చదువు నేర్పి, కళాకారుడుగా ఎన్నో వైజ్ఞానిక ప్రదర్శనలిచ్చి జగన్నాథపురం గ్రామాన్ని తీర్చిదిద్దిన నాయకుడు అతను. మొత్తం పరగణా అమరులలో 12మంది వీర యోధులను కన్నగడ్డ జగన్నాథపురం. 1951లో కేశ బోయిన ముత్తయ్య, కోట్లనందయ్యలను కాంగ్రెసు ప్రభుత్వం కాల్చి చంపింది. అదే విధంగా మరో గొప్ప నాయకుడు ఘట్టు గోపాలకృష్ణయ్యను కాల్చి చంపి ఖమ్మం పట్టణంలో ఆయన భౌతికకాయాన్ని మంచానికి కట్టి జీపు మీద ఊరేగించి ప్రజల్ని భయభ్రాంతుల్ని చేయాలని పోలీసులు ప్రయత్నించారు. ఈ విధంగా అమరులైన వారిలో వుప్పల రామయ్య ప్రముఖుడు. రైతునాయకుడుగా ప్రముఖ పాత్ర వహించిన వాడు. జమీందారు అక్రమ అధిక వడ్డీల నుండి రక్షించుకొనేందుకు రైతాంగంలో సహకార సంఘాల వ్యాప్తికి తీవ్రంగా కృషి చేశాడు. కాII వుప్పల రామయ్యను ప్రభుత్వం అరెస్టు చేసి జగ్గయ్యపేట జైలులో నిర్బంధించింది. జైలులో న్యుమోనియాతో బాధపడుతుంటే సరైన వైద్యం అందించక నిర్లక్ష్యం వహించింది తోటి ఖైదీలు రామయ్యకి వైద్య సహాయం అందించాలని ఆందోళనలు, నిరసనవ్రతాలు చేపట్టినా నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించింది. ఫలితంగా వైద్య సహాయం అందక 1948 సెప్టెంబరు 6న మునగాల ప్రజల ప్రియతమ నాయకుడు కాII వుప్పల రామయ్య అమరుడై నాడు. జగన్నాథపురం, రామసముద్రం, నరసింహులగూడెం, కవిరాల, కొక్కిరేణి, శిరి పురం, మునగాల, కలకోవ, నేలమర్రి గ్రామాల నుండి 33మంది అమరులైనారు. కామ్రేడ్ ఘట్టు గోపాల కృష్ణయ్యతో తెలంగాణా ప్రాంత సర్వవరం కామ్రేడ్ రామయ్యను, కేశనబాయి ముత్తయ్యతో సూర్యాపేట తాలూకా తిమ్మాపురం కామ్రేడ్ గుర్రం నర్సిరెడ్డిని కలిపి కాల్చి చంపింది. నైజాం వ్యతిరేక పోరాటంలో పరగణా వీరులు తెలంగాణా వీరులతో కలిసి పోరాడుతూ అమరులైనారు.

ఈ పోరాటం, ఈ అమరత్వం తెలుగు గడ్డపై ప్రజారాజ్యం కోసమే జరిగాయని మరువరాదు.

## మునగాల యోధుల బలిదానం- మనకొక ఆజ్ఞాపత్రం

అయితే విశాలాంధ్రలో ప్రజారాజ్యం ఏర్పడలేదు. స్వంతంత్ర భారత ప్రజల రిపబ్లిక్ సైతం ఏర్పడలేదు. బ్రిటీషు ప్రభుత్వం పాత వలస చట్టాలు, శాసనాల ఆధారంగా పాత తొత్తులకు బడితొత్తులుగా పడి ఉండే దళారీ వర్గాలకు 1947లో అధికారం బదిలీ చేయ బడింది. సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ వాంఛలకు, దున్నేవానికే భూమి, ఫ్యూడలిజం నశించాలన్న ప్రజల, ప్రజాతంత్ర డిమాండ్ లకు ద్రోహం చేస్తూ కాంగ్రెసు అధికారంలోకి వచ్చింది. జమీందారీ విధానాన్ని రద్దు చేస్తానన్న కాంగ్రెసు చివరకు జమీందారులకు కోట్లాది రూపాయల నష్టపరిహారాన్ని, స్వంత భూముల పేరిట వేలాది ఎకరాల భూ ఖండాలను కట్టబెట్టింది. నష్టపరిహారం లేకుండా జమీందారీ విధానం రద్దు, యావత్తు భూములు పేదలకి పంపకం చేయాలన్న ప్రజల డిమాండ్‌ను తిరస్కరించింది. రికార్డులు తారుమారు చేసుకోవడానికి తగిన అవకాశం ఇచ్చి చివరకు జమీందారీ విధానాన్ని "రద్దు" చేసింది. మునగాల జమీందారీ వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న వేలాదిమంది ప్రజలకు జైళ్ళు, అరెస్టులు, లాఠీ దెబ్బలు, కాల్పులను; మునగాల జమీందారుకి మాత్రం బందరు, తొర్రూరు, నర్సంపేట ప్రాంతాలలో అతని ఆక్రమణలోని వందలాది ఎకరాలతో పాటు 1,34,037 రూపాయల 97అణాలను నష్టపరిహారంగా ఇచ్చింది. అయితే అదే సమయంలో ఒక పరిపాలనా విధానంగా జమీందారీ విధానాన్ని రద్దు చేయాల్సి వచ్చింది. జమీందారుల సివిల్, క్రిమినల్ అధికారాలు రద్దు అయినాయి. వెట్టిచాకిరీ రద్దు అయింది. కౌలుదారు హక్కుల, రక్షణ కోసం భూముల కోసం పోరాడాల్సినది మిగిలే ఉన్నప్పటికీ జమీం దారుల జులుం అంతం అయింది. అయితే భూముల పంపకం పూర్తి కాలేదు. భూ స్వామ్య విధానం రద్దు కాలేదు. చివరకు 1959 జులై 1న మునగాల పరగణా కృష్ణా జిల్లా నుండి నల్గొండ జిల్లాలో విలీనం చేయ బడింది. ఈ విలీనోత్సవం అప్పటి యం.యల్.ఎ. దొడ్డ నరసయ్య, యం.పి. దేవులపల్లి వెంకటేశ్వరరావు, రెవెన్యూ మంత్రి కొండా వెంకటరంగారెడ్డి సమక్షంలో జరిగింది.

భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాలు నేటికీ అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని సాధించేంతవరకూ ప్రజాశక్తులు విశ్రమించరాదని, మునగాల యోధుల బలిదానం మనకొక ఆజ్ఞాపత్రం లాగా మన కళ్ళ ముందు నిలిచి ఉంటుంది.

*'మునగాల ప్రజా ఉద్యమ చరిత్ర'*
*'మునగాల పరగణా అమరవీరుల జీవిత విశేషాలు'*
**-తటవర్తి వెంకటేశ్వరరావు రచనల ఆధారంగా**


శ్రీరామా
2010 - SSC లో
STATE
6th
Topper
585
ALL INDIA
CIVIL SERVICES లో
268
RANK
Govt. of India
FIRST RANK
1
Govt. of India
9th RANK
9
SPAES
THE REAL IIT
FOUNDATION SCHOOL
NCO లో
ALL INDIA
10th RANK
10
శ్రీరామా రూరల్
విద్యా సంస్థలు
లాల్ బహదూర్ గార్డెన్స్, చిలుమూరు, గుంటూరు జిల్లా
Ph : 99497 71169, 99497 71167, 80084 04085, 80084 04092 .

*With best compliments from :*

## *The Krishna Industrial & Agricultural Exhibition Society (Regd.)*

D.No. 55-1-3, PSC Bose Road, Industrial Estate, VIJAYAWADA - 520 007.
Phones : 0866-2550995, 3292231 & 6532995 FAX : 0866-2550996

**HIGHLIGHTS OF OUR SOCIETY SERVICES TO PUBLIC :**

- Established in 1975 to serve the public through Exhibitions.
  - Conducting successfully for the last 36 Years on par with National Exhibitions.
  - Our Exhibition is next only to the Hyderabad Exhibition in A.P.
- Conducted three "Krishna Pushkara Exhibitions" since 1980 and served the pilgrims.
- Erected Statue of Krishnaveni at Prakasam Barrage in 1980, unveiled by the then Chief Minister of A.P. Sri Marri Chenna Reddy.
- Established and running Polytechnic for Women under private management in Andhra Pradesh in 1981 by the then Chief Minister of A.P. Sri Tanguturi Anjaiah
- Contributed Rs. 50 Lakhs to Software Technology Park of India in Vijayawada.Foundation stone laid by the then Chief Minister of A.P. Sri Nara Chandrababu Naidu
- Established and running Krishnaveni Museum, a river valley civilisation Museum, first of its kind in India and 19th in the World. Dedicated to the Nation by His Excellency Dr. C. Rangarajan, the then Governor of A.P. on 24-07-1998.
- Establishing Agricultural Research Farm at Vellaturu Village, Krishna Dist. for small and marginal farmers. Foundation stone laid by the then Chief Minister of A.P. Sri Nara Chandrababu Naidu
- Encouraging the Youth, Sports & Cultural activities

❖❖❖❖❖



President : **Peeyush Kumar,** I.A.S.,
Collector & Dist. Magistrate, Krishna

Vice President : **Dr. Gaurav Uppal,** I.A.S.,
Joint Collector, Krishna

Hon. Secretary : **G.V. Rama Rao**

Jt. Secretary-I
Y. Venkaiah

Treasurer
T. Veeraiah Gupta

and Members of the Managing Committee

*On a Glorious March......*

*With Best Compliments from...........*

# HEALTH HOSPITALS

Prakasam Road, **Tenali-**522 201

HEALTH
HOSPITALS

**N.Pratap Garu**

Chairman

☎ 08644-222229, 226060

*With Best Compliments from...........*

## Dr. K.Sudhakar

**MBBS, MD, PG, DIP**

# THANDRA PAPARAYA INSTITUTE OF SCIENCE&TECHNOLOGY

**Komatapalli (Vill), Bobbili-535 558, Vizianagaram**
**Course Offered: ECE, EEE, CSE&Mech**

The College is established in 2001 in a serene and sprawling 70 acre land at beautiful village, Komatapalli, affiliated to JNTU, Hyderabad, and approved by AICTE, New Delhi. The college is christened after the famous patriot and warrior Thanda Paparaya a benevolent patron of art, culture and education. This Engineering college of ours, equipped with latest and sophisticated technology, is eminently suitable for the pursuit of engineering studies with distinction.

**Our College**
**Phones:**
**☎Off: 08944-253191, 253104, 254911**
**☎Cell: 94401 92015 Fax: 08944 253191**

*With Best Compliments from..........*

**Dr. vijay**

# ప్రగతి ఎత్తిపోతల పథక సంక్షేమ సంఘం

కాజ-చినకాకాని-రైతు కమిటి

ప్రతాపరెడ్డి — కార్యదర్శి
మారెళ్ళ అంజిరెడ్డి — సహాయ కార్యదర్శి

సింహాద్రి మహేశ్వరరెడ్డి — అధ్యక్షులు
చాగర్లమూడి మధుసూదనరావు — ఉపాధ్యక్షులు

బుర్రముక్కు శ్రీరామిరెడ్డి — కోశాధికారి

సభ్యులు

దానబోయిన వర్రప్రసాద్
మర్రిశ్రీరాములు
ఏటుకూరి గంగాధరరావు
బొర్రా సుబ్బారావు
కూరపాటి సురేష్-ఆపరేటర్

ఈదా నాగేంద్రారెడ్డి
మారెళ్ళ బాపిరెడ్డి
కారుమూరు గోపాలరెడ్డి
సింహాద్రి పాపిరెడ్డి
కూరపాటి రాజారావు-లస్కర్

పులగం ప్రకాశరెడ్డి-లస్కర్-పొట్లూరి కిరీటి-వాచమన్

## రైతుకూలీసంఘం వారికి శుభాకాంక్షలు తెలియచేస్తున్నాము

# తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్

## ప్రచురణలు

| | |
|---|---|
| 1.మరణశయ్యపై మన ప్రజారోగ్య వ్యవస్థ -డా॥ ఘంటా వెంకట్రావ్ | రూ.20 |
| 2. కాంతి కేంద్రాలా! మృత్యు మందిరాలా? -పరమాణు విద్యుత్ కేంద్రాలపై ఓపిడిఆర్ నివేదిక | రూ.15 |
| 3. మన విప్లవం-మన భవిష్యత్తు-మన శ్రీశ్రీ - డా॥బి.సూర్యసాగర్ | రూ.20 |
| 4. అజ్ఞాత వీరుడు(నవల)-మిస్తిస్లావస్కీ, అనువాదం-శ్రీనివాస చక్రవర్తి | రూ.100 |
| 5. మానధనులు(నవల)-హొవార్డ్ ఫాస్ట్, అనువాదం-రమణారెడ్డి | రూ.80 |
| 6. సోషలిజం ప్రథమ పాఠాలు-లియో హ్యూబర్‌మెన్, సిబిల్.హెచ్.మే | రూ.25 |
| 7. ఫాసిస్టు కోర్టులో డిమిట్రావ్ సింహగర్జన | రూ.20 |
| 8. శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమం-వెంకట్ | రూ.150 |
| 9. చైనా విప్లవం-చైనా కమ్యూనిస్టు పార్టీ-మావో | రూ.10 |

కాపీలకు: మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, అరండల్‌పేట
కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ-520 002

వివరాలకు: పి.జస్వంతరావు
32-13-26/1, బి.యమ్.రావు రోడ్
మొగల్రాజపురం ,విజయవాడ-520 010



పంజాబ్ కళాకారుల గేయాలాపన



ఒరియా ఆదివాసీల 'పోరుదారి' ప్రదర్శన





కిర్మా బృందం జనం పాటలు



బాల కళాకారుల కోలాటం



'ఎత్తిన జెండా దించకోయ్' ప్రదర్శన



ఆదివాసీ కళాకారుల నృత్యం

Rythu Coolie Sangham (A.P.)
State Conference
Souvenir - 2010 Rs. 30/-




రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)